# ఆధునికాంధ్ర కవితా ధోరణులు

## ఎం. ఏ. తెలుగు, మొదటి సంవత్సరం - ఐదవ పేపరు


రచయితలు :

**డా॥ జి.నై ప్రభావతీ దేవి,**
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు మరియు ప్రాచ్యభాషా విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

**డా॥ కడియాల రామమోహన్‌రాయ్**
5-4 సుధా టవర్స్, లక్ష్మీపురం, మెయిన్‌రోడ్
గుంటూరు - 522 007

**డా॥ కందిమళ్ళ సాంబశివరావు**
తెలుగు రీడర్, డి.ఆర్.యన్.యన్.సి.వి.యన్ కళాశాల
చిలకలూరిపేట, గుంటూరు జిల్లా

**ఆచార్య టి. సత్యవతి**
తెలుగు మరియు ప్రాచ్యభాషా విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

**డా॥ పాపినేని శివశంకర్**
ఎస్.ఎస్.బి.డి. కళాశాల,
తాడికొండ, గుంటూరు జిల్లా

**ఆచార్య వేలి అనంత రామశాస్త్రి**
బి1-82, పట్టాభిపురం
గుంటూరు - 6

**డా॥ యల్లా ప్రగడ మల్లిఖార్జునరావు**
తెలుగు శాఖ, హిందూ కాలేజి, గుంటూరు

**డా॥ కౌతా సుబ్రహ్మణ్య శాస్త్రి**
రీడర్, తెలుగు శాఖ, హిందూ కాలేజి, గుంటూరు

**డా॥ జి. దామోదర నాయుడు**
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ
శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి

**డా.వి. సిమ్మన్న**
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం
స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్,
ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

సంపాదకులు

**ఆచార్య టి. సత్యవతి,** ఎం.ఏ., పి.హెచ్.డి.
తెలుగు మరియు ప్రాచ్యభాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

**డైరెక్టర్**
**ఆచార్య డి. కృష్ణారావు** M.Sc., M.Phl., Ph.D.



**దూరవిద్యా కేంద్రము**
ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం, నాగార్జున నగర్
Ph: 0863-2293299, 2293356, 08645-211023, Cell:98482 85518
08645 - 211024 ( Study Material )
Website : www.anucde.ac.in or www.anucde.info
e-mail : info@ anucde.ac.in

M.A., Telugu , First Year, Paper - V : **Modern Trends in Telugu Poetry**

First Edition : 2003

Second Edition : 2005

Third Edition : 2006

Fourth Edition : 2008

First Edition : 2011

Sixth Edition : 2012
No. of Copies : 5000

Seventh Edition : 2013
No. of Copies : [redacted]

**(C) Acharya Nagarjuna University**

**This book is exclusively prepared for the use of students of M.A., Telugu, Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is meant for limited circulation only.**

Published by : M.V. Ramkumar Ratnam
**Prof. D. Krishna Rao,**
*Director,*
Centre for Distance Education,
Acharya Nagarjuna University

Dr. P.P.S. Paul Kumar
**Prof. M.V. Ramkumar Ratnam,**
*Deputy Director,*
Centre for Distance Education,
Acharya Nagarjuna University

*Printed at :*
**Don Bosco Technical School Press**
Ring Road, Guntur-7, Ph : **2350832**

## [illegible]

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ, 2003 వ సంవత్సరంలో NAAC చే B++ (80-85) గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయుటకు ఎంతో సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలలోని సుమారు 300 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనతో పాటు పరిశోధన డిగ్రీలను కూడా ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అందిస్తోంది.

ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. దీని ద్వారా పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్య నభ్యసించలేనివారికి, ఎంతో వ్యయ భరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరికవున్న గృహిణులకు ఈ దూర విద్యావకాశం ఎంతో దోహదపడుతుంది. ఇట్టి వారందరికి తమ ముంగిట్లో విద్యను అందించే ఉద్దేశ్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, 2003-04 విద్యా సంవత్సరంలో డిగ్రీస్థాయిలో బి.ఏ., బి.కాం.; పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ, ఎల్.ఎల్.యమ్ కోర్సులను ప్రారంభించడం జరిగింది.

ఈ దూర విద్యా పద్ధతి ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి, రచనా వ్యాసంగంలో విశేష అనుభవంగల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించటం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థిని విద్యార్థులు, ఈ పాఠ్యాంశాల బోధనలో నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి ముందు ముందు చేసే ప్రచురణలలో మరింత నిర్దిష్టంగా, మరింత సులువుగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం డిగ్రీ స్థాయిలో వారాంతపు తరగతులు, పి.జి. స్థాయిలో కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేసి, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమేగాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని వాటి ద్వారా దేశ ప్రగతికి దోహదపడాలని నా ఆశయం. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికి అందుబాటులోకి రావాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ మా ప్రయత్నానికి సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు నా అభినందనలు.

ఆచార్య కె. వియ్యన్నారావు
**కులపతి**
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

# ELECTIVE PAPER
# PAPER - V : MODERN TRENDS IN TELUGU POETRY
## ఆధునికాంధ్ర కవితా ధోరణలు

| | | | |
|---|---|---|---|
| 1. | భావ కవిత్వం | : | ప్రణయ కవిత్వం, ప్రకృతి కవిత్వం భక్తి కవిత్వం, దేశభక్తి కవిత్వం, సంఘ సంస్కరణ కవిత్వం, స్మృతి గీతాలు. |
| 2. | అభ్యుదయ కవిత్వం | : | లక్షణాలు - పరిణామం |
| 3. | హేతువాదం | : | నిర్వచనం, పరిణామ వికాసాలు |
| 4. | దిగంబర కవిత్వం | : | లక్షణాలు, పరిణామం |
| 5. | విప్లవ కవిత్వం | | |
| 6. | పాశ్చాత్య కవితా ధోరణలు | : | ప్రతీకవాదం, అభివ్యక్తీకరణ వాదం, అధివాస్తవికత, భవిష్యద్వాదం, అరాచకవాదం, డాడాయిజమ్, ఇమేజిజం |
| 7. | చదవదగిన రచయితలు, రచయిత్రులు | : | కృష్ణశాస్త్రి, నండూరి సుబ్బారావు, దువ్వూరి రామిరెడ్డి, రాయప్రోలు సుబ్బారావు, తుమ్మల సీతారామమూర్తి, విశ్వనాథ సత్యనారాయణ, త్రిపురనేని రామస్వామి, జాషువ, గుంటూరు శేషేంద్ర శర్మ, దాశరథి, కుందుర్తి, శివసాగర్, చెరబండరాజు, బంగారమ్మ గేయాలు. |

### ఆధార గ్రంథాలు :

| | | | |
|---|---|---|---|
| 1. | ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయములు, ప్రయోగములు | : | డా ...నారాయణరెడ్డి |
| 2. | ఆధునికాంధ్ర సాహిత్య సమీక్ష | : | ఆచార్య కె.వి.ఆర్. నరసింహం |
| 3. | మహోదయం | : | ఆచార్య కె.వి. రమణారెడ్డి |
| 4. | నూరేండ్ల సాహిత్యం కొన్ని దృక్పథాలు | : | శ్రీ వడలి మందేశ్వరరావు |
| 5. | త్రిపురనేని సాహిత్యం | : | డా॥ కె. సురేంద్ర |
| 6. | హేతువాద వైఖరి | : | డా॥ టి. ప్రభాకరరావు |
| 7. | కవిసేన మేనిఫెస్టో | : | శేషేంద్ర |
| 8. | సాహిత్యం - విమర్శ | · | శ్రీ వడలి మందేశ్వరరావు |

# M.A. TELUGU (Previous) Degree Examination, July 2005

## Paper - V : Modern Trends in Telugu Poetry

## ఆధునికాంధ్ర కవితాధోరణలు

Time : Three Hours

Max. : 100 marks

***Answer any Five Questions.***
***All questions carry equal marks.***

ఈ క్రింది వాటిలో ఐదింటికి సమాధానాలు వ్రాయండి

1. సంఘ సంస్కరణ కవిత్వాన్ని గూర్చి వివరించండి.
2. అభ్యుదయ కవిత్వంలో శ్రీశ్రీ స్థానం ఎట్టిదో నిరూపించండి.
3. హేతువాద కవితా వికాసాన్ని పేర్కొనండి.
4. దిగంబర కవిత్వ లక్షణాలను, పరిణామాన్ని విశదీకరించండి.
5. విప్లవ కవిత్వ వికాసాన్ని పేర్కొనండి.
6. పాశ్చాత్య కవిత్వ ధోరణులను గూర్చి వ్రాయండి.
7. విశ్వనాథ సత్యనారాయణగారి కావ్యాలను సమీక్షించండి.
8. 'భావ కవితా పితామహుడు' రాయప్రోలు ఎట్లో నిరూపించండి.
9. బంగారమ్మ గేయాలను గూర్చి విశ్లేషించండి.
10. ఈ క్రింది వాటిలో రెండింటికి సమాధానాలు వ్రాయండి :

    ఎ) కృష్ణశాస్త్రి

    బి) దువ్వూరి రామిరెడ్డి

    సి) గుంటూరు శేషేంద్ర శర్మ

    డి) దాశరథి.

# M.A. TELUGU (Previous) Degree Examination, July 2004

## Paper - I : Modern Trends in Telugu Poetry

## ఆధునికాంధ్ర కవితాధోరణులు

Time : Three Hours | Max. : 100 marks

***Answer any Five Questions.***
***All questions carry equal marks.***

1. భావ కవిత్వాన్ని వివరించి సోదాహరణంగా వర్గీకరించండి.

2. అభ్యుదయ కవిత్వ పరిణామాన్ని తెలియ పర్చండి.

3. హేతు వాదాన్ని నిర్వచించి పరిణామ వికాసాలను వివరించండి.

4. దిగంబర కవిత్వోద్యమాన్ని గురించి వ్రాయండి.

5. విప్లవ కవిత్వాన్ని విశదీకరించండి.

6. పాశ్చాత్య కవితాధోరణులను వివరించండి.

7. తుమ్మల సీతారామమూర్తి కవితా ప్రాముఖ్యాన్ని విశదపరచండి.

8. జాషువా కవితా వైభవాన్ని విశ్లేషించండి.

9. కుందుర్తి వచన కవిత్వాన్ని గురించి రాయండి.

10. ఈ క్రింది వాటిలో రెండింటికి సమాధానాలు వ్రాయండి :

    ఎ) బంగారమ్మ గేయాలు

    బి) అమలిన శృంగారం

    సి) చెరబండరాజు

    డి) త్రిపురనేని రామస్వామి.

**M.A. (Previous) DEGREE EXAMINATION, MAY 2006.**

Telugu

Paper V - **MODERN TRENDS IN TELUGU POETRY**

Time : Three hours

Maximum : 100 marks

Answer any FIVE questions

All questions carry equal marks.

1. భావకవిత్వం అంటే ఏంటో తెలిపి అందులోని శాఖల్ని గూర్చి వ్రాయండి.
2. అభ్యుదయ కవిత్వ ఆవిర్భావ వికాసాల్ని సమీక్షించండి.
3. తెలుగులో వెలువడిన హేతు వాదక వికాసాన్ని గూర్చి వ్రాయండి.
4. దిగంబర కవిత్వం స్వరూప స్వభావాల్ని వివరించండి.
5. విప్లవ కవిత్వం తెలుగులో ఎలా వెలువడిందో వ్రాయండి.
6. పాశ్చాత్య కవితా ధోరణుల్ని గూర్చి వ్రాయండి.
7. కృష్ణశాస్త్రి, నండూరిల కవితా రీతుల్ని వివరించండి.
8. రాయప్రోలు సుబ్బారావు ప్రతిపాదించిన అమలిన శృంగారాన్ని వ్యాఖ్యానించండి.
9. దాశరథి కందుర్తుల అభ్యుదయ దృక్పథాలను తెలుపండి.
10. ఈ క్రింది వాటిల్లో రెండింటిని సమాధానాలు వ్రాయండి :

    (a) సంఘ సంస్కరణ కవిత్వం

    (b) మానవతా వాదం (Humanism)

    (c) గుఱ్ఱం జాషువా

    (d) త్రిపురనేని రామస్వామి చౌదరి

M.A. (Previous) DEGREE EXAMINATION,
DECEMBER 2010.

Telugu

Paper V — MODERN TRENDS IN TELUGU POETRY

Time : Three hours Maximum : 100 marks

ఏవైన ఐదు ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

ప్రశ్నలన్నింటికి మార్కులు సమానం.

1. భావకవిత్వంలో ప్రణయకవిత్వం, ప్రకృతి కవిత్వాలను గూర్చి రాయండి.

2. అభ్యుదయ కవిత్వంలో వర్గ పోరాటాన్ని చిత్రీకరించండి.

3. హేతువాద కవిత్వ వికాసాన్ని వివరించండి.

4. దిగంబర కవిత్వ లక్షణాలను పేర్కొనండి.

5. విప్లవ కవిత్వ ధోరణిని వివరించండి.

6. తెలుగు కవిత్వంపై పాశ్చాత్య కవితం ధోరణుల ప్రభావాన్ని తెల్పండి.

7. కుందుర్తి వచన కవితాతత్త్వాన్ని విశ్లేషించండి.

8. రాయప్రోలు రచనలలో తెనుగుదనాన్ని పేర్కొనండి.

9. జాషువా రచనలలో దళిత స్పృహను విశ్లేషించండి.

10. క్రింది వాటిలో రెండింటికి సమాధానాలు రాయండి.

    (a) దేశభక్తి కవిత్వం

    (b) అధివాస్తవికత

    (c) గుంటూరు శేషేంద్రశర్మ

    (d) దువ్వూరి రామిరెడ్డి.

---

**(DT 05)**

**M.A. (Previous) DEGREE EXAMINATION, JUNE 2010.**

**First Year**

**Telugu**

**Paper V — MODERN TRENDS IN TELUGU POETRY**

**Time : Three hours** **Maximum : 100 marks**

**Answer any FIVE questions.**

**All questions carry equal marks.**

1. భావకవిత్వ ఆవిర్భావ వికాసాల గురించి రాయండి.

2. అభ్యుదయ కవిత్వ ప్రాముఖ్యాన్ని గురించి వివరించండి.

3. హేతువాద కవిత్వ పరిణామ వికాసాలను విశ్లేషించండి.

4. దిగంబర కవిత్వ లక్షణాలను వివరించండి.

5. తెలుగులో విప్లవ కవిత్వ స్వరూపాన్ని సమీక్షించండి.

6. పాశ్చాత్య కవితా ధోరణుల్ని పేర్కొని ప్రతీకవాదం, అభివ్యక్తీకరణ వాదం గురించి వివరించండి.

7. కృష్ణశాస్త్రి రచనల గురించి పరిచయం చేయండి.

8. రాయప్రోలు సుబ్బారావు రచనల గురించి రాయండి.

9. దాశరథి, కుందుర్తి కవితా తత్త్వాలను వ్యక్తీకరించండి.

10. ఈ క్రింది వాటిలో రెండింటికి సమాధానాలు రాయండి.

(a) అధివాస్తవికత.

(b) అరాచక వాదం.

(c) నండూరి సుబ్బారావు.

(d) జాషువ.

(e) అర్థపరిణామం – రకాలు.

(f) తెలుగు భాష – ప్రమాణీకరణ.

(g) కుల మాండలికాలు.

(h) తాలవ్యీకరణం.

**(DT 05)**

# M.A. DEGREE EXAMINATION, MAY 2011.

First Year

Telugu

## Paper V — MODERN TRENDS IN TELUGU POETRY

Time : Three hours    Maximum : 100 marks

ఈ క్రింది వాటిలో ఐదు ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

అన్ని ప్రశ్నలకు మార్కులు సమానం.

1. భావ కవిత్వంలోని వస్తు వైవిధ్యాన్ని తెల్పండి.

2. అభ్యుదయ కవిత్వ లక్షణాలను విశదీకరించండి.

3. హేతువాద పరిణామ వికాసాలను వివరించండి.

4. దిగంబర కవిత్వ తత్వాన్ని సోదాహరించండి.

5. విప్లవకవుల ప్రజాపోరాట నిబద్ధతను పేర్కొనండి.

6. పాశ్చాత్య కవితా ధోరణులను పరిచయం చేయండి.

7. రాయప్రోలు సుబ్బారావు కవిత్వ వైశిష్ట్యాన్ని పేర్కొనండి.

8. దువ్వూరి రామిరెడ్డి రచనలను పరిచయం చేయండి.

9. కుందుర్తి కావ్యాల ఆధారంగా వచన కవితా లక్షణాలను పేర్కొనండి.

10. క్రింది వాటిలో రెండింటికి సమాధానాలు రాయండి.

    (ఎ) కృష్ణశాస్త్రి

    (బి) ప్రతీకవాదం

    (సి) వేయిపడగలు

    (డి) జాషువా.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | భావకవిత్వం - ప్రణయ, ప్రకృతి, భక్తి కవిత్వాలు | 1.1 - 1.16 |
| 2. | భావ కవిత్వం - దేశభక్తి, సంఘ సంస్కరణ, కవిత్వాలు, స్మృతికావ్యాలు | 2.1 - 2.15 |
| 3. | అభ్యుదయ కవిత్వం- నిర్వచనం - లక్షణాలు | 3.1 - 3.7 |
| 4. | అభ్యుదయ కవుల కవితా ధోరణులు | 4.1 - 4.14 |
| 5. | హేతువాదం - చారిత్రక నేపథ్యం - లక్షణాలు | 5.1 - 5.11 |
| 6. | హేతువాదం - ఉద్యమం - సాహిత్యం | 6.1 - 6.11 |
| 7. | దిగంబర కవిత్వం - ఆవిర్భావం - ఆవశ్యకత - సంపుటాలు | 7.1 - 7.10 |
| 8. | దిగంబర కవితా లక్షణాలు | 8.1 - 8.14 |
| 9. | విప్లవ కవిత్వం - సామాజిక నేపథ్యం - కవులు | 9.1 - 9.22 |
| 10. | విప్లవ సాహిత్యం | 10.1 - 10.25 |
| 11. | తెలుగులో పాశ్చాత్య కవితా ధోరణులు | 11.1 - 11.27 |
| 12. | దేవులపల్లి కృష్ణశాస్త్రి -నండూరి సుబ్బారావు | 12.1 - 12.12 |
| 13. | దువ్వూరి రామిరెడ్డి - రాయప్రోలు సుబ్బారావు | 13.1 - 13.25 |
| 14. | తుమ్మల సీతారామమూర్తి - విశ్వనాథ సత్యనారాయణ | 14.1 - 14.36 |
| 15. | త్రిపురనేని రామస్వామి - జాషువ | 15.1 - 15.23 |
| 16. | గుంటూరు శేషేంద్ర శర్మ - శివసాగర్ | 16.1 - 16.23 |
| 17. | దాశరథి - కుందుర్తి | 17.1 - 17.22 |
| 18. | చెరబండరాజు - చావలి బంగారమ్మ | 18.1 - 18.19 |


**GOLD MEDALS FOR MERITORIOUS STUDENTS OF CDE**

**Smt. Kollimarla Jaya Sree Memorial Gold Medal** for securing the highest number of marks in aggregate having passed M.A. (Telugu) Examination at the first appearance, under Distance Mode, offered by the Centre for Distance Education, Acharya Nagarjuna University.

పాఠం -1

# భావ కవిత్వం

## (ప్రణయ కవిత్వం - ప్రకృతి కవిత్వం - భక్తి కవిత్వం)

**పాఠ్య నిర్మాణ క్రమం :**

- **1.1** భావ కవిత్వ నిర్వచనం
- **1.2** భావకవిత్వం స్వరూపం
- **1.3** భావ కవిత్వంలోని శాఖలు
- **1.4.** ప్రణయ కవిత్వం
- **1.5** ప్రకృతి కవిత్వం
- **1.6** భక్తి కవిత్వం

**లక్ష్యం :**

నవ్యాంధ్ర కవిత్వంలో తమదైన ప్రత్యేకతను నిలుపుకున్న భావకవుల కవితా స్వరూప విశ్లేషణ, భావకవితా నిర్వచనం, భావకవితా శాఖల్లోని ప్రణయ, ప్రకృతి, భక్తి కవిత్వాలనే మూడు పాయలకుచెందిన ఖండ కావ్యాల కవిత్వాలను మూడు పాయలకు చెందిన ఖండ కావ్యాల స్వరూప నిరూపణ ఈ పాఠంలో తెలుసుకుంటారు.

ఆధునికాంధ్ర కవితా ధోరణులలో మొదటిదైన భావ కవిత్వోద్యమం దాదాపు మూడు దశాబ్దాల (1910-1940) పాటుగా ఆంధ్ర సాహిత్య కేదారంలో పసిడిపంట పండించింది. భావకవులలో ప్రముఖంగా పేర్కొనదగినవారు రాయప్రోలు సుబ్బారావు, వెంకట పార్వతీశ్వర కవులు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, బసవరాజు అప్పారావు, దువ్వూరి రామిరెడ్డి, నండూరి సుబ్బారావు, అబ్బూరి రామకృష్ణారావు, వేదుల సత్యనారాయణ శాస్త్రి, నాయని సుబ్బారావు, అడవిబాపిరాజు, తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి, కవికొండల వెంకటరావు, జాషువా, తుమ్మల సీతారామమూర్తి.

భావ కవిత్వంపై ఇంగ్లీషు సాహిత్యంలో పందొమ్మిదో శతాబ్ది ప్రారంభంలో వచ్చిన రొమాంటిక్ పొయిట్రి (కాల్పనిక కవిత్వం) ప్రభావం కన్పిస్తుంది.

### 1.1 భావ కవిత్వ నిర్వచనం :

రాయప్రోలు వారి కావ్యాలలో 'భావపదము' 'భావగీతము తొలిసారిగా కనిపిస్తున్నాయి. తర్వాత విశ్వనాథ, కృష్ణశాస్త్రిగార్ల రచనల్లో 'భావగీతము' ప్రయోగింపబడింది. 'భావకవిత్వం' అనే పదాన్ని మొదటిసారి ప్రయోగించిన వారు గాడిచర్ల హరి సర్వోత్తమరావుగారు.

అభినవ కవితగా, కాల్పనిక కవిత్వంగా, గీత కవిత్వంగా వ్యవహరించబడిన నవ్య కవిత్వానికి భావ కవిత్వమన్న పేరు స్థిరపడిపోయింది.

విశ్వనాధ సత్యనారాయణగారు "కవి యొక్క ఒక అవిస్పష్ట వాంఛాంకురము, ఒక అంతర్నిగూఢ తాపము, ఒక చిన్న కావ్యములో ఊదబడినచో" అది భావ కవిత్వమని, "ఖండ కావ్యములు ప్రధానముగా ఒక భావమును ఆశ్రయించియే యుండును. అందుచేత దీనివి భావకవిత్వము అనవచ్చు"నని నిర్వచించారు.

కవికొండల వెంకటరావుగారు "భావము యొక్క కవితా స్వభావము భావకవిత్వ"మని నిర్వచించారు. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు భావ ప్రధాన కవిత్వమే భావకవిత్వమన్నారు.

"ఏదో ఒక భావాన్ని ఆధారము చేసికొని అల్పావకాశంలో పూర్ణంగా రససిద్ధిని చేకూర్చేయత్న" మని పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారి అభిప్రాయం.

శ్రీశ్రీగారు భావకవిత్వాన్ని ఈ విధంగా వివరించారు.

"హృదయాలను, మానసాలను కలవరపరుస్తూ అల్లకల్లోలంగా ఘూర్ణిల్లే ప్రమాద ప్రాంతరాలలో కవికి నిరాఘాటంగా విహరించే అధికారం కలదు. అట్టి అతని సంచారాలతో ఏ సమ్మోహనార్తానో కావ్య గీతం ఒకటి మెరుగులు తీరిన విలక్షణ రచనా ధోరణిలో వెలుగు చూస్తుంది. ఆ గీతం కవి అనుభవించిన రస స్థాయిని సమగ్రంగా పాఠకునిలో ఆవిష్కరించ గలుగుతుంది. ఉత్కృష్ట భావగీతానికి నా నిర్వచనం ఇది."

కవి హృదయంలో తటిత్తువలె అప్రయత్నంగా మెరసిపోయిన భావాల అక్షరాకృతియే భావ కవిత్వమని శ్రీశ్రీగారి వివరణ వలన తేలిన సారాంశం.

"వస్తు భావ రచనలలో భావమునకు ప్రాధాన్యమిచ్చిన కవిత్వము" ని ఆచార్య సి. నారాయణరెడ్డిగారు భావకవిత్వాన్ని నిర్వచించారు.

## 1.2 భావ కవిత్వం స్వరూపం

భావ కవిత్వ ప్రధాన లక్షణం అంతర్ముఖత్వం. ఈ కవితా మార్గంలో మనసు పొరల్లోని భావ రేఖలను పదచిత్రాల ద్వారా వ్యక్తం చేసే వీలు కలుగుతుంది. పదచిత్రాల్లోని కొత్తదనం, అనుభూతి ప్రకటనంలోని నవ్యత భావకవిత్వాన్ని కొంత అస్పష్టం కావించాయి. అందుకే కృష్ణశాస్త్రిగారు 'ఏదియొ అపూర్వ మధుర రక్తి స్ఫురియించుగాని అర్థమ్ముగాని భావగీతమ్ము'లన్నారు.

అంతర్ముఖత్వం వలన భావ కవిత్వంలో కింది విధమైన ఛాయలు స్ఫుటాకృతితో నిలిచిపోయాయి.

1. స్త్రీ పురుషుల బాహ్య సౌందర్యానికి బదులుగ ఆత్మ సౌందర్యం, గుణసౌందర్యం కవిత్వంలో వర్ణింపబడ్డాయి.
2. కవి తనకు కలిగిన సుఖ దుఃఖాలను తెరమరుగు లేకుండ వెర్రిగ వెల్లడించుకొన్నాడు.
3. ఒక్కొక్కప్పుడు అవస్థా భేదాన్ని బట్టి కవికి కొండంత సహనమలవడింది. దానికి దార్శనిక దృక్పథంతోడైంది.
4. చర్మచక్షువునకు కనిపించిన ప్రకృతికాక మనో నేత్రానికి భాసించిన ప్రకృతియే వర్ణింపబడింది.
5. జాతికి సర్వాంగ వికాసం కలిగించే సంప్రదాయ సిద్ధమైన సంస్కారదృష్టి కలిగింది. పూర్వజన్మ వాసనలు మరల ఊపిరి పోసుకున్నాయి.
6. తాను విన్న, కన్న ఏ చిన్న సంఘటన అయినా తన హృదయ తంత్రులను ఝుమ్మనిపించి కవిత్వ రూపంలో వెలిజిమ్ముకొని వచ్చింది.
7. ఆత్మార్పణ తత్వం, ఆరాధన తత్వం పాదులు దన్నుకొన్నాయి. అంతశ్చేతనలోని చైతన్యం హద్దులు తెంపుకొని వెలువడింది.
8. లౌకిక సంతోషానికి బదులుగా అలౌకికానందం అంచులు దాటింది.
9. కవి తన వ్యక్తిత్వాన్ని విస్మరించి ఇతరుల సుఖదుఃఖాలలో లీనమై పోయే స్థితి ఏర్పడింది.

## 1.3 భావ కవిత్వ శాఖలు

భావ కవిత్వంలోని శాఖలనీవిధంగా స్థూలంగా విభజింపవచ్చు. 1. ప్రణయ కవిత్వం 2. ప్రకృతి కవిత్వం 3. భక్తి కవిత్వం 4. దేశభక్తి కవిత్వం 5. సంఘ సంస్కరణ కవిత్వం 6. స్మృతికావ్యాలు.

## 1 4. ప్రణయ కవిత్వం

భావ కవిత్వంలో 'ప్రణయ' శబ్దం నాయికా నాయకుల మధ్య ఉన్న ప్రేమ అనే అర్థంలోనే వాడబడింది. భావకవులు సంయోగ వియోగ శృంగారాలలో వియోగ శృంగారానికే ప్రాధాన్యమిచ్చారు. వీరు ప్రేయసీ ప్రియులకు పార్వతీ పరమేశ్వరత్వం ఆపాదించారు. వీరి సంయోగ శృంగారం సభ్యతా పరిధిలోనే ఉండిపోయింది. వీరి దృష్టిలో స్త్రీకి పూజ్య స్థానం కల్పించబడింది. స్త్రీని సహచరిగా, ప్రేయసిగా, ఇల్లాలిగా గౌరవ స్థానం ఇచ్చి పూజించారు. భావ కవులలో ప్రణయ సంకీర్తన చేయని కవి లేడని చెప్పవచ్చు.

భావ కవులను ఇంగ్లీషు కాల్పనిక కవిత్వంలోని స్వచ్ఛంద ప్రణయం ఆకర్షించింది. వీరిలో కొందరు తాము చూచిన స్త్రీ గురించి కవితా గానమాలపించగా, కొందరు ఊహా ప్రేయసిని సృష్టించుకుని కవితలల్లారు. మరికొందరు ప్రేమ విఫలమై వియోగ విషాద గీతాలనాలపించి, ఒక అలౌకిక జగత్తును కల్పించుకుని, ఆ జగత్తులోని ప్రత్యణువులో తమ ప్రేయసీ స్వరూపాన్ని దర్శించి ఆరాధించారు. ఈ విధంగా భావ కవిత్వంలో ప్రణయం, ప్రేయసి అనేకావస్థల నధిగమించాయి.

భావ కవిత్వంలో ప్రణయ కవిత్వం వస్త్వాశ్రయ, ఆత్మాశ్రయ రీతులుగా ప్రవహించింది. కథ, పాత్రలు ఉన్న కవిత్వాన్ని వస్త్వాశ్రయమని ఇవి లేనిది ఆత్మాశ్రయమని చెప్పుకోవచ్చు.

### అ) వస్త్వాశ్రయ రీతికి చెందిన కావ్యాలు

రాయప్రోలువారి కావ్యాలలో లలిత, తృణకంకణం, కష్టకమల, స్నేహలత ప్రణయం ప్రధాన వస్తువుగా గల కావ్యాలు. వియోగ శృంగారంలోని పావిత్ర్యాన్ని దృష్టిలో పెట్టుకుని రాయప్రోలువారు 'అమలిన శృంగారమనే కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు.

"కనుల వొండొరులను జూచుకొనుట కన్న
మనసు లన్యోన్య రంజనల్ గొనుట కన్న
కొసరి 'యేమోయి' యని పిల్చుకొనుట కన్న
చెలుల కిలమీద నేమి కావలయు సఖుడ"

అని రాయప్రోలువారు తృణ కంకణ నాయికచేత అనిపించారు. ఒకనాటి ప్రేమికుల మధ్య ఉన్న ప్రేమ, తర్వాత స్నేహంగా పరిణమించడం తృణకంకణంలో చిత్రింపబడింది.

రాయప్రోలువారు శృంగారానికి, ప్రేవాత్సల్యాలకు లంకె వేశారు. స్త్రీలోని మాతృమూర్తిత్వాన్ని, దైవతాంశను దర్శించి స్వప్న కుమారాది కావ్యాల ద్వారా నిరూపించారు. పద్మ భ్రమరాలకనాదిగా ఉన్న ప్రేయసీ ప్రియ సంబంధం తృణీకృతమై స్వప్నకుమారంలో మాతృ పుత్ర సంబంధం కల్పింపబడింది.

'దప్పిగొని చేరిన మిళింద తనయులకును
పూలపాలిచ్చి చీకట్ల పోవకుండ
కడుపులో దాచుకొనద పంకజము ప్రియుడ!
చేరదీసిన మమకారమేరి కెఱుక.'

స్వప్నకుమారంలో రాయప్రోలువారు వెలిబుచ్చిన ఈ భావం మాతృ పీఠ స్థాయియైన స్త్రీ ముఖం నుండి వినిర్గతం కావటం ఔచిత్యానికి పతాక.

రాయప్రోలు తర్వాత వస్త్వాశ్రయరీతిలో రచింపబడిన ప్రణయ కావ్యాలు అబ్బూరి రామకృష్ణారావుగారి మల్లికాంబ, దువ్వూరి రామిరెడ్డి గారి కడపటి వీడ్కోలు, వెంకట పార్వతీశ్వర కవుల జలజమాలిక ముఖ్యమైనవి.

'మల్లికాంబ'లో 'ప్రణయ లేఖల' మూలాన గలిగిన భ్రాంతితో పండువంటి మల్లిక సంసారంలో కలిగిన ఉపప్లవం చిత్రింపబడింది. 'జలజమాలిక'లో మేనత్త కొడుకైన చంద్రశేఖరాన్ని చిన్ననాటినుంచి ప్రేమించిన అన్నపూర్ణ పెద్దవాళ్ళ ఆటంకంతో వివాహం విఫలం కావడంతో ఆత్మహత్య చేసుకుంటుంది. చనిపోయే ముందు ఆమె రాసిన లేఖను చూచి చంద్రశేఖరుడామెను ప్రకృతిలో లీనమైన ప్రణయ స్వరూపిణిగా భావిస్తూ 'జన్మ జన్మంబునిట్లె నా సకియవగుచు, మదవత్! శాంతి సుఖము నందెదవు గాక' అని తన్నుతాను ఓదార్చుకుంటాడు. 'కడపటి వీడ్కోలు' కావ్యగాథలో ఋషివాటికలో పెరిగిన శారదా గౌతములు చిన్ననాటి నుంచి ఆత్మీయులు. శారదలో కలిగిన వలపు భావనను గౌతముడంగీకరించడు. తన కామెపై కామభావం లేదని, పవిత్రప్రేమ మాత్రమే కలదని, సౌందర్యాన్ని సొంతం చేసుకోవడం తగదని 'పుణ్యమతులకు సౌందర్య పూజనమే' ఆనందదాయకమని అంటాడు. భగ్నమనోరథ అయిన శారద కడపటి వీడుకోలిమ్మని గౌతముణ్ణి

పెనవేయడంతో ఇద్దరూ వాగులోపడి మరణిస్తారు. "ఎంత పుణ్యంబు చేసెనో యీ ప్రవంతి, ప్రేమవాంఛల రెంటిఁజీర్ణించి కొనగ" అన్న కవి వాక్యంతో ఈ కావ్యం విషాదాంతమైంది.

వస్త్వాశ్రయమైన ప్రణయ కావ్యాల్లో కాళ్ళకూరి గోపాలరావుగారి 'స్నానఘట్టము', కొడవంటిగంటి వెంకటసుబ్బయ్యగారి 'భిక్షువు' కావ్యాలు కూడ ఎన్నదగినవే.

## ఆ) ఆత్మాశ్రయరీతికి చెందిన కావ్యాలు

**ఎ) స్వచ్ఛంద ప్రణయం :**

ప్రేమ అనేది ప్రాణికి సహజలక్షణమని భావకవులు భావించారు. వీరికి వలపులు వెదజల్లే విద్య, వలపునకు గుబుల్కొనే అలవాటు ప్రేమకొరకే అన్నది భావకవుల సమాధానము.

"సౌరభములేల చిమ్ము పుష్ప వ్రజంబు?
చంద్రికల నేల వెదజల్లు చందమామ?
ఏల సలిలంబు పాఱు? గాడ్పేల విసరు?
ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను?"

అని కృష్ణ పక్షంలో భావకవుల్లో 'కైలాస శిఖర' మనదగిన దేవులపల్లి కృష్ణశాస్త్రి ప్రేయసితో వ్యక్తం చేసిన భావన ఆత్మాశ్రయ రీతికే అందచందాలను తెచ్చిపెట్టింది.

రొమాంటిక్ కవుల మార్గాన్ని అనుసరించిన భావకవులు ప్రణయాన్ని అతి నాజూకుగా, రమ్యంగా, హృదయాహ్లాదకరంగా వర్ణించారు. కృష్ణశాస్త్రి, అబ్బూరి, నండూరి, నాయని, వేదుల, బసవరాజు మొదలైనవారు ప్రేమను 'ముక్తి' మార్గంగా తలచారు. పవిత్రమైన ప్రణయానికి హేతువేదీ ఉండదని, అది 'అందపు తళుకుల కతీతమైన' దని, 'ఆత్మను ఆత్మను కలిపి కుట్టుదారమే నాదు ప్రేమకుఁగారణమ్ము' అని చాటి చెప్పిన బసవరాజు అప్పారావుగారు ప్రణయ భావనలతిశయించగా తన ప్రేయసి నుద్దేశించి 'లోకముతో మనకేటికి లోలాక్షీ రాపోదము' అని అంటారు.

'ఊహాగానం'లో అబ్బూరి రామకృష్ణారావుగారు 'చివురించిన మావుల క్రింద చేయికి చేయిజేర్చి, పెఱచింతనలన్ మరపించు రాగముల్ దీయుచు వాసనల్ పరిమళించెడు చోటులందు' విహరించటానికి ప్రేయసికి ఆహ్వానం పంపారు. స్వచ్ఛంద ప్రణయ దశలో భావ కవి 'ఆకులో ఆకై, పూవులో పూవై' ప్రేయసి నారాధిస్తూ గడపడం, ప్రణయమే జీవిత ధ్యేయంగా భావించడం కన్పిస్తుంది.

**బి) పూర్వరాగం :**

పరస్పరానురాగం కల నాయికా నాయకుల వియోగదశకు సంబంధించిన అవస్థలు పూర్వరాగంలో దర్శనమిస్తాయి. భావ కవి తాను ప్రేమించిన సుందరి సాన్నిధ్యంకోసం ఎదురు తెన్నులు చూడటం, ఆమె ఎప్పుడు తన వశమగునో అని భావించడం, తనకు, తన ప్రేయసికి సంఘం, విధి అడ్డు రాకూడదని దైవాన్ని ప్రార్థించడం భావకవుల రచనల్లో కన్పిస్తుంది.

"ప్రకృతి కాంతా ధర రసమ్ము వడియగట్టి
పోతపోసినట్లొప్పు నొప్పుల గులాబి
క్రూర కంటకహతి సొంపు గోలుపోక
కన్నులకు విందొనర్చెడు కాలమెపుడొ"

అని సౌభద్రుని ప్రణయ యాత్రలో నాయని సుబ్బారావుగారు ఆందోళన చెందారు. ఈ దశలోనే భావకవి తన ప్రాప్తమనోహరి అనుగ్రహ వీక్షణం కోరుకున్నాడు.

"శ్రోణీభరాలసగమన" సుందరి గమన సౌందర్యాన్ని కమనీయ కవితా రూపంలో అందించిన అబ్బూరి రామకృష్ణారావు గారు "ఊహాగానం"లో 'మోమున మోము చేర్చి ముద్దిడుకొను తమకము' తనకులేదని, ఆమె తనను 'వైజ్ఞానిక సాధుభాషణముల తనియించిన చాలు'నని భావించారు.

2)

**సి) సంయోగదశ :**

పూర్వరాగం పిమ్మటిది సంయోగదశ. ప్రేయసీ సమాగమంకోసం ఉవ్విళ్ళూరటం ఈ దశలో కన్పిస్తుంది. బసవరాజు అప్పారావుగారు 'ఆమబ్బు ఈ మబ్బు ఆకాశ మధ్యాన అద్దుకున్నట్లు మన మైక్యమౌదామే'అని ఆమెను ప్రార్థిస్తారు. వేదుల సత్యనారాయణశాస్త్రిగారు 'దీపావళి'లో 'మూఢ విశ్వాస శృంఖలాల్ని ఛేదించుకుని వలపు కౌగిట ముడి పట్టుబడినచో తమ శరీర సుఖ స్పర్శనమునకు అణువణువు కూడ నవజీవనమనుభవించు'నని, ప్రేయసి తాను కలసి 'వేగుబోకలోరాలు పూలజతవోలె ఆనంద ప్రపూరములో జన్మ జన్మాల యాత్ర సాగింత'మని ప్రేయసితో నివేదిస్తారు. ప్రేయసి ప్రియుని పిలుపు వినడంతో ఆ ప్రేమ జీవుల జనినాంతర సౌహృదయం ఒక్క మాటు గుబాళించింది. 'ప్రకృతి సౌధపు దక్షిణ ద్వారమంత తెలుచుకొనివచ్చి' 'మృదుల పవమాన పరిమళోర్మికలు వారిని ధృఢాశ్లేషంలో బిగించగా, వారు లౌకిక బంధాలను తెంచుకొని 'యుగయుగముల ప్రేమ వియోగ భారమూర్ఛైమచు' లోకాన్ని మరచి శరదుదయోత్సవాలలో మైమరచి పోవడం 'దీపావళి'లో కన్పిస్తుంది.

ఈ సంయోగదశ అపూర్వ మాధుర్యాలను వెల్లివిరియించింది. 'ప్రేయసీ ప్రియులొకరినొకరు చూచుకొనుచు పవ్వళించగా పరస్పరాలోకన మార్గణములు వారి హృదయ జీవ మర్మములను కలచి, అమృతరస గర్భితములైన అలలను ఆవరింపజేసినట్లు, ప్రియుడు కనులుమూసికొనగా ప్రేయసి అతని కనులలో కనులుంచగా అతని హృదయంలో కోటిలోచనాలు ఏకకాలంలో వికసించినట్లు, అతని నాసికలో ఆమె నిశ్వాసపవనాన్ని నింపగా అతని అంతరంగంలో అనంతకోటి జీవవాయు తరంగాలు చెంగలించినట్లు 'సౌభద్రుని ప్రణయ యాత్ర'లో నాయనివారు సంయోగమాధుర్యాన్ని చిత్రించారు.

**డి) ఆశాభంగం - విప్రలంభం :**

తాను ప్రేమించిన సుందరిని తాను కలుసుకోకముందే, ఆమె తనకు లభించకపోగా ప్రియునికి కలిగే ఆందోళన భావకవిత్వంలో ప్రధానంగా చిత్రించబడింది.

భావ కవుల్లో గౌరీశంకర శిఖరమనదగిన దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు
"తళుకుమని కనిపించి వలపు వెల్లువ ముంచి
వలపించి మాయమై వనటగూర్చితివా" అని ఆశాభంగాన్ని వ్యక్తం చేశారు. ఈ ఆశాభంగానికి కారణమైన విధిని వ్యతిరేకిస్తూ నాయనివారు

'ఎవ్వడే రాక్షసుడు మనమీదనున్న
యవధి యంతయు ఁదానయై ఆక్రమించి
వికటదంష్ట్రా భయంకర వికృతవదన
విషమహాసుండు నన్నిట్లు వెక్కిరించు' అంటారు.

వియోగ దందహ్యమానుడైన, నిరాశానిహతుడైన భావకవి 'వేయికరములు సాచికొని, వేయికన్నులు విరిసికొని, వేయి గుండెలు కొట్టకొనగా' ప్రేయసి కొరకు వేచియుండటం,

'కంటి రెప్పలు మింటి కప్పుల
నంటిపోయె నిరీక్షణంబున
ఫాలతలమున రక్తనాడులు
భగ్గు భగ్గున మండుచున్నవి' అంటూ మధురమైన బాధను 'మధుకీల'లో వ్యక్తం చేశారు మల్లవరపు విశ్వేశ్వరరావుగారు.

భావ కవికి ప్రకృతిలోని ప్రత్యంగం చిత్తశమనం కలిగించేదిగా కన్పిస్తుంది. వేదుల వారు చంద్రు నుద్దేశించి

'విరిసిన పూల వెన్నెలల వెల్లువఁ జక్కదనాల హంసవై
యరిగెడు నిన్నుజూచి విశలందున నాకగు బాష్పశాంతి' అని అంటారు.

చంద్రుని ప్రియ మిత్రునిగా భావించే వేదుల శ్రావణ మేఘ గర్జనకు

పెంపుడు నెమలి సైతం పురివిప్పి ఆడకపోగా, తనవలె విరహస్థితిలో ఉన్నట్లు భావిస్తారు.

**ఇ) విషాద స్థితి :**

భావ కవిత్వంలోని విప్రలంభ శృంగారంలో విషాద భావన పరాంకోటినందుకుంది. ప్రకృతి కూడ ఉపశాంతిని ప్రసాదించలేని దశలో వేదనామయ కవితకు మరో పేరైన వేదుల సత్యనారాయణ శాస్త్రిగారు

'దారుణపు జీవితంపు టెడారిలోన
తీరని పిపాస నేదారి తెన్ను లేక
నేనె నా దుఃఖ బాష్ప శోణితలహ హరుల
నే విసుగు వేసటలు లేక త్రావినాను'

అని తన దుఃఖోద్వేగాన్ని ప్రకటించారు. ఈ దుఃఖస్థితిని భరించలేని కృష్ణశాస్త్రిగారు "దుర్భర శోక విషమ గీతులేడ్చినైతు; ఎలుంగెత్తి యేడ్చినైతు" అని పలుకగా ప్రకృతి సైతం చకితమైపోయింది.

**ఎఫ్) పలాయన తత్వం - నిరాశావాదం :**

విషాద స్థితి విషమించగా భావకవికి వాస్తవిక జగత్తు దుఃఖమయంగా కన్పించింది. లోకావరణాన్ని దాటి మిన్నుల కెగసిపోవాలనే పలాయనతత్వం ప్రబలింది. చంద్రునితో 'ఈయామిని మాత్రమే తిరుగులాడెద నేఁజీటు మబ్బువోలె నీతో మనసార, నొక్కపరి దోడ్కొని పొమ్మటకో సుధాకరా" అని వేదులవారు మొరపెట్టుకుంటారు. సంధ్యా సమీరాన్ని ఉద్దేశించి

'ఓయి సంధ్యా సమీరణా, రేయితోడఁ
గారు చీఁకటితోడ దుఃఖమ్ము కూడ
పరువు పరువున నాకొఱకరుగుదెంచు
నీదు నునులేత తెక్కలమీద నడిగ
నెత్తికొని పోవరాదె నన్నిచటికేని" అని కృష్ణశాస్త్రి గారు అర్థిస్తారు.

**జి) విషాద మాధురి :**

విషాద నిర్భరమైన మనో వికృతి దశలలో ప్రకృతికూడ ఓదార్పునీయని సమయంలో భావకవి దుఃఖాన్ని తనకు తోడు నీడగా భావించాడు.

ప్రేమదాహాన నెడద తపించుకొలది
అమృత మొలికింతు స్మిత నయనాంచలముల"

అని వేదులవారు విషాద విషాన్ని ఆనందామృత రసంగా మలచుకున్నారు. అప్పుడు కవికి 'దరిద్ర కుటీరాంగణమున' 'చైత్ర ప్రభాత పరిమళములు' విరిసినట్లు అనిపించింది. తన మనస్సులో కొత్త ఆశలు చిగురించగా

"పూల చిరునవ్వులో పొంగిపోవు వలపు
గాలి యూర్పుల చిఱుతరంగాల వలపు
చివురు జొంపాల వెచ్చని కవుగిలింత
పులుగు గొంతుక తీయని పులకరింత" హృదయంలో నిండగా వేదులవారు వసంతకోకిలవలె ఆనంద కుహూకూజితాల్ని ఆలపించారు.

**ఎఫ్) ఊహా ప్రేయసీ సృష్టి :**

ప్రేయసీ సమాగమం సిద్ధించని భావకవి తనలోని సౌందర్య తృష్ణకు మూర్తి కల్పన చేసికొని ఊహా ప్రేయసిని సృష్టించుకున్నాడు. కృష్ణ శాస్త్రిగారికి ఊహా ప్రేయసి ఊర్వశిగా సాక్షాత్కరించింది. మల్లవరపు విశ్వేశ్వరరావుగారికి విద్యున్నారిగా, జీవన దేవతగా, ఇంద్రజాలిగా,

నీరదరథ సంచారిణిగా బహుభంగుల భాసించింది. వేదులవారికి ఊహాప్రేయసి 'స్వప్నలోకరాజ్ఞి'గా సాక్షాత్కరించింది. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారికి 'తపఃఫలసిద్ధి మూర్తి'గా కనిపించింది. బాపిరాజుగారికి 'శశికళ'గా భాసించింది.

**జి) ప్రేయసీ పూజ్యత :**

భావ కవులలో ప్రేయసికి పూజ్యత కల్పించిన వారిలో రాయప్రోలు వారు ప్రథములు. వేదుల వారు ప్రేయసిని అంతరంగశాంతి దేవతగా, ఆశాపథాంతరాళ పారిజాతంగా, తపఃకల్పవల్లిగా భావించారు. నాయని వారు ప్రేయసిని దేవతగా భావించి

"దైవతమ వీవు నీదు ప్రత్యక్షమునకు
గడియలెంచుచు ముందు భక్తుడను నేను" అంటూ తనను భక్తునిగా చిత్రించుకున్నారు.

**హెచ్) కులపాలికా ప్రణయము :**

విశ్వనాథవారి 'గిరికుమారుని ప్రేమగీతాలు', నాయని వారి 'సౌభద్రుని ప్రణయయాత్ర' కులపాలికా ప్రణయ చిత్రణకు ప్రతినిధి కావ్యాలు. దంపతులకు ప్రకృతి పురుష భావాన్ని సమన్వయించిన కావ్యాలు. ప్రేమతాదాత్మ్యమే బ్రహ్మ సాయుజ్యమని ఈ కావ్యాలు నిరూపించాయి. భారతీయుల గృహస్థాశ్రమ ధర్మం ఈ కావ్యాల్లో అనురాగ రజ్జువులతో పెనవేసుకొంది.

## 1.5. ప్రకృతి కవిత్వం

ప్రకృతి శబ్దం దృశ్యమాన జగత్తులోని చెట్లు, గుట్టలు, నదులు, తీగలు, పూలు, కోకిలలు, తుమ్మెదలు మొదలైన వాటికే రూఢమైపోయింది. స్వభావోక్తి రమ్యాలైన ప్రకృతి వర్ణనలు వేదాల్లోనే కన్పిస్తాయి. ఆది కావ్యమైన రామాయణంలో ప్రకృతి వర్ణన సర్వతో ముఖంగా భాసించింది. ప్రాచీనాంధ్ర కావ్యాల్లో భారత రామాయణాదుల్లో ప్రకృతి స్వభావోక్తి రమ్యంగానే చిత్రింపబడింది. ప్రబంధాల్లోని ప్రకృతి చిత్రణలో కొన్ని చోట్ల సహజత్వం తగ్గి కృత్రిమత్వం చోటుచేసుకుంది.

భావ కవుల దృష్టిలో ప్రకృతి చర్మచక్షువును దాటి హృదయనేత్రంలో ప్రవేశించింది. వీరు ప్రకృతిని స్వీయ సుఖదుఃఖ ప్రకటనకు, ఆత్మానుభూతి సమున్మీలనానికి ఆలంబంగా గ్రహించారు. ప్రకృతి భావకవులను దేవతామతల్లియై చేరదీసి లాలించింది. గురువులా దీవించింది. మిత్రునిలా ఓదార్పునిచ్చింది.

**ఎ) కాల్పనిక ప్రకృతి :**

ఇంగ్లీషు కాల్పనిక కవిత్వంలో ప్రకృతి ప్రీతి, ప్రకృత్యారాధన ప్రధాన లక్షణాలు. ప్రకృత్యారాధన చేసిన కాల్పనిక కవుల్లో వర్డ్సువర్తు అగ్రగణ్యుడు. క్రిక్కిరిసిన నగర జీవితంలో విసిగిపోయిన ఆంగ్లేయులకు ప్రకృతి ఉపశమనంగా తోడునీడగా కన్పించింది. ప్రకృతి దర్శనంతో ఆంగ్ల కవులు అంతర్ముఖత్వాన్ని పొందారు. ప్రకృతిలో తాదాత్మ్యం చెందారు. బాల్య ప్రకృతిని స్మరించారు. ప్రకృతి ద్వారా పారమార్థికతను సాధించారు. ప్రకృతిలో కాల్పనిక విషాద ప్రవృత్తిని వీక్షించారు. ఇంగ్లీషు కాల్పనిక కవిత్వ లక్షణాల ప్రభావం భావకవుల ప్రకృతి కవిత్వం మీద ప్రసరించింది.

**బి) భావ కవిత్వంలో ప్రకృతి :**

భావ కవికి ప్రకృతి అనేక రూపాలలో ప్రత్యక్షమైంది. వేంకట పార్వతీశ్వర కవులకు ప్రకృతి

*"రమణనొకసారి నీలాంబరంబు దాల్చి*
*వెలగి యొకసారి వెన్నెల చీర దాల్చి*
*సొనగ నొకసారి మంచు మేల్ముసుగు దాల్చి*
*లీలనొకసారి మేఘ మాలికను దాల్చి"*

గడియకొకరీతిగా దర్శనమిచ్చింది.

భావకవి తనకు కవితా ప్రేరకమైన ప్రకృతిని ప్రేమించడం, మల్లెలను, మొల్లలనే గాక గడ్డిపూలను చూచి కూడ ఆనందంతో పరవశించడం, పూలను త్రుంచటానికి సైతం అంగీకరించకపోవడం కన్పిస్తుంది. విశ్వనాథవారు మనుజుల మాటలకన్న కోకిల కూజితాలే మహితమైనవనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

ప్రకృతిని ఆనంద హేతువుగా భావించి, ప్రకృతిలో లీనం కావాలని తహతహలాడటం 'ఆకులో ఆకునై, పూవులో పూవునై కొమ్మలో కొమ్మనై ఈయడవి దాగిపోనా" అన్న కృష్ణశాస్త్రి గారి పలుకుల్లో కన్పిస్తుంది.

"పగడాల చిగురాకు తెరచాటు తేటినై
పరువంపు విరిచేడె చిన్నారి సిగ్గునై"

అని ఆయన అడవిలో దాగిపోవాలనే ఉత్కంఠ ప్రదర్శించారు.

"సాంధ్య కిమ్మీర వర్ణ వస్త్రములు దాల్చి
గిరితట విహార శృంగార కేళి సొలసి
రమణఁ జరియించు జలధరార్భకుని గాగ
నేల సృజియింపడో నన్ను నీశ్వరుండు"

అని దువ్వూరి రామిరెడ్డిగారు ప్రకృతిగా తానెందుకు జన్మించలేదా అని వాపోయారు. 'తుహినాంబు కళిక'గా, 'కలువ'గా, 'చుక్క'గా ఈశ్వరుడు తన నెందుకు సృష్టించలేదని బాధపడ్డారు.

ప్రకృతిని ప్రణయానికి ఉద్దీపనగా భావించిన అబ్బూరివారు "ప్రేయసి లేచిరమ్మా చివురించిన మావులక్రింద"... అని ప్రకృతిలోకి ప్రేయసిని ఆహ్వానిస్తున్నారు.

నాయని సుబ్బారావుగారు ప్రకృతిలో ప్రణయ శృంగారాన్ని దర్శించారు.

'చికిలి పూదేనెలకు తుషార కణములకు
నేమి సంబంధ బాంధవ్య మీ శరత్ప్ర
భాత వేళా వికాసి పుష్పముల కొనల
కలిసికొన్నవి ప్రణయ శృంగార మొలయ."

పూదేనెలు, తుషారకణములు కలసిపోవటంలో శృంగారం ఉందని భావించడంలో ప్రణయకవి స్వానుభవంద్యోతకమవుతుంది. ప్రకృతిని తాపోపశయనానికి ఔషధంగా భావించిన వేదులవారు చంద్రునికి 'వెన్నెలల వెల్లువఁ జక్కదనాల హంసవై యరిగెదు నిన్నుఁజూచి నిశలందున నాకగు బాష్పశాంతి' అని నివేదించుకుంటారు.

'శ్యామలాకాశ ఫలకమునందుఁ దరళ
కాంతి వెదజల్లు తారకాక్షరము లొనర
విశ్వ వైశాల్య బోధక విద్య నేర్పు
శర్వరీ గర్భశాంతి యొజ్జగ విధింప'

అని దువ్వూరి రామిరెడ్డిగారు ప్రకృతిని తన గురువుగా భావించారు.

ప్రకృతిని తాత్త్విక చింతనకు ఆధారంగా గ్రహించిన దువ్వూరివారు 'గరిక'ను చూసి

"ఏను నీనైతినో యెవరికిం దెలియు
మున్ను గతించిన పట్టువులందు
ఈవు నేనౌదునో యెవ రెఱుంగుదురు
రాబోవు జన్మాల రాకపోకలకు

గుస గుస చెప్పెదు; గునిసియాడెదవు
నీలోన వెలిగెడు నిర్మల జ్యోతి
వెలి కొత్తఁ బోరాట పెట్టుచున్నదియె"

పూర్వ జన్మానుబంధాన్ని స్మరిస్తున్నారు.

### 1.5.1 పల్లీ జీవన చిత్రణం

#### అ) పల్లీయ ప్రకృతి :

భావ కవిత్వంలో పల్లీయ ప్రకృతిని చిత్రించిన వారిలో విశ్వనాథ, పింగళి-కాటూరి, దువ్వూరి, కవి కొండల, బాపిరాజు ముఖ్యమైన వారు. ప్రకృతి చిత్రణలో వీరందరిది వాస్తవికతా దృష్టి. 'ఋతు సంహారము'లో విశ్వనాథ వారికి గ్రీష్మంలో కన్పించిన 'నలిగిపోయిన పురికోసవలె స్రుక్కిచను నల్లికండ్లపాము', 'ఎండి ముండ్లగు బ్రహ్మ దండిమోళ్ళు', 'గాలికి లేచు ఎండు జిల్లెడు కాయల ప్రత్తి' అచ్చంగా పల్లెటూళ్ళకు సంబంధించినవే.

ప్రభాత సమయంలో పల్లెటూరిలోని వివిధ దృశ్యాలను కాటూరి వెంకటేశ్వరరావుగారు కన్నులకు గట్టినట్లు ఈ విధంగా చిత్రించారు.

"తొలికోళ్ళ యెచ్చరింతలు రెక్కలల్లార్చి
మలుకోళ్ళ గములు మాఱెలుగుసూప
మునుమున్న మేల్కొన్న ముదియవ్వ కదురురుుం
కృతి సుతిగా నూలి కృతులు వాడఁ
గర కంకణ ధ్వనుల్ కవ్వంపుఁజప్పుళ్ళు
బెరయగా నిల్లాండ్రు బెరుగు దరువఁ
బులుగుల కలకలమ్ముల తోడఁ గలయుంపి
సవ్వడుల్ తీయనై సందడింప
మోట గిలకల రవళితో తోటలకును
జలముతోడు బలీ వర్దములనుఁగావు
లదలుపన్ మోకు జవ్వాట లాలకించు
చల్లనన్మేలుకాంచు మా పల్లెటూరు"

#### ఆ) పల్లీజన ప్రకృతి :

కర్షకుల మీద, పడవల వాళ్ళమీద, పశువుల కాపర్లమీద, చేపలు పట్టువారిమీద, గొల్లవాళ్ళమీద భావ కవులు గీతాలాపన గావించడం, కావ్యాలు రచించడంతో కాల్పనిక కవిత్వ ప్రభావమేకాక గాంధీజీ ప్రబోధం కూడ పనిచేసింది.

#### ఎ) కర్షకులు :

దువ్వూరి రామిరెడ్డిగారి 'కృషీవలుడు' పొలము కాపుల దైనందిన జీవితాన్ని వివరంగా చిత్రించిన కావ్యం.

'తడిసిన పచ్చి కట్టియలు తంగెడు తప్పర తాటియాకులం
బడతుక ప్రొయ్యిలో దుఱిగి పైబొగ లెత్తగ నూదుగాని కూ
డుడుకదు కాకకుం బొగకు నుప్పతిలెం గడగంట బాష్పముల్"

అని వానాకాలంలో కాపుటిల్లాలు పడే అవస్థలను దువ్వూరి వారు కళ్ళకు గట్టినట్లు చిత్రించారు.

కాపువానికి "పల్లె యెల్లయె సర్వ ప్రపంచసీమ
ప్రియ యొకర్తయె రమణీయ విగ్రహంబు"

తుమ్మల సీతారామమూర్తిగారు "క్షేత్రజీవి" శీర్షికతో పట్టణాలను చూచి పరువులెత్తే కర్షకు నుద్దేశించి

'కదురుగల చోటు కష్టంబు కదలుచోటు

కఱవులకు ధూమకేతు' వని కృషిజీవనంలోని ప్రాశస్త్యాన్ని ఉగ్గడించారు. 'శివరక్షకుడు' అనే శీర్షిక కింద శివునికి, కర్షకునికి అభేదం చిత్రించారు.

**బి) గోపకులు :**

ఆంగ్ల కాల్పనిక కవిత్వంలో పాస్టరల్ పొయిట్రి అనే ప్రక్రియ ఎన్నదగింది. దీని ప్రభావంతోనే తెలుగులో గోపకులను ఇతి వృత్తంగా చేసికొని కావ్యరచన జరిగింది.

దువ్వూరివారి 'వనకుమారి' ఈ శాఖకు ఏకైక ప్రతినిధి అని చెప్పవచ్చు. ఈ కావ్యంలో దురదృష్టవశాన రాజ్య భ్రష్టుడైన ఒకరాజు, అతని చిన్నకూతురు అడవిలో గొల్లవారుగా నివసించిన వృత్తాంతం ప్రధానవస్తువు. గొఱ్ఱెలను మేపుచున్న వనకుమారి జడివానలో, కారు చీకటిలో గొఱ్ఱెలకై పరితపించిన విధానాన్ని నిసర్గరమణీయంగా వర్ణించారు దువ్వూరివారు.

**సి) ఇతర వృత్తుల వారు :**

పల్లీయులలో అనేక వర్గాలకు, వృత్తులకు చెందిన వారుంటారు. వీరిలో ఆలకాపరులు మొదలుకొని అంట్లుతోమెడి దాసి వరకు కావ్య వస్తువులుగా చేసుకున్నవారు కవికొండల వెంకటరావుగారు. 'రక్తకుల్యగాథ' అనే శీర్షికతో వీరు పడవలాగేవారి పాటను మనోజ్ఞంగా రచించారు.

'రార వెంకటరెడ్డి రార పోతున్న
రావడంలేదు వలలాగు లాగంఁడ్రా
రక్త కుల్యకు కొత్త శక్తొచ్చె నేడు
రావడం లేదు వలలాగు లాగంఁడ్రా"

'ప్రకృతి చందనము' అనే కావ్యంలో వీరు మంగలి కుఱ్ఱవానిని గురించి, జంతికలమ్ముకునే వృద్ధురాలిని గురించి రచనలు చేశారు. కోత కూలీల గురించి, రోడ్లు బాగుచేసేవారిని గురించి కూడ కవికొండలవారు గేయాలు రచించారు.

దువ్వూరి రామిరెడ్డిగారు 'ముసలి మాలెత'పై జాలిపడగా ఆ వృద్ధురాలు
'కాలు సేతులు నున్నంత కాల మొరుల
చేతి కూటికి నాసింపఁజిన్నతన' మంటుంది.
'తిరిపమెత్తి తిన్నఁదీఱునా ఆకలి' అని కవిని ప్రశ్నిస్తుంది.

ఈ పద్యాలలో ముసలి మాలెత శ్రమైకజీవన ప్రియత్వం, ఉదాత్త బుద్ధి చిత్రింపబడ్డాయి.

అడవిబాపిరాజుగారు "గోధూళి" అనే పాటల సంపుటిలో ఆకుమళ్ళలో పనిచేయు భార్యాభర్తల జీవిత రేఖలను రమ్యంగా చిత్రించారు.

"యెయ్యవే గూడ నా పిల్ల' అని
యెయ్యరోయి గూడ యెయ్యరా ఓ సిన్నిబావా
యెయ్యరోయి గూడ వేయరా" అని ఆకుమళ్ళకు గూడవేసినప్పటి ఘట్టాలను, 'పంట పండిస్తాము పాలాయబావా, కుప్ప వేయిస్తాము కొలతోటబావా' అంటూ పంటకు. కళ్ళాలకు సంబంధించిన సన్నివేశాలను, 'పాలమ్మ పాలు తియ్యన్ని పాలు' వంటి పాటలలో పాలమ్మే గొల్లభామలను స్వభావ సిద్ధంగా వర్ణించారు. ఇంతేకాక వీరు 'తోటమాలి కూతురు'పై, 'గొల్ల పెల్లాయి కూతురు'పై వ్రాసిన పాటలీ శాఖలోనివే.

కొనకళ్ళ వెంకటరత్నంగారి 'బంగారిమామ పాటల'లో పల్లీజన ప్రకృతి ప్రధానంగా చిత్రింపబడింది. ఈ పాటలలో ఊరిలో తిండిగడవక 'పట్నవాసము'నకై వెళ్ళిపోయే రైతులను గురించి గుండెగూడు కదలునట్లు వర్ణించారు.

"ఈనమోపై వున్న పైరులు
ఏటి మునకల పాలుజేసి
కొంపగోడీ విడిచి పట్టెడు
కూటికై ఊరేగవలెరా"
.... .... ...
"ఒళ్ళు పెంచిన గడ్డమీదే
ఒరిగిపొయ్యే రాణలేదో
ఊరుగానే ఊరిలో చితి
పేర్చుకొమ్మని నొసటి వ్రాలో"

అను చరణాలలో పల్లీయులకు తమ పంట పైరులతో, ఊరితో ఉన్న దృఢానుబంధం కరుణామయంగా వర్ణింపబడింది.

ఈ సంపుటిలోనే రోడ్డు రోలరులాగే శ్రామికుల ఆత్మవేదన
"మారువాడి అప్పుకంటె మాయదారి బ్రతుకు కంటె
బరువా ఇంతోటి పెద్ద బండరాయి మామయ్య
లాగరా హయిలెస్స లాగరా
రోడ్డు రోలరు ముందడుగై సాగరా"

అనే పాటలో వ్యక్తీకరింపబడింది.

## 1.6 భక్తి కవిత్వం

పూజ్య పూజక భావమే భక్తికి మూలబీజం. 'సాత్వస్మిన్ పరమ ప్రేమరూపా' అని నారదభక్తి సూత్రాలలో భక్తి నిర్వచింపబడింది. భగవంతుని పట్ల ఉండే అవ్యాజమైన, అహంకార రహితమైన ప్రేమతో చిత్తం భగవదధీనంకాగా భక్తుడు పరమాత్మలో లీనం కావాలని పరితపిస్తాడు. రామాయణ భారతాది గ్రంథాల్లో నవవిధ భక్తులకు లక్ష్యాలు కన్పిస్తాయి. భావ కవుల్లో భక్తి కవిత్వాన్ని వెలయించినవారు పలువురున్నారు. వీరిలో కొందరు త్రిమూర్తుల ప్రతినిధియైన జగదీశ్వరిని ఉపాసించినవారున్నారు. ఆ జగదాంబను సమీపించటానికి పంచ భూతాత్మకమైన ప్రకృతిని ఆశ్రయించారు. భావకవుల్లో అధికులు మధుర భక్తి మార్గాన్ని ఆశ్రయించారు.

ఇంగ్లీషు కాల్పనిక కవిత్వంలో కూడ భక్తి కవిత్వం ప్రధాన స్థానమాక్రమించింది. మనం 'భక్తి' అన్నదానినే వారు (Mysticism) మిస్టిసిజంగా భావించారు. భగవంతుని ప్రత్యక్షంగా చూడటానికి, అతనిలో లీనం కావడానికి భక్తుడు పొందే ఉత్కంఠను మిస్టిసిజమని చెప్పవచ్చు. కావున పాశ్చాత్యుల మిస్టిక్ కవులకు, ప్రాచ్యుల భక్త కవులకు భేదం లేదు. భావ కవులు సృష్టిలో పరమాత్మ అంశను దర్శించాడు. అంతర్ముఖత్వం ద్వారా, ఆత్మ దర్శనం ద్వారా వారి చరమలక్ష్యం సాధింపబడింది. భావ కవులు వ్రాసిన భక్తి కవిత్వాన్ని మూడు శాఖలుగా విభజించవచ్చు.

### అ) పారమాత్మిక కవిత్వం :

భావ కవి సృష్టి ఒక్కటే అని, ఈశ్వరుడొక్కడే అని భావించాడు. తాపత్రయ సంతప్తమైన ఈ లోకానికి పరమాత్ముడే ఏకైక గమ్యమని తలంచాడు. ననలు, సొనలు, మంజుకుంజాలు ఆ పరాత్పరుని ఆనంద హాసలేశాంకురాలుగా భావించాడు. ప్రతి పుష్పం భావకవికి భగవంతుని ప్రణయ లేఖగా భాసించింది. భగవంతుడు

"సడలు మేనికి పీవన, బడలు నెదకు
తీయవగు మడి, వడలు పూదోవ కమ్మృత
జీవమిడు వానజడి'గా

దీనపావనుడుగా కృష్ణశాస్త్రిగారి పలుకుల్లో కనిపిస్తాడు. అప్పుడు కవి తన్నుతాను పరిశీలించుకోగా తానెంత పాపాత్ముడో, అహంకార పూరితుడో, అల్పుడో అర్థమైంది. భగవంతునితో తన క్షుద్ర గుణాలను మొరపెట్టుకోవటం వెంకట పార్వతీశ్వర కవుల "భావ సంకీర్తనం"లో కన్పిస్తుంది. తన అల్పత్వాన్ని గుర్తించిన భక్త కవి 'కుక్క గొడుగు క్రిందఁగూర్చుండి, ఛత్రాధిపతినకొని' బడలు వడితినని, 'కుమ్మరి సారెపై జేరి భూచక్రం బెల్ల నాయధీనంబని నమ్మి దండధరుండనై కన్నుగానక యలజడి బడితి'నని, చివరకు 'గొడుగు ముడిగిపోయినది; కులాల చక్రంబు తునియలై పోయిన'దని, అపుడు తానెంతటి అధమమర్త్యుడో తనకు తెలిసిందని ప్రభునితో నివేదించుకున్నాడు.

తాను చేసిన పాపముల వల్లనే భగవంతుడు తన్ను మన్నించుట లేదని గ్రహించి "నా పాపము రూపింపు మురి శిక్షకైన నేనోర్చు కొందు" నని మొర పెట్టుకున్నాడు. పూర్వం తాను సుగుణపరుడినని, జ్ఞానవంతుడినని, పలువురి మెప్పుపొందితి నని, ఇది అంతా తన మహత్వమే అని పొంగిపోయానని, ఇప్పుడు పరమాత్ముని పాదయుగళ భక్తి తప్ప ఏదీ మిగలలేదని కవి 'భావ సంకీర్తనం'లో అహంకార త్యాగాన్ని ప్రకటించాడు.

ఒక్కొక్క చిత్త వృత్తిలో తాను చేసిన పాప కార్యాలకు, తన అహంకార బుద్ధికి తానే సలసల క్రాగిపోయి భగవంతునితో

"ఈ మహాపాపి; గర్విష్ఠు, నీ కిరాతు
గరుణఁజేరంగ దీయకు - కాలయవను
చేతి గండ్ర గొడ్డండ్రతో చిన్న చిన్న
ఖండములుగ నరుక నిమ్ము"

అన్నంత తీవ్రంగా తన బాధ వెల్లడించుకోవడం బి.టి.కె. ఆచార్యగారి 'కలువ రేకులు'లో కన్పిస్తుంది.

'మహతి'లో దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు తనవి గడ్డిపూవులని, అతనికిష్టమైనచో వానినాతని పూలదండలో మెరసిపోనిమ్మని, తనవి లేతగీతములని, అతని కిష్టములైనచో అతని కీర్తనములో మ్రోగిపోనిమ్మని, తనది పేదజీవిక అని అతని కిష్టమైనచో అతని రాజవీధిలో సాగిపోనిమ్మని ఆత్మ న్యూనత్వాన్ని, భగవదాధిక్యాన్ని ప్రకటించారు.

ఇంతటి పశ్చాత్తాపాన్ని ప్రకటించినా, ఇంతగా అహంకార త్యాగమొనర్చినా, ఇంతగా తన అల్పత్వాన్ని ప్రసరించినా పరమాత్మ సాన్నిధ్యం లభించనే లేదు. ఆ స్థితిలో కవికి కన్నీరొకటే శరణ్యమయింది.

'కురియుమురా కన్నీరును మరిమరి విలపించుమురా
పరము గూర్చి పరమేశుడు తాల్చునురా పాపీ"

అని తన్ను తాను సంబోధించుకున్నాడు. మలిన బాష్ప మౌక్తికమ్ము మిలమిలమని కనుల మెరసినచో తళ తళమని తారలు వటియించునని పలికాడు. 'గాఢ లజ్జానుతాప సంకలిత హృదయ నీరజ దళాల రాలు కన్నీటి చుక్క గాక' కాన్కగా నీకే మొసంగ గలుగుదునని పరమాత్మునితో విన్నవించుకున్నాడు.

ఇంకను ప్రభుని వింత చేతల నర్థం చేసుకోలేక
"ఎట్లు విన్నాహ సేయుటో యెఱుగ లేక
వంగి వంగి శిరము వంచి క్రుంగిపోద్దు
... .... ..... చింపి

పాతలం గట్టికొని జీర్ణ పట కుటీర

పాళికా ప్రాంగణముల నివాసమేల?

అంటూ కృష్ణ శాస్త్రిగారు కుంగిపోయారు.

కవి భగ్నాశలు, తాపాగ్ని, ఆత్మలో జరుగు సంగ్రామం అన్నీ కలసి ఉప్పొంగి పొరలి అశ్రు రూపంలో ప్రవహించింది. కన్నీరు ఊషరక్షేత్రం వంటి హృదయాన్ని పదును పరిచి సమస్త కాలుష్యాలను పారద్రోలి, అభినవ జీవ కళలను చిగురింప జేయునని కవి భావించినాడు. కృష్ణశాస్త్రి తాను జలజల కన్నీరు కురిసిన తర్వాత పరమాత్మ సాన్నిధ్యం లభించినట్లే తృప్తి చెందాడు.

'కలుష దుర్దాంత పంక సంకలిత కుహార

ముల జనించు మదీయాశ్రు మలినధార

స్వామి, భవదీయ పాద దేశమునఁ బారి

పరమ పావన జాహ్నవీ ప్రతిభఁగాంచు'

ఈ విశ్వాస సూర్యోదయమైన పిమ్మట భక్తునికి, భగవంతునికి భేదభావం ఉండదు.

**ఆ) మధుర భక్తి కవిత్వం :**

పరమ పురుషుడొక్కడే పురుషుడు; భక్తులందరూ స్త్రీలే అన్న అభిప్రాయం వైష్ణవ వాఙ్మయంలో స్థిరపడిపోయింది. రాధాకృష్ణుల, గోపీ కృష్ణుల విరహ శృంగారాన్ని వైష్ణవులు విశేషంగా చిత్రించారు. శృంగారంతో ప్రారంభమై భక్తిలో పర్యవసించే 'శృంగార భక్తి'ని ప్రతిపాదించారు. ఈ విధంగా చిత్రింపబడిన గోపీకృష్ణుల శృంగారం జీవాత్మ పరమాత్మల వియోగ సంయోగాలకు సంకేతం.

భగవంతుని ప్రియునిగా భావించుకుని భక్తుడు తన్ను తాను ప్రేయసిగా భావించుకొనుటయే మధుర భక్తి. రాధా కృష్ణులు, గోపికా కృష్ణులు జీవాత్మ, పరమాత్మల మధుర భక్తికి పర్యాయ పదాలయ్యారు. మధురభక్తిలో సర్వాత్మ సమర్పణం, భగవద్వియోగ దుస్సహత్వం ప్రధానమైనవి.

భావ కవిత్వంలో వెలువడిన భక్తి కవిత్వంలో మధుర భక్తి అధికంగా కన్పిస్తుంది. దీని అవతరణకు ఆంధ్ర భాగవతం, క్షేత్రయ్య పదాలు, గీత గోవిందం, కృష్ణ కర్ణామృతం మూలప్రభావాలు. వీటితో పాటు రవీంద్రుని 'గీతాంజలి' ప్రభావాన్ని విస్మరించటానికి వీలులేదు. గోపికా కృష్ణుల ప్రస్తావనయే లేక సూటిగా ప్రభువును ప్రాణేశ్వరునిగా విశ్వమంతటిని ప్రాణవిభుని మందిరంగా భావించటంలో రవీంద్రుని ప్రభావం, వంగ వైష్ణవ గీతాల ప్రభావం కన్పిస్తుంది. ఈ విషయంలో ఇంగ్లీషు కాల్పనిక కవుల ప్రభావమే మాత్రం లేదు.

భావ కవిత్వంలో మధుర భక్తి కవిత్వానికి వెంకట పార్వతీశ్వర కవుల 'ఏకాంత సేవ' ప్రతినిధి కావ్యం. ఆస్తిక్య భావాన్ని మధురంగా చిత్రించిన కావ్యమిది. దీనిలో యుగయుగాల విశ్వమానవుని మధుర సాధన 'మధురముగ, మార్దవంబుగా, మంజులముగ, మానసా నందకరముగా, మంగళముగ' చిత్రింప బడినది. 'ప్రవిమల భక్తియుక్తుడైన భక్తుడు పరమేశ్వరుని గూర్చుపాడు' మధుర గీతమే ఏకాంత సేవ.

'వంగ భాషకు రవీంద్రుని గీతాంజలి యెట్టిదో, మనయాంధ్రమునకే మహాకవుల - భక్తుల 'యేకాంతసేవ' యట్టిదని నాయభిప్రాయము' అని దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి పలుకులు ఈ రెండు కావ్యాలకు ఉన్న స్థూల సాదృశ్యాన్ని పురస్కరించుకుని అన్నవి మాత్రమే. రవీంద్రుని 'గీతాంజలి' కేవలము మధుర భక్తికి సంబంధించినది కాదు. గీతాంజలిలోని భక్తునికి భగవంతుడు ప్రియుడు మాత్రమే కాడు; తండ్రి, అన్న, చెలికాడు. మృత్యువు ఆ ప్రభునిదూత. గీతాంజలిలోని భక్తునిది కేవలమొక అనంతాన్వేషణ; ఆధ్యాత్మికగవేషణ.

ఏకాంతసేవ, గీతాంజలి దేనికది విశిష్టములైన కావ్యాలు.

మధురభక్తి కవిత్వం నవ్యకవితా కేదారంలో రెండు పాయలుగా ప్రవహించింది.

ఎ) వస్త్వాశ్రయ రీతి :

రాధా కృష్ణుల, గోపికా కృష్ణుల సంయోగ వియోగాలను, మోద విషాదాలను ఆయా పాత్రలనే ఆశ్రయించుకుని చిత్రింపబడినది వస్త్వాశ్రయ రీతి అనవచ్చు. దీనికి విశ్వనాథవారి 'శృంగారవీధి' నిస్తుల నిదర్శనం.

'మదన మహీపతి ప్రసవ మార్గణ భిన్న శరీర'యైన రాధిక వేపధు స్థితి వర్ణనతో ఈ కావ్యం ప్రారంభమౌతుంది. రాధ 'నిర్దయుడైన గోపరమణీ ప్రియునే' స్మరించుచు 'విరహాబాధా నిబిరీసయై పండు వెన్నెలలను, కోకిల గీతులను ఉపాలంభిస్తుంది. ప్రణయ దౌత్యానికి వెళ్ళిన దూతిక రాధతో 'మనము జ్ఞాపకమా? యదువంశమౌళికిన్' అంటుంది. తర్వాత రాధ మూర్ఛావస్థ, శిశిరోపచారాలు, శ్రీకృష్ణుడు రాధను చేరదీసి అనునయించడం చిత్రించబడ్డాయి. తదనంతరం రాధా కృష్ణుల సంయోగం, స్వామి వేణుగానం, రాధ స్వప్నం వర్ణించబడ్డాయి. ఈ కావ్యం రాధాకృష్ణుల విరహ విప్రలంభానికి, సంయోగానికి వంతెన వంటిది. స్థూలంగా శృంగార గాథవలె కన్పించినప్పటికీ ప్రణయ పథం ద్వారా ప్రణవాన్ని అందుకొను పద్ధతిలో సాగిన కావ్యమిది.

కృష్ణ శాస్త్రిగారి 'అన్వేషణము' వస్త్వాశ్రయ రీతిలో రచింపబడిన కావ్యమే. కృష్ణుని 'మురళికా మంద మంద మాధురుల రుచులు' గుండెలో రగిలిపోగా, 'ఎలదేటి చిఱుపాట సెలయేటి కెరటాల బడిపోవు విరికన్నె వలపు వోలె' పరుగులెత్తిన గోపిక విప్రలంభవేదనను, సంయోగ మాధురిని వర్ణించిన ఖండకావ్యమిది.

కరుణశ్రీగారి 'కరుణామయి' 'రాధనురా ప్రభూ! నిరపరాధనురా! అనురాగ భావనారాధన మగ్న మానసనురా' అని కృష్ణ విరహంలో ఆక్రందించిన రాధికవేదనను చిత్రించిన ఖండకృతి. వీరి 'పారవశ్యము'లో కూడ బృందావన వీధులలో ప్రణయ కుపితయై కూర్చున్న రాధిక చిత్తవృత్తి, 'రాధికామానస విహార రాజహంస'యైన కృష్ణుని దాక్షిణ్య స్వభావం వర్ణింపబడ్డాయి. 'రాధపై ప్రేమ యధికమో మాధవునకు, మాధవుని పైని రాధప్రేమయే ఘనమ్మో' అను మధుర జిజ్ఞాసతో సమాప్తమైన కలకండకృతి ఇది. చామర్తి రాజశేఖరరావుగారి 'బృందావన' మను ఖండకావ్యం సంపుటిలోని 'శరద్రాత్రి గురజాడ రాఘవశర్మగారి 'కల్పలత'లోని 'గోపికా హృదయము' మున్నగునవి, బసవరాజు అప్పారావుగారి 'గోపికా గీతములు', వట్టికొండ విశాలాక్షిగారి 'ప్రణయభిక్ష', చావలి బంగారమ్మగారి 'రాధ', వేదులవారి 'రాధ', 'సంధ్యాన్వేషణము' మొదలైనవి వస్త్వాశ్రయ రీతిలో వచ్చిన ఖండకావ్యాలు.

బి) ఆత్మాశ్రయరీతి :

భావకవి తన్నుతాను గోపికగానో, రాధికగానో భావించుకొని కృష్ణాన్వేషణ చేయుటం, కృష్ణ వియోగంలో దహించుకొని పోవటం, ఆ వియోగ స్థితిలో తన బాధలను, మధుర వేదనాశీలమైన గాథలను 'వెళ్ళబోసికొనుట' ఆత్మాశ్రయ రీతిలో కన్పిస్తుంది.

ఇందులో భావకవి తన్నుతాను 'వరనందనోద్యాన వనలక్ష్మి'గా, భగవంతుని 'తరుణ శృంగార మాధవుడు'గా సంకేతించుకోవటం 'ఏకాంతసేవ'లో కన్పిస్తుంది.

బసవరాజు అప్పారావుగారు 'దాసిగానుండుటకైన తగనా ప్రాణేశ 'పాదములు నొచ్చినంత పట్టుటకైనను దగనా' అని సేవా భావం వెలిబుచ్చారు. ప్రాణేశ్వరుడు ఎట్టకేలకు తన ఇంటికి రాగా లజ్జా భారంతో, శిశిరవాత స్పర్శచే వణకిపోయే సుమవల్లికవలె ఉక్కిరి బిక్కిరైపోయి

'పాడు సిగ్గు వీడదాయె ప్రాణేశ! దేవా! నీ
చూడ చక్కనైన మోము చూడలేక వెఱగుపడితి'

అని నివేదించుకున్నారు. ఒక్కొక్క మానసిక స్థితిలో బసవరాజు అప్పారావుగారికి భగవంతుడు 'కాంతరూపమున' కన్నులబడటం, 'అతివా నీ ప్రాణనాథుడెవడని' ప్రశ్నింపగా 'ఆడుదానివలె హృదయము కానుక యర్పించినతడె నానాథుడ'ని భగవంతుడు బదులివ్వటం వారి గీతాలలో కన్పిస్తుంది. భగవంతుని కాంతా రూపాన్ని భావన చేయుటం విలక్షణాంశం.

**సి) వేణుగానం :**

మధురభక్తి కవిత్వంలో శ్రీకృష్ణుని వేణుగానానికి అత్యంత ప్రాధాన్యమున్నది. మధురభక్తి కవిత వెలయించిన వారు వేణుగానాన్ని వర్ణించక విడువలేదు. 'వాయింపుమా మురళి వాయింపుమా కృష్ణ' అని బసవరాజు అప్పారావుగారు, 'ఏది యింకొక్క మారూదరా నీ మురళి' అని వేదులవారు, "ఏది మరొక్కమాటు హృదయేశ్వర గుండెలు పుల్కరింపగా ఊదగదోయి" అని కరుణశ్రీగారు కృష్ణుని అర్థించారు.

మురళీ రవం విశ్వమంతట వ్యాపించగా జోలపాడినట్లు అనుభూతి చెంది సృష్టి సమస్తం సుషుప్తిలో మునిగిపోయింది. బాలగోపాలుని పాట ఆతని చేతిలోని మురళినే కాక కవిలోని 'మోడుబెడదను', 'శిధిల జీవనమ్ము'ను మ్రోయించింది. ఆ మురళీగానంలో

"మంజుల సుమామృతములోని మధురిమమ్ము
మధుర చంద్రాతపములోని మార్దవమ్ము
మృదు సమీరమ్ములోని పరిమళమ్ము" కలవని

ఉవేదులవారు భావించారు. ఆ 'పాటతీపి'ని భరించే శక్తి తనకు లేదని గ్రహించి

'మ్రోయింపకోయ్ మురళి మ్రోయింపకోయ్
తీయ తేనియ బరువు మోయలేదీ బ్రతుకు'

అని తన అశక్తతను వ్యక్తం చేస్తూ, మురళీగాన మాధుర్యం వలన తనకు గలిగిన పారవశ్యాన్ని తట్టుకోలేని విచిత్రమైన అవస్థను కృష్ణశాస్త్రిగారు ప్రకటించారు.

జీవాత్మ పరమాత్మ పిలుపును మురళీగాన రూపంలో అందుకుని పరమాత్మలో లీనం కావాలని కోరుకుంటాడు. అందుకే విశ్వనాథవారు వేణుగానాన్ని 'బ్రహ్మగీతం'గా వర్ణించారు.

**డి) తాత్త్విక కవిత్వం :**

మోక్షసాధన మార్గాల్లో ఒకటైన జ్ఞాన మార్గాన్ని ఆశ్రయించిన ధోరణి తాత్త్విక కవిత్వంలో కన్పిస్తుంది. పరమార్థాన్ని కనుగొనాలనే తాత్త్వికచింతన కల భావ కవులలో దువ్వూరి రామిరెడ్డిగారు ప్రథములు. మృత్యువును 'ఆనందదాయకమైన వాసంత కల్య'గా, ప్రియమైన వస్తువుగా భావించటం, మృత్యువును 'సకియ'గా భావించటం రామిరెడ్డిగారి విలక్షణత. ఆమెనుద్దేశించి 'అందంబులకు నెల్ల అందంబు నీవు' అని సంభావించారు. చివరికామెను 'పెండ్లి కూతురా' అని పిలిచారు.

వెంకట పార్వతీశ్వర కవులు 'విచారలహరి'లో 'జలధరంబులయందు జలములేగాక పిడుగులేమిటికి గల్పింపగా బడెనో' అని ప్రకృతి సూక్ష్మముల పట్ల జిజ్ఞాసా దృష్టిని ప్రదర్శించారు.

రామిరెడ్డిగారి 'పిచ్చి బికారి' జిజ్ఞాసువునకు సంకేతం. వీరి 'దీప నిర్వాణము' అను ఖండికలో తన చేతిలోని బంగారు దివ్వె ఎంత వెలిగించినప్పటికీ పయ్యరవిచి వెంటనే ఆరిపోయినట్లు, 'వెలిగించి వెలిగించి విసిగి వేసారి' తుహిమ కరళ్ళలో 'త్రుళ్ళింతలాడు చుక్కాని లేని' పడవవలె తాను 'దూళిగ్రుంగుచు' పోవుచున్నట్లు వర్ణింపబడింది.

**సమీక్ష :**

భావ కవిత్వంలో వస్తు భావ రచనల్లో భావానికి ప్రాధాన్యమివ్వడం, అంతర్ముఖత్వం, ఆత్మార్పణ తత్త్వం పాదులు దన్నుకోవడం, ప్రణయ కవిత్వంలో అమలిన శృంగారానికి, ఆరాధనా తత్త్వానికి ప్రాధాన్యమివ్వడం, ప్రకృతి కవిత్వంలో స్వీయ సుఖ దుఃఖ ప్రకటనకు, ఆత్మానుభూతి సమున్మీలనానికి ప్రకృతి ఆలంబంగా భాసించడం, భక్తి కవిత్వంలో మధుర భక్తి ప్రాధాన్యం అనే అంశాలు ఈ పాఠంలో తెలుసుకున్నారు.

**ప్రశ్నలు :**

1. భావ కవిత్వాన్ని నిర్వచించి, భావ కవితా స్వరూపాన్ని ఆవిష్కరించండి.
2. భావ కవిత్వంలోని శాఖల్ని సంగ్రహంగా వివరించండి.
3. భావ కవితా కాలంలో వచ్చిన ప్రణయ కవిత్వంలోని దశలను విశదీకరించండి.
4. భావకవులు ప్రకృతిని విశ్లేషించిన తీరు వ్యక్తీకరించండి.

**ఆధార గ్రంథాలు :**


1) ఆధునికాంధ్ర కవిత్వం - సంప్రదాయములు ప్రయోగములు : డా. సి.నారాయణరెడ్డి

2) తెలుగు కవితా వికాసం : డా. కడియాల రామమోహనరాయ్


**డా॥ జి. వై. ప్రభావతీ దేవి**

పాఠము - 2

# భావ కవిత్వం

## (దేశభక్తి కవిత్వం - సంఘ సంస్కరణ కవిత్వం - స్మృతికావ్యాలు)

**పాఠ్య నిర్మాణ క్రమం :**

2.1 దేశ భక్తి కవిత్వం

2.2 సంఘ సంస్కరణ కవిత్వం

2.3 స్మృతి కావ్యాలు

**లక్ష్యం :**

భావ కవితా శాఖల్లోని దేశభక్తి, సంఘ సంస్కరణ, స్మృతి కవితా సంబంధమైన ఖండ కావ్యాల స్వరూప నిరూపణ ఈ పాఠంలో తెలుసుకుంటారు.

### 2.1. దేశ భక్తి కవిత్వం

భావ కవిత్వంలో దేశభక్తి రెండు పాయలుగా ప్రవహించింది. ఒకటి భారత జాతీయాభిమాన సంబంధి; రెండవది ఆంధ్రాభిమాన సంబంధి. దేశభక్తి కవిత్వం మీద కాల్పనిక కవిత్వ ప్రభావం లేదు. ఇది సమకాలీన పరిస్థితులు, రాజకీయ ఉద్యమాల ప్రభావంతో వెలువడింది.

### 2.1.1 జాతీయాభిమానం :

1905నకు ముందు భారత దేశంలో జాతీయోద్యమం బలపడలేదు. ఆంధ్ర దేశీయుల మనసుల్లో జాతీయాభిమానం అంకుర స్థితిలో మాత్రమే ఉండేది. ఆంగ్ల ప్రభుత్వం 1905లో వంగదేశాన్ని రెండు ముక్కలుగా చేయటంతో భారతీయుల గుండె భగ్గుమంది. దాంతో జాతీయాభిమానం పొంగిపొరలింది. బిపిన్ చంద్రపాల్ కలకత్తా నుంచి మద్రాసు వరకు ఉన్న ముఖ్య పట్టణాల్లో ఉపన్యాసాలు ఇచ్చి ప్రజలను ఉత్తేజితులను చేశారు. రాజమండ్రి సభలో ఆయన ఉపన్యాసం విని ఉద్రిక్తులై చిలకమర్తి లక్ష్మీ నరసింహంగారు జాతీయాభిమానంతో

"భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియబట్టి" అను పద్యాన్ని రచించారు.

జాతీయాభిమానం బెంగాల్ రాష్ట్ర విభజన తర్వాత స్వదేశీ ఉద్యమానికి ఊపిరి పోసింది. ఈ ఉద్యమానికి స్వరాజ్యం, స్వదేశీ వస్త్రం, స్వజాతీయ విద్య ఆదర్శాలయ్యాయి. ఈ నేపథ్యంలోనే 1907లో లాలాలజపతిరాయ్‌ని బ్రిటిషు ప్రభుత్వం అరెస్టు చేసింది. అందుకు నిరసన వ్యక్తం చేస్తూ జాతీయాభావంతో ఆవేశపూరితమైన రీతిలో కవిత వెలయించారు.

"చెరసాలల్ పృథు చంద్రశాలలెయగున్, చేదోయి గీలించు న
య్యర దండల్ విరిదండలయ్యెడును, హేయంబైన చోడంబలే
పరమాన్నంబగు, మోటు కంబళులు దాల్పన్ పట్టు సెల్లాలగున్
స్థిరుడై యే నరుడాత్మ దేశమును భక్తింగొల్చు నవ్వానికిన్"

1915లో గోఖలే నిర్యాణవార్త వినగానే రాయప్రోలులో పొంగులెత్తిన భావోర్మికలలో జాతీయోద్యమ కవిత్వం తొంగిచూచింది.

"దొరలందగిలించిన బిరుదు మోజున ద్రుళ్ళి
నాయక ధర్మంబు-బాయలేదు
ప్రభువుల విశ్వాస పదమెక్కి దుర్నీతిఁ
బ్రజలపక్షము భంగపఱుపలేదు
స్వార్థలోభమున కపటనాటకములాడి
తల్లి కడుపు చెడదలపలేదు
సమయనీతి త్యజించి సంక్షోభ విడివడ
కలహ కవాటముల్ కదపలేదు

నీతి చాతుర్యమును స్తవనీయమయిన
దేశ సేవన దీక్షయు దీర్చినావు
యోగివోలెను ఫలనిస్పృహుండవగుచు
మేలుకీళ్ళు సహించి గోపాల కృష్ణ

భావకవులలో భారత జాతీయతను ప్రబోధించినవారిలో చిలకమర్తి, గురజాడ, రాయప్రోలు, దువ్వూరి, బసవరాజు ముఖ్యమైనవారు. గురజాడ 'దేశభక్తి' గేయం జాతీయాభిమానంతో పాటు అంతర్జాతీయ భావన కలిగిస్తుంది. రాయప్రోలు 'జన్మభూమి' గేయం జాతీయ కవితా పురంధ్రికి శిరోభూషణం వంటిది.

'ఏదేశమేగినా, ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనిని
పొగడరా నీ తల్లి భూమి భారతిని,
నిలుపరా నీ జాతి నిండు గౌరవము'

దువ్వూరి రామిరెడ్డిగారు 'నైవేద్యము' అన్న శీర్షికతో భారతమాతృచరణ పూజకై తరలిపోయిన సామాన్య ప్రజలగీతిని వినిపించారు. వారి 'మాతృమందిరము'లో మాతృపద సన్నిధిలో ఆత్మలను కర్పూరంగా వెలిగించనిదే స్వాతంత్ర్య ఫలం సిద్ధించదనే ప్రబోధమున్నది. అవిగాక వీరు 'మేలుకో భారతకుమారా మేలుకోరా తరుణధీరా' అని ప్రబోధ గేయాలు రచించారు.

మాతృదేశం పట్లగల భక్తిని అసిధారా సదృశమైన ఆవేశంతో వేదుల సత్యనారాయణ శాస్త్రిగారు

"నీచపు దాస్య వృత్తి మన నేరని శూరత మాతృదేశ సే
వాచరణమ్మునందసువులర్పణఁ జేసినవారి పార్థివ
శ్రీ చెలువారు చోటఁ దదస్సృగుచులన్ వికసించి, వాసనల్
వీచుచు, రాలిపోవగ వలెందదుదాత్త సమాధి మృత్తికన్"

అంటూ వెల్లడించారు.

వెంకట పార్వతీశ్వరులు 'పరమార్థనిధియైన భారతభూమి, పైసకు కొఱగాక పొడగుచుండ', 'పరమధామంబైన భారతభూమి బానిసతనములో బడి క్రుంగుచుండ' ఆర్యసంతతివారు 'కనుమూసి కాలంబు గడపుట తగునె' అని హెచ్చరించారు.

'సింధుగంగానది జలక్షీరమెపుడు గురిసి బిడ్డలం
బోషించుకొనుచున్న పచ్చి బాలెంతరాలు మా భరతమాత'

అని జాషువా జాతీయాభిమానంతో భరతమాతను కీర్తించారు.

'దేశభక్తినై తేజరిల్లుమ
దేశ సేవనే పూజ సల్పుచు
దేశమాతకై దివిటీ కావలె'

అని భారత జాతీయాభిమానంతో కవికొండలవారు మాతృదేశ సంకీర్తనం గావించారు. 'లేవరా భరతపుత్ర లేవరా' అంటూ భరతమాత విముక్తికి స్వాతంత్ర్య సమరంలో పాల్గొన మని భరత పుత్రులకు అడవిబాపిరాజుగారు పిలుపునిచ్చారు.

### ఎ) గాంధీ ప్రశస్తి :

జాతీయోద్యమానికి కేంద్రబిందువైన గాంధీజీని కీర్తించిన భావకవుల్లో బసవరాజు అప్పారావుగారు ముఖ్యులు.

'కొల్లాయి గట్టితే నేమి - మా గాంధి
కోమటై పుట్టితే నేమి'
'వెన్నపూసా మనసు, కన్నతల్లి ప్రేమ
పండంటి మోముపై బ్రహ్మ తేజమ్ము'
'చకచక నడిస్తేను జగతి కంపించేను
పలుకు పలికితేను బ్రహ్మవాక్కేను'

అని గాంధీగారి వ్యక్తిత్వాన్ని, వీరత్వాన్ని వర్ణించిన ఈ పాట ఆనాడు ఆబాలగోపాలాన్ని, పండిత పామరుల్ని రంజింపచేసిన రసగుళిక.

"జయగాంధి దేవా మంగళం జయమంగళంబు నీకు
సత్యాగ్రహాశ్రమతా పసా శాంతి స్వభావమానసా"

అని గాంధీగారిని మహాత్ముడుగానే కాక పరమాత్మగా భావించే ధోరణితో కొందరు హారతి పాటలు రచించారు.

'హిమాలయోత్తుంగ శృంగం నీ బ్రదుకు ఉమాపతీ నృత్య రంగం' అని గాంధీగారిని అడవి బాపిరాజుగారు స్తుతించారు.

### బి) ప్రచార గీతాలు

గాంధీజీని గురించి, రాట్నాన్ని గురించి, స్వరాజ్యాన్ని గురించి, భారత జాతీయోద్యమంలోని వివిధ విషయాలను గురించి భావకవులు ప్రచారస్థాయిలో గేయాలు, పద్యాలు వ్రాసినవారు పలువురున్నారు.

మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రి 'అంటరాని వారెవరో కాదు మా వెంటరానివారే' అని హరిజన సమస్యపై, స్వరాజ్య సమస్యపై గీతాలు రచించి స్వాతంత్ర్యోద్యమానికి కొత్త స్ఫూర్తి కలిగించారు.

గరిమెళ్ళ సత్యనారాయణగారు 'మాకొద్దీ తెల్లదొరతనము' అనే పాటతో సామాన్య ప్రజలలో స్వాతంత్ర్య శంఖారావం చేశారు. బసవరాజు అప్పారావుగారు.

'సిగ్గు లేదా నీకు శరములేదా
అన్నమైనా లేక బీదలల్లాడుతుంటేను
సీతాకోక చిలుకలాగ సీమగుడ్డ గట్టి తిరుగ'

అని విదేశీ వస్త్రధారులను తీవ్రంగా విరసించారు.

స్వదేశీ ఉద్యమం కారణంగా వచ్చిన ఖద్దరు ప్రచార ఉద్యమంలో రాట్నానికి ప్రాముఖ్యం వచ్చింది. రాట్నాన్ని గురించి భావ కవుల్లో ఎక్కువ గీతాలు రచించిన వారున్నారు.

'ఓ చిన్నరాటమా, ఒయ్యారిరాటమా, ఒప్పైన రాటమా వడివడివడుకు' అని కవికొండల వెంకటరావుగారు రాట్న ప్రచారాన్ని ప్రారంభించి

"మోడు మోకులు చిగుర్వోసెడి పోలిక
నీ బట్ట గట్టేరు వడివడి వడుకు
జాబిల్లి కిరణంబుః జందాన సాగెడు
నీ దారమెంతురు వడివడి వడుకు"

అని దాని ప్రాశస్త్యాన్ని కవిత్వ గంధం గుబాళించేట్లు కీర్తించారు.

దువ్వూరివారు 'తిప్పవేరాట్నమా దేశ చరితంబు, విప్పవే రాట్నమా విజయకేతనము' అని గానం చేశారు.

### 2.1.2 వస్త్రాశ్రయ రీతి :

భారత జాతీయాభిమానాన్ని వస్త్రాశ్రయ రీతిలో కూడ వెల్లడించడం భావకవుల కావ్యాల్లో కనిపిస్తుంది. దువ్వూరి రామిరెడ్డిగారి ద్రౌపది సందేశం, చామర్తి రాజశేఖరరావుగారి పాంచాలీ సాంత్వనం, కరుణశ్రీగారి ధనుర్భంగం, పెనుమర్తి వెంకటరత్నంగారి దీపావళినాడు, తుమ్మలవారి ఆదర్శ వీరుడు, రాజశేఖర శతావధాని గారి రాణాప్రతాప సింహచరిత్ర, గడియారం శేషశాస్త్రిగారి శివభారతం ఈ ధోరణిలో వచ్చిన రచనలు.

### 2.1.3 ఆంధ్రాభిమానం :

ఆంధ్రాభిమానంతో 1905-1920 మధ్య ఆంధ్రోద్యమం సాగింది. భాషా సంబంధమైన ఉద్యమాల ప్రభావంతో ఆంధ్రోద్యమం రూపుదాల్చింది. ఆంధ్రుల గతవైభవం ఈ ఉద్యమానికి ఊపిరినిచ్చింది. కృష్ణా పత్రిక, ఆంధ్రపత్రిక ఆంధ్ర రాష్ట్రోద్యమానికి ప్రచారం కలిగించాయి. 1907లో విజ్ఞాన చంద్రికామండలి స్థాపన, 1910లో గుంటూరులో ఆంధ్రయువజన సాహిత్య సంఘ సమావేశంలో జరిపిన ఆంధ్రరాష్ట్రానికి సంబంధించిన తీర్మానం, 1912లో ఢిల్లీ రాజధాని కావడంతో జరిగిన ఉత్సవాల సంరంభం, 1913లో బాపట్లలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభ - ఈ సంఘటనల సమిష్టి ప్రభావమే ఆంధ్ర రాష్ట్రోద్యమ కవిత్వంగా రూపొందింది.

రాయప్రోలు సుబ్బారావుగారు ప్రబోధించిన
'నాదుజాతి నా దేశము నాదుభాష
అను అహంకార దర్పనమందు మాంధ్ర' అన్న పంక్తులలోని అహంకార దర్పనమే ఆంధ్రోద్యమానికి మూలమైంది.

రాయప్రోలవారికి ముందే 1914లో గడ్డము కొండారెడ్డిగారు 'ఆంధ్ర మాతృస్తవము' అను శీర్షికతో ఆంధ్ర మాత ప్రాచీన వైభవాన్ని, ప్రస్తుత దుస్థితిని చిత్రించారు. 1916లో మండపాక పార్వతీశ్వర శాస్త్రిగారు 'ఆంధ్ర సంవత్సరాది'లో వసంతకాల ప్రకృతిని వర్ణించే నెపంతో ఆంధ్ర రాష్ట్ర భావనను వెల్లడించారు.

'ఆంధ్ర ప్రత్యేక రాష్ట్రానికి చాటించె
మదపికంబులు పంచమస్వనంబున'.

రాయప్రోలు సుబ్బారావుగారు ఆంధ్రుల గత వైభవాన్ని 'అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వ విద్యాలయమ్ములు స్థాపించునాడు', 'ఓరుగల్లున రాజవీర లాంఛనమ్ముగా పలుశాస్త్రి శాలలు నిలుపునాడు' అంటూ కీర్తించారు. ఆంధ్రనౌకలను, ఆంధ్రతేజస్సును, ఆంధ్ర పౌరుషాన్ని, తెనుగువాణిని, తెనుగుభూమిని కీర్తించిన రాయప్రోలువారు

'జాతిన దేశ గౌరవము చక్కనదిద్ది, మహేంద్ర మండలీ
భారము శ్లాఘనీయముగ పాలన చేసి, సమాన రాష్ట్రముల్
కూరిమినాసజేయ తెనుగుంబుడమిన్ కయిసేయరయ్య" అని ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను, ప్రస్తుతకర్తవ్యాన్ని ప్రబోధిస్తున్నారు.

## 2.1.4 ఆంధ్ర జాత్యభిమానం :

జాతి, దేశ, భాషాభిమానాలనే మూడు పాయలుగా ఆంధ్రాభిమానం ప్రవహించింది. ఈ మూడింటికి గత వైభవస్మరణం, వర్తమానస్థితిపట్ల విచారం, భవిష్యత్ కర్తవ్య ప్రబోధం ముఖ్య లక్షణాలు.

### ఏ) శౌర్య ప్రశస్తి :

విశ్వనాధవారు 'ఆంధ్ర పౌరుషము'లో

'కోటగోడల నుండి కుప్పించి సింహంబు
లోయన నరులపై నురకలేదా
కొండయడుగునుండి కొండపై వరకు నూ
గించి తేజీల దూకించ లేదా
కోటతల్పులను ఢీకొనవచ్చు కుంభి కుం
భమ్ముల గ్రుద్ది చంపంగ లేదా"

అని ఆంధ్రుల శౌర్య పరాక్రమాలను చారిత్రిక నేపథ్యంలో చిత్రించారు.

"కంచికోటల కంచుతల్పులు ఖంగు ఖంగున మ్రోగునప్పుడు
తంజనగరపు కోటగోడలు చెంగుచెంగున నెగురనప్పుడు

అని త్రిపురనేని రామస్వామిగారు ఆంధ్రుల గత వైభవ పరాక్రమాన్ని తెలిసికొమ్మని తెలుగుబిడ్డలను హెచ్చరించారు.

### బి) ఐశ్వర్య ప్రశస్తి :

ఆంధ్రులు గతంలో సాగించిన విదేశ వాణిజ్యాన్ని, నౌకావ్యాపారాన్ని, సాధించిన సిరి సంపదలను భావకవులు అత్యంతా వేశంత స్మరించారు.

'పాకాల చెరువు చెంపల పండు ధాన్యముల్
అన్యదేశాధీశులడుగునాడు" అని

రాయప్రోలువారు ఆంధ్రుల ఐశ్వర్యాన్ని స్మరించారు.

"ఈజిప్టునుండి కృష్ణాజలమ్ములకు బా
రంబాటగా పరాక్రమము జూపి
సకల దీవుల విజయ ధ్వజముల నాటి
తనదు తెరచాప వార్థి రాజానకు కట్టు
కోకగా..... ....."

అని తుమ్మల వారు ఆంధ్రుల నౌకా వ్యాపారాన్ని ప్రశంసించారు.

### సి) కళాప్రశస్తి :

శిల్ప సంగీత, కవిత్వాది లలిత కళలలో ఆంధ్రులు సాధించిన కౌశలాన్ని భావ కవులు తనివితీర కీర్తించారు.

"తలవంచలేదు విఠ్ఠల రాయదేవుడు
పటు శతాబ్దా భీల భారమునకు
నవసిపోలేదు సామువు గణేశుని బొజ్జ
బహు కాల దీర్ఘోపవాసములకు"

అని జాషువాగారు ఆంధ్ర శిల్ప ప్రశస్తి గావించారు.

ఏ రీతి మలచిరో ఈ స్తంభములయందు
ప్రోవు గమ్మిన మల్లెపూవుచాలు
ఏ లేపనంబున నీ కుడ్యములకెల్ల
దనరించినారో యుద్దాల తళుకు

అని పుట్టపర్తి నారాయణాచార్యులుగారు ఆంధ్ర శిల్పుల కళాపైపుణ్యాన్ని కీర్తించారు.

## 2.1.5 దేశాభిమానం:

భావ కవులు ఆంధ్ర దేశ భౌతిక స్వరూపాన్ని కూడ అద్భుతావేశంతో ఉల్లేఖించారు. ఈ దేశాభిమానంలో క్షేత్ర ప్రశస్తి, నదీ ప్రశస్తి, దుర్గ ప్రశస్తి అనే మూడు అంశాల ప్రస్తావన ఉంటుంది.

### ఎ) క్షేత్ర ప్రశస్తి :

కొడాలి సుబ్బారావుగారి 'హంపీ క్షేత్రము' కరుణరసార్ద్రమైన కావ్యం.
"శిలలు ద్రవించి యేడ్చినవి జీర్ణములైనవి తుంగభద్రలో
పలిగుడి గోపురంబులు, సభాస్థలులైనవి కొండముచ్చు గుం
పులకు, చరిత్రలో మునిగిపోయిన దాంధ్ర వసుంధరాధి పో
జ్జ్వల విజయ ప్రతాప రభసం బొక స్వప్నకథా విశేషమై"

అని గత వైభవాన్ని తలచుకొని కొడాలివారు ప్రస్తుత స్థితికి రోదించారు.

'శ్రీ దక్షవాటికా శృంగార దేవతా
సేవఁ గస్తూరి వాసించునాడు'

అని ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారు 'దక్షారామ' కావ్యంలో ఆంధ్రాభిమానాన్ని వ్యక్తీకరించారు.

పుట్టపర్తి వారు పెనుగొండ లక్ష్మిలో 'గగనమహలు' గత వైభవాన్ని, ప్రస్తుత దీనస్థితిని
"రాయల పాదముద్రలు దలఁదాల్చి సాం
పులు దిద్దుకొన్నట్టి కవికి మిన్న
.... ...... .....
తెనుగు ఢంకాలు మ్రోగిన దివ్యభూమి
కనుము తమ్ముడా! జీర్ణంబు గగన మహలు"

అని వర్ణించారు.

దువ్వూరివారి కొండవీడు, విశ్వనాథ వారి కొండవీటి పొగమబ్బులు దుర్గముల గతవైభవాన్ని స్మరించిన ఖండ కావ్యాలు.

### బి) నదీ ప్రశస్తి :

దేశ భౌతిక సంపదలో నదీ సంపత్తి ప్రథమ గణ్యమైనది. ఆంధ్రుల జీవితంతో పెనవేసికొన్న కృష్ణా, గోదావరి, తుంగభద్రా, పెన్నా నదులను కేంద్రంగా చేసికొని భావకవులు ఖండ కావ్యాలు రచించారు.

'ఆంధ్ర పౌరుషము'లో విశ్వనాథ వారు నాలుగు తెలుగు నదులను కేంద్రాలుగా గ్రహించి ప్రాచీన కాలంలో జరిగిన సాహిత్య శిల్పకళా విలసనాన్ని, ఆంధ్ర జాతి వైభవాన్ని ప్రశంసించారు.

గోదావరి నుద్దేశించి జాషువాగారు
"శబ్ద శాసనుని ద్రాక్షా కవిత్వమును గా
వించి యెన్నాళ్ళు లాలించినావో"

వర్ణిస్తూ నన్నయను స్మరించారు.

**2.1.6 భాషాభిమానం :**

రాయప్రోలు వారు తెనుగు మాన్యములో తెలుగు తల్లిని కీర్తిస్తూ తెలుగు భాషలో మీగడలు, వెన్నపూసలు, తేనె చుక్కలు, పూల మాధుర్యాలు ఉన్నాయని తమ భాషాభిమానాన్ని వ్యక్తం చేశారు.

"ఊరక రాష్ట్ర మూడిపడునొక్కొ మహేశ్వరినట్లు మాతృ భా
షా రమణిన్ భజించుటకు సంబరమందని చచ్చు జాతికిన్"

అని తుమ్మల వారు ఆంధ్ర భాషాసేవ చెయ్యనిదే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం రాదని హెచ్చరించారు.

## 2.2 . సంఘ సంస్కరణ కవిత్వం

భావ కవులు రచించిన సంఘ సంస్కరణ కవిత్వంపై మానవోద్యమ ప్రభావం, గాంధీజీ సర్వోదయ సిద్ధాంతాల ప్రభావం ప్రసరించిందే తప్ప కాల్పనిక కవిత్వ ప్రభావం అణుమాత్రం కూడా లేదు.

ర మమోహన రాయలు వంగదేశంలో ఎగురవేసిన మానవోద్యమ ధ్వజాన్ని తెలుగునాట వీరేశలింగం గారందుకున్నారు. రామమోహనరాయల ఉద్యమానికి బ్రహ్మ సమాజం వాహికగా ఉండేది. వీరేశలింగంగారు ఈ సంఘాన్ని ఆంధ్ర దేశంలో స్థాపించి దీని ద్వారా తమ సంస్కరణ కార్యాలు జరిపారు. వీరేశలింగం గారు నడుపుతున్న సంఘ సంస్కరణ మహోద్యమ నిర్వహణలో రఘుపతి వేంకటరత్నం నాయుడుగారు కుడిభుజమై నిలిచారు. వీరేశలింగం గారు ప్రారంభించిన బాల్య వివాహ ఖండనం, కన్యాశుల్క నిరసనం మొన్నగువానితో పాటు ఆకాలంలో వర్ణ వ్యవస్థా నిరసనం కూడ తలెత్తింది. కొంతకాలం తర్వాత సంఘ వ్యవస్థా నిరసనం ప్రారంభమైంది. దీనికి త్రిపురనేని రామస్వామి చౌదరిగారు మూలపురుషులు. ఇవన్నీ మానవోద్యమ లక్షణాలే. మానవోద్యమం రెండవ తరంలో గాంధీయ దృక్పథంగా రూపొందింది. మానవోద్యమంలోని ఈ రెండు శాఖలను దృష్టిలో పెట్టుకొని భావ కవితా కాలంలో సంఘ సంస్కరణ కవిత్వం వెలువడింది.

కొందరు భావ కవులు వితంతు విలాపాన్ని వినిపించారు. కొందరు కన్యాశుల్కాన్ని నిరసించారు. కొందరు వర్ణవిభేద పిశాచానికెదురు తిరిగారు. కొందరు గాంధీజీ నడిచిన బాటలో కాల్మోపి హరిజన సమస్యను కావ్య వస్తువుగా చేసికొన్నారు. ఇంక కొందరీ బాటలోనే విశ్వమానవ ప్రేమను పతాకగా స్వీకరించి ప్రస్థానించారు.

**2.2.1. దురాచార నిరసనం :**

వీరేశలింగంగారి సంస్కరణ వజ్రఘాతంతో అతి బాల్య వివాహ పద్ధతి చూర్ణమై పోయింది. బాల్య వివాహాలు సన్నగిల్లాయి కాని పూర్తిగా పోలేదు. బాల్య వివాహాల వల్ల వితంతువుల సమస్య బయలుదేరింది. 'శుల్కము'న కాసపడి తల్లి దండ్రులు వృద్ధులకు తమ కూతుళ్ళ నంటగట్టటంతో ఇది మరింత విషమించింది.

మంగిపూడి వెంకటశర్మగారు వితంతువుల దుర్దశను 'బాలవితంతు విలాపము' అను కావ్యంలో చిత్రించారు. ఇందులో కవి బాల్య వివాహాలను నిరసించిన తీరు గమనించుదాం.

'పొత్తిళ్ళలో నున్న నెత్తురు కందుల
పెండ్లిండ్లు సేయ భావించు నొకడు

పురుడు పోవక మున్నె బొట్టెల నమ్మంగ
　　　　బేరపారములు గావించు వాకడు
కన్నులు తెఱవని కసుగాయలను గట్టి
　　　　పెట్టి వృద్ధులను సేవించు వాకడు
పాలైన విడువని పసికూనలను గూర్చ
　　　　వెసరాయబారి రావించు వాకడు'

ఈ కావ్యంలో శర్మగారు వృద్ధ వివాహాలను నిశితంగా విమర్శించారు. వనితలకు వైధవ్యం వల్ల ప్రాయంలోనే వచ్చిపడే దురవస్థను హృదయ విదారకంగా చిత్రించారు.

గురజాడ వారి పూర్ణమ్మ, రాయప్రోలువారి స్నేహలత ఈ 'శుల్కము'నకు నిరసనగా వ్రాయబడిన కావ్యాలే.

వనితలను వంటయింటి కుందేళ్ళ వలె అణగద్రొక్కే పద్ధతిని ఆనాటి కవి తీవ్రంగా ఖండించాడు.

'బాలుర కెట్టులో బాలల కట్టులే
　　　　యున్నత విద్యల నొసగుడయ్యా
యువకుల కెట్టులో యువతుల కట్టులే
　　　　స్వేచ్ఛా ప్రదానంబు సేయరయ్యా'

అని మంగిపూడి వెంకట శర్మగారు 'అబలా విలాపము'లో దేశీయులను ప్రబోధించారు.

ఏకేశ్వరారాధనను, విగ్రహారాధనా నిరసనం బ్రహ్మ సమాజం ప్రచారం చేసిన ధ్యేయాల్లో ముఖ్యమైనవి. తెలుగునాట ఈ ఆశయాలను ప్రచారం చేయటానికి 'బ్రహ్మ సమాజ ప్రార్థనా మందిరాలు' ముఖ్య పట్టణాల్లో నెలకొల్పబడ్డాయి. కందుకూరివారు, వెంకటరత్నం నాయుడుగారు దీనికి మూలస్తంభాలు. వీరి సిద్ధాంతాలకు లోనైన కవులు విగ్రహారాధన లోతులని పద్యగేయ రూపంలో నిరసించారు. భావ కవి దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు:

"శిథిలాలయమ్ములో శివుడు లేడోయి
ప్రాంగణమ్మున గంట పలుకు లేదోయి
దివ్య శంఖము గొంతు తెరువ లేదోయి
పూజారి గుడి నుండి పోవ లేదోయి
విచ్చిన విరులు పూలు చైత్ర మాసపు పూలు
ఊరూర ఇంటింట ఊరకే పూచాయి
శిథిలాలయమ్ములో శిల కెదురుగా కుమకు
పూజారి కొకటైన పూవు లేదోయి'

అను గేయంలో భక్తి భావముప్పొంగేచోట పరమాత్ముడున్నాడని, అతడు ఆలయంలోనే బందీగా ఉండడని, విగ్రహారాధనాతత్వాన్ని వ్యంగ్యంగా ఎత్తిపొడిచారు.

2.2.2. వర్ణవ్యవస్థా నిరసనం:

మానవోద్యమం కుల, మత, వర్ణ వ్యత్యాసాల నెదిరించింది. తెలుగునాట బ్రహ్మ సమాజం ఈ తత్వాన్నే ప్రచారం చేసింది. బ్రహ్మ సమాజ ప్రభావంతో కంఠమెత్తిన కవి వర్ణ విద్వేష శృంఖలాలను తెగద్రెంచుడని ఉద్బోధించాడు.

'గుణములేని వాని దేకులమైతే నేమి
తక్కువైతే నేమి శ్రీచరణమంటునేని

ఏ కౌటిల్యము వీని నేర్పరిచిందో కాని
చీకటి గదులున్నే జగదీశ్వరాలయములోనే"

అని పరమేశ్వర సన్నిధానంలో వర్ణ ప్రసక్తి లేదని కృష్ణశాస్త్రిగారు స్పష్టపరిచారు.

గుణాన్ని బట్టి కాక కులాన్ని బట్టి మానవుల హెచ్చుతగ్గులను నిర్ణయించే వ్యవస్థను భావకవి నిరసించాడు. కడజాతి వానికి సంఘం చూపిన నిర్దాక్షిణ్యానికి ఎదురు తిరిగి కావ్యరూపాన సవాలు చేశాడు. గగన గంగ కూడ కడజాతివాని తలమీద పులిమిన పంకాన్ని కడిగి కరుణించలేక పోయిందని ఆక్రోశించాడు. ఈ విధమైన ఆక్రందనలకు జాషువాగారి 'గబ్బిలము'న అక్షర రూపం సిద్ధించింది. 'భరతోర్వరకుం గడగొట్టు బిడ్డ'డైన అరుంధతీ సుతుడు తన దుస్థితిని కైలాసపతికి విన్నవించవలసిందని గబ్బిలంతో తెలిపిన సందేశమిది. దీనిలో కవి ఆనాడు బిగిసికొనిపోయిన వర్ణ వ్యవస్థలోని కుళ్ళును వెలిచిమ్ముటకై ప్రయత్నించాడు. 'సనాతన ధర్మ ధేనువుల్ పిదికిన పాలు పేదకు (అంటరాని వానికి) లభింప'వని, అతని 'గాలిసోకగా 'నాల్గు పడగేల హైందవ నాగరాజు' 'కసరి బుసకొట్టునని', 'ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు వ్యయింత్రు గాని దుఃఖిత మతులై'న వారి పాత్రలలో భరతమేదిని మెతుకు విదల్పదని నిశితమైన వ్యంగ్యంతో వర్ణ వ్యవస్థవలని దుస్థితిని జాషువాగారు ఎత్తిచూపారు.

### 2.2.3. సంఘ వ్యవస్థా నిరసనం :

జాషువా గారు కేవలం వర్ణ వ్యవస్థ వలన సంఘంలో జరుగుచున్న అన్యాయాలనే విమర్శించారు. ఒక్క వర్ణ వ్యవస్థ మాత్రమే కాదు. సంఘంలోని సమస్త వ్యవస్థ కుళ్ళిపోయిందని హుంకరించి తెలుగునాట విప్లవ శంఖం పూరించారు. త్రిపురనేని రామస్వామి చౌదరిగారు సంఘంలో అధికారముద్ర దాల్చిన పురాణాలు, ధర్మశాస్త్రాలు, ఇతిహాసాలు అగ్రజాతులవారు తమ స్వార్థం కొరకు కల్పించుకొన్న కట్టు కధలని, వారందించిన పురాణాల నల్లమందుతో మిగిలిన జాతులు మౌఢ్యంలో మైకంలో మునిగిపోయాయని, సంఘ వ్యవస్థను ఆమూలాగ్రంగా మార్చితే తప్ప కడమ జాతులకు విముక్తి లేదని చౌదరిగారి సిద్ధాంతం. శంబుక వధ, ప్రహ్లాద చరిత్ర మొదలైన మత ఆర్యులు ద్రావిడులకు వ్యతిరేకంగా చేసిన పన్నాగాలను ఎత్తిచూపి పాఠకులను దిగ్భ్రాంతులనొనర్చారు. భగవద్గీతలోని 'చాతుర్వర్ణ్యం మయా సృష్టమ్' అనే సూత్రానికి వ్యతిరేకంగా ఇంకొక భగవద్గీతను బ్రహ్మనాయని కృష్ణునిగా చేసి రచించారు. ఈ సిద్ధాంతాలన్నింటిని వారు 'సూతపురాణం' అనే పేరుతో వెలయించారు.

### 2.2.4. గాంధీయ దృక్పథం :

గాంధీజీ మానవోద్యమాన్ని వ్యక్తి స్వాతంత్ర్య పరిధినుండి సమిష్టి మానవ శ్రేయఃపథంలో ప్రవేశపెట్టిన మహనీయుడు. మతం, వివాహం మొదలైన సమస్యలకన్న ముందుగా సంఘంలోని ఆర్థిక దుస్థితిని, భావ దారిద్ర్యాన్ని తొలగించాలని ప్రతిపాదించాడు. కర్మయోగానికి ప్రాధాన్యమిచ్చాడు. మానవుని మనస్సును జయించటానికి కత్తి కన్న కారుణ్యమే ప్రబలమైందని నిరూపించాడు. జాతి అభ్యుదయానికి గ్రామ వికాసం అత్యవసరమని ప్రబోధించాడు. సత్యం, ధర్మం, ప్రేమ అనే విశాల సూత్రాల ద్వారా తన దృక్పథాన్ని దేశీయుల కందించాడు.

గాంధీజీ సిద్ధాంతాల ప్రభావం భావకవులలో కొందరిపై విశేషంగా ప్రసరించింది. వారిలో తుమ్మల సీతారామమూర్తిగారు అగ్రేసరులు వారి 'ధర్మజ్యోతి' ధర్మవీరానికి, 'ఆత్మార్పణము' ఆత్మార్పణ తత్వానికి మచ్చుతునకలు. 'ధర్మజ్యోతి' తుమ్మలవారి తండ్రిగారు తన ముంగిటికి వచ్చివాలిన బంగారు ముద్దలను 'నాకెందు'కని త్రోసిపుచ్చిన ఉదంతాన్ని చిత్రించిన కావ్యం. 'ఆత్మార్పణము'లో కపోతం తన భార్యనే పొట్ట బెట్టుకొన్న కఱకు టెఱకువాని కడుపు మంట చల్లార్చటానికి కనికరించి ఆత్మార్పణం చేయగా ఆ ఎఱుకవానిలో కలిగిన మనఃపరివర్తన చిత్రింపబడింది. ఈ రెండు కావ్యాలు గాంధీగారి బోధనల ప్రభావముద్ర గలవే. గాంధీగారి ప్రభావానికి సంపూర్ణంగాలోనై తుమ్మలవారు గాంధీజీ 'ఆత్మకథ' నే మహా కావ్యంగా రచించారు.

గాంధీయ దృక్పథంలో విశ్వమానవ ప్రేమను, జీవకారుణ్యాన్ని ధ్వనింపజేసిన కావ్యం పింగళి కాటూరి కవుల "సౌందరనందము' బుదుడు నందునికి బోధించిన ధర్మసారం ఈ సర్గంలో పొందగబడింది.

"కొడుకులు లేని వారలకుఁ గూరిమి బిడ్డవు; మాతృహీనులౌ
బుడుతల కెల్లఁ దల్లివయి పోషణ సేయుదువు, 'నా'యనంగ లే
కడలెడు దీనులన్ మనుపు, మార్తుల కాదరునై భజింపు, మీ
పుడమి దివమ్ము సల్పుమిదెపో, పరమార్థము బౌద్ధజాతికిన్'

గాంధీజీ సాగించిన అస్పృశ్యతా నివారణోద్యమం ప్రభావంతో వెంకట పార్వతీశ్వర కవులు 'పంచమాభినందనము'లో

"మమత దప్పిన యాతడు మాలగాక
మాట దప్పిన యాతడు మాలగాక
అన్నెమునుఁ బున్నెమెఱుగని యట్టి మాల
మాలయే? దేవుమెడఁ బూలమాలగాక"

అని అస్పృశ్యతా నివారణకై గళమెత్తారు.

హరిజన దేవాలయ ప్రవేశ విషయమై కాటూరి వెంకటేశ్వరరావు రచించిన 'గుడి గంటలు'లో హరిజనులతో కవిపొందిన తాదాత్మ్యం గోచరిస్తుంది.

## 2.3 స్మృతి కావ్యాలు

పాశ్చాత్యుల ఆత్మాశ్రయ కవిత్వంలో స్మృతిగీతం (Elegy) ప్రధానమైంది. ఎలిజీకి తెలుగులో శోకగీతం, శోక కావ్యం అనే పర్యాయ పదాలు వాడబడ్డాయి. ఆప్తులైన వారి మరణాన్ని గూర్చి స్మృతిరూపకంగా వ్రాసిన గేయాలు కాని, కావ్యాలు గాని ఎలిజీ అని పించుకుంటాయి.

భావ కవిత్వంలో మొట్టమొదటి స్మృతి కావ్యం రచించిన వారు రాయప్రోలు సుబ్బారావుగారే. గోపాలకృష్ణ గోఖలే నిర్యాణవార్త వినగానే వీరు చక్కని స్మృతికావ్యం రచించారు. తర్వాత బసవరాజు, విశ్వనాథ, నాయని మొదలైనవారు రసభరితాలైన గీతాలు, కావ్యాలు వెలయించారు.

### 2.3.1. దేశ నాయక స్మృతి :

రాజకీయ సాంఘిక కళాది రంగాల్లో ప్రసిద్ధులైన వారిని గురించి వ్రాసిన స్మృతి కావ్యాలు ఈ వర్గంలో చేరతాయి. రవీంద్రుని అస్తమయానికి భాష్ప స్తంభిత కంఠులై రాయప్రోలు వారు రచించిన 'రవీంద్రుని అస్తమయము'లో ప్రకృతి సమస్తం నిస్తబ్దమై పోయినట్లు వర్ణింపబడింది. కిన్నెరలు శ్రుతులాపి నిదురించాయని, రంగు గోపెలలోని వన్నెల చిన్నెలు మాసిపోయాయని, 'కావ్య కలకంఠీ 'కంఠరాగము' గాద్గద్యం వహించిందని కవి కరుణావేశంతో పలికినాడు.

గురజాడ అప్పారావుగారి నిర్యాణానంతరం దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు వ్రాసిన గేయం చక్కని స్మృతికావ్యమే.
అప్పారావుగారి 'గీత శీకరములు'

'యుగ యుగంబులనుండి మ్రోగెడు
విశ్వగాన వియత్తరంగిణి
భంగముల నుప్పొంగు' నని కవి ఊహించినాడు.
'ఆంధ్రరత్న' దుగ్గిరాల గోపాల కృష్ణయ్యగారి మృతికి బసవరాజు అప్పారావుగారు
'ఏల పాడేవింక యమునా కళ్యాణినే
లీలా మానవుడు గోపాలుడు లేడాయె' అని దుఃఖావిలురయ్యారు

కాశీనాధుని వారు శివైక్యం చెందగానే ఆంధ్ర కవులెందరో స్మృతిగీతలు రచించారు. వానిలో తుమ్మల వారు వ్రాసిన 'విశ్వదాత' పేర్కొనదగిన స్మృతిగీతం. దీనిలో కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారు 'మాతృదాస్య పాశచేద కౌశల్యముమ గన్న కర్మయోగి'గా, 'బలికర్ణమాంధాతల విస్మృతికిందెచ్చు విశ్వదాత'గా, 'చదువులమ్మకు సేవ సలుపు బంటుగా' కీర్తింపబడ్డారు.

గాంధీజీ నిర్యాణానంతరం వెలువడిన ఖండ కావ్యాల్లో జాషువాగారి 'బాపూజీ' కావ్యం ఎన్నదగింది. 'మగ్గిన పండు', 'క్షమాప్రవాసి' యైన మహాత్ముడు తుపాకి గుండ్లకు బలియై పోయిన విషయాన్ని తలచుకొని కవి 'ఇదియే పోవడమా! జగజ్జనక! రానేరావుగా' అని ఆక్రోశించారు. 'భారతజ్యోతి గప్పున నారిపోయిన'దని, 'జగమొక్కుమ్మడి ఙొమ్ము గ్రుద్దుకొని మూర్ఛన్ దేలి తబ్బిబ్బు చెందిన'దని, 'ఖదరు రాటాల ఝుంకార రవళి'తో పాటు 'గండు పేదల నోటి కబళరాపి'కూడ ఆగిపోయినట్లేయని కరుణ రసాత్మకంగా చిత్రించారు జాషువా.

### 2.3.2. పతీ స్మృతి :

భావకవుల్లో సత్ స్మృతిలో కావ్యాలు వ్రాసిన వారిలో విశ్వనాథవారు, దువ్వూరివారు, వెంకట పార్వతీశ్వరులలో ఒకరైన బాలాంత్రపు వెంకటరావుగారు ప్రథమ గణ్యులు.

విశ్వనాధవారు వారి సతీమణి వరలక్ష్మి పరమపదించగా 'వరలక్ష్మీ త్రిశతి' అను పేర మూడువందల పద్యాలు రచించారు. వారే స్వయంగా 'వరలక్ష్మీత్రిశతి' వియోగ కావ్యమని పేర్కొన్నారు. ఈ కావ్యం కర్మశతకం, స్మృతి శతకం, నిత్య శతకం అని మూడు భాగాలుగా రచింపబడింది. కావ్య ప్రారంభంలో వ్రాసిన

'ఓ సభా! ప్రియభార్యా వియోగ మెఱుఁగ
నట్టియో పూర్వ సత్కృతీ! యకట! నీవు
కర్మ శతకంబు చదువకు మర్మహాతి
నీ వెఱుగలేవు దానిలోని దగు-----'

అనే పద్యంలో కవి కర్మ శతకంలోని మర్మచ్ఛేదకమైన దుఃఖ తీవ్రత ధ్వనింపచేశాడు. స్మృతి శతకంలో విభిన్న మానసిక దశలలో కవి మనసులో పొడచూపిన సతీ స్మృతి కణాలు చిత్రింపబడ్డాయి. నిత్య శతకంలో దుఃఖ నిత్యత, కర్మనిత్యత నిరూపింపబడ్డాయి. నిత్య శతకంలో దుఃఖ నిత్యత, కర్మ నిత్యత నిరూపింపబడ్డాయి.

ఈ కావ్యంలో వరలక్ష్మి స్వభావ చిత్రణాన్ని బట్టి ఆమె పతిశీలత్వమాత్మదఘ్నంగా ఉన్న సాధ్వియని స్పష్టమవుతుంది. ఆమె

'తవ ప్రేమలోతు చిక్కని దృగంతచ్ఛటా
  శ్రీఁగాని నోటితో జెప్పలేదు
తన దుఃఖ భారమెల్లను నిశ్చలాపాంగ
  ములఁగాని వాల్కతో బలుకలేదు'.

ఆమె 'కనులందె యెల్ల బ్రదుకు బ్రదికి', 'కనులందే ప్రాణముల్ వదిలిపెట్టి'న యోగిని వెలగల చీరలేదని, సొమ్ములు లేవని, పతి దుఃఖపడినప్పుడామె, 'శాశ్వతమా ధనంబు? మీరలు కల' రదే చాలునన్న 'మైథిలీశిల! ఆమె ప్రేమోరూపము దాల్చి వచ్చిన గౌరీదేవి'వలె పతి భావనలో నిల్చినది. విపరీతమైన మనో వికారముగల పతిని సమ్యక్ప్రీలునిగా చేసినది. 'వట్టి నీరసబుద్ధి' యైన అతనిని 'రసోత్తపథముల సత్కవీశ్వరుని' చేసినది. అట్టి 'ప్రాణాధిక'తోడ పోవుటెరుగక రక్షోమతితో బ్రతికియున్న తన మంద భాగ్యమునకు కవి ఎంతగానో కుంగి పోయాడు. మైథిలీ శిలయైన తన సతిలేని కాయం దహన యోగ్యమైన కట్టెగా భావించాడు. కృష్ణలో ఆమె అస్థులను కలుపుచున్నప్పుడు.

'అంతె పేరున కంతె భార్యాస్థిగాని
నా శరీరాస్థి నిజము కృష్ణార్పణమ్ము'

అని పొగిలి పోయాడు.

సతీస్మృతిలో వెలయించిన ఇంకొక చక్కని కావ్యం దువ్వూరి రామిరెడ్డిగారి 'భగ్న హృదయము'. ఈ కావ్య ప్రారంభంలోని ప్రకృతి వర్ణనలో కవి విషాద ఛాయలు ప్రవేశపెట్టాడు.

'జలధర మాలికా మలిన శయ్యను మిత్రుడు గూలె, నేడ్పులా
ర్పులఁ బులుగుల్ కులాయముల పొంతల కేగక కొమ్మలెక్కిము
క్కులఁ దడి లేక యూర్పు; వడగూరిన పోలికఁబూల తీగలుం
దలలను వాంచు; గాలి వెడతాకున మూల్గు సహానుభూతితోన్'

పూర్వము కవికి కనువిందువై తనరిన మోహన వస్తువులన్నీ 'భాష్పముల్ దొనక'గా నీరవభాషలో అతనినోదార్చినట్లు వర్ణింపబడి, ప్రకృతికి కవికి ఉన్న అనుబంధం చిత్రితమైంది. కవిగారి సతీమణి 'యౌవనంపు బంగరు చషకంబులో నురుగు గ్రమ్మెడి'యాసవమింతని' ఇరువదిమైదవ యేటనే కాలదుర్గతి వలన అస్తమించింది. ఆమె అకాల మృతివలన కలిగిన చిత్త భ్రమణంతో కవి

"హృదయమును దొంగిలించిన రీతిగానె
స్మృతిని సైతంబు నీవు హరింపు మతివ"

అని విలపించాడు. పొలం నుండి రాగానే వాకిలివద్ద నిల్చి స్వాగతమిచ్చే అర్ధాంగి నిర్యాణంతో తన యిల్లు మఠంగా మారిందని, తన 'యౌవన నందనం' నుసిగావింప బడిందని తీవ్ర బాధను వ్యక్తపరిచాడు. చివరకు కర్మఫలం దైవాధికారమని, సుఖదుఃఖాలను సమదృష్టితో స్వీకరించుటే ప్రాణి కర్తవ్యమని నిశ్చయించుకొని 'దాని చితిపైన నిర్మింతుఁ దాజమహలు' అన్నంత ఆశాజీవియైనాడు.

బాలాంత్రపు వెంకటరావుగారు తమ సతీ.నిర్యాణంతో వ్రాసిన 'విరహ సంగీతము' అను స్మృతిగీతం ఈ సందర్భంలో పేర్కొనదగింది. ఆమె మరణంతో 'విశ్వమును వెలయించు వెన్నెలపాట', 'కోరికల్ చిగురించు కోకిలపాట' కడలేని పాటలో కలసిపోయాయని వీరు భావించారు. ఆమె ఒక పతగి అని, ఆమె 'బంగారు తెక్కలనీడ'లో నాడు తానొక గేస్తునను కున్నానని, ఇప్పుడామె జ్ఞాపకంరాగా 'కనులఁగడగు చుంటి కడవెడు నీళ్ళతో'నని కరుణావిలంగా తమ అనుతాపాన్ని ప్రకటించారు.

### 2.2.3. సుతాదిక స్మృతి :

దువ్వూరి వారు 'శిశువియోగము' అనే ఖండికలో తమ బిడ్డ పసికందుగా ఉన్నప్పుడే కనుమూసినందుకు దుఃఖించారు. అప్పటికే భార్యా వియోగంతో విలపిస్తూ ఉండగా శిశువియోగం 'గోరుచుట్టు మీద రోకటిపో'టైనది. ఈ దుఃఖాధిక్యంతో

'పూవు రాలిన జటుపిందె పూవవైన
నంటుకొని యుండువన్న పేరాస నుంటి
మృత్యు నిశ్వాస పవనంబు రేగి సుడిసి
భావి ఫలమును గసుగందుఁ బైకి విసిరె'

అని వాపోయారు.

సుతా స్మృతిలో రచింపబడిన గేయాలలో బసవరాజు అప్పారావుగారి 'నిర్యాణ సుఖము' పేర్కొనదగింది. 'మంగళ ప్రద' కవిగారి కూతురుపేరు. ఆ చిట్టి తల్లి మరణించడంతో వారికి 'కత్తి పెట్టి పొడిచిన'ట్లుయింది. 'కోయిలొకసారి కూసిపోయినట్లు, 'పండొకటి చేతిలో బడిజారిపోయినట్లు పాపాయి మరణంతో కవి బాధపడ్డాడు. 'చలిపిడుగు' గర్జించగా సుతావియోగ దుఃఖితుడైన కవి ఈ విధంగా చెప్పుకొన్నాడు.

బంగారు బొమ్మ నాదు మంగళ ప్రదమ్మయొంటి
రుద్రభూమి కటికనేల నిద్రించెడు నొడలు మరచి'

అందువలన 'చలిపిడుగా గర్జింపకు'మని బ్రతిమాలుకున్నాడు. తన చిట్టి తల్లి మినుకు మినుకున మెరయు చుక్కలలో ఒక్కటిగా మారినదేమో అని పలవించినాడు.

ఇంతలో దీపావళి వచ్చింది. అందరికి వచ్చిన దీపావళికాక తనకు 'దివ్య దీపావళి' వచ్చింది. వేదాద్రినాథుడే కవి ఇంటిలో వెలసి ఉయ్యాల తొట్టెలో ఊగాడు. పుత్రోదయంతో కవికి సుతావియోగ వ్రణం కొంత తగ్గిపోయింది. 'వేదాద్రి శిఖరాల వెలిగేటి జ్యోతి, నాపూరి గుడిసెలో దీపమై' ఉందని కవి ఆనందలోకపుటంచులను చుంబించాడు. ఇంతలో కొన్నాళ్ళకే, మానిపోని గుండె గాయంమీద గొడ్డలి దెబ్బ పడినట్లైంది. 'వేదాద్రి శిఖరాన వెలిగున్న జ్యోతి మినుకుమని కాసేపు కునికి పోయింది.'

'కాపుర మొచ్చిన కన్ని పాపాయి
ఇల్లు కాళీజేసి వెళ్ళిపోయాడు.'

అని కవి తీవ్రమైన దుఃఖోద్వేగంతో కుమిలిపోయాడు. ఈ చరణాలలో కవి తన బ్రతుకెట్లు శూన్యమై పోయిందో సూచించాడు. చిన్న మాటలలో మిన్ను మన్నులనేకం చేసే భావాన్ని వెలిబుచ్చాడు. కృష్ణశాస్త్రిగారన్నట్లుగా బ్రతుకును బ్రద్దలు చేసికొని నెత్తురు జీర అంటుకొని వెలికి వచ్చిన ఈ గేయభాగం 'ప్రపంచ కావ్య భాండాగారాల్లో గొప్ప పంక్తుల్లో ఇదొకటి.'

**2.3.4 ఆప్త స్మృతి :**

మాతా పితరులు, సోదరీ సోదరులు మొదలైనవారి స్మృత్యర్థం వెలువడిన కావ్యాలు, గీతాలు ఈ శ్రేణిలోకి వస్తాయి.

వీనిలో మాతృ స్మృతిలో వెలువబడిన రచనలు ఎక్కువగా ఉన్నా నాయని సుబ్బారావుగారి 'మాతృ గీతాలు' ఈ ధోరణిలో రచింపబడిన కావ్యాల్లో శిఖరాయమాణమైనవి. జననియైన ఉదయమ్మ అస్తమయంతో కవి ఉద్విగ్నుడై

'ఎవ్వడా క్రూర కర్మరుడెవడు! నీల
జలద నిర్ముక్త శైశిర శర్వరే ప్ర
శాంత మలవాటు పడిన నిశాంతమందు
అకట నట్టింటి దీపమ్ము నార్పినాడు'

అని దుర్విధిని దూషించాడు. 'పోయినది పార్వతీ దేవి పూల రథము కదలినది మారినది వల్లకాడు పూలవనముగా నేటి' కన్న జనుల మాటలను స్మరించుకొని బాష్పతర్పణం చేశాడు. ఆమె వైకుంఠ పదవి నధిష్ఠించిందని, ఆమె స్పర్శచేత వైతరణిలో 'అమర శైవాలినీ సహస్రములు' పుట్టాయని, ఆమె పుణ్యావతీత్వాన్ని స్మరించుకున్నాడు. తల్లి మరణం తర్వాత సర్వకాల సర్వావస్థలలో ఆమె స్మృతినే అనుభవించాడు. వినాయక చవితి రాగా తన తల్లిచేతి ఉండ్రాళ్ళు కుడుములిక లేవని విలపించాడు. ఉగాదికి బ్రాహ్మణుడు పంచిన వేపపూతపచ్చడి మాతృ వియోగం వలన కాలకూటపు ముద్దవలె భావించాడు. శివరాత్రి రాగా నిరుడు శివరాత్రికి తన్ను వెంటబెట్టుకొని ఏటిలో స్నానం చేసిన అమ్మ 'నేడు భవజటాకల్లో లినీతరంగ శీకర స్నాన మొనరించు చున్న'దని సంభావించాడు. సముద్ర తీరానికేగినా, స్నానానికి బావికేగినా తల్లికి సంబంధించిన స్మృతులే పెల్లగిలివచ్చాయి. 'తల్లి యొడ్డును ముద్దుగొను' బావిలోని అలలు 'అమ్మయేదిరా' అని కవిని ప్రశ్నించాయట. ఈ విధంగా సర్వ కాలాల్లో, సమస్త ప్రదేశాల్లో కవిమాతృమూర్తి స్మృతులే వెలయించుకొన్నాడు.

పెనుమర్తి వెంకటరత్నంగారు మాతృ స్మృతికై వ్రాసిన కావ్యం ఈ సందర్భంలో పేర్కొనదగింది. ఈ కావ్యంలో అశ్రుపూజ, శోకగీతి, శ్రావణాశ్రువులు మున్నగు ఖండికలున్నాయి. మాతృ మరణంతో తన బ్రతుకున 'దివాంధ గీతము' మ్రోగుచున్నదని, విలయాంధ తమస్సులు చుట్టుముట్టాయని, తన 'మధు ప్రవాహములు స్వప్నములై' చెదరి పోయాయని కవిదుఃఖించినాడు.

'జన్మ జన్మాల నాటి వాత్సల్య లతలు
విరియ బూచిన పూవులు పరువు మాసె
ఐహిక ఋణాను బంధము లస్తమించి
అమృతధారలె కాలకూటాగ్నులుమిసె'

అని విధి వైపరీత్యానికి విలపించినాడు. నాయనివారివలెనే ఈ కవికి గూడ శ్రావణమాసం వచ్చినా, వినాయక చవితి, ఉగాది మొదలైన పండుగలు వచ్చినా మాతృ స్మృతియే ఆవహించి కనులను చెమ్మగిల జేసింది. మాతృస్మృతిలో ఖండ కావ్యాలు రచించిన వారిలో కొడాలి సుబ్బారావు కూడ గణనీయులు.

మోటూరి వెంకటరావుగారు పితృ మరణానికి, సోదరీ మరణానికి పొగిలిపోయి 'ఆహుతి' అన్న గేయం రచించారు. తనకు కలిగిన ఆశయభంగాన్ని

'గాలి మేడలు హిమనగమ్ముల
గట్టుకొని నా బ్రతుకు నేటికి
గాజు పెంకులు వోలె ముక్కలు
గాగఁ జితికినది'

అను చరణాలలో ఈ కవి చిత్రించుకున్నాడు. మోటూరివారే రచించిన 'ఓ చెల్లి' అను ఖండ కృతి సోదరీ స్మృతి కెత్తిన కర్పూర కళిక. అన్యోన్య స్నేహంతో పెరిగిన కవిగారి సోదరి పెండ్లియైన పిమ్మట ఒక సంవత్సరానికే పాపాయిని ప్రసవించి కన్నుమూసింది. ఈ దారుణ సంఘటనతో కవిని తమస్సు లావరించాయి. సోదరీ స్మృతిలో ఇతడు వెలిబుచ్చిన భావతీవ్రతకు ఈ క్రింది పద్యం చక్కని నిదర్శనం.

'ఇపుడొక రక్తవీచి పెకలించిన నా కనులిట్లె బొత్తలై
రెపరెపలాడి శూన్య నిబిరీస నిశాంధ తమస్సు జీవితాం
తపుఁదుది ప్రాణ వాయువులఁ దాకిన దాక శిలాద్రవంపు పుటూ
రుపునయి 'చెల్లెలా' యనెడు రోదన మొక్కటె నింతురోదసిన్'
దువ్వూరి వారి 'సోదరీ స్మృతి' అన్నది కూడ ఈ శ్రేణిలో రసవత్తర రచనయే
'చెల్లెలా! నీవు స్వర్గమ్ముఁ జేరికొన్న
వత్సరంబులుఁ గడచియుఁ బ్రకృతి యందు
నీదు చిహ్నంబు లెల్లెడ నింపినావె'

అని కవి ప్రకృతి అంతటా సోదరీ మూర్తి ఛాయలనే సందర్శించాడు. మొయిలు విడిన శశిరేఖను చూచి పొత్తి గుడ్డలు తొలగింపగా కనిపించు సోదరీ ముఖాన్ని స్మరించినాడు. 'సందె వేళల పలుచని జలదములను పూతపూచెడి చెంగావి పూల సొరునవ్వు నెడ' చెల్లెలి చెక్కులలో నటించు కాంతి మంజిమము తలచుకొన్నాడు.

అబ్బూరి రామకృష్ణారావుగారు కవి కొండల సాంబశివరావుగారి మృతికి వగచి 'సోదర స్మృతి' అను ఖండ కావ్యాన్ని రచించారు. ఈ పద్యాలలో వీరు సాంబశివరావుగారి భక్తి భావాన్ని, స్నేహశీలాన్ని, శాంత వృత్తిని స్మరించారు.

"నీ మధుర తేజోరూప సీమఁ దలచి
నీవు మొదలు పెట్టిన యక్షరావళులనుఁ
గూర్చి యల్లెద మింక మా నేర్చినట్లు
మానవ ప్రేమ పూర్ణ నిర్వాణ గీతి"

అనే పద్యంలో అతని జీవితమే తమకు సందేశంగా పరిణమించిందని ఆశాభావం వెల్లడించారు.

ఈ విధంగా ఆరు శాఖలుగా విలసిల్లి వస్తు భావరచనల్లో నవ్య ప్రయోగం గావించి మూడు దశాబ్దాలు ప్రతిభా మహితంగా విరాజిల్లిన భావ కవిత్వం ఆంధ్ర కవితా రంగంలో అప్రతిహితమైన ప్రభావాన్ని చూపి అభ్యుదయ కవిత్వానికి బాటలు తీసి నిశ్శబ్దంగా నిష్క్రమించింది.

**సమీక్ష :**

దేశభక్తి కవితా శాఖలోని జాతీయాభిమాన సంబంధమైన, ఆంధ్రాభిమాన సంబంధమైన ఖండ కావ్యాలను గురించి, సంఘ సంస్కరణ కవిత్వంలోని వర్ణ వ్యవస్థా నిరసనను, గాంధీయ దృక్పథాన్ని వెల్లడించే కావ్యాలను గురించి, దేశనాయకుల, ఆప్తుల వియోగ దశలో ఆవిర్భవించిన స్మృతి కావ్యాల గురించి ఈ పాఠంలో తెలుసుకున్నారు.

**ప్రశ్నలు :**

1. దేశభక్తి కవిత్వాన్ని వివరించండి.
2. భావ కవులు ప్రకృతిని విశ్లేషించిన తీరు వ్యక్తీకరించండి.
3. సంఘ సంస్కరణ కవిత్వంలోని అంశాలను సోదాహరణంగా వివరించండి.
4. భావ కవుల రచనల్లోని స్మృతి కావ్యాలను పరిశీలించండి.

**ఆధార గ్రంథాలు :**

ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయములు-ప్రయోగములు - డా॥ సి. నారాయణరెడ్డి
తెలుగు కవితా వికాసం - కడియాల రామమోహనరాయ్

**డా॥ జి. వై. ప్రభావతీ దేవి**

పాఠం - 3

# అభ్యుదయ కవిత్వం - నిర్వచనం - లక్షణాలు

**పాఠ్య నిర్మాణ క్రమం**

3.1 అభ్యుదయ కవిత్వం - నిర్వచనం లక్షణములు

3.2 అభ్యుదయ కవిత్వం - ఆవిర్భావం పరిణామదశలు

3.3 అభ్యుదయ కవిత్వం - ప్రయోగదశ ప్రగతి దృక్పథం

3.4 ఛందస్సు మీద తిరుగుబాటు; వచన కవిత్వం

3.5 అభ్యదయ సాహిత్యోద్యమం ఒక చారిత్రకమైన అవసరం

3.6 ఆంధ్రదేశంలో కమ్యూనిస్టు పార్టీ అవతరణ : అభ్యుదయ సాహిత్యోద్యమానికి తోడ్పాటు

3.7 అభ్యుదయ రచయితల సంఘం వీరేశలింగం - గిడుగు- గురజాడల అభ్యుదయ దృక్పథం

3.8 అభ్యుదయ రచయితల సంఘం - చిలకమర్తి

3.9 అరసం కార్యకలాపాలు

**లక్ష్యం :**

ఆధునిక కవిత్వం గురజాడ నుంచి భావకవిత్వం స్థితిని దాటి అభ్యుదయ రూపాన్ని పొందటం; అభ్యుదయ కవిత్వ స్వరూప స్వభావాలు, ప్రయోగదశ, ప్రగతి మార్గం, సామాజిక స్పృహ, సంఘ ప్రగతికి, మానవాభ్యుదయానికి మార్గాలమా సామాజిక దురాచారాలకు పరిష్కారాన్ని చూపిన అభ్యుదయ కవిత్వం, ప్రజలకు చేరువగా కవిత్వం; ప్రజా నాట్యమండలి ప్రజా కళారూపాల ద్వారా అభ్యుదయ భావ ప్రచారం వంటి అంశాలను తెలియపరచటం ఈ పాఠం లక్ష్యం.

**3.1 అభ్యదయ కవిత్వం; నిర్వచనం, లక్షణములు :**

"అభ్యుదయ రచన సమకాలికమైన జీవిత పరిస్థితులను రాజకీయ వాతావరణానికి, ఆర్థిక సమస్యలకు, సమాజ సంఘర్షణలకు నైతిక సందర్భాలకు ఐహిక ఆ ముష్మిక సిద్ధాంతాలకు వైజ్ఞానిక విశేషాల కనుగుణ్యంగా అనుకూలంగా తగినట్టి, అవసరమైనట్టి మార్పులతో చిలపిల్లవలెను" అని పి.వి. రాజమన్నారు అభ్యుదయ సాహిత్య స్వరూపాన్ని వివరించారు (1947-మార్చి - అభ్యుదయ).

అభ్యుదయ సాహిత్య స్వరూపాన్ని మరింత స్పష్టంగా దేవులపల్లి కృష్ణ శాస్త్రి "పీడింపబడే వాళ్ళు, పీడించేవాళ్ళు వున్న యీ వర్గ సమాజం ఉండాలని ఎవరూ కోరరు. రానున్న విధానంతో సాధారణ మానవుడే మకుటధారి. పురోగమిస్తున్న లోకాన్ని ప్రతిఘటించేవారు ఎప్పుడూ అభ్యుదయ వాదులు కాజాలరు. ఈ ధనిక సమాజం పోవాలనుకోవడమే అభ్యుదయం. ఇది మనస్సులో పెట్టుకొని వ్రాసేది అభ్యుదయ రచన" అని చెప్పారు. (తృతీయ అభ్యుదయ రచయితల మహాసభ- అధ్యక్షోపన్యాసము - 1946).

కవిత్వంలో అభ్యుదయమంటే ఏమిటో వివరిస్తూ శ్రీశ్రీ "అభ్యుదయ రచయితలు తెచ్చిన విప్లవం రసావిష్కరణకు రసాస్వాదనకు సంబంధించినది. సాహిత్యం ఒక భోగ వస్తువుగా పరిగణించే దృక్పథం మీద వీరు తిరగబడుతున్నారు. నేటి రచయితకు ప్రజలే ప్రమాణము. కొన్ని కారణాలవల్ల సాహిత్యానికి దూరమైపోయిన ప్రజల జీవితాలను మళ్ళీ సారస్వతోన్ముఖంగా తీర్చటానికి నేటి రచయితలు పాటు పడుతున్నారు" అన్నారు.

ఎ) సమ సమాజ నిర్మాణం అభ్యుదయ కవుల ప్రధాన లక్ష్యం

బి) సమాజంలో పీడించేవారు పీడింపబడేవారు అని రెండు వర్గాలు ఉండకూడదు. పీడన ఏ రూపంలోనూ ఉండకూడదు.

సి) కష్ట జీవులకు తమ కష్టానికి తగిన ప్రతిఫలం లభించాలి.

డి) కులమత భేదాలు అంతరించి పోవాలి మనుష్యులందరూ సమానులేనని తలంచాలి.

ఇ) స్త్రీలకు గౌరవ స్థానం ఉండాలి. పురుషులతో సమానంగా ఆస్తి హక్కు మొదలైన హక్కులన్నీ ఉండాలి.

ఎఫ్) దైవ భావనను విడనాడి మనిషిమనిషిని ప్రేమించే మానవతా భావం ప్రజలలో వ్యాపించాలి.

### 3.2 అభ్యుదయ కవిత్వం; ఆవిర్భావం, పరిణామ దశలు :

కవిత్వం ఆనందాన్నివ్వటంతో పాటు విశ్వ శ్రేయాన్ని కలిగించాలని ఆదిమండి కవులు, కావ్య శాస్త్ర వేత్తలూ భావిస్తూ వచ్చారు. "అభ్యుదయ పరంపరాభివృద్ధిగానా యొనర్పంబూనిన ప్రబంధంబునకు కథా క్రమం బెట్టిదనిన అని ప్రారంభించిన కావ్యాల్లో ఉన్న అభ్యుదయం ప్రజల మేలుకోరినది కాదు. కొందరు కవులు రాజుల విలాసాలతో పాటు వ్యసనాలను కీర్తించే స్థాయికి దిగజారారు. "రాయవేశ్యా భుజంగా" అని కృతి భర్తను సంబోధించేవారంటే కవుల పతన స్థితిని ఊహించుకోవచ్చు. ప్రబంధ కవిత్వం సామాన్య జనులకు దూరంగా వుండి పోయింది. ద్విపద కావ్యాలు పదకవిత్వం, శతకాలు, యక్షగానాలు ప్రజల సాహిత్య పిపాసను కొంత వరకు తీర్చాయి. ప్రజా కవి వేమన పద్యాలు అభ్యుదయ భావాలతో ప్రజలను అలరించాయి.

వీరేశలింగంగారితో ప్రారంభమైన నవ్య యుగంలో సంఘంలో మూఢ విశ్వాసాలను దురాచారాలను రూపుమాపే కవిత్వం వెలువడింది. వీరేశలింగం గురజాడవారి కావ్యాల్లో సామాజిక శ్రేయస్సే ప్రధాన లక్ష్యం.

ఉన్నవ లక్ష్మీనారాక్ష్మీనారాయణగారి 'మాలపల్లి' నవలలో తక్కెళ్ళ జగ్గని ధర్మబోధ బంకించంద్రుని వందేమాతరమ్ గీతం వలె ఉత్తేజకరమైనది. ఉన్నవ వారు 'కమ్యూనిస్టు మేనిఫెస్టోను అనుసరించి పని వాండ్లందరు యేకమైతిరా! ప్రపంచము మీది" అని వ్రాశారు. "రైతు కూలీల గురించి ఆలోచించేవారు, పీడిత జనుల పక్షాన నిలువదలచుకున్నవారు మాలపల్లిని తమ మేనిఫెస్టోగా ఎంచుకున్నారు."

1930 తర్వాత ప్రపంచ మంతటా ఆర్థిక మాంద్యం అలముకొన్నది. మధ్య తరగతి, పేద ప్రజల జీవితం దుర్భరం కావొచ్చింది.

ప్రపంచ దేశాల్లో పరిస్థితులు వడి వడిగా ఆందోళనా భరితంగా మారిపోతున్నాయి. జర్మనీలో ఫాసిజం నెలకొన్నది. ఫ్రాన్సులో ఇంచుమించు అదే పరిస్థితి. దిగజారి పోతున్న పరిస్థితుల పట్ల మేధావులు ఆందోళనతో నిస్పృహ చెందుతున్నారు. దేశ దేశాల కళారంగాల్లో అలజడి అవ్యవస్థ ప్రతి బింబించాయి. కొత్త కొత్త ఉద్యమాలు వేళ్ళుదన్ని నీటి మొక్కల్లాగ అందంగా తామర తంపరగా తేలి ఆకర్షిస్తున్నాయి. మొదటి ప్రపంచ యుద్ధానంతరం విలువలు తారుమారై యూరప్ దేశాల్లో నూతన ఉద్యమాలు ప్రారంభమైనాయి. ఫ్రాన్సులో క్యూబిజమ్, జర్మనీలో ఎక్స్‌ప్రెషనిజమ్, ఇటలీలో ఫ్యూచరిజమ్, అమెరికాలో ఇమేజిజమ్ బయలు దేరాయి. ఫ్రాన్సులో బయలుదేరిన డాడాయిజమ్, సకల విలువల్ని ధ్వంసం చెయ్యటమే పనిగా పెట్టుకొన్నది. దీనిలో నుంచి "సుతీక్ష తేజస్సుతో బయలుదేరిన మహోద్యమం సర్రియలిజయం, చిత్రకళలో శిల్పంలో ఫోటోగ్రఫీలో బయలుదేరిన యీ కొత్త ఉద్యమాలు కవితారంగంలో శక్తి మంతంగా ముందుకుసాగాయి.

లండన్‌లో భారతీయ రచయితలు, మేధావులు మార్క్సిజాన్ని అధ్యయనం చేయసాగారు. ఇండియన్ ప్రోగ్రెసీవ్ రైటర్స్ అసోసియేషన్ స్థాపించారు. పారిస్‌లో అంతర్జాతీయ అభ్యుదయ కేంద్రం నెలకొంది.

1935లో భారత అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది. 1936 ఏప్రిల్‌లో లక్నోలో ప్రేమ చంద్ అధ్యక్షతన ప్రథమ మహా సభ జరిగింది. ఈ సంఘంలో సజ్జాద్ జహీర్, ముల్కరాజ్ ఆనంద్, కైఫీ ఆజ్మీ, కె.ఏ. అబ్బాస్ మొదలైన ప్రసిద్ధ రచయితలు యీ సంఘంలో సభ్యులు.

ప్రజలు ఆకలి బాధతో అలమటించిపోతున్నప్పుడు ఆంధ్రలో భావ కవులు ఊహా ప్రేయసి కోసం ప్రణయ గీతాలు ఆలపించటం యువకవులకు ఘోరంగా తోచింది. భారతదేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజుల త్యాగమయ

జీవితాలు కొత్త తీరానికి కావ్య వస్తువులైనాయి. శ్రీ రంగం నారాయణబాబుగారి కపాల మోక్షం; భగత్ సింగ్ శాపం; నయాగరా కవుల 'భగత్సింగ్' 'అల్లూరి సీతారామరాజు గీతాలు ఆనాటి కవుల మనస్థితిని వెల్లడిస్తాయి.

ఆంధ్ర దేశంలో జమిందారులు, భూ స్వాములు పేద రైతులను కూలీలను పీడించటాన్ని సహించలేక జమిందారీ వ్యతిరేకోద్యమం వచ్చింది. ఆ కాలంలో రైతు కూలీలను ప్రబోధించే కవితలు విరివిగా వచ్చాయి.

"శ్రీశ్రీ గారి మహా ప్రస్థాన గేయం 12-4-34లో వెలువడింది. ఆచార్య గోగినేని రంగనాయకులు గారి సంపాదకత్వంలో "రైతు భజనావళి" (22-4-34)లో వెలువడింది. రాగిదమ్మిడి రత్నమాయెను' అనే శీర్షికతో విద్వాన్ విశ్వం గారు రైతు దైన్యాన్ని చిత్రిస్తూ "వెలలు బొత్తిగ కూలిపోయెను/ కాసు యొక్కటే కానరాదుగ / రాగి దమ్మిడి రత్నమాయెను" అని ఆనాటి ఆర్థిక మాంద్యాన్ని కళ్ళకు కట్టించారు. శ్రీ తుమ్మల సీతారామమూర్తి "ధరలు పడియె, సేద్యంబు తక్కువాయె శిస్తు మెండాయే" అని రైతు దుస్థితికి ఆవేదన వెలిబుచ్చారు. రైతుకు పాలేరును మించిన ఆత్మ బంధువు లేడని శ్రీతుమ్మల హెచ్చరించారు. శెట్టి పల్లి వెంకటరత్నంగిరి రాజు రామారావుగార్ల "ఆగునా జీవాళుం/సాగునా లోకాలు", కుసుమ ధర్మన్నగారి హరిజన శతకము' నెల్లూరి వేంకట రామానాయుడి గారి (మా కొద్దీ జమీందార్ల పొందు) మొదలైనవి రైతు భజనావళిలో చోటు చేసుకున్నాయి. 1935లో గద్దె లింగయ్యగారి సంపాదకత్వాన వెలువడిన పక్షపత్రిక ప్రభలో వాసిరెడ్డి నాగేశ్వరరావు అనే రైల్వే కార్మికుడు రాసిన కూలోడ' పెంద్యాల లోకనాధంగారి కూలీలందరు ఏకమైతిరా కూటికి తరుగేమిరా?"; బాలాంత్రపు నళినీకాంతరావు అనువదించిన "ఆకలిమంటచే మలమలలాడే అనాధలందరు లేవండోయ్" ప్రచురింపబడి విశేషాదరం పొందాయి." మా కొద్దీ తెల్లదొరతనం"; "అన్యాయ కాలంబు దాపురించిందిపుడు" గేయాలు ఈ కాలంలోనే. సంప్రదాయంపై దాడి, హేతువాద దృష్టి యీ కాలపు కవిత్వంలో కనపడసాగాయి. త్రిపురనేనివారి సూత పురాణము, ఖూనీ, శంబుక వధ హేతువాద దృష్టిని పెంపొందించాయి. శ్రీనార్ల "సర్వవ్యాపకుడయ్యే సర్వేశుడు టే / కొందరు కోట్లతో కులుకగనేల? ఎందరో కూటికి కుందగనేలా?" అనే పాట మతంపై తిరుగుబాటు ప్రకటించింది. పింగళి నాగేంద్రరావు, పురిపండా అప్పల స్వామి గారల కవితలు కూడా మతంపై గుళ్ళో బందీ అయినదైవంపై ధ్వజమెత్తాయి' '(అభ్యుదయ కవిత్వం - తుమ్మల వెంకట రామయ్య - ఆంధ్రప్రదేశ్ దర్శిని)

శ్రీ తెన్నేటి సూరి 'కీలు గుఱ్ఱం'లో

"కీలు గుఱ్ఱము మీద / బాలీసునానుకొని / ప్రాణాలు లేనట్టి భగవంతుడొచ్చాడు.

ఊరంత ఊరేగుతూ / ఉత్సవము సాగించుతూ / కూలి మాటడగండిరా-అన్నాలు/చాలవని చెప్పండిరా"

గేయం మానవత్వపు విలువల్ని ఎలుగెత్తి చాటించింది. భావ కవుల కవితా సామగ్రి ఆకలి ఆ తరం యువకులకు నచ్చలేదు. శ్రీ పఠాభి పాత విలువల్ని ధ్వంసం చేస్తూ ఫిడేలు రాగాల డజన్ (1939) ప్రచురించారు. కొత్త దనాన్ని ఆహ్వానిస్తూ శ్రీశ్రీ యీ కావ్యానికి 'ఇంట్రో' రాశారు. ఈ నేపథ్యంలో 1943లో ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది. శ్రీతాపీధర్మారావు అధ్యక్షతన తెనాలిలో ప్రథమ మహా సభ జరుపుకున్నది.

"అభ్యుదయ రచయితల సంఘం రాజకీయ సంఘం కాదు. కాని రాజకీయాలను స్పృశించటమే మహాపరాధంగా భావించదు" అని తన ప్రణాళికలో 'అరసం' తన వైఖరిని స్పష్టం చేసింది.

అభ్యుదయ కవిత్వం రెండు దశాబ్దాల పాటు (1935-1955) తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసింది.

## 3.3 అభ్యుదయ కవిత్వం : ప్రయోగదశ, ప్రగతి దృక్పథం

అభ్యుదయ రచయితల సంఘమైతే 1943లో ఏర్పడిందిగాని శ్రీశ్రీ సుప్తాస్థికలు (1929) రచించిన నాటి నుండి అభ్యుదయ కవిత్వం ప్రారంభమైంది. తొలి దశలో ఛందస్సుపైన కవులు తిరుగుబాటు ప్రకటించారు. భావ కవిత్వాన్ని నిరసించారు. కొత్త దనం కోసం అఱ్ఱులు చాచారు. నిషిద్ధమని పూర్వ కవులు కావ్య వస్తువులుగా స్వీకరించని అంశాలను తీసుకున్నారు. ప్రమాద ప్రాంతాలలో సంచరించారు. కొత్త దనం కోసం అనేక ప్రయోగాలు చేశారు. క్లుప్తంగా దీన్ని 'ప్రయోగదశ' అని చెప్పవచ్చు.

తొలి తరం అభ్యుదయ కవులలో శిష్టా ఉమా మహేశ, శ్రీశ్రీ, నారాయణ బాబు, ముద్దు కృష్ణ, బల సూత్రం, పాల గుమ్మి పద్మరాజు, పఠాభి, దేశిరాజు కృష్ణ శర్మ, పురిపండా అప్పల స్వామి ప్రముఖులు.

మరో ప్రపంచం, దేశ చరిత్రలు, ప్రతిజ్ఞ, మహా ప్రస్థానం మొదలైన గీతాలు రచించి శ్రీశ్రీ యీ కొత్త తిరుగుబాటు కవిత్వాన్ని ప్రగతి మార్గానికి మళ్ళించారు. బాధా సర్ప దష్టులు, దగాపడిన తమ్ములు కవిత్వంతో ప్రముఖులయ్యారు. కష్ట జీవికి కుడి ఎడమ నిలబడే వాడే కవి అనే భావం కవులలో వ్యాపించింది. కవిత్వంలో సామాన్యుడు మాన్యుడైనట్లు భాష సామాన్యులకు దగ్గరగా వచ్చింది.

## 3.4 చందస్సుమీద తిరుగుబాటు : వచన కవిత్వం

ఛందస్సు అంటే పద్య లక్షణ శాస్త్రం. నన్నయకు పూర్వం లభించిన శాసనాల్లో తరువోజ మధ్యాక్కర, సీసం, ఉత్పలమాల పద్యాలున్నాయి. వీటిలో యతి ప్రాసల నియమాలను పాటించటం జరిగింది. కవిత్వంతో ఛందస్సుకు విడదీయరాని సంబంధమేమీ లేక పోయినా కవులు ఛందస్సును విధిగా పాటించారు. పదకవులు వచనాలు రచించినవారు ప్రజలకు బోధపడే రీతిలో సులభశైలిలో రాసినా ఛందస్సును పూర్తిగా త్రోసిరాజనలేదు.

ఇంగ్లీషు సాహిత్య ప్రభావంతో 1920 తర్వాత తెలుగు సాహిత్యంలో ఛందస్సు మీద విముఖత్వం ఏర్పడింది. మొట్ట మొదట వచన కవిత్వం (Verse-litirature) రాసినవారెవరో తేల్చి చెప్పటం కష్టం. కవి కొండల వెంకటరావు, అడవి బాపిరాజు, పురిపండా అప్పల స్వామి. ముద్దుకృష్ణ, శిష్ట్లా, శ్రీశ్రీ, నారాయణ బాబు తొలితరం వచన కవులు.

శ్రీశ్రీ 'కవితా! ఓ కవితా! గీతంలో "నా విన్నవి కన్నవి విన్నవించగా / మాటలకై వెదుకాడగబోతే - అవి / పుంఖాను పుంఖంగా / శ్మశానం వంటి నిఘంటువుల దాటి / వ్యాకరణాల సంకెళ్ళు విడిచి / ఛందస్సుల సర్ప పరిష్వంగం వదిలి - వడిగా వడివడిగా / వెలువడినై, పరుగిడినై, నాయెదనడుగిడినై" అన్నారు. ఛందస్సుల సర్పపరిష్వంగాన్ని వదిలించుకొని శ్రీశ్రీ పలికిన వచన కవిత్వం యువతరానికి ఆదర్శంగా తోచింది. అభ్యుదయ కవులు వచన కవిత్వాన్ని తమ ప్రధాన కవితా వాహికగా చేసుకున్నారు.

## 3.5 అభ్యుదయ సాహిత్యోద్యమం ఒక చారిత్రకమైన అవసరం :

అభ్యుదయ రచయితల సంఘ సభ్యులచే సృష్టింపబడిన దొక్కటే అభ్యుదయ సాహిత్యమని, అంతకు ముందు నాటి రచనలను అభ్యుదయ సాహిత్యముకాదని అనుకోకూడదు.

శ్రీ కె.వి. రమణారెడ్డిగారన్నట్లు "నింగినీలిమ నుండి పిడుగువలె ఏ సాహిత్యోద్యమమూ కూడ విరుచుకొని పడదు. ఆ విధంగా హఠాత్తుగా అవతరించిన ప్రతీదీ అంతే హఠాత్తుగా అంతరిస్తుంది. (అభ్యుదయ కవిత్వము సవిమర్శక సమీక్ష 'అభ్యుదయ').

అభ్యుదయ సాహిత్యానికి సీమా భేదాలు లేవు. అంతర్జాతీయత జాతీయతకు విరుద్ధమైనది కాదు బ్రతుకులో ప్రముఖ స్థానమాక్రమిస్తున్న రాజకీయాల నుండి రచయిత విడిపోడు. రాజకీయాలూ సాహిత్యమూ పరస్పర బాహ్యాలు కావు.

అభ్యుదయ సాహితీపరుల దృష్టి సమగ్రమైనది. మనసు వికచమైనది. స్వప్రయోజన పరులు దేశాలమధ్య, జీవిత ఖండాల మధ్య కల్పించిన అరమరలు అభ్యుదయ సాహిత్యం గుర్తించదు.

అంతర్జాతీయంగా, జాతీయంగా, సాంస్కృతికంగా రాజకీయంగా యిరవయ్యో శతాబ్ద మధ్య భాగంలో మానవ జీవితంలో ఏర్పడిన చరిత్రాత్మక పరిణామాల కనుగుణంగా వేరువేరు దేశాలలో, రాష్ట్రాలలో దాదాపు ఒకే శుభ సమయాన అభ్యుదయ సాహిత్యమొక సంఘటితోద్యమంగా జన్మించింది.

తెలుగు సీమలో గత శతాబ్దపు చివరి కాలంలో గిడుగు - గురజాడ - వీరేశలింగం ప్రారంభించిన భాషా సాహిత్య సంఘ సంస్కరణోద్యమాలు ఇరవైయవ శతాబ్ది రెండవ దశాబ్దంలో మొదలై విజృంభించిన జాతీయ సమవాదోద్యమాల ఫలితంగా అభ్యుదయోద్యమం ప్రారంభమైంది. ఇది ఆనాటి సామాజిక చారిత్రక అవసరం.

## 3.6. ఆంధ్ర దేశంలో కమ్యూనిస్టు పార్టీ అవతరణ : అభ్యుదయ సాహిత్యోద్యమానికి తోడ్పాటు :

పెట్టుబడిదారీ ప్రపంచాన్ని మొత్తంగా అతలాకుతలం చేసిన ప్రపంచ ఆర్థిక మాంద్యం 1930 తర్వాత ఒక దశాబ్ద కాలంపైగ దేశాన్ని పులినాకి విడిచింది. పేదరికం వ్యాపించింది. నిరుద్యోగం పెరిగింది. చిన్న చిన్న ఆస్తులు కరిగి పోయాయి. ఋణ భారం పెరిగింది రైతుల పరిస్థితి దుర్భరమైంది. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించక అల్లాడి పొయ్యారు. ఉప్పు సత్యాగ్రహం ఆశించి ఫలితాన్ని ఇవ్వక పోవటంతో గాంధీజీ అహింసా సిద్ధాంతంపై యువతరానికి విశ్వాసం సడలిపోసాగింది. యువ జాతీయవాదులూ టెర్రరిస్టులు సోషలిజం ఆకర్షణకు గురి అయ్యారు. కాంగ్రెసులోని అభ్యుదయకర శక్తులతోనూ ఇతర పార్టీలతోనూ సామ్రాజ్య వాద వ్యతిరేక విశా జాతీయ ఐక్య సంఘటన ఏర్పరచవలసిందిగా కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ కోరింది. ఆంధ్రదేశంలోకి కమ్యూనిస్టు ఉద్యమం ప్రవేశించింది ధనికరైతు కుటుంబాల యువకులు, పెట్టీ బూర్జువా వర్గానికి చెందిన కొత్త తరం కమ్యూనిస్టు పార్టీకి నాయకులయ్యారు.

రైతు రక్షణ సమితి, కూలీ రక్షణ సమితి, యువజన సమితులు కమ్యూనిస్టు పార్టీకి అనుబంధ శాఖలుగా పనిచేయసాగాయి అప్పటికి ఆంధ్ర దేశంలో పెద్దగా పరిశ్రమలు వ్యాపించలేదు. చిన్నా పెద్దా పట్నాల్లో ప్రింటింగ్ ప్రెస్‌లు, కొన్ని చోట్ల జూట్ మిల్లులూ అప్పటి ఉన్నాయి. వాటిల్లో కార్మిక సంఘాలను ఏర్పరచి, కార్మికుల హక్కులకోసం సమ్మె చేయించటం హర్తాళ్ జరిపించటమూ కమ్యూనిస్టు పార్టీ సాధించిన విజయం, వ్యవసాయ కూలీలకు కూలిరేట్లు పెంచటంలో పారిశ్రామిక కార్మికులకు జీతాలు పెంచటంలో పని గంటలను క్రమ బద్ధీకరించటంలో కమ్యూనిస్టు పార్టీ జరిపిన పోరాటాలు కొన్ని విజయాలు సాధించింది.

ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ 1935లో కాకినాడలో మొదటి మహాసభ జరుపుకున్నది. 1938లో రెండవ సభ 1943లో మూడవ మహాసభ బెజవాడలో జరిగాయి. శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య మొదలైన కమ్యూనిస్టు నాయకులు అభ్యుదయ రచయితలు అనుసరించ దగిన కొన్ని అంశాలను సూచించారు.

## 3.7. అభ్యుదయ రచయితల సంఘం : వీరేశలింగం; గిడుగు; గురజాడల అభ్యుదయ దృక్పథం :

అభ్యుదయ రచయిత విధిగా కమ్యూనిస్టు పార్టీ సభ్యుడో, సానుభూతి పరుడో కావాలని అభ్యుదయ రచయితల సంఘం ఎప్పుడూ చెప్పలేదు. కాని దరిదాపు అభ్యుదయ రచయితల సంఘంలో కవులు. రచయితలు అందరూ కమ్యూనిస్టు పార్టీ అభిమానులే.

వీరేశలింగం, గిడుగు రామమూర్తి, గురజాడ అప్పారావు గారలు ముగ్గురూ మార్క్సిజాన్ని అభిమానించినవారు కారు. కాని వీరి రచనల్లోని అభ్యుదయ దృక్పథాన్ని 'అరసం' గుర్తించి గౌరవించింది.

వీరేశలింగం పంతులు గారు తమ కాలంలో ప్రారంభించిన సంఘ సంస్కరణ ఉద్యమాలు - వితంతు వివాహాలు; బాల్య వివాహాలు మాన్పించటం : స్త్రీ విద్యను ప్రోత్సహించటం : భూత ప్రేత పిశాచాలు అన్నీ అబద్ధమేనటం, మొదలైనవి అభ్యుదయ రచయితలకు సమాజాన్ని ముందుకు నడిపించే చర్యలుగా తోచాయి. ప్రబంధకవితను అవహేళన చేస్తూ ఆయన రాసిన అభాగ్యో పాఖ్యానం; కవిత్వంలో కవులకు నియమాలనుండి స్వేచ్ఛను కోరుతూ రాసిన 'సరస్వతీనారద విలాపం' అభ్యుదయవాదులకు బాగా నచ్చాయి. వీరేశలింగంగారిని ఆధునికాంధ్రయుగ పురుషునిగా అభ్యుదయ రచయితలు సంభావించారు. వీరేశలింగంగారి జయంతి వర్థంతి సభలు నిర్వహించసాగారు. ఆయన రచనలకు ప్రజలలో విరివిగా ప్రచారం కల్పించారు.

గిడుగు వెంకటరామమూర్తి గారి వ్యావహారిక భాషోద్యమం అభ్యుదయ రచయితలకు బాగా నచ్చింది. ఆధునిక భావాల ప్రచారం వాడుక భాషలోనే సాధ్యమని వీరు నమ్మారు. గ్రాంథికాంధ్ర భాషా నియమాలను ఫ్యూడల్ భావ జాలంగా వీరు నిరసించారు. సమాజాభివృద్ధికి అవసరమైన విజ్ఞాన శాస్త్రాలు తెలుగు భాషలో వుండాలని, ప్రజలు ప్రతి దినమూ మాట్లాడుకొనేవాడుక భాషలోనే విజ్ఞాన శాస్త్రాలు వుండాలని అభ్యుదయ వాదులు కోరారు.

గిడుగు రామమూర్తిగారి శిష్యులైన తాపీ ధర్మారావు మొదట గ్రాంథికవాది. గ్రాంథికాంధ్రంలో చాలా రచనలు కూడా చేశారు. కాని అభ్యుదయ రచయితల ఆలోచనలను అర్థం చేసుకొని ఆమోదించటమేగాక, వాడుక భాషను ఉద్యమ స్థాయిలో ప్రచారం చేశారు. ఎలాగరాస్తే

4)

బాగా తెలుస్తుందో అదే కావాలి" అని తాపీ ధర్మారావు అభ్యుదయ రచయితల వైఖరిని స్పష్టం చేశారు. తెలుగు పద్యాలలో వచనంలో సుదీర్ఘమైన సంస్కృత సమాసాలను ప్రయోగించటాన్ని ధర్మారావు వ్యతిరేకించారు. వాక్యంలో అర్థం స్ఫురించటాన్ని బట్టి బండిరాలు అరసున్నల అవసరం ఉండదని ఆయన వాదన. చిన్నయ సూరి వ్యాకరణం "ఇంతకు ముందు వ్రాతగాళ్ళు వ్రాసిన తెలుగు భాషది కావచ్చును. కాని ఇప్పటి భాషది కాదు. గతించిన తెలుగుది. ఆ వ్యాకరణం పనికిరాదు" అని ఆయన తెగేసి చెప్పారు. (క్రొత్త పాళీ-పేజీ 55). తన భావాన్ని స్పష్టం చెయ్యటానికి ఆయన 'సూరిమరణం లేక బండిరా పల్లకీ' నాటిక రాశారు. ఈ నాటిక సాహిత్య లోకంలో పెద్ద సంచలనం కలిగించింది. ఇందులో చిన్నయ సూరి శవాన్ని బండిరా పల్లకీ ఎక్కించి శ్మశానానికి చేర్చటం, దహనం చేయటం భాషాభిమానులు కొందరికి నచ్చలేదు. తరువాత కాలంలో నిష్పాక్షికంగా పరిశీలించినవారికి ధర్మా రావుగారి వాదన 'అతివాదన' అనిపించింది.

ధర్మారావుగారి దృష్టిలో కవి ప్రజలలో, ప్రజలతో, ప్రజల కోసం బ్రతకాలి, తెలుగు కవి తెలుగు ప్రజల జీవితంలో ఉండి వ్రాయాలి (కొత్త పాళీ).

'జనవాణి' 'కాగడా' పత్రికలలో ధర్మారావు వాడుక భాషకు ప్రాధాన్య మిచ్చి ధర్మారావు గిడుగు వారి ఆశయ సాధనకు మార్గం సుగమనం చేశారు.

గిడుగు వారి ఆలోచనలకు అక్షర రూపమిచ్చిన మొదటి మహనీయుడు గురజాడ అప్పారావు. ఆయన పూర్తి వాడుక భాషలో 1885 ప్రాంతంలో రచించిన కన్యాశుల్కం నాటకం 1892లో ప్రదర్శితమైంది. 1896లో ప్రచురితమైంది. గురజాడ తన మరణ (1915) పర్యంతమూ గిడుగు వారి వ్యవహారిక భాషోద్యమానికి బాసటగా నిలిచారు.

గురజాడ చాలా శ్రమపడి కళింగదేశ చరిత్ర రచనకు కావలసిన విషయ సేకరణ చేశారు. కొమర్రాజు వేంకట లక్ష్మణరావుగారి సంపాదకత్వంలో నడుస్తున్న 'విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి' కళింగ దేశ చరిత్రను ప్రచురించటానికి సంసిద్ధతను తెల్పింది. కాని రచన తప్పకుండా వ్యాకరణ యుక్తమైన భాషలో వుండాలని నియమం పెట్టింది. "నాది ప్రజల ఉద్యమం దాన్ని ఎవర్ని సంతోషపెట్టడానికి వదులుకొను" అని ఖండితంగా పలికి గురజాడ కళింగ దేశ చరిత్ర రచనను మానుకొన్నారు.

1910లో గురజాడ తెలుగు కవిత్వంలో, కథానికా రచనలో కొత్తదనాన్ని ప్రవేశపెట్టారు. రెండింటిలోనూ వాడుక భాషను ఉపయోగించారు. 1915లో గురజాడ వారు మరణించే నాటికి ఆయన కవితలు, కథానికలు పుస్తక రూపంలో రాలేదు. అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడిన తర్వాత గురజాడ గొప్పతనాన్ని అభ్యుదయ రచయితలు సరిగా గుర్తించారు. అభ్యుదయ రచయితల సభలు సమావేశాలలో గురజాడ దేశ భక్తి గీతాలాపన, పూర్ణమ్మ కథ' గానం చేసి ఆయన రచనలను సామాన్య ప్రజలకు పరిచయం చేశారు.

గురజాడ కవితలను 'ముత్యాల సరాలు' సంపుటిగా అందించి, కథానికలకు 'ఆణిముత్యాలు' అని పేరు పెట్టి వాటికి విశేష ప్రచారం కల్పించారు. అభ్యుదయ కవి శ్రీశ్రీ ముత్యాల సరాల గూర్చి ఒక పరిశోధనా వ్యాసం రచించి, గురజాడ గొప్పదనాన్ని తెలిపే 'మన గురజాడ' (వ్యాస సంపుటి) రచించి ఆయనలోని అభ్యుదయ భావాలను విశ్లేషించి చూపారు.

అభ్యుదయ రచయితలు గురజాడవారి సృజనాత్మక రచనలను వెలుగులోకి తేవటమే గాక ఆయన లేఖలను, డైరీలను, వ్యాసాలను, అసంపూర్ణంగా వున్న రచనలను (బిల్హణీయం, కొండు భట్టీయం సౌదామని మొ.వి) చేయదలచుకున్న రచనల కోసం రాసుకున్న నోట్సును ప్రచురించి తెలుగు జాతికి భాషకు మహోపకారం చేశారు.

మద్రాసు విశ్వవిద్యాలయం వారు విద్యార్థుల పాఠ్య పుస్తకాలు విధిగా గ్రాంథికాంధ్రంలో వుండాలని విద్యార్థులు పరీక్షలలో రాసే జవాబులు కూడ తప్పనిసరిగా గ్రాంథికంలోనే వుండాలని తీర్మానం చేసినప్పుడు గురజాడ విశ్వవిద్యాలయానికి తన డిసెంట్ నోట్ సమర్పించారు. దీన్ని అభ్యుదయ వాదులు 'అసమ్మతి పత్రం' పేరుతో తెనిగించి ప్రచురించి వాడుక భాష వ్యాప్తిలోకి రావటానికి గురజాడ ఎంత శ్రమ పడినదీ లోకానికి రుజువు చేశారు. శ్రీ సెట్టి ఈశ్వరరావు, కొడవటిగంటి కుటుంబరావు కె.వి. రమణారెడ్డి, ఆవసరాల సూర్యారావు మొదలైన అభ్యుదయ రచయితలు గురజాడవారి గూర్చి వ్యాసాలు, పుస్తకాలు రచించి ఆయన ఆలోచనల విశిష్టతను వివరించటానికి మిక్కిలి తోడ్పడ్డారు.

### 3.8. అభ్యుదయ రచయితల సంఘం; చిలకమర్తి :

వీరేశలింగం గారి సంఘ సంస్కరణను కొనసాగించటంలో శ్రీ చిలకమర్తి లక్ష్మీ నరసింహం చేసిన సేవ గొప్పది. వీరేశలింగంగారు ప్రారంభించిన నవల, ప్రహసనం, వ్యాసం, జీవిత చరిత్ర, స్వీయ చరిత్ర ప్రక్రియలను పరిపుష్టం చేయటంలో చిలకమర్తి మిక్కిలి శ్రమించారు.

బ్రిటీష్ వారు తమ పన్నుల విధానంతో భారత ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నారని తెలియజెప్పిన మొట్టమొదటి తెలుగు కవి ఆయన. నిమ్న జాతుల బాలబాలికల కోసం ఆంధ్ర దేశంలో మొట్ట మొదటి పాఠశాలను స్థాపించిన మహనీయుడాయన.

చిలకమర్తి వారిలోని అభ్యుదయ భావాలను గౌరవించి, వారిని స్వీయ చరిత్ర రచించవలసినదిగా కోరి దాన్ని ప్రచురించి అభ్యుదయ రచయితల సంఘం సమాజానికి మహోపకారం చేసింది.

### 3.9 అరసం కార్య కలాపాలు :

తెలంగాణా పోరాట కాలంలో కమ్యూనిస్టు పార్టీ వైఖరిని, పోరాట పంథాను ప్రభుత్వం అడ్డుకున్నది. మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీని నిషేధించింది. ఈ నిషేధ ప్రభావం అభ్యుదయ రచయితల సంఘంపైన అశనిపాతంలా పడింది. 'అరసం' కార్య కలాపాలు అడుగంటి పోయాయి. నిషేధాన్ని తట్టుకోలేక కవులు , కళాకారులు కొందరు అజ్ఞాత వాస జీవితం గడపసాగారు. మరి కొందరు వేర్వేరు వృత్తుల నాశ్రయించి, పార్టీకి దూరమయ్యాయి. దరిదాపు ఒక దశాబ్దం పాటు 'అరసం'లో స్తబ్దత ఏర్పడింది. కొంత కాలం తర్వాత 'అరసం' పునరుద్ధరణ జరిగింది కాని దానికి పూర్వపు ఉత్సాహం చైతన్యం లోపించాయి.

### సమీక్ష :

అభ్యుదయ కవిత్వ నిర్వచనాలను - లక్షణాలను ఆవిర్భావ వికాసాలను - అభ్యుదయ రచయితల సంఘం కార్యకలాపాలను పరిశీలించారు.

### ప్రశ్నలు :

1. అభ్యుదయ కవిత్వోద్యమ చారిత్రక నేపథ్యాన్ని తెలుపండి?
2. అభ్యుదయ కవిత్వ నిర్వచనమును ఆవిర్భావ వికాసాలను తెలుపండి?
3. అభ్యుదయ రచయితల సంఘాన్ని గూర్చి రాయండి?
4. వీరేశలింగం - గిడుగు గురజాడ చిలకమర్తి కవులు అభ్యుదయ కవిత్వోద్యమానికి సేవను తెల్పుము?

### సంప్రదించవలసిన గ్రంథాలు :


1. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయాలు - ప్రయోగాలు : డా. సి. నారాయణరెడ్డి
2. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం : వెల్చేరు నారాయణరావు
3. ఆధునికాంధ్ర కవితా సమీక్ష - ఆచార్య కాకర్ల వెంకటరామనరసింహం.
5. ఆంధ్రప్రదేశ్ దర్శిని - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
6. కల్పన : కవితా సంకలనం
7. మహాప్రస్థానం : శ్రీశ్రీ
8. సాహిత్య పరిచయం - ఇంద్రగంటి శ్రీకాంతశర్మ
9. సమగ్రాంథ సాహిత్యం - ఆరుద్ర - 11, 12, 13 సంపుటాలు
10. అక్షర తూణీరం : కె.వి. రమణారెడ్డి.


డా॥ కడియాల రామమోహనరాయ్

పాఠం - 4

# అభ్యుదయ కవుల కవితా ధోరణులు

**పాఠ్య నిర్మాణ క్రమం**


4.1 శ్రీశ్రీ అభ్యుదయ కవితా ప్రస్థానం

4.2 అభ్యుదయ కవుల పరంపర

4.3 తెలంగాణ పోరాటం

4.4 అభ్యుదయ కవిత్వం - ప్రజానాట్య మండలి

4.5 అభ్యుదయ కవుల కవితాధోరణులు

4.6 అరసం సభ్యులు కాని అభ్యుదయ కవులు

4.7 ఇతర సాహిత్య ప్రక్రియలు : అభ్యుదయ దృక్పథం

4.8 ఉపసంహారం


**లక్ష్యం :**

అభ్యుదయ కవులలో శ్రీశ్రీ స్థానాన్ని - తెలంగాణా విముక్తికై అభ్యుదయ కవులు చేసిన కృషిని - వివిధ అభ్యుదయ కవితా ధోరణుల గూర్చి తెలుసుకొంటారు.

## 4.1 శ్రీ శ్రీ అభ్యుదయ కవితా ప్రస్థానం.

శ్రీ రంగం శ్రీనివాసరావు (1910 - 1983) 'సుప్తాస్థికలు' (1929) రాసి కాల్పనిక కోద్యమ కవిత్వ ప్రభావం నుండి బయటపడ్డారు - జయభేరి (1933) గీతం - నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను. అనేది అభ్యుదయ కవిత్వానికి నూతన కవాటాలు తెరిచింది. 1933-39 మధ్యకాలంలో శ్రీ శ్రీ రాసిన విద్యున్మాలికలు, జయభేరి, మరోప్రపంచం మరో ప్రపంచం పిలిచింది మొదలైన గేయాలు వెలువడ్డాయి. 'జయభేరి' లో 'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధ నొక్కటి ఆహుతిచ్చాను' అని ఆలపించాడు. ఇందులో వ్యక్తిచైతన్యం, సామాజిక చైతన్యం కనిపిస్తాయి. ఛందస్సుల సర్పపరిష్వంగం, భావకవితా స్వర్ణ పంజరం వదలి కొత్త ఛందస్సులో జయభేరి గేయం వెలువడింది. మరో ప్రపంచం అనే చారిత్రాత్మక గేయం అభ్యుదయ కవిత్వానికి నాంది గీతంగా మారింది. ఇది ఐదు నిముషాల వ్యవధిలో రచించబడింది. 1934 లో బాటసారి, ప్రతిజ్ఞ ; 1937-38 లో అభ్యుదయం, వ్యత్యాసం, నవకవిత, 1939 లో కవితా ఓ కవితా, కేక వెలువడ్డాయి.

ఈ గీతాలు "ఏక కాలంలోనే పండిత పామరులిరువురినే" రంజింప జేశాయి. తర్వాత కవులందరూ శ్రీ శ్రీ మార్గాన్ని అనుసరించారు.

తెలుగు సాహిత్యం వరకు చూస్తే శ్రీ శ్రీ ని "Infant terrible of Hungly Thirties" అని చెప్పవచ్చు. 1930 దాకా తెలుగు కవిత్వం తనను నడిపిస్తే ఆ తర్వాత తెలుగు కవిత్వాన్ని తానే నడిపించానని శ్రీ శ్రీ ఒక సందర్భంలో అన్నారు. "ఈ శతాబ్దం నాదే" అని కూడ ఆయన అన్నారు.

1950 లో శ్రీ శ్రీ మహాప్రస్థానం కవితా సంపుటి చలం యోగ్యతాపత్రంతో వెలువడింది. "ఇంకా రాత్రి చీకట్లో లోకం నిద్రలో భయంకర స్వప్నాలు కంటే దీనంగా పలవరించే సమయాన ఉషాగమనాన్ని గుర్తించి స్వాగత మిచ్చే వైతాళికుడు శ్రీ శ్రీ" అని చలంయోగ్యతా పత్రంలో తెలిపారు.

"ఏ లోకంలో అన్యాయాలూ అధికారాలు ఏడుపులు, క్షామాలు, యాచకాలు, క్షుద్రకవిత్వాలూ శిక్షలు, Scantals లేవో ఆలోకాన్ని dream చేస్తున్నాడు యీ కవి" అన్నారు చలం. శ్రీ శ్రీ ఊహించిన మరోప్రపంచం ఇదే.

"అర్థాన్ని అర్థ్వాన్నపు అడవిలో విడిచి పెట్టి" మనస్పంచలనాన్ని మాటలలో పెట్టే అధివాస్తవిక కవితా రీతిలో శ్రీ శ్రీ కొన్ని కవితలు రాశారు గాని తిరిగి అభ్యుదయ మార్గంలోనే తన ప్రస్థానాన్ని సాగించారు.

భారతస్వాతంత్ర్యోదయ సందర్భంలో శ్రీ శ్రీ రచించిన 'మహాసంకల్పం' ఒక ఉత్తమ గీతం. "స్వాతంత్ర్యం ఒక చాలా సున్నితమైన పువ్వున చాలా వాడైన కత్తి విలువైన వజ్రం." అన్నారు శ్రీ శ్రీ ఇంకా "గాంధీజీ ; ఓ మహాత్మా ; తెలుగుతల్లి, విశాలాంధ్ర; సదసత్సంశయం ; నగరంలో వృషభం శరచ్చంద్రిక" గీతాలు శ్రీ శ్రీ అభ్యుదయ దృక్పధాన్ని తెలిపే విశిష్టమైన రచనలు.

చందమామతో శ్రీ శ్రీ "ఇదిగో మాట ! ఈ ప్రపంచంలో ఇంకా ఎందరో అభాగ్యులున్నారు పలకరించు వాళ్ళని చల్లగా, ధైర్యం చెప్పువాళ్ళకి మెల్లిగా" అని విజ్ఞప్తి చేశారు (హరశ్చంద్రిక)

1970 తర్వాత శ్రీ శ్రీ విప్లవ కవితా మార్గాన్ని అనుసరించి, సమసమాజ నిర్మాణం కోసం సాయుధపోరాటం అవసరమన్నారు.

## 4.2. అభ్యుదయ కవుల పరంపర :

**ఆరుద్ర :** అంత్యప్రాసలతో రచనను చూచీ చూడగానే ఇది ఆరుద్ర గారి రచన అని పోల్చవచ్చు భావవ్యక్తీ కరణలో వాడుపు, ఉపమానాలను ఎన్నుకోవడంలో అసామాన్యమైన ప్రజ్ఞ ఆయన ప్రతిభకు నిదర్శనాలు తెలంగాణ పోరాట సమయంలో 'త్వమేవాహమ్' ద్వారా ఆయన అభ్యుదయ కవులలో ప్రముఖ స్థానం వహించారు. ఆయన పాటించిన సంవిధాన చాతుర్యాన్ని సామాన్య పాఠకులు సరిగా అందుకోలేక పోయారు.

'త్వమ్ + ఏవ + అహమ్' = నువ్వేనేను - తెలంగాణలో పీడనకు గురి అవుతున్న వారికి సంఘీభావాన్ని ప్రకటిస్తూ కావ్యానికి ఆయన యీ పేరు పెట్టారు.

భూమి, మిల్లు మొదలైన ఉత్పత్తి సాధనాలు దోపిడి వర్గం చేతిలో వున్నాయనీ, కూలీలూ కార్మికులు వాటిని సొంతం చేసుకొని కార్మిక కర్షక స్వర్గం నిర్మించాలని ఆరుద్ర ప్రభోదించారు.

"నువ్వెక్కదలచుకున్న రైలు ఎప్పుడూ ఒక జీవిత కాలం లేటు" మొదలైనవి ఆరుద్ర గారి ఊహా వైచిత్రిని వెల్లడించే అద్భుతమైన పంక్తులు.

'గాయాలు - గేయాలూ', 'సినీవాలి', కవితలు (విపుల కవితా సంకలనం) ఆరుద్ర గారి అభ్యుదయ దృక్పదాన్ని వెల్లడించే మరికొన్ని కవితా సంకలనాలు.

**దాశరథి :** "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని దేశ భక్తితో కంఠమెత్తిన దాశరథి తెలంగాణలో నిజాం రాజు దుర్మార్గాలను ఎదిరిస్తూ ప్రజలను ఉత్తేజపరచారు. 'అగ్నిధార' కురిపించి జాతిలో చైతన్యం రగుల్కొలిపారు. పీడిత ప్రజల వాణికి తన కవితను మైకొ గా సమర్పించారు." మహాంద్రోదయం, అగ్నిధార, పునర్నవం, తిమిరంతో సమరం కావ్యాలలో ఆయన అభ్యుదయ భావాల ఉచ్ఛ్వాస నిశ్వాస్వాలుగా అమిరాయి. "హృద్యమైన పద్యంనుండి, శ్రవణపేయమైన గేయం నుండి, రుచికరమైన వచన కవిత దాకా అన్ని ప్రక్రియలను ఆస్వాదించాను. పోరాటంలోనుండి కళ పుడుతుందని నమ్ముతున్నాను. నా జీవితమే పోరాటం అని పలికిన అభ్యుదయవాది దాశరథి.

**కాళోజీ :** ప్రజల కవి కాళోజీ నారాయణరావు - తెలంగాణ ప్రజల తలలో నాలుకై వారి వ్యధలను కవిత్వ రూపంలో వెల్లడించిన కవి కాళోజి. అన్యాయాలప విరుచుకు పడ్డప్పుడు కాళోజి కవిత వొళ్ళంతా చీల్చుకుపోయే మొగలిరేకు ; ఒక్కొక్కప్పుడది పదునైన గండ్రగొడ్డలి - అభ్యుదయ భావాలు లేకుండ ఆయన ఏ కవితా రచించలేదు. ప్రజల గొడవే కాళోజీ నా గొడవ.

సంఘంలో వ్యత్యాసాలను వర్ణిస్తూ కాళోజీ "కమ్మని చక్కిలలొకచోట గట్టిదవడలింకొకచోట వాసననూనియ లొకచోట మాసిన తలలింకొకచోట అని చమత్కారంగా పలికి పండిత పామరులిరువురినీ రంజింప జేశారు.

దేశసంపదకు రైతు ముఖ్యాధారం అయినప్పుడు కర్షకుని చిన్నచూపు చూడటం తగదని కాళోజీ భావం. "నర్తకుని నాట్యాలు, గాయకుల గానాలు, ధార్మికుని దానాలు, పండితుని భాషణలు వర్తకుని వ్యాజ్యాలు వకీళ్ళ వాదాలు సైనికుల శౌర్యాలు, యాంత్రికుని మంత్రాలు యోధుల యుద్ధాలు, రాజుల రాజ్యాలు కర్షకునీ కట్టు కదిలినన్నాళ్ళే" అని కర్షకుని ఔన్నత్యాన్ని కొనియాడారు.

జన శ్రేయస్సుకు క్షతి కలిగినప్పుడల్లా స్పందించటం కాళోజీ జీవ లక్షణం.

కుందుర్తి : "నా గీతం నరజాతి విముక్తి సంగీతం" అని పలికిన అభ్యుదయ కవి కుందుర్తి ఆంజనేయులు. "తెలంగాణ, యుగేయుగే; నగరంలోవాన; నాలోని నాదాలు కావ్య సంపుటాలు" అభ్యుదయ భావభరితమైనవి. దుర్భరమైన వర్తమానానికి, ఆశలు రేకెత్తించే భవిష్యత్తుకూ తేడాను రెండులోకాలు గీతంలో వర్ణించారు.

'భగవంతునికి బహిరంగలేఖ' లో కవి "తిండి లేనివాళ్ళకు తృప్తివిషం పెట్టటానికి ఒకపూట ఉపవాసం చేసేభోగి నీకు వాడు మహా అప్పుడు నేను వాడ్ని సహించను" అన్నారు.

అభ్యుదయ భావపు ప్రచారానికి వచన కవిత్వమే సరైన కవితా వాహకమని నమ్మిన కవి కుందుర్తి. వచన కవిత్వానికి గౌరవం సంపాదించి పెట్టిన కొద్ది మందిలో ఈయన ప్రముఖుడు.

**తిలక్ :** దేవరకొండ బాలగంగాధర తిలక్ మానవతావాది. సౌందర్యము. అభ్యుదయమూ ఆయన కవితకు రెండుముఖ్యమైన అంశాలు. "నా అక్షరాలు వెన్నెలలో ఆడుకొనే అందమైన ఆడపిల్లలు.

నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయాపారావతాలు

నా అక్షరాలు ప్రజా శక్తుల వహించే విజయ ఐరావతాలు"

అని తిలక్ తన కవిత్వదృక్పథాన్ని అందంగా తెలిపారు.

"ఆర్తగీతం ; ప్రార్థన మేగ్నకార్టా : "గొంగళి పురుగులూ", "అమృతం కురిసిన రాత్రి" ఈయన కవితలలో విశిష్టమైనవి "ఇజాలల్లో ఇంప్రిజన్" కాకూడదనేది యాయన అభిమతం.

"దేవుడా రక్షించు నా దేశాన్ని పవిత్రులనుండి పతివ్రతలనుండి పెద్దమనుషులనుండి పెద్దపులులనుండి లక్షలాది దేవుళ్ళనుండి.. శ్రీమన్మద్గుర్స పరంపరనుండి" అని వేడుకొన్న కవి భావనలోని అభ్యుదయ భావన గుండెల్లో గుచ్చు కొంటుంది.

అభ్యుదయమంటే సమసమాజ నిర్మాణమని గాక ఆకలి ఖ్యాతి బాధలు లేని చల్లని లోకమని తిలక్ తలచారు.

**విద్వాన్ విశ్వం :** రాయలసీమ కరువును కళ్లారా చూసి హృదయం ద్రవించి, బాధా దగ్ధమైన కంఠంతో శ్రీ విశ్వం పలికిన కవిత్వం పెన్నేటిపాలు. రాయలసీమ కన్నీటి పాట పెన్నేటి పాటగా కరుణ రసభరితంగా వెలువడింది. విశ్వంగారి పెన్నేటిపాట - ఒకనాడు కావ్యాలు అభ్యుదయ దృక్పథంతో రాసినవి.

**సోమసుందర్ :** "జన్మెత్తిన మానవునకు జీవితమే పరమధనం అయితే అది ఒకమారే అతని కొంసగబడిన వరం" అని పలికిన ఆవంత్స సోమసుందర్ అభ్యుదయ కవులలో ప్రముఖులు.

వీరి వజ్రాయుధం అభ్యుదయ కావ్యాలలో ప్రముఖంగా గణుతింపదగినది. అదిగదిగొ ఫాక్టరీ ధన మదాంధ అధికారుల కనికార రహిత గర్వం ఆకృతియై నిలిచిన ఫాక్టరీ : అదిగో అది పొగ గొట్టం ధనస్వామి నిర్దయవలె నించుని భుగభుగమని పొగవలె జిమ్మె చిమ్మి అంటూ యంత్ర భూతముల కోరలు తామై కార్మికులనుద్దేశించి రాసిన గీతం సోమసుందర్ కవితల్లో విశిష్టమైనది.

**అనిసెట్టి సుబ్బారావు :** అని సెట్టి సుబ్బారావుగారి 'అగ్నివీణ' అభ్యుదయ కావ్యాలలో ప్రముఖంగా పేర్కొనదగినది. భయం భయం, బ్రతుకు భయం భయం అన్నా మనకీలోకం పన్నిన పద్మవ్యూహం అంశాలతో బ్రతుకీడ్చే అస్థిపంజరాలు మనం, ఆవేదన హితమయ్యే ఆశాజీవులం మనం గతమంటే కారు వెగటు రేపంటే తగని భయం "అని సామాన్యుని దుర్భర జీవితాన్ని, నిస్సహాయ స్థితిని అనిసెట్టి వర్ణించారు.

"ఎవరిపిల్లలోయి మీరు?" వీరి రచనల్లో అత్యుత్తమమైనది బ్రిడ్జికింద స్టేషన్లో ధూళిమీద ఎటుచూచిన కనిపించే అనాధలను చూచి "ఈలోకపు శాసనాలు ఎంగిటాకులిస్తాయి. ఇనుప కమ్ములిస్తాయి" అని పరిస్థితులు చిన్నారి బాలల్ని బిచ్చగాళ్ళుగా నేరస్థులుగా చెయ్యటాన్ని గురించి ఆక్రమించారు.

**రెంటాల గోపాల కృష్ణ :** రెంటాల గోపాల కృష్ణగారి సంఘర్షణ సర్పయాగం ఉత్తము అభ్యుదయ కావ్యాలు పల్లకీబోసాలు వీరి కవితలలో విశిష్టమైనది. సంభవామియుగేయుగే'లో అధర్మం ప్రవర్తిల్లిన చోటతాను అభ్యుదయ కవిగా అవతరిస్తానంటారీయన.

**గంగినేని వెంకటేశ్వరరావు :** తెలంగాణ పోరాట కాలంలో గంగినేని వెంకటేశ్వరరావు రాజకీయ కార్యకర్తగా కొన్ని సంవత్సరాలు అజ్ఞాత జీవితం గడిపారు. వీరి ఉదయిని కావ్యం అభ్యుదయోగ్యమంలో ప్రముఖంగా పేర్కొనదగినది. వీరి కవితల్లో రాజకీయ సిద్ధాంత అవగాహన, కవితా శిల్పము చక్కగా మేళవించాయి.

**బెల్లం కొండ రామదాసు :** "మానవ మేధస్సుకు సంకెళ్ళను తగిలించిన గత సాంఘిక శిలాశాసనం పడగొట్టను పగిలిన నా నిప్పుల కంఠం పలికిన విప్లవగీతం" నా గీతమన్న బెల్లం కొండ రామదాసు గళం ప్రతీప శక్తులపై రణభేరి. "కాలపుదారుల్లో చీకటి ముళ్లను తొలగించాలని వీరి ఆకాంక్ష.

**కె.వి. రమణారెడ్డి :** రమణారెడ్డి గారి "అడవి, భువన, ఘోష, అంగ అంగారవల్లం" కావ్యాల్లో ప్రతి జీతమూ అభ్యుదయ భావాలను నింపుకొన్నదే. "రక్తాశ్రువు, రణోన్మాది చిత్రపటం, స్టాలిన్ అస్తమయం వీరి గీతాల్లో విశిష్టమైనది.

**అంజతా :** 'చెట్లు కూలుతూన్న దృశ్యం' కవితలో ఆధునిక కవిగా గుర్తింపుపొందిన అజంతా శిల్ప నైపుణ్యంగల కవి - వీరి "పరిత్యాగ పరివేదన ; న్యూస్‌రీల్; జెండాలకు కన్నీళ్ళులేవు; అగ్నిస్పర్శ" కవితలు భావుకుల ఆదరాన్ని చూరగొన్నాయి. రాజకీయ సిద్ధాంత ప్రచారానికి గాక కఠోర జీవిత వాస్తవాలను తెల్పటానికి కవిత రచించాలని వీరి ఉద్దేశ్యం.

**బైరాగి :** ఆలూరి బైరాగి "చీకటి నీడలు, నూతిలో గొంతుకలు; ఆగమగీతి" కావ్యాల అభ్యుదయ భావాలకు మణిదర్పణాలు "హృదయపు మెత్తని చోటుల గీరే జంతువు ఆకలి" అని పలికి ఆకలి కమ్మిన కళ్ళకు ప్రపంచం కనిపించదన్నారు.

"ప్రపంచంతో ఏకమైననాడే కవి కంఠం సరిగా పలుకుతుందని నా నమ్మకం. ప్రపంచానుభూతితో స్వీయానుభూతి లీనమైనప్పుడే ఉత్తమకవిత ఉద్భవిస్తుందని నా విశ్వాసం" అన్నారు బైరాగి.

వీరి కవితల్లో "వేశ్య; తాజమహలే పడగొట్టండోయ్" విశిష్టమనవి.

**గోపాల చక్రవర్తి :** "జీవితం కరిగిపోయేమంచు / ఉన్న దాంట్లో అందరికీ పంచు" అని జీవిత సత్యాలను అలవోకగా అందించిన అభ్యుదయకవి గోపాల చక్రవర్తి, చమత్కారం యాయన కవిత్వానికి ప్రాణం

"కలం కలలు; ఆనందం జీవనది వీరికావ్యాలు "అంగీలోపల అగ్నిపర్వతం వున్నా చిరునవ్వు మనసారగా నవ్వు సగటు మనిషీ ! ఆకలికీ అన్యాయాలకూ గోరీకట్టు నిరుద్యోగం పరిపేడనా పాతిపెట్టు" యని సామాన్యునికి ఉత్సాహం కలిగించారు.

**నయాగరా :** ప్రముఖ అభ్యుదయ కవులు కుందుర్తి ఆంజనేయులు; బెల్లంకొండ రామదాసు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం గారల కవితల సంకలనం 'నయాగరా' శ్రీ శ్రీ కేవలం సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన ఆకాశమార్గాలలో ఎవరికీ అందకుండా విహరిస్తుంటే నయాగరా కవులు భూమ్మీదికిదిగి యిక్కడి పరిస్థితులను అర్థం చేసుకుని వాటికి కావ్యత్వం యిచ్చారు." ఇందులో నా గీతం ; మన్యంలో ; ఠాకూర్ చంద్రసింగ్ కవితలు విశిష్టమైనవి.

కల్పన : అభ్యుదయ కవుల కవితా సంకలనం 'కల్పన' (1953) దీనికి అని సెట్టి సుబ్బారావు, అవసరాల సూర్యారావు, రెంటాల, బెల్లంకొండ రామదాసు సంపాదకులు.

"ఈ యుగంలో వ్యక్తి చైతన్యం సాంఘిక చైతన్యంగా విస్తరిల్లింది. వికలమైన సంఘవ్యవస్థ ఫలితంగా శకలాలై చెదిరిన జీవిత చిత్రణకు ప్రాధాన్యత కనిపిస్తుంది. ఈ యుగాన్ని ఆవరించిన ప్రధాన తత్వదృష్టి మార్క్సిజం నేటి సాంఘిక విషబంధంలో చిక్కిన మానవునికి మార్క్సిజం గొప్ప నిష్కృతి మార్గంగా కనిపించింది. ..... నేటి కవులు యుద్ధాన్ని పరపీడనము ఆర్థిక అసమానతను ద్వేషించి విశ్వశాంతిని మానవ ప్రాదుర్భావాన్ని ఆశిస్తున్నారు అని సంపాదకులు తెలిపారు. ఈ సంకలనంలో భావకవులు దేవులపల్లి కృష్ణశాస్త్రి (అరుణ తార) పిలకా గణపతి శాస్త్రి (మాదాకబళం) రచించిన అభ్యుదయ గేయాలున్నాయి.

అభ్యుదయకవుల కావ్యాలలో కరుణ శ్రీ 'అరుణ కిరణాలు' సి. నారాయణరెడ్డి. - దివ్వెల మువ్వలు, మధ్య తరగతి మందహాసం, బోయిభీమన్న - గుడిసెలు కాలిపోతున్నై; గజ్జెల మల్లారెడ్డి - మల్లారెడ్డి గేయాలు; శంఖారావం, సి.వి. - 'కారు చీకటిలో కాంతి రేఖ'; శశాంక - నయాజమానా; కవిరాజ మూర్తి - మానవ సంగీతం; కారుమంచి వెంకటేశ్వరరావు - పాంచజన్యం' - మొదలైనవి తప్పక పరిశీలించదగినవి.

## 4.3 తెలంగాణ పోరాటం :

అభ్యుదయకవిత్వం నిజాంనవాబు పరిపాలనలో రైతులు, వివిధవృత్తులవారి జీవితం నానాటికీ దుర్భరమైంది. జాగీర్దారులు, దేశముఖ్‌ల దౌర్జన్యమూ పటేల్ పట్వారీల పడు నా ప్రజల జీవితాన్ని దిగజార్చాయి. సేద్యానికి కాలువలు, చెరువులు, బావులు తవ్వించటంపోయి జాగీర్దార్లు పేదరైతులు ఎముకల్ని పిండి చేసుకొని పండించిన పంటలో అధిక భాగాన్ని శిస్తు కింద జమకట్టుకోసాగారు. నిస్సహాయులైన ప్రజలకు సాయం చెయ్యటానికి 1930 లో ' ఆంధ్ర మహాసభ' స్థాపించబడింది. క్రమంగా 'సంగం' (ఆంధ్ర మహాసభకు తెలంగాణ ప్రజలు పెట్టుకున్నపేరు) తెలంగాణ ప్రజల జీవితంలో ఒక భాగమైంది. ఆంధ్రమహాసభ సభ్యులు చూపిన సాహసం, చేసిన త్యాగాలు గొప్పవి.

ఆంధ్రమహాసభ నాయకత్వంలో ప్రజలు చైతన్యవంతులయ్యారు.

విసునూరి దేశముఖ్ రామచంద్రారెడ్డి దౌర్జన్యాలను ప్రతిఘటించి ప్రజలు ఐకమత్యంతో నిలిచినప్పుడు దేశముఖ్ దౌర్జన్యానికి తలపడి తన గూండాల చేత దొడ్డికొమురయ్య అనే కార్యకర్తను చంపించాడు. ఈ సంఘటన 1946 జూలై 4 వ తేదీన జరిగింది. ఆ గ్రామ ప్రజలు ఏకమై దేశముఖ్‌ను గూండాలను ఊరినుండి తరిమి కొట్టారు. ఈ సంఘటనతో తెలంగాణ పోరాటం మొదలైంది.

1951 అక్టోబర్ 21 తేదీన కమ్యూనిష్టు పార్టీ పోరాటాన్ని విరమించింది.

ఈ అయిదేళ్లకాలంలో అభ్యుదయ కవిత్వోద్యమం ఉజ్వలంగా వెలుగొందింది.

భారతదేశానికి స్వాతంత్ర్యం 1947 ఆగస్టు 15 తేదీన వచ్చిందిగాని తెలంగాణ ప్రజలకు రాలేదు. హైదరాబాద్ సంస్థానాన్ని స్వతంత్రరాజ్యంగా ప్రకటించుకొని నిజాంనవాబు భారతదేశంలో తన సంస్థానాన్ని విలీనం చెయ్యడానికి తిరస్కరించాడు. అసఫ్జాహి పాలనలో ప్రతి ముస్లిమూ ఒక పరిపాలకుడేనని ప్రకటించి నిజాం నవాబు మతో ద్రేకాలను రెచ్చగొటాడు. ఇత్తెహాదుల్ ముస్లిమిన్ నాయకుడు కాశీం రజ్వీ నాయకత్వాన రజాకార్లు ఇతర ప్రజల్ని హింసించసాగారు. ప్రజలు సమైక్యంగా నిలిచి హిందూ ముస్లిం భేదం లేకుండా వీరోచితంగా ఎదిరించి పోరాడారు. దొరల దగ్గర వెట్టిచాకిరికి స్వస్తి చెప్పారు.

పోరాటకాలంలో ప్రజలు ఈటెల్లాంటి పాటలు పాడుకున్నారు. తెలంగాణ పోరాటానికి సంబంధించి రెండు రకాల సాహిత్యం వచ్చింది. ఒకటి పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొని, బాధల్ని చవిచూచి మహోద్రేకంతో రచించిన సాహిత్యం. రెండవది తెలంగాణకు వెలుపలవుండి పోరాటాన్ని గురించి తెలుసుకొని వారితో ఏకత్వాన్ని ప్రకటిస్తూ (త్వమేవ హమ్) వారి కష్టాలకు కార్యరూపమిచ్చింది. రెండూ అభ్యుదయ భావాలతో వెలువరించినవే.

తెలంగాణ పోరాటకాలంలో చాలమంది అజ్ఞాత కవులు ప్రజలను ఉత్తేజపరుస్తూ పాటలు పాడారు. వీరిలో కొందరు నిరక్షరాస్యులు కూడా -

"నైజాము సర్కరోడ / నాజీలమించినోడ", బండెనక బండికట్టి / పదహారు బండ్లు కట్టి / ఏ బండ్లపోతవు కొడకో / నా కొడక ప్రతాపరెడ్డీ/", "ఖైదీలం మనమంతా ఖైదీలం స్వతంత్ర భారత ప్రభుత్వ ఖైదీలం" మొదలైన పాటలు యీనాటికీ ప్రజల నాల్కలపై నిలిచివున్నాయి.

దాశరథి, కాళోజీ, తిరునగరి రామాంజనేయులు, సుద్దాల హనుమంతు మొదలైనవారు పోరాటంలో పాల్గొన్నవారు. సోమసుందర్ ఆరుద్ర, అనిసెట్టి, కుందుర్తి, రమణారెడ్డి, రెంటాల, గంగినేని మొదలైనవారు పోరాటాన్ని గురించి తెలుసుకొని స్పందించినవారు.

## 4.4 అభ్యుదయ కవిత్వం ; ప్రజానాట్యమండలి

అభ్యుదయ రచయితల సంఘానికి అనుబంధంగా 'ఆంధ్రప్రజా నాట్యమండలి' ఉద్యమాన్ని ప ందుకు తీసుకుపోవటంలో ప్రముఖ పాత్ర వహించింది.

నాటకాలు, జానపద కళారూపాలు - బుర్రకథ, జముకుల కథ హరికథ, పగటి వేషాలు, కొయదొరవేషం, బుడబుక్కలవేషం, సోది, భజనలు మొదలైన కళా రూపాలతో ప్రజా నాట్యమండలి మారుమూల పల్లెలదాకా చొచ్చుకుపోయింది.

డా. గరికపాటిరాజారావు, కోడూరి అచ్చయ్య, కోసూరి పున్నయ్య, నాజర్, మిక్కిలినేని, కోగంటి గోపాల కృష్ణయ్య, సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు, రామకోటి, కర్నాటి లక్ష్మీనరసయ్య, సుబ్బారావు పాణిగ్రాహి మొదలైన కళాకారులు, ప్రయోక్తలు అభ్యుదయ భావ ప్రచారానికి విరివిరిగా తోడ్పడ్డారు.

తెలంగాణ పోరాటంలో, ప్రజానాట్య మండలి ప్రదర్శనల్లో స్త్రీలు అసంఖ్యాకంగా పాల్గొన్నారు; ఘనమైన త్యాగాలు చేశారు. ప్రజల్ని చైతన్యపరిచారు. అభ్యుదయోద్యమ వ్యాప్తికి కృషి చేసిన మహిళలలో కొండపల్లి కోటేశ్వరమ్మ, మోటూరు ఉదయం, తాపీ రాజమ్మ, వట్టి కొండ విశాలాక్షి, మానికొండ సూర్యావతి ప్రముఖులు.

శ్రీ శ్రీ పులుపుల శివయ్య, నాజర్, కొనకళ్ళ వెంకటరత్నం, సుంకర సత్యనారాయణ, తుమ్మల వెంకటరామయ్య, వేముల పల్లి శ్రీ కృష్ణ, తన్నేటి సూరి, కరుణశ్రీ, నార్ల చిరంజీవి మొదలైన కవుల గీతాలు ప్రజానాట్యమండలి ద్వారా విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. వీటిలో కొన్నిటిని కవిత్వాభిమానులు సందర్భోచితంగా మననం చేసుకుంటూనే ఉన్నారు.

## 4.5 అభ్యుదయ కవుల కవితా ధోరణులు :

1943 లో అభ్యుదయ రచయితలు సంఘ స్థాపనతో అభ్యుదయ కవిత్వం విశ్వరూపం దాల్చింది. 1944 లో వెలువడిన "నయాగరా కవితా సంపుటి" ఈ ధోరణికి ప్రతినిధివంటిది. బెల్లంకొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం అను ముగ్గురు కవుల గేయాలు ఈ సంపుటిలో ఉన్నాయి. సీతా రామరాజు మన్య విప్లవం, దండి సత్యాగ్రహంలో పాల్గొన్నందున యావజ్జీవ కారాగారశిక్ష విధించబడిన ఠాగుర్ చంద్రసింగ్ చరిత్ర వీరికి కవితా వస్తువులయ్యాయి. పారిస్ వీధులు, చైనా లోయలు, బర్మా అడవులు, మాస్కోగేట్లు, సోల్జర్లు, టాంక్‌డ్రైవర్లు, గెరిల్లాలు గుంపులు, కొడవలి పదును, ఎర్రటి జెండా, సమ్మెట పెట్టు, నిప్పుల గొంతుక మొదలైనవి వీరి గేయాలలో స్థానం సంపాదించుకున్నాయి.

నయాగరా కవితా సంపుటి ప్రచురించబడిన తర్వాత పలువురి అభ్యుదయగేయాలు పుస్తకరూపంలో వెలువడ్డాయి. 1950 లోపల వెలువడిన వాటిలో దాశరథి 'అగ్నిధార' (1949) 'రుద్రవీణ' (1950), సోమసుందర్ 'వజ్రాయుధం' (1949), ఆరుద్ర 'త్వమేవాహం' (1949), అనిసెట్టి 'అగ్నివీణ' (1949) నారపరెడ్డి 'అశ్రుమాల' (1950), రెంటాల 'సంఘర్షణ' (1950) గంగినేని 'ఉదయిని' (1950) మొదలైనవి అభ్యుదయ కవిత్వాధ్యాయమున మైలురాళ్ళు వంటివి. అలాగే 1950 తర్వాత వెలువడిన వాటిలో శ్రీ శ్రీ 'మహాప్రస్థానం' (1950), రమణారెడ్డి 'భువనఘోష' (1955), నారపరెడ్డి 'నా వీణ' (1950) కుందుర్తి 'తెలంగాణా'(1956), పుటపర్తి 'పురోగమనం' (1951), రెంటాల 'సర్పయాగం' (1959), సోమసుందర్ 'కాహళి' (1953) మొదలైనవి అభ్యుదయ కవిత్వోద్యమంలో ఎన్నదగిన కవితా సంపుటులు. అభ్యుదయ కవుల్లో ప్రముఖుల రచనల్ని ఆధారంగా చేసుకుని వారు చిత్రించిన కవితా ధోరణులను 7 రకాలుగా డా॥ సి. నారాయణ రెడ్డిగారు విభజించారు. అవి

1. వర్గ సంఘర్షణ
2. విప్లవ ప్రబోధము
3. వీర గాథా కథనము
4. యుద్ధ విముఖత - శాంతి ప్రియత.
5. సమ సమాజ నిర్మాణము
6. తెలంగాణా విముక్తి
7. ఆంధ్ర రాష్ట్రోద్యమము

ఏ) వర్గ సంఘర్షణ :

అభ్యుదయ కవిత్వానికి వర్గ సంఘర్షణ ప్రథమ గణ్యమైన లక్షణం. దీనిలోనే గతని రాసము, ప్రస్తుతపు బూర్జువా వ్యవస్థ తిరస్కారం ఇమిడి ఉన్నాయి.

" ఏ దేశ చరిత్ర చూచినా
ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం"

అన్న శ్రీ శ్రీ వాక్కులు తర్వాతి అభ్యుదయ కవులకు బుక్కులైనాయి. గత నిరసనముతోపాటు వర్తమానంలో అధికారం వహిస్తున్న బూర్జువా విధానం వీరి నిరసనకు గురయినది. ఒకవైపు అధిక ఉత్పత్తిని, మరొక వైపు డొక్కల కరువూకల బూర్జువా సమాజం అంతరించాలని వీరు కాంక్షించారు. పెట్టుబడి దారీ సమాజమును నిరసిస్తూ సోమసుందర్ తన 'వజ్రాయుధం' అనే సంపుటిలో

"ప్రతినిత్యం ఫ్యాక్టరీ
కూలీ యెముకలనెన్నో
సున్నంగా చితకగొట్టి
రక్తంతో రంగరించి
ధనస్వామి పాదమ్ముల
పారణిని పూస్తున్నది"

అని ఒడలు జలదరించునట్లుగా మహావేశంతో అభ్యుదయ కవి ఎలుగెత్తి చాటాడు. వర్గసంఘర్షణ తప్పదని మార్క్సు చెప్పిన విషయాన్ని వివరిస్తూ -

"అనాదిగా సాగుతుంది అనంత సంగ్రామం
అనాథుడికీ, అగర్భ శ్రీమంతుడికీ మధ్య"
అని దాశరథి 'అగ్నిధార' లో పేర్కొన్నాడు. ఈ వర్గసంఘర్షణనే
"భూరివృక్షం జారిపడ్డప్పుడే
లేతమొక్క పైకి లేస్తుంది
పసిడి మేడ ప్రక్క కొరిగినపుడే
అడుసు గుడిసె నడువ నేరుస్తుంది"
అని కె.వి. రమణారెడ్డి బూర్జువా వ్యవస్థను నిరసించారు.

**బి) విప్లవ ప్రబోధము :**

'బూర్జువా' వ్యవస్థలో శ్రామిక వర్గ ప్రస్తుత స్థితి "రైలు కింద పట్టాల్లాగా, చెప్పుక్రింద చీమల్లాగా" ఉన్నారని అభ్యుదయ కవులు గమనించారు. శ్రామికుని "పిల్లల నిల్లాలిని కల్లె , ాదిని నమిలే మిల్లు మ్యాగ్నెట్లు," "అతని వేడివేడి నెత్తురు[illegible]దర్ బాత్ తీసుకునే భువనైక ప్రభువులు" ఉన్నారని అభ్యుదయ కవులు సింహగర్జన చేసారు. శ్రామికులు, నిరుపేదలు గడ్డివంటివారు. "ఒక్కొక్క గడ్డిపరక ఒక కరవాలమై అభ్యుదయ నిరోధకులను హతమార్చు" నని వారు విశ్వసించారు. అందుకు సార్వజనీనమైన విప్లవం రావలెనని ఆకాంక్షించారు.

"గుండె గుండెకు చిచ్చుమండించి లేవండి
గుడిసె గుడిసెకు కోటనిర్మించి లేవండి"

అనివారు పీడిత ప్రజలను విప్లవానికై ప్రబోధించారు. ఎప్పుడో ఒకప్పుడు సమాజంలో మార్పురాదా ? ద నికి విప్లవం, తిరుగుబాటు అవసరమని చాటి చెప్పారు.

"గాండ్రించిన బెబ్బులి గొంతై
తీండ్రించిన బలిపోలికేకై, విడదీసిన పిడికిలిబాకై
విదిలించిన సింహపు జూలై, అదిలించిన వీరగర్జయై
పగిలించిన ప్రళయం బాంబై, రగిలించిన అగ్నిగోళమై

అని విజృంభించారు. విప్లవ విజృంభణకు అభ్యుదయ కవులు పరవశులై "ఎవరాపుదురీ శక్తిని ఎవరాపుదురీ కత్తిని" అని గానం చేశారు.

**సి) వీరగాథాకథనము :**

భావకవులు ఆంధ్రాభిమానమో, జాతీయాభిమానమో ఉన్న వీరుల్ని గూర్చి పాడుకున్నారు. అభ్యుదయ కవులు అంతటితో తృప్తిపడక బూర్జువా వ్యవస్థను ఎదిరించి, దానిని గడగడలాడించి చివరకు తమ ప్రాణాల్ని తృణప్రాయంగా విసిరేసిన విప్లవ వీరులను గూర్చి గానం చేశారు. అల్లూరి సీతారామరాజు, ఠాగూర్ చంద్రసింగ్, భగత్‌సింగ్ మున్నగు వారిని గూర్చి వీరు మహావేశముతో గేయాలు రచించారు. విశాలాంధ్రలో పాలక వర్గాన్ని ప్రతిఘటించి ప్రాణాలొడ్డిన వీరుల గూర్చి వీరు స్మృతి గీతాలు రచించారు. తెలంగాణా పోరాటంలో పాల్గొన్న మాధవ రెడ్డి, కొమరయ్య, లక్ష్మీనరసయ్య, రఘుపతి రెడ్డి, చెన్నారెడ్డి, పాపయ్య, మల్లయ్య, లింగయ్య, అమరయ్య, కాంతయ్య, దస్తగిరి మొదలైనవారు వీరికి నిటలాక్షులుగా కనిపించారు. "Tomarrow is ours" అన్న ప్రపంచ ప్రఖ్యాత, ఫ్రెంచ్ రచయిత "గెబ్రియల్ పెరీ" ని నాజీ ప్రభుత్వం రెండవ ప్రపంచయుద్ధ కాలంలో నిర్బంధించారు. జెకోస్లేవియా అభ్యుదయ కవియైన 'ఫ్యూజిక్' ని కూడా నాజీ ప్రభుత్వం ఉరితీసింది. అభ్యుదయ కవుల గెరిల్లా పోరాటానికి సంబంధించిన వర్ణనలు ఈ వీరగాథాకథనంలో భాగాస్వాములే. గంగినేని గెరిల్లా వీరుల్ని ఉద్దేశించి 'అరచేతిలో మృత్యువు' అనే శీర్షికలో

"జాగ్రత్త, భుజంపై తుపాకీ అదే మన పంచ ప్రాణం
మొలలో తూటాబెల్టు అదే అదే మన సర్వస్వం
ఇక్కడ కాదు ముళ్లు తీసేది నడువ్ కామ్రేడ్
ఇప్పుడు కాదు కాళ్ళు కుంటడం, దళంలో కలిసి పదవయ్యా
ఇంటి దగ్గర అంతా కులాసా, రేపేపాటికి ఈ ప్రాంతమంతా మనది
తెలీదా, నిన్న ఆరు పరగణాలు మనవాళ్ళు విముక్తి చేశారు".

వంటి పంక్తుల్లో గెరిల్లా యుద్ధ వీరుల బాధలు హృదయ విదారకంగా వర్ణించారు. 'అరచేతిలో మృత్యువు' అనే శీర్షికలో ప్రియుడు - ప్రియురాలికి, తల్లి - తనయునికి అనే లేఖా గేయాలు గెరిల్లా వీరుల హృదయంలో ఉద్రేక బడబాగ్నికి, వీరిని నమ్ముకుని ఉన్న తల్లుల గుండెల్లోని శోకాగ్నిని కరుణమహితంగా చిత్రించిన కవితా ఖండాలు. 'ప్రియుడు - ప్రియురాలు' లో ప్రియుడు తనకు కాబోయే ప్రియురాలికి లేఖ ఈ విధంగా రాశాడు.

"ఉత్తరాలు ప్రతీరోజూ వ్రాస్తూ ఉండు.

అక్షర అక్షరంలో నీ మధుర స్వర ఆలాపన వింటాను

పంక్తి పంక్తిలో నీ జీవన దృక్కోణం స్పర్శిస్తాను

లేఖలో నీవు కనబడతావు, కరిగిస్తావు

గరళం త్రాగే శక్తినిస్తావు."

అని చెప్పి భవిష్యత్ పై బ్రహ్మాండమైన విశ్వాసం వ్యక్తంచేసి

"ఉత్తరం ముగించి పగవాడి గుండెకు మరతుపా

గురిపెడతున్నా

భయపడకు నా పేరు మృత్యుంజయుడు నా కోసం

ఎదురుచూడు".

అని అకుంఠితమైన ఆత్మ విశ్వాసాన్ని ప్రకటించాడు,

'తల్లి - తనయునికి' అన్న గేయంలో తల్లి తన కొడుకు గెరిల్లా యుద్ధానికి వెళ్ళినప్పుడు శత్రుసైనికులు ఇంటి మీదపడి కోడలిని ఎత్తుకెళ్ళిన బీభత్స విషయాన్ని మనసునందుంచుకుని, కొడుకుని వారికి లొంగిపోవాల్సిందిగా అని బ్రతిమలాడకుండా అతనిలో పౌరుషాగ్నిని రగుల్కొల్పుతూ ఉత్తరంలో

"తక్షణం ప్రళయ రుద్రుడవై

అంతకు వేయంతల క్రోధంతో

విజృంభించి వారి గుండెరక్తం పిండిరా !

ఆమె ఆత్మకు శాంతి ప్రసాదించు"

అని వీరమాతల పలికింది. మన ప్రాచీన చరిత్రలోనే గాక ప్రస్తుత సమాజంలో కూడా వీరమాతలకు కరువులేదని గంగినేని వ్రాసిన ఈ గేయము నిరూపించింది.

**డి) యుద్ధ విముఖత - శాంతి ప్రియత :**

అభ్యుదయ కవులు గెరిల్లా పోరాటాన్ని చిత్రించినంత మాత్రాన వారిని యుద్ధ ప్రియులు అని భావించుటకు వీలులేదు. సామ్రాజ్య వాదులకు, ప్రజాపీడకులకు జరిగే పోరాటాలను, తిరుగుబాట్లను వీరు సమానంగా చిత్రించారు. అంతేకాదు దాశరథి, గంగినేని వంటి కవులు ప్రత్యక్షంగా పోరాటాల్లో పాల్గొని నిరంకుశ పాలక వర్గాన్ని ఎదిరించారు. పాశ్చాత్య దేశాల్లోని కొందరు కవులు గూడా సామ్రాజ్య వాద ప్రభుత్వానికి ఎదురు తిరిగి పోరాడి పాల్గొన్న వారున్నారు. ప్రపంచాన్ని నిముషంలో భస్మీపటలం చేసేటటువంటి మారణాయుధాలతో ఆటలాడు అగ్రరాజ్యాల ధోరణిని అభ్యుదయకవులు సహించలేకపోయారు. పచ్చని మానవ జాతి సంస్కృతికి యుద్ధం కార్చిచ్చు వంటిదని

దానిపట్ల తమ నిరసనను ప్రకటించారు. 'యుద్ధము మా కొద్దని' వినాదరూపమున ఎలుగెత్తి చాటారు. 'గడియ గడియకొక [illegible] చిరుచెక్కుల మొలిపించే జీవన దేవాలయమున వెలిగేమూర్తి' యైన శిశువు జీవము యుద్ధ జ్వాలంకాహుతియై పోవునని ఆక్రోశించారు. 'హిరోషిమా' లో రెండవ ప్రపంచయుద్ధమున జరిగిన దుర్భర విలయకాండను తలచుకొని అశ్రుతర్పణము చేశారు.

"అమ్మా ! ఉమా ! రుమా ! హిరోషిమా !
నీ శ్మశాన వేదికపై తొలకరి వానలు కురియునులే
నీ అనాధ సమాధిపై 'ఎర్రపూలు' పూయునులే"
అని 'హిరోషిమా' ను ఆశ్వాసించారు. యుద్ధతృష్ణాళువులను ఉద్దేశించి :
"గుండెలు పగిలిన నగరాల ఆర్తఘోష
ఇంకా వింటూనే ఉన్నాం
పచ్చని భూమి తల్లి వృక్షస్థలి పుచ్చి పోతుండగా
ఇక మీదట చూడలేం"
అని దైన్యాన్ని, దారుణ వేదనను ప్రకటించారు. చివరికి వజ్రనిశ్చయులై
"చితిమంటల యుద్ధానికి ప్రతికవి ఒక ఫైర్ బ్రిగేడ్
అణ్వస్త్రపు గ్రీష్మానికి ప్రతి పద్యం మబ్బుముక్క"

అని ప్రతిజ్ఞ చేశారు. యుద్ధ విముఖతను ప్రకటించుటతోనే ఊరకుండక శాంతిని ఎన్నోరీతులుగా ఆరాధించారు, ఆశ్వాసించారు.

"తల్లీ చల్లని శాంతీ

ధారుణి పండించవమ్మా"

అని శిశు హృదయంతో శాంతి దేవతను వేడుకొన్నారు.

శాంతిని గూర్చి వ్రాసిన రచనల్లో దాశరథి వ్రాసిన 'కపోతీ సందేశము' గణనీయమైనది. పావురాన్ని శాంతికి ప్రతీకగా వాడటం పాశ్చాత్య సంప్రదాయము. రష్యా వలన ఈ సంప్రదాయం బహుళ వ్యాప్తి పొందింది.

"కాస్త పశ్చిమాద్రి కడకేగి నా బందు

జాలమునకు గూడ శాంతి నేర్పి

ఇలను కాచుమోయి ఈ అణుప్రోద్గత

ప్రళయ వహ్నినుండి పక్షిరాజ్ఞి"

అని తన పద్యాల్లో పశ్చిమ దేశాల్లో పెల్లుబుకుచున్న సమర కాంక్షకు విరుగుడు మందు చూపాడు దాశరథి. ఈ విధంగానే గంగినేని రమణారెడ్డి, నారపరెడ్డి వ్రాసిన శాంతి గీతాలు కూడా పేర్కొనవచ్చు.

**ఇ) నవ సమాజ నిర్మాణము :**

సమాజంలో గూడు కట్టుకుని ఉన్న ఆకలి, దరిద్రత, వ్యాధులు, అసమానత మొదలైనవి తొలగిపోయి, అది వర్గరహిత స్వర్గంగా వెలుగొందాలని అభ్యుదయ కవుల లక్ష్యం. రాయలసీమ, బెంగాలు మొదలైన చోట్ల ఏర్పడిన కరువులచే ఉద్విగ్నులై ఈ కవులు ఎన్నోక్షామగీతాలను, ఆకలి పాటలను రచించారు.

"ఆకలి వేస్తోందమ్మా అన్నం పెట్టమ్మా

స్వర్ణారుణ సస్యశ్యామలమగు

ఈ జగతిని దరిద్రమున ఆకలితో చావలేను"

అని ఆక్రందించు ప్రజల బాధలను తమ లేఖల్లో వ్రాశారు. రాయలసీమలో కలిగిన దుర్భర క్షామమును ఉద్దేశించి.

"గుండెల్లో జీవతైల మెండిపోవ

మండిపోయెరా ఆకలి దివిటీలు

నరాల్లో పరిచిన నెత్తురు తెరల

కత్తిరించెరా కరువు కత్తెరలు"

అని దీనంగా ఆక్రందించారు. సమాజంలో నాటుకుని ఉన్న ఆకలి, దారిద్ర్యం. మొదలైన భయంకర వ్యాధులకు కారణం సమాజ వ్యవస్తే అని వీరు గ్రహించారు. అందువలననే ఆకలి పాటలతో చేతులు దులుపుకోకుండా ప్రస్తుత సాంఘీక వ్యవస్థలో మార్పురావాలని ఆకాంక్షించారు.

రాబోయే సమాజంలో 'శాంతికొరకు యుద్ధమనే స్వార్థపరుల నినాదాలుండవని' రూపాయికి విలువలేని రోజు రేపు వస్తుందని, మతాలకై మరణించు అమాయకులెవరుండబోరని, గతానికై విలపించే మృతభావులు కానరారని' ఆశాసంగీతం ఆలపించారు. భవిష్యత్ సమాజంలో 'ప్రతీవ్యక్తి ముఖంమీద లక్ష ఉదయాలు - మొలుస్తాయని, 'శ్రమకూ, కళకూ ఫలితం సమానంగా లభిస్తుందని బావించారు. 'పెద్దచేప చిన్న చేప తినే న్యాయం ఇకముందు ఉండబోదని,' 'లాఠీలు, మెడబండలు, చెరసాలలు, ఉరికొయ్యలు,' అంతరిస్తాయని జోస్యం చెప్పారు.

"వ్యక్తులు పరిపాలించే శక్తి నశించింది నేడు

రక్తంలో అణువణువూ శక్తి గడించింది నేడు"

అని సమాజంలో కలిగిన పీడిత వర్గ చైతన్యాన్ని అణగద్రొక్కి, పాలక, పాలితబేదం లేని 'వర్గరహిత స్వర్గాన్ని' స్థాపించడానికి గళమునే కాహళగా చేసికొని ప్రభోదించారు.

**ఎఫ్) తెలంగాణా విముక్తి :**

భారతదేశానికి స్వాతంత్ర్యం లభించింది. హైదరాబాదు మాత్రం నైజాం నవాబు ఇనుప పిడికిలిలో బందీయై ఉంది. తెలుగు ప్రజల తీయని మాగాణమగు తెలంగాణా విముక్తి కొరకు అభ్యుదయకవులు గేయాలు, కావ్యాలు రచించారు. తెలంగాణా విముక్తిని తలచుకున్నప్పుడు ప్రప్రథమంగా మన కళ్ళముందు 'కవి సింహం' దాశరథి కనిపిస్తాడు. తెలంగాణాలో పుట్టిపెరిగి ' నా తెలంగాణా కోటి రత్నాల వీణ' అని సగర్వంగా లోకానికి ఎలుగెత్తి వినిపించినవాడు దాశరథి. గట్టుమీద గానం చేయక కడలిలో దూకి తరంగాలకు ఎదురీది కడకు తీరం చేరుకున్న విజయుడు ఇతడు. దాశరథితోపాటు తెలంగాణా విముక్తి కోసం గీతాలు ఆలపించిన కవులలో కాళోజీ, సోమసుందర్, రెంటాల, గంగినేని, కుందుర్తి, రమణారెడ్డి మొదలైనవారు పేర్కొనదగినవారు.

రెంటాల 'తెలంగాణా సమరగీతం' లో పగలేయి నిజాంకోట, ఎగరేయి ఎర్రవుటా' అని, సోమసుందర్ 'ఖబడ్దార్, ఖబడ్దార్ నిజాం పాదుషాహే' (వజ్రాయుధం) అని నైజాంనవాబును ప్రతిఘటించారు. విప్లవోద్యమంలోని వివిధ సంఘటనలకు, కష్టనష్టాలకు, బాధలకు, కన్నీటి గాథలకు, రక్తాన్ని రగిలించు సన్నివేశాలకు ఒకటి, రెండు గీతాలు కాక తెలంగాణాలో నవాబుకు వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు జరిపిన విప్లవోద్యమానికి ఒక సమగ్ర కావ్యాన్ని రచించినవాడు కుందుర్తి. ఈయన 'తెలంగాణ' కవితా ఖండికలో "చారిత్రక పరిణామంలో మరీపాతదైపోయిన ఫ్యూడల్ వ్యవస్థమీద ఒక పెద్ద తిరుగు బాటుగా తెలంగాణా ఉద్యమాన్ని నేను భావించాను" అని పేర్కొన్నాడు.

అలాగే జాతీయోద్యమ కవులు భారతదేశాన్ని భారతమాతగా, ఆంధ్రదేశాన్ని ఆంధ్రమాతగా భావించడం ప్రసిద్ధం. దాశరథిపై గల జాతీయోద్యమ ప్రభావమే అతనిచేత 'నా తెలంగాణా తల్లి' అని పలికించినది. 'నా తెలంగాణాతల్లి కంజాతవల్లి' అని గానం చేయించింది.

దాశరధి జాతీయోద్యమ భావావేశానికి తోడుగా శ్రామికవర్గ చైతన్యాన్ని కూడా మేళవించుకుని రచన సాగించారు. నిజాం రాజును ఉద్దేశించి 'మా నిజాంరాజు జన్మజన్మాల బూజు' అని మహోద్వేగంతో ఎలుగెత్తి చాటాడు.

"చరిత్ర బొంగరం తిరిగి కిరీటాలు నేలకొరిగి

ధరాధిపులు నశిస్తుంటే బరాయినాం నవ్వాబా

పరాక్రమించూ పేవా"

అని ప్రస్తుత సమాజంలో భూస్వామ్య వ్యవస్థ పతనమైన విషయాన్ని ప్రభోదించాడు. 'తెలంగాణమ్మున గడ్డిపోచయును సంధించెన్ కృపాణమ్ము' అని పీడితవర్గంలో కలిగిన విప్లవ చైతన్యాన్ని ప్రకటించాడు.

"చుట్టూ సముద్రం పొంగి

నట్ట నడి గడ్డను మ్రింగి

అంతా ఏకం చేస్తుం

దంతా ఒకటౌతుంది.

అని హైదరాబాదుకు నాలుగు వైపులనుండి ఉవ్వెత్తుగా వస్తున్న ప్రజావిప్లవాన్ని, పీడిత జన చైతన్యాన్ని వ్యంగ్యంగా వ్యక్తం చేశాడు. అలాగే దాశరథితోపాటు తెలంగాణా విముక్తి కోసం గీతాలు ఆలపించిన వారిలో కాళోజీ నారాయణరావు, పొట్లపల్లి రామారావు, ఆట్లూరి అయోధ్య రామకవి పేర్కొనదగినవారు.

**జి) ఆంధ్రరాష్ట్రోద్యమము :**

రాయప్రోలుతో ప్రారంభమైన ఆంధ్రరాష్ట్రోద్యమం అభ్యుదయ కవులను కూడా ఉత్తేజపరుల్ని చేసింది. సోమసుందర్ రెంటాల, దాశరథివంటివారు అనేక రాష్ట్రగీతాల్ని ఆలపించారు. ఆంధ్రరాష్ట్రంకోసం పొట్టి శ్రీరాములు చేసిన ఉపవాసదీక్ష చివరిదశలో ఉండగా విజయవాడలోని అన్ని రాజకీయ పక్షాలు కలసి ఇచ్చిన 'హర్తాల్' పిలుపుచేత ప్రభావితుడైన సోమసుందర్ 'శ్రీరామరక్ష' అనే సుదీర్ఘ గేయాన్ని రచించాడు. అలాగే రెంటాల వ్రాసిన 'ప్రభుత్వం లేని నాలుగు గంటలు' అనే గేయం కూడా ఈ తెగకు చెందినదే. 1953 లో ఆంధ్రరాష్ట్రం అవతరించడంతో అభ్యుదయ కవులు అనేక గేయాలు రచించారు. 'సింధూరంవోలె తెలుగుసీమ నేడు వికసించిందని, మందారంవోలె తెలుగుమాటనేడు వికసించిందని' ఆనందంగా పాడుకున్నారు.

"వేదంలా గోదావరి ప్రవహిస్తుందే చెల్లీ

వెన్నెల వలే కృష్ణవేణి విహరిస్తుందే చెల్లీ"

అని పరవశులై గానం చేశారు. ఇంతటితో తృప్తిపడక విశాలాంధ్ర అవతరణం కొరకు పాటుపడ్డారు.

"పదవోయి తెలుగువాడా

అదే నీ తెలుగు మేడా

సంకెళ్ళులేని నేల

సంతోష చంద్రశాల"

అని తెలుగువారి సముజ్జ్వల భవిష్యత్తును గానం చేశారు.

## 4.6 'అరసం' పభ్యులు కాని అభ్యుదయ కవులు

'అభ్యుదయ రచయితల సంఘం' మార్క్సిజం పునాదిగా ఏర్పడింది. కమ్యూనిస్టు పార్టీతో వీడదీయరాని అనుబంధాన్ని పెంచుకున్నది. ఆర్థిక వ్యత్యాసాలు తొలగిపోవటానికి, వర్గపోరాటం సరైన మార్గం కాదని కొందరు తలచారు. ఇటువంటి కవులు 'అరసం' కు దూరమయ్యారు.

'మాలపల్లి' లో తక్కెళ్ల జగ్గనిధర్మప్రబోధానికి కమ్యూనిస్టు మేనిఫెస్టోను ప్రేరణగా తీసుకున్న ఉన్నవ లక్ష్మీనారాయణగారు అభ్యుదయ రచయితల సంఘానికి వెలుపలే వుండి పోయారు. ఆయన గాంధీజీ ప్రబోధించిన ధర్మ కర్తృత్వ సిద్ధాంతాన్ని, గ్రామస్వరాజ్యాన్ని నమ్మారు.

దువ్వూరి రామిరెడ్డి, ఏటుకూరి వేంకటనరసయ్య, తుమ్మల సీతారామమూర్తి రైతు-కూలీల సంక్షేమాన్ని మనసా వాచా కాంక్షించిన కవులు. వీరు గాంధీజీ పద్ధతిలో అహింసా యుతమైన రీతిలో పోరాటాలు సాగాలని కోరారేగాని అణచివేతకు ప్రతిహింస అనివార్యమని అనలేదు.

నిమ్నజాతుల దీనస్థితికి వగచి, వాళ్లస్థితి మారాలని కోరిన జాషువా (గబ్బిలం) కుసుమ ధర్మన్న (హరిజన శతకము) బోయిభీమన్న (పాలేరు) కూడ గాంధేయమార్గమే శరణ్యమని నమ్మి అభ్యుదయోద్యమంలో చేరలేదు.

తెలుగులో హేతువాదవిప్లవానికి మార్గదర్శకులైన త్రిపురనేని రామస్వామి (సూతపురాణం) కూడ అభ్యుదయోద్యమానికి దూరంగా వుండిపోయాడు.

అభ్యుదయ కవిత్వోద్యమం కమ్యూనిస్టు పార్టీకి బాసటగా ఉండటం ఆ ఉద్యమానికి మేలు చెయ్యలేదు. 1955 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ పరాజయంపాలు కావటంతో ఉద్యమం బలహీనపడింది. కొందరు కవులు, కళాకారులు సినిమారంగాన్ని ఆశ్రయించటంతో ఉద్యమం స్తబ్దతను ఎదుర్కోవలసి వచ్చింది. తర్వాత కాలంలో 'అరసం పునరుద్ధరణ ప్రయత్నాలు జరిగాయి గాని మునుపటి శక్తిని 'అరసం' పొందలేకపోయింది.

## 4.7 ఇతర సాహిత్యప్రక్రియలు : అభ్యుదయ దృక్పథం

అభ్యుదయ కవుల కావ్యాలతోపాటు ఇతర అభ్యుదయ రచయితల కథలు, నవలలు, నాటకాలు, వ్యాసాలు కూడ అభ్యుదయోద్యమానికి పుష్టిని' చేకూర్చాయి.

కొడవటిగంటి కుటుంబరావు, చాగంటిసోమయాజులు, కరుణ కుమార, మా. గోఖలే, శారద, వార్ల చిరంజీవి, చలం గారల కథలు అభ్యుదయోద్యమాభివృద్ధికి తోడ్పడ్డాయి.

కొడవటిగంటి కుటుంబరావు, బొల్లిముంత శివరామకృష్ణ వట్టికోట ఆళ్వారుస్వామి, మహీధర రామమోహనరావు, శారద, వట్టికొండ విశాలాక్షి లక్ష్మీకాంతమోహన్, ఉప్పల లక్ష్మణరావు నవలలు అభ్యుదయ భావవ్యాప్తికి పాటుపడ్డాయి.

సుంకర - వాసిరెడ్డి, ఆచార్య ఆత్రేయ, అనిసెట్టి సుబ్బారావు, పినిశెట్టి శ్రీ రామమూర్తి, నాజర్ నాటకాలు అభ్యుదయ భావ ప్రచారానికి బాగా ఉపయోగపడ్డాయి.

కె.వి. రమణారెడ్డి, శ్రీ శ్రీ, కొడవటిగంటి తమ వ్యాసాలతో అభ్యుదయోద్యమానికి బాసటగా నిలిచారు.

## 4.8 ఉపసంహారం :

అభ్యుదయ కవిత్వం రెండు దశాబ్దాల పాటు (1935-1955) తెలుగు సాహిత్యాన్ని సంపన్నం చేసింది. సంఘం ఏర్పడిన తర్వాత ఒక దశాబ్దం అభ్యుదయ కవిత్వం ఉద్యమవేగాన్ని అందుకొని తెలుగు నేల నాలుగు చెరగులా సాహిత్య వ్యాప్తికి, సామాన్యుని జీవితపు స్థితి గతుల్ని బాగుపరచటంలో ప్రజల్ని చైతన్యవంతుల్ని చెయ్యటానికి కృషి చేసింది. యువ రచయితలకోసం పెదపూడి (గుంటూరు జిల్లా) లో శిక్షణాపాఠశాల నిరహించింది.

సామాన్య ప్రజలు మెచ్చని సాహిత్యం వ్యర్థమనే భావనను అభ్యుదయ కవిత్వం కలిగించింది.

గతమెంత మంచిదైనా రచయితలకు వర్తమానంతోనే పని. సమకాలిక యదార్థ దృశ్యాలను పట్టించుకోని కవి కవి కాదని ప్రజలు తలచసాగారు.

ఆధునికాంధ్ర సాహిత్యంలో అభ్యుదయ కవిత్వయుగం స్వర్ణయుగం. సామాన్యుని కష్టాలను గురించి ఇంతగా పట్టించుకున్న సాహిత్యోద్యమం ఇంతకు ముందులేదు.

**నమూనా ప్రశ్నలు**

1. అభ్యుదయ కవిత్వం ఆరంభ వికాసాలను వివరించండి.
2. 'శ్రీ శ్రీ అభ్యుదయ కవి' అనే అంశాన్ని నిరూపించండి.
3. అభ్యుదయకవిత్వంలో సామాన్యుడు మాన్యుడైన విధాన్ని వివరించండి.
4. అభ్యుదయోద్యమంలో 'ప్రజానాట్యమండలి' ప్రాముఖ్యాన్ని తెల్పండి.
5. సమాజంలో అభ్యుదయ కవులు తెచ్చిన మార్పు ఏమిటి ?
6. అభ్యుదయ కవిత్వంలో శ్రమైక జీవన సౌందర్యాన్ని వర్ణించండి.
7. ఛందస్సు గురించి అభ్యుదయ కవుల వైఖరిని తెల్పండి.
8. తెలంగాణ పోరాటానికి అభ్యుదయ కవిత్వానికి గల సంబంధాన్ని వివరించండి.

**సంప్రదించవలసిన పుస్తకాలు**


1. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయము : ప్రయోగాలు - డా. సి. నారయణరెడ్డి
2. తెలుగు కవితా విప్లవాల స్వరూపం - వెల్చేరు నారాయణరావు
3. ఆధునికాంధ్ర కవితా సమీక్ష - ఆచార్య కాకర్లవేంకటరామ నరసింహం
4. ఆధునిక యుగంలో కవిలోకం - కె.వి.ఆర్.
5. ఆంధ్రప్రదేశ్ దర్శిని - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
6. కల్పన - కవితా సంకలనం
7. మహాప్రస్థానం - శ్రీ శ్రీ
   (చలం - యోగ్యతాపత్రం)
8. సాహిత్యపరిచయం - ఇంద్రగంటి శ్రీకాంతశర్మ
9. సమగ్ర ఆంధ్ర సాహిత్యం - ఆరుద్ర 11,12,13 సంపుటాలు
10. అక్షర తూణీరం - కె.వి. రమణారెడ్డి


డాక్టర్ కడియాల రామమోహన రాయ్

5)

పాఠం - 5

# హేతువాదం - చారిత్రక నేపథ్యం - లక్షణాలు

పాఠ్య నిర్మాణ క్రమం


5.1 హేతువాదం - చారిత్రక నేపథ్యం

5.2 హేతువాదం - నిర్వచనం

5.3 హేతువాదం - లక్షణాలు

5.4 హేతువాద దృక్పథం

5.5 హేతువాదం - ఆవశ్యకత

5.6 హేతువాదం - నీతి

5.7 హేతువాదం - ప్రయోజనాలు

5.8 హేతువాదం - సారూప్యవాదాలు


**లక్ష్యం :**

హేతువాద నిర్వచనాలను, లక్షణాలను చారిత్రక నేపథ్యాన్ని కార్యకారణ సంబంధాన్ని హేతువాద ప్రయోజనాలను తెలుసుకుంటారు.

విశాల విశ్వం అనేక భావోద్యమాలకు నిలయం. ప్రాచీన కాలం నుండి వర్తమానం వరకూ ఎన్నో ఉద్యమాలకు పురిటిగడ్డగా ఈపుడమి నిలిచింది.విజ్ఞాన శాస్త్ర ప్రగతికి పూర్వ కాలంలో భావోద్యమాలు సమాజాన్ని అంతగా ప్రభావితం చేయలేక పోయాయి.కాలక్రమంలో విజ్ఞాన శాస్త్రం అనేక ముందడుగులు వేసింది. దీనితో పాటు ఉద్యమ స్వరూప స్వభావాలలో మౌలికమైన మార్పులు కొట్ట వచ్చినట్లు కనిపించాయి. శాస్త్రీయ అవగాహన లేని భావోద్యమాలు ఏ మేరకు శాస్త్రీయ అవగాహన కలిగి ఉంటాయో అంతమేరకు సమాజం ఫలితాలను పొంద గలుగుతుంది. శాస్త్ర విజ్ఞానమే అన్ని ఉద్యమాలకూ జవం॥ జీవం. వర్తమాన అణుయుగంలో సమాచార విప్లవం ఉవ్వెత్తున లేచిన కెరటంలా పెనుమార్పులకు దారితీసింది. శాస్త్రవిజ్ఞానం ఆలంబనగా మానవుడు తన సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషిస్తూ ముందడుగు వేస్తున్నాడు. శాస్త్ర విజ్ఞానం హేతువుగా నిలిచింది. ఈ ఉద్యమంశాస్త్రీయ విషయ అవగాహనకు॥ జ్ఞాన సముపార్జనకు.. భావ భావవికాసానికి॥సత్యాన్వేషణకు/స్వేచ్ఛాపిపాసకు॥తిరుగులేనిబీజాలువేశాయి.

## 5.1 హేతువాదం - చారిత్రక నేపథ్యం

మనిషిని పశువునీ మౌలికంగా వేరుచేసేది జిజ్ఞాస. మనిషిని జంతువు నుండి వేరు చేసింది ఆలోచన. మనిషి సంచార స్థితినుండి ఒక చోట స్థిరనివాసం ఏర్పరచు కొన్నాక విశ్రాంతి లభించడంతో అతనిలో "తెలుసుకోవాలి" అనే జిజ్ఞాస మొలకెత్తింది. ప్రకృతిలోని రహస్యాలను అర్థం చేసుకొంటే తప్ప తన జీవితం సగమం కాదనీ రహస్యాన్ని తెలుసు కొన్నాడు. ఫలితంగా మూడు నాలుగు వేల సంవత్సరాలకు పూర్వమే ప్రపంచంలోని నాగరిక జాతుల్లో తాత్విక జిజ్ఞాస క్రమంగా ఉన్నత స్థాయికి ఎదిగింది. ఇరవై శతాబ్దాలకు పూర్వం ప్రాచీన భారత్‌లోని దార్శనికులు; గ్రీకు దేశానికి చెందిన అరిస్టాటిల్; సోక్రటీస్; ప్లాటో; చైనాకు చెందిన కన్ ఫ్యూజియస్ మొదలైన తత్వవేత్తలు తాత్విక చింతన చేశారు. కాలక్రమంలో మానవ జీవితాన్ని ప్రభావితం చేసే మతాలు రంగ ప్రవేశం చేయడంతో తాత్విక చింతనకు అవరోధాలు ఏర్పడ్డాయి. అజ్ఞానాన్ని అద్వైతం పేరుతో గ్రంధస్తం చేయడంతో తాత్విక ఆలోచన కుంటు పడింది. వేదాలు; ఖురాన్; బైబిల్ కంటే పరమ ప్రామాణిక

మైనవి లేవని విశ్వసించారు. ఈ వైజ్ఞానిక ప్రతిష్టంభనకు మధ్య యుగానంతరం వచ్చిన జ్ఞాన పునరుజ్జీవ నోద్యమం గండి కొంట్టింది. ఆధునిక నవ నాగరికతకు తిరుగులేని బీజాలను వేసింది.

ఒక విధంగా యూరప్‌లో బయలుదేరిన శాస్త్ర విజ్ఞానం; మత సత్యాలను త్రోసిరాజని హేతువాద చింతన గానీ యూరప్‌కు పరిమితం కాక విశ్వ వ్యాప్తం కావడం ప్రారంభమైంది. కోపర్నికస్; బ్రూనో; గెలీలియో; ఛార్లెస్ డార్విన్ వంటి శాస్త్రవేత్తల అంకురితమైన దీక్ష కృషి నేపథ్యంగా ఆలంబనగా చేసుకొని వర్తమాన కాలంలో హేతువాద ఉద్యమం తీవ్రరూపం దాల్చింది.

## 5.2 హేతువాదం: నిర్వచనం.

మత విషయంలో; రాజ్యం విషయంలో తమ నివేదన (REASON) చెప్పే విధంగా నడుచుకొనే వారిని హేతువాదులుగా పిలవ బడడం 17వ శతాబ్దం నుండి వాడుకలో ఉన్నట్లు జోసఫ్ మకేన్ జీవిత నిఘంటువు పీఠికలో పేర్కొన్నారు. హేతువాదాన్ని నిర్వచించడం అంత సులభమైన విషయం కాదు. కారణం హేతువాదం అనేది ఒక సిద్ధాంతకానీ, ఒక వాదం కానీ కాక పోవడమే. ఆలోచనా విధానం భావ ప్రవంతి. ఆలోచనా విధానం అని అర్థం. ఆలోచనా విధానం అంటే హేతుబద్ధమైన ఆలోచనా విధానమేకానీ; హేతురహిత ఆలోచనా విధానం కాదు. ఆలోచన అజ్ఞాన పై దాడి చేస్తుంది. మూర్ఖత్వాన్ని నిలదీస్తుంది. ప్రశ్నించే ధైర్యాన్ని నూరి పోస్తుంది. ఆ ప్రశ్న ప్రగతికి చైతన్యానికి అంకురంగా నిలుస్తుంది. యుక్తా యుక్త విచక్షణను రగిలిస్తుంది. మనస్సును ఆవరించిన జడత్వాన్ని బద్దలు కొట్టి.. నిస్తేజాన్ని; నిర్వీర్యతను పటాపంచలు చేసి జాగృతి వైపుకు నడిపిస్తుంది. సత్యా సత్యాలను నిర్ధారిస్తూ.. ప్రతి విషయాన్నీ ప్రశ్నిస్తూ.. అజ్ఞానాన్ని చీల్చి చెండాడుతూ.. శాస్త్ర బద్ధమైన నిర్ణయం వైపుకు నడిపించేదే హేతువాదం.

“అభిప్రాయాలను ఏర్పరచుకోవడంలో గానీ; ఆచరణ వైపుకు చిత్తశుద్ధితో ప్రయాణించడానికి గానీ; హేతువును ప్రమాణంగా స్వీకరించే సూత్రాన్ని హేతువాదము” అనవచ్చునని జోసఫ్ మాకబ్ తెలిపారు. “హేతువును జ్ఞానానికి మూలంగానూ; పరీక్షా సాధనంగానూ; పరిగణించే తాత్విక దృక్పథాన్ని హేతువాదం అంటారని” ఆంగ్ల విజ్ఞాన సర్వస్వంలో పేర్కొన బడింది. “హేతువు యొక్క సర్వాధిక్యాన్ని నిర్నిబంధంగా ఆమోదిస్తూ.. అన్ని రకాల అహేతుక భావాలను.. ప్రమాణాలనూ నిరాకరించి ప్రయోగం ద్వారా మాత్రమే నిరూపణ చేసుకోవడానికి వీలైన జీవన తత్వాన్ని నీతి శాస్త్రాన్ని నిర్మించుకోవడమే లక్ష్యంగా గల మానసిక వైఖరిని హేతువాదం అంటారని ఇంగ్లాండ్ లోని రేషనలిస్ట్ ప్రెస్ అసోసియేషన్ నివేదికలో పేర్కొనబడింది.

1899 లో ఇంగ్లాండ్ లోని ప్రముఖ హేతువాదులు రూపొందించిన ఈ నిర్వచనం అర్థవంతంగా; అభ్యుదయ కరంగా ఉంది. ప్రపంచంలోని అన్ని నాస్తిక; హేతువాద సంఘాలు ఈ నిర్వచనానికి ఆమోద ముద్ర వేశాయి. జ్ఞాన సముపార్జనకు; హేతువాదం ఒక సాధనం; బలమైన ఆయుధం. జీవన తత్వాన్ని; నీతి శాస్త్రాన్ని అవగతం చేసుకోవడానికి మహత్తరమైన మార్గం. మానవునికి జ్ఞానం వికసించే కొద్దీ అజ్ఞానాన్ని అన్వయించగల క్షేత్ర వైశాల్యం కూడా పెరుగుతుంది. తద్వారా మానవుని నైతిక ప్రవర్తన.. జీవన స్రవంతిలో ఊహించని మంచి మార్పులు చోటు చేసుకొంటాయి. “అసత్యాలను చీదరించు కోవడమే హేతువాదానికి మూలం” అని రాబర్ట్ సన్ అనే శాస్త్రవేత్త చెప్పాడు. మానవ మస్తిష్కంలో నిరంతరం ఆలోచనల మథనం జరుగుతుంది. సారంగా ప్రశ్నించే తత్వం అలవడుతుంది. ప్రతి విషయంపై ప్రశ్నలను సంధిస్తూ ఉంటాడు. తద్వారా శాస్త్ర బద్ధమైన సత్యాన్ని అవగతం చేసుకొంటూ పాతను త్రోసిరాజంటూ.. కొత్తను స్వాగతిస్తూ ముందడుగు వేస్తూ ఉంటాడు. మతం పురాతన సత్యాలను వదులుకోవడానికి ససేమిరా అంగీకరించిక.. కొత్తదనాన్ని నిరోధించడానికి ప్రయత్నిస్తుంది. దీనితో రెండింటి మధ్యా పోరాటం జరుగుతుంది. మతాలను నిరాకరించడమే హేతువాదం తొలి మెట్టు.

హేతువాద విజ్ఞాన సర్వస్వంలో “మతానికీ, మతాచారాలకు సంబంధించిన జ్ఞానం ద్వారా.. ప్రమాణం ద్వారా.. సంప్రదాయం ద్వారా ఉద్వేగం ద్వారా వాద సాక్ష్యాధారాలను విశ్లేషించి.. పరీక్షించడం ద్వారా మాత్రమే పరిష్కరించబడాలనే సూత్రాన్ని హేతువాదం అంటారని” నిర్వచించబడింది. “దేవుని నిరాకరించి.. నాగరికతను నిర్మాణం చేయగల మానవుడి సామర్థ్యాన్ని.. విధిని.. మాత్రమే హేతువాదంగా

పేర్కొన వచ్చునని" ఛార్లెస్ వాట్స్ నిర్వచించారు. హేతువాదం పై వెలువడిన నిర్వచనాలను పరిశీలనాత్మకంగా విశ్లేషిస్తే ఈ క్రింది అంశాలను హేతువాద ధర్మాలుగా పేర్కొనవచ్చు.

ఎ) ప్రాధమికంగానూ; ప్రధానం గానూ హేతువు యొక్క ఆధిక్యతను ఏ మినహాయింపులూ లేకుండా అంగీకరించడం.

బి) ఆహేతుకభావాలను: ప్రమాణాలను నిరాకరించడం ద్వారా మతం; కులం; దైవం మొదలుగా గల సంప్రదాయ భావాలను; మూఢ విశ్వాసాలనూ ఖండించడం.

సి) హేతువాదాన్ని జీవన తత్వంగా భావించడం.

డి) హేతువాదం ద్వారా నీతి శాస్త్రాన్ని నిర్మించుకోవడం.

ఇ) హేతువాదం ద్వారా మానవతా విలువలకు ప్రాధ్యానం ఇవ్వడం.

హేతువాద నిర్వచనాలను ధర్మాలను విశ్లేషిస్తే హేతువాదం అనేది జ్ఞాన సాధన విధానమే గానీ సిద్ధాంతం కాదని తెలుసుకోవాలి. కేవలం అది కేవలం తర్కమో, గతి తర్కమో కాక మానవ తత్వంలోని బలాన్ని; బలహీనతలను పరిగణనలోనికి తీసుకొని అతని శ్రేయస్సు దృష్ట్యా ఒక జీవన తత్వాన్ని సాధించడానికి సాధనంగా మాత్రమే హేతువాదాన్ని పరిగణించాయి. హేతువును భౌతిక ప్రపంచానికి అన్వయిస్తే భౌతిక వాదం; దేవునికి అన్వయిస్తే నాస్తిక వాదం; మానవ జాతికి అన్వయిస్తే మానవతావాదంగా రూపాంతరం చెందుతాయి. వస్తు తత్వాన్ని వస్తుసారాన్ని వడపోసి నిగ్గు తేల్చుకోవడానికి హేతువాదం ఉపయోగపడుతుంది. హేతువాదాన్ని నాస్తిక వాదం గానో భౌతిక వాదం గానో; మానవ వాదంగానో పరిగణించడానికి వీలులేదు.

## 5.3 హేతువాదం - లక్షణాలు

సాధారణంగా సందేహించడం ప్రశ్నించడం, పరిశోధించడం: పరిశీలించడం; నిర్ణయించడం అనేవి హేతువాద లక్షణాలుగా పేర్కొనడం జరుగుతుంది. ఏదైన ఒక సంఘటన జరిగినప్పుడు ఆ సంఘటనకు సంబంధించిన కారణాలను కార్య కారణాత్మక రూపంలో పరిశీలిస్తాము. ఆసంఘటన గూర్చి ఆలోచిస్తాము. ఆ సంఘటన ద్వారా జ్ఞాన సముపార్జన చేస్తాము. ఆ సంఘటన తాలూకు భావాలను మెదడు ఉత్పత్తి చేస్తుంది. కావున ఒక సంఘటన సమగ్ర స్వరూపాన్ని దర్శించడానికి ఈ నియమాలన్నీ మన అవగాహన లోనికి వస్తాయి. ఈ విధంగా మన అవగాహనలోనికి వచ్చిన విషయాలను హేతువాద లక్షణాలుగా పేర్కొనవచ్చు. "కార్యకారణ నియమాన్ని గ్రహించుట, ఆలోచించుట అన్ని ఆధారాల ప్రాతిపదికలో ఊహించుట పొందిన జ్ఞానాన్ని భద్రపరచుకొని అవసరమైనప్పుడు వినియోగించుకొనుట మొదలైనవి హేతువాద లక్షణాలని" "హేతువాదం అంటే" అనే గ్రంధంలో వివరించబడింది. నియమబద్ధమైన ప్రశ్నల నుండి ఆవిర్భవించడం చేత పుట్టుకతోనే మానవుడు హేతువాది. హేతువాదం మానవునిలోని హేతుత్వంపై ఆధారపడి ఉంటుంది. హేతుత్వం మానవుని జ్ఞాన స్థాయి మీద ఆధారపడి పనిచేస్తుంది. జ్ఞాన సముపార్జనే హేతుత్వ ప్రధాన లక్షణం. మొదడు పరిసరాలను గ్రహిస్తుంది. ఆలోచిస్తుంది. భావాలను ఉత్పత్తి చేస్తుంది. ఆవిధంగా పుట్టిన భావాలను ఒక క్రమ పద్ధతిలో అర్ధం చేసుకోవాలి. భావాల క్రమత్వమే ఆలోచనా క్రమత్వం. హేతువాద ఉద్యమం అనేది భావ ఉద్యమం. హేతువాద లక్షణాలను పరిశీలించే సమయంలో భావాల ప్రాధాన్యతను కూడా పరిగణనలోనికి తీసుకోవాలి. పై పరిశీలన వలన ఈ క్రింది అంశాలను హేతువాద లక్షణాలుగా పేర్కొనవచ్చు.

ఎ) కార్యకారణ నియమాన్ని గ్రహించడం.

బి) ఆలోచించడం.

సి) జ్ఞాన సముపార్జన చేయడం.

డి) భావాల ప్రాముఖ్యతను గుర్తించడం.

ఇ) లక్షణాల ప్రాతి పదికతో హేతుత్వ వికాసం జరుగుతుంది.

ఎ. కార్యకారణ క్రమం: ప్రపంచంలో ప్రతి క్షణం జరిగే సంఘటనలతో కాల ప్రవాహం కదిలి పోతుంది. ఒక క్రమంలో సంఘటనలు పూర్వ సంఘటనను కారణమనీ; ఉత్తర సంఘటనను కార్యమనీ అంటారు. అయితే కారణాలు అనేకంగా ఉంటాయి. కార్యంమాత్రం ఒక్కటిగానే ఉంటుంది. ప్రాథమిక కారణం మాత్రం వస్తుగతంగానే ఉంటుంది. దీనినే అంతర్గత కారణం అంటారు. అంతర్గత కారణం లేకుండా ఏ వస్తువులోనూ మార్పురాదు. అంటే కార్యం జరగడానికి వీలులేదు. వీటికి ప్రేరణ కలిగించే బాహ్యమైన కారణాలు అనేకం ఉండవచ్చు. వీటినే ప్రేరకాలు లేదా దోహద కారణాలు అని అంటారు.

ప్రకృతి అంతా కార్యకారణ మయం. కార్యము కారణమూ అనేవి ఒక వస్తువు యొక్క స్థితిగతి భేదాలను బట్టి ఉంటాయి. ఉదాహరణకు నీటిని చల్లబరిస్తే మంచుగడ్డగా మారుతుంది. మంచుగడ్డకు కారణం నీరు. మంచుగడ్డను వేడి చేస్తే తిరిగి నీరుగా మారుతుంది. ఇక్కడ నీటికి మంచుగడ్డ కారణం. ఈ ఉదాహరణలో ఒకే వస్తువు ఒక సందర్భంలో కారణంగానూ; మరొక సందర్భంలో కార్యం గానూ ఉంటుంది. ప్రకృతిలో ఉన్న సమస్త వస్తుజాలాన్ని, సంఘటనలు, సందర్భాలను, ఒక దానికొకటి కారణంగానూ; కార్యంగానూ చూపించవచ్చు. కావున కారణత అనేది సృష్టి నిర్మాణంలో అంతర్గతంగా ఉన్న భౌతిక సంబంధమే. ఒక వస్తువు ఒక దశనుండి మరొక దశకు చేరే అంతర్గత పరిణామాన్ని కార్యకారణ క్రమం అంటాము. అది కాలానికి సంబంధించిన పదార్థ ప్రవృత్తి వంటిది. ఉనికి-పరిణామంలో పరిపూర్ణత సాధిస్తుంది. అందు వలన ఉన్న ప్రతి వస్తువు యొక్క ప్రధాన లక్షణము కారణత. ప్రకృతి ఒక కార్యకారణ చక్రము. ఎందుకంటే అది పరిణామ క్రమంలో ఉంది" అని యం.యన్. రాంయ్ పేర్కొన్నారు.

బి. ఆలోచన: ఆలోచనలకు వ్యక్తి కేంద్ర బిందువు, పరిసరాలను గుర్తించగలిగిన స్పృహ ఉన్నప్పుడు మాత్రమే ఆలోచన ప్రారంభమౌతుంది. ఆ స్పృహ లేనప్పుడు ఆలోచనకు తావుండదు. మెదడు పరిసరాలకు స్పందిస్తుంది. అంటే పరిసరాల మధ్య ఉన్న సంబంధాలన్నీ కూడా నియమ బద్ధంగానే ఉంటాయి. అందువలన మన ఆలోచన కూడా నియమ బద్ధమైనదే. ఈ నియమబద్ధమైన ఆలోచననే హేతుత్వం అనవచ్చు. కావున ఆ నియమబద్ధమైన ఆలోచనలలోని క్రమత్వం హేతువాది వికాసానికీ, ప్రతిగా హేతుత్వం ఆలోచనలలోని క్రమత్వానికి దోహదకారి అవుతుంది. కావున ఆలోచనా స్థాయి పెరిగితే హేతుత్వ స్థాయి పెరిగినట్లే అవుతుంది. తదనుగుణంగా జీవన స్థాయి కూడా పెరుగుతుంది. ఉదాహరణకు జంతువులకు ఆలోచనా స్థాయి తక్కువ. కాబట్టి లక్షలాది సంవత్సరాలుగా వాటి జీవన పరిస్థితుల్లో అంతగా మార్పు చోటు చేసుకోలేదు. ఆధునిక మానవునిలో సృజనాత్మక శక్తి పుష్కలంగా ఉంది. ఆటవిక అనాగరిక దశలోని మానవునికీ ఆధునిక మానవునికీ ఎంతో వ్యత్యాసం ఉంది. ఆనాడు పచ్చి మాంసాన్ని పీక్కుతిన్న మానవుడు ఈనాడు రుచి కరంగా వండుకొని తింటున్నాడు. ఆనాడు కొండ గుహల్లో చీకటిలో మగ్గిన మనిషి నేడు అన్ని వసతులతో ఇళ్లను నిర్మించు కొంటున్నాడు. అంతేకాదు భాషలో, భావంలో, ఆరోగ్యంలో, ఆలోచనలతో పాటు తన దైనందిన జీవితానికి సంబంధించిన సమస్త విషయాలను ఆలోచనతో సుఖమయం చేసుకొంటున్నాడు.

సి. జ్ఞాన సముపార్జన: స్పృహ యొక్క పై స్థాయిని జ్ఞానం, వేదాగృతి అంటారు. గృతి వలన కలిగేది జ్ఞానం. జ్ఞాన సముపార్జనకు మూలం మెదడు. మెదడుతో పాటు జ్ఞాన సముపార్జనలో పంచేంద్రియాలు కూడా ప్రధాన పాత్ర పోషిస్తాయి.

జ్ఞానం ఎలా సంపాదించగలం? జ్ఞాన సముపార్జనకు మార్గాలు ఏవి అనే ప్రశ్నలు వచ్చినప్పుడు మనం ఈ ప్రకృతి నుండి జ్ఞానాన్ని పొందుతున్నాము అని చెప్పుకోవాలి. ప్రకృతి నియమబద్ధమైనది. ఈ విశాల విశ్వం నియమబద్ధమైనది. కాబట్టి ప్రతి రోజా సూర్యుడు తూర్పున ఉదయిస్తున్నాడు, పడమర అస్తమిస్తున్నాడు అని చెప్పగలుగుతున్నాం. ఈ ప్రకృతి అంతా కొన్ని నియమాలతో నడుస్తుంది. కాబట్టి దానిని మనం అర్థం చేసుకోగలుగుతున్నాము. ప్రకృతిలో ధర్మాలు స్పష్టంగా ఉన్నాయి కాబట్టే ఇది ఇలా ఉంటుంది.... ఇది ఇలా జరుగుతుంది అని దానికి సంబంధించిన జ్ఞానాన్ని సంపాదించగలుగుతున్నాం.

సూర్యుడు చుట్టూ భూమి, భూమి చుట్టూ చంద్రుడు తిరుగుతున్నాడు. ఇదంతా ప్రతినిత్యం ఒక క్రమ పద్ధతిలో జరుగుతుంది. "ఇలా జరుగుతున్న క్రమం యొక్క ముద్ర మన మనసుల మీద పడడం వల్లనే ఆయా వస్తువులనూ వాటి మధ్య ఉన్న సంబంధం

భాండాగారాలన్నీ మనం గ్రహించగలుగుతున్నాము. ఈ విధంగా గ్రహించిన విషయ సంపదనే జ్ఞానం అంటున్నాం". అని యం. యన్. రాంకు తెలిపారు. ప్రశ్నల యొక్క ధర్మం క్రమరహితమైతే దానిని గురించిన మనకు తెలియదు. అంతు చిక్కని సమస్యలాగా మిగిలిపోతుంది. ఈ సృష్టి మొత్తం హేతుబద్ధంగా నియమబద్ధంగా నడుస్తుంది కాబట్టి గ్రహణం ఎప్పుడు పడుతుందో అమావాస్య పౌర్ణమి ఎప్పుడు వస్తుందో తుఫానులు ఎప్పుడు పుడతాయో ముందుగానే చెప్పగలుగుతున్నాం. కావున ప్రకృతికి సంబంధించిన జ్ఞానం మనకు ఎంత మేరకు ఉంటే అంతమేరకు దాని లోతులను నిజాలను మనం గుర్తించగలమనేది గమనార్హం. వస్తువు లేదా పదార్థంలో ఉన్న దానిని వాస్తవికత అంటాము. ఈ వాస్తవికత మనకు ఎంతమేరకు తెలుస్తుందో అంత సత్యాన్ని మనం తెలుసుకొన్నట్లు లెక్క. సత్యం మనకు బోధపడితే హేతువును మనం అర్థం చేసుకొన్నట్లు అవుతుంది. జ్ఞానం సత్యాన్వేషణకు దోహదం చేస్తుంది. జ్ఞానం ద్వారా ధారణ పెరుగుతుంది. జ్ఞానం అజ్ఞానాన్ని చీల్చి విజ్ఞాన జ్యోతులను వెలిగిస్తుంది.

డి. భావాలు: మనచుట్టూ ఉన్న సమాజం పరిస్థితులు భావ ప్రేరణకు ప్రేరణగా నిలుస్తాయి. అసలు ప్రేరణగా స్పందన అనేది లేకపోతే భావం పుట్టదు. సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలతో పాటు మానవుని భావ వికాసానికి స్వేచ్ఛ అనేదే మూలంగా కన్పిస్తుంది. హేతుత్వ ప్రాతిపదికతో, పంచేంద్రియాల ఆధారంతో చుట్టూ ఉన్న ప్రపంచ స్థితిగతులను ప్రకృతిలోని నియమ నిబద్ధతను మెదడు గ్రహించి భావాలను ఉత్పత్తి చేస్తుంది. పరిసరాలను గురించిన జ్ఞానం మన అనుభూతిలోకి రాకపోతే భావాలు ఉత్పన్నం కావడం అసాధ్యం. కాబట్టి భావాలకు భౌతికమైన పునాది అవసరం. అంత మాత్రాన ప్రతి భావనకు భౌతికమే పునాది కానవసరం లేదు. ఒక్కొక్క పర్యాయం అనేక భావాల కలయిక వలన సృజనాత్మకమైన నూతన భావం ఆవిర్భవించడం కూడా జరుగుతుంది. ఒకసారి భావాలు ఏర్పడిన తరువాత స్వయం నియమబద్ధమై అవి తమంతతాము మనగలుగుతాయని యం.యన్. రాంకు పేర్కొన్నారు. ఆ భావాలను భాషలోనికి మార్చినప్పుడు అవి వస్తువుల లాగా మనగలుగుతాయి. అప్పుడు వస్తువు ఎంత సత్యమో భావం కూడా అంతే సత్యమౌతుంది. వస్తువులు; వ్యక్తులు అశాశ్వతాలు అవి నశిస్తాయి. భావం శాశ్వతమైనది అది నశించదు. చార్వాకులు నశించినా చార్వాకుల భావాలుకు మరణం లేదు. బౌద్ధులు గతించినా వారి భావాలు గతించలేదు.

హేతుత్వం కారణంగానే మానవుడు పరిసరాలను అర్థం చేసుకున్నాడు. తద్వారా భావ జాలాన్ని సృష్టిస్తున్నాడు. భావం ముందుకు పోకపోతే చరిత్ర ముందుకు పోదు. భావాలకు అడ్డుగోడ నిలిస్తే హేతువు ప్రయాణానికి ఆటంకం కలిగినట్లే. భావానికి పెద్ద పీట వేస్తున్నామంటే హేతువాదానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు అర్థం. భావం-హేతువు ఒక దానితో ఒకటి పెనవేసుకొని జంటగా పురోగమిస్తాయి. కార్యకారణ సంబంధం; ఆలోచన; జ్ఞాన సముపార్జన భావాలు లేకుండా హేతు వికాసం మానవునిలో అభివృద్ధి చెందడం అసాధ్యం.

## 5.4 హేతువాద దృక్పథం

హేతువాద దృక్పథం సహేతుకమైన ఆలోచనా విదానాన్ని అభివృద్ధి చేస్తుంది. సహేతుకంగా ఆలోచించడం అంటే స్వేచ్ఛగా ఆలోచించడం అని అర్థం. అంతర్గత శక్తులన్నింటినీ వికసింప చేసుకోవడమే స్వేచ్ఛ. తన అస్తిత్వ సూత్రాల ప్రకారం నిజమైన మానవ స్వభావాన్ని నెరవేర్చుకోవడమే స్వేచ్ఛ. కావున స్వేచ్ఛగా ఆలోచించడం అంటే వాస్తవ జగత్తుకు దూరంగా కేవలం ఊహా జగత్తులో అల్లుకొనిపోవడం కాదు. సమర్థవంతమైన శాస్త్రజ్ఞానం యొక్క ఆలంబన లేని రోజుల్లో తాత్వికులు స్వేచ్ఛకు తిరుగులేని పునాదులు వేశారు. ఈ విశాల విశ్వం, సృష్టి ఏమిటి? అది ఎలా ఆవిర్భవించింది? మనిషి ఎవరు? అతని జననం ఎలా జరిగింది? ఆత్మ ఏమిటి? శాశ్వతం ఏమిటి? ఈ సృష్టికి మూల కర్త ఎవరు ఇలా ఎన్నో ప్రశ్నలు శరసంధానంగా వేసుకొన్నారు. ప్రకృతికి మూల విరాట్టుగా భావించబడిన దైవాన్ని కూడా భౌతిక వస్తువుగానే ఊహించుకొన్నారు. గడిచిన మూడు నాలుగు శతాబ్దాలుగా ఆధునిక విజ్ఞానం అభివృద్ధి చెంద సాగింది. యంత్రాల ఆవిర్భావంతో సాంకేతిక విజ్ఞానం సిద్ధాంత భాగమైన శాస్త్రీయ విజ్ఞానానికి అండదండగా నిలిచింది. సిద్ధాంత భాగం ప్రతిపాదించే సూత్రాలను సాంకేతిక విజ్ఞానం ద్వారా ప్రయోగాలు చేసి వాటి సత్యా సత్యాలను నిర్ధారించడానికి అవకాశం లభిస్తుంది. అందువలన ఆధునిక విజ్ఞానం రోజు రోజుకూ సత్యాన్ని విస్తృతం చేసుకొంటూ పోతున్నది. ఈ విజ్ఞానం ప్రకృతి గురించి అందులోని మానవుణ్ణి గురించి సమాజిన్ని గురించి కూడా కావడం వల్ల దానిని ఆధారం చేసుకొని హేతువాదం సమగ్రమైన జీవన తత్వాన్ని ఏర్పటు చేసుకొంటూపోవాలని నిర్దేశిస్తుంది.

స్వేచ్ఛగా ఆలోచించడం అంటే మత గ్రంధాలను; ప్రవక్తలను; ప్రసిద్ధ గ్రంధాలను ప్రఖ్యాత మేధావులను ప్రమాణంగా తీసుకొని వారి ఉవాచల మీద ఆధారపడటం కాకుండా ఆధునిక విజ్ఞాన శాస్త్రీయ దృక్పధంతో ఆలోచించడమని అర్ధం. దానిని మానవ జీవితానికి అన్వయించడంలోనూ; సత్య నిర్ధారణకు సమన్వియించడంలోనూ సహేతుక పద్ధతిని అనుసరిస్తే మనం మానవ వాద బద్ధమైన జీవన తత్వానికి ముగింపు వేసుకోగలుగుతాము. "ఆలోచనా స్వాతంత్ర్యం, అభిప్రాయ ప్రకటనా స్వాతంత్ర్యం మానవాభ్యుదయానికీ అత్యావశ్యకం. అందుచేత హేతువాదం వాటి కోసం పోరాడుతుంది. శాస్త్ర ప్రగతికి విజ్ఞాన సాధనకూ ఫలితంగా హేతువాద వైఖరి వచ్చింది. సమగ్రమైన సామరస్య పూర్వకమైన జీవన విధానం కోసం అది పాటు పడుతుంది. మానవుని ఆలోచనా విధానం మానవుని ఇతరేతర శక్తులన్నింట కంటె బలమైనది హేతువుకు వాస్తవికాంశాలతో నిమిత్తం లేదనడం పొరపాటు. అది సమస్త మానవుల జీవితాలతోనూ సంబంధం కలిగి ఉంటుంది. వైయుక్తిక సామాజిక జీవితంలోని సమస్యలన్నింటికీ హేతుబద్ధమైన మార్గాన్ని చూపడమే దాని పని. ప్రజా జీవితంలో దాని కర్తవ్యం ఎంతో ఎక్కువగా ఉంది.

సత్యాన్ని వెలువరించడం; భ్రమలను తొలిగించడం, ద్వేషాన్ని నిర్మూలించడం; మానవ హృదయాలను వికసింప చేయడం దాని కార్యాకలాపాలు. మానవ ఉద్వేగాలను అది తిరస్కరించదు. ఉద్వేగాలూ ప్రేరణలు మానవ కృషిలో ప్రధాన భాగంగా ఉంటాయి. మనిషిలో ఉండే భావోద్వేగం మత మౌఢ్యానికో, మరొక రకమైన మౌఢ్యానికో, అంకితం కావడానికి అది సుతరామూ అంగీకరించదు. మనిషి చర్యలు, లక్ష్యాలూ, ఆదర్శాలు అన్నీ ఈ జీవితం వాస్తవం అనే అంశాన్ని గుర్తించే విధంగా ప్రవర్తిస్తుంది. సత్యం, సహనం, న్యాయం, మానవత్వం అనే అంశాల పట్ల తన దృక్పధాన్ని స్పష్టంగా తేట తెల్లం చేస్తుంది. కాబట్టే హేతువాదం శాస్త్ర పునాదుల మీద ఆధారపడుతుంది. శాస్త్రీయ విధానం.. శాస్త్రీయ ఆలోచన.. శాస్త్రయ అవగాహనతో హేతువాద దృక్పధం ముడి పడి ఉంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తూ, సేకరించిన సమాచారం ద్వారా మానవ స్వభావాన్ని అతని యొక్క ప్రకృతి సిద్ధమైన సామాజిక పరిసరాలనూ క్రమబద్ధంగా అర్ధం చేసుకోవడం శాస్త్రీయ విధానం. పరిశీలన, నిశితమైన, ఆలోచన క్రమబద్ధత, కొత్త విషయాలను తెలుసుకోవాలనే ఆసక్తి, సృజనాత్మకతలకు అనుగుణంగా శాస్త్రీయ అవగాహన ఉంటుందని యం.యన్. రాంకు పేర్కొన్నారు.

సమాజంలో శాస్త్రీయ అవగాహన పెంచడం ద్వారా ప్రజలు హేతుబద్ధంగా ఆలోచించ గలుగుతారు. తద్వారా అసమానతలు లేని ప్రజాస్వామ్య బద్ధమైన; మతాతీతమైన ప్రాపంచిక దృక్పధం అలవరచుకొంటారని భారతీయ మేధావులు అభిప్రాయ పడ్డారు. దీనిమూలంగా శాస్త్రం మతాన్ని ఎట్టి పరిస్థితులలోనూ అంగీకరించదని తేటతెల్లమౌతుంది. హేతువాద దృక్పధం శాస్త్రీయంగా ఉంటుంది. కాబట్టి హేతువాదం కూడా మతాన్ని నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తుంది. ఈ సృష్టి మొత్తం కార్యకారణ సంబంధంతో ఉంటుంది. ఒకే వస్తువు కార్యంగానూ కారణంగానూ మారుతూ ఉంటుంది. పదార్ధాన్ని గానీ, శక్తినిగానీ సృష్టించలేము, నాశనమూ చేయలేము. అవి రెండూ ఒక దానికొకటి కార్యకారణాలు. అందువలన శూన్యం నుండి ప్రపంచం ఆవిర్భవించడానికి అవకాశం లేదు. శూన్యం నుండి జగత్తు వస్తే జగత్తు నుండి శూన్యం రావాలి. విశ్వానికి దైవం కారణమైతే దైవానికి విశ్వం కారణం కావాలి. "సైన్సు సత్యాన్ని శోధిస్తుంది. శోధించి నిర్ణయించిన సత్యాల్లో దేవుడు లేడు" అని రావిపూడి వెంకటాద్రి 'శాస్త్రం మతం' అనే గ్రంధంలో పేర్కొన్నారు. అందువలన సృష్టి భావమే తప్పు. విశ్వం సృష్టించ బడలేదు. విశ్వం ఉనికి శ్వాశతం అనిపిస్తుంది. దాని పరిణామం శాశ్వతమని అర్ధమౌతుంది. కాబట్టి పరిణామంలో ఉన్న విశ్వం శాశ్వతం. విశ్వం శాశ్వతం కాబట్టి దానిని గురించి చర్చించే సమయంలో దైవం యొక్క ప్రసక్తి రాదు. హేతువాద దృక్పధం మత నిరాకరణతో పాటు దైవ భావాన్ని తార్కికంగా అసంబద్ధమని తేల్చి వేస్తుంది.

విజ్ఞాన శాస్త్రం ఏది ఏలా ఉన్నదో వివరించగలుగుతుంది, తప్ప అది అలాగే ఎందుకున్నదో చెప్పజాలదని మత వాదుల కోణంనుండి ఒక అభ్యంతరం ఉంది. అది సమంజసమైనది కాదు. సంఘటనలు ఎందుకు జరుగుతున్నావో శాస్త్రం స్పష్టంగా వివరించగలుగుతుంది. ఒక్కొక్కసారి చంద్రుడికి గ్రహణం ఎందుకు పడుతుందని ప్రశ్నిస్తే ఆయా సమయాలలో చంద్రుడు భూమి నీడలోకి ప్రవేశించడమని సమాధానం వస్తుంది. చంద్రుడు ఎందుకు అలా ప్రవర్తిస్తాడు అని ప్రశ్నిస్తే గురుత్వాకర్షణ సిద్ధాంతం అని సమాధానం చెబుతుంది. ఆ సిద్ధాంతం చెప్పినట్లు గానే వస్తువులు ఎందుకు ప్రవర్తిస్తాయని ప్రశ్నిస్తే దానికి సామాన్య సాపేక్ష సిద్ధాంతం సమాధానం చెబుతుంది. ప్రశ్న జవాబు పద్ధతిలో శాస్త్రం అభివృద్ధి చెందుతుంది. శాస్త్రీయ విజ్ఞానంతో మన ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పుకొంటూ పోవడమే హేతువాద

మార్గం. అంతే కాదు మన విశ్వాసాలన్నింటినీ శాస్త్రీయంగా పరిశీలించి అందలి అహేతుక భావాలను ప్రయోగాలను నిరాకరిస్తుంది. ఉదాహరణకు మన విశ్వాసాలు, దైవ, మతం, కులం, జ్యోతిష్య ఖగోళ విజ్ఞానం, మంత్రాలు, తంత్రాలు, హస్త సాముద్రికం, చేతబడులు, పూనకాలూ, గ్రహణాలు వంటి వానిని హేతువాదం నిర్ద్వంద్వంగా ఖండిస్తుంది. హేతువాదం నేరుగా లౌకిక మార్గాను- సరణకు దారితీస్తుంది. "హేతువాదం ప్రకారం ఈ ప్రపంచం ఉంది. ఆత్మ పరమాత్మ లనబడేవి భావదోషం వల్ల పర్యవసించిన భాషా దోషాలు. అతీంద్రియ శక్తులు అనేవి లేవు. శక్తులన్నీ భౌతికాలే, అభౌతిక శక్తులు ఉండడానికి వీలులేదు. పూనకాల్లో కొన్ని దైహిక ప్రకోపాలే. అధిక భాగం కృతకాలు, మతాలను అనుసరించడం అజ్ఞానం. కులాలను పాటించడం హేయం. జ్యోతిష్యాన్ని, ఖగోళ విజ్ఞానాన్ని ఒకే గాటిన కట్టి వేయడం అజ్ఞానం అని పీటర్ ఏంగెల్స్ తెలిపారు. కావున హేతువాద దృక్పథం శాస్త్రీయ అవగాహనతోనూ, శాస్త్రీయ విజ్ఞానం హేతువాద దృక్పథంతోనూ పరస్పరం సమ్మిళితమై ప్రతి అంశం యొక్క సత్యపరిధిని విస్తృతం చేసుకొంటూ పోతాము. హేతువు యొక్క ఆధిక్యతను అంగీకరించడం శాస్త్రీయ విజ్ఞానాన్ని కలిగి ఉండడం, కార్యకారణ క్రమాన్ని శాస్త్రీయంగా విశ్లేషించడం, సత్యాన్వేషణ, స్వేచ్ఛా పిపాస, జ్ఞాన సముపార్జనలతో మానవ జీవన తత్వ మార్గాన్ని నిర్ణయించుకోవడం జరుగుతుంది. మతం, దైవం, కులం మొదలైన మూఢ విశ్వాసాలతో బాటు సంప్రదాయ బద్ధమైన ఆచార వ్యవహారాలలోని అహేతుకతను తొలగించడం కూడా జరుగుతుంది. హేతువాద మార్గానుసరణ మానవునికి అవసరమా? అని ప్రశ్నించు కొంటే తప్పనిసరి అని సమాధానం వస్తుంది.

## 5.5 హేతువాదం ఆవశ్యకత:

ఆలోచన వివేచనలకు కేంద్ర బిందువు మానవుడు. ఆ మానవుడు వస్తుతః హేతువాది. మనస్సు ప్రకృతి పరమైన సంఘటనకు ప్రతి స్పందిస్తుంది. ప్రకృతి పరమైన సంఘటనలకు స్పందనకు మనసుయొక్క పరిధి క్రమంగా ప్రకృతి మొత్తాన్ని కౌగిలించుకొంటుంది. అది నియమ బద్ధ విధానాన్ని గురించిన చైతన్యం కావడం వల్ల వస్తుసారంగా మానవుని మనస్సు అవశ్యంగా హేతువంతం అవుతుంది. మానవుని పురోభి వృద్ధిలో హేతువు ప్రధాన పాత్ర వహిస్తుంది. మతం దైవం మొదలైన మూఢ విశ్వాసాలనే కాకుండా మానవునికి సంబంధించిన అన్ని అంశాలను పరిశీలిస్తుంది. హేతువాదం అనేది ఒక మతానికో, దేశానికో, కాలానికో, జాతికో, వర్గానికో సంబంధించినది కాదు. సమాజ నిర్మాణంలోకి అది చొచ్చుకుపోతుంది. మానవ సమాజంలోని రకరకాల వైఖరులను సమన్వయం చేయడంలో హేతువాదం తనదైన ప్రాతను పోషిస్తుంది. మానవుడు ఉద్వేగాల రాశి. తాను వాటికి లొంగిపోవాలా? లేక వాటిని తను పూర్తిగా అదుపులోనికి తీసుకోవాలా? అనేది ప్రధానమైన ప్రశ్నగా కనిపిస్తుంది. విశ్లేషిస్తుంది. సామాజిక సామర్థ్యానికి అదే ప్రధానమైన నాడిగా నిలుస్తుంది. కావున మానవుని సృజనాత్మక శక్తికి మూల సాధనం ఆయుధం హేతువు.

ప్రతి మనిషి పుట్టుకతో పరాధీనుడుగా మారుతున్నాడు. తల్లి గర్భంనుండి వెలుపలికి వచ్చిన అనంతరం తినడానికి తిరగడానికీ అతనికి సామర్థ్యం ఉండదు. కనీసం రెండు మూడు సంవత్సరాల వయసు వచ్చే వరకూ ఒకరు సంపాదించి పెడితే తప్ప తాను తిరగలేడు, తినలేడు, తనను తాను రక్షించుకోలేడు.... ఎదుటి వస్తువుల మీద స్పష్టమైన అభిప్రాయాలను ఏర్పరచుకోలేడు. భావ ప్రకటన వ్యక్తం చేయలేడు. పరిణితి వయసు వచ్చే వరకూ ప్రతి శిశువుకీ తల్లి, తండ్రీ, ఎవరో ఒకరు సమకూర్చాలి. మానవుడు సంఘ జీవి కనుక పరిసరాల ద్వారా అతని భావాల సంక్రమణ జరుగుతుంది. మానవుని జీవితంలో భావాలు ఏర్పడే సమయంలో సహజంగా ఏ సంప్రదాయ పాఠాలు అందుతాయో వానికే అతని మనసు హత్తుకు పోతుంది. ఆ విధంగా మానవునిలో కలిగే సమస్త భావాలను హేతువాదం పరిశీలించి నివేదించి మనవ జాతి పురోభివృద్ధికీ మానవతా విలువలకు ఆవిష్కరణకు పూల బాటలను వేస్తుంది. హేతువాదం యుక్తా యుక్తాలను పరిశీలించే ఒక సాధనం. అందుకే "హేతువాదం అనేది ఒక సాధనమేగానీ అది ఒక సిద్ధాంతం కాదు" అని రావిపూడి వెంకటాద్రి తెలిపారు. హేతువాదం మానవుని సృజనాత్మకునిగా; సత్యాన్వేషణ శీలిగా; నీతిమంతునిగా తీర్చిదిద్దుతుంది. ఆలోచన, జ్ఞానం, సత్యం, స్వేచ్ఛ వీటిని విస్తృతం చేయడమే హేతువాద లక్ష్యం. మానవునికి వాటి అవసరం తప్పనిసరి కాబట్టి హేతువాద ఆవశ్యకత తప్పని సరి అవుతుంది. మానవుణ్ణి కేంద్రంగా, లక్ష్యంగా పరిగణించడమే హేతువాద అంతిమ లక్ష్యం. హేతుమంతుడే నీతిమంతుడు, నీతిమంతుడే హేతుమంతుడు.

## 5.6 హేతువాదం - నీతి

హేతువాదం అంటే తర్కం కాదు. అందులో ఒకానొక భాగం. హేతువాదం నీతి వాదంగా పరిణమించక పోయినట్లయితే ఉపకారం కంటే అపకారమే ఎక్కువగా జరుగుతుంది. నీతికి మూలం ఏమిటి అని ప్రశ్నించు కొన్నప్పుడు "మానవుడు తన అనుభవాన్ని బట్టి తనకేది మంచో, ఏది చెడో తెలుసుకొంటాడు. అప్పుడు తనకు ఏది మంచో ఇతరులకూ అదే మంచి అవుతుంది, తనకు ఏది చెడు అవుతుందో ఇతరులకూ అదే చెడు అవుతుంది. నీతికి అదేమూలం" అని యం. యన్. రాయ్ అంటారు. సామాజిక వ్యవస్థలో నీతి నిలదొక్కుకోవడానికి మతం; దైవాలకు ఎటువంటి సంబంధం లేదు. వ్యక్తిలోని నైతిక ప్రవర్తనే సామాజిక నీతికి పునాది. అంతేకానీ పాప పుణ్యాల భయాల వల్ల నీతి ఉత్పన్నం కాదు. హేతువాది సమాజం పట్ల నీతిగా ప్రవర్తిస్తాడు. అలాగే సమాజం నుండి నీతిని కోరుకొంటాడు. జాతి; మత; వర్ణ, దేశ, కాలాన్ని బట్టి మనం నీతిని అర్థం చేసుకోకూడదు. మానవునిలో అంతర్నిహితంగా హేతువును బట్టి నీతిని అర్థం చేసుకోవాలి. అప్పుడే మానవుడు స్వచ్ఛందంగా నైతికంగా ఉండగలుగుతాడు. నీతికి ఆధారం హేతువే. నీతి అంటే అంతరంగానికి విజ్ఞప్తి చేసుకోవడమే. అంతరంగం కూడా మార్మికమైనది కాదు. అది చైతన్య స్థాయిలో పనిచేస్తుంది. మానవునిలో అంతర్లీనంగా దాగి ఉన్న హేతుత్వమే సామరస్య పూర్వకమైన సామాజిక విధానానికి హామీ ఇస్తుంది. ఆ సామాజిక విధానం నైతిక విధానం కూడా అవుతుంది. ఎందుకంటే నైతికత అనేది హేతు ప్రవృత్తి. అయితే రకరకాల సమాజంలో రకరకాల నీతులు నెలకొని ఉన్నాయి. మోషే ధర్మ శాస్త్రంలో 'కంటికి కన్ను పంటికి పన్ను' అని అన్నాడంటే ఆ జాతుల మధ్య కలహాలు యుద్ధాలు ఆనాటి సమాజంలో ఉన్నాయి. కాబట్టి ఆ నీతి వేరుగా ఉంటుంది. శత్రువు దొరికితే చంపడం యుద్ధనీతి. నీతి సూత్రాలు సమాజాన్ని బట్టి కాలాన్ని బట్టి మారుతుంటాయి. ఆ విధంగా మారే నీతినే మతనీతి అంటాము. మత నీతి వేరు, మానవ నీతి వేరు|మానవ నీతి విలువలకు సంబంధించినది. మంచి సాధనంతో మంచి లక్ష్యాన్ని చేరుకొనేది మానవ నీతి. హేతువే మంచి సాధనం. కలుషితమైన సాధనంతో నిష్కల్మషమైన లక్ష్యాన్ని చేరుకోగలిగామనడానికి ఋజువులు లేవు. కొంత మంది సాధనం ఏదైనా లక్ష్యం మంచిదైతే చాలంటారు. అది పొరపాటుతో కూడిన అభిప్రాయం. "అవినీతి కరమైన సాధనం ద్వారా ఏనాడైనా నైతిక ఫలితం సాధించబడగలదా అనేది సంశయాస్పదం". అని యం.యన్ రాంకు తెలిపారు. ప్రకృతి, సమాజం, వీటన్నింటికీ మించి మానవుని నైతిక ప్రవర్తన ఉంటుంది. నైతిక మానవులు లేకుండా నైతిక సమాజం ఉండబోదు.

స్పందన, దయ, మానవత మొదలైనవన్నీ సామాజిక వారసత్వాల వల్ల వస్తాయి. మతం ద్వారా మనకు లభించినటువంటి మంచినీ; నీతినీ తోసివేయడానికి వీలులేదు. మంచి, నీతి బోధ ఏ మతంలో ఉన్నా హేతువాదం వాటిని తిరస్కరించ వలసిన అవసరం లేదు. అది తిరస్కరించదు కూడా కానీ మత మౌఢ్యాన్ని మాత్రం విమర్శించకుండా వదలదు. మతాలలో ఉన్న కొద్దిపాటి అంగీకార యోగ్యమైన నీతులు మతస్థుల స్వంతం కాదని వారికి తెలుసు. అటువంటి నైతిక సూత్రాలను మతస్థుల కంటే హేతువాదులే బాగా ఆదరిస్తారు. ఎందుకంటే మతాల కట్టు కథలలో హేతువాదులు వాటిని కల్తీ చేయరు. అసలు మత రూపంలో మనకు నీతి బోధ జరిగిందే తప్ప వాస్తవానికి అది వారసత్వ రూపేణా మనకు లభించిందని మాత్రమే చెప్పుకోవాలి. మానవుడు స్వేచ్ఛగా ఉంటేనే నీతిగా ఉంటాడు. లేకపోతే మానవుడు స్వేచ్ఛను కోల్పోతాడు. నైతిక తత్వానికీ మత విశ్వాసానికీ ముడి పెడితే అది మానవుని సర్వ సత్తాకతకు పరిమితి విధిస్తుంది. అంటే మనిషి మనిషిగా నీతిగా జీవించలేడు. అలా జీవించాలంటే అతడు మానవాతీత శక్తికి లొంగి పోయినట్లు భావించుకోవాలి. ఈ విధమైన లొంగుబాటుతనంతో మానవుడెప్పుడూ వాస్తవంగా స్వేచ్ఛగా ఉండజాలడు. కావున హేతువాదం నీతి వాదం ప్రధానం. హేతు రహితమైన నీతివాదం మత వాదంతో సమానం. మానవునిలోని హేతు స్థాయిని బట్టి నీతి స్థాయి ఉంటుంది.

## 5.7 హేతువాదం - ప్రయోజనాలు

ఏదో ఒక ప్రయోజనాన్ని ఆశించి మానవుడు హేతువాదిగా మారడు. తనకు అవగాహన అయిన పరిమితిలో తప్ప హేతు బద్ధంగా ప్రవర్తించలేడు. ఒక వేళ హేతు రహితంగా ప్రవర్తిస్తే అది అవగాహనాలోపమే. సాధారణంగా మత మౌఢ్యాన్నీ, అహేతుకమూ వర్జించి హేతుబద్ధంగా మానవుడు వీలైనంత సమగ్రంగా ప్రవర్తించడం వల్ల చాలా ప్రయోజనాలను పొందగలుగుతాడు. మానవుని ప్రతి ప్రయత్నం ప్రయోజనాత్మకంగానే ఉంటుంది. ఈనాడు మానవ జాతిలో విస్తృమైన ఆలోచనా సరళి కన్పిస్తుంది. ఫలితంగానే శాస్త్రీయ అవగా ఏర్పడింది. ఆధునిక విజ్ఞానం అభివృద్ధి చెందిన తరువాత శాస్త్రబద్ధంగా నిర్ణయాలు తీసుకొనే స్థితికి చేరుకొన్నాము. మరొక వైపు

రూపంలో ఆ పద్ధతిలో నడవలేని స్థితి కూడా ఉంది. ఇప్పటికీ ఎక్కువ సంఖ్యాకులు మత సూత్రాల ప్రాతిపదిక తోనే ఆలోచన చేయడం జరుగుతుంది. అనేక మతాల వారు తమ తమ సూత్రాల పరిధి నుండి వెలుపలికి రాలేక పోతున్నారో ఆ స్థితి నుండి ప్రతి మానవుడు శాస్త్ర విజ్ఞానం పరిధిలో ఆలోచించే స్థితికి చేరుకోవాలి. ఆ ఆలోచనా సరళి మూఢ విశ్వాసాలను వేళ్ళతోసహా పెరికివేస్తుంది. అప్పుడు మాత్రమే మనం హేతువాద ప్రయోజనాలను పొందగలము. కాలక్రమంలో మతం, దైవం, కులం మొదలుగా గల మూఢ విశ్వాసాలకు భిన్నంగా ఆలోచించే సరళి వర్తమాన కాలంలో స్పష్టంగా కనిపిస్తుంది. ఒక విధంగా ఆ విధంగా ఆలోచించవలసిన ఆవశ్యకత కూడా వచ్చింది. మానవుని ఆలోచనా స్థాయిని మతస్థాయి నుండి మానవుని వైపుకు మరల్చ వలసిన ఆవశ్యకతను ఆధునిక మానవుడు గుర్తించాడు.

హేతువాదులందరూ మానవతావాదులు కావాలి. మానవులు తాము చేసిన పనులకు తామే బాధ్యత వహించాలి. మానవులు హేతువాదులైనప్పుడే అది సాధ్యపడుతుంది. అప్పుడు మాత్రమే హేతువాద ప్రయోజనం చేకూరుతుంది. శ్రీలంకకు చెందిన రేషనలిస్ట్ అంబాసిడర్; రీజన్ అనే పత్రికలు హేతువాద ప్రయోజనాలను ఈ క్రింది విధంగా పేర్కొన్నాయి.

1. హేతువు, పరిశోధన ఆధారంగా అసత్యం నుండి సత్యాన్ని జల్లెడ పట్టి వేరుచేయడం, సహేతుకమైన ఆలోచనను పెంచడం.
2. కులం, మతం, జాతి, ఆచారాల వల్ల కలిగే తారతమ్యాలను నిరోధించడం, ఆలోచనా స్వాతంత్ర్యంతో, పరిశోధనా స్వాతంత్ర్యంతో ఆచార సంప్రదాయాలను పరిశీలించడం.
3. మత జీవితానికి ప్రత్యామ్నాయమైన జీవన విధానాన్ని రూపొందించడం.
4. మానవ సంక్షేమానికి శాస్త్ర విజ్ఞానాన్ని వీలైనంత ఎక్కువగా వినియోగించడం.
5. నైతిక విధానాన్ని సంస్కారాన్ని పెంపొందించడం.

ఈ రెండు పత్రిక పాటు హేతువాద పత్రికలు, హేతువాద సంస్థలతో పాటు, హేతువాదులందరూ ముక్త కంఠంతో ఈ ప్రయోజనాలను ఆమోదించారు.

## 5.8 హేతువాదం - సారూప్యవాదాలు (RATIONALISM)

హేతువాద స్వరూప స్వభావాలను మనం ఎంత మేరకు శాస్త్రీయంగా విశ్లేషణ చేసి సమన్వయించుకొంటామో అంత మేరకే ఫలితాలను మనం పొందగలుగుతాము. మానవ జీవిత లక్ష్యాన్నీ, ఆదర్శాన్నీ నిర్దుష్టంగా నిర్దేశించే నిమిత్తం హేతువాద వైఖరిని, పద్ధతిని ప్రాతిపదికగా చేసుకొని కొంత మంది జిజ్ఞాసాపరులు కొన్ని సిద్ధాంతాలను రూపకల్పన చేయడం జరిగింది. తదనుగుణంగా ఆ సిద్ధాంతాలూ, ఆ సారూప్య వాదాలూ, కాలక్రమంలో బలం పుంజుకోవడం జరిగింది. వానిలో అజ్ఞేయ వాదం (AGNOSTICISM); నాస్తిక వాదం (ATHEISM); మానవ వాదం (HUMANISM); లౌకిక వాదం (SECULARISM) ప్రధానమైనవి. స్థూల దృష్టితో చూసినప్పుడు హేతువాదానికీ ఈ సారూప్య వాదాలకూ అంతగా తేడా కనిపించదు. నిశితమైన పరిశీలనా దృష్టితో చూసినప్పుడు వాటి మధ్యగల వైవిధ్యం స్పష్టంగా గోచరిస్తుంది. సారూప్య వాదాలైన అజ్ఞేయ, నాస్తిక, మానవా, లౌకిక వాదాల పురోగమనానికి హేతువాదం ఆలంబనం.

### ఎ) అజ్ఞేయ వాదం

1869 లో థామస్ హక్స్లీ మొట్ట మొదట సారిగా అజ్ఞేయ వాదమనే పదానికి రూపకల్పన చేశాడు. హక్స్లీ ప్రారంభంలో ఈ పదాన్ని తమాషాగా ప్రయోగించినప్పటికీ కాలగమనంలో ఈ మాట విశేష ప్రచారం పొందింది. థామస్ హక్స్లీ అజ్ఞేయ వాది. ప్రారంభంలో తాను నాస్తికుడా? ఆస్తికుడా? అఖిలేశ్వర వాదా అని ప్రశ్నించుకొని ఆ ప్రశ్నలకు జవాబులు రాక పోవడంతో కొంత మంది యుజ్ఞేలు (GNOSISTS) అతీతమైన జ్ఞానం పొందినట్లుగా చెబుతున్నారు. అట్టి జ్ఞానాన్ని నేను పొందలేదు. కాబట్టి నేను అజ్ఞేయ వాది నయ్యాను అని సమాధానం చెప్పుకొన్నాడు.

"ఒక విషయాన్ని ప్రతిపాదించినప్పుడు అందలి సత్యాన్ని తార్కికంగా సమర్ధించడానికి తగిన సాక్ష్యం దొరకని పక్షంలో ఆ [illegible] యొక్క వాస్తవ సత్యాన్ని తెలుసుకొన్నామని భావించడం తప్పు. అజ్ఞేయ వాదం చెప్పేది ఇదే". అని నిర్వచనాన్ని హాక్స్లీ చెప్పారు. ప్రతిపాదించిన విషయం యొక్క సమగ్ర స్వరూపం మన అవగాహనలోకి రానప్పుడు దానిని గూర్చిన సత్యం మనకు తెలియదని చెప్పాలన్నది హాక్స్లీ అభిప్రాయం. జార్జ్.హెచ్.స్మిత్ అజ్ఞేయ వాదాన్ని నిర్వచిస్తూ "ఆస్తిక విశ్వాసంలోని సత్యా సత్యాలను నిర్ధారించగల శక్తి హేతువునకు కలదని నిర్ధారించే వారు నాస్తికులు. ప్రకృతికి అతీతమైన ఏ రంగంలో కూడా హేతువు పనిజేయ జాలదని విశ్వసించేవారు ఆస్తికులు వీరు ఇరువురినీ వేరు పరచి చూపేది అజ్ఞేయ వాదం" అని తెలిపారు. "అజ్ఞేయ వాది నాస్తికుడు కాదు. ఎందుకంటే నాస్తికుడు దేవుని ఉనికిని నిరాకరిస్తాడు. అజ్ఞేయ వాది దేవుని ఉనికిని గురించి తనకు తెలియదని మాత్రమే ప్రకటిస్తాడు" అని కాథలిక్ ఎన్ సైక్లోపీడియా నిర్వచించింది. అజ్ఞేయ వాదమంటే నాస్తికత్వమూ కాదు, ఆస్తికత్వమూ కాదు రెండింటికీ భిన్నమైనది అజ్ఞేయ వాదం.

ఆస్తిక నాస్తికత్వాలకు భినమైనది అజ్ఞేయ వాదమని అంగీకరిస్తే బహుశా అది సంశయ వాద మేమోనని భ్రమ కలగవచ్చు. కానీ ఈ రెండింటికీ కొంత భేదమున్నది. క్రీ.శ 2, 3 శతాబ్దాలలో నివసించిన ప్రాచీన గ్రీకు సంశయ వాది సెక్టస్ ఇంపిరికస్ సూక్ష్మీకరించినట్లుగా సంశయ వాదం మత సంబంధమేన లేదా అది భౌతిక సంబంధమైన జ్ఞానాన్ని మాత్రమే కాక ప్రత్యక్షాను భవానికి అందని ఏ జ్ఞానాన్ని అయినా సవాలు చేస్తుంది. అజ్ఞేయ వాదం ప్రత్యక్షానుభూతికి అందని జ్ఞానం గురించి తెలియదని మాత్రమే చెబుతుంది. అందువల్ల అజ్ఞేయ వాదం సంశయ వాదం రెండూ ఒకటి కావు.

బి) నాస్తికత్వం: దేవుణ్ణి నిరాకరించడమే నాస్తికత్వం. ఆ విధంగా అతి ఆస్తికత్వానికి వ్యతిరేకంగా నిలుస్తుంది. నాస్తికత్వం చాలా ప్రాచీనమైనది. నాస్తిక వాది, నాస్తిక వాదం వంటి పదాలు ప్లాటో గ్రంధాలలోనూ క్రైస్తవ గ్రంధాలలో కనిపిస్తాయి. భారతదేశంలో ప్రాచీన కాలం నుండి నాస్తికతా భావాలు కనిపిస్తూనే ఉన్నాయి. అయితే ఆనాడు నాస్తికత్వం అనే పదాన్ని దేవుని ఉనికిని నిరాకరించడమనే అర్ధంలోకాక వేరే అర్ధంలో ఉపయోగించినట్లు తెలుస్తుంది. దీనికి మనుధర్మ శాస్త్రమే నిదర్శనం. మనుధర్మ శాస్త్రం వేద ప్రామాణిక తను నిరాకరించిన వారందరినీ నాస్తకులు అని పేర్కొంది. కాల క్రమంలో ఈ నాస్తికత్వం అనే పదం అనేక అర్ధాలను సంతరించుకొంది. నాస్తి అంటే లేదు అని అర్ధం. ఏ పదార్ధానికీ యదార్ధమైన ఉనికి లేదనే వారు నాస్తికులు. పరలోకం లేదనే వారు నాస్తికులని పాణిని పేర్కొన్నారు. వేదాలను ప్రమాణాలుగా అంగీకరించని వారిని నాస్తికులుగా మనువు పరిగణించారు. భగవంతుని మీద విశ్వాసము లేనివారినందరినీ నాస్తికులుగానే పరిగణిస్తున్నారు. నాస్తికుడైన వాడు భగవంతుణ్ణి నిరాకరించడం, ఆత్మ పరమాత్మలు, స్వర్గ నరకాలు, కర్మ పునర్జన్మలు అహేతుకతను ప్రతీకలుగా భావిస్తారు. "రకరకాల ఆస్తికత్వం యొక్క సిద్ధాంతాలను ఖండించడమే నాస్తికత్వం" అని ఎర్నెస్ట్ నాగెల్ పేర్కొన్నారు. "నాస్తికత్వ మంటే అవిశ్వాసం మాత్రమే కాదు ఏ విధంగానూ విధ్వంసయుతమై, రాగశూన్యమై బీడువారినది కాదు. దానికి భిన్నంగా నాస్తికత్వం అంటే ఉత్సాహయుతమై, సఫలమైన సత్యస్థాపన ఉన్నత మానవత్వం యొక్క ఆచరణను నిర్మాణయుతంగా సమర్ధించుట" అని అభిప్రాయ పడ్డారు. నాస్తికత్వం అనేది ఏ ఒక్క సమాజ సిద్ధాంతమో కాదు. ఒక జాతి సిద్ధాంతమూ కాదు. అది అన్ని కాలాలలోనూ, అన్ని దేశాలలోనూ, అన్ని దశలలోనూ, అన్ని వర్గాలలోనూ ఉన్న మానవునికి సంబంధించిన సత్య పరమైన తాత్విక సిద్ధాంతం.

సి) మానవ వాదం: మానవ వాదం మానవుని జీవితం పట్ల ప్రత్యేకమైన వైఖరిని కలిగి ఉంటుంది. ఈ శాస్త్రీయ మానవ వాదానికి సరిహద్దులు లేవు. అది అన్ని ప్రదేశాలలోనూ, అన్ని యుగాలలోనూ ఉన్న మానవ ఆలోచనా సారం. అందువల్లనే ఏ ఆలోచన అయినా ప్రాధమికంగా హ్యూమనిస్ట్ ఆలోచనే. అన్ని రకాలైన అహేతుకాలకూ మానవ వాదం వ్యతిరేకం. మానవుడు ప్రాధమికంగా హేతువాది. ప్రతి మనిషీ తనలో ఉన్న విచక్షణా జ్ఞానం ఆధారంగా మంచి చెడులను నిర్ణయించుకొంటాడు. మానవ వాదానికి కర్త. తన చరిత్రకు తానే ప్రమాణం కావాలి. కావున ఆ మానవుని కేంద్రంగా భావించి అతనిలోని హేతువు ఆధిక్యతను అంగీకరించడం మానవ వాదంలోని ప్రధానమైన అంశం. మానవుడు చేసిన హేతు యుతమైన ప్రతి ప్రయత్నం యొక్క ప్రయోజనం ప్రతిక్షణం స్వేచ్ఛను పొందడమే. మానవ వాదంలో స్వేచ్ఛా పిపాస, సత్యాన్వేషణ జ్ఞానార్జన ప్రధాన మైనవి. మానవ వాదంలో మానవుని హేతువు యొక్క ఆధిక్యతను అంగీకరించడం. స్వేచ్ఛా పిపాస, సత్యాన్వేషణ, జ్ఞాన సముపార్జన, నైతిక విలువల ప్రాధాన్యత అనేవి విధిగా ఉంటాయి. సమాజంలోని మానవుడు ఆధునిక జ్ఞానాన్ని, దాని ఫలితాలను బాగా జీర్ణం చేసుకొని, మానవతా దృక్పధంతో, జీవితంలో ఆచరణలో పెట్టడం వల్లనే మానవ వాద దృకపధం

సఫలమవుతుంది. కాబట్టి మానవ వాదం గిరిగీసి చెప్పే సిద్ధాంతం కాదు. మానవుని జ్ఞానం వికాసం పొందే కొద్దీ అది వికాసం చెందుతూనే ఉంటుంది.

డి) లౌకిక వాదం : లౌకిక భావాలు పాశ్చాత్య ప్రజా స్వామిక సంప్రదాయం నుండి మనదేశం లోనికి ప్రవేశించాయి. సెక్యులర్ అనే పదానికి మత సంబంధం కాని లౌకిక శిక్షణ సంబంధమైన అనే అర్థం ఉంది. లౌకిక వాదం ఏ మతానికీ వ్యతిరేకం కాదు. కానీ మతం లౌకిక వాదం ఒక చోట నిలబడలేవు. మతానికి దేవుని ప్రాపకం, లౌకిక వాదికి ప్రపంచం కావాలి. దేశాభివృద్ధికి సాంస్కృతిక స్వేచ్ఛకు పరస్పర సహనం, అవగాహన ప్రజలు పెంపొందించుకొని సెక్యులర్ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ వాదం ప్రబోధిస్తుంది.

**సమీక్ష :**

కార్యకారణ సంబంధమే హేతువాదమని ఆలోచించటం జ్ఞాన సముపార్జన చేయటం హేతువాద లక్షణాలని తెలుసుకున్నారు. అజ్ఞేయ వాదము, నాస్తికత్వము, మానవ వాదము, లౌకిక వాదములకు హేతువాదమునకు మధ్య సంబంధాన్ని తెలుసుకున్నారు.

**ప్రశ్నలు :**

1. హేతువాదాన్ని నిర్వచించి దాని ప్రయోజనాలు పేర్కొనండి.
2. హేతువాద లక్షణాలను పరిశీలించండి.
4. హేతువాద దృక్పథాన్ని వివరించి దాని ఆవశ్యకతను సోదాహరణంగా వివరించండి.

**ఆధార గ్రంథాలు :**


1. తెలుగు పౌరాణిక నాటకాలు - హేతువాద దృక్పథం - డా. తోటకూర ప్రభాకరరావు
2. హేతువాదం - రావిపూడి వెంకటాద్రి.


డా॥ కందిమళ్ళ సాంబశివరావు

పాఠం - 6

# హేతువాదం - ఉద్యమం - సాహిత్యం

పాఠ్య నిర్మాణ క్రమం


6.1 ప్రాచీన భారత దేశంలో హేతువాద బీజాలు

ఎ) చార్వాకం

బి) జ్ఞానులు

సి) బౌద్ధులు

డి) జైనం

ఇ) సాంఖ్యం

ఎఫ్) న్యాయ వైశేషికాలు

6.2 ఆంధ్ర దేశంలో హేతువాద ఉద్యమం

6.3 హేతువాద యుగకర్త - త్రిపురనేని

6.4 ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ ఆవిర్భావం

6.5 హేతువాద - సాహిత్యం

6.6 తెలుగు నాటకం - హేతువాదం

6.6.1. తెలుగు పౌరాణిక నాటకాలు హేతువాద దృక్పథం


లక్ష్యం :

ప్రాచీన భారత దేశంలో కనిపిస్తున్న హేతువాద బీజాలను ఆంధ్ర దేశంలోని హేతువాద ఉద్యమాన్ని గురించి, హేతువాద సంఘటనల గురించి, తెలుగులోని పౌరాణిక నాటకాలను గురించి తెలుసుకుంటారు.

ప్రాచీన భారతీయ తత్వ చింతనా రంగంలో భావ విప్లవానికి సంబంధించిన లోకాయతం; బౌద్ధం, జైనం, సాంఖ్యం, న్యాయ వైశేషికాలు అనేక ఖండన మండనలకు, తర్జన భర్జనలకు గురై నప్పటికీ అవి భావ విప్లవానికి బీజాలు నాటి ఒక కొత్త ఆలోచనకు సరికొత్త ప్రస్థానానికి నూతన ఒరవడిని ప్రవేశ పెట్టాయి. దైవం, జ్ఞానం, మూఢ విశ్వాసం వంటి భావాలను కార్య కారణాత్మకంగా [illegible]వరించే ప్రయత్నం చేసింది. దైవం, యజ్ఞ యుగాదులు, వర్ణ వ్యవస్థను నిర్ద్వంద్వంగా నిరాకరిస్తూ జా[illegible] సనుపార[illegible] సమాన [illegible] ఒ[illegible]ద్దం కల్పించింది. నైతిక ప్రామాణికతను దైవ ని[illegible] [illegible]పి [illegible]ద్ధ, జైన మత సిద్ధాంతాలలో స్యాత్ వాదము ప్రముఖమైనది. సాంఖ్య దర్శనం ఈశ్వరుని అభావాన్ని సూచించడమే కాకుండా కార్యకారణాలను గూర్చి కూడా చర్చ చేసింది. న్యాయ వైశేషికులు ప్రపంచానికి మూలం అణువని నమ్మి తదనుగుణంగా చర్చలు కొనసాగించారు. బౌద్ధ, జైన, సాంఖ్య, న్యాయ వైశేషికులలో అక్కడక్కడా అప్పుడప్పుడూ ఆస్తిక భావ చిహ్నాలు కనిపించినా మొత్తం మీద వారి తాత్విక చింతన హేతుబద్ధంగా కొనసాగిందని చెప్పడం అతిశయోక్తి కాదు.

## 6.1 ప్రాచీన భారతదేశం హేతువాద బీజాలు

1. చార్వాకం: భారత దేశంలో మొదటి సారిగా హేతువాద బీజాలను నాటి ప్రచారం చేసిన వారు చార్వాకులు. రామాయణంలో జాబాలి భావాలు దీనికి సంబంధించినవే. భారతంలో ధర్మరాజు చార్వాకుని చంపించిన ఘట్టం, మనుస్మృతి చార్వాకులనుగర్హించిన విధానం దీనికి ఉదాహరణలు. ప్రబోధ చంద్రోదయం, వేణీ సంహారం, పండితారాధ్య చరిత్రలో చార్వాకుల ప్రసక్తి ఉంది. హరిభద్ర సూరి

షడ్దర్శన సముచ్చయం. మాధవా చార్యుల సర్వ దర్శన సంగ్రహం చార్వాక గూర్చి విపులంగా చర్చించాయి. చార్వాక మత సిద్ధాంతాన్ని ప్రాచీనతను గూర్చి విజ్ఞాన సర్వస్వం ఏడవ సంపుటలో సటమగ్రంగా వివరించబడింది. చార్వాకులు రచించిన గ్రంధాలు ప్రస్తుతం లభించుట లేదు. చార్వాకులను నిరసిస్తూ చేసిన వ్యాఖ్యలు, విమర్శలు ద్వారా కొంత వరకూ వీరి సిద్ధాంతాలను తెలుసుకొనే అవకాశం ఉంది. చారు అంటే అందమైన లేదా విశాలమైన వాక్ అంటే వాక్కులు కలవారు అనే అర్ధం ఉంది. దీనిని బట్టి చార్వాకులు సూటిగా ఘాటుగా వాదన చేసి ఎదుటి వారిని ఓడించగల సమర్ధులనే అర్ధంలో చెప్పుకోవచ్చు. "బ్రతికినన్ని రోజులు హాయిగా సంతోషంగా ఉండండి" అనే రమణీయమైన సిద్ధాంతాన్ని అందమైన మాటలలో చెప్పేవాడు చార్వాకుడు అని చెప్పుకొవచ్చును. చార్వాకం, లోకాయతం అనే రెండు పదాలూ సమానార్ధకాలు. లోకాయత శబ్దానికి సర్వదర్శన సంగ్రహ కర్త "లోకేషు ఆయతః లోకాయతః" అని నిర్వచించారు. లోకులలో ప్రచారము నందు ఉన్న ఇటువంటి దృష్టియే లోకాయతము. లోకం మాత్రమే విషయంగా గల శాస్త్రము లోకాయుతమని అర్ధం చెప్పగా లోకాయత శబ్దమునగల ఆయత అనే పదమును ఆ+యత్+అ గా విడదీసి సరైన విధముగా లోకమున ప్రయత్నించుట అని కొత్త సచ్చిదానంద మూర్తి పేర్కొన్నారు. లోకాయతం చాలా ప్రాచీనమైనది. కౌటిల్యుడు అర్ధశాస్త్రంలో సాంఖ్యయోగంతో పాటు లోకాయతాన్ని కూడా పేర్కొన్నారు. అంగుత్తర నికాయ వినయ పీటకాది బౌద్ధ గ్రంధాలలో కూడా లోకాయతం స్పృశించ బడింది. హేతు శాస్త్రాన్ని అభ్యసించే వారిని గూర్చి మనుస్మృతి కూడా పేర్కొన్నది. ఈ లోకాయత మతం హేతువాదాన్ని ఆలంబన చేసుకోవడం చేత ఆస్తికులు దీనిపై నాటికీ.. నేటికీ తీవ్రమైన దాడి కొనసాగించడం స్పష్టంగా కనిపిస్తుంది. హేతువాదంపై ఆధారపడి స్వతంత్రమైన ఆలోచన చేస్తూ, భౌతిక వాదంలో పర్యవసించున్న ఈ దర్శనము వేద ప్రామాణ్యము నంగీకరించు వారికి పరలోక పునర్జన్మ ఈశ్వరాస్తిత్వాదులను విశ్వసించు వారికి గిట్టలేదు. కాబట్టి వారు లోకాయతమును నిరసించిరి. లోకాయత మతం ప్రారంభమయ్యే కాలం నాటికి దేశ మంతటా యజ్ఞయాగాది కర్మకాండలు పెచ్చు పెరిగాయి. శ్రాద్ధకర్మల వంటి ఆచారాలతో సంఘం సతమతమై పోతుంది. ఇటువంటి వాతావరణాన్ని సుశిక్షితులైన చార్వాకులు పరిశీలించి సంఘంలో ఆవరించి ఉన్న మౌఢ్యాన్ని తీవ్రంగా నిరసించి ప్రశ్నించారు. ఈ లౌకిక జగత్తులో మనం చేసే దానధర్మాల వల్ల చనిపోయి స్వర్గంలో ఉన్న తల్లి దండ్రులకు సంతృప్తి కలుగుతుందని మనం భావిస్తే ప్రాసాదము పై భాగములో ఉన్న వారిని క్రిందికి దిగి రాకుండానే తృప్తిపరచ వచ్చును గదా అని చార్వాకులు కార్యకారణాత్మకంగా ప్రశ్నించారు.

ఎ) జ్ఞానములు: చార్వాకుల జ్ఞానమార్గం సత్య సాధనకు ప్రమాణం, ప్రధానం. చార్వాకులు అనుమాన ప్రమాణాన్ని అంగీకరించరు. ప్రత్యక్ష ప్రమాణమే వారికి విశ్వసనీయం. లోకాయత మతము దృశ్యమాన మగుచున్న లోకమనే సత్యమని భావించును. ఇంద్రియములకు అందు బాటులో ఉన్న ప్రపంచం కంటే మించినది లేదు. ఇంద్రియ గోచరము కానిదంతయూ అసత్యము. శబ్ద ప్రమాణముని గానీ, అనుమాన ప్రమాణమును గానీ లోకాయతులు స్వీకరించరు. దీనిని బట్టి శబ్ద ప్రధానాలైన వేదాలను వీరు తిరస్కరిస్తారు. అలౌకిక తత్వాన్ని, కారణ భూతుడైన దైవాన్ని వీరు నిష్కర్షగా నిరాకరిస్తారు. అయితే అన్ని విషయాలలోనూ ప్రత్యక్ష ప్రమాణమే ఆధారమైతే అడుగు కూడా ముందుకు వేయలేము.

బి) బౌద్ధము: ప్రపంచానికి శాంతి మంత్రాన్ని ఉపదేశించిన సిద్ధార్ధుడు క్రీ.పూ 563 లో జన్మించాడు. శరవై తొమ్మిదవ ఏట ఇంటిని వీడి క్రీ.పూ 528 లో బుద్ధుడై బౌద్ధ ధర్మాన్ని ప్రచారం చేసి క్రీ.పూ 483 లో నిర్యాణం చెందారు. గౌతమ బుద్ధుని కాలం నాటికి సమాజం అస్తవ్యస్థమై పోయింది. వర్ణ వ్యవస్థ సమాజంలో లోతుగా పాతుకు పోయింది. బుద్ధుడు సామాజిక పరిస్థితులను అవగాహన చేసుకొని వర్ణ వ్యవస్థను ఖండించారు. బానిసలను గౌరవించడమే కాదు వారిని విముక్తి చేయాలని స్పష్టం చేశాడు. బ్రాహ్మణుల సిద్ధాంతాలను, యజ్ఞ యాగాదుల పేరుతో చేసే పశుబలిని నిరసించాడు. బౌద్ధులే కార్యకారణ సంబంధాన్ని ప్రపంచానికీ పదార్ధానికీ అన్వయించారు. ఈ ప్రపంచం అశాశ్వతమైనది. ప్రపంచంలో ప్రతి ఒకటీ పరస్పర ఆధారంతో కూడి ఉన్నదని వీరి భావన. అకారణంగా ఏదీ జరగదు. ప్రతి దానికీ కారణం ఉంది. ప్రపంచం ఈశ్వరునిచే సృష్టించబడితే పరిణామము, అంతము, ఆపద, దుఃఖము ఉండడానికి వీలులేదు. అన్ని కార్యాలూ ఈశ్వరుని సృష్టియే కాబట్టి తప్పు చేసినా ఒప్పు చేసినా ఒకటే కదా అని వీరి నమ్మిక. కార్యకారణ క్రమంలోనే బుద్ధుడు దైవాన్ని అంతగా ప్రాధాన్యం ఇవ్వలేదని తెలుస్తుంది. బుద్ధునిది అనాత్మ వాదము. ఈ లోకం అంతా అనిత్యము, దుఃఖమయమూ అని చెప్పడమే బౌద్ధ మత సారాంశం. దైవం, ఆత్మ, వర్ణ వ్యవస్థ సంస్కరణ, కార్యకారణాలు మొదలైన అంశాలను గూర్చిన హేతువాద చింతన బౌద్ధ మతంలో కన్పిస్తుంది.

**సి) జైనం:** మహావీరుడు జైనమత ప్రవక్త. మహావీరునికి పూర్వం ఇరవై ముగ్గురు తీర్థం కరులు ఉండేవారు. మహావీరుడు కొంత కాలం తపోనియమాలు ఆచరించి జినుడని పేరు పొందాడు. ఈ బిరుదు వల్ల జైన మతమనే పేరు వచ్చినట్లు కొందరి అభిప్రాయం. జైనులు దైవాన్ని నిరాకరిస్తారు. పదార్థం శాశ్వత మని అంగీకరిస్తారు. జైన మతాన్ని నాస్తిక మతంగా సాంప్రదాయికులు లెక్కగట్టారు. "సృష్టి స్థితి లయకారకుడైన భగవంతుని ఆధిపత్యాన్ని జైనులు అంగీకరించక పోవడమే దీనికి కారణము. విశ్వము శాశ్వతము దానికి వినాశనం లేదు. అందు మూలంగా దాని సృష్టికి దైవంతో పనిలేదు. ప్రపంచంలో అనేక పరివర్తనే సంభవిస్తూ ఉంటాయి. ఎంతో వైవిధ్యం గోచరిస్తుంది. ఈ వైవిధ్యమంతా కాలము, స్వభావము, నియతి, కర్మ, ఉద్యమము అనే సహకార కాంశాల వల్ల సంభవిస్తుందని" యం. రాజగోపాలరావు తెలిపారు. దైవాన్ని నిరాకరించిన జైనులకు దేవతలు స్వర్గ నరకాలుంటాయి. మానవుడు మరణించిన తరువాత దహనానంతరం కర్మ కాండకు జైనంలో స్థానం లేదు. పదార్థం యదార్థమని జైనులు అంగీకరిస్తారు. ఒక పదార్థానికి మరో పదార్థంతో అనేక సంబంధాలు ఉంటాయి. ఆ సంబంధాలన్నీ మన అవగాహనలోకి రావడం కష్టం. ఒక వస్తువును అనేకులు అనేక రకాలుగా చూసినప్పుడు అనేక రకాల అభిప్రాయాలు వ్యక్తం అవుతాయి. అంటే సమగ్ర జ్ఞానం లభిస్తుంది. ఇదే స్యాత్ వాదము. ఒక వస్తువు లేదా పదార్థం యొక్క వివిధ దశలను తెలియజేసి దానికి సంబంధించిన సమగ్ర జ్ఞానాన్ని అందించే సూత్రమే స్యాత్ వాదము. జైనులు పదార్థంతో పాటు ఆత్మను కూడా అంగీకరించారు. జైనుల అహింసావాదం ఛాందసత్వంతో ఉంటుంది. గాలి పీల్చే సమయంలో ముక్కుకు గుడ్డ అడ్డంగా పెట్టుకొంటారు. రాత్రిళ్లు దీపం వెలిగిస్తే జీవులు నశిస్తాయని వెలిగించేవారు కాదు. నడిస్తే జీవరాశులు చనిపోతాయని నేలను తుడుస్తారు. జైనులు యజ్ఞ యాగాదులను, కర్మకాండలను తీవ్రంగా నిరసించారు.

**డి) సాంఖ్యం:** భారతీయ తత్వ శాస్త్రంలో సాంఖ్య శాస్త్రానికి ప్రత్యేకమైన గౌరవముంది. కపిలుడు సాంఖ్యానికి మూల పురుషుడు. సాంఖ్య దర్శనంలోని భావాలు చాలా ప్రాచీనమైనవి. భారతం, వైద్యశాస్త్ర గ్రంథాలైన చరక సంహిత, మనుస్మృతి, పురాణాలు మొదలైన వానిలో సాంఖ్య శాస్త్రాన్ని గూర్చి చర్చించడం జరిగింది. సాంఖ్య మనగా సరైన జ్ఞానము అని అర్థము. సాంఖ్య శాస్త్రంలో కార్య కారణం, దైవం, జ్ఞాన సిద్ధి అనే మూడు అంశాలు హేతుబద్ధంగా ఉంటాయి. ఈ సృష్టికి పదార్థం మూలమనీ, అది కార్యకారణాత్మకంగా ఉంటుందని విశ్వానికి కారణం విశ్వమేనని సాంఖ్యం వివరిస్తుంది. సాంఖ్యం దైవ నిరాకరణ చేస్తుంది. అందుకే దీనిని నిరీశ్వర వాదము అని కూడా పిలుస్తారు. దైవ నిరూపణ కావాలంటే ప్రమాణాలు ముఖ్యం. సాంఖ్యుల జ్ఞాన సిద్ధాంతం ప్రత్యక్ష, అనుమానం, శబ్ద ప్రమాణం అని మూడు విధాలుగా ఉంటుంది. ఒక్క వస్తువు తాలూకు ముద్ర మన మనస్సుపై పడినప్పుడు ప్రత్యక్ష జ్ఞానాన్ని పొందగలుగుతాము. సాంఖ్యులు ఆత్మ పునర్జన్మ మోక్షం అనే మూడు విషయాలను అంగీకరించడంలో భావవాదంవైపు మొగ్గుచూపినట్లు కనిపిస్తుంది.

**ఇ) న్యాయ వైశేషికాలు :** న్యాయసూత్రాలకు గౌతముడు; వైశేషిక సూత్రాలకు కణాదుడు మూల పురుషులు, న్యాయ వైశేషికాలు ప్రపంచ అస్తిత్వం యదార్థమని బలంగా చాటి చెప్పారు. మనం దేనినైతే చూడగలమో, పేరు పెట్టి పిలవగలమో ; తెలుసుకోగలమో దానినే పదార్థమంటారని న్యాయ వైశేషికులు తెలిపారు. ప్రపంచానికి మూలం నాలుగు భూతాలు. అవి అణురూపంలో ఉంటాయి. భూమి, నీరు, గాలి, తేజస్సు అనే నాలుగు నిత్యములు, శాశ్వతములు. వీరు మార్పును అంగీకరిస్తూనే భగవంతుని అస్తిత్వాన్ని గుర్తించారు. తాము చేసిన కర్మానుసారం జీవులు భగవంతుని ఆజ్ఞకు లోబడి వాటి పాపపుణ్యాలతోపాటు అణువులతో కలిసి సృష్టి జరుగుతుందని న్యాయ వైశేషికులు భావించారు. భౌతిక ప్రపంచాన్ని అంగీకరించిన వీరు జ్ఞాన మార్గాన్ని వివరిస్తూ అది స్మృతి జ్ఞానము; సంశయ జ్ఞానము; భ్రమజ్ఞానము; తర్కజ్ఞానము అని నాలుగు రకాలుగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ విధంగా ప్రాచీన భారతదేశంలో చార్వాకం, బౌద్ధం, జ్ఞానం, సాంఖ్యం, న్యాయ వైశేషికం హేతువాద భావ వ్యాప్తికి విశేషమైన కృషి చేశాయి.

## 6.2 ఆంధ్రదేశంలో హేతువాద ఉద్యమం.

ఆంధ్రదేశంలో హేతువాద భావ సంపద వేమనతో ప్రారంభమై త్రిపురనేని రామస్వామితో సుసంపన్నమైనది. ఆంధ్రదేశంలో కులం, మతం, ఆచారం, సంప్రదాయం పేరుతో కరుడుగట్టుకుపోయిన దురాచారాలను, మూఢవిశ్వాసాలన నిలదీసి నిగ్గదీసి ప్రశ్నించి చీల్చి చెండాడి హేతువాద భావ వ్యాప్తికి వేమన చేసిన కృషి నిరుపమానమైనది. "రాలు బొమ్మలకేల రంగైన వలువలు" అంటూ విగ్రహారాధనను నిరసించాడు. "కులము హెచ్చు తగ్గు గొడవల పనిలేదు." అంటూ అందరిదీ మానవ కులమని ఎలుగెత్తి చాటాడు. "పిండములను చేసి

పితరులను తలపోసి కాకులకు పెట్టు గాడెల్దారా పెంట తినుడు కాకి పితరు డెట్లాయెరా" అంటూ పితృదేవతలకు చేసే పిండ ప్రదానాలను ఎద్దేవా చేశాడు. "విప్రులెల్ల జేరి వెర్రి కూతలు కూసి సతి పతులను గూర్చి సమ్మతమున మును ముహూర్త ముంచ ముండెట్లు మోసెరా" అంటూ తిథి, వారం, వర్జ్యం, నక్షత్రం అన్నీ చూసి ముహూర్తాలు పెట్టినా విపరీతాలూ కష్టాలూ కడగండ్లు ఎందుకు వస్తున్నాయని నిగ్గదీశాడు. హేతుత్వాన్ని ప్రాతి పదికగా చేసుకొని వేమన సంధించిన ప్రశ్నలు ఎన్నో ఆలోచనలకు ఆలంబినగా నిలుస్తాయి. "పాల సాగరమున పవ్వళించిన సామి గొల్ల ఇండ్ల పాలు కోరనేల" అనే పద్యం అటు భగవంతుని మనస్తత్వాన్ని హాస్యరస స్ఫోరకంగా తేట తెల్లం చేస్తుంది. వేమన మానవతా వాది. సంఘంలోని కుళ్ళను కడిగి వేయడం తోనే సరిపుచ్చక మానవ సేవయే మాధవ సేవ అని పేర్కొన్నాడు. "మాలవాని నేల మరిమరి నిందింప ఒడలనున్న మాంస మొకటి గాదె" అంటూ అస్పృశ్యతను కలాన్ని కత్తిగా చేసుకొని చీల్చి చెండాడాడు.

అనంతరకాలంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రుడు, అతని శిష్యుడైన సిద్దయ్య తత్వాలతో మతాలను నిరసించి, విగ్రహారాధనను,మూఢ విశ్వాసాలను ఖండించి సంఘ సంస్కర్తలుగా చరిత్రలో నిలిచి పోయారు. సామినేని ముద్దు నరసింహని నాయని గారు హితసూచిని అనే గ్రంథం ద్వారా మంత్ర తంత్రాల మార్మాలను; మహత్తుల బూటకాలనూ, భూత ప్రేత పిశాచాది మూఢ విశ్వాసాలను, అనాగరికమైన వర్ణ వ్యవస్థనూ, బాల్య వివాహాది విశ్వాసాలనూ ఖండించి స్త్రీ స్వాతంత్ర్యం, స్త్రీ విద్య ఆవశ్యకత, వితంతు పునర్వివాహాలు, మొదలైన వానిని ప్రోత్సహిస్తూ అభ్యుదయ భావాలకు బలమైన పునాదులు వేశారు. నవయుగ వైతాళికుడైన కందుకూరి సాంఘిక చైతన్యం కోసం రాజీ లేని పోరు చేశారు. వివేక వర్థిని, హాస్య సంజీవని అనే పత్రికల ద్వారా కులమతాచారాలను, సామాజిక లోటు పాట్లను వ్యాసాల రూపంలో ఆవిష్కరించారు. వితంతు వివాహాలు, స్త్రీ విద్య కంటె అభ్యుదయ భావాలను ప్రచారం చేశారు. ప్రహసన ప్రక్రియను చేపట్టి వ్యంగ్యం, చమత్కారం, అవహేళనతో నిశిత విమర్శలు చేశారు. రాజశేఖర చరిత్ర నవలలో ఆనాటి సమాజంలోని స్థితి గతులను చక్కగా ప్రతిబింబించి అనైతికమైన విలువల పై ధ్వజమెత్తారు. కోలాచలం. చిలకమర్తి ప్రహసనాలు కూడా ప్రజల అమాయకత్వంతో ఆడుకొంటున్న దురాచార పరాయణుల నిజ నైజాలను బహిర్గతం చేశారు. మానవతా వాదానికి నిలువెత్తు ప్రతీకగా నిలిచిన గురజాడ కన్యాశుల్క వ్యవస్థను ఎండగడుతూ వ్రాసిన కన్యాశుల్కం నాటకం ఆనాటి అవ్యవస్థ పై ధ్వజ మెత్తింది. విగ్రహారాధన, అస్పృశ్యత, మూఢ విశ్వాసాలను నిరసిస్తూ అనేక గేయాలు వ్రాశారు. దేవుడు చేసిన మనుషుల్లారా మనుషులు చేసిన దేవుళ్లారా మీ పేరేమిటి అనే కథ ద్వారా గురజాడ మత మౌఢ్యాలను ఖండించారు విజ్ఞాన శాస్త్రమే మానవ జీవితానికి పూల బాటలు వేస్తుందని గురజాడ చాటి చెప్పారు. అనంతర కాలంలో స్పష్టమైన భావ జాలంతో హేతువాద భావ వైఖరితో భావ విప్లవం కోసం పాటు పడిన హేతువాద ఉద్యమ పితామహుడు త్రిపురనేని రామస్వామి.

## 6.3 హేతువాద యుగకర్త - త్రిపురనేని

నూతన భావ విప్లవాన్ని ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రవేశ పెట్టి హేతువాదానికి తిరుగులేని పునాదులు వేసిన హేతువాద యుగకర్త త్రిపురనేని రామస్వామి. అంతకు పూర్వం సంస్కరణ పేరుతో వెలువడిన సాహిత్యం, జరిగిన ఉద్యమాలు ఒక ఎత్తు అయితే భావదాస్యానికి ప్రతీకలైన పురాణాలను, వాటి ప్రభావాలనూ తుదికంటా నిర్మూలించడానికి కంకణం కట్టుకొన్న త్రిపురనేని నిరంతర కృషి ఒక ఎత్తుగా నిలుస్తుంది.భావదాస్య శృంఖలాలను పగులగొట్టి సమాజ రుగ్మతను రూపుమాపి జాతిని జాగ్రుతం చేయడానికి ఒక ఉద్యమాన్ని వినేత్న తత్వాన్ని సృష్టించారు. త్రిపురనేని ఒక వ్యక్తి అనడం కన్నా హేతువాద ఉద్యమ సమూహ శక్తిగా నిలిచాడు అనడం సమంజసం. త్రిపురనేని రచయిత, విమర్శకుడు, సంఘ సంస్కర్త, భావ విప్లవాన్ని ప్రజ్వలించి నవ భారత వికాసానికి లక్ష్యించి మానవతకు పట్టాభిషేకం చేసిన వీరి కృషి అనన్య సామాన్యం. పురోహిత వర్గ వ్యతిరేకతలో ప్రారంభమైన త్రిపురనేని కృషీవత్వం తుదకు నాస్తిక వాదంతో పరాకాష్టను చేరింది. భావ విప్లవ సాధన కోసం ప్రప్రథమంగా త్రిపురనేని పురాణాల పై దాడిచేసి ప్రశ్నించడం, ఆలోచించడం, వివేచించడం అనే ప్రగతిశీల భావాలను ప్రజలకు నేర్పారు. కురుక్షేత్ర సంగ్రామం, కుప్పుస్వామి శతక, ధూర్త మానవా, సూతాశ్రయ గీతాలు, వివాహ విధి అనే నాటకాలూ, గీతాలను రచించారు. త్రిపురనేని అవిశ్రాంత కృషితో హేతువాదం ఒక ప్రభంజనంలో ఆంధ్రదేశాన్ని చుట్టు ముట్టింది. అనైతిక పరుల గుండెల్లో ఒక కలకలాన్ని, ఒక కలవరాన్ని సృష్టించింది. ఎందరో త్రిపురనేని అభిమానులుగా మారి ఉత్తేజితులై ఉద్యమ స్ఫూర్తితో హేతువాద రచనలు చేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే త్రిపురనేని భావాలు హేతువాదులకు అడుగు జాడలుగా, గురుజాడలుగా నిలిచాయి. తన కలంబలంతో పురాణాలలోని అసత్యాల పై ధ్వజమెత్తాడు.

పంచమ వేదంగా కీర్తిని పొందిన మహాభారతంలోని ఇతివృత్తం పాండవుల చరిత్ర. పాండవులు సన్మార్గులనీ, కౌరవులు దుర్మార్గులనీ లోకంలో ప్రసిద్ధి చెందినది. త్రిపురనేని ఆభావాలను విస్ఫోటించి కౌరవపక్షం వహించి పాండవులు దాయ భాగానికి అనర్హులని హేతుబద్ధమైన విధానంలో నరూపించి తెలుగు సాహిత్యంలో అలజడిని సృష్టించారు. రామస్వామిగారి హేతు దృష్టికి కురుక్షేత్ర సంగ్రామం చక్కని నిదర్శనం. ఇది 1910 లో ముద్రించబడింది. హస్తినాపుర రాజ్యం పరిపాలించిన వారి పూరు, భరతాదుల నుండి శంతన మహారాజు వరకు రాజులందరూ జ్యేష్ఠాను క్రమాన్ని పాటించారు. భీష్ముడు అగ్రశుద్ధుడైన తండ్రి కోసం రాజ్య సన్యాసం చేశాడు. చిత్రాంగద విచిత్ర వీరుడు సంతానం లేకుండా మరణించడం వలన దేవర న్యాయం చేత ధృతరాష్ట్ర, పాండురాజులు ఆ వంశంలో జన్మించారు. వీరిద్దరికీ కూడా అంటే అంధుడైన ధృతరాష్ట్రునకు, పాండు రోగ పీడితుడైన పాండురాజుకు రాజ్యార్హత లేదన్నాడు. అన్నను సింహాసనాధిష్టుని చేసి పాండురాజు రాజ్యాన్ని వ్యాపింపజేశాడు. రాజ్య సింహాసనం కోసం ఈ ఇద్దరి కొడుకుల మధ్య పోరాటం సంభవించింది. ధృతరాష్ట్రుడు రాజు గనుక అతని కుమారునకే రాజ్యార్హత ఉన్నది . రాజ్యం అవిభాజ్యం గనుక పాండవాగ్రజుడు భాగమును కోరుట అర్హుడు కాదు. 12 సంవత్సరములు తరువాత ఆస్థిని పరాధీనం అయిన యెడల దాని మీద హక్కు కోల్పోవుదురు. పాండవులు 13 సంవత్సరములు రాజ్యము నందు లేకపోయిన రాజ్యాధికారం కోరుట అన్యాయమని త్రిపురనేని భావించాడు. అష్టాదశ పురాణాల కోవలోకి చేరకపోయినా ఋుతు పురాణం కూడా ఉత్తమ పురాణమే. "ఋుతు పురాణము గాదిది, పాత పురాణమును గాదు పాతక హరణమౌ సూతపురాణం బియ్యది" అని త్రిపురనేని పేర్కొన్నారు. పురాణంలలోని వైరుధ్యాలను అసందర్భాలను వెలికితీసి కాలానుగుణమైన వ్యాఖ్యను కవిరాజు చేయడం ఆయన గొప్పతనానికి నిదర్శనం. సూత పురాణంలో ధర్మశాస్త్రాల్లోని ధర్మనిర్ణయాన్ని కవిరాజు ఖండించారు. వాటిల్లో అధర్మాన్ని బయట పెట్టారు. ముఖ్యంగా మనుస్మృతిలోని శిక్షాస్మృతిని ప్రశ్నించారు ధర్మా ధర్మాల పేరుతో కొన్ని వర్గాల ప్రజలను బానిసలుగా చేయడాన్ని నిరసించారు. పురాణాల్లోని పరస్పర విరుద్ధ గాధలు, అసంబద్ధమైన కథలు కవిరాజు హేతు దృష్టికి నిలువలేక పోయేవి. అభూత కల్పనలకు పురాణాలు పుట్టినిల్లు అంటూ విమర్శించాడు. ఇంద్రుడు పర్వతాల రెక్కలు విరగ్గొట్టాడని, కోతులకు, కొండులకు మనుషులు పుట్టారని, అగస్త్యుడు సముద్ర జలాన్ని పానం చేశాడని, హిరణ్యాక్షుడు భూమిని చాపగా చుట్టాడనిన పురాణాలలోని విషయాలను హేతు దృష్టితో ప్రశ్నించాడు. సూతపురాణం తరువాత కవిరాజు రచనలలో మేలు బంతి అనదగినది భగవద్గీత, వ్యాసభగవద్గీతను వ్యంగ్యంగా ఈ గ్రంధంలో చిత్రించారు. యుద్ధంలో అర్జునునికి శ్రీకృష్ణుడు గీతోపదేశం చేయగా పల్నాటి యుద్ధంలో బ్రహ్మనాయుడు బాలచంద్రునికి గీతోపదేశం చేసినట్లు భగవద్గీతలో చిత్రించారు. చాతుర్వర్ణ్య వ్యవస్థను ప్రస్తావిస్తూ భూమి మీద ఉన్న వర్ణాలు మూడు అని గౌతముడు, చతుర్వర్ణాలను నేనే సృష్టించానని కృష్ణుడు పేర్కొన్నారు. పంచమ వర్ణం ఎక్కడిది అంటూ వర్ణ వ్యవస్థ పుట్టుపూర్వోత్తరాలను చర్చించాడు.

వర్ణములు నాల్గు తొలుత నేర్పఱచి పిదపఁ
బ్రజ సృష్టించితి ననుమాట వట్టి మాట
ప్రజల సృష్టిఁ జేసి గుణకర్మల చేత
వర్ణములను మూఁడింటి నేర్పఱచినాడు.

స్వార్థపరులు, ద్రోహచింతనులు అయినవారు తమ తమ సుఖ సంతోషాలకోసం కొన్ని జాతుల వారిని శాశ్వతంగా అణచి పెట్టారని విమర్శించారు. మానవతా భావాలు, ధార్మికత అంతర్లీనంగా ఈ గ్రంధంలో కనిపిస్తుంది. సామాజిక రుగ్మతలను దృష్టాంతములు, సామెతలు, జాతీయాలతో సూటిగా ఘాటుగా రచించిన ఖ్యాతి కవిరాజుకే దక్కుతుంది". గుడికి తఱచు పోయి గొణుగు చుండెడి వాడు చెడ్డ పాపమేదో చేసి యుండు" అంటూ కుప్పుస్వామి శతకంలో చురకలు వేశారు. ప్రతి పద్యంలో హాస్యం, వ్యంగ్యం తొంగి చూస్తూ ఉంటాయి. సూతాశ్రయ గీతాలు జాతీయ భావాలకు, దేశభక్తికి దోహదం చేస్తాయి. తెలుగు రాజుకు, తెలుగు ప్రజలకు అపఖ్యాతినార్జించే కథలను ప్రచారం చేయవద్దంటూ చరిత్రకు భిన్నంగా అనేక అభూత కల్పనలతో నిండిన ప్రతాపరుద్రయంను విమర్శించాడు. వివాహంలో పూజా పురస్కారాలు, మంత్రాల అధ్యయనం ఒక వర్గం వారు గుత్తకు తీసుకోగా ఆ దురాచారాన్ని రూపు మాపడానికి తెలుగు భాషలో సులభమైన శైలితో కవిరాజు వివాహవిధి రచించారు. వధూవరులకు అర్థం కాని మంత్రాలు చదివి లాభమేమిటి? తెలియని భాషలో నీతి బోధలవల్ల ఉపయోగం లేదు. అందుకే వివాహరంగంలో సంస్కరణలు ప్రవేశ పెట్టారు. సంస్కృతమంత్రాలను తెలుగులోకి మార్చి

వధూవరులకు అర్థమయ్యేలా తామాచరించవలసిన విధులను సూచించాడు. దీనివల్ల వైవాహికం ద్వారా తమకు సంక్రమించే బాధ్యతలు, విధులు వధూవరులు అర్థం చేసుకున్నారు. న్యాయ శాస్త్రానికి అణుగుణమైన పద్ధతిలో దుర్వ్యయం లేకుండా వివాహ పద్ధతికి దోహదం చేసింది. మానవ జీవిత ఆవిష్కరణకు మూఢ విశ్వాసాల విచ్ఛేదనకు తన కలాన్ని, జీవితాన్ని అంకితం చేసి తెలుగు హేతువాద ఉద్యమ పితామహుడైన కవిరాజు త్రిపురనేని ఒక నూతన వికాసానికి మార్గదర్శకు లయ్యారు.

## 6.4 ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ ఆవిర్భవం

1937-47 మధ్య కాలంలో జి.వి. గోపీచంద్, కొగంటి, అబ్బూరి ప్రభృతులు వ్యాసాలూ, ఉపన్యాసాలు, కథలు, నాటకాల ద్వారా హేతువాద ఉద్యమానికి బాటలు వేశారు. యస్. రామ నాథన్ కృషితో మద్రాసులో భారత హేతువాద సంఘ స్థాపన జరిగింది. ఈ సంఘ స్థాపనకు పూర్వమే పురోహితుల దుశ్చర్యలను ఖండిస్తూ "రీజన్" అనే పత్రిక బొంబాయి నుండి వెలువడేది. భారత హేతువాద సంఘ మహాసభలు తెనాలి, హైదరాబాద్ లో జరిగాయి. ఈ మహాసభలలో చురుకుగా పాల్గొన్న ఆవుల గోపాల కృష్ణమూర్తి, ఆవుల సాంబశివరావు, యన్. ఇన్నయ్య, యం.వి. రామమూర్తి, గోరా ప్రభృతులు ఉన్నారు. భారత హేతువాద సంఘం ఆధ్వర్యంలో 1917 లో విజయవాడ నాస్తిక కేంద్రంలో ఆవిర్భవించి అక్కడే సమసి పోయింది. 1975 లో రెండు పర్యాయాలు, 1976 లో అబ్రహమ్, ఎ.టి. కోవూరు ఆంధ్రప్రదేశ్ లో పర్యటించారు. వీరి పర్యటనలతో ఆంధ్రప్రదేశ్‌లో తిరిగి హేతువాద ఉద్యమం ఊపునందుకొంది. తోటకూర వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 1976 లో చార్వాక పత్రిక ఆవిర్భవించింది. చార్వాక పబ్లికేషన్ పేరున హేతువాద గ్రంధాలు, కరపత్రాలు ముద్రింప బడ్డాయి. చార్వాక అధ్యయన తరగతులు నిర్వహించబడ్డాయి. హేతువాద ఉద్యమ నాయకులు రావిపూడి వెంకటాద్రి అధ్యక్షులుగా ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం 1979 లో తిరిగి ఆవిర్భవించింది. తద్వారా ఆంధ్రదేశంలో హేతువాద ఉద్యమం ఉవ్వెత్తున లేచిన కెరటంలా విరుచుకు పడింది.

## 6.5 హేతువాద సాహిత్యం

హేతువాద ఉద్యమం బలంగా వేళ్లూను కొనగానే ఎందరో రచయితలు స్పందించి హేతువాద నేపథ్యంతో గ్రంధాలను రచించారు. దీనితో యువత నవత వైపు అడుగులు వేసింది. భారత భాగవత రామాయణాలను ఆధారం చేసుకొని అందులోని అహేతుకమైన విషయాల బండారాన్ని బట్ట బయలు చేస్తూ రచనలు పుంఖాను పుంఖాలుగా వెలువడ్డాయి. ఆచారం, సంప్రదాయం, మూఢ విశ్వాసాల మాడు పగలగొట్టే రచనలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకొన్నాయి. హేతువాద సిద్ధాంతాలపై విశ్లేషణాత్మకంగా, వివరణాత్మకంగా ఎన్నో అత్యుత్తమ గ్రంధాలను రచించి ఆ కోవకు చెందిన ఉద్యమ నిర్మాణకర్తలలో అగ్రగణ్యత పొందిన ఘనత రావిపూడి వెంకటాద్రి గారికి దక్కుతుంది. హేతువాద మంటే అనే సిద్ధాంత గ్రంధాన్ని యం.వి. రామమూర్తి రచించారు. కొడవటి గంటి కుటుంబరావు "బ్రాహ్మణులు' ' ఒక అనార్యగాథ, కొత్తి సత్య నారాయణ "రామాయణ రహస్యాలూ" కొప్పరపు సుబ్బారావు "శాస్త్ర దాస్యం" కొల్లా సుబ్బారావు "హ్యూమనిస్ట్ విద్యా విధానం", యం.వి. రామమూర్తి "జిల్లెళ్లమూడి అమ్మ", ముక్కాముల నాగభూషణం "వెర్రిపడగలు" శతావతారాలు" హేతువాద నేపథ్యంతో వెలువడి సంచలనాన్ని సృష్టించాయి. మూఢ, మూర్ఖ విశ్వాసాలను ఖండిస్తూ శాస్త్రీయమైన దృక్పధం, కోణంలో వెలువడిన గ్రంధాలలో ముప్పాళ రంగ నాయకమ్మా "నవ్య మానవ వాదం" "నీడతో యుద్ధం", సి.వి. "హేతువాద నాస్తికోద్యమం రంగనాయకమ్మాకు సమాధానం, శ్రీ రామకృష్ణ "అరెరె రంగ నాయకమ్మా మీకు నాస్తికత్వం తెలుసా" మొదలైన గ్రంధాలు వెలువడ్డాయి. దీనితో సిద్ధాంత పరమైన చర్చ దారిమళ్లి వ్యక్తిగత దూషణలకు, వివాదాలకు దారితీసి హేతువాద ఉద్యమానికి విఘాతం కలిగింది. సి.వి. "వర్ణ వ్యవస్థ", "ఆధునిక యుగంలో కులవ్యవస్థ", కత్తి పద్మారావు "కులం పువాదులు", యన్.వి. బ్రహ్మం "బైబిల్ బండారం", "మెదడుకు మేత", ఈశ్వర్ ప్రభు "మత గ్రంధాల మాయాబజార్", వెనిగళ్ల సుబ్బారావు" "రామాయణం రంకు", "పెళ్లిమంత్రాల బండారం", "సుప్రభాత శృంగారం", జి. పోలయ్య "విమర్శ రామాయణం", "పురాణాల్లో బూతు", పిలక రాయుళ్లు", శ్రీరామకృష్ణ "నాస్తికత్వ సిద్ధాంతం" "మత మంటే ఏమిటి", యల మంచలి వెంకటప్పయ్య "దేవుళ్లు ఎవరి కొరకు", తోటకూర విజయలక్ష్మి" "హేతువాదుల సూక్తులు, వచనాలు" వంటివి రచించబడ్డాయి.

ఈ గ్రంథాలతో పాటు చార్వాక వారి ప్రచురణలో "ఆలోచించండి", "మత మౌఢ్యం పై పిల్ల దండయాత్ర", కదలి "హేతువాద వ్యాసాలు", మానవుడు సమాజం, ప్రకృతి, రాడికల్ హ్యూమనిజం ముఖ్యమైనవి. ప్రజాస్వామ్య ప్రచురణల పేరుతో యం.వి. రామమూర్తి "మానవ నాగరికత", ఫాసిజం మొదలైన గ్రంథాలు వెలువరించారు. నాగుల పాలెం నాస్తిక సమాజం "మతం గుప్పిట్లో మహిళ", "మరణానంతరం వేరే జీవితముంటుందా" గ్రంథాలూ, కోవూరి వ్యాసాలు, విజయవాడ నాస్తిక కేంద్రం ఆధ్వర్యంలో "నాస్తికత్వం, "జీవితం నేర్పిన పాఠాలూ' "ప్రజాస్వామ్యం పెరగాలంటే నాస్తికత్వం కావాలి" మూఢ నమ్మకాలూ, నాస్తిక దృష్టి, "నాస్తికత్వం అభివృద్ధి చరిత్ర", "సంఘ దృష్టి", "సైన్స్-నాస్తికత్వం కావాలి", "బాణామతి అబద్ధం", "సృష్టి రహస్యం" "నేను నాస్తికుణ్ణి", "అతీత శక్తుల బండారం", "పునర్జన్మ కట్టు కథలు", నెల్లూరు హేతువాద సంఘం ప్రచురణలో "సృష్టికి మూలం ఏమిటి" "మతం అంటే", "హేతువాద ఎందుకు", గ్రంథాలు ప్రామాణికంగా నిలిచాయి. తెలుగు పౌరాణిక నాటకాలూ హేతువాద దృక్పథం అనే సిద్ధాంత గ్రంథాన్ని రచించిన డాక్టర్ తోటకూర ప్రభాకరరావు హేతువాద సాహిత్య వికాసానికి విశేషమైన కృషి చేశారు.

## 6.6 తెలుగు నాటకం - హేతువాదం

జాతిని జాగృతం చేసేది "జాతి జీవితాన్ని ప్రతిబింబించేది నాటకం". "కావ్యేషు నాటకం రమ్యం" అనీ "నాటకాంతం హిసాహిత్యమ్' అని నిర్వచించారు. వేయి ఉపన్యాసాలు కలిగించని స్పందనను నాటకం కలిగిస్తుంది. కందుకూరితో ప్రారంభమైన తెలుగు నాటకం ధర్మవరం, కోలాచలం, చిలకమర్తి, పానుగంటి, బలిజేపల్లి, తిరుపతి వేంకట కవుల వంటి వారి కృషితో తెలుగు నాటకం ఆరంభ వికాస దశల్లో వికసించింది. తెలుగు నాటక ఆరంభ దశలో రామయణ, భారత వృత్తాలు ఎక్కువగా వెలువడ్డాయి. "పౌరాణిక నాటకాలలో సాధారణంగా ఒకే లక్షణం అంతర్నిహితంగా గోచరిస్తుంది. ఆయా పురాణాల ఆదర్శ వాక్యాలు, ధర్మ ప్రవచనాలు నీతి సూత్రాలనూ నాటక కర్తలే విశ్వసించారు. తాము విశ్వసించడమే కాదు ప్రజలంతా విశ్వసించాలనీ పౌరాణిక ధర్మాలు శిరోధార్యాలనీ, మరి అంతకన్న గత్యంతరం లేదని ప్రబోధించారు. ఈ పరిస్థితుల్లో సంఘాన్ని సముద్ధరించే నిమిత్తం విప్లవాత్మకమైన భావాలతో పురాణాలపై దాడిచేసి హేతువాద దృష్టిని పెంపొందించి తదనుగుణమైన హేతువాద నాటకాల రచనకు కొంత మంది నాటక కర్తలు పూనుకొన్నారు. ఈ దృక్పథంతో నాటక రచన చేయడానికి కొంత మంది రచయితలు సాంఘికేతి వృత్తాలను ఎన్నుకొంటే కొంత మంది పౌరాణిక ఇతి వృత్తాలను ప్రాతి పదికగా చేసుకొన్నారు. వీరు తమ నాటకాలలో సాంఘిక దురాచారాలనూ, ఆచార వ్యవహారాలను, మూఢ విశ్వాసాలనూ తిరస్కరిస్తూ తద్వారా సాంఘిక చైతన్యాన్ని ప్రదీప్తం చేయాలని భావించారు. సాంఘిక దురాచారాలను నిర్మూలించడానికి కందుకూరి, చిలకమర్తి ప్రధానంగా ప్రహసన ప్రక్రియను చేపట్టారు. వీరు తమ ప్రహసనాలను సాంఘిక సంస్కరణకు అత్యుత్తమ మైన సాధవంగా పరిగణించారు. కందుకూరి ప్రహసనలు సంఘంలోని అవినీతిని ఎంత కర్కశంగా విమర్శిస్తాయో, వాటిని పాటించి ఆదరించే వ్యక్తులను కూడా అంతే నిశితంగా విమర్శిస్తాయి. కందుకూరి పాశ్చాత్య ప్రహసనాలను అనువదించారు. ఈ అనువాదాలు కూడా తెలుగు దేశానికీ, తెలుగు వాతావరణానికి అనువుగా మలచుకొని తెలుగు దేశంలో ఆనాడు నిలదొక్కుకొని ఉన్న దురన్యాయాలను కూకటి వేళ్లతో పెకలించి వేయడానికి ప్రయత్నించాడు.

ఛాందసుల మీద, డాంభికుల మీద ఎక్కువ ప్రహసనాలను రచించిన చిలకమర్తి కృషి ప్రశంసనీయం. ఆడంబరాలకు పోయేవారు, మతం పేరుతో అస్తవ్యస్తంగా ప్రదర్శించే వారు, మూఢ విశ్వాసాల మీద, వరశుల్కం, కన్యాశుల్కాల పై, మద్యపాన, వ్యభిచారుల పై నిశితమైన విమర్శలు చేశారు. అందుమూలంగా ఈ ప్రహసనాలను అన్నింటినీ చిలకమర్తి తమ సంఘ సంస్కరణోద్యమానికి ఆలంబనగా, ఆయుధంగా స్వీకరించారు. కన్యాశుల్క వ్యవస్థను కూకటి వేళ్లతో పెకలించిన ఘనత గురజాడ కన్యాశుల్కం నాటకానికి దక్కుతుంది. వరవిక్రయ వికృత రూపాన్ని 'వరవిక్రయం' వేశ్యాలం పటత్వాన్ని "చింతామణి", మద్యపాన వ్యసనం మూలంగా నైతికంగా దిగజారిపోయే వారినీ హృదయ విదారకంగా చిత్రించిన 'మధుసేవ' నాటకాలను రచించిన కాళ్లకూరి కృషి ప్రశంసనీయమైనవి. 1928 ప్రాంతంలో పి.వి. రాజమన్నార్ హిందూ సంఘంలోని దురాచారాలను ఖండించడమే కాకుండా సంప్రదాయ బద్ధమైన ధర్మ ప్రవచనాలు కూడా పక్కకు నెట్టి పి.వి. రాజమన్నార్ "తప్పెవరిది" నాటిక ఆరోజుల్లో సంచలనాన్ని సృష్టించింది. తెలుగు నాటకం సంఘ సంస్కరణ ధ్యేయంతో మిగిలిన అన్ని ప్రక్రియల కన్నా ముందడుగు వేసింది.

### 6.6.1 తెలుగు పౌరాణిక నాటకాలు - హేతువాద దృక్పథం

సాంఘిక దురాచారాలు, ఆర్థిక పరమైన అంతరాలు సమసిపోయి మనిషి మనిషిగా ఎదగాలనీ, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో ఊపిరి పీల్చాలని, సత్యాన్వేషణతో అడుగు కదలాలని మనిషిని నీతిపరునిగా, సత్యశీలునిగా చేయాలని నాటక రచయితలు విశ్వసించారు. ఈ దిశగా మనిషిని తీర్చిదిద్దడానికి మానసిక చైతన్యం, భావ విప్లవం కలగాలి. మానవుని భావనలో ఎటువంటి మార్పు రానిదే ఏ మార్పూ, ఏ విప్లవం సత్ఫలితాలను ఇవ్వలేదు సాంఘిక చైతన్యం సమాజానికి సంబంధించినది. స్వేచ్ఛాప్రియత్వం మృగ్యమైపోతే మానవుని సుఖ సంతోషాలకు పరిధి గీయబడుతుంది. నాటక కర్తలు సమూలమైన మార్పును కోరి భావ విప్లవానికి ప్రతిబంధకాలైన మానవుని అంతరాంతరాలలో గూడుకట్టుకొని పోయిన కులం, మతం, దైవం మొదలైన విశ్వాసాలను విస్ఫోటనం చేయడానికి హేతుత్వాన్ని ఆశ్రయించి పౌరాణిక ప్రక్రియను చేపట్టారు. ఈ నాటక కర్తలు పౌరాణిక ప్రక్రియను చేపట్టడానికి బలమైన ప్రాతిపదిక కన్పిస్తుంది. పౌరాణిక నాటకాలు జన సామాన్యంలో విశేష ఆదరణకు నోచుకొన్నాయి. దానికి కారణం అందులోని ఇతి వృత్తం భారత, భాగవత రామాయణాలకు సంబంధించినది కావడమే. ప్రజాదరణకు నోచుకొన్న పౌరాణిక ప్రక్రియను చేపట్టిన పక్షంలో తమ లక్ష్య సిద్ధికి మార్గం సుగమ మౌతుందనె ఆశయంతో రచనలు చేశారు.

ఈ పౌరాణిక నాటక కర్తలు నాటక రచనకు పూనుకొనే సమయానికి ఇతిహాసాల పట్ల ప్రజలలో ఒక పూజ్య భావం నెలకొని ఉంది. ప్రజలకు పౌరాణిక నీతి సూత్రాలు శిరోధార్యాలు. ఈ విధమైన తత్వ ప్రతి పాదనతో నాటకాలు వెలువడుతున్న కాలంలో మూఢ విశ్వాసాలను నిరసిస్తూ హేతువాద దృక్పదంతో నాటక రచనను జత చేశారు. ఈ ఉద్యమాన్ని సంఘ తిరస్కరణోద్యమంగా డాక్టర్ పి యస్ ఆర్. అప్పారావు అభివర్ణించారు. ఈ నాటక కర్తలు భావ విప్లవం ద్వారానే సాంఘిక అసమానతలు నశించి మానవ కళ్యాణానికి కారణ భూతమౌతుందని భావించారు. విశ్వాసం చాలా బలీయమైనవి. శాసనాల ద్వారా వాటిలో మార్పు తీసుకొని రావడం కష్టసాధ్యం. ఒక విశ్వాసాన్ని తొలిగించాలంటే అంత కంటే బలీయమైన, హేతు బద్ధమైన మరొక విశ్వాసాన్ని ఆ స్థానంలో ప్రవేశ పెట్టడం ముఖ్యం. ఈ దృక్పధంతో త్రిపురనేని, ఆమంచర్ల గోపాలరావు, ముద్దు కృష్ణ, నార్ల, జి.వి. కృష్ణారావు, రామకృష్ణ మొదలైన వారు నాటకాలను రచించి లబ్ధ ప్రతిష్ఠులయ్యారు. ఇతి వృత్తాలను ఆధారంగా చేసుకొని హేతువాద నాటకాలను విభజించారు. అని రామాయణాంతర్గతమైనవి, భారతాంతర్గతమైనవి, భాగవతాంతర్గతమైనవి, పురాణాంతర్గతమైనవి, హేతువాద దృక్పధంతో రచించబడిన పౌరాణిక నాటకాలను ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చు.

| రచయిత | | నాటకం |
|---|---|---|
| త్రిపురనేని రామస్వామి | : | కురుక్షేత్ర సంగ్రామం |
| | | శంభుక వధ |
| | | ఖూనీ |
| ముద్దు కృష్ణ | : | అశోకం |
| ఆమంచర్ల గోపాలరావు | : | హిరణ్య కశిపుడు |
| చలం | : | శశాంక |
| | | సావిత్రి |
| | | సీత అగ్నిప్రవేశం |
| | | నరసింహావతారం |
| | | భానుమతి |
| | | హరిశ్చంద్ర |
| | | భిక్షాపాత్ర |

| | | |
|---|---|---|
| | | యాదవ ప్రళయం |
| | | దానధార |
| | | ధమ్మిల్లం |
| నార్ల వెంకటేశ్వరరావు | : | జాబిలి |
| | | సీతజోస్యం |
| | | నరకంలో హరిశ్చంద్రుడు |
| రామకృష్ణ | : | చార్వాకుడు |

ఎ) శంభుక వధ: దైవత్వం కోసం ఉగ్రతపస్సు చేస్తున్న శంభుకుని శ్రీరాముడు కత్తితో నరికివేయడం ఇతి వృత్తంగా శంభుక వధ రచించబడింది. ఈ ఘట్టంలో శ్రీరాముడు ఆకృత్యానికి పాల్పడినట్లు త్రిపురనేని హేతుబద్ధంగా నిరూపించారు.

బి) అశోకం: సీతాదేవి వివాహం, అరణ్యవాసం, సీతాపహరణం సీత అగ్ని ప్రవేశం వంటి సన్ని వేశాలతో, విప్లవాత్మకమైన మార్పులతో ముద్దు కృష్ణ రచించిన నాటకం అశోకం. ఈ నాటకంలో రావణుని పాత్రను ఉన్నత భావసంస్కారిగా, ఉదాత్తమైన వ్యక్తిత్వ శీలిగా ముద్దు కృష్ణ నిరూపించారు.

సి) సీత అగ్ని ప్రవేశం: సీత శీలాన్ని రాముడు శంకించడం రామాయణ ఇతి వృత్తం. రాముని ప్రేమను నిరసిస్తూ రావణుని ప్రేమను మన్నిస్తూ మలినమైన హృదయాన్ని నిర్మలం చేసుకోవడానికి సీత అగ్ని ప్రవేశం చేసినట్లు చలం హేతుబద్ధంగా వివరిస్తూ తీవ్రమైన పంథాలో ఈ నాటకాన్ని రచించారు.

డి) జాబాలి: నైతిక ధర్మాలూ, నైతిక కర్మలూ బ్రతుకు తెరువు కోసమేనని, పరలోకం, ధర్మప్రయోజనాలూ వర్గ ప్రయోజనం కోసమేనని, రామాయణంలో జాబాలి పాత్ర ద్వారా వివరించిన నాటిక 'జాబాలి' ని నార్ల రసవత్తరంగా రచించారు.

ఇ) సీత జోస్యం: మునుల సంరక్షణ కోసం అమాయకులైన ప్రజలను వధించడం ఉచితం కాదని సీత రామునితో వాదించినప్పుడు రాముడు ఆమె మాటలను తృణీకరిస్తాడు. నిరపరాధులైన వారిని చంపి మీ వంశ ప్రతిష్ఠలను నిలబెట్టు కోవడానికి బలిగా ఏదో ఒకరోజు ఏ నట్టడవి లోనో దిక్కులేని దానిగా వదిలి వేస్తారని జోస్యం చెబుతుంది. ఈ ఇతి వృత్తంతో నార్ల సీతజోస్యం నాటికను రచించారు.

ఎఫ్) కురుక్షేత్ర సంగ్రామం: పాండవులకు రాజ్యభాగం కోరు అర్హత ఇసుమంతా లేదని సోదాహరణంగా వివరిస్తూ దుర్యోధనుని సద్వర్తనునిగా, ధర్మరాజును దురాత్మునిగా చిత్రిస్తూ త్రిపురనేని కురుక్షేత్ర సంగ్రామం నాటకాన్ని రచించారు.

జి) సావిత్రి: సత్యవంతుని పై సావిత్రికిగల ప్రేమను పరీక్షించడానికి యమ ధర్మరాజు సావిత్రి మానాన్ని కోరడం సావిత్రి దానికి అంగీకరించడం వంటి విప్లవాత్మకమైన సంఘటనలతో చలం రచించిన నాటిక సావిత్రి.

హెచ్) యాదవ ప్రళయం: యాదవ కులం వినాశనం అంతః కలహాల మూలంగా జరిగిందే కానీ ముసలం పుట్టడం వలన కాదని, కృష్ణుడు భారతంలో ప్రదర్శించిన రాజనీతి బెడిసి కొట్టి యాదవులలో అంతః కలహాలకు దారి తీసిందని చలం రచించిన నాటకం యాదవ ప్రళయం.

ఐ) భానుమతి: మయ సభలో ద్రౌపతి పరాభవం, జూదంలో ద్రౌపతిని పణంగా పెట్టడం, ద్రౌపతీ వస్త్రాపహరణం వంటి సన్నివేశాల ఆధారంగా పురుషాహంకారాన్ని, అధికత్యను ప్రశ్నిస్తూ చలం రచించిన నాటిక భానుమతి.

జె) చార్వాకుడు: యజ్ఞ యాగాదులు, వర్ణాశ్రమ ధర్మాలూ, దైవం, సృష్టి మతం పట్ల చార్వాకుల సిద్ధాంతాలను సుస్పష్టం చేస్తూ రామ కృష్ణ రచించిన నాటిక చార్వాకుడు.

కె) ఖూనీ: భాగవతంలోని వేనరాజు కథను విశ్వనాధ నాటకంగా వ్రాయగా ఆపాత్రను విశ్వనాధ ఖూనీ చేశారనే భావంతో త్రిపురనేని ఖూనీ పేరుతో ఆ పాత్ర స్వభావాన్ని స్పష్టం చేస్తూ వ్రాసిన నాటకం ఇది. విశ్వనాధ సృష్టించిన వేనరాజు నరహంతకుడు కాగా త్రిపురనేని సృష్టించిన వేనరాజు మానవతావాది.

ఎల్) హిరణ్యకశిపుడు: లోక కళ్యాణానికి ప్రతిబంధకాలుగా భావించిన హిరణ్యకశిపుడు యజ్ఞ యాగాదులు, మతాచారాలను నిర్మూలించుటకు పూనుకొనగా మంత్రి, పురోహితుడు భయపడి ప్రహ్లాదుని భక్తిని ఆసరాగా చేసుకొని హిరణ్యకశిపుని వధించినట్లుగా మార్పులు చేస్తూ ఆ మంచర్ల గోపాలరావు రచించిన నాటకం హిరణ్య కశిపుడు.

ఎమ్) శశాంక: తారా శశాంకుల ప్రేమను ఉన్నతంగా భావించి బృహస్పతి వారిని ఒకటిగా చేశాడనే ఇతి వృత్తంలో చలం శశాంక నాటికను రచించారు.

ఎన్) నరసింహావతారం: తండ్రి పట్ల వైరం వహించిన ప్రహ్లాదుడు తండ్రిలోని దైవత్వాన్ని గ్రహించక పోవడం నేరమని శ్రీహరి చీవాట్లు పెట్టాడనే ఇతి వృత్తంతో చలం నరసింహావతారం నాటకంను రచించారు.

ఓ) దానధార: బలి చక్రవర్తి పాత్రలోని ఔన్నత్యాన్ని ఉదాత్తతను వివరిస్తూ చలం రచించిన నాటిక దానధార

పి) హరిశ్చంద్ర: కీర్తి దాహంతో హరిశ్చంద్రుడు కోరి కోరి తెచ్చుకొన్న కష్టాలను వివరిస్తూ నార్ల రచించిన నాటకం.

క్యూ) ధమ్మిల్లం: నత్కోరుని వాదనా పటిమకు నిలువలేని శివుడు ఉక్రోషంలో శపించాడనే ఇతివృత్తంలో రచించబడిన ధమ్మిల్లం నాటికను చలం హృద్యంగా రచించారు.

ఆర్) నరకంలో హరిశ్చంద్రుడు: హరిశ్చంద్రుడు చనిపోయి నరక లోకానికి వెళ్లినప్పుడు యమ ధర్మరాజు అతని తప్పులను విశ్లేషించడు, హరిశ్చంద్రుడు తన తప్పులను తెలుసుకొని తనకు పట్టిన దుష్ట గ్రహాలను వదిలించుకోవడం అనే ఇతివృత్తంతో నార్ల రచించిన నాటకం నరకంలో హరిశ్చంద్రుడు.

మానవునికి సత్యాన్వేషణ పట్ల ఆసక్తిని శాస్త్రీయ అవగాహన దృక్పధాన్ని కలిగించాలని, శాస్త్రీయ అవగాహన లేక పోవడం చేత మానవ హృదయం అనేక అశాస్త్రీయాలకు ఆలంబన అయినందున మానవునికి సంబంధించిన అన్ని అంశాలనూ, హేతుబద్ధంగా అధ్యయనం చేసి అతనిలోని మూఢ విశ్వాసాలను నిర్మూలించాలనీ సామాజికి అంశాలను వాటి మూలాలను అవగాహన చేసుకొని ఆ సమానతలను రూపుమాపి సమ సమాజ స్థాపన చేయాలని, మతరహితమైన నీతిని పెంపొందించి తద్వారా మానవత్వ విలువలను ఆవిష్కరింప చేయాలనే ఆశయంతో హేతువాదులు నాటక రచన చేశారు. హేతువాద నాటక రచయితలు భావంలో, భాషలో సంభాషణల్లో, సందేశంలో గానీ, తమ హృదయాలలోని నూతన భావాలను ఆవిష్కరింప జేయడానికి ప్రయత్నం చేసి సఫలీకృతులై తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానాన్ని పొందారు.

**సమీక్ష :**

చార్వాకం, బౌద్ధ జైనులు, సాంఖ్య, న్యాయ వైశేషికాలు ప్రాచీన భారతదేశంలో హేతువాదానికి బీజాలు వేశాయని ఆంధ్ర దేశంలోని ఉద్యమ వ్యాప్తిని హేతువాద పితామహుడైన త్రిపురనేని రామస్వామిని గురించి తెలుసుకున్నారు. తెలుగు పౌరాణిక నాటకాలలో హేతువాద దృక్పథం అధికంగా కనిపిస్తుందని త్రిపురనేని శంబుకవధ, ముద్దు కృష్ణ అశోకం, నార్ల జాబాలి, చలం సావిత్రి, మొదలగు నాటకాల ద్వారా తెలుసుకున్నారు.

## పరీక్షలలో రాదగిన ప్రశ్నలు

1. మూఢ విశ్వాసాలపై హేతువాదం చేసిన దాడిని వివరించండి.
2. ఆంధ్రదేశంలో హేతువాద పరిణామ వికాసాలు పేర్కొనండి.
3. హేతువాద వ్యాప్తికి నాటక కర్తల కృషిని వివరించండి.
4. తెలుగు సాహిత్యంపై హేతువాద ప్రభావాన్ని పేర్కొనండి.
5. హేతువాదం నీతికి గల సంబంధాన్ని వివరించి దాని పరిమితులను గూర్చి వివరించునది.
6. హేతువాదం లక్ష్యాలూ, ఆదర్శాలూ, కర్తవ్యాలను గూర్చి వ్రాయునది.
7. హేతువాదం సారూప్య వాదాలను సోదాహరణంగా వివరించునది.

## ఆధార గ్రంథాలు

1. తెలుగు పౌరాణిక నాటకాలు-హేతువాద దృక్పధం
డాక్టర్ తోటకూర ప్రభాకరరావు
2. మానవ నాగరికత - యం.యన్. రాయ్
అనువాదం. బి.యస్ యల్. హనుమంతరావు.
3. హేతువాదం - రావిపూడి వెంకటాద్రి
4. హేతువాదమంటే - యం.వి. రామమూర్తి
5. A Biographical dictionary of Modern
Rationalists - Joseph Mccabe.
6. THE TASK OF RATIONA LISM- A GOWANS WHYTF

డా॥ కందిమళ్ళ సాంబశివరావు

## పాఠం - 7

# దిగంబర కవిత్వం - ఆవిర్భావం - ఆవశ్యకత - సంపుటాలు

పాఠ్య నిర్మాణ క్రమం :

7.1 నాటి రాజకీయ పరిస్థితి

7.2 ఆర్థిక స్థితి

7.3 సాహిత్య స్థితి

7.4 అంతర్జాతీయ నేపథ్యం

7.5 దిగంబర కవుల ఆవిర్భావం

7.6 దిగంబర కవుల ఆవశ్యకత

7.7 ప్రారంభ దశ

7.8 పరిణామ దశ

7.9 పరిణతి దశ

7.10 సమీక్ష

7.11 ప్రశ్నలు

7.12 ఆధార గ్రంథాలు

లక్ష్యం :

ఆధునిక తెలుగు సాహిత్యంలో దిగంబర కవిత్వం ఒక ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించింది. దిగంబర సాహిత్య ఆవిర్భావ సమయం నాటి రాజకీయ ఆర్థిక స్థితిగతులు, దిగంబర కవిత్వ ఆవిర్భావం, దిగంబర కవుల భావాలలో విలక్షణత, దిగంబర కవిత్వంలోని మూడు సంపుటాలలో దిగంబర కవులు ప్రదర్శించిన వారి భావాలను గూర్చి తెలుసుకుంటారు.

దాదాపు రెండు దశాబ్దాల కాలం అభ్యుదయ కవిత్వం తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేసిన తరువాత దిగంబర శకం మొదలయింది.
"భావ కవుల నపుంసక హావభావాలకు సవాలు
అభ్యుదయ కవీ నల్లమందు తిని నిద్రపోయావ్" - అంటూ అభ్యుదయ కవిత్వంపై తిరుగుబాటు చేశారు దిగంబర కవులు.

### 7.1 నాటి రాజకీయ పరిస్థితి :

చైనా భారతదేశంపై యుద్ధం ప్రకటించడం, తర్వాత పాకిస్తాన్ భారతదేశం మీద యుద్ధాన్ని ప్రకటించడం వలన ప్రజలు యుద్ధవాతావరణం నుండి తేరుకోలేదు. ఇందిరాగాంధి ప్రధానమంత్రి అయినపుడు ఇది నెహ్రూ వారతస్వమంటూ పార్లమెంటరీ పద్ధతులపైన ప్రజాస్వామ్యంపైన ప్రజలు అభిమానాన్ని కోల్పోయారు. రాజకీయ రంగం కలుషితమయింది. రాయలసీమలోని కరువువల్ల, గోదావరి వరదలవల్ల దెబ్బతిన్న కోస్తా ఆంధ్ర ప్రజలు చాలా మంది ఉద్యోగ వ్యాపారాల నిమిత్తం హైదరాబాదు వెళ్ళారు. ఆందోళన చెందిన తెలంగాణావారు తమ అసంతృప్తిని వ్యక్తపరిచారు. ఫలితంగా ప్రాంతీయ తత్వం, మతతత్వాలను రెచ్చగొట్టినట్లయింది. పాలకులు ప్రజావ్యతిరేక చట్టాలను చేయడం, కొన్ని అరాచక చర్యలు జరగడంతో రాజకీయంగా ప్రశాంతత లేదు. సహజీవనం, సమానత్వం, సౌభ్రాతృత్వంలాంటి మాటలు రాజకీయ నినాదాలుగా మిగిలిపోయాయి.

### 7.2 ఆర్థిక పరిస్థితి :

రూపాయి విలువ పడిపోయి నల్లధనం పెరగడంతో ప్రజాస్వామ్యంలో ఆర్థిక వ్యత్యాసాలు పెరిగాయి. స్వాతంత్ర్యం సిద్ధించి రెండు దశాబ్దాలు గడిచినా ఆశించిన పురోగతి సమాజంలో కన్పించలేదు. కులం, మతం, ప్రాంతీయతత్వం లాంటి విభేదాలు ప్రజల్లో ద్వేషాన్ని పెంపొందించాయి. ప్రజలను నిరుద్యోగం, మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలు. అవిద్య మొదలైన సామాజిక జాడ్యాలు పట్టి పీడిస్తున్నాయి. ఆర్థిక సంక్షోభం, కరుడు గట్టిన సంస్కృతి, నిరాశానిస్పృహలు, నిరుద్యోగం, ఆందోళనలతో కొట్టు మిట్టాడుతున్న ఆనాటి సాంఘిక స్థితి దయనీయం.

### 7.3 సాహిత్య స్థితి :

మానవుడు శాస్త్రీయ విజ్ఞానంలో ఎంత పురోగతి సాధించినా వర్ణాశ్రమ ధర్మాలను ప్రవేశపెట్టాలనే వారూ, సాహిత్య అకాడెమీలకు, ప్రభుత్వ పాలనకు జేకొట్టే కవులు సాహితీ రంగంలో ఉన్నారు. అభ్యుదయకవి కుందుర్తి నాయకత్వంలో ఫ్రీవర్స్ ఫ్రంట్ ఏర్పడింది. వచన కవుల రచనలకు ఇది వేదికయింది. కుందుర్తి కవిత్వాన్ని ఆత్మాశ్రయ రీతిలో నడిపించారు. వ్యంగ్య కవిత పాఠకుల ఆదరణకు నోచుకుంది. ప్రజలను చైతన్యవంతుల్ని చేసి ముందుకు నడిపించవలసిన కవులు అనుభూతి వాదాలకు, ప్రయోగ వాదాలకు, సంస్కరణ వాదాలకు, వ్యాపార పత్రికల కోసం రచనలు చేసారు. శ్రీశ్రీలాంటి వారు సినీ పరిశ్రమలో స్థానం ఏర్పాటు చేసుకుంటే, విశ్వనాథలాంటివారు ఆ స్థాన పదవులకు, అకాడమీలకు ఎన్నుకోబడ్డారు. కవి అధికారానికీ, ధనానికి లొంగిపోయాడు. ఆంధ్ర పాఠకులను ఉత్తేజపరచిన అభ్యుదయం అడుగంటింది. డిటెక్టివ్ సాహిత్యం దిగంబరత్వం నాట్యం చేయటంతో సాహిత్య స్థితి దిగజారింది. కుందుర్తి, కాళోజి, దాశరథి కలాలనుండి మంచి రచనలు వచ్చినా పాఠకులను ఊహాలోకంలో విహరింపజేసే స్వాప్నిక సాహిత్యానికి ఆదరణ పెరిగింది.

### 7.4 అంతర్జాతీయ నేపథ్యం :

రెండు ప్రపంచ యుద్ధాలు జరిగినా అనేక దేశాధినేతల్లో యుద్ధకాంక్ష చల్లారలేదు. ప్రజల్లో అభద్రతా భావం ఏర్పడింది. యుద్ధ వ్యతిరేకత, కృత్రిమ నాగరికత మీద విముఖతగల కొందరు తీవ్రవాదంవైపు ఆకర్షితులయ్యారు. మరికొందరు సామాజిక, సాహిత్య రంగాల్లో ఈ విపరీత పోకడలనుండి బయటపడాలని యువతరం కాంక్షించింది.

ఇంగ్లండ్‌లో ప్రారంభమైన 'జార్జియన్' కవిత్వోద్యమం ఆధునిక కవిత్వానికి ఒక మలుపు. 'ఇమేజిజం', 'సింబాలిజమ్' ఈ శతాబ్దారంభంలో కవులు అనుసరించారు. చిత్రకళలోను, సంగీతంలోను వచ్చిన మార్పులు కవిత్వంమీద తమ ప్రభావాన్ని చూపించాయి. జర్మన్ కవుల కవితలు ఆంగ్లంలోకి అనువదించబడి ఆంగ్ల కవులకు ప్రేరణ కలిగించాయి. కవిత్వంలో అస్పష్టత ఉండవచ్చుని, ఉత్తమమైన కవిత్వంలో అస్పష్టత తప్పదని విలియమ్ లేవదీసాడు.

1930 తరువాత సర్రియలిజమ్, డాడాయిజమ్ వంటి నూతన సిద్ధాంతాలు తెలుగు కవిత్వంలో ప్రవేశించాయి. ఆరుద్ర, బైరాగి వంటి ఆధునిక కవులకు ప్రేరణ కలిగించిన ఇలియట్ కవితలు దిగంబర కవులకు కవితావేశాన్ని కలిగించాయి.

నిరాశ, నిస్పృహ, సంప్రదాయ నిరసన, యుద్ధ విముఖత మొదలైన అంశాలను వ్యతిరేకిస్తూ బీట్నిక్కులు 1950 తరువాత అమెరికన్ సాహిత్యంలో తిరుగుబాటు జరిపారు. ఇదే బీట్ జనరేషన్. బ్రిటన్‌లో యాంగ్రీయంగ్‌మెన్ ఉద్యమం వచ్చింది. పొరుగుదేశాల దాడితో గాయపడిన హంగరీ యువతరం 'గాయపడిన యువతరం' పేరుతో ఆందోళన చేశారు. ఇదే సమయంలో దేశంలోని అనేక సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లో 1958లో ఆ కలితరం కవులు 'హంగ్రీయంగ్ మెన్' బయలుదేరారు. ఈ అంశాలన్నీ ఆనాటి యువతరంపై ప్రభావం చూపాయి.

పారిశ్రామికీకరణ, నగరీకరణ వలన ఉమ్మడి కుటుంబాలు చిన్న కుటుంబాలు అయ్యాయి. మానవ సంబంధాలు తగ్గిపోయి ఆర్థిక సంబంధాలకు విలువ పెరిగింది. ఫలితంగా స్వార్థం పెరిగిపోవడం, అక్రమ పద్ధతుల్లో ధనార్జన చేయడం, విలాసాలకు అలవాటు పడటంతో నైతిక విలువలు పతనమయ్యాయి.

ఇరవయ్యో శతాబ్దిలో భారత స్వాతంత్రోద్యమం, ఆంధ్రోద్యమం, తెలంగాణా సాయుధ పోరాటం మొదలైన సామాజిక, రాజకీయ, సాంఘికోద్యమాలెన్నో వెలువడ్డాయి. సాహిత్య, రాజకీయ, సాంఘికరంగాలన్నింటిలోనూ యువత అనాసక్తంగానే ఉంది. దిగంబరకవిత్వం మొదటి సంపుటం వెలువడకముందు 'రాత్రి' కవితా సంకలనం వెలువడింది. దిగంబర కవులుగా అవతరించక ముందు కేశవరావ్, వెంకటేశ్వరావు, యాదవరెడ్డి ఈ సంకలనంలో కవితలు రచించి అలజడి సృష్టించినవారిలో ఉన్నారు. ముఖ్యంగా తెలుగు సాహిత్య రంగంలో ఏర్పడిన స్తబ్దత మీద హైదరాబాద్‌లో ఆరుగురు యువకవులు అలజడి ప్రకటించారు. వారే దిగంబర కవులు.

### 7.6 దిగంబర కవుల ఆవిర్భావం :

సంఘ దుస్థితికి, కలుషిత వాతావరణానికి పిచ్చెత్తి, రోదించి, నినదించిన కవిత దిగంబరకవిత. ఈ ప్రాపంచిక అచ్చాదనల్ని చీల్చుకుని కొత్త రక్తాన్ని ఇంజెక్ట్ చేయడానికి వచ్చిన యువకులు నగ్నముని, నిఖిలేశ్వర్, చెరబండరాజు, జ్వాలాముఖి, భైరవయ్య, మహాస్వప్న. దిగంబరశకం, నగ్ననామ సంవత్సరం, ఆశ ఋతువు అని వారు పేర్కొన్న కాలం 1965లో హైదరాబాద్‌లో తమను తాము దిగంబర కవులుగా ప్రకటించుకున్నారు. "మంచికోసం, మనిషిలోని నిప్పులాంటి నిజమైన మనిషి కోసం కపటంలేని చిరునవ్వులు చిందే సమాజం కోసం, అహోరాత్రులు ఆరని అగ్నిలో నడిచిన ఆత్మలలోంచి పలుకుతున్న గొంతుకులం" అని ప్రకటించారు.

ఇది సెక్స్ గ్రంథం కాదని ముందుగా చెప్పుకున్నారు. "ఈ దేశంలో ఈ గోళంలో ఊపిరి పీల్చే ప్రతి మనిషి ఉనికి కోసం తపనపడి, అతని భావిని చూసి వెక్కి వెక్కి ఏడ్చి పిచ్చెత్తి ప్రవచించిన కవిత" అని దిగంబర కవితను నిర్వచించారు. సాంఘిక ఆర్థిక రాజకీయ వ్యవస్థలమీద, వెన్నెముక విరిగిన యువతమీద, నిర్వీర్యమైన కళాకారుల మీద, కుళ్ళి దుర్గంధం వెదజల్లుతున్న కుష్ఠువ్యవస్థమీద తిరుగుబాటు చేస్తున్నామని చెప్పుకున్నారు. తెలుగు సాహిత్యంలోని నిర్వీర్యత మాలో అసహ్యాన్ని, ఆసహనాన్ని, కోపాన్ని కలిగించిందన్నారు. కడుపులో అనంతమైన కాలుష్యాన్ని దాచుకుని అంతులేని కల్లోలాన్ని అణుచుకుంటూ పైకి నిర్మలంగా, నిశ్చలంగా కన్పించే ఈ సమాజంలోకి దిగంబర కవులు నగ్నమైన ఆలోచనలతో, నగ్నమైన పదజాలంతో తమ నిరసనను తెలియజేస్తూ ప్రవేశించారు.

"మనిషిలో అట్టడుగున బురద గుంట్లో
పడి ఉన్న మనిషిని లేవదియ్యడం
ఎముకుల లోతుల్లో ధ్వనించే
స్వచ్ఛమైన గీతాల్ని ప్రతిధ్వనించడం
కళ్ళ వెనుక దాగివున్న
సిసలైన కన్నీళ్ళను ప్రసరించడం
గుండెల తీరాన్ని కొట్టుకునే
సహజమైన భావాల్ని ఒడుపుగా పట్టడం
పెదాల కొసల్లో చిక్కటి చిరునవ్వుల్ని మొలిపించడం

నిజాన్ని నిజంగా నగ్నంగా చెప్పడం" లక్ష్యంగా పెట్టుకున్నట్లు దిగంబర కవి భైరవయ్య పేర్కొన్నాడు.

దిగంబరకవులు కుల వ్యవస్థకు వ్యతిరేకం. అందుకే తమపేర్ల చివర ఉన్న రెడ్డి, రాజు, ఆచార్యులు మొదలైన పేర్లను తీసేశారు. పాత సంవత్సరాల పేర్లు, ఋతువుల పేర్లు మార్చినట్లే వారి పేర్లుకూడా మార్చుకున్నారు.

| | | |
|---|---|---|
| జ్వాలాముఖి | - | వీరవెల్లి రాఘవాచార్యులు |
| నిఖిలేశ్వర్ | - | యాదవరెడ్డి |
| నగ్నముని | - | మానేపల్లి హృషీకేశవరావు |
| చెరబండరాజు | - | బద్దం భాస్కరరెడ్డి |

మహాస్వప్న - కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు
భైరవయ్య - మన్‌మోహన్ సహాయ్

ఈ ఆరుగురూ మూడేళ్ళపాటు మూడు కవితా సంపుటాలను వెలువరించి తెలుగు సాహితీలోకానికి షాక్‌ట్రీట్‌మెంట్ ఇచ్చారు.

దిగంబర కవుల కవితా సంపుటాలు : ఇది దిగంబర శకం. మేం దింగంబర కవులం - మాది దిగంబర కవిత. ఇది సాహిత్యంలో దిగంబర కవిత్వోద్యమం. కవితా స్వరూపాన్ని బట్టి, స్వభావాన్ని బట్టి మేము రాస్తున్న దాన్ని వచన కవిత అని మేము అనదలచుకోలేదు. అననివ్వదలచుకోలేదు. 'వచన కవిత' అనే పదం మాకు నచ్చదు అని దిగంబరకవులు ప్రకటించుకున్నారు. తమ రచనలు కవితలు కాదంటూ 'దిక్'లని రెండవ సంపుటిలో పేర్కొన్నారు.

1956లో ప్రారంభమై మూడేళ్ళలో మూడు సంపుటాలు వెలువరించి సాహిత్య లోకంలో అలజడి కలిగించిన కవిత దిగంబర కవిత. అభ్యుదయ రచయితల సంఘం నిర్వీర్యమయ్యాక తెలుగు సాహిత్యంలో ఏర్పడిన స్తబ్దతను తొలగిస్తూ దిగంబరకవులు తిరుగుబాటు చేసారు.

మొదటి సంపుటం 1965 మే 6వతేది అర్థరాత్రి హైదరాబాద్‌లో 'నాంపల్లి పాండు' అనే రిక్షా కార్మికునిచేత ఆవిష్కరింపబడింది. రెండవ సంపుటి 1966 డిసెంబరు 8వ తేదీన విజయవాడలో 'జంగాల చిట్టి' అనే హోటల్ క్లీనర్ చేత, మూడవది 1968 సెప్టెంబర్ 19వ తేదీన అర్థరాత్రి 'యశోద' అనే బిచ్చగత్తెచేత విశాఖ పట్టణంలోనూ ఆవిష్కరించబడ్డాయి. ఈ మూటిల్లోనూ తొంభైమూడు కవితలున్నాయి.

## 7.7. ఆవశ్యకత :

దిగంబర కవిత రచించడానికి కారణాలను మొదటి సంపుటంలో పేర్కొన్నారు. ఈ గ్రంథంలో ఏమున్నదో తెలుసుకోవటానికి కూడా ప్రయత్నించని వెన్నెముకలేని వారి కోసం, కవిత్వం ప్రబంధయుగానికి ముందే ఇంకి పోయిందని కవి మేళాల్లో, కొన్ని పత్రికల్లో బాకాలూదే వారి కోసం, అసహ్యం అసహనం అరిగి పుచ్చి కుళ్లి దుర్గంధం వెదజల్లే మాటల్ని, భావాల్ని పట్టుకుని వేలాడేవారి కోసం రాయవలసి వచ్చిందన్నారు. మనిషి అంటే డబ్బే తప్ప, మనసారా నవ్వలేడు. గుండెలవిసేలా ఏడ్చి బాధను పోగొట్టుకోనూ లేడు. అందుకే మిమ్మల్ని మీరు మరచిపోయారు. దానికి కారణం మీ ముఖాల మీద వెళ్ళాడే ముసుగులే తార్కాణం.

'మేం ఆరుగురం, మాలోని నిజరూపాన్ని దర్శిస్తూ మా చుట్టూ ఉన్న మనుషులందర్నీ ప్రేమిస్తూ వాళ్ళనుకూడా ఆప్రయత్నం చేయమంటున్నాం. అందుకే మేం దిగంబరకవులం. మంచికోసం, మనిషిలోని నిప్పులాంటి నిజమైన మనిషికోసం కపటంలేని చిరునవ్వులు చిందే సమాజం కోసం అహోరాత్రులు ఆరని అగ్నిలో నడిచిన ఆత్మలలోంచి పలుకుతున్న గొంతుకులం. మేం పుస్తకాలలోంచి మాట్లాడదలచుకోలేదు. అనుభవాల్లోంచి పలకదలచుకున్నాం. అందుకే శంకరాచార్యులు ఇలా అన్నాడు. ఝీన్‌పాల్ సార్త్రే అలా అన్నాడు. అనదలచుకోలేదు. మేంమేంగా మాట్లాడదలచుకున్నాం. మా దిగంబర గొంతుకతో చెప్పదలచుకొన్నాం అంటూ తమ అభిప్రాయాలను వెల్లడించారు.

"కలియుగం రేడియోగ్రామ్‌లో
గిరగిర తిరుగుతున్న క్రీ.శ. ఇరవయ్యో శతాబ్దం రికార్డుమీద పిన్నునై
మానవత రెండు కళ్ళూ మూసుకు పోయినప్పుడు
విప్పుకుంటున్న మూడవ కన్నునై
కాలం వాయులీనం మీద కమానునై
చరిత్ర నిద్రాసముద్రం మీద తుఫానునై
నేను వస్తున్నాను దిగంబర కవిని
రాత్రి ఉదయిస్తున్న రవిని" అంటూ వారి రాకను మహాస్వప్న తెలియజేసాడు. ఆనాటి సంఘ వ్యవస్థను వర్ణిస్తున్న సందర్భంలో దిగంబర కవికి ఆవేశం కట్టలు తెంచుకు ప్రవహించింది. కీర్తికాముకుల, నియంతల, అహంతల దౌర్జన్యకారుల దురాక్రమణలో దేశదేశాలు

సుఖవ్యాధి పుండ్లతో చీడపురుగులతో నిండిపోయి భూమి వెలయాలై, పతితయై, భ్రష్టయై పుచ్చి గబ్బు కొడుతున్నప్పుడు దిగంబరకవిగా జన్మించినట్లు తమ అసహ్యతను ప్రకటించుకున్నారు.

"నాటేసిన చెట్లను నడిపించేందుకు
పాతేసిన రాళ్ళను పలికించేందుకు
గోరీల్లో శవాలకు పునరుత్థానం కలిగించేందుకు
వికృతాకారపు శిలల్ని మానవులుగా మలిచేందుకు
మరణించిన భగవంతుడికి ప్రాణం పోసేందుకు

నేను వస్తున్నాను దిగంబరకవిని" అంటూ ఆనాడు కలుషితమై పోయిన రాజకీయవాతావరణాన్ని, సమాజాన్ని మార్చాలనే తపనను ప్రదర్శించారు.

## 7.7 ప్రారంభదశ :

వీరి మూడు సంపుటాలను మూడు దశలుగా గుర్తించవచ్చు. మొదటిది ప్రారంభదశ, రెండవది పరిణామదశ, మూడవది పరిణతి దశ. గత చరిత్ర, నడుస్తున్న చరిత్ర యావత్తు మార్పులేకుండా స్తబ్దత ఆవరించిందనీ గాఢాంధకారంలో మునిగిపోయిన ప్రస్తుత సమాజ స్వరూప స్వభావాలను మార్చాలనీ అందుకు ముందుగా మనిషి మనిషిగా బ్రతకడం అవసరం కనుక మొదటి సంపుటంలో మానవస్థితినీ, మానవతా విలువలను గూర్చి దిగంబర కవులు తమ అభిప్రాయాలను ప్రకటించారు.

"నన్నయ్యను నరేంద్రుడి బొందలోనే
నిద్రపోనియ్యి
లేపకు
పీక నులిమి గోతిలోకి లాగుతాడు.

...............

పండిత వర్యా రికార్డులా నోరు త్రిప్పకు
నవ సృష్టిని కాలదన్నకు"

ఏ ఆచ్ఛాదనకి తలొగ్గని, ఏ భయాలకు లొంగని నిరంతర సజీవమానవుడి కోసం ఎలుగెత్తి పిలుస్తున్నామంటూ దిగంబర కవులు సమాజంలోని అన్ని విలువలను తీవ్రమైన పదజాలంతో విమర్శించారు.

"చచ్చిన రాజుల పుచ్చినగాధల
మెచ్చే చచ్చు చరిత్రకారులను
ముక్కు చెవులు కోసి అడగాలనుంది
మానవ పరిణామం నేర్పిందేమని" గత చరిత్రను జ్వాలాముఖి 'సూర్యస్థానం'లో ప్రశ్నించాడు.
"దిగంబర కవిత్వంలో అక్షరాలు
కామంతో పుచ్చిపోయిన

లతాంగి పయోధరాలపై నూతన నఖక్షతాలు" కాదని సాహితి సరస్వతికి కొత్త బంగారపు తొడుగులు అంతకన్నా కావనీ, పచ్చల హారాలు, ముత్యాల సరాలు, నవరత్నాలు అసలేకావంటూ భైరవయ్య స్పష్టం చేశాడు.

రేబవళ్ళ తిరుగలి మధ్య నామరూపాల్లేకుండా ఎప్పుడో ఒకసారి గప్పున గాలిలో కలిసేముందు ఒక్కసారి వెనక్కి మళ్ళి చూసుకొమ్మని చెరబండరాజు హెచ్చరిస్తూ-

"ఈ మహాపాపంలో
మనమంతా భాగస్తులం
రాగల యుగాల కొఱకు
అణువణువును చిదిమి చిదిమి
చైతన్యాగ్ని జ్వాలాముఖులమై
చితిపేర్చుకుందాం రండి" అంటూ పిలుపునిచ్చాడు.

మన పవిత్ర విశాల దేవాలయ ప్రాకారాలనడుమ పొడుగాటి గోపురాల నీడల్లో భగవంతుణ్ణి బంధించి వ్యాపారం చేసే స్థానంలో ఆపురావురంటూ ప్రతి మనిషిని స్వామీ అంటూ నోరు తెరచి అర్థిస్తున్న బిచ్చగాళ్ళ సంగతి ఆలోచించమన్నాడు. ఎవరికివారు డబ్బుకి దాస్యం చేస్తున్నప్పుడు -

"దేవుళ్ళ కోసం - రాజుల సమాధుల కోసం
బంగారు ఇటుకలతో గోడలు లేపే ఈ దేశంలో
మట్టి గోడల గోడు వినేవాడెవ్వడు" అని నిఖిలేశ్వర్ ప్రశ్నించాడు.

మనసులోని అభిప్రాయాలను పైకి కన్పించనీయకుండా ధరించిన ముసుగులను తన్నేయమన్నారు.

'మనిషి మనిషిగా
ఈ కృత్రిమ దుస్తుల్ని విప్పేసి
నగ్నంగా నిశ్చలంగా సజీవంగా సాక్షాత్తు మానవుడిగా ఎదగాలని కాంక్షించాడు నగ్నముని.

మొదటి సంపుటి చివరలో దిగంబరశకం కాలమానాన్ని ప్రకటించారు. నగ్ననామ, నిఖిలేశ్వరనామ, జ్వాలాముఖినామ, చెరబండ నామ, భైరవనామ, మహాస్వప్ననామ అంటూ ఆరు సంవత్సరాలను; ఆశ, తపన, అశ్రు, మదిర, విరహ, విషాద ఋతువులు ఆరు; స్నేహ, విశృంఖల క్రాంతి, సృజన, వికాస, అనంత ఆరువారాలను పేర్కొన్నారు. ఆరుగురి పేర్లతో ఆరుసంవత్సరాల పేర్లు పెట్టుకున్నారు.

### 7.8 పరిణామదశ :

నిఖిలనామ సంవత్సరం మదిర ఋతువు (1966 డిసెంబర్)లో దుర్భరంగా, హేయంగా, చండాలంగా ఉన్న ఆంధ్రదేశమనే మురిగ్గుంటలోంచి దిగంబర కవులు పలికిన కవితా ప్రచురణగా రెండవ సంపుటి వెలువడింది. సమకాలీన జీవితం మీద దిగంబర కవుల దృక్పథం ఇందులో కన్పిస్తుంది. నేటి చెత్త వ్యవస్థను సమూలంగా తొలగించి నిత్యనూతన మహత్తర వ్యవస్థ కోసం తపన పడ్తున్న దిగంబర కవులు తమ కోరికలను తెలియజేసారు. ఆదినుండి అనువాదానికి, అనుకరణకు అలవాటుపడి నేడు పాశ్చాత్య స్వరాలకు ప్రతినిధిగామారిన తెలుగు సాహిత్యానికి మౌలిక ధ్వనిని కోరుతున్నాం. నేటి కావ్య రచనలోనున్న జీవితంలోని నిజాయితీని, సరళత్వాన్ని, యుగసందేశాన్ని, అనుభూతుల అభివ్యక్తిని, ఊపిరిపీల్చగల ఆధునిక మానవుని అస్తిత్వాన్ని ఆవిష్కరించడం అవసరంగా భావించారు. నిజమైన అస్తిత్వం భౌతిక ఆనందంతోపాటు మనసుని సర్వదా సచేతనంగా ఉంచి అందరిలోనూ నిలబడి తనలోతాను జీవించడం. ఈ శాస్త్రీయ యుగంలో మనిషి ధనం వెనుక పిచ్చివాడై సుఖం, లాలస వెనుక తిరుగుతున్నాడు. తన నీడను చూసి తానే భయపడుతున్నాడు. అణ్వాభ్యున్నతితో మానవుడు ఈ ధరాతలంలో తప్పిపోయాడు. తప్పిపోయిన ఆత్మను పట్టితెచ్చి మనిషిని మనిషిగా చూడాలని మా కోరిక అని ప్రకటించాడు.

కుళ్ళి గబ్బు కొడ్తున్న కుల, మత, వర్ణ, వర్గ బురద గుంటల్లో పడి రాజకీయ వేత్తలు పురుగుల్లా ఈదుతున్నారన్నారు. ఇరవయ్యో శతాబ్దిలో మనిషి యంత్రపు విడిభాగంగా అస్తిత్వ రహితుడు కానక్కర్లేదని, శక్తితో కలసి యంత్రాన్ని నడపాలిగాని పక్కవాడి గొంతునొక్కడానికి దానిని ఉపయోగించకూడదనీ ఇప్పుడు లోకంలో జరుగుతున్నదదేనంటూ విమర్శించారు.

మతాలతోను, ఇజాలతోను తమకు నిమిత్తం లేదని, అంతర్జాతీయ రాజకీయ రంగంలో మనిషిని పణంగా పెట్టి ఇజాల పాచికలతో మాయజూదం ఆడకుండ చిత్తశుద్ధి, నిజాయితీలపై ఆధారపడిన సంఘ వ్యవస్థను, రాజకీయ దృక్పథాన్ని రూపొందించాలన్నారు.

ఈనాటి రాజకీయాలకు ప్రత్యామ్నాయం కావాలన్నారు. వ్యక్తి మంచికోసం పాటుపడే వ్యవస్థ నిర్మించబడాలి. వ్యక్తిని శాసిస్తున్న రాజకీయ మంత్రదండం విరిగిపోయి విలువలకోసం జీవించే జీవితం కోసం సంఘర్షణ కోరారు.

అగ్రరాజ్యాల నాయకులు గొప్పనట చక్రవర్తులు. విశ్వశాంతి కా॰ాలని ఉపన్యాసాలిస్తూనే అణ్వస్త్రాలపేరిట ప్రపంచ వాతావరణాన్ని విషమయం చేస్తున్నారు. వీళ్ళను, వీళ్ళ అమానుష చర్యలను దిగంబరకవులు అసహ్యించుకొన్నారు.

ఆంధ్రదేశమంతా జడత్వం ఆవరించిందని, పాలేరు మనస్తత్వంగల పాలకులు, వెన్నెముకలేని యువకులు, గుమస్తా మనస్తత్వం గల కళాకారులు, అకాడెమీలు, సంస్థలు అన్నిటిమీద వీరు క్షొరడా ఝుళిపించారు. దేశాన్ని కుష్ఠువ్యాధిలాగా పట్టుకున్న సినిమా ప్రభావం తగ్గాలని, విజ్ఞాన వినోద సాధనంగా సినిమాలుండాలన్నారు.

'ఈ జీవితంలో ప్రతి వస్తువునకు, సంఘటనకు సార్థకత, నిరర్థకత రెండూ ఉంటాయి. కర్మ సిద్ధాంత భయంతో గుడ్డిగా దేన్నో నమ్మి రాళ్ళకు మొక్కేవాడు నిజంగా నాస్తికుడు. ఏ అచ్ఛాదనకు తలొగ్గని, ఏ భయాలకు లొంగని నిరంతర సజీవ మానవుడి కోసం ఎలుగెత్తి పిలుస్తున్నామన్నారు.

"కోడి పందాలకీ గొర్రెపందాలకీ
కుత్తుకలు తెగ్గోసుకునే
ఓ ఆంధ్ర దేశమా!
నీ రోడ్లనీ గొడ్లనీ లారీల్ని మైకా గనుల్ని
టెండర్లనీ కాంట్రాక్టర్లనీ
మాదాకవళం మేధావుల్ని లంగామార్కు సినిమాలనీ
ఎండల్నీ కల్లుకుండల్నీ
పొగాకు పైకాన్నీ వంటింటి పత్రికల్నీ
ఇళ్ళు తగుల బెట్టుకునే సహజీవనాన్ని" - చూసి అసహ్యించుకున్నారు.
"వరదల్లో తేలాడే గ్రామాలు
బీళ్ళల్లో తిరుగాడే అస్థిపంజరాలు
రైళ్ళ కౌగిలింతల్లో రాలిన ప్రాణాలు
దహన క్రియా వేడుకల్లో ఊపిరాడని వాడలు
హత్యలు ఆత్మ హత్యలు సమాజం దినచర్యలు
రేట్ల బూట్ల క్రింద కొనుగోలు చీమలు
కల్తీ తామరలో ఎడారి ఓడలు
సమ్మెల్లో దుమ్ముల్లో సొమ్మసిల్లిన మానవతాకిరణాలు"

సామాన్యుల కడగండ్లు, కష్టాలను తమ కవితల్లో ప్రతిబింబించారు. నా దేశంలో నేను ఏకాకిని నా దేశం నాకు మిగిల్చిన మహా సమస్యలు ఉరితాడు అంటున్న నిఖిలేశ్వర్ నేను నా దేశానికి పరాయివాడిని, జ్వలిస్తున్న ఏకాకిని అని ఆక్రోశించాడు.

దేశం క్షామంతో అతివృష్టి, అనావృష్టితో బాధపడుతుంటే మతాధిపతులు, కవులు, కళాకారులు, షష్టిపూర్తి ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నారనీ, వారికి దేశ పరిస్థితులు ఆకలి అరుపులు పట్టవని దిగంబర కవులు ఆవేదన చెందారు.

"కవితలన్నీ కాపీకొట్టి
పరుల పద్దెం పదును పెట్టి
పరకాయ ప్రవేశం చేసినట్టి

కైంకర్యపు కవి పుంగవునికి
షష్టిపూర్తి" జరుపుతున్నారు.

ఎంతోమంది వాజమ్మలు వెంగళప్పలు షష్టిపూర్తి చేసుకుంటుంటే ఊళ్ళో ఉన్న పందులు, కుక్కలు ఆఖరికి గాడిదలు కూడా మేళతాళాలతో, పూలహారాలతో హాజరవుతున్నాయని విమర్శించారు.

"తలలు లెక్కించే ప్రజాస్వామ్యంలో
ఈ మనుషుల కాళ్ళ అడవిలోంచి
సర్వత్రా వ్యాపిస్తున్న
అయోమయపు దుమ్ములో
ముసలి నక్కలు లాభాలు పంచుకునే ఈ శ్రేయోరాజ్యంలో నీ బాధ తప్పదు".

ప్రజాస్వామ్యం పేరుతో ఒక్క ఓటు హక్కుతోనే అధికారంలోకి వచ్చి దేశాన్ని దోచుకు తింటున్నారనీ, అందుకు బాధ పడక తప్పదనీ రాజకీయ పరిష్కారం కోసం ప్రయత్నించారు.

"బీట లెత్తిన మీ కడుపు బీళ్ళలో
ఎరువులు వేసి పొలాలు దున్ని
కన్నీళ్ళతో పైరులు పెంచి
మీ బిడ్డల భావికి ఆకలి శోకం మాట
లేకుండా చేసేవాణ్ణి
కాకులు గద్దలు వదలేసిన ఎముకల్లాంటి
పదవుల్ని పట్టుకు
మిమ్మల్ని శాసించే వెర్రికుక్కల్ని తరిమి కొట్టేవాణ్ణి - అని చెరబండరాజు తనని ఆపవద్దని, వెనక్కు పిలవవద్దని హెచ్చరించాడు.

సామాన్యుల కడగండ్లు, అంతర్జాతీయ రాజకీయ రంగం, ప్రపంచ మానవుని కోసం ఎలుగెత్తి పిలవడం, సమకాలీన సమాజంపై దిగంబర కవుల దృక్పథం ఈ రెండో సంపుటంలో కనిపిస్తుంది.

### 7.9 పరిణతి దశ :

మూడవ సంపుటాన్ని దిగంబర కవుల పరిణతి దశగా భావించవచ్చు. మూడు సంపుటాల్లోనూ సమకాలీన వ్యవస్థపై తిరుగుబాటు చేస్తూ ఆవ్యవస్థ స్వరూపాన్ని తమ కవితల్లో వ్యక్తపరిచారు.

"ఓ నా ప్రియమైన మాతృ దేశమా
తల్లివి తండ్రివి దైవానివి నీవేనమ్మా
దుండగులతో కులుకుతున్న శీలం నీది
అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టు పెట్టిన అందం నీది" - అంటూ భారతదేశ ఆర్థిక స్థితిపట్ల, దేశ భవిష్యత్తుపట్ల వీరు ఆవేదనను వ్యక్తం చేశారు. దేశమంతటా రాజకీయ నాయకులు, పెద్ద పెద్ద బొజ్జలు, గొప్ప గొప్ప ప్రజారక్త వ్యాపారులు పదవికోసం, డబ్బుకోసం దేనికైనా తెగించే మహాత్ములు జాతి రక్త నాళాలనిండా, మహమ్మారిలా వ్యాపింపజేస్తున్న ఒక కుష్టు వ్యవస్థను నాశనం చేయడానికి బయటకు రావాలసిందిగా పిలుపునిచ్చారు. దేశం ఒక లావణ్రీగా తయారై కంపు కొడుతుంటే దానికి కారణాలేమిటో చూడకుండా ప్రపంచ పౌరుడిగా తన బాధ్యత లేమిటో పట్టించుకోకుండా ఆంధ్రుడు పేడపురుగు కన్నా హీనంగా జీవిస్తున్నాడన్నారు.

ఆంధ్రుడు రోజు రోజుకి మరింత నపుంసకుడిగా మారుతున్నాడంటూ అందుకు కారణాలు సూచించారు.

1) రాష్ట్ర ప్రజల అవసరాలు ఏమాత్రం పట్టించుకోకుండా రాజకీయ అశుద్ధంలో పొర్లుతున్న గ్రూపు పురుగులు, ఉపన్యాసాల నంగి వెధవలు, మెదడు లేని అడ్డగాడిదలు.

2) స్వర్గానికి షార్ట్ కట్ చూపిస్తామని ప్రజల్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్న సన్యాసులు, మతం పేరుతో ప్రజలను అజ్ఞానంలోకి తోసివేస్తున్న పీఠాధిపతులు, గోసాయిలు, బాబాలు-

3) ప్రజల చెమట సొమ్ముతో కళపేరుతో తోలు వ్యాపారం సాగిస్తూ ప్రజా స్వామ్య యుగంలో నటసామ్రాట్టులు, నట చక్రవర్తులమని బిరుదులు తగిలించుకుంటున్న సినీ హీరోలు -

4) సినీతారల బొమ్మలు వేసుకుంటూ ప్రతివారం ఇంత చెత్త దేశం మీద పోస్తున్న వారపత్రికలు, పత్రికాధిపతులు, సంపాదకులు.

5) సాహిత్య అనాథమీ (అకాడెమీ) బహుమతులకోసం వార పత్రికల్లో వాంతులు చేసుకుంటున్న రచయితలు - ప్రజల కోసమంటూ వీరంతా ఓ కుష్టు వ్యవస్థను ప్రజలపై రుద్దుతున్నారు.

6) విశ్వవిద్యాలయాలు ఈ కుష్టు వ్యవస్థను, దుర్గంధ సంస్కృతిని తరతరాలకు అంటించి వదలుతున్నాయి.

ఈ కుష్టు వ్యవస్థను, దాన్ని పోషిస్తున్న వాళ్ళను సర్వనాశనం చేయడానికి దిగంబర కవులు పూనుకున్నారు.

ప్రజల అవసరాలేమిటో ఎప్పటికప్పుడు రాజకీయ నాయకులు పట్టించుకునేలా చేయాలనీ, సంఘాన్ని దోచుకుతింటున్న వైనాన్ని చూపించమని యువతరాన్ని కోరారు. దేవుడి పేర జరుగుతున్న వ్యాపారాన్ని ప్రజలకు తెలిపేందుకు, సంఘంలో పేరుకుపోయిన మూఢ నమ్మకాలను పారదోలి మానసికంగా, ఆర్థికంగా వెనుకబడిన అమాయక ప్రజలను బలమైన జాతిగా తయారు చేయడానికి పనికొచ్చే చదువులు చెప్పే విధంగా విశ్వవిద్యాలయాలను మార్చడానికి యువతరం ముందుకు రావాలని యువ రక్తాన్ని మేల్కొనవలసిందిగా కోరుతున్నారు.

దిగంబర కవులకు ఈ వ్యవస్థలోని అలగాజనం ఆర్తనాదాలను కుక్కల మొరుగుడుగా విర్రవీగే కామాందులు కన్పించారు. ఇసుక నైవేద్యపు కాంట్రాక్టర్లు, కులాలు, మతాలు, మత మౌఢ్యాలు, కుమ్ములాటలు, ఓట్లకోసం పొడుచుకోవడం, చంపుకోవడం, జిరీకండువా సన్మానాలు, శవాలకు చుట్టిన బట్టలు విప్పుతున్న నాయకులు, మధ్య తరగతిని తినేస్తున్న ప్రాంసరీనోట్లు, కాళ్ళులేని స్కూళ్ళు, కడుపుకు అతకని కాలేజీలు, జ్ఞానగర్భ స్రావాలైన విశ్వ విద్యాలయాలు కన్పిస్తున్నాయి. యాభైకోట్ల కంఠాలు తిరుగుబాటు మంటలుగా మారాలని చెరబండరాజు పిలుపునిచ్చాడు.

పోరాటం ఊపిరితో ధైర్యం కవచంతో ప్రపంచం నిండా పాకిపోతున్న ఈ కొజ్జా పాలకుల్ని ఊచకోతగా కోయడానికి, ఈ మానవత్వం రక్తాన్ని పీలుస్తున్న తోడేళ్ళను పాతెయ్యడానికి, చెట్టు పేరుతో కాయలమ్ముతున్న గజదొంగల్ని చెట్లకే కట్టేయడానికి, వాళ్ళ డబ్బు పొట్టలో గునపాలు దింపడానికి ధైర్యం అగ్ని పర్వతంతో నాలోకి, ప్రజల్లోకి రమ్మని ఆహ్వానిస్తున్నారు.

"యువతీ యువకుల్లారా
మన్నుతిన్న పాముల్లారా
చిలుంనాకి బజ్జోకండి
ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ
కొలిం పెట్టి
పగల గొట్టి
చిలుం వదల గొట్టాల్సిందే
తరం మీది
బరువు మీది
బాధ్యత మీది
బావి మీది" - అంటూ యువతరానికి పట్టిన చిలుం వదలగొట్టే ప్రయత్నం చేశాడు చెరబండరాజు.

పీడితుడు, తాడితుడు, దరిద్రుడైన వానికి బోధివృక్షం పిడికెడు నీడనీయలేదు. గాంధీపథం గరిటెడు గంజి పోయలేదు. ధర్మశాస్త్రాలు తలదాచుకోనీయలేవు. కర్మ సిద్ధాంతం, బానిసను చేసి వదిలింది. అందుకే వాడు మత వడగాల్పులకు సొమ్మసిల్లి పడ్డాడు. ఖరీదైన కోర్టు భాషల్లో చెల్లని నాణ్యమై విసరబడ్డాడు. ఎన్నికల తిరునాళ్ళలో ఎంగిలి విస్తరాకులకై తోయబడ్డాడు. అయినా బతుకు పోరాటాన్ని సాగిస్తాడు. ఓటమిని సాహసంపైకి విసిరి ఆలోచనల వెలుగు రవ్వల్ని చూశాడు.

"తూర్పు పేలి పగులుతున్నప్పుడు
ఎరుపై దగ్గరలో వినబడుతున్నది
భరత వాక్యం బలంగా కనబడుతున్నది" - అని ఆశించాడు జ్వాలాముఖి.

మొదటి సంపుటిలో సామాజిక రుగ్మత పట్ల నిరసన, సత్యాన్వేషణ కనబడతాయి. రెండవ సంపుటిలో మనిషి ఉనికి కోసం తపన, సామాజిక అస్తిత్వ దార్శనికత కోసం అన్వేషణ, మార్క్సిజం పట్ల అనుకూలత ఉన్నాయి. సమస్యల పరిష్కారానికి సాయుధ పోరాట మార్గం సూచన ప్రాయంగా మూడో సంపుటిలో కనబడుతుంది.

ఈ మూడు సంపుటాలు వెలువడిన తరువాత భైరవయ్య, మహా స్వప్న బైటకు వచ్చారు. మహాస్వప్న ప్రజాతంత్ర పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూ చూసి మిగిలిన దిగంబర కవులు పత్రికా ముఖంగా చార్జిషీటు దాఖలు చేశారు.

"నీ మానసిక అరాచకత్వాన్ని ప్రదర్శించుకొని కక్షదారులైన సోకాల్డు పత్రికా విలేఖరి కుట్రకు ఘోరంగా బలయ్యావు." అంటూ తమలో అంతర్గతంగా సాగుతున్న మానసిక వైరుధ్యాలను బయట పెట్టారు.

ఒక విశ్వాసానికి కట్టుబడిన వారు మీరు. దేనికీ కట్టుబడని వాణ్ణి నేను అంటూ మహాస్వప్న తప్పుకున్నాడు. భైరవయ్య కూడా ఉద్యమం నుండి బయటకు వచ్చాడు. జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, చెరబండరాజు, నగ్నముని 1970లో ఏర్పడిన విప్లవ రచయితల సంఘంలో చేరారు. ఆరుగురి పేరుతో ఉన్న ఆరు సంవత్సరాలు, ఆరు సంపుటాలు వెలువడకుండానే దిగంబర శకం అంతరించింది.

## 7.10 సమీక్ష :

దిగంబర కవుల ఆవేశం, సాంఘిక రాజకీయ ఆర్థిక వ్యవస్థల మీద, కుళ్ళి దుర్గంధం వెదజల్లుతున్న కుష్ఠు వ్యవస్థ మీద దిగంబర కవులు ఆరుగురు చేసిన తిరుగుబాటు స్వరూపం వివరించబడింది. పైకి నిర్మలంగా నిశ్చలంగా కన్పించే ఈ సమాజంలోని కుళ్ళును తొలగించడానికి కృత్రిమ ముసుగులు తొలగించి సమాజ నిజ స్వరూపాన్ని చూపించడానికి దిగంబరకవులు ప్రయత్నించారన్న విషయం స్పష్టం. వీరు మానవతా విలువలను ప్రశ్నించారు. మన మనసులోని అభిప్రాయాలను పైకి కన్పించకుండా ధరించే ముసుగులను తొలగించమన్నారు. ఆధునిక మానవుని అస్తిత్వం ఆవిష్కరింపబడాలన్నారు. కులమత వర్గ విభేదాలతోను, రాజకీయ బురదలోను కూరుకుపోయిన సమాజాన్ని నిరసించారు. భారతదేశపు ఆర్థిక స్థితిపట్ల, దేశ భవిష్యత్తుపట్ల వెన్నెముకలేని యువతను గురించి ఆవేదన వ్యక్తపరిచారు.

## 7.11 ప్రశ్నలు :

1. దిగంబర కవితా కాలంనాటి సామాజిక పరిస్థితులను తెలియజేయండి.
2. దిగంబర కవుల భావాలను పరిశీలించండి.
3. దిగంబర కవిత్వ ఆవిర్భావ వికాసాలను తెలియజేయండి.

## 7.12 ఆధార గ్రంథాలు :


1) అభ్యుదయ సాహిత్యం - ఇతర ధోరణులు డా. యస్వీ సత్యనారాయణ
2) ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం - ఆచార్య కొలకలూరి ఇనాక్.
3) తెలుగు కవితా వికాసం - కడియాల రామమోహనరాయ్
4) దిగంబర కవులు - శేషాచలం అండ్‌కో.


ఆచార్య తేళ్ళ సత్యవతి

పాఠం - 8

# దిగంబర కవితా లక్షణాలు

**పాఠ్య నిర్మాణ క్రమం :**


8.1 తిరుగుబాటు తత్వం
8.2 అంతర్జాతీయ భావం
8.3 అణుయుద్ధ విముఖత
8.4 నగర జీవన చిత్రణ
8.5 వ్యక్తి స్వేచ్ఛ - నూతన వ్యవస్థా స్థాపన
8.6 వర్గ పోరాటతత్త్వం - సాయుధ విప్లవం
8.7 దిగంబర కవిత్వ విమర్శ
8.8 దిగంబర కవుల ప్రభావం
8.9 సమీక్ష
8.10 ప్రశ్నలు
8.11 ఆధార గ్రంథాలు


**లక్ష్యం :**

దిగంబర కవులు తమ రచనల్లో చూపిన కొన్ని సామాన్య లక్షణాలను తెలుసుకుంటారు. వారి మూడు సంపుటాలలోను తమ మనసులోని అలజడిని స్పష్టంగా ప్రదర్శించారు. కుహనా రాజకీయాలమీద, మేధావుల అలసత్వం మీద వారు చూపిన వ్యతిరేక భావాలు ఈ పాఠంలో చూడవచ్చు. అణుయుద్ధాన్ని వ్యతిరేకిస్తూ శాంతిని కాంక్షించడం గమనించవచ్చు. దిగంబర కవుల ప్రభావం పైగంబర కవులమీద ఎలా ఉందో, ఇతర భాషలలోనికి వచ్చిన అనువాదాలు తెలుసుకోవచ్చు.

తెలుగు సాహిత్యంలో మూడు సంపుటాల ద్వారా అలజడి సృష్టించిన దిగంబర కవిత్వంలో తిరుగుబాటుతత్వం, వర్గపోరాటం, వ్యక్తి స్వేచ్ఛ, ప్రపంచ శాంతి ఆకాంక్ష మొదలైన అంశాలను దిగంబర కవులు ప్రకటించారు.

## 8.1. తిరుగుబాటు తత్వం :

తిరుగుబాటు తనం, విశృంఖలత్వం దిగంబర కవిత్వ ప్రధానలక్షణాలు. తిరుగుబాటు అంటే కొత్త దానిని వెతుక్కునే ప్రయత్నం. పాతతరం కవులపైనా, సామాజిక వ్యవస్థ మీద తిరుగుబాటు చేశారు. సమస్త విలువలను సవాలు చేస్తూ మూల మట్టంగా మార్చి వేయాలన్నదే వీరి ధ్యేయం. ముఖ్యంగా కుహనా రాజకీయాల పైన, మేధావుల అనాసక్తత పట్ల, ఆధునిక ఛాందస భావాల మీద, వర్తమాన కాల అధోగతి మీద తిరుగుబాటు చేశారు. వాస్తవ జీవితాన్ని వేల మైళ్ళ దూరంలో విసిరేసిన విద్యాలయాలు వదలి జట్లు జట్లుగా మెట్లు మెట్లుగా యువకులు నడిరోడ్డు మీదకు పరుగెత్తాలన్నారు.

"మూఢ నమ్మకాల ఉక్కు కౌగిళ్ళలో
నంగనాచి నాయకుల దొంగవేషాల్లో
నలిగే అలగా జనం కళ్ళ గంతలు చించుకొని బయటకు రావాలి

మహావ్యవస్థ రూపొందించని నాయకులు
జనాన్ని జేజమ్మలుగా వాజమ్మలుగా
పురుగులుగా వెధవలుగా
ఎట్లా దిగజార్చారో
ఒక్కసారి వెన్ను తట్టి కళ్ళారా చూపించాలి

యాభైకోట్ల కంఠాలు తిరుగుబాటు మంటలుగా మారాలని యువత గుండెల్లో మంటలు రగిలించాలన్నాడు చెరబండరాజు.

చైతన్యాన్ని, విప్లవాన్ని తేవాలన్న ప్రగాఢ విశ్వాసంతో అన్ని రంగాల్లోని కృత్రిమత్వాన్ని బహిర్గతం చేశారు. అన్ని చోట్ల విజృంభించిన దోపిడీ విధానం, లంచగొండితనం, పరపీడనతత్వం, మత ప్రాంతీయ భేదాలు, వర్గ వైషమ్యాలు, బానిసత్వపు బ్రతుకు, వెర్రి వ్యామోహం - ఇవి జాతిని పట్టి పీడిస్తున్న రుగ్మతలు. అందుకే వీరు నేటి సాంఘిక జీవన పరిస్థితులను, రాజకీయ వికృత స్వరూపాన్ని, దుర్గంధ భూయిష్టమైన సంస్కృతిని, సమాజ దుస్థితిని వర్ణించడంలో విశృంఖలత్వాన్ని ప్రదర్శించారు. చచ్చిన రాజుల పుచ్చిన గాథలను మెచ్చే చచ్చు చరిత్ర కారుల ముక్కు చెవులను కోసి మానవ పరిణామ శాస్త్రం నేర్పించిందేమిటని అడగాలట.

"మారణ హోమపు కాంక్షల జ్వాలలలో
దారుణ రూపం దాల్చిన దానవతా చర్యలలో
మరణించిన మానవతను మళ్ళీ తేజాలం
మనమింకా సజీవ మానవులం కాజాలం" మనం ఏ నాటికీ అభ్యుదయానికి పోలేమని జ్వాలాముఖి నిరసన వ్యక్తం చేశాడు. ఆనాటి సమాజం వర్ణభేదాలతో వర్గ పోరాటాలతో అల్లకల్లోలంగా ఉంది. సమాజంలో ఉన్నదంతా చెడు అన్నదే వీరి భావం. అంతా కపట నాటకం, మలినం. అందరూ మలిన మనస్కులు, వేషధారులు. ఈ వేషాలన్నీ విప్పాలన్నదే వీరి పిలుపు. ఈ మలినాన్నంతా కడగాలన్నదే వీరి తలపు. మానవుడు సత్యాన్ని కనిపెట్టాలంటే శూన్యం నుండి ప్రారంభించాలి. దిగంబరుడు కావాలి. ఇది మూలం. ఇది వారి సిద్ధాంతం.

"ప్రజలు దిగంబరం కావాలి
దేశాలు దిగంబరం కావాలి
మతాలు ఇజాలు దిగంబరం కావాలి
యంత్రాల నట్లూ నాగరికతల పటకార్లూ దిగంబరం కావాలి.
భజంత్రీలు బాంబులూ దిగంబరం కావాలి.
ప్రపంచం దిగంబరం కావాలి
విశ్వం దిగంబరం కావాలి" మనసు కూడ దిగంబరం కావాలని నగ్నముని కాంక్షించాడు.

"నన్నయను నరేంద్రుడి బొందలోనే
నిద్రపోనియ్యి
లేపకు
పీక మలిమి గోతిలోకి లాగుతాడు
...... ..........
పండిత వర్యా రికార్డులా నోరు త్రిప్పకు
నవ సృష్టిని కాలదన్నకు
భావ కవుల నపుంసక పోచ భావాలకు సవాలు
అభ్యుదయ కవీ నల్లమందు తిని నిద్రపోయావ్."

వీరు పాత తరం కవులతో పాటు కొత్తతరం కవులమీద కూడ తిరుగుబాటు ప్రదర్శించారు. సంప్రదాయ కవిత్వాన్ని నిరసిస్తూ -

అందమైన ఆడదాన్ని వెతికి తెచ్చి
ఊపిరాడని గదిలో బంధించి
వొయ్యారపు ఊహల పల్లకిలో ఊరేగించి
పాదాలు పట్టుకు వేలాడే కవీ!
తరతరాల వ్యాధినుండి ఎప్పుడు కోలుకుంటావని ప్రశ్నించారు.

కృతక భాషనుండి జన జీవనంలోని నుడికారాలలోకి, వ్యవహార భాషలోకి సంపూర్ణంగా కవిత వికసించడం కూడ తిరుగుబాటే.

"దిగంబర కవిత్వంలోని అక్షరాలు
కామంతో పుచ్చిపోయిన
లతాంగి పయోధరాలపై
నూతన నఖక్షతాలు కావు" అంటూ భాషా పరమైన తిరుగుబాటును ప్రదర్శించారు.
రాజకీయ రంగం కళ్మలంగా ఉంది కనుక తిరుగుబాటు చేయమని యువతరాన్ని కోరారు.
"పార్టీలు మారే ఈ పగటి వేషగాళ్ళని
పదవీ భ్రష్టుల్ని చేసే
బహిరంగ సభల్లో నిర్దయగా కాల్చేసే
తిరుగుబాటు యువతరాన్ని సమర్థించి తీరుతాను

ముందు నడిచి నడిపిస్తాను" సామాన్యుడి తలపాగను చింపి రోజుకో జెండాను ఎగురవేసే గూండాల చెవులు పట్టి వెనక్కు తిప్పి ప్రగతిపేర దేశానికి తెచ్చిన దుర్గతిని, ప్రణాళికల పేర రేపిన వ్రణాల్ని మూత్రశాలలుగా చాకిరేవులుగా మారిన శంకుస్థాపన స్థావరాలను వాళ్ళ కళ్ళు పొరలు పీకి చూపిస్తానన్నాడు చెరబండరాజు.

సమాజమంతా సంప్రదాయపు ముసుగులో కూరుకు పోయిందనీ, కనుక వ్యవస్థపై తిరుగుబాటు చేయవలసిందిగా కోరాడు. అందుకే చిల్లులుపడి చీకి ముక్కిపోయి గబ్బులేచిన పాత చాపగా ఈ వ్యవస్థను వర్ణించారు. ప్రజాస్వామ్యం పేరుతో ప్రజలను దోచుకు తింటున్న రాజకీయ నాయకులను ఖండించారు.

"ఒరేయ్
పేనుకు పెత్తన మిచ్చిన పెయ్యమ్మలూ
మీ ఒంటి మీది చర్మం బులబులాగ్గా ఒలిపించి
కారంపూసి
నిప్పులమీద దొర్లించి

మిమ్మల్ని తింటున్నార్రా" అంటూ భైరవయ్య ఆక్రోశించాడు. సమాజంలో నిద్రపోతున్న వారిని మేల్కొలిపి వారి బాధ్యతలను వారు గుర్తించేలా చెయ్యడానికి దిగంబర కవులు కొరడా ఝుళిపించారు. 'ఒరేయ్ మీరంతా ఊరపందుల్లా బతుకుతున్నారు. భయం గురించిన ఆలోచనలు, వర్తమాన వక్రగతిపట్ల విమర్శలూ లేవు. అంట్ల వెధవల్లా, మొగుడు చచ్చిన ముండల్లా బతుకుతున్నారు. గతంలో తలలు దూర్చి వెలిగే సూర్యుణ్ణి చూడటానికి నిరాకరిస్తూ భవిష్యత్తును శాసింపజూస్తున్న నిప్పుకోళ్ళు, నిఖార్సైన అప్రాచ్యులు మీరు. మీ జీవితాలు మీరఘోరించడం కూడా చేతకాని వాజెమ్మలైన మీకు ఈ గానుగెద్దు జీవితాలెందుకు? అని ప్రశ్నించారు. ఆంధ్రుడు రోజు రోజుకీ నపుంసకుడై పోవడానికి ముఖ్య కారణాలను పేర్కొంటూ తమ విశృంఖలతను ప్రదర్శించారు.

### 8.2. అంతర్జాతీయ భావం :

వీరిది విశ్వమానవ దృక్పథం. దేశ కాలాల అవధుల్లేవు. విశ్వమంతా సమానమే. ఎక్కడ దోపిడి, అన్యాయం జరుగుతుందో అక్కడికి వారి హృదయం పరుగెడుతుంది. విశ్వశాంతికోసం సహేతుకమైన భావాలను సత్యసమ్మతాలను ఒప్పుకొన్నారు. అన్ని ప్రపంచ దేశాలలో ఐక్య రాజ్యసమితివలన శాంతి నెలకొంటుందని ఆశించారు. ఇది భ్రమయింది. అగ్ర రాజ్యాల దురహంకారం అధికార కాంక్షకు దారితీసి దురాక్రమణలు జరిపాయి. ఈ అంతర్జాతీయ కలుషిత రాజకీయ రంగాన్ని తమ ఖండికల్లో వ్యక్తపరిచారు. ఏ దేశంలోను శాంతి లేదని ఎటుచూసినా భయకంపిత వడగాడ్పుల సుడిగాలుల సందడులే వినిపిస్తున్నాయన్నారు.

"అణ్వహంకారంలో కావరమెక్కిన
అగ్రరాజ్య శ్వేవాలకు రెక్కలు నరికి

ఈకలు పెరికి చూపాలనుంది" అంతేకాదు ఈ యుద్ధంలో ఆకాశం నుండి క్రిందబడ్డ నగ్న శరీరాన్ని ఐక్యరాజ్య సమితికి ఎంబ్లమ్ చేయాలనుందని తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. న్యాయ స్థానాల్లో సిసలైన న్యాయం కన్పించలేదన్నారు. దక్షిణ వియత్నాంలో వల్లని చావు రూపంలో ప్లేగ్ వచ్చిందని, అందుకు కారణం పసిఫిక్ సముద్రంలో హైడ్రోజన్ బాంబు అనీ ప్రపంచంలోని అమానుషాలను ఖండించారు. మానవులంతా కొత్త కుటుంబాలుగా ఏర్పడ్డారనీ, తిరుగుబాటు నాయకుడు 'దిగంబర దేవుడు' అర్ధరాత్రి నూత్న దిగంబర యుగాన్ని ఆరంభించాడన్న వార్తలను జిరాస నుండి, ఆకాశవాణిలో 'శాంతి బాల' ప్రేమ భాషలో వార్తలు వేదంలా చదువుతుంటే చెవికోసుకు వినాలనుందని జ్వాలాముఖి పేర్కొన్నాడు.

దేశాలు, మతాలు, ఎల్లలు, వర్గాలు అన్నీ కేవలం కృత్రిమమైనవే. ఒకేజాతి అనే అంతర్జాతీయ దృక్పథం, విశ్వమానవ భావం దిగంబర కవుల రచనల్లో స్పష్టంగా కన్పిస్తుంది. కలాలు కాగితాలు సర్దుకొని లా బుక్కుల్లో నా సందేహాలు రాసుకోండి. న్యాయానికి దేశాలేమిటి? ఎల్లలేమిటి? అని ప్రశ్నించాడు చెరబండరాజు.

"మనిషీ రక్తం, ప్రాణం ముఖ్యం
లింగ భేదాలు వాదాలు తప్పితే
మందిర్, మజ్జిద్ చర్చి,
మతాధికారులు మతాలు ఎందుకు?
ఆకలి, కామం, కలలూ, కన్నీళ్ళు,
మనిషిలోని మర్మజ్ఞానమంతా ఒక్కటే.
దేశమేదైతేనేం; మట్టంతా ఒక్కటే

అమ్మ ఎవరైతేనేం? చనుబాల తీపంతా ఒక్కటే". - వసుదైక కుటుంబంలో సుధాధారలు పాలువారాల్సిందిపోయి స్పర్థలు, చికాకులు నిరంతర వేదనా సముద్రాల విషపు చుక్కలు జాలువారి జీవితం నీరుకావిడి బట్టలా, నేల విడిచి సాములా, ఎన్నికల ప్రచారోపన్యాసంలా మారిందని విచారించారు. మానవులంతా ప్రపంచ పౌరులనీ, సంకుచితత్వాలు లేకుండా ఉండాలనీ, మంచి మనసు, మంచితనం ఎక్కడైనా గౌరవాన్ని పొందుతాయని భావించారు.

"గది నాల్గు గోడలు కూల్చివేసి
దిశలు వాల్గుగా మార్చుకోండి
ప్రపంచ పౌరులు కారెందుకు అప్పుడు?" అని ప్రశ్నించారు.

సమస్యలకు లోతులు తీసి, సామాన్యులను గోతుల్లోతోసి కాలాన్ని గాలంగా వాడుకుంటూ విల్లిప్తతలోనే నిప్పును రాజేస్తూ అనంతమూ అమాయకమైన ఈ మానవజాతిని అనాదిగా, అధ్వాన్నంగా పరిపాలిస్తున్న పిడికెడు మేధావులకు పిరమిడ్లు కట్టాలనుందన్నారు. ప్రాణాన్ని పణంగా పెట్టయినా ఈ జగతికి మానవతాదీక్ష పెట్టాలని కాంక్షించారు. ఆకాశంలో నక్షత్రాలు నెత్తురు కక్కకముందే, అవనిలో అబద్ధం

విశృంఖల విహారం చేయకముందే విషపు నాల్కలు చాపకముందే హిరోషిమాకు వల్లెవాటు వేసిన అణురజంలా నీ మనస్సును కప్పిన కృత్రిమ ముసుగుల్ని తొలిగించేందుకు మానవతా నిగమాగమ ఋషీ మేలుకో అని పిలుపునిచ్చారు.

**8.3. అణుయుద్ధ విముఖత :**

రెండు ప్రపంచ యుద్ధాల్లో ఆధునిక అణు విజ్ఞానం వల్ల సంభవించిన నష్టాన్నీ, భీభత్స దృశ్యాల్ని గర్హించారు. సామ్రాజ్యవాద ధోరణితో ప్రపంచాన్ని తృటిలో భస్మం చేయగల అణ్వస్త్ర ప్రయోగాలను నిరసించారు. మానవుడు సాధించిన అణు విజ్ఞాన సంపత్తి మానవ నాశనానికి దారి తీసిందని ఆందోళన చెందారు. ఇది ప్రగతి కాదనీ, విధ్వంసక చర్యగా ఖండించారు. వెన్నెల కొంగిగట్టిన నుసిలా ముసుగేసుకొన్న విధవలా అలుముకున్నది. చంద్రుడు భేతాళుడిలా వికృతంగా నవ్వుతున్నాడు. నక్షత్రాలు మారీచ గణాల్లా హాహాకారాలు చేస్తున్నాయి. రాజుకుంటున్న నిప్పులా రాత్రి నిలబడిపోయింది. నా పెదాల మీద చిరునవ్వు నిప్పు కణాలమీద సమిధల్లా, మండుతున్న కణాల మీద అగ్ని కీలలా వ్యాపిస్తోంది. కంకాళాలు కైవారాలు పలుకుతున్నాయి. ఆకాశంలో గ్రహాలకు బదులు నక్షత్రాలను వేలాడదీస్తున్నాను. సౌందర్యాన్ని మంటపెట్టి ఆనందాన్ని ఆహుతిచేసి విషాదాన్ని సృష్టిస్తున్నాను. శూన్యానికి ఆకృతినిచ్చి ప్రణవంలో ప్రణయాన్ని పలికిస్తున్నానన్నాడు భైరవయ్య. నేటి అణ్వస్త్రాలతో ఆధునిక మానవుడు సర్వాన్ని బుగ్గిపాలుచేసి విషాదాన్ని సృష్టిస్తున్నాడనీ, అతడే అణు యజ్ఞాన్ని ప్రారంభించాడన్నారు.

"ఆకాశం మంటపం క్రింద
ఒంటి కాలి నృత్యం చేస్తున్న
అణ్వస్త్రాల ఆధునికుణ్ణి
నేను
మారణాయుధాల మానవుణ్ణి
నేను యజ్ఞం తలపెట్టాను
ప్రపంచం మీద నిర్మించిన హోమగుండంలో
చరాచరాలు హవిర్భాగాలు
భేతాళుని రుత్విజ తత్వంలో
ఘృతంగా మారిన కాలాన్ని
ఆస్వాదించిన యుగపురుషుడు స్మశానం"

భైరవుని పర్యవేక్షణతో పిశాచాలు మంగళతూర్యాలు మోగిస్తే నాల్గు దిక్కులు రక్తం కక్కుకున్నాయి. వాయుదేవుడు విషపు వాయువులు పీల్చి మత్తెక్కి తూలుతున్నాడు.

"ఒక్కసారిగా అణుగుండంలో
యాగపురుషుని ప్రత్యక్షంతో
సర్వస్తంభన జరిగింది
నా దోసిట యాగఫలం
పిడికెడు భస్మం మిగిలింది"

మానవజాతి వినాశనం వలన ఏర్పడేది చితాభస్మమేనని తెలియజేశారు.

అణువిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ మనిషి సృష్టికి ప్రతిసృష్టి చేస్తున్నాడనీ అతని మనస్సు మానవత్వంవైపు, మేధస్సు దానవత్వం వైపు వెళ్తున్నాయని, వర్తమాన కాలంలో మనసును మేధస్సు జయించిందన్నారు. మనసుకు మనసుకు మధ్యనున్న తడితీగె (దయ) తెగిందని వ్యధచెందారు.

"ప్రపంచ ప్రయోగశాలలో విజ్ఞానం విస్ఫోటన
తలలో విశ్వామిత్ర సృష్టి

నాకు నాతలకు ధారిచెడింది
హృదయానికి మేధస్సుకు మధ్య తడితీగె తెగింది"

విశ్వశాంతి కోసం దిగంబర కవులు ఉవ్విళ్ళూరారు. నాగరికతా అవహేళనలో కన్నీళ్ళను అడుక్కుంటున్న యుగభిక్షువుగాను, విజ్ఞానం విసిరిన విషకిరణానికి చెడిపోయిన చక్షువు (కన్ను) గాను ఈశోక పీడిత లోకంలో కారుణ్యమనే మహాబోధి వెలుగులో మెరిసిన తథాగతుడిగాను, అహంకారం సిలువపైన నవ్విన నెత్తుటి గులాబిగా శాంతిపక్షిని పోలుస్తూ విశ్వశాంతిని కాంక్షించారు.

"విశ్వశాంతి మనధ్యేయం
యుద్ధాలకు పరిమితమా?
అబద్ధమా యీ వేదన" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.
"కల్లోలపు కడలి అలల తాకుళ్ళ మధ్య
ఊపిరి సలపని చీకటి సుళ్ళ మధ్య
యుద్ధ తిమింగలాల రంపపు పళ్ళ మధ్య
త్రోయబద్ధ 'శాంతిమూకబాల' చరమ ఘోషను
కనురెప్పలు ఊడబెరికి చూపాలనుంది
కండ కావరమున పండిన ప్రపంచ పండితులకు"

జాతి, మత, దేశ, భాషా భేదాలతో సంకుచితత్వంలో మనం బతుకుతున్నామనీ, ఇది సంప్రదాయంగా మన నరనరాల్లో జీర్ణింపజేసుకున్నామనీ, వీటిని విడనాడాలనీ అప్పుడే సర్వమానవ కల్యాణం జరుగుతుందని భావిస్తూ -

"సంకుచితత్వాన్ని మనమంతా
సంప్రదాయ బద్ధం చేసేసుకున్నాం
కాబట్టే మనకింకా అర్థం కానిది
సర్వమానవ కల్యాణం" అని భావించాడు జ్వాలాముఖి.

**నగర జీవన చిత్రణం :** నగర జీవితాన్ని వర్ణించిన కవులు చాలా తక్కువ. పఠాభి, ఆరుద్ర కొన్ని కోణాలను స్పృశించారు. సమాజ చేతననూ, దాని అస్పష్టతను ప్రతి బింబించడంలో దిగంబర కవిత నగరవాసం చేస్తున్నది. ఆధునిక నాగరికత వల్ల సమాజంలో నైతిక విలువలు దిగజారాయి. నగర జీవితం యాంత్రికంగా మారిపోయి ప్రజలు కృత్రిమత్వంతో బ్రతుకుతున్నారు. ఈ కృత్రిమత్వాన్ని దిగంబర కవులు నిరసించారు.

"ఈ చౌరాస్తాలో సిగరెట్ల అంపశయ్యపై
ఆకలిని ఆవిష్కరించాను
సారా సముద్రాలు ఇంకిన కళ్ళతో
మురిగిన సూర్యుణ్ణి నంజుకుంటూ
మృత్యువు కాస్త కాస్త కొరుక్కు తిన్నాను"

మనిషి మనుగడకు, విలయాలకు, నియమాలకు సంఘర్షణ ఏర్పడ్డప్పుడు మధ్య తరగతి విఫలమయ్యేది ఏకాకితనం. శ్రామికుడు తనను దోపిడీ చెయ్యడాన్ని కూడ సరైనదిగా భావించే తాత్త్విక పరిసరాల్లో బ్రతుకుతాడు. మధ్య తరగతి అలాకాదు. ఏకాకితనం నుంచే మనిషిని ప్రశ్నించారు దిగంబర కవులు. ఈ ఏకాకితనాన్ని సామాజిక స్తబ్ధతగా భావించారు.

"నేను నా దేశానికి పరాయివాడిని
జ్వలిస్తున్న ఏకాకిని
స్నేహం ఇవ్వని దేశంలో
స్నేహం లేని ప్రతివాడూ ఒక్కొక్క ద్వీపం" అంటూ నిఖిలేశ్వర్ ఏకాకితనంలోని వ్యథను చిత్రించారు.

నాగరికతలోని కుళ్ళును, ప్రజాజీవిత విధానాన్ని వీరు చక్కగా వర్ణించారు. దిగంబర కవులంతా దాదాపుగా నగర జీవనం గడుపుతున్న వారే కనుక నగర జీవితపు అయోమయ స్థితిని, కుసంస్కృతిని చక్కగా అర్థం చేసుకున్నారు. నగరాలలోను పట్టణాలలోను నివసిస్తూ గుమస్తా జీవితం గడుపుతున్న మధ్యతరగతి ప్రజల ఆలోచనా విధానాన్ని, ఆందోళనలను, వారివైరాశ్యాన్ని, కష్టాలను, నష్టాలను, అసంతృప్తిని, అగమ్యమైన పోరాటాలను మొదలైన సమస్యలను పసిగట్టి తమ రచనల్లో ప్రతిఫలింపచేశారు.

"నంగనాచి నాగరికతను నగ్నంచేసి
నవ మధువున సూర్య స్నానం చేయించి
న్యూయార్కు నగర వేదికన నీగ్రో వీరునితో
నూడ్ ట్విస్ట్ తాండవం చేయించాలనుందన్నారు జ్వాలాముఖి.

నాగరిక సంస్కృతిని, నగర జీవన విధానాన్ని కృత్రిమ ముసుగులను వీరు చిత్రించారు. దూరపు కొండలు నునుపు అన్నట్లు నగరాలు కూడ దూరానికి చూడముచ్చటగా ఉంటాయనీ, దగ్గరకు వెళ్ళి చూసినపుడు మాత్రమే అక్కడ జరుగుతున్న ఘోర దృశ్యాలు, దారుణాలు తెలుస్తాయని భావించారు.

"ఈ దేశంలోని ప్రతినగరం
నవనవలాడే మహాగాయం
దూరంనుండి అది ఎర్రగులాబి

దగ్గరికి వెడితే రక్తస్రావపు వ్రణం" నగరాలల్లో సైడు కాలువల్లోని నీచం, జారత్వం, పశుత్వం, చెరచబడ్డ బజార్లు, క్యూలో ప్రాణం వదలిన ఆకలి వీరికి కనిపించింది. నగరాల్లోని దారుణమైన, దయనీయమైన దృశ్యాలను వారి 'దిక్'లలో చిత్రించారు.

"రోడ్డు మధ్య జారిన రక్తపు చారికల్లో
కాలు విరిగిన వాడి జీవితం
తల పగిలిన వాడి ముఖం
అది నేనే అవుతే అని ఆత్మ ఒణికిన క్షణం-
ప్రక్కనే ప్రాణంలేని నేరస్థుడిలా నిలుచుని వుంది లారీ
స్టీరింగ్ ముందు వేగానికి బానిస అయిన
డ్రైవర్ పాపం! పోలీస్ స్టేషన్‌లో లాకప్పులో'" అంటూ

ప్రతిరోజు రోడ్లమీద జరుగుతున్న ప్రమాదాలను చూసి చూసి మన హృదయాలు రోడ్డులా గట్టి పడ్డాయని తలంచారు. రోజా హోటల్లో ఏదో ఒకటి తిని బయటకు అడుగు పెట్టగానే ఆరు లేక ఎనిమిది చేతులు ఎదురుగా చాచుకుంటాయి. వారి ముఖాలు దైన్యంగా ప్రతిఫలిస్తుంటాయి. మనం మాత్రం నేరస్థుడిలా మొగం వేలాడేసుకొని వెళ్తుంటామంటూ నగర జీవనాన్ని చిత్రించారు.

యాంత్రిక జీవితంలోని వేమదారణను, నగరాల్లో తరచుగా జరిగే బందులను, కర్ఫ్యూల వల్ల నగరాల్లో కన్పించే దృశ్యాలను కళ్ళకు కట్టినట్లు చిత్రించారు. నగరం నడిబొడ్డుమీద నాగరికత బొడ్డుమీద నగ్నంగా నిలబడిన కర్ఫ్యూని చూసి నాగరికత వణికింది, బెదిరింది, స్తంభించిపోతుంది. నగరం నడిరోడ్డు మీద విధించిన కర్ఫ్యూవల్ల సభ్యతలు, సంస్కారాలు డొక్కున్నాయి. సిగ్గులన్నీ పరదాల్లో దాచి పగలూ ద్వేషాలను పుట్టల్లో దాచి ప్రజలంతా గుంపులు గుంపులుగా చెల్లాచెదరై భయంతో పరుగెడుతున్నారు. కపటాలు, వంచనలు కళ్ళబోళ్ళలోంచి చూసి పరుగుతీస్తున్నాయి. చౌరస్తా కాళీయుని శిరస్సుమీద కర్ఫ్యూ కథక్కళీ చేస్తుంటే -

"కోట్లు బూట్లు బుష్ షర్టులు
చొక్కాలు లాల్చీలు నేలకొరిగి పోతున్నాయ్
టోపీలు పాగాలు నేలకొరిగి పోతున్నాయ్

గర్జిస్తూ వెళుతున్నా
గాండ్రిస్తూ వెళుతున్నా
నగరం నడిబజార్లో నగ్నంగా వెళుతున్నా"

కర్ఫ్యూ సందర్భాలలో నగరాలలోని తలుపులు, ఆఫీసులు, దుకాణాలు, ట్రాఫిక్ అన్నీ బంద్. సందులు, గొందులకు జ్వరాలు, బజారు బజార్లకూ మూర్ఛలు. అంతా నిశ్శబ్దం, నిర్మానుష్యం. అందుకే నగరానికి కర్ఫ్యూ అంటే మహాభయం అని వివరించారు. చీకట్లో తిరిగే గజదొంగలు, ముసుగుల్లో నటిస్తున్న వంచకులు, ఖల్లులు, బల్లులయిన మీరంతా రక్తం పీల్చే జలగలు, పిశాచాలు, నిశాచరులు. అందుకే మిమ్మల్ని కాపాడుతున్న ఈ రాత్రికోటను బద్దలు కొట్టి ఈ నాగరికతకు మానభంగం చేస్తానని హెచ్చరించారు.

"ప్రతి పుట్టను పగులగొట్టి
విషభుజంగాల్ని పట్టి కోరలు తీస్తాను నేను
ఈ ఘోరారణ్యంలో కారుచిచ్చు రగిలిస్తా.

ఈ నాగరికత రావణలంకా దహనం చేస్తా" అంటూ నాగరికతను ప్రదర్శిస్తున్న వాళ్ళమీద ఆగ్రహాన్ని ప్రకటించారు. ఈ నాగరికమైన వీధుల షోకేసుల్లో భలేషోగ్గా మనీ పర్సుల్లో బంధింపబడి కారుల్లో వెళ్ళే అదృష్టవంతుల ముందు మనమంతా పిచ్చి కుక్కలం అన్నారు.

నగరంలో నాలుగు వైపులా వేలాడుతున్న కాలిన గుడ్డ పీలికలు, ఆకలితో అలమటించే అస్థి పంజరాలు వీరి దృష్టినాకర్షించాయి. నగరం అస్థిపంజరంలో ఆకలి ఉరగం కదులుతోందనీ నిద్రపోని రోడ్డుమీద జనం తిరుగుతున్నారన్నారు. 'నగరం మూపు మీద వాపుమీద పెద్దల విగ్రహాలు' అంటూ హైదరాబాదు నగర కూడలిలో టాంక్ బండ్ మీద ప్రతిష్ఠించిన విగ్రహాలను అపహాస్యం చేశారు. నాగరికత నిగనిగల కౌగిలిలో వైమరచి మైకం కమ్మిన నేటి వ్యామోహపు పతిత జాతికి చరిచి చూపాలనుంది అని అభిప్రాయపడ్డారు.

నగరాల్లోను, పట్టణాల్లోను గుమస్తా జీవితంలో చాలీచాలని జీతంతో అవసరాలను, కోర్కెలను చంపుకోలేని తపం, ఆవేదన, నగర జీవనంలోని అసహ్యత, పెరుగుతున్న జీతాలతో పాటు ఆకాశాన్నంటుతున్న ధరలు, నిరంతర సంఘర్షణ, వీటన్నిటిని 'కరువు భిచ్చం' దిక్‌లో భైరవయ్య చూపించారు. కరువు భత్యం పెరిగితే చిరిగిపోయిన చొక్కాను మాసిక వేసుకోవచ్చు. అర్ధాంగి కళ్ళల్లో ఆరక్షణం కాంతి నింపవచ్చు. అప్పుల వాడిని ఆమడ దూరం నుండి ధైర్యంగా చూడొచ్చు. ఆఫీసరు చిన్న కొడుక్కి బిస్కెట్లు పట్టుకెళ్ళొచ్చు. రోడ్డు మీద జెర్రిపోతులా జారిపోతున్న ప్లిమత్ కారును సరదాగా పరిశీలించొచ్చు. ఒక్కసారి ప్రస్తుతాన్ని వదలి భావికేసి ఆకాశంలో నక్షత్రాలకేసి ఆశగా చూడొచ్చు. కరువు భత్యం పెరగడం దానివెన్నంటి ధరలు పెరగడం, ధరల వేగాన్ని తట్టుకోలేక సతమతం కావటం - ఇవన్నీ మధ్య తరగతి ఉద్యోగి బాధలు. ప్రభుత్వాన్ని కరువుభత్యం పెంచమని ధర్నాలుచేసి సాధించినది ఎలాంటిదంటే -

"అన్నాభయపడకు
కరువు భత్యం పెరుగుతుంది
కొండ చిలువనోట్లోకి ఈగపిల్ల దూకుతుంది"

సామాజిక జీవితంలో మధ్య తరగతి ఉద్యోగుల నిజస్థితిని వెల్లడించారు.

## 8.5 వ్యక్తి స్వేచ్ఛ - నూతన వ్యవస్థా స్థాపనం :

దిగంబర కవులు వ్యక్తి స్వేచ్ఛకు ప్రాధాన్యమిచ్చారు. మానవ సంక్షేమం కోసం, వ్యక్తిని మరింత ఉన్నతంగా తీర్చి దిద్దడం కోసం పుట్టిన ఈ మతాలు, సిద్ధాంతాలు కాలం మారుతున్న కొద్దీ, చరిత్ర పురోగమిస్తున్న కొద్దీ వాటి స్వరూప స్వభావాలు కూడ పూర్తిగా మారిపోయి కేవలం భేషజంగానో లేక ఏ కొద్దిమంది వ్యక్తుల అధికార దాహానికి ఆలంబనగానో మిగిలిపోవడం జరిగింది. వ్యక్తిని శాసిస్తున్న రాజకీయ మంత్ర దండం విరిగిపోయి అసలు విలువల కోసం నిలిచే, బ్రతికే జీవితం కోసం సంఘర్షణ జరగాలని కాంక్షించారు. ఆధునిక యుగంలో అణ్వాభ్యుదయస్థితిలో మానవుడు ఈ ధరాతలంలో తప్పిపోయాడు. తప్పిపోయి ఆత్మను పట్టి యిచ్చే మనిషిని మనిషిగా చూడాలని మా కోరిక అని ప్రకటించారు.

"నిన్నేనోయ్ ఎదగని మనిషీ
రేబవళ్ళ తిరుగలి మధ్య
నామరూప రమితుడవై
ఎప్పుడో గప్పున గాలిలో కలిసేముందు
ఒక్కసారి వెనక్కి మళ్ళి చూసుకోవూ?"

మనిషి ఆచ్ఛాదనలతో కప్పబడి ఉన్నాడనీ వానిని ఛేదించుకొని బయటపడాలని కోరారు. ముసుగులు తొలగించుకొని కంపుకొట్టే ఈ బట్టల్ని విప్పి ఆత్మముందు నిలబడి నిన్ను నువ్వు చూసుకొని మనిషిలా మంచిగా ఆకాశంలా అవనిలాగ బతకమని సందేశమిచ్చారు. మనిషి సంపూర్ణ విశ్వాసంతో ఉండాలన్నారు. జాలిలేని సమాజంలో మనిషి నిలదొక్కుకొని బతకలేనపుడు చీకటికి, నైరాశ్యానికి, ఊపిరికి బానిసలేనంటూ దిగంబర కవులు వ్యక్తి స్వేచ్ఛకు ప్రాధాన్యమిచ్చారు. వ్యక్తి ఆత్మ విశ్వాసంతో సమాజంలో నిలబడగలిగిన నాడు సమాజం దానంతట అదే అభివృద్ధి చెందుతుంది. సమాజంలో భాగస్వామి అయిన వ్యక్తి సంపూర్ణుడు కావాలని వీరి అభిప్రాయం. జాలిలేని సమాజంలో మనిషి స్వేచ్ఛగా జీవించలేడు. అతడు అన్నిటికీ బానిసే. మనిషి నిలదొక్కుకు నిలవలేనపుడు చీకటి, నైరాశ్యం, బానిసను చేస్తాయి. ఎదుటివాని ఎదకుంపటి దించాలనుకున్న మనుషులలోని మనిషిని పీల్చుకుతినే ధన పిశాచాలున్నాయి. ఈ దగాకోరు లోకానికి హృదయమున్న ప్రతి ఒక్కడూ పిచ్చివాడే. అర సెంటీమీటరు భూమికి అంతర్జాతీయ తగాదాల జాబితాలు తయారు చేయడం తప్పని బ్రతుకుకు బానిసయ్యాడు. రెప్పపాటు చీకటిని భరించలేక అనుక్షణం అర్ధరాత్రిగా ఎంచుకుంటున్నాడు. తాతల, తండ్రుల తరతరాల వంశపు రూపు రేఖా విలాసాలను దేవులాడుకుంటూ మనిషి బానిసగా జీవిస్తున్నాడంటూ-

"కళ్ళు తెరిచి నేలా నింగిని
కన్నదాన్ని చూడలేని
కపిగందుకు మతాలు యెల్లలు
సంకుచిత స్వభావాల కొలబద్దలు
ఎందుకు? ఎందుకు? యెందుకు?"

మానవుడు తన పిచ్చి పిచ్చి ఊహాలతో పుచ్చిపోయిన ఆలోచనలతో ఇంకా బానిసగానే జీవిస్తున్నాడు తప్ప స్వేచ్ఛా జీవిగా కన్పించడం లేదన్నారు. శాసనాల సంధ్యా వందనాల్లో, ఉపన్యాసాల ఊక దంపుళ్లలో ప్రణాళికా వసంతాల పందిళ్ళలో సత్యానికి మానభంగం సంప్రదాయ బద్ధంగా జరిగింది. మహాత్ముని మూడు నీతి కోతులు ఈ ఘోర దృశ్యాలు చూడలేక ముందే మూసుకున్నాయి.

"ఈ కృత్రిమ దుస్తుల్ని విప్పేసి
నగ్నంగా నిశ్చలంగా సజీవంగా సాక్షాత్తూ మానవుడిగా
మట్టిలో పుట్టి మట్టిలో ఎదిగి
కాల రాక్షసి కరాల ఎత్తుకు ఎదిగే
మానవతా నక్షత్రంగా మానవుడు ఎదగాలని ఆశించారు.

నమ్మకం మడతల కింద నల్లిలా, వెన్నెముకలేని గుడ్డలా రద్దీ కాగితంలో పలచబడిన సిరాలా జీవిస్తున్న జీవితంతో పొత్తు కుదరక బతికిన నీ బతుక్కి సమాధి కట్టాలన్నారు. అడుగులకు మడుగులెత్తుతూ ఆసాముల పంచన లేపిన మేడ పునాదులు కదలకముందే మేలుకొమ్మని, స్వేచ్ఛను సంపాదించుకొమ్మని ప్రబోధించారు.

కార్యం లేని యజమాని, గుండెలేని గృహిణి, చెత్తకుండీ విస్తరి యువకులతో ఈ చావ వ్యవస్థ మారేదెప్పుడని ప్రశ్నించారు. నేటి కావ్య రచనలో జీవితంలోని నిజాయితీని, సరళత్వాన్ని, యుగ సందేశాన్ని, అనుభూతుల అభివ్యక్తిని ఊపిరి పీల్చగల ఆధునిక మానవుని అస్తిత్వం ఆవిష్కరింపబడటం అవసరం"గా గుర్తించారు. ఏ రాజకీయ సిద్ధాంతం గానీ కళా సిద్ధాంతం గాని వ్యక్తి స్వేచ్ఛను ప్రసాదించలేదు. ప్రజల్ని బానిసలుగా చేసే రాజరికపు వ్యవస్థపైగాని, ప్రజల్ని దోచుకు తినే జమిందారీ వ్యవస్థపై గాని, ప్రజల్ని పట్టి పీల్చే భూస్వామ్య వ్యవస్థపైగాని

వీరికి నమ్మకంలేదు. ఇవి వ్యక్తి స్వేచ్ఛను అరికడతాయని వీరి నమ్మకం. వ్యక్తి స్వేచ్ఛను కాపాడే ఏ సిద్ధాంతం ఈ భూమి మీద పుట్టలేదన్నది వీరి అభిప్రాయం. నేటి రాజకీయాలకు ప్రత్యామ్నాయ మార్గాన్ని ఆలోచించి వ్యక్తికోసం పాటుపడే వ్యవస్థను నిర్మించాలని భావించారు. వీరు ఆశించిన నూతన వ్యవస్థాపన ఇదే. చిత్త శుద్ధి, నిజాయితీలపై ఆధారపడ్డ సంఘవ్యవస్థ, రాజకీయ దృక్పథం రూపొందించాలనేది వీరి పరమ లక్ష్యం.

సమాజం సంస్కరణోద్యమం ద్వారా మారదు. దానికి సమగ్రమైన విప్లవం రావాలి. అది రాజకీయంగా వచ్చి సాంఘిక విలువలను మార్చి ఆర్థిక వ్యత్యాసాలను తొలగించి ఒక వ్యవస్థను నిర్మించాలి. నేటి భీకర దోపిడీ వ్యవస్థను బలప్రయోగం ద్వారానే నాశనం చేసి అజేయమైన నూతన వ్యవస్థను రూపొందించాలని వీరి తపన.

"ఈ దారుణ దారిద్ర్య భీకర విష ఖండంలో
ఈ గొంతులు కోసే వ్యవస్థలో
ఈసారి నీ ఇంటి దోపిడీ గాళ్ళతోనే
సమూలంగా సుందర సమతా వ్యవస్థకై
బలాలను తేల్చుకోమని

ఆహ్వానిస్తున్నాను" అంటూ నిఖిలేశ్వర్ ఈనాటి తరానికి పిలుపునిచ్చారు. నిహిలిస్టులు శాస్త్రజ్ఞానం వలన అన్ని సమస్యలు పరిష్కరించబడతాయని భావిస్తే, దిగంబర కవులు వ్యక్తి స్వేచ్ఛవలన సమాజం బాగుపడుతుందని, ఆర్థిక వ్యత్యాసాలు తొలగకపోతే వ్యక్తికి స్వేచ్ఛ లభించదని భావించారు. అందుకే ఈ దోపిడీ వ్యవస్థను నిర్మూలించి నూతన వ్యవస్థను స్థాపించాలంటే సాయుధ విప్లవమే మార్గమని పిలుపునిచ్చారు.

## 8.6 వర్గపోరాట తత్త్వం - సాయుధ విప్లవం :

దిగంబర కవులు పూర్వ సంప్రదాయాలను, పెట్టుబడిదారీ వ్యవస్థను, కులవర్ణ వర్గ విభేదాలను, మూఢనమ్మకాలను, మిధ్యాడంబరాలను, విగ్రహారాధనను, అసమానతలను నిరసించి సామాన్యుని ప్రగతికోసం విప్లవాన్ని ప్రబోధించారు. వర్గాలున్నపుడు వర్గపోరాటం తప్పనిసరి కనుక వీరు సాయుధ పోరాటాన్ని మార్గంగా చూపించారు. పీడిత సమాజాన్ని తమ రచనల్లో చిత్రీకరించారు. పొద్దు తిరుగుడు పువ్వులా లోకం చుట్టూ పరుగెత్తకుండ మనిషిలాగా కనీసం మనిషిలాగ మారి ఎర్రగులాబిలా నిప్పులా యౌవనంలో, మందహాసంలా నిజంలాగ, మధ్యందిన మార్తాండునిలాగ అరక్షణమైన జీవించి 'సీ' హోరులా హోరెత్తమని పిలుపునిచ్చారు. 'వంచనల సంకుచిత సహజీవనాల్లో కుంచించుకుపోయి జాతిమతాలు నెమరేసే యుగాల రోగపీడితుల మీద పండితులమీద, పశువులమీద, నపుంసక భావుకులమీద తిరుగుబాటు చేశారు. భయం, బానిసత్వం బ్రతుకు కాదు. సరిహద్దుల్లో పారే నెత్తుటేర్లను నిర్లిప్తంగా చూస్తూ నిల్చున్న మేధావులను మన్నించ కూడదన్నారు. ప్రాణాన్ని పణంగా పెట్టయినా ఈ జగతికి మానవతా భిక్షపెట్టాలన్నది వీరి ఆకాంక్ష. కొందరు కోటీశ్వరుల సారాగ్లాసుల్లో కోటికోట్ల సగటు పౌరులు మంచుగడ్డలుగా మారుతున్నట్లు గడియారాల ముళ్ళను శాసించే వేళ్ళ ఫోర్కుల మధ్య జనం గిజగిజలాడుతున్నట్లు గమనించారు. సమాజంలో పెట్టుబడిదారి వర్గానికి పేద వర్గానికి మధ్య వ్యత్యాసాన్ని ప్రశ్నించారు.

"నిజాం నవాబులాంటి ఫకీర్ జీవితంలో
నిజంగా మనమంతా పరిహాసితులం
నవాబు అనుభవిస్తున్న ఐశ్వర్యానికి
నిజంగా మనమంతా వారసులం".

తన్నులు తిన్నా మళ్ళీ రోడ్డుమీద మిఠాయి అంగడికి ఎదురుగా వచ్చి నాలుకలు చాపే కుక్క పిల్లలుగా పేదలు కనిపించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడ వర్గభేదాలు అలానే ఉన్నాయనీ మనుష్యుల మమకారం పేదలకు పంచిపెట్టేదెప్పుడని ప్రశ్నించారు. స్వార్థం నల్ల గడ్డ కట్టిన ధనంగా కోటికోట్ల ప్రజలను దురదృష్టవంతులుగా మార్చిందని స్వాతంత్ర్యాన్ని గుర్తుచేశారు.

సమకాలీన భారత సమాజంలో నివసిస్తున్న సామాన్యులను గమనించి -

"అలగా జనం ఆర్తనాదాలను
కుక్కల మొరుగుడని విర్రవీగే
కామందుల కళ్ళు పీకమని" ఆహ్వానించారు.

సాహిత్య రంగంలో సామాన్యుని ఆకాంక్షలకు స్థానం కల్పించడానికి నిరాకరించే కామందులకు హెచ్చరికలు చేశారు. ఉన్న వాళ్ళకు, లేని వాళ్ళకు అనాదినుండి జరుగుతున్న వర్గ పోరాటాన్ని తెలియజేశారు.

"ప్లేట్లలో ఫోర్కుల కింద అలగా జనాలు
జైళ్ళలో బండరాళ్ళు కప్పుకొని అమాయకులు" పేద ప్రజల బ్రతుకులు, ఉన్నవాడు తప్పుచేసి తప్పించుకుంటుంటే అమాయకులు శిక్షననుభవిస్తున్న దుర్భర పరిస్థితులను విమర్శించారు. కాలం వెంట పరుగెత్తలేక ఆకాశాన్నంటే ధరలను అందుకోలేక క్రుంగి కృశించి పోతున్న పేదలను 'రేట్ల బూట్ల క్రింద కొనుగోలు చీమలుగా' ఊహించారు.

ఈనాటి వ్యవస్థలో సామాన్యుడికి స్థానం లేదని, దేవుడి గుళ్ళ కోసం, రాజుల సమాధుల కోసం డబ్బు వెచ్చిస్తున్నారనీ, మట్టిగోడల గోడు వినేవారుండరని ఆవేదన వెలిబుచ్చారు.

"దేశం నిండా శాపగ్రస్తులు
వానల్లో స్నానమాడి వడగాడ్పుల్లో ఆరి
ఆకల్ని ఆరగించి కన్నీళ్ళను సేవించి
చలిని కప్పుకొని
ఆశల ఆకుల రాలిన చెట్ల క్రింద
ఎక్కిళ్ళ జోలపాటలో
కలతల కనుకుల చేతి తలగడపై
అలలు అలలుగా కలలు గంటున్నారు."

ప్రజా స్వామ్యంలో ప్రగతి నానాటికీ క్షీణించుతున్నందున సామాన్యుడు కూడా క్షీణించిపోతున్నాడు.

"పాకలోనివాడు ప్లాట్ ఫారం మీదికి
రిక్షానుండి టి.బి.లోకి
టి.బి. నుండి కాన్సర్‌లోకి' జారిపోతున్నాడు.

పేదలు కడుపేదలవుతున్నారు. పంచవర్ష ప్రణాళికల ప్రగతి ఫలం వారికి అందడంలేదు. ఈ ప్రజాస్వామ్య ప్రగతిని ప్రశ్నించారు. విప్లవాలు కుక్కిమంచాల్లో పాతేయబడ్డాయనీ, బీడీ ముక్కల్లా చెప్పుక్రింది సిగరెట్ పీకల్లా వంటింటి మసిపాతల్లా కడుదయనీయంగా బతుకుతున్న ఈ తరాలను, ప్రశ్నించడం చేతగాని అస్తిత్వాన్ని సహించలేకపోయారు. మన దేశంలో ఉన్నది దోపిడీ వ్యవస్థ. దీనినే మేము కుష్ఠు వ్యవస్థ అంటున్నాం. నేటి కుష్ఠు వ్యవస్థను బలంగా కూలదోయడమే సరయిన మార్గం. ఫ్రాన్స్‌లో చైనాలో వచ్చిన విప్లవాల వంటి విప్లవాలు బలంగా రావాలనీ, అందుకోసం ఆయుధాలు చేపట్టక తప్పదని ఆవేశంతో ఆవేదనతో పలికారు.

తమ తిరుగుబాటు నాయకుణ్ణి తుపాకి గొట్టంలో దాగిన విప్లవ సామ్రాజ్యాల విజయ దుందుభుల ప్రతిధ్వనులు ఆహ్వానించాయి. ఎంతో ఉద్వేగంతో మూలనున్న విశ్వాసం క్షతగాత్రుణ్ణి తనలోకి లేవనెత్తి తుపాకిని ఆధారంగా చేసుకొని చరచరా ముందుకు నడిచాడు. అస్తిత్వానికి అనవాలు పోగొట్టుకొని చావలేక బతకలేక బజారున పడ్డ భరతమాత అపస్మారక స్థితిలో అరుస్తున్నదట. రకరకాల రంకు రాజకీయాలు, డాలరు డాక్టరిచ్చిన విటమిన్ ఇంజక్షన్లు, బోసి తాతయ్య జప సూత్ర ధర్మాలు, పరిపడని సిద్ధాంతాల అపహాస్య లేహ్యాలు, జ్యుడీషియరీ గంధర్వుల సాంత్వన వాక్యాలు భారతమాతను శాశ్వత రోగిని చేశాయి. అందుకే రక్త సిక్త విప్లవ భానుడు పిడికిలి బిగించి రావాలని పిలుపునిచ్చారు.

"హింస విప్లవానికి మంత్రసాని కావాలి
దుస్సహదుర్గంధ క్రూర గర్భాయాసం నుండి
భరతమాతకు విముక్తి కలగాలి
భారతి తల్లయి తలెత్తుకు తిరగాలి
మమతా సాగరం స్తన్యమై
పొంగులెత్తి పారాలి
నెత్తురు పొత్తిళ్ళలో
విప్లవ శైశవం
చండ ప్రచండమై
మధ్యందినమార్తాండ తేజమై ప్రజ్వరిల్లాలి".

దిగంబర కవులు శాస్త్రజ్ఞానం సాధిస్తున్న మహత్తర విజయాలవైపు దృష్టి పెట్టలేదు. ప్రస్తుత సమాజంలోని కుష్ఠు వ్యవస్థకు కారకులైన వాళ్ళను, ఈ కుష్ఠు వ్యవస్థను పోషిస్తున్న వాళ్ళను సర్వనాశనం చేయాలని పిలుపునిచ్చారు. వీరి ప్రయత్నం సఫలం కాకముందే ఈ వ్యవస్థను మార్చాలంటే దాన్ని అసహ్యించుకోవటం మార్గం కాదని గుర్తించారు. ప్రజల్లో కలసిపోయి ప్రజలను విప్లవానికి సమాయత్తం చేయాలని భావించిన కొందరు దిగంబర కవులు విప్లవ రచయితల సంఘ స్థాపనకు తోడ్పడ్డారు. "దిగంబర కవుల ఉద్యమాన్ని గురించి శ్రీకొడవటిగంటి కుటుంబరావు వాంతి చేసుకొనే వాణ్ణి చూసి ఎవరూ వాంతి చేసుకోరు'. సమాజం మారాలనే ఆవేశం లోపలినుండే రావాలని, ప్రజలకు ఆ ఆవేశం కలిగించటానికి పూనుకోవాలని చెప్పిన హితవు వీరిపట్ల యధార్థమైంది. దిగంబర కవులు సమాజాన్ని చూసి అసహ్యించుకున్నట్లే ఇంకా ఎందరో అసహ్యించుకొంటున్నారు. పరిస్థితులను తిట్టుకొంటూ కూర్చోలేదు. భారతదేశంలో అతివాద రాజకీయ పక్షాల్లో వచ్చిన మార్పు కూడ దిగంబర కవులలో మార్పు రావటానికి తోడ్పడింది" అంటారు రామమోహనరాయ్. దిగంబర కవుల గీతాల నిండా బూతు మాటలే ఉన్నాయనుకోవడం పొరపాటు. ఆలోచనను ప్రేరేపించేవి, కరుణామయ దృశ్యాలు, వ్యసనాల్లో మునిగిపోయిన వారికి హెచ్చరికలు, మోసకారుల బండారాలను వ్యంగ్యంగా బయటపెట్టడం, కవితా దుర్వినియోగాన్ని ఎత్తి చూపటం కూడా ఉన్నాయి.

రసవంతమైన రచనలతోపాటు అసహ్యాన్ని కలిగించే రచనలు కూడా ఉన్నాయి. అశ్లీల పదాలను అవసరానికి వాడటం దోషంకాకపోయినా, అవి కవి ఆవేశంలోనుండికాక కేవలం సంచలనాన్ని సృష్టించడానికి, పాఠకులను 'షాక్' చెయ్యటానికి కావాలని తెచ్చి పెట్టుకున్నారు. వీరు ప్రయోగించిన అశ్లీల పదాలు, వర్ణనలు కామోద్రేకాన్ని కల్గించకుండా ఏహ్యభావాన్ని కలిగిస్తాయి. అశ్లీల పదాలను పరిహరించమని సలహా ఇచ్చిన విమర్శకులను కూడ దిగంబర కవులు నిందించారు. సమాజంలోని అసహ్యతను ప్రకటించడంలో ముందడుగు వేసినా అవసరానికి మించి ప్రయోగించిన అశ్లీల పదాలు వీరి కవిత్వం మీద పాఠకునికి జుగుప్స కలిగించాయి.

## 8.7 దిగంబర కవిత్వ విమర్శ :

1965-68 మధ్య కాలంలో తెలుగు సాహిత్యాన్ని ఒక ఊపు ఊపిన దిగంబర కవిత్వం 1968 నుండి క్రమంగా మలుపు తిరిగింది. అస్తిత్వవాద సిద్ధాంతంతో ఇద్దరూ, మావో ఆలోచనా విధానంవైపు ముగ్గురూ ఆకర్షించబడ్డారు. వీరి కవిత్వానికి నిర్దిష్టమైన ప్రణాళికలేదు. ఆవేశపరులైన యువకుల ఆత్మ ఘోషగా ఆవిర్భవించింది. కాబట్టి ఇది ఒక ఉద్యమంగా ఎదగలేకపోయింది. వీరి కవిత్వంలో వస్తువిశ్లేషణ ప్రధానాంశంగా ఉంది. రాజకీయం, ఆర్థికం, మతం, మానవత్వం, సాహిత్యం, కవితా వస్తువులుగా దూషించినా, భూషించినా విషయాన్నే ప్రధానంగా స్వీకరించారు. దిగంబర కవుల తీవ్రధాటిని సమకాలిక కవులు విమర్శకులు తట్టుకోలేకపోయారు. ఈ కవిత్వం తీవ్రమైన నిందలకు స్తుతులకు గురయింది.

'దిగంబర కవిత్వోద్యమం తాటాకుల మంటలా ఎలా వచ్చిందో అలా పోతుంద'ని విశ్వనాథ విమర్శిస్తే, మార్పు ఆయనకు బద్ధ శత్రువు. అందుకే విద్యుద్దీపాలకన్నా ఆముదపు దీపాలే వేయిపడగల వెలుగునిస్తాయని దిగంబర కవులు వీరిని ప్రతి విమర్శ చేశారు.

వీరిది తిట్టు కవిత్వమని, అశ్లీల పదప్రయోగం తిట్టు కవితకు మెరుగులు దిద్ది పదును పెడుతున్నదని ఆచార్య కె.వి.ఆర్. నరసింహం అన్నారు.

దిగంబర కవిత్వాన్ని చదివిన ఆరుద్రగారు "మహాబలిపురంలో పెద్ద అలలువచ్చి మొహానికి తగిలితే" కలిగిన 'షాక్' వంటి అనుభూతి కలిగిందన్నారు. అన్యాయాలను, అక్రమాలను అమానుషాలను ప్రతియుగంలోను ప్రతి తరంలోను ప్రతికవి ఖండిస్తూనే ఉంటాడు. కళ్ళముందు దారుణాలు జరుగుతుంటే కవి శపించక మానడు. కాని ఈ కవులు వాల్మీకిలాగ కాక కూచిమంచి జగ్గకవిలాగ తిడుతున్నారు. అందులో కవిత్వం తగ్గి కసి పెరుగుతున్నది. క్షమించడం చేతకానివాడు దానవుడుగా మారడానికి అవకాశాలు ఎక్కువ అన్నారు.

కొత్త పదజాలం ప్రయోగిస్తున్నామనుకొని అసహ్యమైన జుగుప్సాకరమైన పదచిత్రాలు వక్రీకృత మానవతా భావాలు పోగులు పోగులుగా పెట్టిన దిగంబరులు సాధించినది మానవజాతికి రుగ్మతనీ, సిఫిలిస్‌నీ, కుష్ఠునీ తప్ప అన్యం కాదు అన్నారు సోమసుందర్.

దిగంబర కవిత్వం కేవలం తిట్టు కవిత్వంగా కన్పిస్తుందంటే ఆశ్చర్యపడవలసిన పనిలేదంటారు ఆర్.ఎస్. సుదర్శనం.

నూతలపాటి గంగాధరం "దిగంబర కవిత్వోద్యమం సాహిత్య చరిత్రకారులకు ప్రయోజనం కావచ్చునేమోకాని సామాజిక వ్యవస్థకు ఉపయోగించే గుణం ఇందులో మృగ్యం" అన్నారు.

దిగంబర కవులది సాహిత్య స్టంటు. గుప్తాంగాల వర్ణన, సెక్సు పదాలమోజు - ఇవన్నీ మానసిక రుగ్మతకు లక్షణాలు అని కె.వి. రమణారెడ్డి అభిప్రాయం.

"దిగంబర కవులు ఆధునిక కవిత్వంలో ఒక కొత్త దారి చూపారు. ఇది నిజమైన విప్లవం. తిరుగుబాటు కవిత్వం. ఈ కవిత్వం ప్రజలకు ఈనాడు అవసరం" అంటారు కొడవటిగంటి.

శ్రీరాచమల్లు రామచంద్రారెడ్డి "వీళ్ళు ఆరుమంది అరిషడ్వర్గంలాగా. ఈ సంపుటిలో దికేలు చాలానే ఉన్నాయి. కవిత్వం మాత్రం ఎక్కడా లేదు" అని నిందించారు. వీళ్ళ రచనలు చదివితే అసహ్యం వేస్తుంది. ఆ తిట్లూ, ఆ బూతులు, ఆ ఆటవిక ఆవేశమూ, ఆ ఒళ్ళు ఎరుగని కుసంస్కారమూ ఆనోటితోటా, ఆ మాటల కంపు మనకు జుగుప్స కలిగిస్తాయన్నారు. గత వెయ్యి సంవత్సరాల తెలుగు సాహిత్య చరిత్రలో ఇంతనీచమైన కుసంస్కారమైన రచన మునుపెప్పుడూ రాలేదు. అన్నారు. రా. రా. అభిప్రాయాన్ని ఖండిస్తూ- "రామచంద్రారెడ్డిగారు ఆక్షేపించారేగాని, వీళ్ళ కవిత్వంలో నిజాయితీని, ధర్మక్రోధాన్ని అన్నిటినీ మించి ప్రతిభావంతులైన వీరి కవిత్వాన్ని ఆస్వాదించలేకపోయారు. పుడకలున్నాయని పానకం పారబోసుకుంటామా? అశ్లీలాలున్నాయని కవిత్వాన్ని నిందిస్తే అది సహృదయ లక్షణం కాదుగదా" అంటారు రామమోహనరాయ్.

అభ్యుదయ కవిత్వం తరువాత తెలుగు సాహిత్యంలో ఏర్పడిన స్తబ్ధతను దిగంబర కవిత్వం తొలగించింది. వీరి తిరుగుబాటు తనం చూశాక యువకవులు కర్తవ్యాన్ని గుర్తించారు. విప్లవ రచయితల సంఘం ఏర్పడ్డాక దిగంబర కవిత్వం అంతరించింది. అయితే కొత్త కవితా ధోరణులను వికసింప జేయడానికి కావలసిన నేపథ్యాన్ని మాత్రం ఏర్పాటుచేసింది.

### 7.9 దిగంబర కవుల ప్రభావం :

దిగంబర కవుల ప్రేరణతో సుగమ్‌బాబు, కిరణ్‌బాబు, దేవీప్రియ, కమలాకాంత్, ఓల్గా అనే ఐదుగురూ రెండు కవితా సంపుటాలు వెలువరించారు. రోగగ్రస్తమైన సమాజాన్ని బాగు చేయాలన్న తలంపుతో బయలుదేరిన ఈ పైగంబర కవుల కవిత్వం ప్రజలను ఆకట్టుకోలేకపోయింది.

హిందీలోని 'ధర్మయుగ్' పత్రికలో వ్యాసాలు, దిగంబర కవితల అనువాదాలు వచ్చాయి. వీరి కవిత్వ అనువాదాలు భారతీయ జ్ఞానపీఠ్, లహర్, పొయెట్ పత్రికల్లోను, బెంగాలీ పత్రికల్లోను కన్నడ పత్రికల్లోనూ, ప్రచురింపబడ్డాయి. వీరి మూడు కవితా సంపుటాలను ప్రొఫెసర్ రామానాయుడు అనువదించి కేంద్రీయ సంస్థాన అవార్డు పొందారు. కన్నడంలోని బండాయ సాహిత్యానికి, హిందీలో కొత్త ధోరణులకు దిగంబర కవిత స్ఫూర్తి నిచ్చింది.

దిగంబర కవిత్వోద్యమంలాగానే మహరాష్ట్రలో 'దళిత్ పాంథర్' ఉద్యమం దళిత జాతులహక్కుల కోసం ఏర్పడింది. అమెరికాలోని బ్లాక్ పాంథర్ ఉద్యమంలాగ వీరు దళిత్ పాంథర్ అని పెట్టుకున్నారు. దిగంబర కవిత్వంలాంటి సాహిత్యోద్యమాలు ఒరియా, పంజాబీ, బెంగాలీ భాషల్లోకూడ వచ్చాయి. ఒక సంధియుగంలో ఆదర్శాన్ని తొలగించి సాహితీ పరుల వరాల్లో విస్ఫురగిలించి విప్లవ ఝంఝ వీచటానికి దిగంబర కవిత్వం దోహదం చేసింది.

## 8.9 సమీక్ష :

దిక్కులు అంబరంగా కలవారు దిగంబర కవులు. ఇతర దేశాలలోని కొందరు యువకులకు ఉన్నట్లు వీరికి భౌతిక దిగంబరత్వం లేదు. వీరు మానసిక దిగంబరులు. మాయా మర్మంలేని, కల్ల కపటం లేని స్వచ్ఛమైన అభివ్యక్తికోసం ఆరాటపడ్డారు. సంఘంలో పొందిన అశాంతి, నిరాశ, నిస్పృహలనుండి వీరికి తిరుగుబాటు తత్వం సంక్రమించింది. అశాంతి, ఆందోళన నుండి వీరి కవిత్వం పుట్టింది. సంఘం దేశ ఆర్థిక వ్యవస్థమీద ఆధారపడి జీవిస్తుందని, మానవ సంబంధాలు ఆర్థిక పరిస్థితులకనుగుణంగా నడుస్తున్నాయని గ్రహించారు. రాజకీయంలోని కుళ్ళును నిర్మొహమాటంగా సూచించారు. రాజకీయ నాయకులను పేలుగా, చొల్లు కార్చుకునేవాళ్ళుగా, కొజ్జాలుగా, నపుంసకులుగా పగటి వేషగాళ్ళుగా పేర్కొన్నారు. రాజకీయాలతో నిండిన ఈ సమాజం కుష్టు వ్యవస్థయి దుర్గంధ భూయిష్ఠంగా తయారయిందని విమర్శించారు.

భారత దేశపు ఆర్థిక స్థితిగతులమీద దాడి చేశారు. శ్రమకు విలువ లేకుండా ధనానికి విలువ నివ్వడాన్ని, రాజకీయ నాయకులు, అధికారులు, కాంట్రాక్టరులు దేశాన్ని దోచుకు తింటున్నారంటూ ఈ దోపిడీ వ్యవస్థమీద తిరుగుబాటు ప్రదర్శించారు. మఠాధికారులు, పీఠాధిపతులు, బాబాలను మోసకారులుగా చిత్రించారు.

నన్నయ్యతోపాటు భావ కవిత్వాన్ని పూర్తిగాను, అభ్యుదయ కవిత్వాన్ని పాక్షికంగాను నిరసించారు. ఛందోబద్ధ సాహితీ విష వృక్షంలో చీడపురుగు గీపెడుతుందన్నారు. సాహితీ యాచకులు, కవి పందులంటూ పరుష పదజాలాన్ని వాడారు. మానవత్వం, వ్యక్తి స్వేచ్ఛ కోరుకున్నారు. మానవత మసిబారడాన్ని సహించలేకపోయారు. పీడనలేని వర్గాతీత మానవ సమాజాన్ని కాంక్షించారు. అందుకే చిరిగి ముక్కలయిన పాత చాపలాంటి ఈ వ్యవస్థను నాశనం చేసి కొత్త వ్యవస్థను రూపొందించాలని కోరుకున్నారు.

## 8.11 ప్రశ్నలు :

1. దిగంబర కవిత ఆవిర్భావ వికాసాలను తెలియజేయండి
2. దిగంబర కవితా లక్షణాలను వివరించండి
3. దిగంబర కవిత స్వరూప స్వభావాలను విశదీకరించండి.

## 8.10 ఆధార గ్రంథాలు :


అభ్యుదయ సాహిత్యం - ఇతర ధోరణులు - డా. ఎస్వీ సత్యనారాయణ
ఆధునికాంధ్ర కవితాతత్వం - జి. లలిత
ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ - కోవెల సంపత్కుమార్
ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం - ఆచార్య కొలకలూరి ఇనాక్
తెలుగు కవితా వికాసం - కడియాల రామమోహనరాయ్
తెలుగు సాహిత్య సమీక్ష - ఆచార్య జి. నాగయ్య
దిగంబర కవులు - శేషాచలం అండ్ కో
దిగంబర కవిత్వం - పరిశీలన - బొంతగర్ల ప్రసాద్
సాహిత్యంలో దృక్కోణాలు - ఆర్.ఎస్. సుదర్శనం


ఆచార్య తేళ్ళ సత్యవతి

పాఠం - 9

# విప్లవ కవిత్వం - సామాజిక నేపథ్యం - కవులు

పాఠ్య నిర్మాణ క్రమం

9.1 సామాజిక నేపథ్యం
9.2 సాహిత్య నేపథ్యం
9.3 దిగంబర కవులు
9.4 తిరగబడు కవులు
9.5 విప్లవ రచయితల సంఘం
9.6 విప్లవం అంటే ఏమిటి?
9.7 విప్లవ సాహిత్య స్వభావం
9.8 మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతం
9.9 కొందరు విప్లవ కవులు - రచనలు

**లక్ష్యం :**

విప్లవ కవిత్వ ఆవిర్భావానికి సామాజిక సాహిత్య నేపథ్య పరిశీలనం - విరసం - స్వభావం - విప్లవ కవుల గురించి తెలుసుకొంటారు.

ఆధునికాంధ్ర సాహిత్యచరిత్రలో ఎన్నో ఉద్యమాలు కన్పిస్తాయి. ఒకరకంగా చెప్పాలంటే 20వ శతాబ్ది నుంచి తెలుగు సాహిత్య చరిత్ర అంటే ఉద్యమాల చరిత్రే. సంఘ సంస్కరణ, స్వాతంత్ర్య పోరాటం, వామపక్ష ఉద్యమాల నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్రలో గూడా జాతీయకవిత్వం, భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, విప్లవకవిత్వం, స్త్రీవాద దళితవాదాలు ఉద్యమస్థాయిలో సాగాయి. మరి సాహిత్యోద్యమాలను ఏవిధంగా అర్థం చేసుకోవాలి?

నిర్దిష్ట భౌతికాశయంతో ఒక మానవసమూహం చేసే సమిష్టి ప్రయత్నాల, చర్యల పరంపర ఉద్యమం. (సామాజికోద్యమాలను సాహిత్యోద్యమాలను విభిన్నంగా అర్థం చేసుకోవాలి.)

సాహిత్యోద్యమం సామాజిక వస్తువుతో అన్యోన్యసంబంధం కలిగి ఉంటుంది. అంటే సాహిత్యోద్యమానికి సామాజిక మౌలికాంశాలతో ఆర్థిక రాజకీయాలతో ప్రధాన ప్రమేయం ఉంటుంది. సమాజంలోని ఇతర ఉపరితల అంశాలతో సాహిత్యోద్యమానికి - ప్రధాన ప్రమేయం ఉంటుంది.

సాహిత్యోద్యమానికి సామాజిక భౌతిక పరిణామాలతో నిరంతర పారస్పర్యం (Interaction), చలనతీవ్రత ఉంటాయి.

ఉద్యమసాహిత్యానికి సమూహిక వినియోగ సంబంధాలుంటాయి. అంటే ఆ సాహిత్యాన్ని ఒక సమూహం సమూహంగా స్వీకరించటం, ప్రభావితం కావటం జరుగుతాయి.

తెలుగు సాహిత్యంలో 1970-1990 మధ్యకాలాన్ని విప్లవోద్యమకాలంగా భావించవచ్చు. ఆకాలంలో వేల సంఖ్యలో విప్లవ, కవితలు, కథలు, వ్యాసాలు మొదలైనవి వెలువడ్డాయి. ఆ కాలానికి అటు, ఇటు కూడా విప్లవసాహిత్యం వచ్చినా దాని ఉధృతినిబట్టి స్థూలంగా ఈ కాలనిర్ణయం చెయ్యబడింది.

సాహిత్యాన్ని ఒకనదీ ప్రవాహంగా భావిస్తే ఉద్యమాలను నదికి వచ్చే వరదలుగా అనుకోవచ్చు. వరదలు ఎప్పుడోవస్తాయి. అవి ఊరికేరావు. అందుకు భూ, భౌతిక, పర్యావరణ కారణాలుంటాయి. అదేవిధంగా ఉద్యమాలకు రాజకీయార్థిక సామాజిక కారణాలుంటాయి. ఆవిధంగా విప్లవ సాహిత్యోద్యమానికి కూడా పూర్వరంగం లేదా నేపథ్యం ఎంతో ఉంది.

## 9.1 సామాజిక నేపథ్యం:

1947 ఆగస్టు15న వచ్చిన స్వాతంత్ర్యంతో దేశ సమస్యలన్నీ తీరిపోతాయని దేశభక్తులు, ప్రగతికాముకులు నమ్మారు. అయితే అదికేవలం అధికారం మార్పు మాత్రమే అని సమస్యలు సమస్యలుగానే మిగిలిపోయాయని తెలుసుకోవటానికి ఎంతోకాలం పట్టలేదు. ప్రగతిశీలి జవహర్‌లాల్‌నెహ్రూ నాయకత్వంలో గొప్ప సోషలిస్టు వ్యవస్థ ఏర్పడుతుందని నమ్మినవాళ్ల ఆశాభంగం పొందారు. పంచవర్షప్రణాళికలు ఆచరణలో అభివృద్ధి సాధించలేకపోయాయి. 'అవినీతి, బంధుప్రీతి, చీకటిబజారు అలముకొన్న ఈదేశం ఎటుదిగజారు?' (శ్రీశ్రీ)అని 1950దశాబ్దంలోనే చైతన్యవంతులకు ఆలోచన కలిగింది. 1955-65 దశాబ్దంలో నిరక్షరాస్యత, నిరుద్యోగం, కులకక్షలు, దారిద్ర్యం, అప్పులు, వడ్డీలు, విదేశాల కంపెనీలు, సంపద విదేశాలకు తరలింపు, ధనికులు మరింత ధనికులై పేదలు మరింతపేదలు కావటం మొదలైన పరిణామాలెన్నో జరిగాయి. వినోబాభావే భూదానోద్యమం సూటిగా ప్రారంభమైన భూసంస్కరణలు సరిగ్గా అమలుకాలేదు. అంతర్జాతీయంగా అమెరికన్, రష్యాలవంటి అగ్రదేశాల దయాదక్షిణ్యాలమీద దేశం నడవాల్సివచ్చింది. జనజీవితం సంక్షోభానికి లోనయ్యింది. భూస్వాములు, పెట్టుబడిదారులు బలపడ్డారు. పరిపాలకులు ఆవర్గాలనుండే, రావటంవల్ల సగౌరవంగా ఆవర్గాలకే ప్రభుత్వం అండ, దండలు లభించాయి. పేదప్రజల మీద బలప్రయోగం సాగింది. చైతన్యవంతులవుతున్న ప్రజల, మేధావుల కార్యాచరణమ అణిచివేసే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. కార్మికులపై, వ్యవసాయకూలీలపై నిర్బంధాలు సాగాయి. అయితే ఈదశలో శ్రామిక వర్గంనుంచి, గిరిజనులనుంచి ప్రతిఘటనలు కూడా చెదురుమదురుగా మొదలయ్యాయి.

ఈదశలో ప్రపంచంలోని సోషలిస్టు శక్తులకు నాయకత్వం వహిస్తున్న అగ్రరాజ్యం రష్యా భారతదేశంలో కాంగ్రెస్ అధ్వర్యంలో సాగుతున్న ప్రభుత్వానికి అనుకూలంగా ఉంది. 1956లో రష్యా కమ్యూనిస్టుపార్టీ 'శాంతియుత పరివర్తన'ద్వారా సోషలిస్టు వ్యవస్థ స్థాపన తన ఆశయంగా ప్రకటించింది. దానికి అనుగుణంగా భారత కమ్యూనిస్టుపార్టీ ఇక్కడి, కాంగ్రెస్ ప్రభుత్వంతో మిత్రవైఖరి అవలంభించి, ప్రజాహిత కార్యక్రమాలు చేయించటం గురించి ఆలోచించింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వంపట్ల శత్రువైఖరితో ఈపార్లమెంటరీ వ్యవస్థను నూతన ప్రజాస్వామ్యవ్యవస్థగా రూపొందించటానికి భారత కమ్యూనిస్టు పార్టీలో రాడికల్స్ ఆలోచించారు.

1951లో తెలంగాణా సాయుధపోరాట విరమణ గురించే కమ్యూనిస్టుపార్టీలో భిన్నాభిప్రాయాలు తలెత్తాయి. 1962లో భారత చైనా యుద్ధంలో భారత కమ్యూనిస్టుపార్టీ భారతదేశంవైపు మొగ్గితే, పార్టీలోని రాడికల్ వర్గం చైనావైపు మొగ్గుచూపింది. 1962 తర్వాత ఈవర్గం ప్రభుత్వపీడనకు గురిఅయింది. 1964లో ఈ రాడికల్ వర్గం భారత కమ్యూనిస్టు-మార్క్సిస్టు పార్టీగా (CP1-M) విడిపోయింది. ఈపార్టీ దేశానికి వచ్చిన స్వాతంత్ర్యం బూటకమేనని, నిజమైన స్వాతంత్ర్యంకోసం విప్లవానికి అనుకూలమైన పోరాట విధానం అవలంభించాలని నిశ్చయించింది. నిరాశ నిస్పృహల్లో ఉన్నయువతరం కొంత ఊరటపొందింది, ఉత్తేజంపొందింది. అయితే కాలక్రమంలో రెండు కమ్యూనిస్టుపార్టీలు విప్లవం పోరాటంకంటే రాజకీయపు ఎత్తుగడులు ప్రధానంగా నడక సాగించాయి. మరోవంక రష్యాసోషలిస్టు రాజ్యంగా అవతరించే క్రమంలో అంతర్జాతీయంగా మరో ఆలోచనావిధానం ప్రాధాన్యంపొందింది. దానికి అనుకూలమైన వర్గాలు కూడా భారతదేశంలో బలం పుంజుకోవటం మొదలైంది. ఒకగొప్ప సామాజిక విప్లవం మాత్రమే భారతదేశ వ్యవస్థలో ప్రజల సమస్యలను తీర్చగలదనే ఆలోచన యువకుల్లోకిరాసాగింది. చైనాలో మావో-సే-టుంగ్ నడిపిన 'లాంగ్‌మార్చ్' వెలుతురులో భారతీయ ప్రజాపోరాటాలు జరగాలని ఈవర్గం ఆశించింది. క్యూబాలో ఫెడల్ కాస్ట్రో నాయకత్వంలో విజయవంతమైన 'చేగువేరా' వంటి వీరులు గొప్ప ఉత్తేజం కలిగించారు.

1967లో పశ్చిమబెంగాల్ లోని డార్జిలింగ్ జిల్లా నక్సల్బరీ గ్రామంలో గిరిజనులు భూస్వాములు జోతేదార్లపై తిరగబడి సాయుధపోరాటం చేశారు. తమ భూములను స్వాధీనం చేసుకున్నారు. ఈరైతాంగ పోరాటానికి చారుమజుందార్, కానూసన్యాల్ వంటివాళ్లు నాయకత్వం వహించారు. 1969 ఏప్రిల్ 22న మార్క్సిస్టు లెనినిస్టు పార్టీ ఏర్పడింది. రెండు కమ్యూనిస్టుపార్టీలు భాగస్వాములుగా ఉన్న

పశ్చిమబెంగాల్‌లోని 'యునైటెడ్ ఫ్రంట్' ప్రభుత్వం ఈ తిరుగుబాటును కఠినంగా అణిచి వేసింది. 1972లో అరెస్ట్ అయిన చారుమంజుదార్ పోలీసుకస్టడిలోనే మరణించాడు. నక్స్‌ల్బరీ ప్రకంపనలు ఆగిపోలేదు.

'తిరిగి తిరిగొచ్చింది నక్స్‌ల్బరీ, తనకు మరణమే లేదంది నక్స్‌ల్బరీ' అని కవులుగానం చేసినట్టు నక్స్‌ల్బరీ పరోక్ష ప్రభావంతో 1967లో శ్రీకాకుళ గిరిజన పోరాటం మొదలైంది. గిరిజనులు తమను పీల్చిపిప్పి చేస్తున్న భూస్వాములపై తిరగబడ్డారు. తారిమెల నాగిరెడ్డి, నాగభూషణ పట్నాయక్ మొదలైన రాజకీయ సిద్ధాంతకారులు, నాయకులు ఈదశలో యువతరానికి ఆదర్శమయ్యారు. చారుమజుందార్, కానూసన్యాల్ వంటి అతివాద కమ్యూనిస్టులు ఉత్తేజం కలిగించారు. శ్రీకాకుళ ఉద్యమాన్ని రూపొందించిన ప్రధాన విప్లవశిల్పులు వెంపటాపు సత్యం, పంచాది కృష్ణమూర్తి, పంచాది నిర్మల, తామాడ గణపతి, చాగంటి భాస్కరరావు మొదలైన ఎందరో యువతీ యువకులు, విద్యార్థులు, ఇంజనీర్లు, డాక్టర్లు ఈఉద్యమంలో పాల్గొని హతులయ్యారు. ప్రభుత్వం కల్లోలిత ప్రాంతాల చట్టం ప్రయోగించి నిర్విచక్షణతో ఉద్యమాన్ని అణిచివేసింది. విప్లవకారులపై 1970 లో పార్వతీపురం కుట్రకేసు మోపబడింది. వెంపటాపు సత్యం ఆదిభట్ల కైలాసం సుబ్బారావు పాణిగ్రాహి వంటి పోరాటకారులు కాల్చివేయబడ్డారు. ఉద్యమం అపజయం పాలైన ఆ స్ఫూర్తి నుంచే తెలుగు సాహిత్యంలో విప్లవోద్యమం ప్రారంభమైంది. సుబ్బారావు పాణిగ్రాహి తన పాటలతో విప్లవానికి నాంది పలికాడు.

శ్రీకాకుళ స్ఫూర్తితో మళ్లీ తెలంగాణా 1977 నుంచి రైతాంగ పోరాటాలు ప్రారంభమయ్యాయి. మార్క్సిస్టు లెనినిస్టుపార్టీ నేతృత్వంలో ఉత్తర తెలంగాణాలో కూలిజనం రైతు-కూలీసంఘాలు చూచుకొని దొరల ఆధిపత్యాన్ని ధిక్కరించారు. ఉవ్వెత్తున భూపోరాటం మొదలైంది. సహజంగానే ఈపోరాటాన్ని కూడా ప్రభుత్వం 1978లో కల్లోలిత ప్రాంతాలచట్టం, నిర్బంధాలు మొదలైన వాటితో అణచి వేసే ప్రయత్నం చేసింది. ఇటువంటి ఉద్యమాలు విప్లవ సాహిత్యాన్ని బలంగాప్రోది చేశాయి.

## 9.2 సాహిత్యనేపథ్యం:

20వ శతాబ్దంలో భారతీయ సమాజంలో ఎన్నో ఉగవడులు కన్పిస్తాయి. రష్యాలో 1917లో లెనిన్ నాయకత్వంలో విజయవంతమైన బోల్షివిక్ విప్లవం మొత్తం ప్రపంచానికే గొప్పవాగ్దానం చేసింది. ఒకగొప్ప సోషలిస్టు వ్యవస్థ అన్ని దేశాల్లో ఏర్పడగలదని ఆశాభావం తలెత్తింది. తెలుగుదేశంలోను మెల్లమెల్లగా మార్క్సిస్టు భావజాలం వ్యాపించింది. ఉన్నవ లక్ష్మీనారయణ వంటి గాంధేయవాదుల రచనలు సైతం(మాలపల్లి) ఈప్రభావం నుంచి తప్పించుకోలేక పోయాయి. 1936లో అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది. శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు, చాగంటి సోమయాజులు, తానీదర్మారావు, తుమ్మల వెంకట్రామయ్య, మద్దుకూరి చంద్రశేఖరరావు, ఆరుద్ర, దాశరథి, సోమసుందర్, కె.వి.రమణారెడ్డి, నారాయణరెడ్డి, మొదలైన హేమాహేమీలు ప్రగతిశీల రచనలెన్నో చేశారు. స్వాతంత్రోద్యమంలోనే నైజాం వ్యతిరేక తెలంగాణా పోరాటకాలంలోను అరసం (అభ్యుదయ రచయితల సంఘం) గొప్ప కృషిచేసింది. ఎంతోమంది రచయితలు ప్రజాపోరాటాల్లో పాల్గొని, కష్టనష్టాలు అనుభవించారు. ఆక్రమంలో ఎంతో గౌరవం కూడా పొందారు.

అయితే ఈక్రమంలోనే అభ్యుదయ సాహిత్యం 1955నాటికి ఒకానొక ఘనీభవస్థితికి చేరింది. స్వాతంత్ర్య భానోదయంతో ప్రజల కష్టాలు తీరిపోతాయని కవులనుకున్నారు. మువ్వన్నెలజెండా మీద పంచవర్షప్రణాళికల మీద అల్లిక మొదలైంది. కొంతమంది అభ్యుదయకవులు, కళాకారులు తెలంగాణా పోరాట విరమణ తర్వాత వాడిని, వేడిని పోగొట్టుకున్నారు. కొందరు సినిమాల్లోకి, వ్యాపారాల్లోకి వెళ్లిపోయారు, 1955 తర్వాత అరసం కొంతవరకు క్షీణించింది. 1960 పిమ్మట కుందుర్తి ఆంజనేయులు 'వచనకవిత్వం' ఒక ఉద్యమంగా అభివృద్ధిచేసే ప్రయత్నంలో భారత్-చైనా యుద్ధసందర్భంలో అభ్యుదయకవులు దేశభక్తి భావంతో పాలకపక్షాన్ని సమర్థించారు. ఆతర్వాతకూడా వీరిలో చాలమంది ప్రజలకష్టాలకు ప్రభువులు కారణం కాదనే భావనలోకి వెళ్లిపోయారు. ఇక కవిత్వరంగంలో సమత, మమత, నవత, మానవత, అభ్యుదయం మొదలైన అరిగిపోయిన పదాలతో ఏమాత్రం, కొత్త చైతన్యం కలిగించలేని కవితలు వెలువడ సాగాయి.

ఈసమయంలో 'రాత్రి' సంకలనం కొంతవరకు సాహిత్యరంగంలో కొత్త ఆలోచనలు రేపింది.

## 9.3 దిగంబర కవులు :

తెలుగు సాహిత్యం మీద ఒక ఉలరిలాగా వచ్చిపడింది దిగంబర కవిత్వం, ఆరుగురు యువకవులు నగ్నముని, నిఖిలేశ్వర్, చెరబండరాజు, జ్వాలాముఖి, భైరవయన్, మహాస్వప్న అనే మారుపేర్లతో సమాజ వ్యవస్థమీద ధిక్కార ఢంకామోగించారు.

"నన్నయను నరేంద్రుడి బొందలోనే నిద్రపోనియ్యి
లేవకు పీకనుమిలి గోతిలోకి లాగుతాడు
ప్రబంధాంగనల తొడలు తాడి మొద్దులు
తాకితే కాళ్లు విరగ్గొట్టు" (నిఖిలేశ్వర్)

అంటూ పాత కవిత్వధోరణుల మీద తిరుగుబాటు ప్రకటించారు. అతి తీవ్రపదజాలంతో, బూతులో అప్పటి రాజకీయ అవినీతిని, సమాజంలోని కుహనానీతిని, రచయితల నిశ్శైతన్యాన్ని, 'లంగామార్కు' సినిమాలని, 'వంటింటిపోపు' సాహిత్యాన్ని, 'అగాధమీలోని' తీవ్రంగా విమర్శించారు. వీళ్లధాటికి ప్రగతిశీల రచయితలు సైతం ఉలిక్కిపడ్డారు. ఆ కవిత్వాన్ని జీర్ణించుకోలేక ప్రతి విమర్శలు ప్రారంభించారు. అయితే 1965నుండి 1968వరకు దిగంబరకవుల స్వరం అప్రతిహతంగా కొనసాగింది. మార్క్సిజం, అస్తిత్వవాదం దిగంబరకవిత్వ మూలాల్లో ఉన్నాయని ఆ కవితాసంపుటల ముందుమాటల వల్ల తెలుస్తుంది. కేవలం మూడు సంవత్సరాలకాలం, మూడుసంపుటాల వరకే కొనసాగిన దిగంబరకవిత్వం ఆస్థితినిదాటి తన ప్రభావం కొనసాగించింది.. అరిగిపోయిన పదాలతో, ఏచైతన్యం, స్పందన కలిగించలేక నిస్తేజంగా మారిన అప్పటి సాహిత్యం మీద తిరుగుబాటు జెండా వేసింది. దిగంబరకవుల్లో కొంతమంది ఆతర్వాత కాలంలో విప్లవకవులుగా పరిణతి పొందారు.

"ఈదేశంలో, ఈభూగోళంలో ఊపిరిపీల్చే ప్రతిమనిషి ఉనికి కోసం తపనపడి, అతడి భూమినిచూసి వెక్కివెక్కి ఏడ్చి, పిచ్చెత్తి ప్రవర్థించిన కవిత" అని దిగంబరకవులు తమ కవిత్వమూలాన్ని స్పష్టం చేశారు. "మంచికోసం, మనిషిలోని నిప్పులింటి నిజమైన మనిషికోసం, కపటంలేని చిరునవ్వులు చిందే సమాజంకోసం, అహోరాత్రులు ఆరని అగ్నిలోనడిచిన ఆత్మలలోంచి పలుకుతున్న గొంతూకలం" అని ప్రకటించుకున్నారు. స్వచ్ఛమైన, నగ్నమైన మనిషి ఆవిష్కారం కోసం తపించారు.

పుస్తకాల్లోంచిగాక తాము తాముగా మాట్లాడదలుచుకున్నామని, తమకవిత్వాన్ని వచన కవిత్వం అననివ్వదలచుకోలేదని వాళ్లు వెల్లడించారు. తమకవితలను 'దిక్'లు అన్నారు. దిగంబరశకం ప్రారంభమైందని దానికి సరికొత్త కాలమానం, ఋతువులు, సంవత్సరాల పేర్లు పెట్టారు.

"ఓనాప్రియమైన మాతృదేశమా
తల్లివి తండ్రివి దైవానివి నీవేనమ్మా
దుండగులతో పక్కమీద కులుకుతున్న శీలంనీది
అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టుపెట్టిన అందం నీది
సంపన్నుల చేతుల్లో మైమరచి నిద్రిస్తున్న యవ్వనంనీది
వందేమాతరమ్
వందేమాతరమ్" (చెరబండరాజు)

ఈవిమర్శతీవ్రత వేదనా తీవ్రతనుంచే వెలువడింది. వర్తమాన వ్యవస్థపట్ల జుగుప్స కలిగించే క్రమంలో దిగంబరకవులు బూతుల్ని ఆశ్రయించారు.

"ఓహోహో అఖిలాంధ్ర దేశమా
అజ్ఞానాంధ సౌభాగ్యసీమా......
నీ వేల సంవత్సరాల గొడ్రాలి సంస్కృతిని
ఏదేశమేగినా ఎందుకాలడినా
కారంలో పొర్లించిన రొకళ్లతో
పట్టపగలు విషయించాలనుంది" (నగ్నముని)

అన్నంతగా అశ్లీలాన్ని ఆయుధం చేసుకొని వ్యవస్థపై రోతపుట్టించే ప్రయత్నం చేశారీ కవులు. దీన్ని సహించలేని రాచమల్లు రామచంద్రారెడ్డి(రారా) వంటి విమర్శకులు "వీళ్లు ఆరుమంది, అరిషడ్వర్గంలాగా" "వీళ్లరచనలు చదివితే అసహ్యం వేస్తుంది". అన్నారు.

ఎంతమంది ఎన్నివిధాల విమర్శించినా దిగంబరకవుల నిజాయితీని ఎవరూ శంకించలేరు. "నన్నెక్కనివ్వండి బోను, వందేమాతరమ్, ఆకాశం వెక్కివెక్కి ఏడుస్తోంది(చెరబండురాజు), తొడవిరిగినతరం, బుద్ధక్షేమ, జైల్లో సముద్రం (నగ్నముని), చెరచబడ్డగీతం (భైరవయ్య), మేం మనుషులంకాదు, ఇంకేదో పేరుందిమాకు(మహాస్వప్న)" మొదలైకవితలు దిగంబరకవిత్వానికి తాత్వికతను సరికొత్త వ్యక్తీకరణను సంతరించాయి.

దిగంబరకవులు స్ఫూర్తితో 'పైగంబరకవులు' (సుగమ్‌బాబు, దేవిప్రియ, ఓల్గా, కిరణ్‌బాబు, కమలాకాంత్)కూడ, వచ్చిన పాఠకులపై అంతగాప్రభావం చూపలేక పోయారు.

## 9.4 'తిరుగబడు' కవులు:

'తిరుగబడు' కవితాసంచలనం స్వేచ్ఛాసాహిత్య ప్రచురణగా 1969లో వెలువడింది. ఇందులో పదిమంది కవులున్నారు. వరవరరావు, అశోక్, లోచన్, కిషన్, ఎక్స్-రే, ఐ, సంజీవరావు, సుధాకర్, సుదర్శన్, యాదగిరిరావు - 10మంది 'తిరుగబడ' కవులు.

వ్యవస్థపై దిగంబరకవుల కున్నంత ఆగ్రహం ఆ కవులకీ ఉంది. అయితే దిగంబరకవుల విశృంఖల భాషాప్రయోగం ఈకవుల్లో లేదు.

"విషంకలసిన పాయసం మనరాజ్యం, డబ్బున్న భడవాపోషించే ఉంపుడుకత్తె మనప్రజాస్వామ్యం. మనప్రణాళికలో, తీర్మానాలు వాగ్దానాలూ, రేడియోలు, పత్రికలూ, సినిమాలూ, సాహిత్యం ఒకటేమిటి, అన్నిరంగాలూ ఇరవయ్యేళ్లకే ఏడుపుకూడు తిని, రాగూడని రోగాలు తెచ్చుకొని ముసలిదైన దీని విలాసాన్ని వర్ణించటానికే ఖర్చయిపోతున్నాయి" అని ఈసంకలనం తేల్చిచెప్పింది. "శాంతియుత పోరాటం సంభవం. పోరాటం లేకుండా నిజమయిన శాంతిరాదు....సామ్యవాద సమాజాన్ని నిర్మించాలి. ఈవ్యవస్థను శస్త్రచికిత్సచేసి, కొత్త వ్యవస్థను నిర్మించటానికి త్యాగాలూ, బలిదానాలు తప్పవు" అని'యువతరానికి' పోరాటసంకేతాలు అందించింది ఈసంకలనం, శాంతియుత పరివర్తన ద్వారా సోషలిజం సాధ్యమనే ఆలోచనాధోరణిని విమర్శించింది.

ఈవ్యవస్థకు "శస్త్రచికిత్స తప్ప మందులేదని" వరవరరావు ప్రకటించాడు.

"హక్కుల్ని అడుక్కుతినేవాడు
ఇక్కడ జీవించుటకు పనికిరాడు
హక్కులు ఒకడివ్వడ మేమిటి?
శ్వాసించడం ఎవడు నేర్పాడేమిటి?"

అంటూ మనిషి సహజస్వేచ్ఛను వివరించాడు లోచన్. దైవభావనమీద, కర్మసిద్ధాంతం మీద ఏమాత్రం శంకించవవసరం లేదు. అయితే ఈసంకలనంలో రాజకీయ చైతన్యం కన్పించినంతగా కవితాసామర్థ్యం కన్పించదు. 'తిరుగబడు' కవులకు దిగంబరకవులు, శ్రీశ్రీ మొదలైన వారిప్రోత్సాహం లభించింది. ఆతర్వాత ఈకవులు 'విరసం'తో ఏకమయ్యారు.

1970 ఫిబ్రవరి 1, 2 తేదీల్లో మహాకవి శ్రీశ్రీషష్టిపూర్తి సందర్భంగా విశాఖపట్నం పానగల్ బిల్డింగ్స్‌లో సన్మానం జరిగింది. ఆసన్మానసభలో ఫిబ్రవరి 1వతేదీ ఉదయం 'రచయితలకు సవాల్' అనే కరపత్రం పంచారు. అది విశాఖ విద్యార్థుల పేరుతో వెలువడింది. విప్లవసాహిత్య సంచలనానికి అదీ నాంది.

"ముప్పైఏళ్ళుగా సాహిత్యం ఏం చేస్తోంది? ఎటువెళ్తోంది? మీరంతా ఎందుకోసం రాస్తున్నారు? "అనే ప్రశ్నలు సంబంధించింది ఆ కరపత్రం. కుహనా అభ్యుదయ కవుల్ని, సినిమా వ్యామోహవుల్ని, 'వంటి పత్రికల' రచయితల్ని ఆ కరపత్రం నిగ్గదీసింది.

"అభ్యుదయంపేరుతో గొంతుచించుకొని అరచినవాళ్లంతా ఆపేరుతో కవిత్వాన్ని cash చేసుకుంటున్నారు. ప్రజాకవిత్వం సినిమాలకు passport, మాత్రమే అయింది. భావకవిత్వపు భోగం కవుల్లో ప్రజాకవులమని చెప్పుకొనేవాళ్లు కూడా ఒకరికన్నా మరొకరు పేరు తెచ్చుకోవడానికి

నానాగడ్డీ కరవడం, ఒకర్నిచూసి ఒకరు ఈర్ష్యపడ్డం, అధికారంలో ఉన్నప్రతీ అడ్డమైన వాడికాళ్ళు పట్టుకోవడం అకాడమీలో ఆధిపత్యం కోసం నానా అగచాట్లు పడ్డం యిదిగాక యింకేమైనా చేస్తున్నారా?"

కాలంలో సంవాదం (respondence) కోల్పోవటమేస్తబ్దత. సాహిత్యం ఒకానొక కాలసందర్భంలోని ప్రవాహశీలతను, ప్రగతిశీలతను పట్టుకోలేనప్పుడు అందులో స్తబ్దత ఏర్పడుతుంది. ఏర్పడినప్పుడు రచయితలు సామాజిక ప్రయోజనం కొసంగాక అంతర్గర్భితంగా స్వార్థప్రయోజనాల కోసం రచనలు చేస్తారు. అటువంటి సందర్భంలో స్పందన కలిగించలేని అరిగిపోయిన పాతప్రవచనాలు, రూపవాద చమత్కారాలు, వ్యక్తివాదధోరణులు, భావవాదధోరణులు సాహిత్యంలో ప్రవేశిస్తాయి.

హైదరాబాద్‌లోని 'సెవెన్‌స్టార్స్ సిండికేట్' అనే సంస్థ 1970 జులై4, 5తేదీల్లో 'అభ్యుదయ సాహిత్య సదస్సు' జరపాలని నిశ్చయించారు. ఆసదస్సుకు కవుల్ని, మంత్రుల్ని, నటుల్ని, మరెందరినో ఆహ్వానించి మహాకవి శ్రీశ్రీకి పెద్దసన్మానం కూడా తలపెట్టారు. కొడవటిగంటి కుటుంబరావు, రామశాస్త్రి, వరవరరావు మొదలైన విప్లవ రచయితలు కూడా ఆనిరసనతో శృతి కలిపారు. సదస్సుకు వెళ్లవద్దని ఎందరో శ్రీశ్రీపై ఒత్తిడి తెచ్చారు. అయితే "ఒక మహోద్యమ ప్రతినిధిగా" తనను భావించుకొన్న శ్రీశ్రీ సదస్సుకు హాజరుకావటమే మంచిదని మద్రాసునుంచి హైదరాబాద్ వచ్చారు. కాని అక్కడ విప్లవకవులు, విప్లవాభిమానుల అభిప్రాయాలకు సమ్మతించి సదస్సును సాహిత్యకారులతో 1970 జులై4న 'విప్లవ రచయితల సంఘం'(విరసం) ఆవిర్భవించింది.

## 9.5 విప్లవ రచయితలసంఘం:

శ్రీకాకుళ గిరిజన రైతాంగపోరాటం, దాన్ని నడిపించిన మార్క్సిస్టు-లెనినిస్టుపార్టీ, దేశవ్యాప్తంగా రూపుదిద్దుకుంటున్న విప్లవరాజకీయాలు మొదలైన అంశాల నేపథ్యంలో 'రచయితలకు సవాల్', శ్రీశ్రీ హైద్రాబాద్ సన్మానం తక్షణ కారణాలుగా 1977 జులై4వ రోజున విప్లవ రచయితల సంఘం స్థాపించబడింది. 'జాతిని సమగ్రవిమోచనం వైపు నడిపేందుకు విప్లవరచయితల సంఘం' ఏర్పడుతున్నది అని సంఘం ప్రకటించింది. శ్రీశ్రీ,కె.వి.రమణారెడ్డి, వరవరరావు, జ్వాలాముఖి, రావిశాస్త్రి, నిఖిలేశ్వర్, నగ్నముని మొదలైన పదిహేనుమంది సంతకాలతో ఆనాడు విరసం ప్రణాళిక 7అంశాలతో వెలువడింది. మార్క్సియన్ సోషలిజం ధ్యేయంగా, ప్రజల వర్గపోరాటాలను సమర్థిస్తూ నూతన ప్రజాస్వామ్యస్థాపనకు తోడ్పడేందుకు, శ్రామిక అంతర్జాతీయ దృష్టితో కృషిచేయబూనినట్టు ప్రణాళిక ప్రకటన ద్వారా తెలిపింది.

విరసం తొలిమహాసభలు 1970 అక్టోబర్‌లో ఖమ్మంలో జరిగాయి. ఈసభల్లో సమగ్రప్రణాళిక ఏర్పడింది. 'ఝంఝు' కవితాసంకలనం, చెరబండరాజు 'దిక్సూచి' కవితాసంపుటి ఈసందర్భంగా ఆవిష్కరించబడ్డాయి. 1974 జనవరిలో కర్నూలులో జరిగిన మహాసభ సందర్భంగా విరసం 6అంశాలుగా తన విధానాన్ని లేదా ప్రణాళికను ప్రకటించుకుంది.

1. విరసం భారతరైతాంగ సాయుధ విప్లవ పోరాటంలో సాంస్కృతిక సైన్యంగా తన కర్తవ్యాన్ని నిర్వహిస్తుంది.
2. ఈలక్ష్యసాధన కోసం మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనావిధానమే విరసం విధానం.
3. జనతా ప్రజాతంత్ర విప్లవ సాధనకు సాయుధపోరాటమే మార్గం.
4. జనతా ప్రజాతంత్ర విప్లవానికి దోహదం చేసే వర్గపోరాటాలను విరసం బలపరుస్తుంది.
5. సామ్రాజ్యవాదం, సోషల్ సామ్రాజ్యవాదాలను విరసం ప్రతిఘటిస్తుంది.
6. శ్రామిక అంతర్జాతీయత విరసం వైఖరి.

విప్లవాన్ని సమర్థించే రచయితల్లోనే పై విధానంతో ఏకీభవించనివాళ్లు ఉండటంచేత అప్పుడప్పుడు విరసంలో ఆరోపణలు, చీలికలు, బహిష్కరణలు తప్పలేదు.

"విరసం మార్క్సియన్ సోషలిజాన్ని శాస్త్రంగానే కాక శస్త్రంగా స్వీకరించింది. పోరాట రాజకీయాల నాయకత్వాన్ని అంగీకరించింది. పాలిటిక్స్ ఎట్ కమాండ్ అనే శాస్త్రీయ సత్యాన్ని నీళ్లు నములకుండా ఒప్పుకొన్నది. విప్లవసాహిత్యం, విప్లవకళలు, విప్లవ రాజకీయాల్లో ఒక

భాగమని, విప్లవాదర్శంకోసం పోరాడే శ్రామిక చైతన్యశక్తికి సాహిత్యం బాసటకావాలని విరసం విశ్వసిస్తుంది" (వరవరరావు, 'సృజన' సంపాదకీయాలు)

## 9.6 విప్లవం అంటే ఏమిటి?

ఒకనొక సామాజిక వ్యవస్థలో జరిగే సమూలమైన మార్పును విప్లవం అంటారు. మరో విధంగా చెప్పాలంటే అభివృద్ధి నిరోధకమైన ఒక వ్యవస్థను కూలదోసి, మరొక నూతన వ్యవస్థను నెలకొల్పటమే విప్లవం, ఇందుకు బలప్రయోగం లేదా హింస అనివార్యమవుతుంది. విప్లవ శబ్దార్థ వివేచన చేస్తూ కేతవరపు రామకోటి శాస్త్రి ఆధునిక తెలుగు సామాజిక కవిత్వ ఉద్యమాలు, అనే గ్రంథాలలో ఈ విధంగా వివరించారు.

"కాళిదాసు రఘువంశంలో 'సత్త్వవిప్లహాట్' (8:41) అని భాగ్యవిప్లవాట్ (8:47) అని విప్లవశబ్దాన్ని నాశము అన్న అర్థంలో ఉపయోగించాడు, కిరాలార్జునీయంలో భరవి ధర్మవిప్లవం (1-13) అని అపవర్జిత విప్లవే (2-26) అని వాడితే మల్లినాథసూరి 'ధర్మ వ్యతిక్రమం అధర్మమితియావత్'అని ఒక్కచోట, 'విప్లవ; ప్రమాణబాధ; అపవర్జిత విప్లవేత్యక్త వ్యల్యాసే త్యక్తకలంకే' అని రెండోచోట విప్లవ శబ్దార్థాన్ని వివరించాడు, కాళిదాస భారవులిద్దరూ ఉన్నది నశించటాన్నీ, ఉన్నదానికి విపర్యయరూప మైంది ఉనికిలోకి రావటాన్ని విప్లవ శబ్దంచేత చెప్పినట్టనిపిస్తున్నది. దాన్ని అలా ఉంచితే విప్లవ శబ్దంతో పాటు ధాతు సంబంధం చేత గుర్తుకువచ్చే శబ్దం మరొకటి వుంది. అది ఉపప్లవం. కాళిదాసు ఆ మాటను కుమార సంభవంలో "ఉపప్లవాయ లోకానాం (2-32)" అనిలోకాలకు ఉపద్రవమన్న అర్థంలో వాడాడు. తారకుడు లోకోపద్రవ కారకుడైనాడు. వాని పీడనకు తట్టుకోజాలక లోకస్థులయిన దివౌకసులు బ్రహ్మదగ్గరకు పోయి తారకుని ఉపప్లవ ప్రవృత్తిని, వాని దుర్మార్గలక్షణాన్ని చెప్పి రక్షించవలసిందిగా ప్రార్థించారు. లోకరక్షణ బాధ్యతగల దేవతలు, దేవతల పక్షాన మాట్లాడింది బృహస్పతి. బృహస్పతి బ్రహ్మకు చేసిన విజ్ఞాపన మధ్యలో ఒకమాటన్నాడు. వాడు సహిస్తున్నారు గదా అని సహించిన కొద్దీ మరీ "క్లిశ్నాతి భావనత్రయం" అంటూ "శామ్యేత్ ప్రత్యమారేణన ఉపకారేణ దుర్జన;(2-40)" అని బృహస్పతి తన అభిప్రాయాన్ని కూడా చెప్పాడు.

"దుర్జన; ప్రతికారేణైవ శాంతో భవేత్- ఉపకారేణతున శామ్యేత్-ప్రత్యుత ప్రకుప్యతి ఇతి భావ; "అని మల్లినాథుడు తన వ్యాఖ్యానాన్ని జోడించాడు, ఉన్న ధర్మాన్ని త్రోసిరాజంటూ విపర్యయ ధర్మం ఉనికిలోకి రావటాన్ని అందుకోసం జరిగే క్రియాకలాపాన్ని కాళిదాసాదులు విప్లవమన్నారని చెప్పవచ్చు. లోకానికి ఉపప్లవం కలిగించే పరిస్థితి అది యేదైనా సరే దుష్టం. దుష్టశక్తులు మంచిమీద మారవు. పైగా మంచిని ఒక బలహీనతగా జమకట్టి మరింత విజృంభిస్తాయి. అందువల్ల అవి అంతకంటె బలమైన ప్రతీకారంవల్ల మాత్రమే శమిస్తాయి. అంతేకానీ మంచితనానికీ ఉపకారానికీ అవిలొంగవు-అనికూడా కాళిదాసు బృహస్పతి ఆలోచనా విధానాన్ని అందులోని ముందుచూపును ప్రదర్శించాడు, సంసార కర్మబంధాల నుండి విముక్తి పొందటానికి ఆచరించటానికి ఒక దర్మాన్ని చూపించినట్లు - ఇప్పుడు ఈ తారకుని పీడన నుండి విముక్తి పొందటానికి అతనితో ఎవరి నాయకత్వాన మేము పోరాడితే మంచిదో అటువంటి సేనా నాయకుణ్ణి మాకు ప్రసాదించండి (2-51) అన్న బృహస్పతి విజ్ఞప్తిని సార్థకంగా రచించాడు కాళిదాసు.

విప్లవ - ఉపప్లవ శబ్దార్థ విషయమంతా ఆయా దేశాలకు సంబంధించిన ఆంతరంగిక విషయమే. లోకానికి ఉపప్లవం కలిగించేవాళ్ళు ఆ లోకంలోనివాళ్లే. ఉన్న ధర్మానికి బదులు మరొక ధర్మాన్ని తీసుకొని రావటానికి విప్లవించేవాళ్ళూ అక్కడివాళ్ళే. పాలక పాలిత వ్యవస్థలో పాలన జనహిత ప్రయోజనం నుండి ఎంతగా దూరమవుతుంటే అంతగా పాలితులు పాలకుల విషయంలో అసంతృప్తినీ, వ్యతిరేకతనూ, తిరుగుబాటునూ వ్యక్తం చేస్తూ ఉంటారు. వీళ్ళిపని చేస్తున్న కొద్దీ పాలకులు మరింత క్రుద్ధులై తీవ్రమైన అణచివేత కార్యక్రమాన్ని చేపడతారు. ఈ విధంగా పాలకుల వైపు నుండి ప్రజాజీవితంలోకి ప్రసరించే ఉపప్లవాల నుండి విముక్తి పొందటానికి ప్రజలు విప్లవిస్తారు. ఈనాడు విప్లవమంటే రైతాంగవిప్లవమే అది అనుసరిస్తున్న రాజకీయోద్యమ దృక్పథానికి యోగక్షేమం వహామ్యహం అని భరోసా ఇయ్యగల సాంస్కృతిక భావజాలాన్ని సృజించే రచయితలే విప్లవ రచయితలు. విప్లవ రచయితలు విప్లవకారులు కారు. కారుగానీ కాకూడదని లేదు. అయినా అతని రచనలను చూచేటప్పుడు విప్లవ రచయితగానే చూస్తాంగానీ విప్లవకారుడుగా చూడం. విప్లవ రచయితకీ, విప్లవకారునికీ ఈనాడుండే సంబంధాన్ని సరిగ్గా చెప్పాలంటే కృష్ణార్జునులనే చెప్పాలి. శ్రీ శ్రీ అలాగే చెప్పాడు -

"సంహారాన్ని స్యందనం చేసి
ఉద్రేక తరంగాలే తురంగాలుగా
ఆగ్రహం కొరడా చేబూని
సాయుధ విప్లవ బీభత్సుని రథసారధినై
భారతకురుక్షేత్రంలో
నవయుగ భగవద్గీతా ఝుంఝుని ప్రసరిస్తాను
మంటలచేత మాట్లాడించి
రక్తంచేత రాగాలాపన చేయిస్తాను"(మరోప్రస్థానం)

విరసం ఏర్పడిన మరుసటి నెలలో దానికి నాయకత్వం వహిస్తున్న శ్రీశ్రీ విప్లవ రచయిత తనాన్ని అవాహన చేసుకుంటున్నట్లుగా స్పష్టం చేశాడు. ఈ సందర్భాన్ని దృష్టిలో వుంచుకొని చెరబండరాజు అన్న మాటలను కూడా ఇక్కడ చెప్పవచ్చు.

కత్తి నీది కలం నాది
శక్తి నీది యుక్తి నాది
నీరంగం రణరంగం
నారంగం భావతరంగం.(1972) ముట్టడి-పుట.15

ఈ దృష్ట్యా విప్లవ రచయితలను వారి రచనలను అధ్యయనం చెయ్యటం అవసరం. విప్లవ సాహిత్యం పరమార్థం నూతన ప్రజాస్వామ్య వ్యవస్థ అవసరం గురించిన వివేకానికీ, అవతరణ గురించిన ఆచరణకూ అనుకూలమైన భావచైతన్యాన్ని ప్రజల్లో పరివ్యాప్తం చెయ్యటమే."

1985లో సికింద్రాబాద్ కుట్రకేసులో నిందితులైన త్రిపురనేని మధుసూధనరావు, వరవరరావు కోర్టులో ఒక స్టేట్‌మెంట్ సమర్పించారు. అందులో విప్లవం గూర్చి వివరణ ఉంది.

"వెనుకబడిన ఉత్పత్తి సంబంధాలను బద్దలు కొట్టి, ఉత్పత్తి శక్తుల అభివృద్ధి సాధిండానికి సమూలమైన సామాజిక పరిణామం చారిత్రకంగా అవసరం. అనివార్యం దాన్నే 'విప్లవం' అంటాం. 'విప్లవం' అంటే అర్థం ఒకానొక ప్రభుత్వాన్ని, ప్రభుత్వరూపాన్ని కూలదోయడం మాత్రమే కాదు. పతనోన్ముఖమైన ఒక సామాజిక వ్యవస్థను పెలకొల్పడమే 'విప్లవం'. A social change resolving the controdiction between increased productive forces and obsolate production relations, radically altering the social system and bringing a new, advanced social elass to power. ఉత్పత్తి సంబంధాలు ఉత్పత్తి, శక్తుల అభివృద్ధికి ప్రతిబంధకంగా వున్నపుడు, ఆ సంకెళ్లను ముక్కలు చేయాలి. అభ్యుదయం సాధించగలవర్గానికే రాజ్యాధికారాన్ని దక్కించాలి. ఈపరిణామానికి 'బలప్రయోగం' మంత్రసానిలా తోడ్పడుతుంది. పాత సమాజం గర్భంలో పిండరూపానవున్న భవిష్యత్ వ్యవస్థ భూపతనమయ్యేందుకు అంతకంటె మంచి సాధనం లేదు.

విప్లవరచయితలమైన మేము, సామాజిక విప్లవ మహోద్యమంలో సాంస్కృతిక సైనికదళ సభ్యులం మాత్రమేగాని, కుట్రదారులం మాత్రంకాదు. ఈఅక్రమవ్యవస్థను నిలబెట్టాలనడమే కుట్ర. ప్రజాకోటికి వ్యతిరేకంగా నిజమైన కుట్రదారులు ఎవరంటే, ప్రభుత్వమే. అందుకనే, అది ప్రజాద్రోహి. ఏపార్టీ అధికారంలోవున్నా, ప్రభుత్వరంగం ఏదైనా, మూలంలోనే వేరుపురుగుదూరి తొలిచితేనే 'రాజ్యం' (state) ఏర్పడింది, ఏర్పడింది లగాయితు, వర్గసమాజం కొనసాగే పర్యంతం అది అధికారవర్గానికే చరణదాసి. దాని సాధనోపకరణం, దాని సైనాతీ, దానిబంటు. రాజ్యం సాగిస్తున్న ఈమురానా కుట్రకు దాదాపు ఐదువేల సంవత్సరాలను మించిన చరిత్రవుంది. రాజ్యం కత్తుల బోను, రాజ్యం దిరికంబం రాజ్యం బందిఖానా చేతిసంకెల రాజ్యం మారణాయుధం. సంస్థాకారం ధరించి వ్యవస్థీకృతమైన దౌర్జన్యమే రాజ్యం. అనేకులైన ప్రజాబాహుళ్యం మీద కొందిమంది ఆస్తిపరుల అధికారసంస్థే రాజ్యం".

('నన్నెక్కనివ్వండిబోను' సికింద్రాబాదు కుట్రకేసులో స్పెషల్‌కోర్టులో కె. వి. ఆర్, మధుసూదనరావు, వరవరరావు స్టేట్మెంట్, 26-12-85, విరసం ప్రచురణ, 1986)

## 9.7 విప్లవసాహిత్య స్వభావం:

తిరుపతి కుట్రకేసులో నిందితుడైన త్రిపురనేని వెంకటేశ్వరరావు తన వాదనలోభాగంగా 1981లో చేసిన కోర్టుప్రకటనలో విప్లవసాహిత్యస్వభావం వివరించారు.

"సమాజాన్ని వేదకాలంవైపు తిరోగమింపజేయడానికి, వర్తమానాన్ని కళ్లకింద నిలిపివేయడానికి అనేక రూపాల్లో ప్రయత్నిస్తున్నా సాంప్రదాయవాద సాహిత్యానికి వ్యతిరేకంగా; వర్గపోరాటాన్ని, శ్రామిక నియంతృత్వాన్ని వ్యతిరేకిస్తూ సమాజాన్ని గురించి రాస్తున్న తథాతథవాద సాహిత్యానికీ, కార్మికవర్గ ప్రాపంచిక దృక్పథం లేకుండా, ఆర్థికపోరాటాల రొంపిలో కూరుకుపోయి పార్లమెంటరీ పంథానికి ప్రజల్ని బలిచేస్తూ అభ్యుదయసాహిత్యం పేరుతో ఉన్న రివిజనిస్టు సాహిత్యానికి వ్యతిరేకంగా, పాలకవర్గహింసని అహింసగా ప్రచారం చేస్తూ ధర్మకర్తృత్వ సిద్ధాంతాన్ని ప్రచారం చేసే సాహిత్యానికి వ్యతిరేకంగా విప్లవ సాహిత్య మధ్యమం వచ్చింది.

"కష్టజీవులం మేం కమ్యూనిస్టులం
అవునన్నా కాదన్నా అదే ఇష్టులం
మాక్కుది సిద్ధాంతం
నమ్మము మీ వేదాంతం" (సుబ్బారావు పాణిగ్రాహి)

"ఈవిప్లవాగ్నులూ ఎచటివని అడిగాతే
శ్రీకాకుళము వైపు చూడమని చెప్పాలి" (మంచి వెంకటనరకయ్య)
"శ్రీకాకుళములోని చిందింది రక్తమ్ము
కాల్వలై ప్రవహించె కొండవాగులలోన
బండలెరుపెక్కినాయి-పోరాడ
కొండలే కదిలినాయి" (శంఖారావం)

అని శ్రీకాకుళం గిరిజన, రైతాంగ పోరాటం జరిగితే రాస్తారుగానీ పోరాటమే లేకుంటే ఈకవిత్వం ఎలావస్తుంది? విప్లవపోరాటలు లేకుండా విప్లవ సిద్ధాంతం వుండదు. విప్లవపోరాటాలు మాత్రమేకానీ విప్లవసిద్ధాంతాలు మాత్రమేకానీ విప్లవ సాహిత్యానికి వస్తువు కాజాలవు. సిద్ధాంతానికీ ఆచరణకీ గతితార్కిక సంబంధం ఆవేశరూపం, విప్లవ సాహిత్యం. ఇందుకు సజీవమైన సంకేతమే అమరజీవి కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి, ప్రజలు చేసే నిర్దిష్టపోరాటాల్లో రచయితకువున్న సైద్ధాంతిక అనుబంధం కలిసి మెలసి వుంటాయి. భారతదేశ విప్లవం ప్రపంచవిప్లవంలో భాగమయినట్లుగానే విప్లవ సాహిత్యం ప్రపంచవిప్లవ సాహిత్యంలో భాగమే. వాస్తవ పోరాటాలమీదకాక ఊహాజనిత పోరాటాలమీద రాసేది విప్లవ సాహిత్యంకాదు. భారత రైతాంగ విప్లవానికి తప్ప విప్లవరచయితలు ప్రపంచంలో మరిదేనికీ విధేయులుగా వుండరు. యుగయుగాలుగా సాహిత్యానికి వున్న పాలకవర్గం పునాది పెకలించి, నిర్మూలించి ప్రజావువాదిని కల్పించటం విప్లవ సాహిత్యలక్ష్యం. ఈలక్ష్యసాధనలో ఎలాంటి క్రూరమైన విప్లవ ప్రతిఘాతుకశక్తిని అయినా ఎదుర్కోవటానికి విప్లవ రచయితలు సిద్ధంగా వుంటారు. ప్రజలనుంచి నేర్చుకొనే, ప్రజలదగ్గరికి తిరిగి తీసుకుపోయే క్రమంలోనే విప్లవ పథం ఏర్పడుతుంది".

(త్రిపురనేని మధుసూదనరావు, సాహిత్యం కుట్రకాదు, రచయితలు కుట్రదారులు కారు)

అంతేగాకుండా సమకాలీన సాహిత్య చరిత్రము పరిశీలిస్తూ, కవిత్వం ప్రజలను ఎలా చైతన్యవంతుల్ని చేస్తుందో త్రిపురనేని పరిశీలించాడు. విప్లవకవుల ధ్యేయం విప్పిచెప్పాడు.

"విప్లవకవిత్వమే నేటికవిత్వం. ఇది ఎవరో కొందరు వ్యక్తులు స్థాపించిన నవ్యకవిత్వ ఉద్యమంకాదు. కవిత్వం ఒక సామాజికశక్తి, సామాజిక వాస్తవికత రూపమే విప్లవకవిత్వం. వర్గసమాజాన్ని కూకటివేళ్లతో పెకలించి, జాతికి దోపిడీవ్యవస్థనుంచి విముక్తిని సాధించటానికి సాంస్కృతిక రంగంలో విప్లవకవిత్వం నాయకత్వం వహిస్తుంది. వివిధరంగాల్లో జరుగుతున్న విప్లవసమరంలో కవులుకూడా విప్లవసైనికులై, కవిత్వసాధనంతో పోరాటం చేస్తున్నారు. పీడితులు ఆయుధపోరాటంతో విప్లవ విజయాన్ని సాధించటం చారిత్రకంగా అనివార్యం. దోపిడీవర్గాన్ని ఎదుర్కొంటున్న వివిధ ప్రజాఉద్యమాలను శాస్త్రీయంగా సమర్థించటమే విప్లవకవుల ప్రథమ కర్తవ్యం. విప్లవకారుల్ని వర్గశత్రువులు సాంస్కృతిక సాధనాలతో కూడ ఎదుర్కొంటున్నారు. సాంఘిక విప్లవం వేగవంతం కావటానికి సాంస్కృతిక భావ విప్లవదోహం చేస్తుంది. ప్రజలలో భావచైతన్యాన్ని సామాజిక స్పృహను కలిగించటానికి ప్రజల్ని విప్లవానికి సిద్ధంచేయటానికి విప్లవకవులు రచనలు చేస్తారు. సమాజంలో సామ్యవాద సామాజికక వాస్తవికత స్పృహ కలిగించటమే విప్లవకవుల ధ్యేయం" (త్రిపురనేని మధు సూదనరావు: కవిత్వం-చైతన్యం)

## 9.8 మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతము:

19వశతాబ్దిలో జర్మన్ దేశస్థుడైన కార్ల్‌మార్క్స్, అతని సహచరుడు ఫ్రెడరిక్ ఎంగెల్స్ పారిశ్రామిక విప్లవనేపథ్యంలో ఐరోపాదేశాలు ముఖ్యంగా ఇంగ్లాండులోని కార్మికవర్గ జీవితాన్ని అధ్యయనం చేశారు. చరిత్రను, సమాజాన్ని పరిశీలించారు. మార్క్స్ రచించిన 'దాస్ కాపిటల్' కార్మికుల దోపిడిని చరిత్రలో మొదటిసారిగా బట్టబయలు చేసింది. 1848లో మార్క్స్, ఎంగెల్స్‌లు రచించిన 'కమ్యూనిస్ట్ మానిఫెస్టో' పెట్టుబడిదారీ దోపిడి, సమాజం స్థానంలో సామ్యవాద సమాజస్థాపన గురించి ప్రతిపాదించింది. కాలక్రమంలో మార్క్స్, ఎంగెల్స్ పరిశీలనల్ని రష్యన్ సమాజానికి అన్వయించి లెనిన్ ఆదేశంలో సోషలిస్టు వ్యవస్థ స్థాపనకు ఆద్యుడయ్యాడు. తర్వాతకాలంలో ఇంకా దేశదేశాల్లో సామ్యవాద వ్యవస్థలు ఆవిర్భవించాయి. ఈవిధంగా చరిత్రలో మార్క్సిస్టు సిద్ధాంతానికి గొప్ప ప్రాధాన్యం ఏర్పడింది.

మార్క్సిస్టు సిద్ధాంతంలో గతితార్కిక భౌతికవాదం, గతితార్కిక చారిత్రక భౌతికవాదం రెండు ప్రధాన విషయాలు. గతితార్కిక భౌతికవాదం పదార్థం ప్రధానమని, అది తనలోని విరుద్ధశక్తుల ఘర్షణ ఫలితంగా నిరంతర చలనంలో ఉంటుందని చెపుతుంది. పదార్థ పరిణామంలో చైతన్యం ఏర్పడిందని నిర్ధారిస్తుంది. పరిమాణం గుణంగా మారుతుందని, ఒకస్థితిని నిరాకరించేది తానుకూడ మరొకదానిచేత నిరాకరించబడుతుందని చెపుతుంది. ఇక చారిత్రక భౌతికవాదం మానవజాతి చరిత్రంతా వర్గపోరాటాల చరిత్రే అంటుంది. విరుద్ధశక్తుల(వర్గాల) మధ్య నిరంతరం ఘర్షణ ఉంటుందని చెప్తుంది. మానవజాతి చరిత్ర ఆదిమగణ వ్యవస్థ, బానిస వ్యవస్థ, భూస్వామ్యవ్యవస్థ, పెట్టుబడిదారీ వ్యవస్థలు ఒకదాన్ని మరొకటి ధ్వంసంచేస్తూ ఆవిర్భవించాయని చెపుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో దోపిడిచేసే పెట్టుబడిదారీ వర్గాన్ని కూలదోసి కార్మిక, కర్షకవర్గం రాజ్యాధికారం చేజిక్కించుకొని సామ్యవాద వ్యవస్థను స్థాపిస్తుందని చెపుతుంది. సామ్యవాదం యొక్క ఉన్నత రూపం కమ్యూనిజం. కమ్యూనిస్టు సమాజంలో దోపిడి ఉండదు. సొంత ఆస్తి ఉండదు మనుషుల్లో అసమానతలు ఉండవు. ప్రతివ్యక్తి తనశక్తినిబట్టి పనిచేస్తాడు. అవసరాన్ని బట్టి ప్రతిఫలం పొందుతాడు. ఇది స్థూలంగా మార్క్సిస్టు సిద్ధాంతం. దీనికి లెనిన్, మావోలు తమ తమ ప్రత్యేక సామాజిక సందర్భాల్లో కొన్ని చేర్పులు చేశారు. ఆవిధంగా మొత్తంమీద మార్క్స్, లెనిన్, మావో ఆలోచనా విధానం ఏర్పడుతుంది.

కార్ల్‌మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, మావోలు ఆయా సమాజాలను పరిశీలించే క్రమంలో సాహిత్యంగురించి కూడా కొన్నిపరిశీలనలు వ్యాఖ్యానాలు చేశారు. వీటిపై ఆధారపడి, జార్జిథామ్సన్, క్రిస్టోఫర్ కాడ్వెల్, ఎర్నెస్ట్ ఫిషర్, జార్జిలూకాచ్, రేమాండ్ విలియమ్స్ మొదలైన మేధావులు చేసిన కృషిఫలితంగా మార్క్సిస్టు సాహిత్యసిద్ధాంతం రూపు దిద్దుకుంది.

ఈసిద్ధాంతం సమాజాన్ని, సాహిత్యాన్ని విడివిడిగా పరిశీలించదు. సమాజంతో అవినాభావ, పరస్పర సంబంధంఉన్న అంశంగా సాహిత్యాన్ని గుర్తిస్తుంది. సమాజగమనానికి ఉత్పత్తి విధానం, ఉత్పత్తి సంబంధాలతో కూడిన ఆర్థిక విషయం పునాదిగా ఉంటుందని, దానిపై ఆధారపడి, చరిత్ర, తత్వశాస్త్రం, విజ్ఞానశాస్త్రం, సంస్కృతి, కళలు మొదలైన ఉపరితల అంశాలు ఏర్పడతాయని మార్క్సిస్టు దృక్పథం భావిస్తుంది. సమాజ గమనం నుంచి పుట్టిన సాహిత్యం తిరిగి సమాజాన్ని ప్రభావితం చేస్తుందని అంటుంది. సాహిత్యకారులు సామాజిక వర్గాల్లో కార్మిక, కర్షకవర్గ పక్షపాతంతో చైతన్యవంతమైన రచనలు చెయ్యాలని, తద్వారా సమసమాజస్థాపన దిశగా కృషిచెయ్యాలి. సాహిత్యంలో రచయితల భావజాలంతో కూడిన వస్తువు ప్రధానం. వస్తువునుబట్టి రూపం ఏర్పడుతుంది.

ఈసందర్భంగా మార్క్సిస్టు సాహిత్య దృక్పధంగురించి త్రిపురనేని చెప్పినవాక్యాలు పరిశీలించవచ్చు.

"మార్క్సిస్టు దృక్పధం అంటే గతితార్కిక చారిత్రక భౌతికవాద దృక్పధం. (ప్రకృతినీ, చరిత్రనూ గతితార్కిక భౌతికవాద పరంగా పరిశీలించటం, పదార్థం ప్రధానం, పదార్థంనుంచి చైతన్యం పుడుతుందని చెప్పేది భౌతికవాదం. పదార్ధం అంటే ఇంద్రియాలద్వారా మనిషిమెదడులో ప్రతిబింబించే బాహ్యప్రపంచం. బాహ్యప్రపంచం మనమెదడులోని దాని ప్రతిబింబంమీద ఆధారపడి వుండదు. మనమెదడులో ప్రతిబింబమే బాహ్యప్రపంచం మీద ఆధారపడి ఉంటుంది. అంటే మనచైతన్యానికి భిన్నంగా స్వతంత్రంగా బాహ్యప్రపంచ అస్తిత్వం వుంటుంది. బాహ్యప్రపచానికి భిన్నంగా స్వతంత్రంగా మనచైతన్యం వుండదు. మనిషి మెదడు పదార్ధ పరిణామ ఫలితం. మెదడు వ్యాపారమే మనస్సు. గతి తార్కికం అంటే పరస్పరవాదం. ప్రకృతిలో సమాజంలో ప్రతివస్తువూ మరొక వస్తువుమీద ఆధారపడి ఉంటుంది. ప్రతిదీ నిరంతర చలనంలో వుంటుంది. ప్రతిదీ నిరంతరం మారుతుంటుంది. ఈచలనం, ఈమార్పు వస్తువుల పరస్పర సంబంధంలో సంభవిస్తాయి. ఈగతితర్కం, భౌతికవాదం కలిసి గతితార్కిక భౌతికవాద దృక్పధాన్ని చరిత్రకి అన్వయించి అధ్యనం చేయటాన్ని గతితార్కిక భౌతికవాద చారిత్రక దృక్పధం అంటారు.

మానవ సంబంధాలకి భౌతిక అవసరాల ఉత్పత్తిపునాది. ప్రకృతికీ మానవుడికీ పనిముట్లులతో సంబంధం ఏర్పడుతుంది. మనిషికీ మనిషికీ భాషతో సంబంధం ఏర్పడుతుంది. ఈఉత్పత్తి సంబంధాల సామాజిక రూపం సామాజిక సంబంధాలు. ఉత్పత్తి శక్తులనూ ఉత్పత్తి సంబంధాలనూ ఉత్పత్తివిధానం అంటారు. ఇదే సామాజిక భౌతిక జీవితం. ఈసామాజిక భౌతిక జీవితంనుంచే సామాజిక చైతన్యం పుడుతుంది. అంటే భౌతికజీవితమే చైతన్యాన్ని నిర్ణయిస్తుంది. సమాజ ఆర్ధికవిధానం పునాది. మతం, తత్త్వశాస్త్రం, రాజకీయాలూ, సాహిత్య కళారంగాలూ ఉపరితల అంశాలు. ఉపరితల అంశాలన్నీ సామాజిక చైతన్యరూపాలే. చైతన్యంలో మార్పులకి ఆర్ధికపునాదిలో మార్పులు ప్రధాన కారణం ఏకైకకారణం కాదు. పునాదికీ ఉపరితలానికీ మధ్య అన్యోన్య ప్రభావం వుంటుంది. ఉపరితల అంశాలమధ్య అన్యోన్య క్రియవుంటుంది. పునాదిలో మార్పులు సామాజిక చైతన్య రూపాలనుంచే మనుషుల స్పృహలోకి వస్తాయి. చారిత్రక భౌతికవాదం అంటే చరిత్రని ఆర్ధికదృక్పధం నుంచి, సామాజిక దృక్పధంనుంచి వివరించటం కాదు. పునాది, ఉపరితల అంశాలూ కలిసి సమస్తంగా వుంటాయి. చరిత్రను వ్యస్తంగాకాక సమస్తంగా పరిశీలించటం చారిత్రక భౌతికవాద ప్రధానలక్షణం.

సాహిత్యం సామాజిక చైతన్యరూపం కాబట్టి సాహిత్యపుట్టుకా, సాహిత్యంలో మార్పులూ సాహిత్యప్రయోజనం మొదలైనవాటిని సామాజిక అస్తిత్వంనుంచే పరిశీలించాలి. ఆర్ధిక విధానంలో వచ్చిన మార్పులూ ఉత్పత్తి సాధనాలమీద యాజమాన్యం ఉత్పత్తిశక్తుల అభివృద్ధి ఉత్పత్తి సంబంధాల మార్పునుంచీ సాహిత్యాన్ని పరిశీలించాలి. ఇది ప్రాధమిక పరిశీలన. ఆర్ధికరూపాల్లో వచ్చిన మార్పులూ, ఆమార్పులూ ఉపరితల అంశాల్లో ప్రతిబింబంచినతీరూ, ఆమార్పులకీ సాహిత్యానికీ అన్యోన్యక్రియల్ని పరిశీలించాలి. ముందే మనుస్సులోవున్న ఆర్ధికరూపాల కోణం నుంచే వివరించటానికి పూనుకోకూడదు. తిరిగి సమాచారిన్ని సేకరించి నిర్దిష్టకాలంలో, నిర్దిష్ట స్థలంలోవున్న ఆర్ధికరూపాల్ని విశ్లేషించాలి. ఆహారసేకరణ, రాతి పనిముట్లు, వేట, చేపలుపట్టి జీవించటం మొదలైన ఆరిమవర్గేతర ఆర్ధిక విధానంలో సాహిత్య ప్రారంభదశల్ని అన్వేషించాలి. పశువుల పెంపకం, వ్యవసాయం, ఇనుమువంటి లోహపరికరాల్ని వాడడం, అదనపు ఉత్పత్తి, వర్గసమాజం ఏర్పడటానికి దారితీసిన రూపాలను గ్రహించాలి. భూస్వామ్య వ్యవస్థ, పెట్టుబడిదారీ వ్యవస్థల్లోని ఆర్ధిక విధానం సాహిత్యంలో ప్రతిబింబించిన తీరును వాస్తవ సమాచారంనుంచి విశ్లేషించాలి. విభిన్న చారిత్రకదశల్లో ఆర్ధిక పునాదిమీద సాహిత్యపు భావాన్నికూడా పరిశీలించాలి. అయితే సాహిత్యం ఆర్ధిక పునాదికి దర్పణ ప్రతిబింబం అనుకోకూడదు. అద్దంలో ప్రతిబింబానికీ అద్దానికీమధ్య అన్యోన్యక్రియ వుండదు. మనిషి మెదడు అద్దంకాదు. అది క్రియాశీలంగా వుంటుంది. సంకీర్ణంగా వుంటుంది. సాహిత్యం సామాజిక పురోగమన సూత్రాలకి అనుగుణ్యంగానే ఉంటుంది. ఈఅనుగుణ్యతని యాంత్రిక విధేయతగా భావించటం అంతిమంగా సాహిత్యానికి ఆర్ధిక విధానం పునాది అయినప్పటికీ అదే ఏకైక నిర్ణాయక అంశంగా భావించటం అర్ధరహితం. అసంబద్ధం. తత్త్వశాస్త్రం, న్యాయవిధానం, మతం, రాజకీయాలూ వంటి ఇతర ఉపరితల అంశీలూ సాహిత్యంలో అనేక మార్పుల్ని నిర్ణయిస్తాయి. ఇవి సాహిత్యంలో వచ్చేమార్పుల్ని అధ్యయనం చేయాలి. సాహిత్యాన్ని సాహిత్య సూత్రాలనుంచి వివరించటానికి పూనుకోవటం అశాస్త్రీయం. వివరంగా నిర్దిష్టంగా అధ్యయనం చేయకుండా ఆర్ధికపునాదికి అధిక ప్రాధాన్యం ఇచ్చి వాగాడంబర అధ్యయనం చేయకూడదు. గతితార్కిక భౌతికవాద దృక్పధాన్ని అధ్యయనానికి మార్గదర్శిగా గ్రహించాలి. అధ్యయానాని ప్రత్యామ్నాయంగా గ్రహించకూడదు.

('చరిత్ర-సాహిత్య చరిత్ర' త్రిపురనేని మధుసూదనరావు ప్రసంగవ్యాసం 'చరిత్ర, భాష, సాహిత్యం-శాస్త్రీయదృక్పధనం', విరసం ప్రచురణ,1979.)

## 9.9 కొందరు విప్లవకవులు: రచనలు

ఎ) శ్రీశ్రీ:

మహాకవిశ్రీశ్రీ 'మహాప్రస్థానం', 'ఖడ్గసృష్టి' కవితా సంపుటుల తర్వాత కవిత్వపరంగా కొంత వెనుకంజ వేశాడు. సినిమారంగంలో కూరుకుపోవటం ఇందుకు ఒకకారణం కావచ్చు. కవుల్లో ఒకానొక మహోజ్వలదశ తర్వాత కొంత విరామం, లేదా శాశ్వత విరామం సహజమే, అయితే శ్రీశ్రీ దిగంబరకవిత్వం, విప్లవకవిత్వం ప్రభంజనంలో పునశ్శక్తి సంపన్నుడయ్యాడు. 1970 దశాబ్దంలో తిరిగి విప్లవసాహిత్యం సృష్టించాడు. ఆదశలో 'మరోప్రస్థానం' కవితాసంపుటి వెలువడింది.

విప్లవ పోరాటంలో పాల్గొని ఉరిశిక్షకుగురైన భూమయ్య, కిష్టాగౌడ్‌ల స్మృతిలో ఆయన రచించిన 'భూమ్యాకాశాలు' కవిత విశిష్టమైంది.

"ఒద్దు, కన్నీటి కవిత్వం రాయొద్దు
సమాజానికి కలంపెట్టిన అప్పును
ప్రాణాలతో వారు తీర్చుకున్నారు
.............................................
బతికే అర్హతలేని పందుల్ని, పందుల్ని
చంపటమే వాళ్లు చేసిన నేరం
.............................................
వాళ్లిద్దరిలో ఒకడు భూమి, రెండోవాడు ఆకాశం"

మహాకవిలో కవిత్వశక్తి ఆరిపోలేదనటానికి ఈకవిత నిదర్శనం. అదేవిధంగా 'తుది పయనం: తొలివిజయం' అనేకకవిత విప్లవవీరుల్ని ఉద్రూతలూగించేది.

"ఊగరా, ఊగరా, ఊగరా!
ఉరికొయ్య అందుకొని ఊగరా!
ఉరికొయ్య అంటుకొని ఊగరా!.......
.............................................
స్వాతంత్ర్యపు మారుపేరు సామ్యవాదమే సత్యం
చావులేని ఆసత్యం జ్వలిస్తుంది అనునిత్యం
.............................................
తెల్లవాడు నిన్ననాడు భగత్సింగు అన్నాడు
నల్లవాడు నిన్ననేడు నక్సలైటు వన్నాడు
ఎల్లవారు నిన్నురేపు వేగుచుక్క అంటారు
శివాజీకి వారసుడా! శ్రీశ్రీ కవిత్వలాలసుడా!
నీ ధాటికి అడ్డులేదు, నీత్యాగం వృధాకాదు"

విశాఖ మాండలికంలో రాసిన 'విన్నటిజట్కావాలా' కవిత శ్రీశ్రీ భావాల్లో, భాషలో వచ్చిన కొత్తమార్పును తెల్పుతుంది.

శ్రీశ్రీ విప్లవరచయితల సంఘం తొలి అధ్యక్షుడు. అయితే కొన్నిసార్లు విరసం భావజాలానికి విరుద్ధమైన రచనలుచేసి, భావాలు ప్రకటించి వివాదాస్పదుడయ్యాడు. ఏదిఏమైనా మహాకవిగా శ్రీశ్రీ విరసానికి, విప్లవరచయితలకు గొప్ప స్ఫూర్తి నిచ్చాడనేది నిర్వివాదాంశం.

తొలికాలపు శ్రీశ్రీ కవిత్వంలో-ముఖ్యంగా 'మహాప్రస్థానం'లో పురాణ ప్రతీకలూ, గ్రాంధిక భాషావాసనలూ ఎక్కువ. వాటిని ఆధారంగా చేసుకొని ఇవాళకొందరు విమర్శకులు శ్రీశ్రీకవిత్వానికి కాలం చెల్లిందంటున్నారు. అయితే ఒక కవిని ఆకాలపు పరిస్థితులనుంచి వేరుచేసి పరిశీలించరాదు. కవిత్వాన్ని అంతకుపూర్వంలేని విధంగా సమాజపరం చెయ్యటంలో, నూతన వస్తుస్వీకరణలో, శిల్పవిన్యాసంలో శ్రీశ్రీ ప్రజ్ఞగొప్పది. కొత్తగా కలంపట్టే ప్రతి ఆధునిక కవి శ్రీశ్రీ కవిత్వాన్ని అధ్యయనం చెయ్యాల్సిందే.

## బి) శివసాగర్:

విప్లవకవుల్లో గాఢమైన, ఆవేశభరితమైన, మానవతాస్పర్శగల గొప్పకవిత్వం సృష్టించిన వారిలో శివసాగర్ మొదటివరసలో ఉంటాడు. కె.జి. సత్యమూర్తి అసలుపేరు. శివసాగర్; శివుడు, రెంజయ్ మొదలైనవి కలంపేర్లు. 'నరుడో భాస్కరుడా!' అనే గేయంతో విప్లవ కవిత్వయుగంలో ప్రసిద్ధుడయ్యాడు శివసాగర్, అది శ్రీకాకుళ రైతాంగపోరాటంలో పాల్గొని అమరుడైన చాగంటి భాస్కర్‌మీద స్మృతిగీతం.

నరుడో! భాస్కరుడా!
నర్రెంగ సెట్టుకింద నరుడో! భాస్కరుడా!
కన్నెర్ర సేస్తివయ్య నరుడో! భాస్కరుడా!
కన్నెర్ర సేసినీవు నరుడో! భాస్కరుడా!
కదనాన దూకితివా నరుడో! భాస్కరుడా!
బర్రెంక సెట్టికింద నరుడో! భాస్కరుడా!
బంధూకు పట్టివయ్యా నరుడో! భాస్కరుడా!
బంధూకు సేతబట్టి నరుడో! భాస్కరుడా!
బంధాలు తెంచ్తివయ్యా నరుడో! భాస్కరుడా!
గొట్టంకి సెట్టుకింద నరుడో! భాస్కరుడా!
గొడ్డళ్ళు నూర్తివయ్య నరుడో! భాస్కరుడా!
గొడ్డళ్ళు నూరినీవు నరుడో! భాస్కరుడా!
గుడ్డెలుగు కొడ్తివయ్యా నరుడో! భాస్కరుడా!
విప్పపూ సెట్టుకింద నరుడో! భాస్కరుడా!
విల్లు సారించితివా నరుడో! భాస్కరుడా!
విల్లంబు సారించి నరుడో! భాస్కరుడా!
విజయమే అన్నావో నరుడో! భాస్కరుడా!
నీదుశౌర్యం సూచి నరుడో! భాస్కరుడా!
కళ్ళల్లో జిల్లేళ్ళు నరుడో! భాస్కరుడా!
కళ్ళల్లో జిల్లేళ్ళతో నరుడో! భాస్కరుడా!
నీశిరసు తీస్తిరయ్యా నరుడో! భాస్కరుడా!

శింగెరి గట్టుకింద నరుడో! భాస్కరుడా!
నీశిరసు తీస్త్రిరయ్యా నరుడో! భాస్కరుడా!
నీశిరసు తీసినవారు నరుడో! భాస్కరుడా!
సిందులే వేస్త్రిరయ్యా నరుడో! భాస్కరుడా!
సిందీన నెత్తురంత నరుడో! భాస్కరుడా!
సీసాలకెత్తిరయ్యా నరుడో! భాస్కరుడా!
సీసాల్లో ఎమిటన్న నరుడో! భాస్కరుడా!
సారాని సెప్పిరయ్యా నరుడో! భాస్కరుడా!
కారీన నెత్తురంత నరుడో! భాస్కరుడా!
కడవల్ల కెత్తిరయ్యా నరుడో! భాస్కరుడా!
కడవల్లో ఏమిటన్న నరుడో! భాస్కరుడా!
కల్లాని సెప్పిరయ్యా నరుడో! భాస్కరుడా!
పారీవ నెత్తురంత నరుడో! భాస్కరుడా!
పీపాల కెత్తిరయ్యా నరుడో! భాస్కరుడా!
పీపాల ఏమిటన్న నరుడో! భాస్కరుడా!
పాలాని సెప్పిరయ్యా నరుడో! భాస్కరుడా!
పేరీన నెత్తురంత నరుడో! భాస్కరుడా!
పేరిళ్ళ కెత్తిరయ్యా నరుడో! భాస్కరుడా!
పేరిళ్ళ ఏమిటన్న నరుడో! భాస్కరుడా!
పెరుగాని సెప్పిరయ్యా నరుడో! భాస్కరుడా!
నినుసంపి మముసంపి నరుడో! భాస్కరుడా!
మాటేసి కాటేయ నరుడో! భాస్కరుడా!
మాటేసి కాటేయ నరుడో! భాస్కరుడా!
కుట్రలే పన్నారో నరుడో! భాస్కరుడా!
నీవు సూపినబాట నరుడో! భాస్కరుడా!
మాదొడ్డ బాటయ్య నరుడో! భాస్కరుడా!
నీబాటనే మేము నరుడో! భాస్కరుడా!
బంధూకు పడ్తాము నరుడో! భాస్కరుడా!
బర్రెంక సెట్టుకింద నరుడో! భాస్కరుడా!
బంధూకు పట్టాము నరుడో! భాస్కరుడా!
బందూకు సేతపట్టి నరుడో! భాస్కరుడా!
బంధాలు తెంచాము నరుడో! భాస్కరుడా!

విప్లవ కవిత్వోదయంలో పాటకు అంకురార్పణ చేసినవాడు సబ్బారావు పాణిగ్రాహి. శ్రీకాకుళ రైతాంగ పోరాటంలో అతనిపాటలు తూర్పుకొండల్లో ప్రతిధ్వనించాయి. అయితే పాటకు ఒకనూతన వస్తువు, శిల్పం సమకూర్చి ప్రసిద్ధం చెయ్యటంలో శివసాగర్ ప్రముఖుడు అయ్యాడు.

అజ్ఞాత పోరాటకారుడుగా మారిన శివసాగర్ కరీంనగర్ జిల్లాలో రహస్యజీవితం గడుపుతున్నప్పుడు పోలీసుల నిఘాగురించి ఇలా ఒకకవిత రాశాడు

"అలలపైన నిఘా
అలలుకనే కలలపైన నిఘా
చిరుగాలి సితారా సంగీతంపై నిఘా"

కవుల కర్తవ్యం వివరిస్తూ శివసాగర్ 'నేడుకవి' అనే కవిత రాశాడు

"కసితో స్వార్థం శిరస్సు గండ్రగొడ్డలితో
నరకగల్గిన వాడే నేటిహీరో
ప్రజల గుండెల కొండల్లో మాటుకాసి
ట్రిగర్ నొక్కగల్గినవాడే ద్రష్ట
ప్రజను సాయుధం చేస్తున్న
రివల్యూషనరీ నేటికవి"

అవి శివసాగర్‌చేసిన నిర్వచనం ఆధునికకవుల విమగ్నతను గుర్తుచేస్తుంది. స్వార్థనీతిపై తిరగబడాలని ఇక్కడ చెప్తున్నాడు కవి. ప్రజల్లో మమేకం కావాలని చెప్తున్నాడు. 'సాయుధ విప్లవ కార్యాచరణలో భాగంకావాలని చెప్తున్నాడు. "మెన్ సినీగనేరియా చితికిన సితారా మ్రోయించే గీతాకారులు......సత్యగీతాల్ని మండించలేరు" అని సినీ మాయలోపడిన ప్రగతిశీల కవులను తిరస్కరిస్తున్నాడు. ఈగీతంలో శివసాగర్ ఆనాటిసంఘం 'కుష్టు సంఘం' అని పేర్కొన్నాడు.

పాటకు పదునుపెట్టిన శివసాగర్ ఎన్నో జానపద బాణీలను గ్రహించి వాటిని ఉద్యమచైతన్యంకోసం ఉపయోగించాడు. శ్రీకాకుళం జిల్లాలో వినిపించే జాలరన్నపాటను తీసుకొని 'రెంజిమ్' పేరుతో శివసాగర్ రాసిన 'ఏటికి ఎదురీదువాళ్లమురా' అనేపాట పరిశీలించ దగింది.

"కూరిమి కొండల్లో మెరిసింది మేఘము
ఉద్దమాల కొండల్లో ఉరిమింది మేఘము
కూరుపము కొండల్లో కురిసింది వర్షము
సంగమొలసా కొండల్లో సాగింది వర్షము
ఏరుమీద ఏరొచ్చెరా! ఓజాలరన్నా!
ఏరు ఎచ్చుగా పారెరా! ఓజాలరన్నా
మెండు చీకటి కమ్మెరా!
తెరకొయ్య విరిగింది, తెరచాప చినిగింది
పడవ కడుపులోన కలకలము రేగింది
మొనగాడు తమ్ముణ్ణి మొసలి మింగేసింది
ఎదిగిన తమ్ముణ్ణి ఏరుకాటేసింది
గుండెజారిన దండు గంగాకు మొక్కింది

చేతిలో తెడ్డును ఏటిలో విసిరింది
నీకంటె సినవాళ్లమురా! ఓజాలరన్నా
నీతి తప్పని వాళ్లమురా! ఓజాలరన్నా
నీతోనే వుంటామురా..........!

ఉద్యమప్రారంభం, ఉధృతి, పోరాటంలో ప్రాణాలు పోగొట్టుకున్నవాళ్లు మొఎలైన అంశాలన్ని స్పృశిస్తూ సంకేతాత్మకంగా సాగిన పాట ఇది. ఏటికి ఎదురీదటం అంటే వ్యవస్థపై పోరాటమే.

ఇంకా శివసాగర్ రచించిన 'తోటరాముడు' పాట పోరాటంలో గాయపడిన వీరుణ్ణి వర్ణించేది. 'నాచెల్లీ చెంద్రమ్మా' కరుణరసాత్మక కథాగేయం. ఈవిధంగా ఎన్నో విప్లవగీతాలు రాసిన శివసాగర్ తర్వాతకాలంలో విరసంనుంచి విడివడి దళిత ఉద్యమంలో కృషిచేయటం, విరసం విధానాలను విమర్శించటం విశేషం.

## సి) చెరబండరాజు:

విప్లవకవుల్లో చెరబండరాజు అత్యంత ప్రతిభాకంతుడు. వచన కవిత్వం, పాట అనే రెండు ప్రక్రియల్లో ఆరితేరినవాడు. భావాలవేడి, స్వచ్ఛత, వ్యక్తీకరణసారళ్యం అతని కవిత్వానికి సహజ సౌందర్యం కలిగిస్తాయి. దిగంబరకవుల్లో ఒకడుగా తాను రచించిన 'వన్నెక్కనివ్వండి బోను' ఆకాశం వెక్కివెక్కి ఏడుస్తోంది, వందేమాతరమ్, జాగద్గురువులొస్తున్నారు జాగ్రత్త' మొదలైన 'దిక్'లు అతని ప్రతిభను పట్టిచూపిస్తాయి. ఆతర్వాత విప్లవకవిగా పరిణతి పొందిన దశలో 'దిక్సూచి, ముట్టడి, గమ్యం, కాంతియుద్ధం, గౌరమ్మకలలు, జన్మహక్కు, పల్లవి' అనే కవితాసంపుటులు వెలువరించాడు.

"ఈమట్టినాకు పట్టెడన్నం పెట్టి పాలు తాపింది
రాక్షస భూస్వామ్యరంపం కోతల్నుంచి
తనను కాపాడి రుణం తీర్చుకుంటాను
ఆగస్టు పదిహేను ద్రోహం గురించి చెప్పకపోతే
అన్నం సయించదు నాకు
ఏరోజైనా ప్రజాపోరాటాల విజయాలను వర్ణించకపోతే
ఆరోజు జీవించి నట్టుండదు"

"శిశుహంతక రాజ్యం ఇది
పశుసంతతి పాలన ఇది
స్వేచ్ఛాజీవుల రక్తంమాంసం
యదేచ్ఛగా తినమరిగిన రక్కసి
శిరచ్ఛేదమే మనకర్తవ్యం
దానికి మించిన ధర్మం శూన్యం" (గడ్డిపోచలు గర్జించాలి)

అని చెరబండరాజు తిరుగుబాటు వేదాంతం ప్రబోధించాడు. భారతదేశ స్వాతంత్ర్యం రజతోత్సవాల సందర్భంగా(1972, చెరబండరాజు రాసిన వ్యంగ్యగీతం ఆలోచనా ప్రేరకమైంది.

"వధ్యశిల రజతోత్సవమ్మట
బందిగానలు ప్రజల సొమ్మట

న్యాయమే వర్ధిల్లుతుందట
నాయకుల ఆరాధనాలట
పూలుగోయర తమ్ముడా!
మాలగట్టవె చెల్లెలా'' (వాద్యశిల)

ఈగీతం "శ్రీలుపొంగిన జీవగడ్డయి, పాలుపొంగిన భాగ్యసీమయి, వరలినది యీ భారత ఖండము, భక్తిపాడర తమ్ముడా!" అనే రాయప్రోలు దేశభక్తిగీతానికి అపహాస్యం (parody).

తొలినుంచీ పోరాటాలకు ప్రసిద్ధిచెందిన తెలంగాణాను 'ఎర్రగడ్డ'గా భావించాడు చెరబండరాజు. రజాకార్ల నాజీలను, దేశముఖుల గుండాలను తరిమికొట్టిన వీరులైన గెరిల్లాల జన్మస్థలంగా గుర్తించాడు. గ్రామాలు మేల్కొంటున్నాయని, రైతాంగసాయుధ పోరాటం, వర్ధిల్లుతుందని బలంగా విశ్వసించాడు. విప్లవ విశ్వాసం చెరబండరాజు కవిత్వ ప్రాణధాతువు

" ఇంటింట చీకటే ప్రతికంట కన్నీరె
రాజ్యమెవరికి వచ్చెనో రాజన్న
సుఖములెవరికి దక్కెనో''
అనిప్రశ్నించాడు చెరబండరాజు.

శాంతి భద్రతల సమస్యలో ముందుండేది పోలీసే. శ్రీకాకుళ ఉద్యమం మొదలు తెలంగాణా రైతాంగ పోరాటందాకా అన్ని ఉద్యమాలను ప్రభుత్వం శాంతిభద్రతల సమస్యలాగానే పరిగణించింది. వాటి ఆర్థిక సాంఘిక మూలాలను చూడలేదు. మొదటినుంచి మేధావులు నక్సలైట్ సమస్యను శాంతిభద్రతల సమస్యగాకాక భూమితో ముడుపడి ఉన్న సాంఘికార్థిక సమస్యగా చూసి పరిష్కార మార్గాలు వెదకాలని మొత్తుకుంటున్నా ఇప్పటిదాకా ఆ ఆలోచన ప్రభుత్వానికి కలుగలేదు. అదట్లా ఉంచితే ఎప్పుడైతే శాంతిభద్రతల్లో భాగంగా ఉద్యమాన్ని అణచివేయటానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందో ఆప్రయత్నానికి తొలిసాధనం పోలీసే అవుతాడు. కనుక పోలీసు ఉద్యమకారులకు, విప్లవకవులకు ప్రత్యక్ష, తక్షణ శత్రువులవుతాడు. సహజంగా శత్రువుపై ఎవరూ జాలిచూపరు. అయితే చెరబండరాజు పొట్టకూటికోసం ఉద్యోగంలోచేరి, బాధ్యతలో భాగంగా నక్సలైట్‌లను ఎదుర్కొంటున్న పోలీసుల సంక్లిష్ట పరిస్థితిని విశాల హృదయంతో అర్థం చేసుకున్నాడు.

"మాలోని మనిషివే, మామనిషివే నీవు
పొట్టకూటికి నీవు పోలీసువైనావు
ప్రాణాలు బలిపెట్టి పోరాడుసోదరుల
గుండెలకు తూటాలు గురిపెట్టినావేమి"

అను సానుభూతి ప్రకటించాడు. అంటే వర్గశత్రువుల ప్రయోజనాలకు ఉపయోగపడే వ్యక్తులు తాము ప్రాథమికంగా ఏశ్రామిక వర్గానికి చెందినవారో గుర్తించేట్టు చెయ్యటం ఇక్కడ కవి ఉద్దేశం. ఇది విప్లవ పోరాటతరుణంలో ఎందరినో ఆశ్చర్యపరిచిన అరుదైన కవిత.

ఒకవైపు తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నా
"అనారోగ్య బాధితుణ్ని
అయితే నేం యోధుడినే"

అని తుది శ్వాసవరకు విప్లవోత్తేజంతో కృషిచేసిన కవి చెరబండరాజు. అతని కవితల్లోని భాష, భావాలు సహజమైనవి; స్వచ్ఛమైనవి.

## డి) నగ్నముని:

తొలుత 'కేశవరావ్' అనే అసలుపేరుతో 'ఉదయించని ఉదయాలు' అనే కవితాసంపుటి ప్రచురించాడు నగ్నముని. తర్వాత దిగంబరకవులలో ప్రముఖ పాత్రవహించాడు. ఆతర్వాత విప్లవకవిగా పరిణామంచెందాడు. శబ్దరహస్యం తెలిసినకవి.

"కవీ! గాలిని గురించిరాయి
గాలిమాత్రం నీకవిత్వంలో నింపకు"

అని హెచ్చరించాడు నగ్నముని. ప్రజావ్యతిరేక కవిత్వం రాసేవాళ్లనుద్దేశించి 'ప్రజాద్రోహి' కవితలో ఇలా అన్నాడు.

"ప్రజల పత్రికలే కాదు
తెల్లకాగితమూ నవ్వుతుంది హేళనగా
మనం పందులమీద పంచరత్నాలు రాస్తున్నప్పుడు
ప్రభుత్వ జనవ్యతిరేక కార్యన్ని కీర్తిసున్నప్పుడు"

దిగంబరకవిగా నగ్నముని తీవ్రమైన ఆవేశంతో, అశ్లీలాలతో భావప్రకటన చేశాడు. ఆధోరణిని విమర్శించిన వారిని విమర్శిస్తూ "అశ్లీలం పలుకుతోంది దిగంబరాక్షరం అంటున్నావు సిగ్గులేకుండా" అని ఎదురుదాడి చేశాడు. వ్యవస్థలోని దుర్మార్గం అంతా అశ్లీలమే కవిదృష్టిలో, అది వదిలేసి అక్షరాల్లో అశ్లీలం వెదకటం తగదని కవి ఉద్దేశం.

1977 నవంబరులో కోస్తా ఆంధ్రలో సంభవించిన తుఫానులో వేలమంది ప్రాణాలు కోల్పోయారు. అసంఖ్యాక మరణాలకు ప్రభుత్వ యంత్రాంగం నిర్లిప్తత కొంతవరకు కారణం. ఆసంఘటన నేపథ్యంలో ప్రభుత్వవ్యవస్థ కొయ్యగుర్రం వంటిదని, దానిపాదాలకింద నలుగుతున్న ప్రజలుదాన్ని తగలబెట్టందే దేశానికి విముక్తిలేదని 'కొయ్యగుర్రం' అనే దీర్ఘకవిత రచించాడు నగ్నముని.

"సిద్ధార్థుణ్ణి రాజ్యం పొలిమేరవరకూ
చేరవేసి తిరిగొచ్చిన
అశ్వం
అశ్వయనాల్తో నాగార్జున కొండలో ఇంకా
నిలబడే వుంది
మనిషి మనసులో మాత్రం
మహాబోధి ఎప్పుడో కూలిపోయింది"

అనిసంఘంలో మానవతారాహిత్యాన్ని తాత్వికంగా వ్యాఖ్యానించాడు నగ్నముని.

అయితే కొయ్యగుర్రాన్ని తగలబెట్టగల కొత్తఘంధనం కోసం 'చరిత్ర చీకటికోణాల గుహల్లోకి వెళ్ళిపోతాను' అన్న నగ్నముని వివాదాస్పదమైంది. ఇది పలాయనవాదమని కొందరు విమర్శించారు. అంతేగాకుండా 'కొయ్యగుర్రం ఆధునిక మహాకావ్యం' అని చేకూరి రామారావు ప్రశంసించటం విమర్శకు గురితయింది.

విరసంలో కొంతకాలం కొనసాగి, తర్వాత ఆసంఘంతో తెగదెంపులు చేసుకున్నాడు నగ్నముని. తర్వాతకాలంలో 'ప్రజాస్వామ్య కవిత' వంటి రచనలు చేశాడు. గాఢమైన వ్యక్తీకరణ నగ్నముని కవిత్వంలోని ప్రత్యేకత.

## ఇ) వరవరరావు:

జీవనాడి, చలినెగళ్లు, స్వేచ్ఛ, భవిష్యత్ చిత్రపటం, సముద్రం, ముక్తకంఠం మొదలైన కవితాసంపుటులతో విప్లవకవిగా శిరసెత్తిన వరవరరావు తొలిదశలో 'తిరుగబడు' కవులలో ఒకడు. ఆవేశంకంటె ఆలోచనాత్మకమైన కవితలు రచించాడు వరవరరావు.

జైలు జీవిత అనుభవంనుంచి వెలువడిన కవితలు 'స్వేచ్ఛ' సంపుటిలో వచ్చాయి.

"నాకిక్కడ సుఖంగా వున్నదా అని నువ్వడిగావు
ఈవిశాలదేశం కోట్లాది జనం గుండెల్లో

మబ్బులోదాగిన మెరుపులా వెలుగుతున్న
భవిష్యత్తుమీద ఆశ ఈసంకెళ్లలో ధ్వనిస్తున్నది" (స్వేచ్ఛ)

అని తేలికమాటల్లో గొప్ప ఆశాభావం ప్రకటించాడు వరవరరావు. విరసం మూలస్తంభాలలో అతనొకడు.

మువ్వన్నెలజెండాలో "ప్రజల రక్తంతో తడిసి మెరుస్తున్న ఎరుపు, లేగలను చంపి ఆవుతోలు కప్పుకున్న పులితెలుపు, బూటకపు సంస్కరణలు సాధించిన 'సస్యవిప్లవ' ఆకుపచ్చదనం" ఉన్నాయని భావించిన విప్లవకవి-కుహనా స్వాతంత్ర్యాన్ని అపహేళన చేస్తున్నాడు.

"ధనగణ మన అధినాయక్ జయహే
భారత భాగ్యవిధాత
భయహే! భయహే
భయ భయ భయ జయహే"

అంటూ స్వతంత్రదేశంలో సర్వత్ర భయమే రాజ్యం చేస్తుందని వ్యంగ్యంగా విమర్శిస్తున్నాడు.

"రక్షించండి, రక్షించండి
దరిద్రాన్ని, అజ్ఞానాన్ని
రోగాలను, భోగాలను
విప్లవంనుంచి
పడిపోతున్న ప్రభుత్వాలను
పగిలిపోతున్న పార్లమెంటు భవనం
పునాదుల మీద నిలిచిన మన ప్రజాస్వామ్యాన్ని
కాపాడండి విప్లవం నుంచి
పాడండి నాలుక చివరి సామ్యవాద గీతాలు చించి
ఆకుపచ్చ విప్లవం గురించి
పీయల్ 480 గిటార్ సవరించి......."

అంటూ వరవరరావు సునిశితమైన వ్యంగ్యంతో దేశదౌర్భాగ్యాన్ని, విప్లవ అవసరాన్ని వివరించాడు. 'దేవుడా! రక్షించు నాదేశాన్ని' అంటూ దేవరకొండ బాలగంగాధర తిలక్ రాసిన కవిత ఈసందర్భంగా నిర్మాణపరంగా సైకవితతో పోల్చిచూడవచ్చు.

తెలంగాణా రైతుకూలీ మహాసభను చూసి ఉత్తేజితుడై వరవరరావు 'సముద్రం' అనే దీర్ఘకవిత రచించాడు. ఇది ఒకవిధంగా సంకేత కావ్యం. ప్రజా చైతన్యానికి, పోరాటశీలానికి సముద్రం సంకేతం.

"ఏమున్నది జీవితం
నీళ్లు ఉప్పూ ఉప్పైనా తప్ప
ఏమున్నది జీవితం
చీమూ నెత్తురూ పోరాటం తప్ప" (సముద్రం)

అని మనిషి జీవితాన్ని ఒకవంక సరళీకృతం చేస్తూ అదే క్రమంలో తాత్విక గాఢం చస్తున్న సర్వచనం ఇది.

1985లో సుదీర్ఘమైన జైలు జీవిత నేపథ్యంలో వెలువడిన కవితాసంపుటి 'ముక్తకంఠం'.

సృజన సంపాదకుడుగా వరవరరావు రాసిన గాఢమైన సంపాదకీయ వ్యాసాలు సమకాలీన రాజకీయ సాంఘిక సంక్షోభాలను చిత్రించాయి. కవిత్వంలోను, వచన రచనలోను, ఉపన్యాసంలోను తన ప్రత్యేకముద్ర కలిగిన వ్యక్తి వరవరరావు.

"కవులేం జేస్తారు
గోడలకు పోరిస్తారు, గాలికి గొంతిస్తారు
ప్రజలకు చేతులిస్తారు
ప్రజల చేతుల్లో
అనంత శక్తి సంపన్నమైన పద్యాన్ని పెడతారు"

ఆధునిక కవితా క్షేత్రంలో శ్రీ కె. శివారెడ్డి ఉన్నతుడైన గొప్పకవి. ఎంతగొప్ప కవీ ఒకేరోజు రూపొందడు. క్రమక్రమంగా దశలు దశలుగా అభివృద్ధి చెందుతాడు. రక్తం సూర్యుడు(1973), చర్య(1975), ఆసుపత్రి గీతం(1976), నేత్రధనస్సు(1978), భారమితి(1983), మోహనా ఓమోహనా(1988), అజేయం(1994), నాకలల నది అంచున(1997), వర్షం వర్షం(1999), అంతర్గానం(2002), వృత్తలేఖిని(2003) అనే కవితాసంపుటాలు చదివినప్పుడు శివారెడ్డిలోని క్రమానుగతమైన పరిణితి గుర్తించగలుగుతాం. 'రక్తం సూర్యుడు'లో వ్యవస్థపట్ల కవి అసంతృప్తి, కసి వ్యక్తీకరించబడతాయి. అవ్యక్తీ కరణలో తరువాత కవిత్వంలో లేని వ్యంగ్యం వుంది. 'శవాలయినా మనిషికొక సైరింజన్ కావలా పెట్టండి, ఎటువంటి నిప్పూ ఎక్కడా ఉండరాదు' అనే రీతిలో సాగుతుంది వ్యంగ్యం.

శివారెడ్డి అసలైన గొంతుక, అసలైన ఆవేశం 'ఆసుపత్రి గీతం'లో విన్పిస్తాయి. అతని కవిత్వ మూలరూపం అందులో కన్పిస్తుంది. అది సుదీర్ఘకవిత. గొప్ప సంకేత కావ్యం. వర్తమాన వ్యవస్థకి సంకేతం ఆసుపత్రి. అది ప్రపంచానికి సూక్ష్మరూపం. వర్తమానం కూడా ఆపరేషన్ థియేటర్‌లో చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుందని కవి అంటాడు. ఆసుపత్రి ఆరోగ్యం కోసమే అయినా సహజంగా ఆవాతావరణం ఎవరికైనా వెగటు కలిగిస్తుంది. ఆసంకేతాన్ని అలలు అలలుగా వివరిస్తూ భంగ్యంతరంగా సామాజిక స్థితిపట్ల వెగటు కల్గిస్తాడు కవి.

'నేత్రధనస్సు'లో కవి తననుంచి బహిర్గతుడయ్యాడు. తననీ, ప్రజల్ని పోరాటానికి సన్నద్ధం చేయటానికి ప్రశ్నిస్తాడు. కుళ్లిపోయిన వ్యవస్థను ద్వేషిస్తూ ధ్వంస రచన చేస్తాడు.

'ధ్వంసం చేయాల్సిన దాన్నే ధ్వంసం చేసి
మరోమహత్తరమైన దాన్ని చెమటలో కడతాం.....
నువ్వుతప్పకుండా ధ్వంసం చెయదగిన వ్యక్తివి'.

తెలంగాణా రైతాంగ, గిరిజన పోరాటాల పటుత్వాన్ని కొలిచేది 'భారమితి'. నాటండి, ఎర్రని నృతనా, తుడం, ఆయుధాల్ తెచ్చుకో, రాత్రి, భూమ్మీద పాదం మోపుతాను, కంజిర మొదలైన కవితలన్నీ ఇట్లాంటివే, విప్లవోద్యమాల ఆటుపోట్లనీ, మొక్కవోని ధైర్యాన్ని ప్రదర్శిస్తుంది ఈ కవిత్వం. ఆయుధం తెచ్చుకో, ఆయుధం తెచ్చుకో. ఆయుధం లేకుండా యుద్ధానికి మాత్రం రాకు, ఆయుధం లేకుండా ముందుకడుగు వెయ్యడానికి ఊహించకు' అని కవి చెబుతాడిక్కడ. ఈకవిత్వం మీద పాబ్లో నెరుడా, వాల్ట్‌విట్మన్, ఆఫ్రికన్ కవుల ప్రభావాలున్నాయి. నగర జీవితం సంక్లిష్టతని గూడా ప్రతిఫలిస్తుంది 'భారమితి'.

'మోహనా! ఓమోహనా!', 'అజేయం' కవితాసంపుటలు అతని కవిత్వంలోని వస్తువైవిధ్యానికీ, కళాపరిణతికీ, తాత్విక గాఢతకీ నిదర్శనాలుగా నిలుస్తాయి. 'మోహనా! ఓమోహనా!' అనే పేరే కొత్త వస్తువుని సూచిస్తుంది. ఈకవితల్లో శివారెడ్డి కేవలం పోరాట విషయాలేగాక జీవితంలో అపురూపమైన ప్రతి అంశాన్ని పరామర్శించే ప్రయత్నం చేశాడు. మోసపోయిన స్త్రీలు, చీలిన సంబంధాలు, ఉద్యమాలు, మానవహక్కులు, ఎదురుకాల్పులు, బెంజమిన్ మొలైసేలు, బాలచంద్రుళ్ళు, వృద్ధమూర్తులు, మతఘర్షణలు-ఇట్లా అనేకానేక జీవిత పార్శ్వాలు ఆరెండు సంపుటుల్లో కన్పిస్తాయి. సారాంశములో మానవసంబంధాల ప్రాధాన్యం కన్పిస్తుంది.

శివారెడ్డి ఎమర్జెన్సీ, చీకటిభూతం మొదలుకొని ఇప్పటిప్పటి తెలంగాణా ప్రజలమీద ఉక్కుపిడికిలి దాకా అధికార వ్యవస్థాగతమైన క్రూరత్వాన్ని వ్యతిరేకించాడు. శివారెడ్డి అవిశ్వాసికాడు. 'నమ్ముకున్న దాన్ని గట్టిగా చివరకంటా' నమ్ముకున్నవాడు. అతడు నమ్మింది పోరాట రాజకీయ దృక్పథాన్ని, అది విప్లవ రాజకీయ సిద్ధాంతం చేత, దాన్నినమ్మిన విరసం చేత ప్రభావితమైంది.

సామాజిక విధ్వంసం వ్యక్తి విధ్వంసం -ఈరెడు క్రమాల్నీ సరిగ్గా గుర్తించినవాడే సమగ్ర విప్లవకవిగా రూపొందుతాడు. విప్లవ కవిత్వం చాలావరకు సామాజిక విధ్వంసాన్ని గుర్తించి, పోరాటం అవసరాన్ని గొప్పభావావేశ బలంతో వివరించింది. అయితే వ్యక్తిలోని విధ్వంసాన్ని గుర్తించటంలోని, బహిర్గతం చెయ్యటంలోనూ చూపు తీక్షణంగా సారించ లేకపోయింది. అదొక పరిమితి. సరిగ్గా ఇక్కడే శివారెడ్డి విప్లవ కవిత్వానికి చేసిన ప్రత్యేక దోహదం ఉంది.

శివారెడ్డి విప్లవ కవిత్వ వస్తురూపాన్ని విస్తృతం చేశాడు. విప్లవకవి దృక్పథం జీవితంలోని అన్ని కోణాల్ని స్పృశించాలనీ, స్పృశించగలదనీ నిరూపించాడు.

'ఆమె ఎవరైతే మాత్రం', 'కమల కుమారి స్వగతం' అనేది తెలుగు సాహిత్యంలో రెండుగొప్ప స్త్రీవాద కవితలు. మొదటి కవిత ఒక ఇల్లాలి దైనందిన శ్రమపట్ల ఆర్ద్రమైన కవి స్పందనను తెలుపుతుంది.

"ఆమె ఎవరైతే మాత్రం ఎలా కదుపుతాం
ప్రశాంతంగా నిర్మలంగా దేవతలెవరో ఆమె తలచుట్టూ తిరుగుతూ విజామరలు విసురుతున్నట్లు
హాయిగా అస్పష్టంగా మళ్ళా ముకుళిత పుష్పంలా శయనించిన ఆమెను
ఆమె ఎవరైతే మాత్రమేమిటి
నాభార్యో, పక్కింటావిడో, పిల్లలతల్లో తెల్లనిపిల్లో
ఒక సంక్షుభిత పగటి తర్వాత
ఒక వ్యాకులకలిత శిధిల పగటి తర్వాత
ఏసౌందర్యమూ లేని ఏలాలిత్యమూలేని భయంకర పశువు
పగటి తర్వాత
విశ్రమిస్తున్న ఆమెను కదపటంఎలా."

మానవ విధ్వసంలో ప్రకృతినుంచి మనిషి వేరుకావటం తొలి ఘటన. సాటి మనుషుల నుంచి వేరుపడటం మలిఘటన. తన సారాంశం నుంచే తాను వేరు కావటం తుదిఘటన.

ఎక్కడ మనిషి ప్రాథమిక బంధం తెగిపోయిందో శివారెడ్డి గుర్తించాడు. 'మట్టివేళ్లకీ సిరా మరకలకీ అనుసంధానం' కుదుర్చుకున్నాడు.

'నాకూ భూమికీ ఒక అవినాభావ సంబంధం.........
భూమి విత్తు, అందులోంచి నేపుట్టుకొస్తా
భూమి ఒక నక్షత్రపుష్పం, అందులోంచి నే పరిమళిస్తా.........
మట్టి చరిత్రే చరిత్ర, మట్టి మనిషి చరిత్రే చరిత్ర
మట్టికన్నా బలమైందీ, ప్రియమైందీ, ప్రాణప్రదమైందీ, సువాసనా
భరితమైందీ మరేదీలేదు.
అందుకే మట్టి నాజీవితం నాఅనుభవం నాస్వప్నం...........
(నగ్న భూమ్మీద-మోమనా ఓమోహనా)

మట్టినుంచి పుట్టిన మానవదేహం కూడా ఒక రకంగా భూమే, అదిగూడా మట్టికిమల్లే తడిలో పదునుగావల్సిందే.

'వర్షం వర్షం', 'అంతర్దహనం' కవితల్లో అంతర్ముఖత్వంలోకి ప్రయాణించిన శివారెడ్డి తిరిగి 'వృత్తలేఖిని'లో బహిర్ముఖుడయ్యాడు. ప్రజా ఉద్యమాలను సూటిగా బలపరిచాడు.

శివారెడ్డి కవిత్వంలో అక్కడక్కడ కొంత అస్పష్టత, సంక్లిష్టత చోటు చేసుకున్నాయి. అయినా వర్తమాన తెలుగు కవిత్వంలో శివారెడ్డి కవిత్వం నిరంతర జీవనది.

## ఎఫ్) ఎన్.కె:

"శిరస్సు వున్నతమని
భుజాల బరువులమీద ఆలోచనకు కిరీటం మొలిచినప్పుడే
అఖండాలు ఖండాలైనవి
ప్రపంచం రెండుగా చీల్చ బడ్డది"

అంటూ ఎన్.కె. రచించిన 'లాల్‌బనో గులామీ చోడో, బోలో వందేమాతరం' సాయుధ వర్గపోరాటం వస్తువుగా వెలువడ్డ దీర్ఘకవిత. ఈకవితలో కవి శ్రమకి, బుద్ధికి మధ్య చరిత్రలో ఏర్పడ్డ వైరుధ్యం వివరించాడు. శ్రమజీవులతో మమేకం అయ్యాడు. చరిత్ర ప్రారంభంనుండి జరుగుతున్న వర్గ సంఘర్షణను ఉద్రేక ప్రధానమైన శైలిలో ఆవిష్కరించాడు ఎన్.కె.

"ఔను నేను మాతృభూమి మాటే మాట్లాడుతున్నాను
నాతల్లి నాకెప్పుడూ పేదగానే వున్నది
ఎప్పుడూ నాతల్లి నాకోసం చిక్కి శల్యమై వున్నది
నాతల్లిస్తన్యం ఎప్పుడూ నాడొక్కనిండా పాలు తాపలేదు"

దేశభక్తి జాతీయవాదులే ఎక్కువగా ఉద్ఘాటించే అంశం. కాని సాయుధ పోరాటాన్ని కోరేకవి, దేశభక్తిలోని మృదువైన ఉద్వేగాన్ని తెచ్చి, విప్లవంతో మిళితం చెయ్యడం - ఈకావ్యంలోని ప్రత్యేక శిల్పం" (అద్దేపల్లి రామమోహనరావు, అభ్యుదయ విప్లవ కవిత్వాలు - సిద్ధాంతాలు, శిల్పరీతులు)

## సమీక్ష :

విప్లవ కవిత్వానికిగల సామాజిక సాహిత్య నేపథ్యాలు, విప్లవ రచయితల సంఘాన్ని గురించి, విప్లవ సాహిత్య స్వభావాన్ని, విప్లవ కవుల రచనలను చదివారు.

## ప్రశ్నలు

1. విప్లవ కవిత్వ ఆవిర్భావానికి గల నేపథ్యములను వ్రాయుము?
2. విప్లవం అంటే ఏమిటి? విప్లవ సాహిత్య స్వభావాన్ని తెల్పుము?
3. విప్లవ రచయితల విప్లవ భావాలు సమాజంపై చూపిన ప్రభావాన్ని వివరించండి?
4. విప్లవ సాహిత్యంపై మార్క్సిస్టు సిద్ధాంత ప్రభావాన్ని తెల్పండి?
5. విప్లవ రచయితల సంఘ ఆవిర్భావాన్ని గూర్చి తెలుపండి?

## ఆధార గ్రంథాలు :

1. ఝుం ఝుం, లే, మార్చ్ సంకలనాలు
2. కవిత్వంపై ఎర్రజెండా - విరసం
3. దిగంబర కవితా సంకలనాలు - 3
4. నేపథ్యం - ఆశారాజు

పాఠం - 10

# విప్లవ సాహిత్యం

## పాఠ్య నిర్మాణ క్రమం

10.1 విప్లవ కవితా సంకలనాలు
10.2 ఈతరం యుద్ధ కవిత
10.3 కవిత్వంపై ఎర్రజెండా
10.4 విప్లవ సాహిత్యోద్యమం - పాట
10.5 గద్దర్ పాటలు
10.6 విప్లవోద్యమం
10.7 నిషేధాలు, నిర్బంధాలు
10.8 విప్లవ సాహిత్యంపై విమర్శలు
10.9 1980 అనంతర (విప్లవ) కవిత్వం
10.10 కొన్ని ప్రముఖ విప్లవ భావ కవితా సంపుటలు

## లక్ష్యం :

విప్లవ సాహిత్యంలో పెల్లుబికిన విప్లవ సాహిత్య రీతులను గురించి, రచయితల అభ్యుదయ, విప్లవ పంథాను తెలుసుకోవటం.

## 10.1 విప్లవ కవితా సంకలనాలు

విప్లవ కవిత్వోద్యమ ప్రారంభ దినాల్లో వెలువడ్డ 'ఝంఝు' కవితాసంకలనం అందులోని భావతీవ్రతను బట్టి, గాఢమైన వ్యక్తీకరణను బట్టి విలక్షణమైన కవితాసంకలనం, ఈసంకలనం శ్రీకాకుళ గిరిజన పోరాటంలో 'పెన్ను, గన్ను పట్టి' పోరాడి, ప్రాణాలర్పించిన సుబ్బారావు పాణిగ్రాహికి అంకితం చేయబడింది. అప్పటి సాయుధ పోరాటంలో అమరులైన నక్సలైట్ నాయకులపై స్మృతిగీతాలు కూడా ఇందులో ఉన్నాయి.

"ఆకాశం కింద విశాల హృదయంతో వస్త్రహీన దేహాలతో,
రక్తాన్ని ఇంధనంగామార్చి పాలకుల రైలు ఇంజన్నిమండే కడుపులతో
ఊడ్చుకుపోతున్న కార్మికులం కర్షకులం నిరుపేదలం మనకు" అంటూ చెరబండరాజు శ్రామిక వర్గంతో మమేకం అయ్యాడు.
"అరోపరకో మన నేరాలన్నీ ఒకే సెక్షను కిందికొస్తాయి
అందుకే
దారి తప్పిన సోదరులందరిదీ ఒకేదారి" (ఝంఝు)
అంటూ పోరుదారిని చూపించాడు చెరబండరాజు
"మెలిదిరిగిన కండరాలు కాయకష్టంలో కుమిలిపోతున్న
గంజిమూకుట్లో రెండు మెతుకులు లేవు

దారిద్ర్యం మన శత్రువు
యవ్వనమంతా విశ్వవిద్యాలయ పడగ నీడల
భవనాల్లో బంధించినా
యువతరం చదువుల బ్రతుకుల్లో వెలుగులేదు
అజ్ఞానం మన శత్రువు
ప్రపంచాన్ని ప్రమాణాల్ని ప్రజాప్రభుత్వాన్ని
నిర్మించే మనుషులు కావాలిప్పుడు
ప్రతితల్లీ
ఒకసూర్యుణ్ణి ప్రసరిస్తే చాలు" (ఝంఝ కవితాసంకలనం)

అన్నాడు నగ్నముని. సూర్యుడు తీక్షణ కాంతికి, చైతన్యానికి సంకేతం.

'ఝంఝ' కవితాసంకలనంలో శ్రీశ్రీ రచించిన 'నిన్నటి జట్కావాలా' భిన్నమైన కవిత. అది ...ండలికంలో రాయబడింది. శ్రీశ్రీ శైలిలో ఇది ప్రత్యేక మార్గం.

పార్లమెంటరీ రాజకీయాల్ని 'ఝంఝ' కవితాసంకలనం తిరస్కరించింది. 'ఓటుహక్కు గొప్పది' అనే నానుడిని హేళన చేసింది.

"రైట్ టు ఓట్ కాదు
ఈదోపిడీ రేచు కుక్కల్ని తరిమి తరిమి
ఫైట్ టు ది లాస్ట్"

అని లోచన్ ప్రకటించాడు. ఇదే సంకలనంలో శివుడు (శివసాగర్) రచించిన 'నరుడో భాస్కరుడా!' గీతం విప్లవసాహిత్యంలో పాటల శకాన్ని ప్రారంభించింది, అంతకు ముందు సుబ్బారావు పాణిగ్రాహి వంటి కవుల పాటలున్నా శివుడిపాట ప్రత్యేకమైంది. అది శ్రీకాకుళ పోరాటంలో అమరుడైన డాక్టర్ చాగంటి భాస్కరరావుపై రచించబడిన స్మృతిగీతం. జననాట్యమండలి ఆపాటకు చాలా ప్రచారం తెచ్చింది.

'ఝంఝ'లోని కవితల్లో జి.సోమయ్య రాసిన 'సైన్యంలో చేరకు' అనే కవిత ఆక్షేపణ పాలైంది. సైన్యంలో చేరమనటం దేశభక్తి కావచ్చు. చేరవద్దనటం ప్రభుత్వం దృష్టిలో దేశద్రోహం అయింది. ఆకారణంగా ప్రభుత్వం 'ఝంఝ' కవితాసంకలనాన్ని నిషేధించింది. నిషేధించినా విప్లవోద్యమ ప్రారంభదశలో ఆకవితాసంకలనం యువకవులకు బ్రహ్మాండమైన ఉత్తేజం ఇచ్చింది.

"ఆకలిమంటల్తో అలమటించే వాడికి
అహింసను బోధించేవాడు లుచ్ఛా
నిరాశలో కూరుకుపోయిన వాడిముందు వేదాంతాన్ని వల్లించేవాడు
పాలకవర్గాల గంజిమెతుకులు తాగే పొచ్ఛా" (సి.వి.)

అనే కవితను గమనిస్తే 'ఝంఝా' ప్రభంజనం ఎంత తీవ్రంగా వీచిందో అర్థం చేసుకోవచ్చు.

ప్రభావవంతమైన మరొక విప్లవ కవితాసంకలనం 'మార్చ్', సంకలనకర్త పి.కిషన్‌రావు. ఇందులో ప్రత్యేకించి కవుల పేర్లు లేవు 'ప్రజలను సాయుధం చేస్తున్న రివల్యూషనరీ నేటికవి' అనే అభిప్రాయం ఈసంకలనం చూసినప్పుడు తప్పకుండా కలుగుతుంది.

'కసితో స్వార్థం శిరస్సును గండ్రగొడ్డలితో
నరకగల్గిన వాడే నేటి హీరోక్ష' (శివసాగర్)

అని వర్గశత్రునిర్మూలనే వీరత్వం అనే నిర్వచనం ఇచ్చింది ఈసంకలనం.

'బాలెట్లతో కాదు, బుల్లెట్లతో ఈరాజ్యాధిపత్యం చేపట్టండి. అని ప్రబోధించిన 'మార్చ్' సంకలనాన్ని ప్రభుత్వం సహజంగానే సహించలేక పోయింది. ఫలితం 'మార్చ్' నిషేధం, సంకలనకర్త కిషన్‌రావు అరెస్టు.

ఝుంఝు, మార్చ్ కవితాసంకలనాల తర్వాత తిరుపతినుంచి 'లే' కవితాసంకలనం వచ్చింది. ఇందులో చెరబండరాజు, గద్దర్, వం.శండు ప్రసాదరావు పాటలు బహుళ ప్రజాదరణ పొందాయి. కవితాశక్తి కంటె ఆవేశతీవ్రత గల సకలనం ఇది. ఇదికూడా ప్రభుత్వ నిషేధం చవిచూసింది.

కె.వి. రమణారెడ్డి సంపాదకత్వంలో వెలువడిన 'మరో ఝుంఝు' (1990) కూడా విప్లవ భావజాలంతో నిండిపోయిన కవితాసంకలనమే, అయితే ఇందులో కవిత్వగాఢత తక్కువగా ఉంది.

## 10.2 ఈతరం యుద్ధ కవిత (1971-80):

ఉస్మానియా యూనివర్సిటీ రైటర్స్ సర్కిల్ ప్రచురణగా 1982లో వెలువడింది ఈసంకలనం. ఇందులో శ్రీశ్రీ శివసాగర్, చెరబండరాజు, వరవరరావు, దేవిప్రియ, నగ్నముని, శివారెడ్డి, కె.రాంమోహన్‌రాజు, హెచ్చార్కె, అజ్ఞాత సూరీడు, నందినిసిధారెడ్డి, జయధీర్ తిరుమలరావు, అజంతా మొదలైనవారి కవితలున్నాయి.

'భూమ్యాకాశాలు' పేరుతో శ్రీశ్రీ రాసిన కవిత ఉరితీయబడ్డ భూమయ్య, కిష్టాగౌడ్‌లనే నక్సలైట్లకు జోహార్ చెపుతుంది. 'మరణంలేని మహదాశయమే మనకు వాళ్లిచ్చిన నిధి' అన్నాడు శ్రీశ్రీ.

చిలీలో అలెండీ ప్రభుత్వం చేస్తున్న సామ్రాజ్యవాద దౌర్జన్యానికి వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న పోరాటాన్ని సమర్థిస్తూ శివసాగర్ 'వివాలా! శాంటియాగో' అనే సుదీర్ఘ కవిత రచించాడు. తీవ్ర భావావేశంతో సాగే రచన ఇది. అక్కడక్కడ కేవలవచనం కూడా తొంగిచూస్తుంది.

"అడిలీ నువ్వంటే నాకిష్టం
రేపటిదేశానికి ఈనాటి తల్లివి నువ్వు
రేపటి ఆకాశానికి
ఈనాడే పూచిన సూర్యపుష్పానివి నువ్వు"

చక్కని రూపకాలంకారంతో వర్ణించాడు దేవిప్రియ. అంటే అడవిలో అజ్ఞాత వీరుల పోరాటాలనుంచి దేశవిముక్తి జరుగుతుందని కవి ఆలోచన.

తననీడలో భావాల వేడిని అనుమానించి నాశనం చెయ్యాలనుకునే వాళ్లని తిరస్కరిస్తూ చెరబండరాజు 'పునర్జన్మ' అనే మంచికవిత రచించాడు.

"నాది శ్రమైక జీవన సౌందర్యగీతం
మతానికి దోపిడీ, పధానికీ పల్లవిని కానునేను
బొట్టు బొట్టుగా నానెత్తుటిని
ఈనేలవిముక్తి కోసం విత్తనంగా చల్లుతాను
బందీనైనా బానిసనుకాను
నన్ను కదిపినా ఖండించినా

మళ్ళీమళ్ళీ అలలా పుట్టుకొస్తూనే వుంటాను" (చెరబండరాజు)

అలలు నిరంతర క్రమంగా పుట్టుకొస్తూనే ఉంటాయి. వాటిని ఖండించటం అసాధ్యం. అంత చక్కని ఉపమానంతో కవి తన బద్ధతని చాటిచెప్పాడు.

"గుండె నుండి రాసిన గీతం
మళ్ళీ గుండెను మండిస్తుంది
మండే పొయ్యిలోంచి తీసినకట్టె
మంచుగడ్డలా ఎందుకుంటుంది?"

అని విప్లవ కవిత్వంలోని వేడిని కవిత్వీకరించాడు హెచ్చార్కె.

ఆర్థికస్థితి మనిషి ఉనికికి ఆధారభూమిక అని మనకు తెలిసిన విషయమే. అయితే ఈప్రాథమిక సమస్య విస్మరించి, ప్రజల్ని భ్రమల్లో ముంచెత్తే విధంగా పాలక వర్గాలు ఒక్కొక్కసారి దేశభక్తి, సంస్కృతి మొదలైన అంశాల్ని ప్రాధమికాంశాలుగా ముందుకు తెస్తాయి. 1975లో ప్రపంచతెలుగు మహాసభలు హైదరాబాద్‌లో జరిగినప్పుడు సంస్కృతి గురించి ఇలాంటి ప్రచారమే జరిగింది. ఇటువంటి సందర్భంలో వాస్తవాల్ని చూడమని వ్యంగ్యంగా హెచ్చరిస్తోంది 'నారా' కవిత.

"ఆకలేస్తోందా నీకు?
ఆంధ్ర సంస్కృతి మహోజ్జ్వలమైనది
తినడానికి తిండి లేదా నీకు?
తెలుగు భాష 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్'
పోలీసులు నిన్ను చితగ్గొడుతున్నారా?
మనకి అంతర్జాతీయ ఖ్యాతి అవసరం
నన్నయ్య గొప్పవాడు
నాకు ఆకలేస్తోంది
కృష్ణదేవరాయలరోజుల్లో.......
ఒరేయ్! నాకు ఆకలేస్తోంది
ఏదేశమేగినా ఎందుకాలిడినా......
నీయమ్మ! నాకాకలేస్తోంది రా" (అపస్వరాలు)

"యుద్ధరంగంలో నిలబడి,
కవిత్వం రాయడం గొప్ప ఆనందాన్నిస్తుంది
ఇక్కడ, కవిత్వం తన కృత్రిమ మృదుత్వం కోల్పోతుంది"

అంటూ కొన్ని వాక్యాలు దాశాడు మొలీనా.

"బాధాగ్ని కుసుమాన్ని ఆఘ్రాణిస్తున్నప్పుడే,
క్షణాల మధ్య అగాధంలో స్వప్న చక్షువులకు నిషా"

అని అజంతా వర్తమాన జీవిత బీభత్సం వర్ణించాడు. ఇంకా ఈసంకలనంలోని వగ్గుముని 'కొయ్యగుర్రం', కె.రాంమోహన్‌రాజు 'రాడ్‌క్రా చేస్తా', వరవరరావు 'అవును, అతడూ మనిషే', కె.శివారెడ్డి 'నాఅక్షరం' మొదలైన విలువైన కవితలున్నాయి.

"1970-80 మధ్యకాలంలో సాహిత్యం విప్లవ కవితాయుగంగా స్థిరపడ్డట్టు మనం గుర్తించవచ్చు. దేశంలో ఉన్న రాజకీయ పోరాటాన్ని సమర్థిస్తూ ప్రజలను సమరశీలురుగా చేయడమే ఈవిప్లవ కవితాలక్ష్యం" అని చేకూరిరామారావు (చేరా) ఈసంకలనం ముందు మాటలో అన్నాడు.

## 10.3 కవిత్వంపై ఎర్రజెండా:

1980-94 మధ్యకాలంలో వచ్చిన విప్లవ కవిత్వం ఒకసంకలనంగా 'కవిత్వంపై ఎర్రజెండా' పేరుతో 1995లో వెలువడింది.

"నువ్వు cyclone లాగో - sulphuric acid లాగో
గంధసిందూరంలాగో - గండభేరుండంలాగో
రావోయ్! యువకవీ! నవకవీ!" (రావోయ్ నవకవీ!)

అంటూ శ్రీశ్రీ చేసిన ఆవాహనతో ఈ సంకలనం మొదలవుతుంది.

"మృత్యువునే పరిహసిస్తు
శత్రువునూ ఎదిరిస్తా
అనారోగ్యబాధితుణ్నే
అయితేనేం యోధుణ్నే"

అనిచెరబండరాజు 'కత్తిపాట' పాడాడు.

"జీవితం రక్తాక్షరాల పంక్తి ఐనపుడు
నరాల్లో ప్రవహించేది నెత్తేరుకాదు-లోహద్రవం
నాలికమీద లాఠీమోపినపుడు
కలంలో సిరాకాదు
క్రోధపు భార జలం ప్రవిస్తుంది"

అని పోలీసు అత్యాచారాలను విమర్శిస్తూ కె.రాంమోహన్‌రాజు 'ఏకశిలపై ఎర్రజెండా' ఎగరేశాడు. కన్నవారికి దూరమై సాయుధపోరాటంలో భాగంగా అడవుల్లోకి వెళ్ళిన అజ్ఞాన వీరుడి హృదయాలాపన 'అమ్మా!' అనే శివసాగర్ గేయం

"అమ్మా! నన్ను కన్నందుకు
విప్లవాభినందనాలు!
పొలాలలో పరిగె గింజ
ఏరుకునే వేళలందు
పక్షుల రాగాల నడుమ
గరికపూల పాన్పు మీద
అమ్మా! నన్ను కన్నందుకు
విప్లవాభినందనాలు"

దళిత కవిత్వానికి నాంది అని చెప్పదగిన 'దళిత్ మేనిఫెస్టో'ను సలంద్ర రచించాడు.

"ఒకడేమో నన్ను అంటరాని వాడంటే
మరొకడేమో హరిజనుడు
యింకో గాడిద కొడుకేమో

నీచుడు అని పిలవడం అలవాటే
ఎవడు ఎలాపిలిస్తే నాకేం?
నేనొక నక్సలైట్ నైనప్పుడు
వీళ్ల విలువల మీద తుప్పున ఉమ్ముస్తున్నపుడు"

అంటాడు సలంద్ర. సామాజిక బహిష్కరణ నుంచి పోరాటయోధుడుగా తాను రూపొందటమే బాగుందని కవి ఉద్దేశం. శిశువు గర్భంలో ఉండగానే లింగ నిర్ధారణ పరీక్షలు జరిపి ఆడపిల్లయితే గర్భస్రావం చేయించే అనాగరికత మీద ఈశ్వరి రాసిన కవిత 'మంచిరోజులు' స్త్రీవాద కవిత్వానికి స్ఫూర్తి నిచ్చింది. 'తిరిగి తిరిగొస్తోంది నక్సల్బరీ తనకు మరణమే లేదండి నక్సల్బరీ' అంటూ అట్లూరి రంగారావు ఆలపించాడు.

ఇంద్రవెల్లిలో గోండులపై పోలీసుకాల్పులు, భోపాల్ విషవాయు సంఘటన, ఎదురుకాల్పులు, చుండూరులో దళితులపై దాడి, అమరవీరుల జ్ఞాపకాలు మొదలైన ఎన్నో అంశాలపై కవితలున్నాయి ఆసంకలనంలో, సముద్రుడు, వి.వి. అలిశెట్టి ప్రభాకర్, అజ్ఞానసూరీడు, ఎన్.కె., అల్లం రాజయ్య, హెచ్చార్కె, త్రిపురనేని శ్రీనివాస్, విమల, ఎన్. వేణుగోపాల్, నారాయణస్వామి, గౌతమ్, సౌదా, అనామధేయుడు మొదలైన వారి 'కవిత లిందులో' ఉన్నాయి.

"కవిత్వంపై ఎర్రజెండా' విప్లవ కవిత్వంలో వస్తు విస్తృతికి, శిల్పనైపుణ్యానికి గుర్తు. అంతదాకా(1980-94) విప్లవ కవిత్వానికి కాలం చెల్లిందన్న వారెవరూ, తమ వాదనను రాజకీయ, ఆర్థిక ప్రాతిపదికపై వివరించలేకపోయారు. 1970లో వంటె 80లో వస్తుపరంగానే కాక శిల్పపరంగా కూడా విప్లవ కవిత్వం అభివృద్ధిని సాధించింది. భాష, వ్యక్తీకరణ, తాత్విక గాఢత విషయంలో విరసం కవులు బయటి కవులను ప్రభావితం చేయగలిగినంతగా రాశారు." (ముప్పై ఏళ్ల విరసం స్వీయవిమర్శ, అరుణతార మాసపత్రిక, జులై-ఆగస్టు, 2002)

## 10.4 విప్లవ సాహిత్యోద్యమం - పాట:

విప్లవ సాహిత్యోద్యమానికి గొప్ప ఉత్తేజం ఇచింది పాట. "ప్రజల ఆశలు, ఆవేదనలో పల్లెపాటలు. వారి మనసు ఆకళింపు చేసుకోవటానికి అవి ఎంతో అవసరం" అన్నాడు లెనిన్.

పాట ప్రజాకళారూపం. అది ఏ ఒక్కరో ఏకాంత దంతమందిరంలో కూర్చొని సృష్టించేది కాదు. అది సామూహిక కృషి నుంచి పుట్టింది. పాట శ్రమకు పుట్టిన శిశువు. సామూహిక శ్రమ సందర్భంలో - ఆ శ్రమ క్లేశం మర్చిపోవటానికి, శ్రమవిధానాన్ని ఏకీకృతం చేసుకోవటానికి పాట ఉపయోగపడుతుంది. నిత్యజీవితంలో 'పని, పాట' అనే జంటపదం ప్రచారంలో ఉంది. అంటే ఆరెండిటికీ ప్రగాఢ సంబంధం ఉందని అర్థం. పని నుంచే పాట పుట్టింది. కలుపుపాటలు, కోతలపాటలు, పొలిపాటలు, పడవపాటలు, మోటపాటలు, తిరగలి పాటలు, దంపుళ్ల పాటలు మొదలైన పాటలన్నీ శ్రమక్రమంలోనే ఉద్భవించాయి.

ఆయా ఉద్యమ సందర్భాల్లో కవులు, కళాకారులు ఏప్రజలకు తమ సందేశం ఇవ్వదలిచారో ఆసంస్కృతిలోకి ప్రవేశించటం తప్పని సరి. అందుకే ఆ జానపద సంస్కృతిలోని కళారూపాన్ని తీసుకొని వాటిలో తమ భావాజాలాన్ని దట్టిస్తారు. ఆవిధంగా విప్లవ సాహిత్యోద్యమంలో ప్రధాన ఆయుధంగా ముందు కొచ్చింది పాట.

విప్లవగీతం 1940 దశాబ్దినాటి విమోచన పోరాటంనుంచి, శ్రీకాకుళ గిరిజన పోరాటంనుంచి స్ఫూర్తి పొందింది.

"ఈ విప్లవాగ్నులు ఎచటివని అడిగితే
శ్రీకాకుళము వైపు చూడమని చెప్పాలి
మోపటాపు సత్యమెవరని అడిగితే
గిరిజనుల సత్యమని గొప్పగా చెప్పాలి" (మంచి వెంకటనరసయ్య)
"ఏంపిల్లో ఎల్ద మొత్తవా

శ్రీకాకులంలో సీమకొండకీ ॥ఏం పిల్లో॥
సిలకలు కత్తులు దులపరిత్తయట ॥
సాతా రత్తల పవర్ల కొండకి ॥ (వంగపండు ప్రసాదరావు)

"మేరిమి కొండల్లో మెరిసింది మేఘము
ఉద్దమాల కొండల్లో ఉరిమింది మేఘము
కురుసము కొండల్లో కురిసింది వర్షము
ఏరుమీద ఏరొచ్చెరా! ఓజాలరన్నా!
ఏరు ఎమ్బుగా పారెరా! ఓజాలరన్నా!" (శివసాగర్)

కమ్యూనిజం కష్టజీవుల పక్షాన నిలుస్తుంది. కనుక
"కష్టజీవులం మేం కమ్యూనిష్టులం
ఔనన్నా కాదన్నా అదే యిష్టులం" (సుబ్బారావు పాణిగ్రాహి)
అంటుంది విప్లవ గీతం. కమ్యూనిస్టు పార్టీ గుర్తు అయిన ఎర్రజెండా విప్లవ సంకేతం. విప్లవగీతానికి ప్రాణం.
"ఎర్రజెండెర్రజెండెన్నియ్యలో
ఎర్రెర్రనిదీ జెండెన్నియ్యలో
పేదలపాలీ టెన్నియ్యలో
మరిపెన్నిధి ఈజెండెన్నియల్లో" (అల్లం వీరయ్య)
అయితే ఎరుపు అందరికీ సరిపడదు. విప్లవం అందరికీ మింగుడుపడె, విషయంకాదు. అటువంటి వారిని దృష్టిలో పెట్టుకొని
"ఎరుపంటే కొందరికి భయం భయం
పసిపిల్లలు వారికన్న నయం నయం"
అని ఎగతాళి చేశాడు సుబ్బారావు పాణిగ్రాహి.

విప్లవోద్యమ గీతాల్లో జీవన వాస్తవికత తొంగి చూస్తుంది. సామాన్యజనానీకం బ్రతుకు లోతులు తెరచిచూసిన కవి అందులోని కష్టాలను, కన్నీళ్లను హృదయానికి హత్తుకునే విధంగా వర్ణిస్తాడు. ఈ వర్ణనలో స్వభావోక్తి తప్పలే సమాత్రం అతిశయయోక్తి ఉండదు. చెరబండరాజు రాసిన 'కొలిమంటుకున్నది' పాటలో ప్రత్యక్షమయ్యేది ఈ జీవన వాస్తవకతే.

"కొలిమంటుకున్నది
తిత్తినిండా గాలి
మెత్తంగ ఉన్నది
నిప్పారిపోనీకు - రామన్నా
పొద్దెక్కి పోనీకు - లేవన్నా
నీపక్క పాలమోడు
దుక్కిసాగిండన్న
కాల్జాపి కూకోకు - రామన్నా
కార్తి పోతే రాదు - యినుమన్నా"...... (చెరబండరాజు)

ఎరువుకావాలి. గుడిసె వేసుకోవాలి. బండి పట్టాలు కొత్తవి కావాలి. కంచాన గంజికోసం ఎగబడ్డ కాకుల్ని గద్దల్ని తోలటానికి వడిసెల పేనుకోవాలి. కూలినాలి చేసి కూడ బెట్టిందేమీలేదు. చట్టాలు, పట్టాలు అన్నారు. పొలంలో కాలుబెడితే పోలీసులు వచ్చారు. 'దయగల్ల సర్కారు దాదాలె అయ్యారు'. కౌలుకిచ్చినవాడు కన్నెర్రజేశాడు. అప్పులిచ్చినవాడు ఆలివే చూశాడు. నీదారి గోదారి కావీక కదనాన నిలవాలి. కఱ్ఱు, పారా పాన బెట్టాలి. బతుకు యుద్ధంలోన నిలవాలి.

ఇదంతా తెలంగాణా సన్నకారు రైతునిత్య జీవన వ్యధే. ఈవ్యధలోనుంచి ఒక తిరుగు బాటు తత్వం అలవరుచుకోవాలని కవి అంటున్నాడు. కఱ్ఱు, పార పానబెట్టి, బతుకు యుద్ధంలో నిలబడ మనంలో భూస్వామ్య, పెట్టుబడిదారీ శక్తులకు వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కమ్మనే వ్యంగ్య సందేశం దాగిఉంది.

స్వరాజ్యం వచ్చినా సురాజ్యం రాలేదని విప్లవ కవులు భావించారు. అర్ధరాత్రి స్వాతంత్ర్యం వచ్చినా ఇంకా తెల్లారలేదని తెలుసుకున్నారు. 'గరీబీహఠావో' నినాదం నినాదంగానే మిగిలి పోయిందన్నారు. సంపన్నుల లోగిట్లో వెన్నెల, నిరుపేదల బతుకుల్లో చీకటి ఎందుకు ముసిరిందో ఆలోచించమన్నారు.

"ఇంటింట చీకటే
ప్రతికంట కన్నీరె
రాజ్యమెవరికి వచ్చెనో-రాజన్న
సుఖము లెవరికి దక్కెనో" (చెరబండరాజు)

శ్రమజీవి తన జీవికకు సరిపోయే దానికంటె ఎక్కువగా కష్టపడతాడు. ఉత్పత్తి వస్తువుకు అదనపు విలువ (Surplus valere) కల్పిస్తాడు. అయితే ఆ అదనపు విలువకు వెల చెల్లించకుండా భూస్వామి లేదా పెట్టుబడిదారు దోచేస్తాడు. అదే వారికి లాభమవుతుంది. శ్రమజీవి ఎప్పటికీ ఆ విధంగానే మిగిలి పోతాడు. ఈవిధమైన ఆలోచనతో కారల్ మార్క్స్ అదనపు విలువ సిద్ధాంతం (Theory of Surplus value) రూపొందించాడు. సామాజిక చరిత్రలో మొదటిసారిగా దోపిడి తత్వం బట్ట బయలు చేశాడు. అతని Das capital లో ఈవిశ్లేషణ చూడవచ్చు. ఆ సిద్ధాంతపు వెలుగులో విప్లవాభి మానులైన కళాకారులు శ్రమ శక్తి దోపిడిని గుర్తించారు.

"కొండలు పగలేసినం
బండలనూ పిండినం
మా నెత్తురు కంకరగా
ప్రాజెక్టులు గట్టినం
శ్రమ ఎవడిదిరో
సిరి ఎవడిదిరో" (చెరబండరాజు)

ఈ పాటలో శ్రమకు సంపదకు మధ్యగల వైరుధ్యం

"అలజడి మా ఊపిరి, ఆందోళన మా జీవితం, తిరుగుబాటు మా ఎదాంతం" అని మహా ప్రస్థానంలో శ్రీశ్రీ అన్నట్టు విప్లవగీతానికి తిరుగుబాటే వేదాంతం అయింది.

"ఊరు మనదిరా ఈ వాడ మనదిరా
పల్లె మనదిరా ప్రతి పనికి మనంరా
సుత్తె మనది, కత్తి మనది
పలుకు మనది, పార మనది

దొర, మనదిరా బలిదెడ్లు మనయిరా
దొర ఏమిందుకురో దొర తనమెందుకురో నడుమ
దొరలేమిందుకురో దొరతన మెందుకురో" (అంజయ్య)
దొరల భూస్వామ్య విధానంపై తిరుగుబాట్
ఈ పాట
"కొంగునడుముకు చుట్టవే చెల్లెమ్మ
కొడవళ్ళ చెబట్టవే చెల్లెమ్మ"
అని భూస్వాముల ఆగడాలపై కదనశంఖం
ఊదమంటుంది ఈ పాట.

మార్పును కోరుతూ ఒక వ్యవస్థతో ఢోకొనటం తేలికైన పనేమీ కాదు. ఆ విధంగా సాయుధ పోరాటం వల్లెరు మీద బండినడక కాదు. వేదివులనుంచి వీరమరణాలదాకా ఎన్నో త్యాగాలకు సిద్ధపడినప్పుడే, ఈపోరాటం సాగుతుంది. అందువల్ల విప్లవ పోరాటం గురించి గానం చేసిన పాట ఈ 'పోరుబాట' లో గాయపడిన వారి గురించి కూడా గానం చేసింది. "మృత వీరుల ఆశలతో మును ముందుకే సాగుతాం" అని అమర వీరుల నుంచి స్ఫూర్తి పొందింది.

"తోటరాముని తొడకు కాటా తగిలిందాని
చిలుక చీటి దెచ్చెరా, ఓవిలు కాడ
మైనా మతలబు చేసెరా "తోట"
వొద్ది పూ దారిలో సద్దు మణిగిందంట
సంద్రాపుదారిలో గాండ్రించి దూకిరేదంట
సంజా మాటున దాగి పంజా విసిరిందంటా
తోటరాముని తొడకు కాటా తగిలిందంట
కంజు కన్నీరెట్టెరా ఓ విలుకాడ
నెమలి నాట్యం మానెరా" ॥తోట॥
(శివసాగర్)

"తోటరాముడు పల్లె చేతిలో బల్లెము. తోటరుముడు అడవి గుండెల్లో గిటుకు." అడవిలో తిరుగుతున్నప్పుడు పోలీసుల కాల్పుల్లో గాయపడిన పోరాట వీరుడి గురించి అమూర్త భావనతో (abstract) రాయబడిన మంచి పాట ఇది. ఇందులో అడవికి, తోట రాముడికి గల అనుబంధం, తోటరాముడు గాయపడితే అడివి అల్లాడిన వైనం గొప్ప కాల్పనిక భావనతో (Romantic imagination) వర్ణించబడింది.

## 10.5 గద్దర్ పాటలు:

విప్లవ సాహిత్యోద్యమం గద్దర్ లాంటి మహా ప్రజా కళాకారుల్ని సమాజానికి అందించింది. తెలంగాణా నిరుపేద కుటుంబంలో లచ్చుమమ్మ కొడుకు 'విఠల్' కులపరమైన, ఆర్థికపరమైన అవమానాలు, కష్టాల మధ్య పుట్టిపెరిగాడు. బైరూపులు, బైండ్లోళ్లు, గొగ్గులు, దాసరొల్లు, శారదగాళ్లు, లత్కోరు సాబ్‌లు, ఎర్రగొల్ల వాళ్ల మొదలైన జానపద కళాకారుల సృజనాత్మకతను గమనించాడు. శ్రామిక వర్గ రాజకీయాలు అతడిని సాయుధపోరాట పంథావైపున నడిపించాయి. విరసం వెలుగులో రూపు దాల్చిన 'జన నాట్యమాండలి' లో ప్రబల శక్తిగా మారాడు కష్ట జీవుల బతుకు వెతల్ని తన పాటల్లో పలికించాడు. గోచి, గొంగడి తప్ప మరే ఆహార్యం లేకుండానే ఆంధ్ర దేశాన్నంతా అలరించాడు. తన భావాలతో వెడెక్కించాడు. గద్దర్ ఒక యుద్ధ మేఘ గర్జన.

"దీపావళి వచ్చె
దీపమే లేదాయె
శివరాత్రి వచ్చింది
ఉపవాస ముండాలె
నీ బతుకంత శివరాత్రె లచ్చుమమ్మో లచ్చుమమ్మో
నీ బతుకంత అమవాస లచ్చుమమ్మో లచ్చుమమ్మో"

అంటూ ఒక కార్మికురాలి జీవన దైర్యాన్ని, సంఘర్షణని చిత్రించాడు. గద్దర్ ప్రతి పాటలో శ్రామిక జన పక్షపాతం తొం చూసుండి ఆ జీవితంతో మమేకం అయ్యాడు గద్దర్. అందుకనే

"నా కూలినాలన్నలు
బావుల్ దొవ్వంగో భారతీ కిరియాల
బావుల్ దొవ్వంగో "
బాయి బాయికీ నేను "
బతుకమ్మ నేదో "
బతుకమ్మ నేదో "

అంటూ బావులు తవ్వేవాళ్లు, మోట గొట్టేవాళ్లు, దుక్కులు దున్నేవాళ్లు, కొతలు గోసేవాళ్లు, కుప్పలు గొట్టేవాళ్ల బళ్లు తోలే వాళ్లు ఇట్లా ఎందరో కూలినాలి జనంతో లీనమయ్యాడు గద్దర్. "యాలరో ఈ మాదిగ బతుకు మొత్తుకుంటె దొరకదు మెతుకు" అని నిమ్న కులాల వెతలు మొదలు వడ్డెరలు గ్యాంగు కూలాలు, రిక్షావాళ్లు మొదలైన శ్రామికుల బాధలన్నీ తనవిగా చేసుకున్నాడు.

వివిధపోరాటాల్లో అమరులైన వీరుల్ని గురించి గానం చేశాడు గద్దర్, వాళ్ళందరికీ 'లాల్ సలాములు' చెప్పాడు. 1975 లో విధింపడిన అత్యవసర పరిస్థితి (Emergency) ఎందరో విద్యార్థుల్ని పొట్టన పెట్టుకుంది. తన పాటలో వాళ్ళ నిట్లా తలచుకున్నాడు గద్దర్.

"ఏడ బుట్టి ఏడ బెరిగె
ఏడికొచ్చి ఏడ సచ్చె
ఎవరి కొరకు వచ్చినారు
ఎవరి కొరకు సచ్చినారు
నీ తల్లి కడుపు పంట లోలీ - శెమ్మ కేలిల వోలీ
కూలితల్లి కంటిపాప లోలీ- శెమ్మ కేలీల వోలీ"

"గద్దర్ పాటలు ప్రజలను నేరుగా చేరుతాయి. ప్రజలను చేరడం మాత్రమే కాదు. వారి జీవితాలలో భాగంగా మారుతాయి" అన్న 'వర్గీస్' అతని పాటలు ఎట్లా సృష్టింపబడతాయో వివరించాడు.

"ఒకటి ప్రజా రాజకీయాలను (విప్లవ రాజకీయాలు) వివరిస్తూ, ప్రజల కోసం, ప్రజల సేవలో రాయడం. రెండవది: ప్రజలలో బాగా ప్రచారంలో ఉన్న జానపద బాణీ తీసుకోవడం. మూడవది : ప్రజలు వాడే భాష, అంటే పలుకుబళ్లు జాతీయాలు, సామెతలు మొ॥నవి పాటలలో చోటుచేసుకోవడం. నాలుగు వీటన్నిటి కూర్పు. కేవలం ఈ పద్ధతి ననుసరించే గద్దర్ పాటలు రాస్తాడు. అందుచేతే అవి బలంగా ప్రజలలోకి వెళ్లగలుగుతున్నాయి."

(వర్గీస్ ముందుమాట, గద్దర్‌పాటలు, జననాట్య మండలి ప్రచురణ,1981)

శ్రమజీవుల జీవితంతో మమేకమయ్యాడు గద్దర్. వాళ్ల సజీవమైన భాషనే తన వాహికగా మార్చుకున్నాడు. జనసామాన్యంలో నిత్యం కలిగే జానపద బాణీలను స్వీకరించటంలో, విప్లవీకరించటంలో గద్దర్ గొప్పదనం దాగుంది. 'కల్లుముంతో మాయమ్మ, పెరుమల్లె చెట్టుకింద. రావనా ఉయ్యాల, లస్కరు బోనాలంట, సూర్యుడు సెంద్రుడు' మొదలైన పాటలు జానపద గేయాల వరుసల్ని(బాణీలు) గ్రహించినవే.

పై కారణంవల్ల గద్దర్ ఆహార్యంలో మాదిరే కవిత్వంలోనూ నగరీకరణ(urbanity) కన్పించదు. ఆధునిక (వచన) కవిత్వానికి ఒకప్రత్యేక లక్షణంగా చెప్పబడుతున్న ఈఅర్బనిటీకి గద్దర్ పాట పూర్తి విరుద్ధం. అది పూర్తిగా గ్రామీణ సౌందర్యం (Rural beuaty) పుణికి పుచ్చుకుంది. పూర్తి విరుద్ధం అయితే అది ఆధునికం కాకుండా పోలేదు. వర్తమాన జీవన కసంఘర్షణ అందులో ఉన్నత కాలం ఆపాటకు నిత్యనూతనత్వం ఉంటుంది. దానికి పాఠకులకన్నా ప్రేక్షక శ్రోతలే ముఖ్యం. అంటే గద్దర్ పాటలు ప్రధానంగా చదివి ఆనందించేవికావు; వినిఆనందించేవి.

గద్దర్‌పాటలో గొప్ప సారళ్యం ఉంటుంది. అది అస్పష్టతకి ఆమడదూరం. ప్రజలకోసం, ప్రజలభాషలో రాసిన ఏసాహిత్యమైనా ప్రజలకు తేలిగ్గానే అందుతుంది. ఇందుకు వేమన ఆటవెలదులనైనా ఉదహరించవచ్చు.

"ఏది గానేటట్ల లేదు
ఏది తినేటట్ల లేదు
నాగులో - నాగన్నా
దరలిట్లా పెరగవట్టె
నాగులో నాగన్నా"

ఇటువంటి గద్దర్ పాటలనైన ఉదహరించవచ్చు. దీంతోపాటు గద్దర్‌పాటల్లో హాస్యవ్యంగ్యాలు పదునైన బాణాల్లా తాకుతాయి.

"అమ్మదిగి అయ్యెక్కే
అయ్యదిగి అమ్మెక్కే
నాగులోనాగన్నా
ధరలమీద ధరలెక్కే
నాగులో నాగన్నా"

అంటాడు గద్దర్ పదునుగా. చింతపండు కొనబోతే ధర చింతచెట్టెక్కి కూర్చుండట. పేరు పప్పు పప్పేకాడ సెటాకంత రాలేదట. చెక్కరధర వినగానే చెక్కరొచ్చి పట్టయిందట.

గద్దర్‌పాటలో నిర్మాణ సౌందర్యం(Structural Beauty) ఉంటుంది. ఇది రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి భావనిర్మాణమైతే రెండోది క్రమబద్ధత (Border)

గద్దర్ తన పాటల్లోని వస్తువును విశ్లేషించే తీరులో ఆయా పీడితప్రజల లేదా వస్తువుల సహజ చిత్రణ ఉంటుంది. ఆ తర్వాత చివరగా ప్రజలభావాన్ని పోరాటం వైపు మళ్లించే విధంగా ముగింపు ఉంటుంది. ఇక రూపానికి సంబంధించి పాటచరణాల కూర్పులో, అంశాలకూర్పులో క్రమబద్ధత ఉంటుంది, 'నాకూలినాలన్నలు' అనేపాటను ఇందుకు పరిశీలించవచ్చు. రకరకాల వృత్తులకు సంబంధించిన కూలినాలిజనం శ్రమిస్తుంటే బాయిబాయికి నేను బతుకమ్మనవుతానంటాడు, గట్టూ గట్టుకు నేను గనిమనౌతానంటాడు. దుక్కీదుక్కికి నేను మొక్కనవుతానంటాడు. కుప్పాకుప్పకు నేను రాసినవుతానంటాడు. కత్తీకత్తికి నేను వారనవుతానంటాడు. చివరికి 'నాకూలినాలన్నాలు' దండులోచేరగా, దండూ దండుకు నేను ఎర్రజెండా నవుతానంటాడు.

అచ్చమైన పరిశీలన, అద్భుతమైన ఊహాశక్తి గద్దర్ పాటల్లో ప్రతి అణువులోను కన్పిస్తాయి. ఈ సుగుణాలు ప్రజలపై ఆ కవికి గల అపారప్రేమ లోంచి ఉద్భవించాయి.

"గద్దర్ అక్షరాల జనం బిడ్డడయ్యాడు - జనం తలలోపాటల నాలుకయ్యాడు-ప్రజాకళలకు నమూనా అయ్యాడు-పోరాట సాహిత్య సంప్రదాయానికి నమూనా అయ్యాడు. విపవోద్యమంలో సాంస్కృతిక మారుపేరయ్యాడు" అని కె.వి. రమణారెడ్డి గద్దర్‌పాటలకు రాసిన ముందుమాటలో అన్నది ప్రత్యక్షర సత్యం.

గద్దర్ వరసలో కొన్నివందల మంది ప్రజాకళాకారులు పాటలురాస్తూ, పాడుతూ ప్రజలసమస్యలు వివరిస్తూ వారిలో పోరాటచైతన్యం రగిలించారు.

## 10.6 విప్లవోద్యమం: విప్లవ రచయితల సంఘం:

ఈ సాహిత్య క్రమంలో ఒకబలమైన విప్లవోద్యమం ఆంధ్రదేశంలో నిర్మించటంలో విరసం బలమైన పాత్ర వహించింది. తన సంస్థలోని కవులకన్న ఎంతో ఎక్కువమందిని ప్రభావితం చేసింది. సుమారు రెండు దశాబ్దాలు తెలుగు సాహిత్యరంగంలో ప్రజల సాహిత్య సంస్థగా కొనసాగింది. ఎన్నిఆటుపోట్లున్న లోటుపాట్లున్న ఇప్పటికీ తన కృషి కొనసాగిస్తుంది. 1996లో ఆసంస్థ ప్రకటించిన పత్రంలోనే దాని కృషి తెలుసుకుందాం.

**విప్లవోద్యమం - విరసంపాత్ర :** భారతదేశంలోనే మొట్టమొదటి బలమైన విప్లవ సాహిత్యోద్యమ నిర్మాణంగా విరసం ఇరవైఐదు సంవత్సరాల పుట్టినరోజు మొత్తంగా తెలుగు సాహిత్య చరిత్రలోనే ఒక గుణాత్మక సందర్భం. ఈ సందర్భంలో నిలబడి చరిత్రను పునరావ లోకనం చేసి విజయవైఫల్యాలను గుర్తించి బేరీజువేయడం, సాహిత్య సామాజిక రంగాలలో తాను నిర్వచించుకున్న కర్తవ్యాలకు మరింత దీక్షతో పునరంకితం కావడం విప్లవ రచయితల సంఘం బాధ్యత.

**సామాజిక నేపథ్యం:** విరసం ఏర్పడిన తర్వాత ప్రచారం చేసిన విలువల్లో ఈ సామాజిక స్పృహ ప్రధానమైనది. విరసం సభ్యులకు మాత్రమేకాక, తెలుగు సాహిత్యకారులలో అత్యధికులకు ఈ స్పృహ పెరిగింది. 'సమాజం మాకక్కరలేదు. మాఒంటరి లోకాల్లోనే మేముంటాం' అనే వాళ్ళు కూడా తమ వేదనకూ, లోకం వేదనకూ ఎక్కడో సంబంధం వుందని గుర్తించడం మొదలయింది. విప్లవం అనేమాట భూసారంలో ఇంకి గాలిలో వ్యాపించి, విప్లవాన్ని వ్యతిరేకించే వాళ్ళుకూడా విప్లవ విశేషణం తగిలించుకునే స్థితి వచ్చింది. క్రమక్రమంగా 'సమాజానికీ సాహిత్యానికీ సంబంధం లేదనే మాట బహిరంగంగా అనడానికి వీలులేని మాట అయిపోయింది.

**నిర్దిష్టత:** సమాజ సాహిత్య సంబంధాల అవగాహనలో ముఖ్యమైన అంశం నిర్దిష్టత. విరసం ఏర్పడక ముందు ప్రజాసాహిత్యాన్ని వాంఛించిన వాళ్ళకు కూడా సాహిత్యంలో నిర్దిష్టత గురించి స్పష్టత ఉండేది కాదు. సాహిత్యంలో సాధారణీకరణకు, తాత్వికతకు, అమూర్తభావనకు ఎంత స్థానం ఉన్నదో. ఆ స్థాయిని తీసుకుపోయేందుకు తగిన ప్రత్యేక ఘటనలను నిర్దిష్ట పరిణామాలను, వయ్యక్తిక దృగ్గోచరాంశాలను వెతికి పట్టుకుని అక్షరీకరించడానికి కూడా అంత స్థానం ఉంది. కానీ ఆధునిక తెలుగు సాహిత్యంలో చాలా భాగం ఇతర భాషాసాహిత్యాల ప్రేరణతో వచ్చిందే గనుక ఎక్కువగా సూటిగా సాధారణీకరణలే వచ్చాయి.

ఈనేపథ్యంలో శ్రీకాకుళం కొండల్లో సవర, జాతాపు తెగలు ఎత్తిపట్టిన పోరాట పతాకపు నిర్దిష్టతను, ఆ పోరాటానికి ప్రేరణ నిచ్చేందుకు వెంపటాపు సత్యం, సుబ్బారావు పాణిగ్రాహి రాసిన పాటల నిర్దిష్టతను విరసం సొంతం చేసుకున్నది. అప్పటినుంచి తెలుగు నేలమీద ప్రతి ప్రజాజీవన సంచలనంలోని నిర్దిష్టతను పట్టుకుని దాన్ని సాధారణీకరిస్తూ వచ్చింది. విప్లవం అనేది అనిర్దిష్ట, అమూర్త భావనకాదని నిర్దిష్టంగా వర్తమానంలో మననేలమీద సాగుతున్న ప్రజా పోరాటమని, అస్థలకాల బద్ధత సాహిత్యంలోకి రావలసిందేనని, అపునాది మీద మాత్రమే సాధారణీకరణ జరగాలని విరసం సాహిత్యం చూపింది.

**సృజనాత్మకత:** సృజనాత్మకత మూలం ఏమిటి? భూస్వామ్య, హైందవ, బ్రహ్మణ విలువలు ప్రబలంగా ఉన్న సమాజంలో సృజనశక్తి అప్రజ్ఞాతమనీ, అతీతమనీ, దైవదత్తమనీ, వ్యక్తి నిష్టమనీ, నియమాతీతమనీ అనేకానేక సమాధానాలుంటాయి. ఈప్రశ్నకు అభ్యుదయ సాహిత్యోద్యమం అరకొరగా చెప్పి వదిలిన జవాబును విప్లవ సాహిత్యోద్యమమే సూటిగానూ, స్పష్టంగానూ చెప్పింది. సమాజంలో కొనసాగుతున్న

10)

తప్పుడు అవగాహనలను తోసివేస్తూ సృజనశక్తికి మూలం ప్రజాజీవన సంఘర్షణ అని విరసం నిర్ద్వంద్వంగా ప్రకటించింది. జనజీవన సంఘర్షణతో, నిత్య, అన్యోన్య సంబంధం ఉన్న రచయితలే అంతకంతకు ఎక్కువగా సామాజిక సమస్యల పరిష్కార మార్గంలో తమ కలాల్ని గళాల్ని వినియోగించగలరని విరసం రుజువు చేసింది.

**ప్రజాస్వామికీకరణ:** విరసం ఏర్పడిన తరువాత బలపడిన మౌళిక సాంప్రదాయం నిజానికి అంతకన్నా విస్తృతమైన సాహిత్య ప్రజాస్వామికీకరణలో భాగం. సమాజం అంతకంతకూ ఎక్కువగా ఆధిపత్యాన్ని, నియంతృత్వాన్ని, కేంద్రీకరణను వ్యతిరేకిస్తూ ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటున్నప్పుడు ఆ ఆకాంక్షలు సాహిత్య కళా రంగాలకు కూడా విస్తరించడం సహజమే. ఆ ఆకాంక్షలన్నిటికీ విరసం ఒక వాహిక అయింది.

సాహిత్యంలో ప్రజాస్వామికీకరణకు అర్థం ఏమిటి? సాహిత్యంలో ప్రజాస్వామికీకరణ కనీసం మూడు స్థాయిలలో వ్యక్తమవుతుంది. ఒకటి-అంతకంతకూ ఎక్కువమంది రచయితలు పుట్టుకురావడం, ప్రజలలో సాహిత్య సృజనాశక్తి, మొత్తం మీద సాహిత్యాభిరుచి ఇతోధికంగా పెరగడం. రెండు-ఇంతవరకూ సాహిత్య వ్యాసాంగంతో, అక్షరాస్యతతో పరిచయంలేని వర్గాల నుంచి సాహిత్యం వెలువడడం, మూడు - అభివ్యక్తిలో, వక్తీకరణ పద్ధతిలో కొత్త రూపాలు పుట్టుకు రావడం, విస్తరణ బహుముఖాలుగా సాగడం, మాండలికాలలో, కొత్తభాషలలో సాహిత్యం అభివృద్ధి చెందడం.

ఈసందర్భాన్ని రూపొందించడంలో తప్పనిసరిగా విరసానికి పాత్ర ఉంది. ఇదివరకెన్నడూ సాహిత్యంతో గానీ, అక్షరాస్యతతో గానీ సంబంధం లేని రచయితలు, మొదటితరం అక్షరాస్యులు కొత్తగా సాహిత్యలోకంలోకి ప్రవేశించారు. నిరక్షరాస్యులు పాటలు కట్టడం, ప్రజా కళాకారులుగా ఎదగడం, వాళ్ళకు గౌరవం పెరగడం జరిగింది.

ఈపరిణామాల వల్ల తెలుగు సాహిత్య సాంస్కృతిక రంగాలకు చాలా మేలు జరిగింది. అన్ని రంగాలలోను కొత్తదనం వ్యాపించింది. విస్తృతమైన ఈ కొత్త ఇతివృత్తాలు,కొత్త జీవవరంగాలు, కొత్త అభివ్యక్తి తెలుగు కళాసాహిత్య సాంస్కృతిక రంగాలలోకి ప్రవేశించాయి . విస్తృతమైన ఈ పరిణామానికి మాండలిక రచన ఒక ముఖం మాత్రమే. మాండలిక రచన తెలుగులో అంతకుముందే అరకొరగా ఉన్నప్పటికీ అది ఒక ప్రయోగంగానే తప్ప, ఒక సామాజిక అవసరం కోసం చైతన్యయుతంగా మాండలికాన్ని వాడడం జరగలేదు. విరసం పుట్టుక తర్వాత, మరీ ముఖ్యంగా, కరీంనగర్, ఆదిలాబాద్ ప్రజాపోరాట వెల్లువ తర్వాత ప్రజారాజకీయాలలో విస్తృతిలాగానే, ప్రజా సాహిత్యంలోనూ విస్తృతి పెరిగింది. మాండలిక రచన ఒక ఉద్యమ స్థాయిలో సాగి దానికి సాధికారత వచ్చింది. మరోవైపు గోండి, మాండియా, కోయ, బంజార వంటి లిపికూడా లేని భాషలలోనూ సాహిత్యం వెలువడడం ప్రారంభమైంది.

**నిబద్ధత:** రచయితలు ప్రజాజీవనాన్ని చిత్రించడానికి, ఆజీవితంలోని సంఘర్షణలను వ్యక్తీకరించడానికి, ఆశావహమైన భవిష్యత్తుకు దారితీస్తుందనే నమ్మకాన్ని కలిగించడానికి నిబద్ధులు కావాలనే విలువలను విరసం ప్రాచుర్యంలోకి తెచ్చింది.

**ఆశావాదం :** అసహాయులకు ధైర్యం ఇవ్వడంకన్న సాహిత్యం చెయ్యగల గొప్పపని మేరొకటి ఉండదని కొడవగంటి కుటుంబరావు ఒక సందర్భంలో అన్నారు. సాహిత్యం దానికదిగా ఒక ధార్మినిక శక్తిని పాఠకులకు ఇస్తుంది. వారిలో నిద్రాణంగా ఉన్న సృజనాత్మక, ఆలోచనా శక్తులను సాహిత్యం పెంపొందిస్తుంది. గతం గురించి రాసినా, వర్తమానం గురించి రాసినా, ఈగత వర్తమానాల ఘటనల వెనుక ఉన్న శక్తులను చూపి, ఆశక్తుల పరిణామాన్ని ఊహించి ఒక భవిష్యత్తును రూపుకట్టగల శక్తి సాహిత్యానికి ఉంది. ఇవాళ్ల కంటె ఎప్పుడూ రేపే బాగుంటుందంటాను' అని శ్రీశ్రీ అన్నట్టు ఈవాళ ఎందుకిట్లా ఉందో, రేపు ఎట్లా బాగుండబోతుందో, అందుకు సమాజం ఏం చేయాలో సాహిత్యం చూపించగలగాలి. ఒక్క మాటల్లో చెప్పాలంటే సాహిత్యానికి అంతర్గత సూత్రం ఆశావాదం కావాలి.

నిజానికి విప్లవ రచయితల సంఘం పుట్టిన నాటికి దానికి ప్రేరణ అయిన నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమాలు తాత్కాలిక ఓటమికు గురయి ఉన్నాయి. సరిగ్గా విరసం పుట్టిన నాలుగు రోజులకు శ్రీకాకుళ పోరాట నాయకులు వెంపటాపు సత్యనారాయణ, ఆదిభట్ల కైలాసంలు

కాల్చి వేయబడ్డారు. సమాజంలో నెలకొని ఉన్న ఇటువంటి నిరాశామయమైన పరిస్థితులలో కూడా విరసం 'ఇప్పుడు వీస్తున్న గాలి' విప్లవ 'ఝంఝ'దని చూపింది. ఇది విప్లవాల యుగమనీ, విప్లవిస్తే జయం మనదేననీ పీడిత ప్రజానీకానికి ఆశ్వాసాన్నిచ్చింది.

వర్గపోరాట సాధనంగా సాహిత్యం: విరసం పుట్టిన తర్వాత సాహితీయం ప్రత్యక్షంగా వర్గపోరాటంలో భాగం పంచుకుంది. సాహిత్యంలో వర్గ పోరాటం ప్రారంభమైంది. రచయితలలో ఎక్కువ మంది చైతన్యయుతంగా తామే శిబిరంలో ఉండదలచుకున్నారో నిర్ణయించుకున్నారు. సాహిత్యం కూడా వర్గపోరాటంలో భాగమయిందన్నప్పుడు అనివార్యంగానే వర్గపోరాటంలో వైరి వర్గాలకు ఆ సాహిత్యం పట్ల ఉండే వైఖరి వాళ్ళ ఆచరణలో ప్రస్ఫుటమవుతుంది. విప్లవ సాహిత్యాన్ని అణచివేయడానికి పాలకవర్గాలు అతి దుర్మార్గమైన ప్రయత్నాలు చేయడం, పీడిత ప్రజానీకం ఈసాహిత్యాన్ని తమ నాలుకల మీద కాపాడుకోవడం విప్లవ సాహిత్యం వర్గపోరాట సాధనంగా మారిందనేందుకు ప్రబలమైన చిహ్నాలు.

విగ్రహ విధ్వంసం : విరసం సాధించిన విజయాలలో చెప్పుకోదగినది దాని విగ్రహ విధ్వంస లక్షణం. విరసం ఏర్పడడానికి ముందు సాహిత్యకారులను సమాజం నుంచి విడదీసి అనవసరమైన గౌరవం ఇచ్చి అతీత మానవులను చేసే పద్ధతి ఉండేది. రాజులతో గండపెండేరాలు తొడిగించుకునే భూస్వామ్య, రాచరిక పద్ధతికి కొనసాగింపుగా, సన్మానాలు, దుశ్శాలువల స్వీకరణలు, షైరవీరలతో అవార్డులు సాగిసాగి చివరికి హాస్యాస్పదంగా, ఫార్సుగా మారిపోయాయి. పరస్పర భజన బృందాలుగా ఏర్పడిన అత్యల్ప సంఖ్యాక 'సాహిత్య' బృందాల్లో ఒకరినొకరు ఇంద్రులనీ, చంద్రులనీ, మహాకవులనీ పొగుడుకోవడం, సన్మానాలు చేయించుకోవడం సాగి సాహిత్యకారులను ప్రజలనుంచి దూరం చేసేందుకు దారి తీశాయి. ఇట్లా సాహిత్యకారులు సమాజం పట్టని ఏకాంత ప్రాకారాలకు బందీలయి పోయారు. విరసం ఏర్పడడంతో ఇటువంటి సాహిత్యకారుల సాంప్రదాయానికి గట్టి దెబ్బ తగిలింది. సన్మానాలు-శాలువలు సాంప్రదయం సాహిత్యం పేరుమీద చలామణీ అవుతున్న సాహిత్యేతర భజన వ్యవహారమని లోకానికి తెలిసి పోయింది.

విగ్రహ విధ్వంస సాంప్రదాయంలో విరసం స్వయంగా తన విగ్రహాలను కూడా ధ్వంసం చేసింది. ప్రజల మధ్య సంబంధాలు ప్రజాస్వామికంగా ఉండాలని, ప్రజాస్వామ్యమనేది ఎన్నికలకో పార్లమెంటరీ వ్యవస్థలకో చెందినది మాత్రమే కాదని, అది ఒక జీవన విధాన సంస్కృతి అని గుర్తించిన విరసం తన నాయకులకు తయారయిన పీఠాలను కూడా ధ్వంసం చేసింది. మహాకవి యుగకర్త అనిపించుకున్న శ్రీశ్రీ కూడా నిర్మాణంలోని ఇతర సభ్యులతో సమానంగా విమర్శలను క్రమశిక్షణా చర్యలను స్వీకరించవలసి వచ్చినది ఇందువల్లనే.

ప్రక్రియలు: విరసానికి సాహిత్యరంగంలో స్థానం కల్పించిన ప్రక్రియలు కవిత్వం, సాహిత్య విమర్శ అనే చెప్పుకోవాలి. తొలి ప్రచురణలలో కథ, నాటకం, నవల వంటి ప్రక్రియలు ఉన్నప్పటికీ విరసం దృష్టి ఆ ప్రక్రియల మీద ఎక్కువగా కేంద్రీకృతం కాలేదు. విప్లవ భావ ప్రచారానికి అవసరమైన ఉద్వేగభరిత ప్రక్రియగా కవిత్వమే విరసం సభ్యులందరినీ ఆకర్షించింది. అప్పటి నాయకత్వంలో కొడవటిగంటి కుటుంబరావు, రాచకొండ విశ్వనాథశాస్త్రి, కాళీపట్నం రామారావు మినహా మిగతా వారందరూ కవులు కావడం కూడా కవిత్వ ప్రాధాన్యతకు కారణం కావచ్చు. పాట, దృశ్యకళారూపాలు కూడా రంగం మీదకి వచ్చాయి. విరసం తొలి ప్రచురణ 'ఝంఝ'లో అచ్చయిన 'వరుడో! భాస్కరుడా' విరసానికి, విప్లవ సాహిత్యోద్యమానికి పాటల ఒరవడిని పెట్టింది. అంతకు ముందే శ్రీకాకుళ పోరాటంలో వెంపటాపు సత్యనారాయణ, సుబ్బారావు పాణిగ్రాహి, మరెందరో కవులు పాటలను విప్లవోద్యమ అవసరాలకు తగినట్టుగా ఎట్లా మలచాలో చూపి ఉన్నారు. ఈ నేపథ్యం నుంచి విరసం పాట మీద కృషి చేయడం ప్రారంభించింది. 1972-73ల్లో జననాట్యమండలి ఏర్పడి పల్లెసీమల జానపద బాణీల గనులు తవ్వడం ప్రారంభించిన తరువాత పాట, ఇతర కళారూపాలు జననాట్యమండలి ప్రధాన ప్రక్రియలు అయ్యాయి. విరసం సభ్యులుకూడా ఆ సమయంనుంచే పాటలు రాయడం విరివిగా సాగించారు.

ఎమర్జెన్సీ తర్వాత విప్లవోద్యమం ప్రజాపంథాను చేపట్టి, కరీంనగర్, ఆదిలాబాద్ రైతాంగ పోరాటాలు వెల్లువికిన తర్వాత ఆ ప్రజాపోరాటాల వెల్లువ సాహిత్యంలోకి కూడా విస్తరించింది. కరీంనగర్, ఆదిలాబాద్‌ల నుంచి పాట, కథ, నవల విజృంభించాయి. విప్లవోద్యమం అన్ని జీవిత పార్శ్వాలలోకి ప్రవేశించడం ఎట్లా జరిగిందో, ఆయా జీవిత పార్శ్వాల సంక్లిష్టతను పట్టుకోగల కథ, నవల ప్రక్రియల్లోకి విరసం

సభ్యులు ఎక్కువ దృష్టి సారించడం కూడా అట్లాగే జరిగింది. క్రమంగా విరసం విజయం సాదించిన ప్రక్రియల జాబితాలో కథ, నవల కూడా చేరాయి.

సాహిత్య విమర్శకు తొలిసారిగా స్పష్టమైన తాత్విక భూమికను నిర్దిష్టతను అందజేసినది విరసమే. అరసం సాంప్రదాయంలో సాహిత్య విమర్శ అభివృద్ధి చెందినప్పటికీ, ఆ కాలపు ప్రముఖ విమర్శలకు కూడ దృక్పధపు స్పష్టత లేకుండింది. మార్క్సిస్టు సాహిత్య విమర్శా పరికరాలు, ఆకాలపు సాహిత్య విమర్శలో సహజీవనం చేశాయి. మరోవైపు సమీక్షలాంటి, వివరణలాంటి చాలా తేలికపాటి విమర్శే, విశ్లేషణ లేని విమర్శే సాహిత్య విమర్శగా చలామణీ అయింది. విరసం ఈసాంప్రదాయానికి భిన్నంగా సాహిత్య విమర్శను మార్క్సిస్టు తాత్విక పునాదిపై, సామాజిక శాస్త్రాల అవగాహనతో పదునుపెట్టింది.

ప్రక్రియాపరంగా విరసం విఫలమైన ప్రక్రియ నాటకం, నాటిక, విరసంలో ప్రతిభావంతులైన నాటక రచయితలున్నప్పటికీ, బహుశా ప్రదర్శనా అసౌకర్యాలవల్ల విప్లవోద్యమం బలంగావున్న తెలంగాణలో నాటకరంగం అభివృద్ధి చెందకపోవడం వల్ల నాటక ప్రక్రియలో విరసం సాధించవలసినంత సాధించలేకపోయింది. అయితే ఇటీవల కాలంలో విరసం సభ్యులు, స్కిట్, స్ట్రీట్ ప్లేస్ రచించడంలోనూ, ప్రదర్శించడంలోనూ సృజనాత్మకమైన ప్రయోగాలు చేస్తున్నారు.

**సాహిత్య ప్రమాణాలు, శిల్పం:** కొత్త విమర్శా ప్రమాణాల్ని రూపొందించడం గాని, ఉన్నతమైన శిల్ప ప్రమాణాల్ని అభివృద్ధి చేయడంగాని అలవోకంగా సాధించగలిగినవి కావు. తరగని గని అయిన ప్రజాజీవితంలో, జీవన సంఘర్షణతో, సామాజిక ఘర్షణలతో అవినాభావ సంబంధం, స్పష్టమైన దృక్పధం, నిరంతర అధ్యయనం, నిశిత పరిశీలనా దృష్టి అనవతరమైన సాధన మాత్రమే వాటిని సాధించి పెడతాయి. ఈరెండున్నర దశాబ్దాలలో శిల్పంలో, రూపంలో విరసం సాధించిన విజయాలున్నప్పటికీ, విరసం మీద ఉన్న బాధ్యతతో పోల్చినప్పుడు అవి చాలా తక్కువ.

**యాంత్రిక ధోరణి:** శిల్ప, రూప, సాహిత్య సంబంధమైన చర్చలలో చాలాసార్లు యాంత్రికంగా ఉండడం విరసం వైఫల్యాలలో మరొక ప్రధానమైన అంశం. మార్క్సిజం పిడివారం కాదని, అది ఆచరణకు మార్గదర్శి అని నమ్మే విరసం, ఆ అవగాహనతో సాహిత్యాచరణలో ఉన్న విరసం ఇటువంటి యాంత్రికతకు లోను కాకుండా ఉండవలసింది. విరసం శిల్పవాదానికీ, రూపవాదానికీ, శుద్ధ సాహిత్య వాదానికి వ్యతిరేకంగానీ శిల్పాలినీ, రూపానికీ, సాహిత్యాభిరుచికే వ్యతిరేకం కాదు. కాని తన రెండున్నర దశాబ్దాల ఆచరణలో విరసం శిల్పాన్నీ వ్యతిరేకిస్తుందని అనిపించేటట్టుగా చర్చలు నడిపింది. కొన్ని శక్తులు, కొందరు వ్యక్తులు పనిగట్టుకుని విరసం మీద ఇటువంటి దురభిప్రాయాలు, అపోహలు కల్పించడానికి ప్రయత్నించిన మాట నిజమే. కాని విరసం ఆచరణ వల్లకూడా ఇందుకు వీలు కలిగిందని గుర్తించాలి.

**ప్రాప్తకాలజ్ఞత:** ప్రజా పోరాటాల పట్ల ప్రగాఢమైన అభినివేశం, ఆపోరాటాలతో మమేకత విరసం చరిత్రలో ఎంతటి సుగుణాలో వాటిని వెన్నంటే ఒక లోపం కూడా విరసంలో ప్రవేశించింది. సాహిత్యానికి ఉండగల తక్షణ ప్రయోజనాన్ని గుర్తించడంలో అంత దూరదృష్టి అలవరచుకో లేకపోయింది. తక్షణావసరాలను గుర్తించి, ఆ అవసరాలను తీర్చడానికి రచనలు చెయ్యడంలో పడి, విరసం రచయితలు చాలావరకు ప్రాప్తకాలజ్ఞతకు లోనయ్యారు.

**నిబద్ధత:** రచయిత సాహిత్యానికీ, సమాజానికీ జవాబుదారీ కావడమే నిబద్ధతకు స్థూల అర్థం. సాహిత్యానికి జవాబుదారీ కావడమంటే అవసరమైన వస్తువును ఎంచుకోవడం. జనజీవన సంఘర్షణ ఇతివృత్తంగా సాహిత్య సృజన చేయడం. సందేశం ఎక్కువ మందికి అందడానికి అవసరమైన ప్రక్రియలనూ, శిల్పాన్నీ ఎంచుకోవడం, మొత్తం మీద సామాజిక అభివృద్ధిలో పాత్రధారిగా సాహిత్యాన్ని అభివృద్ధి చేయడం. అంటే నానాటికీ ఉన్నతమైన కళాత్మకతను సాధించడం.

రచయిత సమాజానికి జవాబుదారిగా వుండడమంటే సమాజ పురోభివృద్ధికి దోహదం చేయడం. జన జీవనంలో సంఘర్షణను గుర్తించి, ఆ సంఘర్షణలో పురోగామి శక్తుల అభివృద్ధికి తన కలాన్ని, గళాన్నీ వినియోగించడం. వ్యక్తిగత జీవితాచరణలో కూడా తన అక్షరాలకు కట్టుబడి వుండడం.

నిబద్ధతను ఇంత విశాల అర్థంలో గ్రహించి, ఆచరణలో పెట్టగలిగితే విరసం ఎక్కువమంది మిత్రులను సంపాదించుకో గలుగుతుంది. తద్వారా తన ఆశయ మార్గంలోకి ఎక్కువమంది ఆకర్షించగలుగుతుంది.

దళిత, స్త్రీ వాదాలు: ఈదశకం ప్రారంభం నుంచి తెలుగు సాహిత్య రంగంలోకి దళితవాదం, స్త్రీవాదం దూసుకొచ్చాయి. ఈరెండు వాదాల నాయకత్వాలూ విరసం పట్ల తొలినుంచీ ప్రతికూల వైఖరిని ప్రదర్శిస్తూ వస్తున్నాయి. దళితుల, స్త్రీల ప్రత్యేక సమస్యల్ని గుర్తించడంలో విరసం విఫలమయిందనే దగ్గరి నుంచి, విరసం ప్రధాన లక్షణం అగ్రవర్ణ, పితృస్వామ్య భావజాలమేననే వరకూ ఈనాయకుల విమర్శలు సాగాయి. విరసాన్ని, విరసం నాయకత్వాన్ని, విప్లవోద్యమాన్ని పూర్తిగా నెగెటివ్ వైఖరితో చూడడం, మిత్రపూరితమైన, నిర్మాణాత్మకమైన విమర్శనాధోరణి బదులు నిందలతో కూడిన శత్రుపూరిత ధోరణిని అవలంబించడం ఈదళిత, స్త్రీవాద నాయకులు చేశారు, చేస్తున్నారు. ఈవాదాలలో కూడా అనేక పాయలున్నమాట, అన్ని పాయల ధోరణీ ఒకటి కాని మాట నిజమే. కాని విరసం పట్ల అమిత్ర వైఖరిదే బలమైన ధోరణిగా ఉంటూ ఉంది.

ఈ ఊహించని శిబిరం నుంచి, ఊహించనివేళ వచ్చిన దాడిని విరసం సంక్రమంగా ఎదుర్కోలేకపోయింది. ఈశిబిరంలో కొన్ని శక్తులకు నిర్దిష్ట భౌతిక పునాది వుందనే విషయం గ్రహించడంలో ఉదారత్వం వహించింది.

చెరబండరాజు 1975లో రాసిన 'ఏకులమబ్బీ' పాటనుంచి, అంతకు ముందే భూపాల్ రాసిన 'గొల్లకుర్మ గోత్రమింటవా' పాట నుంచి, 1985లో విరసం నిర్వహించిన 'మతవర్గతత్వం' సాహిత్య పాఠశాల, 1986లో ఎ.ఐ.ఎల్.ఆర్.సి. నిర్వహించిన కులం-వర్గం సదస్సు వరకు' ఆతర్వాత విరసం సభ్యుల రచనల్లో విరసం ఆచరణలో కుల సమస్య ప్రస్తావన వుంటూనే వస్తోంది. 1978లో అల్లం రాజయ్య కథలో ఊర్ల చనిపోయిన స్త్రీబొట్టు తొలగించడం గురించిన చర్చ నుంచి, 1984 మార్క్సిజం' సాహిత్యంలో జాతువాడకం, జానకి విముక్తి, భూమి పుత్రిక చర్చల ద్వారా స్త్రీ సమస్య చర్చ, మనకు తెలియని మన చరిత్ర, స్వేచ్ఛ సమీక్షలు మరెన్నో సృజనాత్మక రచనల ద్వారా స్త్రీ సమస్య చర్చ - మొత్తానికి 1990లకు ముందే కనీసం ఒక దశాబ్దానికి పైగా అటు కులసమస్య గురించి, ఇటు స్త్రీ సమస్య గురించి విరసం సాహిత్యంలోను, ఇతర పత్రికలలోను చర్చలు జరిగాయి. ఈ చర్చలు జరగవలసినంత సమగ్రంగా జరగలేదనే మాట, విరసం శ్రద్ధాశక్తులతో ఈచర్చను అభివృద్ధి చేయలేదనే మాట నిజమే. కాని విరసం చేసిందేమి లేదనే తిరస్కారధోరణి ప్రబలుతోంది గనుక ఈవాస్తవాలను పరిగణనలోకి తీసుకోవాలి.

విరసం-ప్రభావాలు: తెలుగు సమాజ, సాహిత్య రంగాలలో ఇరవై ఐదు సంవత్సరాల పాటు పని చేసిన ఒక సాహిత్య, సాంస్కృతిక సంస్థగా విరసం చూపిన ప్రభావాలు ఎటువంటివి?

సమాజం మీదా, సాహిత్యం మీదా విరసం వేసిన ప్రభావాలు చాలా సంక్లిష్టమైనవి. ఈ ప్రభావాలలో అదృశ్యంగా పనిచేసేవి, అస్పష్టంగా వుండేవి వుంటాయి. స్పష్టంగా, కొలవదగిన రూపంలో వుండేవి వుంటాయి.

మొత్తంగా సమాజంలోకి కొన్ని కొత్త భావాలను, కొత్త సంస్కృతిని ప్రవేశపెట్టడంలో విరసం విజయం సాధించింది. అయితే ఆ భావాల వ్యాప్తి, సంస్కృతి విస్తరణలో ఒక సంస్థగా విరసం చేయగలిగినంత చేసి వుండకపోవచ్చు. కాని ఆ భావాలు భౌతిక శక్తిగా మారడంలో విరసం పాత్రకన్నా ఇతర సామాజిక నిర్మాణాల పాత్ర హెచ్చు.

విప్లవ సాహిత్యం తెలుగు సాహిత్య, సాంస్కృతిక రంగాలలో ప్రధాన స్రవంతిగా మారడంలో విరసం విజయం సాధించింది. సాహిత్యచరిత్రలో విస్మరించడానికి వీలులేని అధ్యాయాన్ని విరసం రచించింది. తెలుగు సమాజానికి ఒక విప్లవ మేధావుల బృందాన్ని విరసం సమర్పించింది. ఎట్టి చేతులు ఒక మనిషిని మేధావిగా మలిస్తే, తిరిగి ఆ మేధావి ఆ మట్టి మనుషుల ఋణం తీర్చుకునే సాంప్రదాయాన్ని విరసం నెలకొల్పి బలపరిచింది.

ఈ ప్రభావాలు అదృశ్యమైనవీ, గుణాత్మక మార్పులుగా మాత్రమే గుర్తించగలిగినవీ కాగా, స్పష్టంగా కనబడే ప్రభావాలలో ప్రజాపోరాటాల మీద విరసం ప్రభావం ముఖ్యమైనవి. విద్యార్థి, యువజన, రైతుకూలీ,పౌరహక్కుల, మహిళా, దళిత, గిరిజన, కార్మిక ఉద్యమాలపై విరసం తన ప్రభావాన్ని చూపింది. ఆయా ఉద్యమాలకు సాహిత్యాన్ని అందించింది. ఆయా ఉద్యమాలను సాహిత్యంలో ప్రతిఫలించి ప్రచారం చేసింది. ఆయా ఉద్యమాలకు మద్దతును కూడగట్టడంలో తన కలాన్నీ, గళాన్నీ ఉపయోగించింది. సహకారాన్ని అందించింది. సాంస్కృతిక శక్తిగా ఆయా ఉద్యమాలకు ప్రేరణనిచ్చింది. ఇవ్వాళ దండకారణ్య రచయితలు, బందీకాని గొంతుకలతో రాజకీయ ఖైదీలు, ఎందరెందరో అజ్ఞాతకవులు, రచయితలు విస్తృతంగా సాహిత్య సృష్టి చేస్తున్నారంటే అందులో విరసం పాత్ర లేకపోలేదు.

రచయితలకు, మేధావులకు వుండవలసిన ప్రజా కార్యాచరణను, త్యాగనిరతిని విరసం సమాజం ముందుంచింది. తానొక నమూనాగా నిలిచింది. ప్రజలు రచయితలను, మేధావులను తమలో ఒకరిగా భావించే స్థితిని విరసం కల్పించింది.

('విప్లవ సాహిత్యోద్యమం - విరసం పాత్ర' వ్యాసభాగం, 'అరుణతార' మాసపత్రిక, జనవరి, 1996)

- విప్లవ రచయితల సంఘం

## 10.7 నిషేధాలు; నిర్బంధాలు:

నిషేధాలు, నిర్బంధాలే విప్లవ సాహిత్యానికి అలంకారాలు! విప్లవ రచయితల సంఘం స్థాపన నాటినుంచి తమ ప్రభుత్వ వ్యతిరేక సాహిత్య సృజన వల్ల ఎంతో మంది విప్లవ రచయితలు నిర్బంధాలకు లోనయ్యారు. వారి పుస్తకాలు నిషేధించబడ్డాయి.

విరసం తొలి ప్రచురణ 'ఝంఝ' కవిత సంకలనం, తొలికథాసంపుటని "ఇపుడు వీస్తున్నగాలి"(1971) ప్రభుత్వ నిషేధం చవి చూశాయి. 'మార్చ్' కవితా సంకలనం నిషేధించబడింది. సంకలనకర్త పి. కిషన్‌రావు అరెస్టు చేయబడ్డాడు. 1971లో 'లే' కవితాసంకలనం నిషేధించబడింది.

1970లోనే 'ప్రివెంటివ్ డిటెన్షన్' అనే చట్టం కింద జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, చెరబండరాజులు అరెస్టు చేయబడ్డారు. "విశ్వాసాలకారణంగా ఎవరినీ నిర్బంధించడానికి వీలులేదు" అని జస్టిస్ చినపరెడ్డి చెప్పిన తీర్పుతో వీరు విడుదల అయ్యారు. 1973లో మీసా (MISA) చట్టం కింది ఎం.టి.ఖాన్, చెరబండరాజు, వరవరరావులను అరెస్టు చేశారు.

విరసం ప్రధాన కార్యదర్శి త్రిపురనేని వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు కె.వి. రమణారెడ్డి, చెరబండరాజు ఎం.టి. ఖాన్, వరవరరావు, మొదలైన వారిపై 1974లో ఈకేసు కొట్టి వెయ్యబడింది. ఈసందర్భంగా వెలువడిన 'సృజన' పత్రిక సంపాదకీయం 'నిజానికి ఎవరు ఎవరిపై కుట్రపన్నుతున్నారు?'అని ప్రశ్నించింది.

"ప్రజాస్వామ్యం ముసుగులో ధనస్వామ్యం దోపిడీని రక్షించి పోషించే ఈదేశపు రాజ్యాంగమే ఒక పెద్ద కుట్ర. మాస్కో, వాషింగ్టన్, టోక్యో, బాన్ ఇంకెక్కడెక్కడో తాకట్టు పెడ్డ ఢిల్లీ సింహాసనం ఇందిరా మందహాసం, ప్రతిపలుకూ, శ్వాసా కుట్ర ఈ సింహాసనం పాదాలు కడిగే మంత్రులూ ముఖ్యమంత్రులూ కుట్ర. ఆంతరంగిక భద్రతా చట్టం కుట్ర. దేశ భద్రతా చట్టం కుట్ర. రకరకాల పీడన చట్టాలు కుట్ర. తారు పులుముకున్న ఇక్కడి బజార్లు కుట్ర. బజారు ధరలు కుట్ర. బ్యాంకులు కుట్ర. బ్యాకుల జాతీయం కుట్ర. గరీబీహటావో కుట్ర. ఆకాశవాణి కుట్ర. ఆకాశానికి పడగలెత్తిన కీడలు కుట్ర. ఆఫీసులు కుట్ర. ఎన్నికలు కుట్ర. ప్రణాళికలు కుట్ర. నిన్నగాక మొన్నపేలిన అణుబాంబు కుట్ర. ఈప్రభుత్వమే పెద్దకుట్ర. ఈవ్యవస్థే కుట్ర." (సృజన మాసపత్రిక, జూన్1974)

త్రిపురనేని మధుసూదనరావు, జ్యోతి, భూమన్‌లపై 'తిరుపతి కుట్ర కేసు' మోపబడింది. ఈసందర్భంగా "సాహిత్యం కుట్రకాదు, రచయితలు కుట్రదారులు కారు" అని త్రిపురనేని కోర్టులో ఒక (సాహిత్య) ప్రకటన చేశాడు.

1975లో హైదరాబాద్‌లో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంలో శ్రీశ్రీ, చెరబండరాజు, లోచన్‌లు అరెస్టు చెయ్యబడ్డారు. 1975లో ప్రకటించబడిన అత్యవసర పరిస్థితిలో (ఎమర్జెన్సీ) విరసం కార్యవర్గ సభ్యులంతా నిర్బంధించబడ్డారు.

1977లో విరసం సభ్యుడు జ్ఞానేశ్వర కీర్తి అరెస్టు అయ్యాడు. 'సృజన' సంపాదకుడు వరవరరావు ఎన్నోసార్లు నిర్బంధాల పాలయ్యాడు. 1984లో విరసం సభ్యులు, అభిమానులను హైదరాబాద్‌లో అసెంబ్లీముందు ప్రదర్శన సందర్భంగా సభపై ఆంక్షలు విధించబడ్డాయి. 1985లో పౌరహక్కులు సంఘం నాయకుడు డాక్టర్ రామనాథం హత్యచేయబడ్డాడు. విరసం కార్యదర్శి వరవరరావు జైలు కెళ్లాడు. 1985 తర్వాత ఉత్తర తెంగాణా జిల్లాలలో హుస్నాబాదద్‌లో అమరవీరుల స్థూపావిష్కరణ సందర్భంగా వరవరరావు మొదలైన వారిపై కుట్రకేసు మోపబడింది.

## ఎ) ప్రభుత్వం చేత నిషేధించబడిన కొన్ని విప్లవ రచనలు

1. ఝుంఝు-కవితాసంకలనం, విరసం ప్రచురణ, సంపాదకుడు: కె.వి. రమణారెడ్డి
2. మార్చ్-కవితాసంకలనం, సంకలనకర్త: పి. కిషన్‌రావు,
3. 'లే-కవితాసంకలనం, సంకలనకర్త: సుభాన్, చిత్తూరుజిల్లా విరసం యూనిట్ ప్రచురణ.
4. ఇపుడు వీస్తున్నగాలి-కథాసంకలనం, సంపాదకుడు: కొడవటిగంటి కుటుంబరావు, విరసం ప్రచురణ
5. రక్తగానం-కవితాసంకలనం, చైతన్యసాహితి, అనంతపురం ప్రచురణ.
6. శంఖారావం-గేయసంకలనం, సోషలిస్ట్ పబ్లికేషన్స్,
7. బందూక్-కవితాసంకలనం, చైతన్యసాహితి, అనంతపురం ప్రచురణ.
8. సృజన మాస పత్రిక-1972 మార్చ్, ఏప్రిల్, మే సంచికలు, 1973 ఏప్రిల్ సంచిక, 1974 మే సంచిక
9. పిలుపు-16-11-72 సంచిక, 1-4-73 సంచిక, 1-10-73 సంచిక
10. విమోచన-2సంచికలు
11. భవిష్యత్ చిత్రపటం- కవితా సంపుటి , కవి వరవరరావు, సముద్రం ప్రచురణ.

## 10.8 విప్లవ సాహిత్యంపై విమర్శలు:

విప్లవ కవిత్యోద్యమంపై, ప్రత్యేకించి విరసంపై 1980 దశాబ్ద చివరినుంచి ఎన్నెన్నో విమర్శలు వెల్లువెత్తాయి. సహజంగానే ఒక ఉద్యమం తీవ్రంగా ఉన్నంతకాలం పెద్దగా విమర్శలురావు. ఆ ఉద్యమాన్ని ఎక్కువమంది ఆమోదిస్తూ ఉన్నప్పుడు అందులో లోపాలన్ని బయపడి విమర్శించటానికి ఎక్కువమంది ముందుకు రాకపోవచ్చు. విప్లవ సాహిత్యం కొంత వెనకపట్టు పట్టి, కొన్ని కొత్తధోరణులు తలెత్తగానే, విప్లవ సాహిత్యోద్యమం మీద విమర్శలు చెలరేగాయి.

విరసం రాజకీయ సంస్థ అని, విప్లవ రాజకీయ పార్టీలు తిరిగే మలుపుల్ని బట్టి విప్లవ కవిత్వం కూడ మలుపులు తిరుగుతుందని ఒక విమర్శ. 'విరసం' రాజకీయ సంస్థ కాదని మొదటినుంచి ప్రకటిస్తూనే వచ్చింది. అయితే (సి.పి.ఐ (ఎం.ఎల్. ) చారుమజుందార్ గ్రూప్ రాజకీయాలకు అది మొదటి నుంచి సాహిత్యపరంగా మద్దతు ఇచ్చింది. అది రాజకీయ సంస్థ కాకపోయినా రాజకీయ అనుబంధం విరసానికి లేకుండా పోలేదు. అయితే సాహిత్యానికి రాజకీయాలు అస్పృశ్యం కావు. ఆరెండిటి మధ్య ఒక సరిహద్దురేఖ ఉండక తప్పదు. విప్లవ సాహిత్యోద్యమం రాజకీయ పార్టీల కొంగు పట్టుకుని వెళ్లదని కొడవటిగంటి కుటుంబరావు వంటి మేధావులు పేర్కొన్నా రాజకీయపార్టీ అనుబంధం దానికి ఎక్కువే అని తేలుతుంది. అందుచేతనే మార్క్సిస్టు లెనినిస్టు కమ్యూనిస్టుపార్టీలో వచ్చిన చీలికలను బట్టి విరసం కూడా చీలుతూ వచ్చింది. 1975లో అనంతపురంలో జరిగిన విరసం మహాసభ సందర్భంలో జ్వాలాముఖి, నిఖిలేశ్వర్ విరసం నుంచి వేరయ్యారు. 1985లో మరోసారి విరసం నుంచి కొందరు వేరయ్యారు. విరసానికి సమాంతరంగా 'జనసాహితి', 'ప్రజారస' వంటి సంస్థలు ఏర్పడ్డాయి. ఏసంస్థకైనా ఒడిదుడుకులు తప్పవు. అయితే విరసం సంస్థలోని మొదటినుంచి ఉన్న కఠినవైఖరి వలన సంస్థలోని సభ్యుల మధ్య ఎన్నో

విభేదాలు తలెత్తుతూ వచ్చాయి. మార్క్సిస్టు, మావో ఆలోచనా విధానం లేని వాళ్లంతా ప్రతిపక్షం వాళ్లే అనే ధోరణి విరసానికే నష్టం కలిగించింది.

విప్లవ కవిత్వం నినాదప్రాయమైందని, 'కొట్టు, నరుకు, చంపు' అనే నినాదాలుంటే విప్లవ కవిత్వం అయిపోతుందని కొంతమంది విమర్శించారు. ఇస్మాయిల్, ఇంద్రకంటి శ్రీకాంత్‌శర్మ వంటి కవులు రాజకీయ మాలిన్యం లేని స్వచ్ఛమైన అనుభూతి కవిత్వం రాయాలని ప్రకటించారు. శ్రీకాంతశర్మ కవిత్వాన్ని పరిచయం చేసిన అజంతా "ఆధునికాంధ్ర సాహిత్య చరిత్రలో ఇది కవిత్వాన్ని బాహాటంగా నడివీధిలో ఉరితీస్తున్న రోజులివి". అని ఆవేదన చెందారు. గుంటూరు శేషేంద్రశర్మ నాయకత్వంలో ఏర్పడిన 'కవిసేన' మనిఫెస్టో కూడ "సామాజిక చైతన్యం ముసుగుకింద వీరవిహారం చేస్తున్న శిల్పరహిత అనే నిత్య మలినాన్ని దేశంనుంచి క్షాళనం చెయ్యాలని ప్రబోధించింది.

అయితే ఏరాజకీయపు అంటు, సొంటు లేని అచ్చమైన, స్వచ్ఛమైన, కవిత్వం ఎక్కడైనా ఉంటుందా అన్నది ప్రశ్న. నన్నయ భారతంలో రాజరాజనరేంద్రుడు ఆమోదించిన వర్ణాశ్రమ ధర్మాలు లేదా అని ఎదురు ప్రశ్న వేస్తారు విప్లవ సాహిత్యాభిమానులు. కవి కాళిదాసు రాజులకు అనుకూలం కావటం చేతనే వృత్తాంతం ద్వారా దుష్యంతుడిని సమర్థించడం జరిగిందని సరోజ్‌దత్తా లాంటి విప్లవ కవులు విమర్శించారు. ఏ కవి అయినా తనకు తెలిసో తెలియకో ఏదో ఒక రాజకీయ/వర్గ/వర్ణ భావజాలానికి అనుకూలంగా ఉంటాడు. సాహిత్యం అంతటా ఈపాక్షికత్వం కనిపిస్తూనే ఉంటుంది. కాలం చెల్లిన వర్ణ వ్యత్యాస సిద్ధాంతాల్ని విచక్షణా రహితంగా ఆమోదించటానికి లేని అభ్యంతరం సోషలిస్టు సిద్ధాంత భావాన్ని ఆమోదించటానికి ఉండటమే ఆశ్చర్యం.

ఇక 'నినాదం-కవిత్వం' అనే అంశాన్ని పరిశీలిస్తే ఉద్యమ సందర్భాల్లో ఒక్కొక్కసారి సాధారణ వాక్యాలే గొప్ప కవిత్వ చరణాలుగా ప్రజానీకానికి ఉత్తేజం కలిగించటం చరిత్రలో చూస్తాం. అందులోని భావోన్మీలనం ఆశక్తి నిస్తుంది.

1905 ప్రాంతంలో 'వందేమాతరమ్' అనే దేశభక్తి గీతచరణం మహానినాదమైంది. నిజానికి పదానికి 'తల్లీ! నీకు నమస్కారం' అనే అర్థం తప్ప మరేమీ లేదు. అదేవిధంగా భగత్‌సింగ్ ఇచ్చిన ఇంక్విలాబ్! జిందాబాద్!' అనే నినాదం కూడా గొప్ప యువతరంలో స్ఫూర్తి కలిగించింది. విప్లవోద్యమ కాలంలో "విప్లవాల యుగం మనది, విప్లవిస్తే జయం మనది" (చెరబండరాజు), "లాల్‌సలామ్, లాల్‌సలామ్" (గద్దర్) అనే సాధారణ పదాలు గొప్ప నినాదాలై, గొప్పకవితా పాదాలై స్ఫూర్తి నిచ్చాయి. అయితే తతానంత భావోన్మీలనం లేనప్పుడు నినాదాలు నినాదాలుగానే మిగిలిపోతాయి. ఆవిధమైన కవిత్వం కూడా కొంత విప్లవోద్యమంలో వచ్చిన మాట నిజం.

విప్లవ కవిత్వం సాయుధ పోరాటం అనే ఏకైక అంశానికి పరిమితమై మూస పద్ధతిలోకి పోయిందని ఇంకో విమర్శ వచ్చింది. ఇది కొంతవరకు వాస్తవమే. ఒక ఉద్యమావేశం తీవ్రంగా ఉన్నపుడు దానికి సంబంధించిన అంశాలే కవిత్వంలో ముఖ్య వస్తువులవుతాయి. భావకవిత్వ, అభ్యుదయ కవిత్వ దశల్లో ఇదే సంగతి కనపడుతుంది. అయితే విప్లవం కేవలం వర్గపోరాటానికి పరిమితం కాదని, అది జీవితంలో అన్ని అంశాల్ని స్పృశించి మౌలిక చైతన్యం కలిగించాలని గ్రహించాలి. ఈ అవగాహన లేకపోవటం వల్ల విప్లవ కవిత్వం మాటికి తొంభైపాళ్లు 'వర్గపోరాటం' అనే అంశానికే పరిమితమైంది. అయితే ఆపరిమితిలోనే ఎంతో వైవిధ్యం కవులు చూపించగలిగారు.

విప్లవ సాహిత్యానికి మూలచోదక శక్తి మార్క్సిస్టు సిద్ధాంతం. 'మార్క్స్, లెనిన్, మావో ఆలోచనా విధానం' తన మూలసూత్రంగా విరసం ప్రకటించుకుంది. అయితే ఒకక విదేశ సిద్ధాంతాన్ని తెచ్చి ఇక్కడి పరిస్థితులకు అన్వయించటం తగదని, స్వదేశ సమస్యల్ని పరిష్కరించటానికి స్వదేశ సిద్ధాంతమే సరైనదని కొంతమంది అభిప్రాయం. అయితే ఒక సిద్ధాంతం స్వదేశమా, విదేశమా అనేది సమస్యకాదు. అది ఆచరణ సాధ్యమా, కాదా అనేది ప్రమాణంగా పరిశీలించాలి. మార్క్సిజం చెప్పిన వర్గపోరాటం అనేక దేశాల్లో సఫలమై, సోషలిస్టు వ్యవస్థ సాధించబడింది.

విప్లవ కవిత్వంలో అత్యున్నత భావ తీవ్రత, ఊహాబలం ఉన్న కవితలు వచ్చినట్టే ప్రబోధ ప్రాయమైన, జీవనశక్తి రహితమైన కవితలు కూడా వచ్చాయి. తొలిదశలో 'తూర్పు, తూర్పుగాలి, అడవి, ఎరుపు, రక్తం, ఖడ్గం' మొదలైన మాటలు ప్రత్యేక అర్థంలో సంకేత పదాలుగా మంచి స్ఫూర్తి నివ్వగలిగాయి. అయితే రానురాను చాలమంది కవులు అవే మాటల్ని పదేపదే పునరావృతం చేయటం వల్ల కవితల్లో సరికొత్త స్ఫూర్తి తగ్గింది. ఇదంతా మూస కవిత్వం అనే విమర్శకూడా ఇందువల్లే వచ్చింది.

ఇక విప్లవ సాహిత్యంలో పాటను గురించి కొంత మంది విమర్శించారు పాట ప్రాథమికంగా జానపదగేయం కాబట్టి ఆధునిక కవిత్వ ప్రక్రియగా అది పనికి రాదని విమర్శించారు. పాట పాత రాతి యుగానిదని పురాణం సుబ్రహ్మణ్య శర్మ వంటి సాహితీవేత్తలు పరిహాసం చేశారు. అయితే విప్లవ సాహిత్యోద్యమంలో పాట ఒక ప్రబలశక్తిగా ఆవిర్భవించిందన్న మాట సత్యం. శివసాగర్ 'నరుడో భాస్కరుడో!' పాట మొదలు గద్దర్, చెరబండరాజు, వంగపండు ప్రసాదరావు, భూపాల్, అల్లం నారాయణ మొదలైన వాళ్ల పాటలు ప్రజల్ని ఉర్రూతలూపాయి. భావావేశం, లయ, బాణీ, గాన మాధుర్యం మొదలైన లక్షణాలు ఇందుకు కారణాలు, అంతేగాక వాటిల్లో కవిత్వ గుణాలకు లోటులేదు. ప్రజాసామాన్యం దగ్గరకు చేరటానికి పాటవంటి కళారూపం కంటె యుగయుగాలనుంచి మానవ జాతిని అలరిస్తూనే వుంది.

1980 దశాబ్దం మధ్యనుంచి స్త్రీవాద, దళిత వాదాలు సాహిత్యరంగంతో ప్రవేశించాయి. తద్వారా కొత్తకొత్త ఆలోచనలు ప్రారంభమయ్యాయి. కొత్తకొత్త ప్రశ్నలు తలెత్తాయి. విప్లవ కవిత్వం సామాజిక ఆర్థిక, రాజకీయ లక్ష్యాల గురించి ఆలోచించినంతగా ఇతర విషయాల గురించి మొదలైన సమస్యలు విప్లవ సాఫల్యంతో పరిష్కరించబడతాయని విప్లవ సాహిత్యోద్యమం నమ్మటం వలన ఆవిషయాల గురించి ప్రత్యేకంగా సాహిత్య సృష్టి జరగలేదు. అయితే విప్లవం నెరవేరేంత వరకు స్త్రీలు, దళితుల పరిస్థితి ఏమిటి అనే ప్రశ్న సహజంగానే తలెత్తింది. మార్క్సిస్టులు, విప్లవ రచయితలు ఈసమస్యలను పట్టించుకోలేదని విమర్శకులు ఆరోపించారు. ఆసమస్యలను పరిష్కరించటానికి మార్క్సిజం చాలదని ప్రకటించారు. విప్లవ సాహిత్యాన్ని విమర్శించారు. ఈ విమర్శకుల్లో ఎక్కువమంది పూర్వాశ్రమంలో మార్క్సిస్టులై ఉండటం విశేషం.

## 10.9 1980 అనంతర (విప్లవ) కవిత్వం:

విప్లవ కవిత్వంలో 1980 తర్వాత రెండోదశ ప్రారంభమైనట్టు గుర్తించవచ్చు. తొలితరం విప్లవకవులు శ్రీకాకుళోద్యమ ప్రభావంతో ప్రారంభమైన తర్వాత విప్లవకవులు తెలంగాణా రైతాంగ పోరాటాల స్ఫూర్తి పొందారు. సరికొత్త రీతిలో విప్లవ భావాలు ప్రకటించారు. వీరిమీద పరోక్షంగానో, ప్రత్యక్షంగానో తెలంగాణాలో ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో జరుగుతున్న రైతాంగపోరాటాల ప్రభావం ఉంది. ఆ ప్రభావం కేవలం తెలంగాణాకే పరిమితంగానే అన్ని ప్రాంతాలకు ప్రసరించింది. ఫలితంగా 1980 దశకంలో కలం పట్టిన ప్రతికవి అంతో ఇంతో విప్లవ భావ పూరిత కవత్వం రచించాడు. అయితే ఈ కవులు కేవలం వర్గపోరాటం వరకే పరిమితంగాకుండా మానవ సంబంధాలు స్త్రీ పురుష సంబంధాలు, యాంత్రిక జీవనం, పరాయితనం మొదలైన మరెన్నో అంశాలను పరామర్శించారు. అంతేగాకుండా ఇంద్రవెల్లిలో గిరిజన సభపై పోలీసుల కాల్పులు, భోపాల్ విషవాయు దురంతం, రాజస్థాన్‌లో సతీసహగమనం, ఇందిరాగాంధీ హత్య సందర్భంలో కల్లోలాలు, తునికాకు పోరాటాలు, గని కార్మికుల సమ్మెలు, రైతుల ఆత్మహత్యలు, పోలీసు దురంతాలు, సోవియట్ యూనియన్ విచ్ఛిన్నత, స్త్రీ సమస్యలు, వ్యక్తిగత అనుభవాలు మొదలైన ఎన్నో సంఘర్షణలకు ఈతరం కవులు ప్రతిస్పందించారు. ఈవిధంగా ఈకవిత్వంలో ఎంతో వస్తు విస్తృతి కన్పిస్తుంది.

'అడవి ఉప్పొంగిన రాత్రి' అనే కవితాసంపుటి రచించిన విమల ఇందిరాగాంధి హత్య సందర్భంగా సిక్కులు ఊచకోత మీద 'కన్నతల్లి' అనే కవిత రచించింది. వంటింటి కుందేళ్లుగా స్త్రీలను అణిచి వేయటంపై 'వంటిల్లు' అనే కవిత రచించింది. స్త్రీలను సౌందర్య సాధనాలుగా పరిగణించటాన్ని నిరసిస్తూ 'సౌందర్యాత్మక హింస' అనే కవిత రాసింది.

దిగంబర కవిగా తన కవితా ప్రస్థానం ప్రారంభించాడు దేవిప్రియ. 'సమాజానంద స్వామి'తో వ్యంగ్య కవిగా గొంతు సవరించిన దేవిప్రియ అమ్మచెట్టు, నీటిపుట్ట, తుఫాను తుమ్మెద, దేవిప్రియ కవిత్వం, గరీబు గీతాలు మొదలైన సంపుటులెన్నో రచించాడు. 1989 కాలంలో సోవియట్ యూనియన్ మొదలు దేశ దేశాల్లో సోషలిస్టు వ్యవస్థలు కుప్పగూలుతున్నప్పుడు

"ఇది ప్రజాస్వామ్య శిలలమీద
ఎర్రపూలు రాలుతున్న ఋతువు
ఇది శిరసులు వికసించిన అగ్ని సరస్సులని మాయం చేయడానికి

"సాగుతున్న ఆధునిక శత్రువు"

అని సామ్రాజ్యవాద దేశాల కుట్రను బహిర్గతం చేశాడు.

నందిని సిధా రెడ్డి 'భూమిస్వప్నం, సంభాషణ, సోయి' మొదలైన కవితాసంపుటలు రచించాడు.

"ఇల్లు ఖాళీ చేసినంత తేలిగ్గా
జీవితాన్ని ఖాళీ చెయ్యలేం కదా"

అంటూ తెలంగాణా పల్లెల్లో ప్రజలు పోలీసుదాడులకు భయపడి ఊళ్లు ఖాళీచేయటం గురించి రాశాడు.

"విపణి వీధి వేయికోరల రాకాసి
అంచనాలు తలకిందులు చేసి
ఆయుస్సంపద కబళించి ఎముకలు వేలం వేస్తుంది"

అంటూ రైతులపై జరిగే మార్కెట్ దోపిడిని వర్ణించాడు. 'ప్రతిఘటన-పదఘట్టన' అనే దీర్ఘ ఉద్యమకారుల్ని వర్ణించాడు. నవరవీరుడు బాణం ఎక్కుపెట్టినట్లు వ్యవస్థపై తన కవిత్వం ఎక్కుపెడుతున్నానన్నాడు.

"జీవితాన్ని మార్చేవాడు మనిషి
మనిషి అమరుడు
అమరుడైన మానవుడి అంతస్సారమేమిటి?
జీవితం చలనం
జీవితం జ్వలనం" (స్తబ్దత-చలనం)

అని పాపినేని శివశంకర్ చలన శీలతని మనిషి సారాంశంగా గుర్తించాడు. 'వరం, శాపం అయిన జీవితంలో ఆలోచన అనివార్య యాతన అన్నాడు. దోపిడి పాలవుతున్న రైతుల పక్షం వహించి తన ఆకాంక్షను ఇట్లా వెల్లడించాడు.

"మట్టిగుండె చప్పుళ్లతో
హింసా సింహాసనాల్ని బీటలు గొట్టాల్సిందే
ఎర్రకోటపై ఒక దుక్కి దున్నిన చెయ్యి
ఎర్రకోటపై జెండా ఎగరెయ్యాల్సిందే" (బెట్ట)

జీవన వీచిక, ప్రవాహం ముఖాముఖం, వేళ్ల మాట్లాడేవేళ అనేక కవితాసంపుటాల్తో ప్రసిద్ధైన కవి దర్భశయనం శ్రీనివాసాచార్య. సరళమైన వ్యక్తీకరణ అతని పద్ధతి. కెన్ సారో వివా అనే నల్లజాతి కవిని ఉరితీసినప్పుడు శ్రీనివాసాచార్య ఈవిధంగా ప్రశ్నించాడు.

"పచ్చదనాన్ని కలగనకుండా
ప్రపంచం బతికిందెపుడు
బతికే కల పేరు కెన్ సారో వివా!....
నియంతలు ఎడారుల్ని ప్రేమిస్తారు
వీరులు చెట్టై వీస్తారు
భూమ్మీద ఎన్ని చెట్లనురితీస్తారు?"

1997-98 కాలంలో తెలంగాణాలో వందల రైతులు పంటలు పండక, పండినా గిట్టుబాటు ధరలు లభించక ఆత్మహత్యలు చేసుకున్నారు. ఎక్స్‌గ్రేషియా కోసం ఈఆత్మహత్యలు జరుగుతున్నాయని ప్రభుత్వాధికారులు, నాయకులు దారుణంగా వ్యాఖ్యానించినప్పుడు కొండేపూడి నిర్మల 'కాటిసుంకం' అనే కవిత రాసింది.

"సంపేటోడికి సచ్చేటోడు లోకువ గదన్నా
వాడట్టనే గునుగుతడు
కాటి సుంకాల కోసం రైతు కరువు సెయ్యి సాపాడంట
కొండ కూలిన నష్టం ఆడిచ్చే ముదనష్టంతో తీరుద్దా"

"డీక్యూమనైజేషన్! డీహ్యూమనైజేషన్
గాజుసీసా గాజుసీసా
రక్తంతో నిండిన సెలైన్ సీసా మనిషి
నగరం మీదెవరో పగల గొట్టారు
మానవ దరహాస మహాకాశ పతాకంలో నిప్పులు పోసి
నగరం నడిబొడ్డున ఆవిష్కరించారు".

అని వసీరా ఆధునిక మానవుడు హింస, ద్వేషం, ఓట్ల రాజకీయాలు, యాంత్రిక జీవనం మధ్య అమానవుడుగా మారుతున్న క్రమం ఆత్మాశ్రయంగా (Subjeetive) వివరించాడు. 'లోహనది', 'మరోదశ' అనే కవితాసంపుటులు వసీరావి.

"విద్యార్థి చీకటి బతుకుల్ని
విద్యుదీకరించలేని విశ్వవిద్యాలయాల్నీ
విస్తృతమౌతున్న కాగితపు బెడారుల్నీ
అధ్యయనం చెయ్"

అన్నాడు అవిశెట్టి ప్రభాకర్. 'తనును పుండై ఎందరికో పండై' రాలిపోయే వేశ్యల దయనీయ జీవితాన్ని సానుభూతితో అధ్యయనం చేశాడు.

"సమస్త మానవాళి ఆశ్చర్యపడేలా ఒక్కసాహసం చెయ్యాలి" ఎవరి రక్తచలనంతో వారు ఖడ్గ చాలనం చెయ్యాలి" అన్న త్రిపురనేని శ్రీనివాస్ 'రహస్యోద్యమం' కవితాసంపుటి రచించాడు. పాటలను నిషేధిస్తున్న పరిపాలకుల గురించి నారాయణ స్వామి 'కల్లోల కలల మేఘం'లో ప్రశ్నించాడు. వచ్చినప్పటి పరిస్థితి గురించి ఆశారాజు

"ఒంటరి తనం రంపం కోతకన్నా
లాకప్‌లోని చిత్రహింసల కన్నా
అర్ధరాత్రి దహించే జ్ఞాపకాల కన్నా
ములాఖాత్ గదిలో కెళ్లటం చాలా దుర్భరం"

అనే వర్ణించాడు. ఈకవి 'నేపథ్యం', ఒక తడిగీతం, చిల్మన్, బద్నాం మొదలైన కవితాసంపేటులు వెలువరించాడు.

ఇంకా కందుకూరి శ్రీరాములు, సౌదా, దామోర రాములు, కృష్ణమూర్తి యాదవ్, సౌభాగ్య, ఛాయరాజ్, వజ్జల శివకుమార్, కాట్రగడ్డ దయానంద్, నాళేశ్వరం శంకరం, కొప్పర్తి, అరణ్యకృష్ణ, సతీష్ చందర్, కౌముది, గౌతమ్, ఇంద్రవెల్లి రమేష్ మొదలైన వందలమంది కవిలు 1980 దశాబ్దంలోను ఆతర్వాత కలం పట్టి విప్లవ కవిత్వాభిమానంతో రచనలు చేస్తున్నారు. 1970లో మొదలైన విప్లవ కవితాశకం రెడు దశాబ్దాలు మహోధృతంగా సాగింది. ఇప్పటికీ అనేక రీతుల్లో వెలువడుతూనే వుంది.

కవిత్వం ఒక అగ్నిజ్వాల. 1980 దశకంలో మరీముఖ్యంగా తొలిదశలో విప్లవకవి అగ్నిస్పర్శ చేశాడు. ఆగ్రహ రచన చేశాడు. ఈకాలంలో తెలంగాణా రైతాంగ భూమి పోరాటాల నేపథ్యంలో విప్లవ సాహిత్యోద్యమం విస్తరించింది. తక్కిన ధోరణుల మాదిరికాక ఈసాహిత్యోద్యమానికి సమాజ మూలాలైన ఆర్థిక రాజకీయాంశాలతో సూటి సంబంధం ఉంది. పునాదిని ప్రభావితం చెయ్యగల శక్తి ఉంది. ఉద్యమం తెలంగాణా కవులకు ఊపిరి నిచ్చినట్లే ఇతర ప్రాంతాల కవులకి ఉత్సాహమిచ్చింది. కవిని సాంస్కృతిక సైనికుణ్ణి చేసింది. నిబద్ధతనీ నిమగ్నతనీ నేర్పింది. ఈనేపథ్యంలోనే ఆధునిక కవి నూత్న వర్తమానం అందుకున్నాడు. 'మనిషి యుద్ధరంగం అంతరంగాన్ని చూడగలిగాడు'.

వర్గజాడ్యాల్ని వదుల్చుకొని అవర్గీకరణ (Declassification) చెందటం విప్లవకవి సాధించిన ఒక గొప్పవిలువ. కవి వ్యక్తిత్వానికీ ప్రజావ్యక్తిత్వానికీలడం తగ్గటం ఈవిలువలోని సారాంశం. ప్రజలకు నేర్పే కవి ప్రజలనుంచి నేర్చుకునే వాడయ్యాడు.

శ్రమకీ బుద్ధికీ మధ్య ఏర్పడిన శత్రువైరుధ్యాన్ని కవి పసిగట్టాడు. సమస్త కళల వెరక గల శ్రమ మూలాన్ని గమనించాడు. పట్టణంనుంచి పల్లెదాకా, పల్లెనుంచి అడవిదాకా-నల్లరేగడి దేహాల గిరిజనులదాకా-శ్రమ ఫలితం కొల్లగొట్టబడే వైనం గ్రహించాడు. 'ప్రజల జీవిత విధానమూ, అధ్యయనమూ, అనివార్యమైనా అవసరమూ పోరాటం" అని గుర్తించాడు. 'కవిత్వం ఆయుధమై యుద్ధభూమిలో గొంతు విప్పాల్సి ఉంది' అని తన సంకల్పాన్ని చాటి చెప్పాడు.

తన కవితా వస్తువు అంతిమంగా ఏ ప్రజా ప్రయోజనం కోసమో తెలుసుకున్నప్పుడే విప్లవ కవి రూపవాదాన్ని తిరస్కరించాడు.

"అందం నన్ను మోసం చేస్తుంది
నాకు తెలీకుండానే నాపద్యం వెనక దాక్కుంటుంది.
నేను సంఘంలో బీభత్సాన్ని చెప్పేప్పుడు
నా గొంతును దారిమళ్లించి
సౌకుమార్యంలోకి దింపుతుంది". (గుడిహాళం రఘునాధం, పద్యంలో ఇమడాల్సిన అందం)

కాబట్టి కవితలో ఇమడాల్సిన అందం జీవన వాస్తవికతేగాని, దాన్ని మరుగుపరిచి మోసగించే మాటల గారడీకాదు. రూపం, సారాంశంగా సౌందర్య భరితం చేసే అంశం. రూపాన్నీ సారాంశంగా భ్రమించినప్పుడు కవి పూర్తి సౌందర్య వాదిగా మారిపోతాడు. వాస్తవికత నుంచి చల్లచల్లగా జారిపోతాడు. కాబట్టి వ్యక్తీకరణ నైపుణ్యం, అలంకారాలు, వర్ణనలు, చమత్కారాలు మొదలైన రూపసంబంధ పదార్థాలు కవిత్వంలో ప్రధానం కాదని వస్తువే ముఖ్యమని విప్లవ కవిత్వం నిర్ధారించింది.

ప్రజలనుంచి ప్రజల్లోకి అనే మావో సూత్రాన్ని పాటించింది విప్లవ సాహిత్యోద్యమం. విప్లవ కవులు, రచయితలు అట్టడుగు జనం బతుకు లోతుల్లోకి తొంగి చూశారు. ఆ పరిశీలనని తిరిగి ప్రజలకు చూపించటానికి ప్రజల భాషే అవసరమైంది. కనుక ప్రాంతీయతని. భాషా మాండలికాలనీ విప్లవ సాహిత్యోదమం అధ్యయనం చేసింది. ఈ ఉద్యమ దృక్పధంలో భాగంగానే కాళీపట్నం రామారావు, అల్లం రాజయ్య మొదలైన వాళ్ల కథలు, గద్దర్, వంగపండు మొదలైన వాళ్ల పాటలు, కళారూపాలు ప్రాంతీయమాండలికాల్లో వెలువడ్డాయి.

సాంస్కృతిక భావజాలానికి సంబంధించి విప్లవ సాహిత్యోద్యమం పునరుద్ధరణ, సంస్కరణ, హేతు, నాస్తిక్, మానవతావాదాలన్నిటినీ తిరస్కరించింది. ఈవాదాలూవీ సవజం పునాదిలో మార్పు తేలేవని, కమ్యూనిజం మాత్రమే ఆపని చేయగలుగుతుందనీ స్పష్టం చేసింది. ఈవిధంగా సమాజంలో అంతకుముందు నుంచి వ్యాప్తిలో ఉన్న రకరకాల భావజాలాలనుంచి ఒక విచ్ఛిత్తి (Break away) కోసం విప్లవ సాహిత్యోద్యమం ప్రయత్నించింది.

విప్లవ సాహిత్యోద్యమం గతకాలపు విలువలను ధ్వంసం చేసే క్రమంలో పాతకాలపు పాటని అంటే జానపద గేయాన్ని ఆయుధం చేసుకుంది. గద్దర్, భూపాల్, వంగపండు, వర్గీస్ మొదలుగా ప్రజ్ఞాకళాకారులు శ్రామిక జీవితాల్లోని పాటల బాణీలనే తీసుకొని వాటిని చికిలి చేసి, అభివృద్ధి చేసి ఉద్యమానుగుణంగా వాడుకున్నారు. విప్లవ సాహిత్యంలో పాట ఎంత ప్రధాన స్థానం ఆక్రమించిందంటే వచనకవితల్లో కూడ పాటలోని లయ చోటు చేసుకుంది. శివసాగర్ 'ఉద్యమం నెలబాలుడు', వరవరరావు 'సముద్రం', ఎన్.కె. 'లాల్ ఎనో గులామీ చోడో బోలో వందేమాతరం' మొదలైన వచన కవితల్లో సమాన ధ్వని సంపుటులు, లయ, యతి, ప్రాసలు మొదలైన పాట లక్షణాలు స్పష్టంగా కన్పిస్తాయి.

విప్లవ సాహిత్యోద్యమం సాహిత్యం యొక్క సాధన ప్రతిపత్తిని గుర్తించినంతగా సాధ్య(లక్ష్య) ప్రతిపత్తిని గుర్తించలేదని పిస్తుంది. అంటే సాహిత్యాన్ని ప్రత్యేక స్వాతంత్రగల కళగా భావించి, అత్యాధునికమైన మార్పుల్తో రచన రూపాన్ని, శిల్పసౌందర్యాన్ని ప్రత్యే శ్రద్ధతో అభివృద్ధి చెయ్యలేదని భావం. బహుశా ఆపని విప్లవోద్యమం యొక్క తక్షణా వసరం కాకపోవటకు ఇందుకు కారణమై ఉండొచ్చు. అందువల్ల ఇప్లవ సాహిత్య వస్తువులో కన్పించే 'రాడికల్' లక్షణం రూపంలో అంతగా కన్పించదు.

సమాజంలో అసమానతలు ఉన్నంతకాలం, దోపిడి సాగుతున్నంతకాలం మార్క్సిజం యొక్క ఆవశ్యకత, విప్లవ సాహిత్య ఆవశ్యకత తప్పనిసరి. కవులు దుర్మార్గ వ్యవస్థపై తమ ప్రశ్నల్ని సంధిస్తూనే ఉండాలి. ఒక నూతన ప్రపంచ ఆవిష్కరణకై ప్రయత్నిస్తూనే ఉండాలి.

శ్రీశ్రీ 'మహాప్రస్థానానికి' 'యోగ్యతా పత్రం' ఇచ్చిన చలం అన్నట్టు "తనకి, ప్రపంచానికి మధ్య సామరస్యం కుదిరిందాకా కవి చేసే అంతర బహిర్ యుద్ధారావమే కవిత్వం"

కవిత్వం మరణవేదనలో పునర్జన్మ
అది నరాల తీగలపై జ్వాలా మూర్ఛన
శబ్ద సమ్మేళనలో సంఘర్షణలో భావ విస్ఫోటన.

## సమీక్ష :

అభ్యుదయ సాహిత్యము తదుపరి జనించిన విప్లవ సాహిత్యమును గురించి, వివిధ రచయితల మనోభావాలను వారి సంపుటాలను, వాటిపై విమర్శలను, 1980 తర్వాత వచ్చిన విప్లవ కవితా రీతులను అధ్యయనం చేశారు.

# అనుబంధము

**కొన్ని ప్రముఖ విప్లవ భావ కవితా సంపుటులు**

1. ఝంఝు, లే, మార్చ్ సంకలనాలు
2. కాంతి యుద్ధం, దిక్సూచి, పల్లవి - చెరబండరాజు
3. సముద్రం, స్వేచ్ఛ, ముక్త కంఠం - వరవరరావు
4. తూర్పుగాలి, కొయ్య గుర్రం - నగ్నముని
5. ఉద్యమం నెలబాలుడు - శివసాగర్
6. గద్దర్ పాటలు - గద్దర్
7. జననాట్య మండలి పాటలు
8. భారమితి, మోహనా! ఓమోహనా!, అజేయం-కె. శివారెడ్డి
9. మరో ప్రస్థానం - శ్రీశ్రీ
10. స్తబ్దత-చలనం. ఒక సారాంశం కోసం-పాపినేని శివశంకర్
11. భూమి స్వప్నం, సంభాషణ, ప్రాణహిత - నందిని సిధారెడ్డి
12. ప్రవాహం, ముఖాముఖులు - దర్భశయనం శ్రీనివాసాచార్య
13. కవిత్వంపై ఎర్రజెండా - విరసం
14. మరో ఝంఝు - విరసం
15. రహస్యోద్యమం - త్రిపురనేని శ్రీనివాస్
16. కల్లోల కలల మేఘం - నారాయణ స్వామి
17. దిగంబర కవితాసంకలనాలు -3
18. అడవి ఉప్పొంగిన రాత్రి - విమల
19. లాల్ బనో గులామీ ఛోడో వందేమాతరమ్ - ఎన్.కె.
20. నేపథ్యం - ఆశారాజు
21. శ్రీకాకుళం - ఛాయరాజ్

22. లోహనది - వసీరా
23. దిష్టిబొమ్మ - పి. విద్యాసాగర్
24. అమ్మ చెట్టు, నీటిపుట్ట - దేవిప్రియ
25. రహస్యోద్యమం - త్రిపురనేని శ్రీనివాస్
26. లావా - హెచ్చార్కె
27. గోదావరి లోయ - నమ్ము
28. 'ఈతరం యుద్ధకవిత' - సంకలనం

## కొన్ని ప్రశ్నలు

1. విప్లవ కవిత్వోద్యమం తెలుగు కవిత్వానికి చేసిన దోహదం ఏమిటి?
2. విప్లవ కవిత్వం తెలుగు కవిత్వంలో తెచ్చిన మార్పును విశ్లేషించండి?
3. మీకు నచ్చిన నలుగురు విప్లవ కవులను పేర్కొని వారి కవితలను పరామర్శించండి?
4. విప్లవ కవిత్వంపై వచ్చిన విమర్శలను పేర్కొని వారి కవితలను పరిశీలించండి?
5. విప్లవ కవిత్వం మూస కవిత్వం అనే విమర్శ సమంజసమేనా? పరిశీలించండి?
6. గద్దర్ పాటల్ని విశ్లేషించండి?
7. విప్లవోద్యమంలో పాట ప్రాధాన్యం ఎటువంటిది?
8. అనంతర విప్లవ కవిత్వంలోని వైవిధ్యం పరిశీలించండి?
9. విప్లవ కవిత్వోద్యమంలో విరసం పాత్రను చర్చించండి?
10. మీకు నచ్చిన నాలుగు విప్లవ కవితా సంపుటల్ని పేర్కొని వాటి ఔన్నత్యాన్ని హేతుబద్ధంగా వివరించండి?

## ఆధార గ్రంథాలు :


1. ఝుం ఝుం, లే, మార్చ్ సంకలనాలు
2. కవిత్వంపై ఎర్రజెండా - విరసం
3. దిగంబర కవితా సంకలనాలు - 3


డా. పాపినేని శివశంకర్

పాఠం - 11

# తెలుగులో పాశ్చాత్య కవితా ధోరణులు

**పాఠ్య నిర్మాణ క్రమం :**

11.0 ఉపోద్ఘాతం
11.1 ఫ్యూచరిజం
11.2 డాడాయిజం
11.3 అనార్కిజం
11.4 ఇమేజిజం
11.5 సింబాలిజం
11.6 ఎక్స్‌ప్రెషనిజం
11.7 సర్రియలిజం

**లక్ష్యం :**

కాల్పనిక వాదానికి వ్యతిరేకంగా తలెత్తిన కవితా ధోరణులను పరిచయం చేయడం. పాశ్చాత్య కవితా ధోరణుల ప్రభావం తెలుగు సాహిత్యంలోని నవ్య కవులమీద ప్రసరించిందని నిరూపించడం.

## 11.0 ఉపోద్ఘాతము :

ఆధునిక యుగంలో శాస్త్రాలతోపాటు కళలు, అనేక విధాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. తత్వశాస్త్ర, మనస్తత్వ శాస్త్రాలయందు అనేక పరిశోధనల ఫలితంగా అనేక సిద్ధాంతాలు ఆవిర్భవించాయి. సాంఘిక రాజకీయ రంగాలయందు అనేకములైన వాదాలు బయలుదేరాయి. ప్రాథమికంగా ఇవి సాహిత్యపరమైన సిద్ధాంతాలుకావు. కాని క్రమ క్రమంగా వీని ప్రభావం సాహిత్య రంగానికి కూడా వ్యాపించాయి. నవ్య కళా సిద్ధాంత వివరణకు ఈ అంశం ముఖ్యంగా గుర్తింపవలసి ఉంది.

ఏ దేశమందైనా కళలు మొదటినుండీ ఎట్టి మార్పు లేకుండా ఒకే విధంగా ఉండవు. కాలక్రమాన ప్రజల అభిరుచులనుబట్టి అనేక విధాలుగా మారుతుంటాయి. యూరప్ ఖండంలో కొంతకాలం గ్రీకు-లాటిన్ కావ్యాలే ఆదర్శ ప్రాయంగా భావింపబడటం చేత సంప్రదాయబద్ధమైన ఉదాత్తతయే కవులకు ఆరాధనీయమైంది. తరువాత దానిపై తిరుగుబాటు కాల్పనిక కవిత్వం (Romanticism) ప్రాచుర్యం వహించింది. కానీ అదికూడా ఆ విధంగా ఉండలేదు. కవుల, కళాకారుల అభిరుచులను అనుసరించి దానికి భిన్నమైన వాదాలు అనేకం వచ్చాయి. ఇవి ఒక కవిత్వమందేకాక చిత్రలేఖనాది అన్య కళలయందును వ్యాపించాయి. అవి తొలుత యూరపు ఖండమందలి అన్ని భాషల్లో వ్యాపించి ఆంగ్లంతో ఖండాంతర దేశాలకు కూడా ప్రాకాయి.

పాశ్చాత్య సాహిత్య రంగంలో ముందుగా ఫ్రాన్సు దేశం అనేక నూతనమైన కవితా రీతులకు ప్రయోగశాల అయింది. కాల్పనిక వాదానికి వ్యతిరేకంగా ఈ దేశంలో అనేక కవితా ధోరణులు తల ఎత్తాయి. ముఖ్యంగా చిత్రకళలో జరిగిన కొన్ని ప్రయోగాలు క్రమంగా సాహిత్యానికి అనువర్తితమైంది. ఫ్రాన్సులో ఈ శతాబ్ది తొలిదశకంలో పొడచూపిన కళా సంబంధమైన ఉద్యమాల్లో క్యూబిజం, ఇంప్రెషనిజం, ఫ్యూచరిజం, డాడాయిజం, సర్రియలిజం, ఇమేజిజం, సింబాలిజం, ఎక్స్‌ప్రెషనిజం, ఎగ్జిస్టెన్షియలిజం. మొదలైనవి పేరొ న గగినవి

చిత్రాలను బుద్ధికి అందేటట్లుకాక కంటికి కన్పించేట్లు చిత్రించడాన్ని ఇంప్రెషనిజం అంటారు. దూరంగా ఉన్న అడవిని చిత్రించాలంటే చెట్లను ఆకుపచ్చగా, నీడలను నల్లగా చిత్రించడం సంప్రదాయం. ఇంప్రెషనిజం ఈ అభిప్రాయాన్ని త్రోసివేసింది. ఈ తెగకు చెందిన చిత్రకారుడు చెట్లను ఎరుపు (purple) రంగులో, నీడలను నీలిరంగులో చిత్రించి నవ్యతను ప్రదర్శించాడు. బాగా దూరంగా ఉన్న అడవుల్లోని చెట్లు ఎరుపురంగులో, నీడలు నీలిరంగులో కన్పించటం ప్రత్యక్షానుభవానికి సన్నిహితమైన లక్షణం. సంప్రదాయానికన్నా ప్రత్యక్షానుభవానికే ప్రాధాన్యమిచ్చిన ప్రయోగమిది. ఇది సింబాలిస్టుల ఉద్యమానికి సైదోడుగా పుట్టిన ఉద్యమమే.

ఇంప్రెషనిజం తర్వాత ఫ్రెంచి కళారంగంలో తలయెత్తిన ఉద్యమము క్యూబిజం. దీనికి పికాసో నాయకుడు. నీగ్రోకళ ప్రభావంతో వెలువడ్డ ఉద్యమమిది. దృశ్య ప్రపంచాన్ని 'cubes' కోణాకృతులుగా విడదీసి చిత్రించడం ఈ ఉద్యమ లక్ష్యం. ఈ తెగ చిత్రకారులకు వర్ణమేళనంపై, రేఖా విన్యాసంపై శ్రద్ధ ఉండదు. ప్రకృతిలోని 'అపురూపమైన' అంశాలను చిత్రించటంలోనే వీరికి ఆసక్తి అధికం. మొదట (Geometrical figures) రేఖా కృతులతో ప్రారంభ[illegible] క్యూబిక్ చిత్రకళలో క్రమంగా చిత్ర రూపంలో మౌన సంగీతం (Pictorial lyricism) మార్మికత, పొడచూపింది. స్పష్టతకు దూరమై భావవైశద్యం కోల్పోయినప్పటికినీ, ఈ చిత్రకళ వాద్య సంగీతంలాగా హృదయ స్పందకమైంది. ప్రథమ ప్రపంచ యుద్ధంతో ఇది ఆగిపోయింది. యుద్ధానంతరం ఈ కళారీతిలోని అంతస్సారం సర్రియలిజంలో లీనమై పోయింది. కవితా రంగంలో ఈ ఉద్యమాలు ప్రత్యక్షంగా వెలువడకపోయినా, పరోక్షంగా వీని ప్రభావం నవ్యకవులపై ప్రసరించింది. ఏ విధంగా తెలుగు కవులపై ప్రసరించిందీ పరిశీలించడమే ఈ వ్యాస ముఖ్యోద్దేశం.

ప్రస్తుతం పైన పేర్కొన్న ఉద్యమాల్లో ఈ క్రింద పేర్కొన్న ఉద్యమాలను గురించి సోదాహరణంగా వివరిస్తాను.

| | | |
|---|---|---|
| 1. | ఫ్యూచరిజం | (భవిష్యద్వాదము) |
| 2. | డాడా యిజం | (విధ్వంసక వాదము) |
| 3. | అనార్కిజం | (అరాజకవాదము) |
| 4. | ఇమేజిజం | (భావ చిత్రవాదము) |
| 5. | సింబాలిజం | (ప్రతీకవాదము) |
| 6. | సర్రియలిజం | (అధివాస్తవికత) |
| 7. | ఎక్స్ప్రెషనిజం | (అభివ్యక్తీకరణ) . |

## 11.1 ఫ్యూచరిజం (భవిష్యత్ వాదం)

ఫ్యూచరిజాన్ని తెలుగులో భవిష్యత్ వాదం అంటారు. ఇది మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో పుట్టింది. దీనికి ఆద్యుడు ఇటలీ దేశపు రచయిత అయిన 'మారినెటి' (Marinetti) 1909లో ఇటలీలో 'మారినెటి' అనే రచయిత నాయకత్వంలో 'Futurist Manifesto' ప్రకటింపబడింది. ఇది రాజకీయాలలో ఫాసిస్ట్ ఉద్యమం వంటిది. అంతేగాక కేవలం అరాచక వాదాన్ని, లేదా విధ్వంసక వాదాన్ని లక్ష్యంగా కలిగినటువంటిది.

పాత బొమ్మల్ని చూచి ఆనందాన్ని ప్రకటించడం ఎట్లాంటిదంటే శవంలో జీవం పోయుటం వంటిదనీ, గత చరిత్ర జ్ఞానం కేవలం విషయంతో సమానమనీ, గ్రంథాలయాల్లోని పుస్తకాలకు నిప్పంటించాలనీ, ఏటి కాల్వలను మ్యూజియాల్లోకి మరలించి వానిని ముంచి వేయాలని, సమస్త కళారూపాలను, సాహిత్య సృష్టిని ధ్వంసం చేయడం, ఆ విధంగా ధ్వంసం చేయబడ్డ శిథిలాలమండే నూతన సృష్టి వెలువడుతుందని ఫ్యూచరిస్టు ప్రణాళిక సూచించింది. శతాబ్దాల తరువాత తన సర్వశక్తులను వినియోగించి, శ్రమించి సృష్టించిన సర్వ కళాఖండాలను, కావ్యాలను, కాల్చి బూడిద చేస్తేకాని ప్రపంచం బాగుపడదని వీరి సిద్ధాంతం. పుష్కిన్, డాస్టోవస్కీ, టాల్‌స్టాయ్ ముగ్గురు మహా రచయితల రచనలను వీరు నిందించారు. ప్రపంచానికి యుద్ధమొక్కటే ఆరోగ్యాన్ని ప్రసాదించే వరమని వీరి ప్రణాళిక యొక్క ఉద్దేశ్యం.

యంత్ర నాగరికత దీనికి విషయం. అంటే చలన చిత్రాలనుండి, వార్తాపత్రికల శీర్షికలనుండి, యంత్రాలనుండి కవితా వస్తువును స్వీకరించమని ఉద్బోధించింది. యాంత్రిక నాగరికతను ఆవహేళనాత్మకంగా చిత్రించడం, యుద్ధోన్మాదం, స్త్రీ-పురుష లింగ విచక్షణారాహిత్యం, విపరీతమైన ధనాసక్తి, క్రీడాసక్తి, జీవితంలో యంత్రవేగ నిరూపణము ఇందలి ప్రధానాంశాలు. దీనిని ఆదరించి ప్రచారం చేసిన వారిలో 'క్లాడ్ ఫ్లైట్' 'విండ్ హామ్ లూయిస్' ప్రముఖులు. ఈ వాదమునందలి ప్రధానాంశము యాంత్రిక వేగ నిరూపణము కాబట్టి సాహిత్యంలో కూడా ఆవేగాన్ని చూపటానికై శైలిలో కొన్ని మార్పులు వచ్చాయి.

ఉదాహరణకు క్రియాపదాల్ని భావార్థకంలో మాత్రమే వాడటం, విశేషణాలు లేకుండా ఉండటం, విరామ చిహ్నాలు లేకుండటం, ధ్వన్యనుకరణము, గణిత శాస్త్రాల నుండి సంజ్ఞలను గ్రహించి యధేచ్ఛగా వాడటం మొదలుగాకలవి భవిష్యత్ వాదుల సాహిత్య శైలిలోని ప్రధానాంశాలు. దీనికి నాయకుడైన మారినెట్టీ ధ్వనులే సంగీతమని, మాటలే కవిత్వమని, రంగులే శిల్ప చిత్రాలని ప్రకటించాడు. ఇతని ట్రిపోలి యుద్ధం అను గేయము కేవలం ధ్వన్యనుకరణాలతో నిండి ఉంది.

మేరినట్టీ లేవనెత్తిన ఈ ఉద్యమం ఎంతో కాలం సాగలేదు. కానీ ఇతని స్వప్నాన్ని హిట్లర్ సత్యంగా మార్చాడు.

1912లో రష్యా దేశమున ఈ ఉద్యమం మొలకెత్తింది. 'A slap in the face of public taste' (ప్రజల అభిరుచికి ఒక చెంపపెట్టు) అనే పేర ఆ సంవత్సరంలో ఫ్యూచరిస్టు మానిఫెస్టో ప్రచురింపబడింది. దీనిపై సంతకం చేసినవారిలో మైకోవస్కీ ఒకరు. గతమంతా బూడిద కుప్పయనీ, గతంలోని భాషను వాడరాదనీ, ప్రణయం, సాహసం, మొదలైన వస్తువులు పనికిరావని ఈ ప్రణాళిక ఘోషించింది. మైకోవస్కీ వంటి రచయితలు తొలుత ఈ ఉద్యమాన్ని ఆమోదించినా కొద్ది కాలంలోనే ఈ దృక్పథాన్ని మార్చుకొని ప్రజా సారస్వతాన్ని సృష్టించారు.

## 11.2. డాడా యిజం (విధ్వంసక వాదము)

**11.2.1. డాడా యిజం ఆవిర్భావ స్థితి :** డాడా యిజము ప్రథమ ప్రపంచ యుద్ధం ప్రసాదించిన దుష్ఫలితాల్లో వెలువడ్డ ఉద్యమం. దీన్ని తెలుగులో విధ్వంసక వాదము లేక అరాచకవాదంగా చెప్పవచ్చు. ఇంకా దీన్ని పరమ అసహ్య వాదమని శ్రీ కురుగంటి సీతారామయ్యగారు అన్నారు. అరాచకాన్ని సృష్టించటమే దీని ప్రధాన ప్రయోజనం. యుద్ధ కాలంలోని అరాచకస్థితి ఫలితంగా యువకుల మనస్సులు ఉద్రిక్తాలను, ఉన్మత్తాలు కాగా వెలువడ్డ ఉద్యమం ఇది. ఆ కాలంలో కొందరు యువకులు యుద్ధాల్లో పాల్గొనేవారు. వయసు చాలక యుద్ధంలో పాల్గొనలేని యువకులు యుద్ధరంగంలో క్షత గాత్రులై తిరిగి వచ్చినవారు, నిరాశా నిస్పృహలతో కుంగిపోయి విపరీతమైన అశాంతితో సంచరిస్తుండేవారు, పూజా మందిరాలు, విద్వేషాగ్నిని, హత్యాకాండలను రెచ్చగొట్టేవారు వీరికి స్పష్టమైన దారిలేదు. నిర్దిష్టమైన గమ్యంలేదు. అరాజక పరిస్థితులు ఎక్కడ చూచినా వారికి ఎదురైనాయి. కళలు, సారస్వతం యుద్ధ ప్రచారక సాధనాలైపోయాయి. భవిష్యత్తు చీకటి గొయ్యిగా, వర్తమానం పాతాళకుహరంగా కనిపించసాగింది. నైతిక విలువలు నశించిపోయాయి. నిర్మూలనత్వమే వారి ధ్యేయం. కానీ, వారికి నిర్మాణాత్మకమయిన కాంక్ష పొడచూపలేదు. ఎటుచూచినా క్రోధం, వైరం, నిరాశా అలుముకున్నాయి. అట్టి అరాజక పరిస్థితుల్లో ఆవిర్భవించిన విధ్వంసక వాదాన్నే డాడా యిజం అంటారు.

**11.2.2. డాడా యిజం అనే పేరు ఎలా వచ్చింది :** 1916 ఫిబ్రవరి 8వ తేదీన జ్యూరిచ్ నగరంలో ట్రిస్టన్ జారా (Tristan Tzara) అనే అతడు ఈ ఉద్యమాన్ని ప్రారంభించాడు. దీనికి నామకరణం కూడా చాలా విచిత్రంగా జరిగింది. కళ్ళు మూసుకుని 'జారా' ఒక నిఘంటువును తెరిచాడట. తెరచి చూడగానే మొట్టమొదట 'డాడా' అనే పదము తనకి కనిపించిందట. డాడా అంటే ఫ్రెంచిలో ఆటవస్తువు అని అర్థం. అర్థ రహితము, అరాజకమునగు తమ నూతనోద్యమానికి ఆ పేరే సముచితమైనదని అతడు భావించాడట. తత్ఫలితంగా ఈ వాదానికి 'డాడాయిజము' అనే పేరు వచ్చింది.

**11.2.3. డాడాయిస్టుల లక్ష్యం :** క్యూబిస్టు గ్రూపులోని ఎపోలీనియర్, (Apollinaire) జాకబ్ (Jacob) మున్నగు కవులు ఈ డాడాయిజంవైపు మొగ్గు చూపారు. 1918 నాటికి 'Dadaist Manifesto' కూడా ప్రచురింపబడింది.

డాడాయిజం ఒక తాత్త్విక దృక్పథమో లేక సాహిత్య సిద్ధాంతమోకాదు. ఫ్యూచరిజంలాగా నిరాశనుండి, కసినుండి ఉద్భవించిన కుక్కగొడుకు వంటిది. డాడాయిస్టులు తాము ప్రదర్శించు అరాజకప్రవర్తనతోనే ఆత్మ తృప్తిని పొందారు. ఈ తృప్తి ఎలాంటిదంటే ఎదుటివారి శరీరంపై సూదులు గ్రుచ్చి ఆనందించే ధోరణికి చెందింది. ఈ డాడాయిష్టులకు సాంఘికములగు కట్టుబాట్లు లేవు. నైతికములగు విలువలు లేవు. ఒక మార్గం లేదు. ఒక లక్ష్యం లేదు. అధిక్షేపాన్ని, అవహేళనాన్ని దూషనాన్ని సాధనాలుగా చేసుకున్నారు. లోకంలో పైకి వచ్చిన ప్రతి సాంఘికాదర్శాన్ని వీరు తూలనాడారు. లోకాన్ని వికృతంగా చూడటం, అయోమయత్వం వీరి ప్రధాన గుణాలు. తమ ధ్యేయమేమిటో తమకే తెలియదని వీరంగీకరించారు. ఇట్టి వాదమెంతకాలం నిలుస్తుంది. పుబ్బలో పుట్టి మఖలో మాసిపోవు ఉద్యమాలివి.

1920లో ఫ్రాన్సిస్ పికాబియా (Francis Picabia) అనే డాడాయిష్టు ఇలా అంటాడు.

"You do not understand, of course what we are doing! well; my dear friends; we understand is still less; How wonderful, isn't that you are right!... you don't understand ? neither do I; how sad! (From cubism to surrealism in Frenche Literature page 171).

**11.2.4. డాడాయిష్టుల సాహిత్య లక్షణాలు :** డాడాయిష్టు సారస్వతంలో వస్తువుగానీ, భావంగానీ రచనా క్రమంగానీ లేవు. అర్థరహితమైన వాక్య విన్యాసం, అయోమయములైన శీర్షికలు ఈ సాహిత్య లక్షణాలు. కొంతకాలం సమాజంలో గందర గోళాన్ని లేవదీయటానికి తప్ప ఇది సాధించిందేమీలేదు. డాడాయిష్టులు అప్పుడప్పుడు సమావేశాలేర్పరచి ప్రేక్షకులను కుళ్ళిన కోడిగ్రుడ్లతో కొట్టేవారట. తమ సమావేశాలు ఎంతగా అల్లరి పాలైతే అంతగా జయప్రదమైనట్లుగా భావించేవారట.

1921 ప్రాంతంలో ఆంద్రీబ్రితూ (Andre Breton) ముష్నగువారు ఈ ఉద్యమం నుండి తప్పుకున్నారు. పిమ్మట ఇది క్రమంగా 'న్యూయార్కు, బెర్లిన్' కొలొన్, పారిస్ నగరాల్లో ఈ డాడా సిద్ధాంతం ప్రాకింది. ప్రఖ్యాత కళాకారులు ఈ సిద్ధాంతాన్ని వైచిత్రికై ప్రయోగ ప్రాయంగా వాడుకొన్నారు. డాడా వాదుల్లో చిత్రకారుడైన కర్ట్స్విటర్స్ (1887-1948) ప్రముఖుడు. కళాకారుడు తుమ్మినా, దగ్గినా కళయే అని ఇతని సిద్ధాంతం. డాడా సిద్ధాంతం ముఖ్యంగా నైరాశ్యాన్ని కలిగించింది. ఈ నైరాశ్యం ఆనాటి ఐరోపా సాహిత్యంలోనే కాక లలిత కళలన్నింటిలో కూడా ప్రతిబింబించింది.

కొడిగట్టి ఆరిపోతున్న ఈ డాడాయిజం నుండే సరిక్రొత్త తేజస్సుతో సర్రియలిజం (Surrealism) వెలువడింది.

## 11.3 అరాచక వాదము (Anarchism)

**1.3.1 అరాచకవాద లక్ష్యం :** పాశ్చాత్య సాహిత్య లోకంలో వెలువడ్డ ఫ్యూచరిజం, డాడాయిజం అనే యీ రెండూ అరాజక వాదానికి సంబంధించిన ఉద్యమాలే. గత విధ్వంసనం, భవిష్యత్తు పట్ల అవిశ్వాసం డాడాయిజం యొక్క లక్షణాలు. ఫ్యూచరిజానికి గతంతోపాటు వర్తమాన నిరసనం కూడా ప్రధాన ధ్యేయం. ఈ రెండింటికి గత ద్వేషము సమానమే. ముఖ్యంగా ఈ రెండింటిలో డాడాయిజం అరాజకవాదాన్ని, అధికంగా ప్రేరేపించింది. అక్షర విన్యాసంలో భావనారీతిలో భాషాప్రయోగంలో, జీవిత వైఖరిలో డాడాయిష్టులు అరాజకాన్ని ప్రదర్శించారు. ఈ డాడాయిష్టు గీతాన్ని ఒకసారి పరిశీలించండి.

'La ..... di ...... da ........ da
.... di ....... da ......... da
..... ........ ..... da ..... da
.... ..... ...... ....... dum.
why do French men
woo a woman
as if women
never resisted'.

ఇందులో అర్థం లేని శబ్దాలు, అనవసరమైన గీట్లు, punctuation marks (విరామ చిహ్నాలు) గమనింపదగింది. శ్రీశ్రీ వ్రాసిన 'న...న....న.... నత్తి మాటలు' 'హూష్ హూష్' అనే కేకలు డాడాయిజంతో ప్రభావంతో వెలువడ్డవే. డాడా యిష్టులు జీవితం పట్ల ప్రదర్శించిన

అరాజక స్థితిని మన తెలుగు కవులు కూడా అనుకరించారు. 'పూషా' వ్రాసిన 'కల్చర్ అండ్ అనార్కీ' అనే గేయంలో ఈ ధోరణి స్పష్టంగా కన్పిస్తుంది. (ప్రతిభ - సంపుటి - 5, సంచిక - 2.)

1.3.2. అరాజకవాద కవితా రచనలు :

ఈ గేయంలో కవి
'ఒక్కొక్కడికీ యొవడి వాడికి
నాలుగ్గోడల నడిం ప్రపంచం : కల్చర్ - కంచం; మంచం:
యొవడికి వాడికి యొవడిది వాడిది:
'మా యింట్లో నేనొక pools - 'shaw' ని; షర్నాని: నాదిర్షాని!
నీ యింట్లో నువ్వొక Go - 'wells' గోబెల్స్ వి: గోరింగ్ టాంగ్ వి!

అని 'కంచము, మంచమే' సంస్కృతియన్నాడు. ఎవనికి వాడే గొప్పయని, సాంఘిక మూల్యాలు, నైతికపు విలువలన్నవి లేవని ప్రబోధించారు.

'దొరకని దాన్ని దొరికినదాన్ని కొరుక్కుంటాం.
పొకర్ణీకరం మహా కసిగా పసగా నరుక్కు తింటాం'!

ఈ చరణాల్లో సంఘంలోని అరాజక వ్యవస్థను కవి అధిక్షేపించటానికి ప్రయత్నిస్తున్నట్లు కన్పిస్తాడు. కాని బురద వాడిగా రాయి విసిరితే అది విసిరిన వాని ముఖానే చిమ్మినట్లుగా, కవి చిత్రించ దలచుకొన్న అరాజక స్థితి తానే ప్రబోధిస్తున్నట్లు గోచరిస్తుంది. ఈ గేయంలోనే ఇంకొక భాగాన కవి

'మనిషికి లవ్ ఆఫ్ మదర్ కంట్రీ
జీవితానికి ఆర్ట్ అండ్ పొయిట్రీ
అక్కర్లేదు! అన్ నెసిసరి'

అని కళలతోపాటు దేశ భక్తిని కూడా నిరసిస్తాడు. ఈ గేయం చివర్లో

'జాతులు బాసలూ దేశాలూ
ఖండాలూ సముద్రాలు గోళాలూ
అరాజకంలో అనార్కీలో
విప్లవ విలయ ప్రళయ జ్వాలలో
భగ్నం భుగ్నం మగ్నం నగ్నం కావాలి!
వర్షాంతర ప్రశాంత శారదనభానికి
దేర్ యీజ్ వోన్లీ వన్ ఫిట్ టెస్ట్
సర్వైవల్ ఆఫ్ ది ఫిట్టెస్ట్'

అని సంఘంలో అరాచక స్థితి ఏర్పడి తరతరాలుగా పెరిగిన మానవ సంస్కృతి బుగ్గిపోవాలని, 'కర్రయున్న వానిదే బర్రె' అని అవినీతి ప్రేరకాలైన అభిప్రాయాలను ప్రకటించాడు. ఏ ఉద్దేశ్యంతో వ్రాసినా ఈ గేయం అరాజక ధోరణికి ప్రతిబింబంగానే ఉంది. కె.వి. రమణారెడ్డిగారి 'అడవి'లోని 'సత్యం, శివం, సుందరం' అనే గేయంలో కూడా అరాజక ధోరణులు కన్పిస్తున్నాయి.

"నిందిస్తున్నాను నేను పరిశుద్ధమైన గ్రంథాన్ని
..........................................................
నిందిస్తున్నాను నేను దిగంబర న్యాయాన్ని
..................... మంగళసూత్రాన్ని
నిందిస్తున్నాను నేను.

నెమలి సింహాసనాన్ని; తాజమహలు శిల్పాన్ని

పిరమిడ్‌ను..............................."

విప్లవ దృష్టిపేర ఈ కవి అరాజకత్వాన్ని ప్రేరేపించటం వాంఛనీయంకాదు.

శ్రీశ్రీ, వరద, ఆరుద్ర - ఈ ముగ్గురు కలిసి రచించిన 'మేమే' అనే గేయ సంపుటి ఈ అనారోగ్యకరమైన ధోరణికి అసలైన ప్రతిబింబం. 'ఏ సోడా ఏనీళ్ళూ, పీసం కూడా కలుపక విస్కీ సానాయాసంగా త్రాగు' 'ఏసు'కు (ఏల్చూరి సుబ్రహ్మణ్యానికి) ఈ కావ్య సంపుటి అంకితం చేయబడింది. వ్యక్తిగతమైన అలవాట్లను రచ్చకెక్కించే ధోరణి ఇందులో స్పష్టంగా కన్పిస్తుంది. 'సీసా పయినేగా మన ధ్యాస హమేషా' అన్న వాక్యం దానికి ప్రోద్బలకంగా ఉంది. అంకిత గేయంలాగానే ఈ సంపుటంలోని గేయాలన్నీ అవినీతికీ, అరాజకతకు, ఉన్మత్త ప్రవర్తనకు మచ్చుతునకలుగా ఉన్నాయి. 'బమ్మెర పోతులం', 'అల్లసాని వాడలం' అనే పంక్తుల్లో వీరు ప్రాచీన కవులను అవహేళన చేశారు. 'భగవంతుని వితంతువులం', ఎదిగీ యెదగని లంజలం' వంటి అసభ్యోక్తులను గుప్పించారు.

'అక్షయ పాత్రలో ఉమ్మేద్దాం

మక్షికాని మింగి తుమ్మేద్దాం' -

వంటి అవినీతికరమైన, జుగుప్సావహమైన భావాలు వెల్లడించారు. శబ్ద చమత్కారపు మోజులో పడి, అంత్య ప్రాసల గారడీకి లోనై వ్యక్తావ్యక్త మనఃస్థితికి దాసులై చేసిన రచనయిది. ఏ దృష్టితో రచించినా ఇది అరాజక ధోరణికి ప్రతినిధిగానే ఉంది. అయితే ఇట్లాంటి రచనలను అతి నవ్యకవులు ఆదరించలేదు. ప్రజలు ఈ కవిత్వాన్ని ఆదరించలేదు. అందువల్ల ఈ విధమైన ఒకటి రెండు రచనలు వచ్చినప్పటికీ అవి మఖలో పుట్టి పుబ్బలో మాడిపోయాయి.

పాశ్చాత్య దేశాల్లో లాగా తెలుగు దేశంలో డాడాయిజము వంటి ధోరణులు ఉద్యమ రూపంలో రాలేదు. అప్పుడప్పుడు హఠాత్తుగా రేగి కండ్లలో దుమ్ము చల్లిపోయే సుడిగాలిలాగా ఈ ధోరణి ఒకరిద్దరు కవుల్లో ప్రవేశించి, ఒకటి రెండు రచనలను మాత్రం చేయించింది. పాశ్చాత్యుల అంధానుకరణంతో ప్రారంభమైన ధోరణి కాబట్టి ఇది తెలుగు దేశంలో నిలువలేక పోయింది. సంప్రదాయ వాసనలేని ఏ ధోరణియైనా నిలబడటం కష్టం.

## 11.4. ఇమేజిజమ్ (భావచిత్ర వాదం)

**11.4.1. ఉపోద్ఘాతం :** ఆంగ్ల సారస్వతంలో కాల్పనికోద్యమం తర్వాత వెలువడ్డ ఉద్యమాన్ని 'విక్టోరియనిజమ్' అంటారు. కొంత కాలానికి యీ 'విక్టోరియానిజమ్' కూడా కొత్తదనాన్ని కోల్పోయి ప్రతిధ్వని క్రింద పరిణమించింది. పలుకుబడుల్లో, పదబంధాల్లో, రచనా రీతిలో గతానుగతికమైన ధోరణి ప్రబలింది. ఈ తెగకు ప్రతికూలంగా Edwardian School, Georgian School తల ఎత్తాయి. కానీ ఈ తెగలు కూడా ప్రతిక్షణం పరివర్తనాత్మకమై ప్రబలమైన అభిరుచులకు తృప్తిని కలిగించలేక పోయాయి. ఈ తెగలన్నిటికి ప్రతిగా 'ఇమేజిజమ్' పొడసూపింది. ఆధునిక సాహిత్యోద్యమాల్లో ఇది ఒకటి.

**11.4.2. ఇమేజిజమ్ - నామౌచిత్యం :** తెలుగులో దీనికి సరియైన పదం లేనే లేదనేది ఒక అభిప్రాయం ఉంది. ఆంగ్లంలో కూడా వాచ్యార్థాన్ని బట్టి చూస్తే 'ఇమేజిజమ్' అనే పదం తత్ వాద లక్షణాలకు అనుకూలంగా లేదు. అందుకే 'ఎజ్రాపౌండ్' (Ezra Pound) స్వీయ వాదానుసారంగా 'Image' అనే పదాన్ని నిర్వచింపవలసి వచ్చింది. వాచ్యార్థమే సరిపడితే ఇకప్రత్యేకంగా లక్షణ నిర్దేశం అనావశ్యకం కదా!

'ఇమేజ్' అనే పదానికి తెలుగులో 'పదచిత్రమే' అర్థమైతే 'ఇమేజిజమ్'కు భావ చిత్రవాదం అని పలువురు ప్రయోగించారు. 'ఇమేజ్' అనే పదానికి ప్రతిమ, ప్రతికృతి, ప్రతిబింబం, బింబము, రూపము మొదలగు అర్థాలున్నాయి. ఇవన్నీ వాచ్యార్థాలే. ఎజ్రాపౌండ్ చెప్పినట్లు మనం ఈ పదాలకు కూడా విశిష్టార్థాన్ని చెప్పి ప్రయోగించవచ్చు. కానీ ఆ పదాల వాడకంలో కొన్ని చిక్కులున్నాయి. 'ఇమేజిజమ్' అంటే కేవలం రూపకల్పనకు సంబంధించిన సిద్ధాంతం కాదు. ఈ పదానికి తెలుగులో సరియైన పదం లేదు. అయినప్పటికీ ఉన్నదాన్లో 'భావచిత్రవాద' మనే పేరే ఉత్తమమైంది.

11.4.3 'ఇమేజ్' నిర్వచనం :

ఇమేజ్ అనే పదానికి అనేక విధాలైన అర్థాలున్నాయి.

i) A reproduction or imitation of the form of a person or thing'

ii) Any likeness of an object produced on a photographic material'

iii) Something introduced to represent something else that it strikingly resembles or suggests.

ఇవన్నీ webter's seventh New Collegiate Dictionary ఇచ్చిన నిర్వచనాలు. అంటే ఒక వ్యక్తినిగాని, ఒక వస్తువునుగాని అనుకరించి ఆ రూపాన్ని ప్రదర్శించేది. లేక ఏదో ఒకదాన్ని ప్రవేశపెట్టి ప్రదర్శించునపుడది మనో భావానికి ప్రతిరూపంగా ఉండేది. దీన్ని తెలుగులో పదచిత్రమని అన్నారు. చిత్రకారుడు రంగుల పద సమ్మేళనంతో కుంచె సహాయంతో అద్భుతమైన చిత్రాలను చిత్రిస్తాడు. అదేవిధంగా కవి పద ప్రయోగాలచేత మూర్తిని వర్ణించటాన్నే పదచిత్రంగా చెప్పుకోవచ్చు.

2) దీనికి ఎజ్రా పౌండ్ ఇచ్చిన నిర్వచనమిది.

"An image is that which presents an intellectual and emotional complex is an instant of time" (The Trend of Modern Poetry) I use the termes 'Complex' rather in the technical sense, employed by the newer psychologists such as 'Hart' though we might not agree absolutely in our application.

ఇక్కడ Complex అనే పదానికి అసాధారణ మానసిక స్థితి అని అర్థం. ఏక కాలంలో బౌద్ధికమును ఆ వేగ భరితము, చేయుటం. లేక రసభావాత్మకమగు అసాధారణ మానసిక స్థితిని క్షణమాత్రంలో ప్రకటించే దాన్ని 'ఇమేజ్' అనబడుతుంది. అట్టి మానసిక స్థితిలో మానవుడు దేశకాల పరిస్థితులకు అతీతంగా స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తాడు. ఉత్తమోత్తమమగు కళాఖండాన్ని సమీపించినపుడు హఠాత్తుగా మనకు కలిగే అభ్యుదయానుభూతే అది. దాన్ని కవి భావచిత్రంగా రూపొందిస్తాడు.

11.4.4 పాశ్చాత్య దేశాల్లో ఇమేజిజమ్ ఆవిర్భావ వికాసాలు : 1909-1917 మధ్య కాలంలో అమెరికా, ఇంగ్లాండ్, దేశాల్లో ఇమేజిజమ్ ఒక ఉద్యమంగా ప్రారంభమైంది.

టి.ఇ. హుల్మ్ (T.E. Hulme), హ్యోమ్, ఫ్లింట్, అల్లింగ్టన్ జోసఫ్ కాంప్ బెల్, ఎజ్రాపౌండు మున్నగు కవులు కలిసి లండన్ నగరంలో 1909లో ఒక నవ్య కవితోద్యమాన్ని లేవదీశారు. అదే ఇమేజిజమ్. 1909లో ఎజ్రాపౌండు లండన్ నగరానికి వెళ్ళి ఆకలి సంఘంలో ఒక సభ్యుడుగా చేరి, దాని అభ్యుదయానికై చాలా కృషి చేశాడు. నిజానికి ఈ ఉద్యమానికి ప్రాణంపోసిన నిర్మాతగా చెప్పదగిన కవి ఎజ్రాపౌండ్ ఒక్కడే.

డే ఇమేజిస్ట్స్ 'Des Imagiste's' అనే కవితా సంకలనం ద్వారా ఇమేజిస్టులు తొలిసారిగా రంగంపైకి వచ్చారు. తరువాత 1915వ సంవత్సరం మే 1వ తేదీన ఇమేజిస్టు కవిత 'ఈగోయిస్టు' అనే ప్రత్యేక సంచికలో వెలువడింది. ఈవాదం సంప్రదాయ విరుద్ధం కాకుండుట ఒక విశేషం. 1917 వరకు ఈ కవులు మూడు కవితా సంకలనాల్ని ప్రచురించారు.

ఆమీలొవెల్ (Miss Amylowell) అనే ఆమె కూడా ఈ ఉద్యమ వ్యాప్తికై పాటు పడింది. ఆమె ప్రభావానికి ఈర్ష్యపడి పౌండ్, ఇమేజిస్టులను "Anygists" అని పిలిచేవాడు. గ్రీకు లాటిన్ సాహిత్యాలు ఎజ్రాపౌండ్ రచనలు ఇమేజిస్టు కవులకు ప్రోత్సాహాన్నిచ్చాయి. 1912-17 మధ్య కాలంలో హెరియట్ మన్రో, జాన్ ఫ్లెచ్, ఫ్లెచర్ (John gould flectchur) H.D. అనే కలం పేరు కల హిల్డాడూలియట్ (Hilde Doolittle) విలియమ్ కార్లస్ విలియమ్స్ (William Carlos Williams) ఆంగ్లేయుడైన రిచర్డ్ ఆలింగ్టన్ మున్నగువారు ఇమేజిస్టు కవులుగా ప్రసిద్ధి చెందారు.

ఎజ్రాపౌండ్ చివరి వరకు ఈ ఉద్యమంలో ఉండక వదిలివేశాడు. పౌండ్ తరువాత ఆమీలో వెల్ అను ఆమె ఈ కవితోద్యమానికి నాయకత్వం వహించింది. మొత్తం మీద ఈమె ఈ ఉద్యమానికి వెన్నుముకగా నిలబడి కవితా పరిధిని విస్తృత పరచింది. ఇమేజిస్టు కవులు

కవితా శిల్ప సంప్రదాయాలను అన్య భాషల నుండి ముఖ్యంగా చైనా, జపాన్, భాషల నుండి గ్రహించేవారు. అన్య భాషా కవులనుండి వీరి కవితలను గురించి పలు విధాలుగా చర్చలు కొనసాగాయి. ఇమేజిజంపై మొదటగా వాద ప్రతివాదాలు వచ్చాయి. మన్రో అనే రచయిత్రి ఎజ్రాపౌం[illegible] కవితలను విమర్శించటానికి పూనుకున్నది. అంతేగాక ఇమేజిస్టు కవులపై జపాను కవితలు కొంత వరకు ప్రభావాన్ని చూపాయి. [illegible] కొద్దికాలం మాత్రమే సాగింది. క్రమంగా ఇది నశించిపోయింది.

**[illegible].4.5 ఇమేజిస్టు కవితా లక్షణాలు :** 1913వ సంవత్సరంలో ఫ్లింటు, పౌండ్ చేసిన సంయుక్త ప్రకటనలో 'ఇమేజిజమ్' కవితకు గల లక్షణాల్ని [illegible]చించారు. 1. భాషా విషయంలో గజిబిజి లేకుండా అందరికీ అర్థమయ్యే రీతిలో భాషను సులభం చేసి కవితకు ఒక రూపాన్ని కల్పించటం [illegible]రవంతమగు పదప్రయోగాలను చేయటం. పద ప్రయోగమనేది కేవలం అలంకరణ కోసం కాకుండా కవితా విషయాన్ని స్పందింపచేసేదిగా [illegible] అంటే భావాభి వ్యక్తికి తోడ్పడని పదమొక్కటికూడా వాడకూడదు. పరిమితి కాలంలో హృదయానికి, బుద్ధికి సంప్రీతి కలిగించే భావ చిత్రాలనందించడం ఇమేజిజం యొక్క లక్ష్యం.

2. కవితయందు నూతన లయలు సృష్టింపబడాలి. వ్యక్తీకరణము నందు వినూత్నమైన ధోరణులను ప్రదర్శించటమే కాకుండా ప్రాచీన పద్ధతులను యధాతథంగా కాక మార్పులు చేర్పులు చేసి కవితలో చూపించాలి.

3. ఆత్మాశ్రయమైనా, పరాశ్రయమైనా కవితను సూటిగా వివరించాలి. కవులకు వస్తు స్వీకారమందు పూర్తి స్వేచ్ఛ ఉండాలి. ఆధునిక జీవితమునందలి కళాత్మక దృష్టిని కవితయందు పొందుపరచాలి.

4. చిత్రకారుడు చిత్రాన్ని చూపిన విధంగా కవితలో ఆయా విషయాల్ని స్పష్టంచేయాలి. అంటే విషయాన్ని సూటిగా అందించడం.

5. భావ వ్యక్తీకరణకు అనేక పదాల్ని ఉపయోగించక అల్పార్థమున అనల్పార్థ రచనచేస్తూ సంక్షిప్తీకరణను (brevity) పాటించాలి.

6. Organic rhythm (అంతర్లయ) ను వాడటం.

ఈ లక్షణాలతో పాటు ఇమేజిస్టు కవులు జపాను కవిత్వంలోని (Tanka) హొక్కు (Hokku) అను ఛందస్సులను స్వీకరించారు. (Hokku - 3 చరణాల గీతం Tanka 5 చరణాల గీతం) ఇంగ్లీషు కవిత్వంలో ఈ ఛందస్సులను ప్రయోగించటం నవ్యతయే. టి.యస్. ఇలియట్ కూడా ఈ తెగకు చెందిన కవిగా ఉన్నాడు. ఇమేజిజమ్ వచన గేయానికి మంచి వ్యాప్తిని కలిగించింది.

'Dime lands of peace' వంటి ప్రయోగాలను చేయరాదు. అట్టి ప్రయోగం 'ఇమేజి'ని మ్లానంగావిస్తుంది. ఇది మూర్త (the concrete) విషయంతో, అమూర్త (the abstract) విషయం కలుపబడుతుంది. ప్రకృతి సిద్ధమగు పదార్థమే సమర్థవంతమగు ప్రతీక అను విషయాన్ని రచయిత గ్రహింపక పోవటమే యిట్టి ప్రయోగాలకు కారణం.

ప్రపంచ దేశాలయందు విప్లవాలు చెలరేగటంచేత సంప్రదాయ పద్ధతులపై వ్యతిరేకత ప్రబలింది. పాఠక లోకం క్రొత్త దనంకోసం ఎదురు చూచింది. క్రొత్త దనం చూపించాలని సనాతనులపై తిరుగుబాటును లేవదీసి వారికనుగుణంగా కవితను రచించటానికి ప్రారంభించారు. అట్టి సందర్భంలో కవులు తమ కవితలను సామాన్యులకు అందుబాటులో ఉండాలనే దృష్టితో భాషను చాలా వరకు సులభం చేశారు. అంటే పాఠకులకు అర్థమయ్యేరీతిలో చెప్పటానికి ప్రయత్నించారు. భాషలో గజిబిజి లేకుండా విషయాన్ని వీలైనంతవరకు సూటిగా చెప్పటానికే ముందుకు వచ్చారు. ఇదే ఇమేజిస్టుల ప్రధానోద్దేశ్యం.

**11.4.6 తెలుగు కవులలో ఇమేజిజమ్ :** తెలుగు కవితలో ప్రత్యేకంగా ఇమేజిజం అనేది లేక పోయినప్పటికీ కవులు వ్రాసిన కవితలలో ఈ ఇమేజిజం అక్కడక్కడ కన్పిస్తున్నది.

"జలజలా పొంగింది
బిలబిలా నడిచింది
పరికిణీ తొక్కాడు పదియేండ్ల కన్నెలా

చిన్న గంతులు వేయు తెల్లనాచెయ్య
పసిపాప సెలవి వారిన బోసినవ్వులా"
(విశ్వనాథ - కిన్నెర సాని పాటలు)

కవి కిన్నెరసాని వాగును స్త్రీగా ఊహించి ఆమె రూపాన్ని అలతి అలతి పదాల పోహళింపులో అందంగా వర్ణించారు. ఇందులోని పదాలన్నీ సులభగ్రాహ్యాలే. కిన్నెర పొంగింది, నడిచింది. ఆ నడక పదేళ్ళ వయస్సుగల కన్నె నడకలా ఉండటమే గాక, చిన్న చిన్న గంతులు వేసే తెల్లనాబెయ్య, పసిపాప సెలవిజారిని బోసినవ్వువలె కిన్నెర ఉంది. సాదృశ్యాలు సందర్భోచితములై కిన్నెర స్థితిని పాఠకులకు తెలియజెప్తున్నది. ఇందు కవి చూపిన భావ చిత్రం ఎంతో మనోహరంగా ఉంది.

ఇదే విధంగా దాశరథి తన 'మహాబోధి' అనే ఖండ కావ్యంలో బుద్ధుణ్ణి గురించి సుబోధక మొనరించాడు. సామాన్య ప్రజలకు బుద్ధుడు ఎవరో తెలుసు. అతని జీవితమునందు సత్యం, ధర్మం, శాంత గుణాలు ప్రధానమైనవి. వానిని బుద్ధుని జీవితంతో సమన్వయించి దాశరథి వివరించాడు. ఈ కవితలో కవిపద ప్రయోగమందలి నైపుణ్యాన్ని అర్థాన్వయమునందుగల క్లిష్టతను తొలగించి వేశాడు.

"దయకు సాగరమ్ము ధర్మమునకు గని
సత్యమునకు తావు శాంతమునకు
పుట్టినిల్లు సత్త్వమున కాలవాలమ్ము
జ్ఞానమునకు తాన కాణయాచి"

బుద్ధుని దయలో విశాల విశ్వమానవ కరుణ నిండి ఉంది. ధర్మంలో అపారమైన సత్యాన్వేషణ దాగి ఉంది. సత్యం అతనికి ప్రాణమైంది. శాంతము ఆ జన్మ సిద్ధము. సత్త్వగుణానికి నిలయం. జ్ఞానానికి నిధి. ఈ గేయంలో సాగరము, గని, తావు, పుట్టినిల్లు, ఆలవాలము కాణయాచి మొదలగు పదాలు అర్థవంతములై స్ఫూర్తిని కల్గిస్తున్నాయి. ఇందులోని భావ చిత్రాన్ని గమనించండి.

ఆధునిక కావ్యాలు సామాజికమై వస్తువును గ్రహించి రచింపబడ్డాయి. భావకవులు ప్రణయాన్ని వస్తువుగా స్వీకరించి రచనలు చేశారు. ఆ ప్రణయమందు వివిధములైన కథా విషయాల్ని వ్యక్తం చేసి పద చిత్రాలను, భావ చిత్రాలను ప్రదర్శించారు. వీరి కవితా వస్తువుకు సంకెళ్ళులేవు. స్వేచ్ఛయే ప్రాణం. వీరికి ప్రాణం కన్నా గానము తీపు. కృష్ణశాస్త్రిగారి గీతాలకు ప్రణయమే కావ్య వస్తువు. స్వేచ్ఛయే గీతానికి ప్రధానము.

'నవ్వి పోదురుగాక నాకేటిసిగ్గు
నా యిచ్ఛయేగాక నాకేటి వెఱపు
కలవిహంగమ పక్షముల తేలియాడి
తారకామణులలో తారనై మెలసి
మాయమయ్యెదను నా మధుర గానమున
నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు."

ఇందులో కవితా ప్రపంచంలో కవికి కావాల్సిన స్వేచ్ఛ ఉంది. ఆ స్వేచ్ఛకు ఆటంకాలు లవు. నియమములంత కంట లవు. ఎందరెన్ని మాటలన్నా వారికే మాత్రము సిగ్గులేదు. అవి వారి దృష్టికందవు. అందుచేతనే ఊర్వశిని ప్రణయమూర్తిగా భావించి తనతోటిదే లోకమని విశ్వసించి గాలిలో కలసి, మెరుపులో మెరసి, దివిచుట్టూ గుడికట్టుకొని నిరీక్షించారు. అని చెప్పడంలో కవి భావచిత్రాన్ని వ్యక్తం చేశాడు.

మూర్తి వర్ణనమునందు ఇమేజిస్టులు చిత్రకారులవలె కవితయందు చిత్రించటం ప్రారంభించారు. కవులు తమ భావాలకు ఆకృతిని కల్పించి సజీవంగా చిత్రించటం వారి ధ్యేయమైంది. కృష్ణశాస్త్రి చేసిన ఈ క్రింది స్త్రీమూర్తి చిత్రణను గమనించండి.

"ఆమె కన్నులలో ననంతాంబరంపు
నీలి[illegible]లు కలవు; వినిర్మలాంబు
పూర [illegible]ంభీర శాంతకాసార చిత్ర
హృదయములలోని గాటంపు నిదురఛాయ
లందు [illegible]గమ్ము; సంధ్యావపాన
సమయమున నీప పాదపశాఖ కాగ్ర
పత్రకుటిల మార్గముల లోపల వసించు
ఇరుల గుసగుసల్ వానిలో నిపుడునపుడు
వినబడుచునుండు మరికొన్ని వేళలందు
వానకారు మబ్బుల మెయి వన్నె వెనుక
దాగు బాష్పమ్ము లామె నేత్రములలోన
బొంచుచుండును.

ఇందులో కృష్ణశాస్త్రి స్త్రీకన్నులను వర్ణించాడు. ఆమె కన్నులు కాటుక కన్నులు అని చెప్పటానికి ఆమె కన్నులలో అనంత అంబరపు నీలినీడలు, వినిర్మల అంబుపూర, గంభీర శాంతకాసారముగను, నీపపాదప శాఖకాగ్ర పత్రకుటిల మార్గములలోపల వసించు ఇరులుగను, వాన కారుమబ్బుల దాగిన బాష్పములున్నవని కవి అభిప్రాయం. ఇందులో కవి నాలుగు భావ చిత్రాలను వర్ణించాడు.

1. ఆమె కన్నులలోని భావాలు అనంతత్వములు అని
2. అగాధత్వము
3. అజ్ఞేయత్వము
4. నయనముల సజలత్వాన్ని వర్ణించాడు.

నారాయణబాబు గీతాల యందు చాలా వరకు భావ చిత్రాలున్నాయి. ఇంకా అధివాస్తవికతా ధోరణులు కూడా నారాయణబాబు కవితల్లో ఉన్నాయి. దాంతో వారి కవితలో భావ చిత్రాలు ప్రదర్శించడం పరిపాటి అయింది. మూర్తి స్పష్టంగా ఉన్నపుడే కవిత్వానికి అందము, చందము కలుగుతుంది. అధివాస్తవిక కవితలయందు ఇమేజిజానికి తగిన స్థానం లభించింది. వారు అన్ని మార్గాలు చూపించినప్పటికీ భావ చిత్రాల ప్రత్యేకతను కోల్పోలేదు.

"దంతపు వీణైతే నేమి
ఒళ్ళు
తెగిపోయిన తీగె
బతుకు
మేళన చేయని హృదయం
నీ వ్రేళ్ళకు
బాధే మిగులు
నను ముట్టకు
నా చక్కని స్వామి"

ఇందులో ఒక వేశ్య వర్ణింపబడింది. ఆమె ఆకారం ఎంత అందంగా ఉంటుందో అంత దీనత్వం ఆమె బ్రతుకులో ఉంది. ఆమె జీవితం ఇందులో చెప్పబడింది. దంతపు వీణ వేశ్య మేలిమివన్నెను, తెగిపోయిన తీగ కాలం గడిచిన తరువాత, వయసు జారిన తరువాత

కవిపించు స్వరూపము. శరీరముపై వ్యాపించిన అనారోగ్యపు చిహ్నలను వివరించాడు. ఈ గీతంలో నీలిమ చూపుల లోతులను చూచిన, మేళన చేయని హృదయం కవ్విస్తుంది.

శ్రీశ్రీ వ్రాసిన 'బాటసారి' గీతం భావ చిత్రానికి సంబంధించిందే. ఇందులో బాటసారి కూటికొరకు, కూలికొరకు ఏవిధంగా తపించి, అనుభవించింది తెలుస్తుంది.

కూటికోసం, కూలికోసం

......................................

బయలుదేరిన బాటసారికి
మబ్బుపట్టీ, గాలికొట్టీ
వానవస్తే వరదవస్తే
చిమ్మ చీకటి క్రమ్ముకొస్తే
దారి తప్పిన బాటసారికి
ఎంత కష్టం

ఈ గేయం విషాదాంతమైంది. బ్రతుకు తెరవు కోసం బయలుదేరిన బాటసారికి అన్నీ అపశకునాలే. ఎప్పుడో ఒకప్పుడు మంచిరోజు రాకమానదా అన్న విషయాన్ని స్పష్టం చేయటం కోసం 'వాన వెలిసి మబ్బులో ఒక మెరపు మెరిసింది' - అనే చరణాలయందు ఆశను ప్రదర్శించాడు.

సంక్షిప్తత అనేది కవితకు స్ఫూర్తిని కల్గిస్తుంది. ఆధునికులలో నారాయణబాబు కవితలో సంక్షిప్తత అధికం. పరిమిత పద ప్రయోగాలతో విపులార్థాన్ని ప్రయోగించటం అతని ధ్యేయం. 'తెలుగు రాత్రి' అనే గేయంలో సాంఘిక దురాచారాన్ని ఈ విధంగా స్పష్టపరిచారు.

పసితనమున పెండ్లి
భర్త పరమ పదముజేర
విధవ
మసక మసక యౌవనమున
కుసుమించే తల్లి తలపు
గుండెల్లో పాల పాట
ఆకాశపు పాలబాట.

చిన్న తనంలోనే కన్యాశుల్కానికి ఆశపడి వివాహాలు చయడం ప్రబలిపోయింది. దానివల్ల వయసుతో నిమిత్తం లేకుండా కాటికి కాళ్ళు చాచుకొన్న ముదుసలికి, ముక్కు పచ్చలారని కన్యనిచ్చి వివాహం చేసేవారు. అతను అకస్మికంగా మరణిస్తే వాని భార్య వైధవ్యాన్ని పొందుతుంది. పునర్వివాహం ఆ రోజుల్లో నేరంగా భావించటం చేత ఆమె ఆ విధంగానే జీవితం గడిపేది. కాని యౌవ్వన ప్రాయంలోని కోరికలు కుసుమించేవి. ఆ కోరికలతో తాను తల్లి కావాలని కోరుకొనేది. కానీ సమాజం సంకెళ్ళువేసి కదలకుండా బంధించింది. ఇక్కడ పసితనపు పెండ్లిండ్ల దురవస్థను భావచిత్రంగా కవి చిత్రించాడు.

పాశ్చాత్య దేశాల్లో 'ఇమేజిజం' కవిత మహోద్యమంగా ప్రారంభింపబడటంచేత ఇది క్రొత్త కవితా మార్గమే అను ఆలోచన కలిగింది కొందరికి. ఆయా మార్గాలు చూచిన తెలుగువారు కూడా దీన్ని నూతన కవితా మార్గంగా పరిగణించి అనేక భావ చిత్రాలను ప్రదర్శించారు.

## 11.5 సింబాలిజం (ప్రతీక వాదం)

**11.5.0. ఉపోద్ఘాతము :** 'రొమాంటిసిజమ్'లా ప్రతీ కాత్మాకతకూడా హఠాత్తుగా ఒక ఉద్యమంవలె బయలు దేరలేదు. రొమాంటిసిజమ్‌కు వలెనే దీనికి ఇతమిద్ధమని నిర్ణయించే సూత్రం లేదు. ఇది కూడా రొమాంటిసిజమ్‌లాగే ఒక సాహిత్య ధోరణి. సాహిత్యంలో ప్రతీకాత్మకత ఎందరినో ఆకర్షించింది; ప్రభావితులను చేసింది.

1890 తర్వాత పాశ్చాత్య సాహిత్య రంగంలో గణనీయమైన మార్పు కలిగింది. ఫ్రాన్సులో తల ఎత్తిన సింబాలిజం ఈ మార్పునకు బలమైన చిహ్నం. బ్లాడ్లేర్, వెర్లేన్, మలార్మే-వీరు ముగ్గురూ సింబాలిష్టు కవిత్వ ధోరణికి ప్రతినిధులు. వీరిలో ప్రతీకల (symbols) విలువను పైకెత్తి చూపించినవాడు బ్లాడ్లేర్. దానికి మెరుగులు దిద్దినవాడు వెర్లేన్. వానికి తాత్త్విక గంధాన్నందించినవాడు మలార్మే. నలుబదేండ్లపాటు ఏకచ్ఛత్రాధిపత్యాన్ని వహించి 'మలార్మే' ప్రతీక కవితోద్యమానికి మకుటంలేని మహానాయకుడుగా స్థిరపడ్డాడు.

**11.5.1 సింబల్ ప్రతీక :** ఆధునిక యుగంలో, కళావిషయంగా జనించిన వివిధ వాదాల్లో 'ప్రతీకవాద' మొకటి 'సింబల్' అంటే చిహ్నము లేక గుర్తు. దీనినే సంకేతము లేక ప్రతీక అని కూడా చెప్పవచ్చును. దీన్ని బట్టి సింబాలిజం అనే ఆంగ్ల పదానికి సమానార్థకంగా ప్రతీకవాదం అనుట సమంజసం. కొందరు దీన్ని సంకేతవాదమని కూడా అన్నారు. పెక్కు నిఘంటువులయందు 'సింబల్' అనేపదానికి 'ప్రతీక' అనే అర్థం చెప్పబడలేదు. మోనియర్ విలియమ్స్ రచించిన సంస్కృత నిఘంటువులో 'ప్రతీక'కు సింబల్ అను అర్థం వుంది. ఈ అర్థం ఛాందోగ్యోపనిషత్తునుండి గ్రహింపబడినట్లు ఆధారముంది.

**11.5.2. ప్రతీక అంటే :** కవితలో ప్రధాన స్థానాన్ని ఆక్రమించింది సంకేతం (Symbol). కవి మనోభావాలు సంకేతాల యందు నిండి ఉంటుంది. అంతేగాక సంకేతం సంస్కార హృదయానికి ప్రతిబింబం. ఒక శబ్దంగాని, శబ్ద సముదాయంగాని, ఒక వస్తువునో, క్రియనో, సంఘటననో సూచిస్తూ అది 'తిరిగి' వేరొక అంశాన్ని సూచించినప్పుడు అది ప్రతీక అవుతుంది. ప్రతీకలు అర్థమైతే గానీ కవి ఉద్దేశించిన భావాలు తెలియవు. లేకపోతే అయోమయంగా సందిగ్ధంగా కవిత ఉంటుంది. ఉదాహరణకు బీజగణితంలో వట్టి అక్షరాలనే ఉపయోగించి ఆలోచనను సాగిస్తాం. అందుకే బీజగణితాన్ని 'ప్రతీకాత్మక తర్కం' అనవచ్చు. ఈ కవితకు తోడుగా వేదాంతం బయలుదేరి మనసును తాత్త్విక మార్గం వైపుకు మరలించింది. కవి ప్రకృతిని పరిపరి విధాలుగా చెప్పక దాన్ని ఒక ప్రతీకగా గ్రహించి చెప్పటం పరిపాటి అయింది. కవితలో వచ్చే ప్రతీకలు విషయాన్ని దృశ్యాత్మకం చేయగలవు.

ఈ ప్రతీకల్లో కొన్ని ఆనవాయితీగా (Conventional) గా వచ్చేవి ఉంటాయి. వాటిల్లో అర్థం వేనిని సూచిస్తాయో విస్పష్టంగా ఉంటుంది. ఉదాహరణకు 'శిలువ-పద్మం వంటివి ఒకానొక సాంస్కృతిక సంప్రదాయానికి సంబంధించినవి. ఇవి సర్వసామాన్యమైన ప్రతీకలే. అందరికీ అర్థమయేవే. మరికొన్ని ప్రతీకలను కవి కల్పించుకోవచ్చు. సాధారణంగా కొన్ని వస్తువులు, ప్రాణాలు కొన్ని లక్షణాలతో ముడివడి ఉంటాయని భావిస్తాం. వేగానికి వేడి, ఠీవికి సింహం, జిత్తులమారి తనానికి నక్క, కుటిలత్వానికి పాము మనకు జ్ఞాపకం వస్తాయి. అలాగే శుక్ల పక్ష చంద్రుడు అభివృద్ధిని, కృష్ణ పక్ష చంద్రుడు క్షీణదశను, సూర్యోదయం పుట్టుకను, అస్తమయం మరణాన్ని సూచిస్తాయని భావిస్తాం. సాంస్కృతిక, సామాజిక జీవితంలో అభివ్యాప్తమై ఉన్నట్టి భావాలను అన్నింటినీ ఉపయోగించుకుంటూ, కవి వీనిని ప్రతీకలుగా మలుస్తాడు. కొందరు కవులు స్వయాన, సరికొత్తగా కొన్ని ప్రతీకలను సృష్టించుకుంటారు. అట్టి ప్రతీక దేన్ని సూచిస్తుందో గ్రహించడానికి చదువరి ఎంతో శ్రమపడవలసి ఉంటుంది. ఉపమానం ప్రతీక అవదు. అట్లే రూపకం కూడా. అది కేవలం అలంకారం. ప్రతీకలలో ఉండే లక్షణమేమంటే అది ఒకే అర్థానికి పరిమితం కాకుండా అనేక అర్థచ్ఛాయలకు అవకాశమిస్తుంది. అందుకే ప్రతీకలు కవిత్వానికి ప్రాణం.

**11.5.3 ప్రతీకోద్యమం - లక్ష్యం - ప్రయోజనం :** మలార్మే, టి.యస్. ఇలియట్ మున్నగువారు ప్రతీకలను బహుధా ఉపయోగించారు. ఇలియట్ సమాజాన్ని దృష్టియందుంచుకొని ప్రతీకలను వాడాడు. మలార్మే ప్రతీకలు వాస్తవ ప్రపంచానికి చాలా దూరంలో ఉంటాయి. మలార్మే రచనలు ఈ ఉద్యమానికి సిద్ధాంతాల వంటివి. ఆంగ్ల భాషలో 'రోసెట్టి' మొదటి తరపు సింబాలిష్టు కవి. తరువాత వారిలో Yeats (యీట్స్) ఎన్నదగినవాడు. ప్రజాస్వామిక దృక్పథానికి జీవిత సమస్యలకు అతీతమై పోయినందున ఈ కవితోద్యమం ఏ కొందరికో పరిమితమై పోయింది.

ఈ ఉద్యమం మత దృక్పథాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని జీర్ణించుకున్న కథా ధోరణులను నిరసించింది. సత్యాన్వేషణమే దీని లక్ష్యం. శాస్త్రజ్ఞాన జన్యమైన వాస్తవికతా వాదం ఇంద్రియాతీతమైన సత్యాన్ని అంగీకరించదు. దీనికి విరుద్ధంగా సింబాలిజము ఇంద్రియాతీతమైన భావ జగత్తువైపు మొగ్గు చూపింది. ఈ భావాలు ఇందు ప్రతీకల ద్వారా వివరింపబడుతుంది. అందుచేత ఈ భాష విలక్షణంగా ఉంటుంది. అందరికీ అర్థంకాదు. సింబాలిస్టు కవులు రాజకీయ విషయాలను కవితా వస్తువుగా స్వీకరింపలేదు. జప ధ్యానాల ద్వారా ఆస్తికులు సాధించు లక్ష్యాన్ని సింబాలిస్టులు, కళ ద్వారా సాధించటానికి ప్రయత్నిస్తారు. సంగీత శాస్త్రంలో రాగాలకున్న ప్రాధాన్యం కవిత్వంలో శబ్దాలకున్నదని సింబాలిస్టు కవులు భావించారు. ప్రతీక కవితపైన ఇతరములైన సాహిత్య ప్రక్రియల ప్రభావం చూపినవి. అందులో ప్రధానమైనవి ఇమేజిజమ్, సర్రియలిజమ్ మున్నగునవి.

మలార్మే కవితా ప్రయోజనాన్ని ఇట్లా వివరించాడు. "The whole purpose of poetry is to create pure essenses, unhindered by any echo of the concrete reality which surrounds us" (మనలను ఆవరించి ఉన్న వాస్తవ ప్రపంచ వాసనలచే (ప్రతి ధ్వనులు) ప్రతి షిద్ధము, లేక నివారితము కాని, శుద్ధమూల తత్త్వములను సృజించుటయే సమగ్ర కవితా ప్రయోజనం).

ఫ్రెంచి సింబాలిస్టులు వైయక్తికంగా ప్రతీకలను సృష్టించుకోవడం ధ్వనినీ వక్రోక్తినీ ఆదరించడం యూరపులోని అన్ని దేశాలలోని కవులను ఆకర్షించింది. ఇంగ్లాండులో Arthno symons, W.B. Yeats, T.S. Eliot, Ezra pound, Dylan Thomas, E.E. commings మున్నగువారు ప్రతీకాత్మకతను ఆదరించారు. మతంనుంచీ, సాంస్కృతిక, జానపద సంప్రదాయాల నుంచి వీరు ప్రతీకలను స్వీకరించారు. కొన్నింటిని స్వయంగా సృష్టించుకున్నారు. ఏట్సు 'Byzantives' కవితలు, ఇలియట్ 'waste land' ప్రతీకాత్మకమైనవే.

**11.5.4. ఆంధ్ర వాఙ్మయం - ప్రతీకవాదం :** ఇలియట్ వేస్ట్ లాండ్ మున్నగు కావ్యాల్లోని కొన్ని విచిత్రమైన ప్రతీకలు వాడి కొత్తదారి తొక్కిన కవులు ఆంధ్ర వాఙ్మయంలోని నవ్య కవులు ఆరుద్ర, బైరాగి. వీరిపై ఇలియట్ ప్రభావం ఉంది. తెలుగులో ప్రతీకవాద ప్రభావమున్న కవులు చాలా తక్కువమంది ఉన్నారు. ప్రాచీనకవుల్లో కొందరు మాత్రమే సంకేతాలను వాడారు. కాంతిని-విజ్ఞానానికి, చీకటిని - అజ్ఞానానికి సంకేతాలుగా కవులు ఉపయోగించారు. ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగు కవితలో రకరకాలైన ప్రక్రియలు పుట్టి తెలుగు సాహిత్య పరిధిని పెంచాయి. కాని అయోమయమగు ప్రతీకలు అభివృద్ధి చెందలేదు. చిన్నయసూరి మిత్రలాభ, మిత్రభేదములలోని కథల్లోని పశుపక్ష్యాదులను ఒక్కొక్క తత్త్వానికి ఒక్కొక్క ప్రతీకగా గ్రహించి నీత్యుపదేశాన్ని గావించాయి.

రాయప్రోలు సుబ్బారావుగారి కావ్య ఖండికల్లో కొన్నిటియందు ప్రతీకలను ఉపయోగించారు. 'చిల్క' అనేగేయంలోను 'యాత్ర' అనే కావ్య ఖండికలోను ప్రతీకలను వాడారు.

యాత్రికులు సాయం సంధ్యాసమయానికి నదీ తీరానికి చేరారు. "అంధకారం జగమంతా ఆక్రమింపగనున్నది. ఆలసింపక నావికుని నమ్మి, నావ నధిరోహించి సంతరణముగావింపుము" అని యాత్రికులను కవిగారు ప్రబోధిస్తున్నారు. సాయం సంధ్య - జీవిత చరమకాలానికి, నదీ ప్రవాహం - మృత్యువునకు, అంధకారం - అజ్ఞానానికి - నావికుడు గురువునకును, నావ తదీయ బోధకును, యాత్రికులు జీవులకును ప్రతీకలు కావచ్చును. లేదా నదీ ప్రవాహం సంసారానికి ప్రతీక కావచ్చు. ఇందులో కవిఒక ఆధ్యాత్మిక విషయాన్ని ప్రతిపాదించి ఉన్నారనడానికి ఎట్టి సందేహంలేదు.

**11.5.5. అభ్యుదయ కవులు : ప్రతీకాత్మకత :**

**అ) ఆరుద్ర - ఇలియట్ ప్రభావం :** ప్రతీకాత్మకత అభ్యుదయ కవుల్లో కొందరిపై ప్రభావాన్ని చూపింది. వారిలో ముఖ్యుడు ఆరుద్ర. ఇలియట్ ప్రభావంతో తెలుగున అతినవ్య కవితా వీధుల విహరించిన వారిలో ఆరుద్ర ప్రథమ గణ్యుడు. వీరు రచించిన 'త్వమేవాహం' 'సినీవాలి' అనే రెండు కావ్యాలు ఇలియట్ ప్రభావం కల కావ్యాలే. అయితే ప్రతీక వాదంలోని ఆధ్యాత్మికతా గంధాన్ని ఆరుద్ర స్వీకరించలేదు. తాత్త్విక దృష్టిని తనలో కలుపుకోలేదు. ప్రతీకల ద్వారా జరిపెడు చమత్కృతులను మాత్రం ఆకళించుకొన్నాడు. ఇలియట్ వేస్టుల్యాండు ఏ విధంగా నీతిభ్రష్టమైన మానవ సమాజానికి ప్రతీకయో ఆరుద్ర 'త్వమేవా హం'లోని ఇసుక గడియారము మున్నగునవి కాలానికి సమాజానికి

ప్రతీకలు. భావవైచిత్ర్యాన్ని కలిగించటంలో, నగర జీవన చిత్రణంలో ఇలియట్ ప్రభావం ఇతనిపై ఉంది. అంతేగాని ప్రతీక వాదంలోని తాత్త్విక దృష్టితో ఆరుద్ర రచనలకు ప్రసక్తి లేదు.

**ఎ) త్వమేవాఽహం:** ఆనాడు తెలంగాణాలో జరిగిన పోరాటం, రజాకారుల దోపిడీతనం, మున్నగు సంఘటనలు 'త్వమేవాఽహం' కావ్యానికి ఆవేశాన్ని అందించాయి. ఆ ఆవేశంలో ఆరుద్ర తన కావ్యమందు వాస్తవ చిత్రణముగావించాడు. కథగా కన్పించకపోయినప్పటికీ వివిధములైన ప్రతీకలవల్ల నాటి తెలంగాణా స్థితిని కన్నులముందు చూపించాడు. ప్రతీకలన్నీ వాడినా ఆ ప్రతీకలమాటున తీవ్రమైన భావాలు పెనవేసికొని ఉన్నవి. రచనలో ఉపయోగించిన ప్రతీకలు చాలా చిత్రంగా ఉంటాయి.

'త్వమేవాఽహం'లో కాలము ప్రధానవస్తువు. మృత్యువు, చిరంజీవి మానవునితో 'నీవేనేన'ని అంటాడు. కాలానికి మృత్యువునకు గల అభేదాన్ని ఈ విధంగా సూచింపబడింది. మృత్యువు అంతగా భయపడవలసిన విషయం కాదనీ, మానవుడు పుట్టినప్పటి నుండి మరణిస్తాడని, మరణించినప్పటినుండీ జీవిస్తాడనీ అందువల్ల మృత్యుజీవితాలకు గల సంబంధానికి భయపడకూడదనీ, ఈ కావ్యంలో ధ్వనిప్రాయమైన ప్రబోధము. శ్రీశ్రీ అన్నట్లుగా ఈ దృష్టితో చూస్తే 'త్వమేవాఽహం' కావ్యానికి కాలమే ప్రధానవస్తువు. తెలంగాణా అప్పుడొక అల్పక్షణంగా మారిపోతుంది.

ఇసుక గడియారం నేటి కాలానికీ, నీటి గడియారం జరిగిన కాలానికీ, గంటలు ధనవంతులనబడు పెట్టుబడిదారీ సమాజానికీ, నిమిషాలు మధ్యతరగతి వర్గానికీ, సెకండ్లు కష్టించి చెమటోడ్చి పనిచేయు శ్రామిక వర్గానికీ, చిన్నముల్లు పెట్టుబడిదారుల మనస్తత్వానికీ, స్టాప్‌వాచ్ విప్లవాన్ని వెక్కిరించు సాధనానికీ, అలారము సామాజిక సమకాలీన పరిస్థితులకు, పైథాగరస్ థీరము సామ్యవాద వ్యవస్థ సర్పము బూర్జువా ధోరణికీ సంకేతాలుగా ఆరుద్ర ఉపయోగించాడు. ఇవికాక రంగులు కూడా ప్రతీకల రూపాన్ని దాల్చాయి. ఎరుపు విప్లవము, ఆకుపచ్చ మేధావి వర్గము, నీలము కార్మిక వర్గములు, పసుపుపచ్చ కాంగ్రెసు పార్టీకి సంకేతాలు. లోహములగు ఇనుము, రాగి, తుత్తునాగము మున్నగునవి ధనికులకు, మధ్యతరగతి శ్రామిక వర్గానికి చిహ్నాలుగా వెలిశాయి. ఈ ప్రకారం కాలాన్ని గురించి తనకున్న జిజ్ఞాసను ఆరుద్ర ఇన్ని ప్రతీకల్లో వ్యక్తం చేశాడు. ఈ ప్రతీకలకు తనకున్న విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానాన్ని ఆధారంగా చేసుకొని ప్రయోగించటానికి ప్రయత్నం చేశాడు.

'సినీవాలి' ఆరుద్ర రచించిన మరోకావ్యం. ఇందులో ఆధునిక నాగరికతా ధోరణులను నిరసిస్తూ వర్గ సంఘర్షణ, వర్గ చైతన్యాన్ని వివరించారు. ఈ రెండు కావ్యాలపై ఆంగ్ల సాహిత్య ప్రభావం విడదీయరానిదిగా ఉంది.

'పెద్ద ముల్లు' ద్వారా (మధ్య తరగతి మనస్తత్వ చిత్రణ సందర్భంగా) పైథాగరస్ థీరాన్ని సామ్యవాదానికి అనుగుణంగా అన్వయింప చేశాడు.

"చిన్న చిన్న చీమలు వగైరా
అడుగు భుజం అనుకోండి
బలవంతమైన సర్పం
గట్రా ఎట్సెట్రా
అడుగు భుజం ఉత్పత్తిచేసే
ఆహారం మీద ఆధారపడటం వల్ల
లంబం అవదామరి?
ఈ భుజాల పరస్పర సంఘర్షణల ఫలితం
ఈ భుజాల కర్ణం మీద చతురస్రం
అవునా? మరి
ఈ చతురస్రపు వైశాల్యం ఇజీక్వల్టూ
రెండు విభిన్న భుజాలపై గల చతురస్రాలలోని మిశ్రమ

థీసిస్ యాంటీ థీసిసుల మిశ్రం
రెండు భిన్న పక్ష సంజ్ఞల పోరాటం
అనగా ఒక నూతన వ్యవస్థ"

'బలవంతమైన సర్పం చలి చీమల చేత జిక్కి చావదె' అన్న సుమతీ శతకంలోని న్యాయం దీనికి ప్రోద్బలకమైంది. సర్పము బూర్జువా వ్యవస్థ. చీమలు శ్రామిక వర్గం. చిన్న చిన్న చీమలు అడుగు భుజము. అడుగు భుజము మీద ఆధారపడినది లంబము. ఇది బూర్జువా వ్యవస్థ. ఈ రెండింటికి ఘర్షణ అనివార్యమని మార్క్సు వాదం. ఈ రెంటి ఘర్షణ ఫలితంగా ఏర్పడ్డ కర్ణము మీద చతురస్రము సామ్యవాద సమాజం. ఈ సిద్ధాంతానికి గణిత శాస్త్రములోని పైథాగరస్ థీరము ద్వారా సమన్వయం కుదిర్చి ఆరుద్ర గొప్ప చమత్కారాన్ని, దీక్షని ప్రదర్శించాడు. ఆధునిక విజ్ఞాన శాస్త్ర ఫలితంగా కవిత్వంలో ఏర్పడ్డ నూతన పరిభాషకు ఇది యొక మచ్చుతునక.

ఆరుద్ర 'త్వమేవాఽహం' కావ్యంలో ఒక చోట ఈ విధంగా అన్నాడు.
"మన మానవ సమాజమొక పూరా విప్పారిన పుష్పం
అట్టడుగున పరిశ్రమించే జనావళి
మనకందరికి రక్షక పత్రావళి
కడుపుమంట సైరింపశాఖ
కీటకాల నాకర్షించే పతాక
అవకాశాల వల్ల తలెత్తిన వర్గం
పరాగప్రాప్తి వోచుకునే కీలాగ్రం
శ్రీలు పొంగిన కేసరాల ధర్మం
విక్రాంతి పర పరాగ సంపర్కం"

ఈ గీతం సామ్యవాద ధోరణికి ప్రతీక : పువ్వునకు అట్టడుగున ఉండేవి రక్షక పత్రాలు. పరపరాగ సంపర్కం కీలాగ్రానికి ప్రాప్తిస్తుంది. ఇందులో రక్షక పత్రాలు శ్రామిక వర్గానికి సంకేతాలు. కీలాగ్రం పెట్టుబడిదారి వర్గానికి చిహ్నం. కార్మికులు కండలు విరిచి పని చేసిన గాని పెట్టుబడి దారులకు కొంచెం ఊరట కలుగదు. వారు నిలబడినప్పుడే ధన స్వాములు నిలబడగలరు. కాని శ్రీమంతులు అనుభవించు అనుభూతి అనిర్వచనీయం వారికే ఐశ్వర్యం ప్రాప్తిస్తుంది. ఆయా వర్గాలమధ్య ఉండే సంబంధం పరపరాగ సంపర్కంగా సంకేతించి గీతాన్ని రచించారు. ప్రతీకలనుగ్రహించటంలోనే కాక రచనా సంవిధానంలో కూడా ఆరుద్ర ఇలియట్ పద్ధతిని గ్రహించాడు.

**ఆ) బాలగంగాధర తిలక్** - మధ్య తరగతి మానవుని ఉద్దేశించి 'కిటికీ' 'దీపం' గొంగళి పురుగులు - మున్నగునవి ప్రతీక కవితా మార్గంలో బాలగంగాధర తిలక్ రచించాడు.

**ఎ) కిటికీ :** ఈ గేయం మనః పరిధికి సంకేతం. కిటికీ ద్వారమున రకరకాలైన సుగంధాలు, దుర్గంధాలు, మంచి మాటలు, చెడు మాటలు ప్రాప్తిస్తుంటాయి. అదే విధంగా మనస్సును కిటికీగా భావించి తిలక్ గేయాన్ని రచించాడు. మనసులో రకరకాల ఆలోచనలు వస్తుంటాయి. ఆ ఆలోచనలకు పరిమితి లేదు. గాలి వెలుతురు కిటికీనుండి వస్తాయి. గాలి - వెలుతురుపదాలు ప్రతీకలుగా గేయంలో కన్పిస్తాయి.

**బి) దీపం :** ఈ గేయం కూడా ప్రతీక కవితా మార్గంలో పయనించింది. దీపం మానవుని అంతర్ముఖ దృష్టికి సంకేతం. ఈ దృష్టి ఉండటంవల్ల తన్నుతాను అర్థం చేసుకొని సంస్కరించుకోవడానికి ప్రయత్నిస్తాడు. 'దీపం' విజ్ఞాన వికాసాలకు పాప. కనుపాప-సహజత్వానికీ, స్వచ్ఛతకు, చీకటి-అజ్ఞానానికీ, అమాయకత్వానికీ, ఎఱ్ఱ దీపం సామ్యవాద వ్యవస్థకు చిహ్నాలు. తిలక్ సామ్యవాద వ్యవస్థపై విశ్వాసం కల్గిన కారణంచేత 'ఆరని ఎఱ్ఱదీపం' అని కమ్యూనిజాన్ని ఉద్దేశించారు.

పి) గొంగళి పురుగులు : తిలక్ ప్రతీక కవితల యందు ఇది మణిమకుటం. గొంగళి పురుగులు తిన్నంత వరకు తిని, తిరిగినంతవరకు తిరిగి, దొరికినంత వరకు అటు ఇటు తిరిగి, దొరకని యెడల అలసిసొలసి యేదోమూలకు నక్కి నిశ్శబ్దంగా ఉండి మత్తుగ నిద్రపోతుంది. అట్లే మధ్యతరగతి కుటుంబీకుడు తన చేతిలో ఉన్నంత వరకు పొట్ట నింపుకుంటాడు. జీతపురాళ్ళు వచ్చే దాకా ఎదురు చూడాల్సిందే. ఈ ప్రకారం అధ్వాన్న స్థితికి తనలోతాను నవ్వుకొని మత్తుగ నిద్రపోతాడు. అంతకంటే మిన్నయైన మార్గం మరొకటి అతని దృష్టికి కన్పించదు. జీవిత గమనము గొంగళిపురుగు గమనంవలె ఉంటుంది. తిలక్ కూడా అట్లే ఆలోచించి గొంగళి పురుగును సంకేతంగా గ్రహించాడు.

ఇ) బైరాగి : నూతిలో గొంతుకలు' అనే పేరును తన కావ్యానికి పెట్టాడు. ఈ కావ్య నామకరణం నందు ఇలియట్ ప్రభావం స్పష్టంగా గోచరిస్తున్నది. 'మేలుకొన్నవాడు' అనేగీతం బైరాగి ఆధ్యాత్మిక భావాన్ని వ్యక్తం చేస్తున్నది.

"నడిరేతిరిని మేలుకొన్న వాడెవ్వడు
దివ్వెల నమ్మిక లేమి నీడల కుట్ర
చీకటుల మెతక బుద్ధి ఎవరికెరుక
గోరీలా అలికిడిలేని గదిలోపల
ఎందుకు పడినట్లా వెలుగు మరక"

ఇందులో 'నీడల కుట్ర' నిత్యం మానవుడుపడే యమ యాతనలకు 'మెతకబుద్ధి' అసమర్థతను, గోరీ గది - అంధకారానికి ప్రతీకలుగా గ్రహించి ఆ ప్రతీకల మాటున తీవ్రమగు భావ సంఘర్షణను, ఆధ్యాత్మిక దారిద్ర్యాన్ని వ్యక్తం చేస్తుంది. మానవుడు అజ్ఞానాంధకారంలో మునిగినంతకాలం పాప పుణ్యాల సంగతిని గ్రహింపలేడు. సాధనల వల్ల తన్నుతాను తెలిసికొన్నప్పుడు వెలుగురేఖలు జీవిత మందు ప్రసరించి మనో వికాసాన్ని కలుగజేస్తాయి. కాని మానవుల్లో భావ సంఘర్షణ కావాలనీ, ఆధ్యాత్మిక దారిద్ర్యాన్ని రూపుమాపి నిర్మల చిత్తాన్ని మానవుడు కలిగిఉన్ననాడు అతని జీవితం తొలి ఉషోదయంగా ఉంటుంది. అట్టి దాన్నే బైరాగి ఉద్దేశించాడు.

ఈ) శ్రీరంగం నారాయణబాబు : వీరు రచించిన 'గడ్డిపరక' అనే గేయం కష్టపడి చెమటోడ్చి కండలు విరిచి పొట్ట గడుపుకొను వ్యక్తిని ఉద్దేశించి వ్రాసింది. 'గడ్డిపరక' సమాజమునందు హీనంగా చూడబడు జీవికి పెట్టుబడిదారుల కాళ్ళకింద నలిగిపోయే మానవునకు సంకేతం. గేయమంతా అతని జీవితాన్ని ఆధారం చేసికొని రచించాడు.

"నడవండి నడవండి నా మీంచి నడవండి
గడ్డిపరకను గడ్డిపరకను
పూజా సమయాల పూవును
దూర్వాంకురాన్ని అవసరం తీరాక
అవతల కనబడితె చుల్కనగ చూచేటి
గడ్డిపరకను గడ్డిపరకను
నడవండి నడవండి నామీంచి నడవండి
పల్లకీ దిగినట్టి పెళ్ళికొడుకులు మీరు
పట్టు తివాసీని నేను
నడవండి నడవండి నా మీంచి నడవండి
పశువుల నోటికి పాయసాన్ని
మీ సుకుమార పాదాల మకరికను
నడవండి నడవండి
మీ పైడి పాదాల మృదు రజోలేశాలె

..................................

మిన్ను విప్పిన రక్తపతాకం

..................................

నన్ను నేను తెలిసికొన్నాను

ఆగండి ఆగండి.

గీతం పేరే ఒక ప్రతీక. పూజా సమయం నిర్మాణాత్మక కృషికి

'పూవు' జీవిజీవితానికి, 'పాయసము' నిరుపేదలగు కార్మికుల

ఘర్మకణాలకు, 'పెళ్ళికొడుకు' పెట్టుబడి దారునకు 'పట్టు తివాసి'

కండలు పిండి పని చేసే కార్మికునకు 'పశువు' - మానవత్వం

మంటగలిపి కర్కశంగా ప్రవర్తించేవానికి 'రక్తపతాకం' - విప్లవానికి సంకేతాలుగా ఉపయోగించేవారు.

నవ సమాజ నిర్మాణానికి పునాది వేయడానికీ, సమానత్వాన్ని ప్రతిపాదించి జీవితం శాశ్వతం చేయాలని, ఆ సంకల్ప సిద్ధికై సామ్యవాదమే ధ్యేయమని భావించారు. కార్మిక శ్రేయస్సును కవి దృష్టియందుంచుకొని గీతం రచించారు.

**ఉ) శ్రీశ్రీ :** శ్రీశ్రీ రచించిన మహాప్రస్థాన గీతాలయందు చాలా వరకు ప్రతీక కవితలకు చెందినవి ఉన్నాయి. అందులో 'ప్రతిజ్ఞ, నీడలు, పేదలు, నవకవిత' ప్రధానమైనవి.

**ఊ) కరుణశ్రీ :** వీరి కవితల్లో 'తప్పులేని తమ్ముడు' ఖండికలో ప్రతీక కవిత తొంగి చూస్తున్నది.

**ఋ) వింజూరి సుబ్బారావు :** వీరి 'ఎంకి పాటల'లో గోవుమాలచ్చిమి అనే గీతం ప్రతీక కవితకు చెందింది. గోవుమాలచ్చిమి సకల సంపదలకు అనంతమైన సుఖానికి సంకేతం, గోవును లక్ష్మిగా స్వీకరించి రచించారు.

**ౠ) సి. నారాయణరెడ్డి :** వీరు రచించిన 'మనిషి-చిలక' అనే కావ్యంలో పంచవన్నెల ఆ రామచిలక, పరమాత్మకు మరొక ప్రతీక' అని వివరించారు. ఇంకా 'ఇంకిపోయినబావి!' అనే ఖండిక భావ దారిద్ర్యంతో బాధపడుతున్న ఛాందసత్వానికి ప్రతీక. అట్లే 'జోడెద్దుల కుమ్ములాట' ఖండికలో కూడా ప్రతీక తుది వరకున్నది. 'ఆగామియుగనైమిశారణ్యం' అనే ఖండికలో నైమిశము - విద్యా కేంద్రం, విద్యా కేంద్రంగా నిరూపించారు.

**ఎ) గుంటూరు శేషేంద్ర శర్మ :** వీరు రచించిన 'మండే సూర్యుడు' అనే కావ్య సంపుటిలో ప్రతీకలు తరచుగా వాడబడ్డవి. ఇందులో సూర్యుడు ప్రగతికి ప్రతీక 'నేను చెమట బిందువుని' అను వాక్యంలో చెమట బిందువు శ్రామికునకు ప్రతీక : 'కండల కొండల్లో ఉదయించే లోక బంధువుని గుండెలతో నాకు దోస్తి' - ఇందు విశ్వశ్రేయస్సు లోకబంధువుగా వ్యవహరింపబడింది.

అస్సామి సాహిత్యమందు ప్రతీక కవితాపద్ధతికి 'హేమబారువా' ప్రసిద్ధుడు. కాశ్మీరీ సాహిత్యమునందు 'నదీమ్' కవి పురాతన జానపద గాథలను స్వీకరించి చిత్రంగా కల్పనలు గావించాడు.

ఏ అభ్యుదయ కవి అయినా సరే తన కాలం నాటి దేశకాల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వాని కనుగుణంగా ప్రతీకలను ఏర్పరచుకొని వాని మాటున తీవ్ర సంఘర్షణను చొనిపి రచనలు సాగిస్తాడు. అది కేవలం నవ్య భావ వ్యక్తీకరణ కొరకు యూరప్ యువ కవుల కావ్యాల సంపర్కం చేత ఏర్పడింది.

తెలుగు సాహిత్యంలో ప్రతీకవాదంవైపు మొగ్గుచూపిన కవులున్నారు. అందులో ఒకరిద్దరు మాత్రమే ప్రతీకవాద తత్త్వం తెలిసినవారు. తక్కిన వారి ప్రతీకలు యాదృచ్ఛికాలు. అయినప్పటికీ ఆ ప్రతీకలను తమ అనుభవ ప్రపంచం నుండి ఏరుకొని వానికొక స్థానాన్ని సాహిత్యమందు కల్పించి ప్రాణ ప్రతిష్ఠ చేశారు.

## 11.6 అభివ్యక్తి వాదము (Expressionism)

**11.6.1. ఈ వాద ప్రారంభవికాసాలు :** ఇటలీ దేశానికి చెందిన 'క్రోచే' (Benedetto Croce) (1866-1952) అనే దార్శనికుని సిద్ధాంతాల ఆధారంగా అభివ్యక్తి వాదమేర్పడింది. దీనినే ఉక్తి వాదమనియు లేక వ్యక్తిత్వ వాదమనియు అంటారు. నిజానికి క్రోచే ప్రతిపాదించిన కళా సిద్ధాంతాల యందు ఎక్కడా గూడా నేడు అభివ్యక్తివాదమని చెప్పబడే కళా విధానాలను సమర్థించే వాక్యాలు లేనే లేవు. దీన్ని బట్టి క్రోచే ప్రతిపాదించిన 'expressionism' అనే పదం ప్రత్యేకంగా ఒక కళాధర్మంకాదు ప్రత్యేక రచనా విధానానికి సంబంధించినదియు కాదు. అది అన్ని కళలకును అందరి రచయితలకును అన్వయిస్తుంది. క్రోచే ప్రతిపాదించిన కళా సిద్ధాంతాన్ని అనుసరించి చూస్తే షేక్స్పియర్, టెన్నిసన్, వాల్మీకి, కాళిదాసు, తిక్కన, పెద్దన మొదలైన కవులంతా - వేయేల ప్రపంచంలోని కవులంతా అభివ్యక్తి వాదులే. క్రోచే కళాతత్వాన్ని నిరూపించడానికి ప్రయత్నంచేవాడే కాని ప్రత్యేక కళా విధానాన్ని లేక రచనా విధానాన్ని ప్రతిపాదించలేదు. కాబట్టి అభివ్యక్తివాదం కళాతత్వాన్ని మాత్రమే వివరిస్తుంది. ప్రత్యేక కళావిధానాన్ని స్థాపించదు. క్రోచే అభిప్రాయంలో కళాకారులందరూ సమానులే రచనలన్నీ సమానమే.

కళలోకూడా అభివ్యక్తి మార్గమొకటుంది. దీన్నే Expressionistic Art అంటారు. క్రోచే ఈ ప్రత్యేకమైన కళా విధానాన్ని గురించి ఆలోచించలేదు. దానికొక సిద్ధాంతాన్ని అతడు ప్రతిపాదించలేదు. 'అభివ్యక్తి' అన్నది కళకు వ్యష్టిగామన్న ఒక మార్గమని క్రోచే భావించలేదు. అది కళలన్నిటా అతనికి కనబడ్డ సామాన్య లక్షణం. అతడు ఏ ఒక్క ప్రత్యేక కళామార్గాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించలేదు.

**11.6.2. క్రోచే ప్రతిపాదించిన కళా సిద్ధాంతము :** క్రోచే అభిప్రాయంలో మనస్సుకు బాహిరంగా ఏదియూ లేదు. సర్వమూ మనస్సే. అంటే మనస్సుకు బాహ్యంగా, స్వతంత్రంగా ఉండే వాస్తవికత ఒకటి, మనస్సునందే ఉండు వాస్తవికత ఒకటి అని రెండు విధాలైన వాస్తవికతలు లేవు. అంతా మనస్సునందే ఉంటుంది. జ్ఞానం రెండు విధాలు.

1. అంతర్ జ్ఞానము (Intuitive) : 2. తార్కికమగు జ్ఞానం (Logical).

ఒకటి భావ జనితము, రెండవది బుద్ధి జనితము. ఒకదానివల్ల రూపకల్పనం జరుగుతుంది. రెండవదానివల్ల ప్రత్యయాలు (Concepts) జనిస్తాయి. మొదటిది వ్యక్తిగత జ్ఞానం. రెండవది వ్యక్తికీ, వ్యక్తికీగల పరస్పర సంబంధ జ్ఞానము. బుద్ధి-ఇంద్రియాలవల్ల మనము మానవుడు ఆలోచించు మృగమని నిర్ణయించగలం. భావనవల్ల ఆలోచనా ధర్మంగల ఆ మృగము యొక్క రూపాన్ని గ్రహించగలం.

అంతర్ జ్ఞానము యాంత్రికం కాదు. ప్రాకృతికం కాదు. నిష్క్రియా రూపంకాదు. అది అతీంద్రియము. మనో ముద్రితములగు భావాల శక్తిమంతమగు అభివ్యక్తి. క్రోచే అభిప్రాయంలో కళ అంటే అంతర్ జ్ఞానమే. అదే అభివ్యక్తి. మనో ముద్రిత ప్రగాఢ భావాభివ్యక్తి. అభివ్యక్తము కానిది అంతర్ జ్ఞానమే కాదు. అప్పుడది ఇంద్రియ జ్ఞానం. లేక స్వాభావికత మాత్రమే అవుతుంది. కాని ఈ కళాసృష్టి ఈ రూప కల్పనము మనస్సునందే జరుగుతుంది. ఒక చిత్రకారునికి ఒక వస్తువు యొక్క అనుభూతి కలగవచ్చును. తదను భూతిని రేఖా మాత్రంగా అతడు గ్రహించవచ్చు. అంత మాత్రాన అతడు అంతర్ జ్ఞానాన్ని పొందజాలడు. ఆ వస్తువుని పొందటానికి సమ్యక్ దర్శనం అవసరం. అంటే ఆ వస్తువును సర్వ సంపూర్ణంగా అభివ్యక్తం చేయగలిగినపుడే అంతర్ జ్ఞానం సిద్ధిస్తుంది.

కళాసృష్టి అంతా వ్యక్తిగతమని అది ఆంతరమగు వ్యాపారమని, మనో నిష్ఠయని క్రోచే సిద్ధాంతము. బహిరంగంగా వ్యక్తమయ్యేది. కళకాదని అతని అభిప్రాయం.

"The work of Art (the Aesthetic work) is always internal; and that which is called external is no longer a work of art" (by Croce)

పైన చెప్పిన అభిప్రాయాన్ని కొందరు ఈ విధంగా ఖండిస్తున్నారు. చక్షురాది ఇంద్రియ గోచరాలగు కళా ఖండాలన్నీ కళానిర్మాణాలుకాక మరేమిటి? ఈ ప్రశ్నకు సమాధానమిది. అది కేవలం స్మృతి సహాయకములు. శరీరోత్తేజకాలు. స్మృత్యాదులచేత ప్రభావితుడైన కళాకారుడు తన అంతర్జ్ఞానాన్ని తిరిగి ఉత్పత్తిచేస్తాడు. తాను దర్శించిన రూపాలు నశింపకూడదను ప్రబలమగు ఇచ్ఛయే, అట్టి ఉత్పత్తికి కారణం. మనం ఆ కళా సౌందర్యాన్ని ప్రశంసిస్తాం. కారణమేమిటంటే ఎట్టి మానసికావస్థయందు మనకు సుందరమగు అంతర్ జ్ఞానం కలిగిందో అట్టి మానసికావస్థను కళా సందర్శనంవల్ల మనం పొందగలుగుతున్నాం. అందుకే ఆ కళాఖండాలను సుందరములని

అంటాం. నిజమైన కళ, కళాకారుని మనస్సునందే ఉంటుంది. అది పునరుక్తంకాదు. "కళ" అంటే అంతర్ జ్ఞానం. అంతః జ్ఞానం అంటే వ్యక్తిత్వం. వ్యక్తిత్వం పునరుక్తంకాదు". ఇది క్రోచే సిద్ధాంతం.

"Art is intuition and intuition is individuality is never repeated" (Croce)

ఈ సిద్ధాంతాన్ని అనుసరించిచూస్తే నిజమైన కళానందాన్ని పొందగలవాడు కళాకారుడు మాత్రమే. ఇతరులు కాదు. ఒక మహా కవిని అర్థం చేసుకోవాలంటే మనం ఆ మహా కవిస్థాయికి పోవాలని క్రోచే నిర్ణయం.

11.6.3. అతీంద్రియతయే కళ : క్రోచే తత్త్వ వివేచనలో అతీంద్రియతయే కళ. అదే మనసున భావ ముద్రలను అభివ్యక్త మొనరిస్తుంది.

కొందరు విమర్శకులు జీవితంలోని అనుభవాలు, కళలోని అనుభవాలు వేర్వేరుగా ఉన్నట్లు భావిస్తారు. క్రోచే ఈ రెండింటిని విడదీసి చూడడు. రెండూ సజాతీయాలే. అయితే పరిమాణంలోనూ, విస్తరణలోనూ భిన్నంగా ఉంటాయి. ఎట్టి జీవితానుభవమైనా, ఎట్టి భావ ముద్ర అయినా కళకు వస్తువే. ప్రధానమైనదేమంటే దాన్ని కళాకారుడు స్పష్టంగా చూడగల్గాలి. అవగాహన చేసుకోవాలి. ఆవిధంగా స్పష్టంగా చూడగలిగినపుడే దాన్ని స్పష్టంగా వ్యక్తీకరిస్తాడు. అదే అభివ్యక్తి అవుతుంది. కళాత్మకమైన అతీంద్రియత సాధారణమైన అతీంద్రియత కన్నా భిన్నమై, గాఢమై ఉండదు. అది విపులమై, విశాలమై విస్తరించి ఉంటుంది. 'The artistic intuition differs from the ordinary not in intensity. The difference is not, intensive but extensive" (Croce) క్రోచే తాత్త్విక వివేచనలో అతీంద్రియత, అభివ్యక్తి వేర్వేరు అంశాలు కావు. అభివ్యక్తిలేని అతీంద్రియత లేదు. ఈ అతీంద్రియత - అభివ్యక్తియే కళఅంటాడు క్రోచే. అతీంద్రియత, అభివ్యక్తి కళాకారుని మనసున జరిగేవని. దానికి అతడు ఎవరికీ జవాబు దారీ వహించడు. నీవు కాళిదాసు కావ్యాన్ని అర్థం చేసుకునేందుకు, అతని అతీంద్రియతను పునఃసృష్టి చేసుకొనేందుకు కాళిదాసులే అవ్వాలన్నమాట.

11.6.4. క్రోచే భావాలు : అభివ్యక్తి వాదం : సంప్రదాయం : సాహిత్యంలో ఎట్టి సిద్ధాంతాన్ని ప్రతిపాదించినా, ఆ సిద్ధాంతం ఆనాడు ఆదరింపబడినా, తరువాత వచ్చిన కవులు, రచయితలు దానికి భిన్నమైన రచనలనే చేయనారంభించారు. క్రోచేవంటి విమర్శకులు వెనుకటి సాహిత్య సూత్రాలను వ్యతిరేకిస్తారు. క్రొత్త సిద్ధాంతాలను అన్వేషిస్తారు. సాహిత్యంలో క్లాసికల్ విమర్శకుల సమాలోచనలో అలంకారాలు చాలా ముఖ్యమైనవి. కవులు అలంకారాన్ని అభిమానించేవారు. అలాగే ప్రతీ సాహిత్య ప్రక్రియకూ కొన్ని ఔచిత్య సూత్రాలుంటాయనీ వాటిని విధిగా పాటించాలనీ భావించేవారు. క్రోచే ఇట్టి భావాల్ని వ్యతిరేకించారు.

కవికి పరికరాలయిన ఛందస్సు వ్యాకరణం మున్నగునవి అన్నీ సిద్ధమైనవిగానే ఉన్నా వానిని ఉపయోగిస్తూనే, వానిలోని క్రొత్తదనాన్ని చూపడమే కవికర్మ. వస్తువు భాషా రెండూకూడా వారసత్వంగా లభించేవే అయినా, రెండింటినీ కలిగించి క్రొత్త మూసలలో పోతపోసి, కవి నూతనమైన ఆకృతులను సృష్టిస్తాడు. అసలు భాష అనుక్షణము సృష్టింపబడుతూనే ఉంటుందంటాడు క్రోచే.

పరిక్రొత్త భావ ముద్రలు ఉచ్చారణలోనూ, అర్థములోనూ మార్పులు తీసికొని వస్తాయి. నూతనమైన భావ వ్యక్తీకరణకు కారణమవుతాయి.

సాహిత్య విమర్శలో సంప్రదాయ సిద్ధంగా వస్తున్న ఎన్నోరకాల విశ్లేషణలమా, వింగడింపులకు క్రోచే వ్యతిరేకి.

ఉదాహరణకు : క్లాసికల్ - రొమాంటిక్; ప్రతీకాత్మకత - వాస్తవికత వంటి జంటపదాలు ఒక్కొక్క విమర్శకుని అభిరుచిని, సంస్కారాన్ని బట్టి ఒక్కొక్క విధమైన అర్థానికి కారణమవుతాయి.

క్లాసికల్ అంటే కళాత్మకంగా నిర్దుష్టమైనదని ఒకనికితోస్తే మరొకనికి అది కృతకమైనదని తోచవచ్చు.

రొమాంటిక్ అంటే అచ్చమైన కవితాత్మనిముద్దుకొన్నది కావచ్చు. వట్టిరాగ ప్రదర్శనతో కూడినదనీ sentimentalగా ఉండేదని అర్థం కావచ్చు.

వాస్తవికమైనదంటే ఒకనికి వట్టి అనుకరణాత్మకమైనది. మరొకనికి జీవితాన్ని స్పష్టంగా ప్రదర్శించేది.

12)

ప్రతీకాత్మకత అంటే వాస్తవాన్ని వక్రీకరించడం కావచ్చు. గుప్తకథాత్మకమైనదన్న భావం కల్గవచ్చు. ఈ జంటపదాల్లో ప్రతీ పదమూ కవితాత్మకతను సూచిస్తుందన్న భావాన్ని కానీ, తద్వ్యతిరేక భావాన్ని కానీ కల్గించవచ్చు. ఈ పదాలను ప్రశంసార్థకంగా కానీ, నిందార్థకంగాకానీ వాడడానికి, సమానమైన అవకాశాలున్నాయంటాడు క్రోచే.

క్రోచే ఇలా సంప్రదాయ విమర్శలోని వివేచనను వ్యతిరేకించినా అందలి పారిభాషక పదాలు కళాత్మకతను ఆవిష్కరించవని వాదించినా, అతడు మంచి భావుకుడు, విమర్శకుడు. శబ్దాల కూర్పువల్ల ఏర్పడ్డ నాద విన్యాసంవల్లనే పద్యం మనకు మనోరంజనాన్ని ఆనందాన్ని కల్గిస్తోందని అనుకోవడం వట్టి భ్రమఅంటాడు క్రోచే. క్రోచే, ఎడ్గార్ ఏలెన్ వలెనే రసాత్మకత దీర్ఘమైన కావ్యాల్లో కంటె హ్రస్వమైన రచనల్లోనే గోచరిస్తుందంటాడు.

అతీంద్రియ స్థితిలో రామకథనంతా దర్శించినా, దానిని కావ్యంగా మనకు అందజేసినపుడే వాల్మీకి నొక కవిగా మనం గుర్తిస్తున్నాం. కాని క్రోచే కావ్య సృష్టి జరగకపోయినా కవి అతీంద్రియతే కావ్యమంటాడు.

క్రోచే మహాకావ్యాన్నీ, రూపకాన్నీ అఖండ కళాఖండాలుగా అనుశీలించడాన్ని విపేదిస్తాడు. వానిని అచ్చమైన కవితల సంకలనాలుగా చూడాలని అంటూ, అప్పటప్పటి కవిత్వపు మెరుపులతో తృప్తిపడుతుంటాడు. అంటే మహా కావ్యంలో కానీ, నాటకంలోకానీ కన్పడే శిల్పమూ, ఆకృతీ, పరస్పరాంశాల రాపిళ్ళూ మున్నగువానివల్ల పుట్టే అర్థాలను, అర్థాంతరాలనూ క్రోచే నిర్లక్ష్యం చేయమంటాడు.

క్రోచే అన్నిరకాల ఉపదేశాత్మక, శాస్త్రీయ ప్రమాణాలతో కళాఖండాలను సమీపించడాన్ని కూడా నిరుత్సాహపరచాడు. సరియైన చారిత్రక అవగాహనతో కావ్య రచనాకాలంనాటి పరిస్థితులను పునరుద్ధరించుకుంటూ ఆనాటి భాషా సంప్రదాయాన్ని అర్థం చేసుకుంటూ కావ్యాన్ని సమీపించమంటాడు.

**11.6.5. అభివ్యక్తి కళ - ఒక ఉద్యమం :** ఈ శతాబ్దపు ఆరంభంలో 'అభివ్యక్తికళ (Expressionsitic art) ఒక ఉద్యమంగా స్వీడిష్ నాటక కర్త. Strindbeg (1849-1912 ప్రభావంతో ప్రారంభమైంది. 1915-25 మధ్యలో ఈ ఉద్యమం పరాకాష్టనందుకుంది. సాహిత్యంలోను- ముఖ్యంగా నాటకంలో సంగీతంలో చిత్రకళలోనూ దాని ప్రభావం కనబడుతుంది.

కళలో అభివ్యక్తివాదం వాస్తవికతావాదాన్ని ప్రతిఘటించేదిగా ప్రారంభమైంది. కళాకారుడు తన మూర్తిమత్వాన్నే కళలో ప్రతిఫలింపచేస్తాడు. ఇట్టి వ్యక్తి గతానుభవాభివ్యక్తి (Self expression) కుహనా వస్త్వాశ్రయ వర్ణనకన్నా ఎంతో సత్యమైంది. వాస్తవానికి సమీపమైంది. విలువైంది అంటాడు పాటర్.

అభివ్యక్తి నాటక కర్తలు విలక్షణమైన శైలిలో సంభాషణలను కూరుస్తారు. కాంతి, శబ్దం కల్గించే ఎఫెక్ట్సును గిరిగిర తిరిగే రంగస్థలాన్ని (revolving stage) ఉపయోగిస్తారు. అత్యాధునిక రంగస్థలాన్ని అన్ని విధాలా ఉపయోగిస్తారు. Bertolt Brecht వంటి జర్మన్ అభివ్యక్తి నాటకకర్తల ప్రభావం అమెరికన్ రూపకాల మీదకూడపడింది. Theater of the Absurd లోకి అవాస్తవిక ప్రయత్నాలలోనూ, చలన చిత్రాలలోనూ అభివ్యక్తివాదం ప్రభావం కనబడుతుంది.

ప్రతీక వాదులైనా, ప్రతిబింబవాదులైనా, అధివాస్తవికులయినా absurdists అయినా-వీరందరి అన్వేషణా, అభివ్యక్తీ స్వీయమైన ఆంతరంగిక మనస్సునుండి పుట్టినవే.

అధివాస్తవికతకు ఆకృతిలో సంబంధంలేని మానసిక స్థితి ముఖ్యమైనదవుతుంది. అధి వాస్తవికులు ఫ్రాయిడ్ సిద్ధాంతాలను ఆదరిస్తారు. వారు అజ్ఞాత మనస్సుకు స్వాతంత్ర్యం ప్రకటించారు. యధేచ్ఛా రచనలను (automatic writing) స్వప్నాలను, పూనకాలవంటి అవ్యక్త ప్రేలాపనను అధివాస్తవికులు అక్షర బద్ధమొనరిస్తారు. ఇది అభివ్యక్తివాదానికి పరమమైన స్థితి అనుకోవచ్చు. 'అభివ్యక్తి' కళ ఇన్ని రకాల ర్వప్షలలో కనబడినా, దాని ప్రభావం నాటకాలలోనే ప్రధానంగా కనబడుతోంది. కళలో అభివ్యక్తి అవగానే మనకు నాటకాలే ముఖ్యంగా జ్ఞాపకం వస్తాయి.

## 11.7. అధివాస్తవికతా వాదం (Surrelism)

**11.7.1. అధివాస్తవిక ఆవిర్భావం :** ఈ అధివాస్తవికత మొదట చిత్రకళతో వచ్చింది. తరువాత సాహిత్యంలోకి ఎగుమతి అయ్యింది. ఫ్రాయిడ్ చెప్పిన సైకో ఎనాలిసిస్ (phycho-analysis) ఆధారంగా ఈ వాదం ఆవిర్భవించింది.

ఆధునిక చిత్రకళ ఉద్యమంలో విశేష ప్రాముఖ్యాన్ని కలిగి సాహిత్య రంగానికి అనువర్తితమైన ఈ ఉద్యమానికి అధినాయకులు సాల్వడార్ డాలీ. ఎర్నెస్టు మార్క్సు అనువారు. వీరి ప్రధాన లక్ష్యం ఏమంటే అంతశ్చేతనలోని నిగూఢ సత్యాన్ని తెలుసుకోవడమే. కాని వీరికింతకన్న ముఖ్యమైంది బుద్ధి, మనస్సు, ఆవేశం, ఆలోచన, సంప్రదాయం, వాస్తవికత మొదలైనవన్నీ నిర్మూలించి సత్యాన్ని భాసింప చేయటం. వీరి చిత్రాల్లో సంజ్ఞలు మిక్కిలి ప్రధానమైనవి. ఈ సంజ్ఞలు మనస్తత్వ శాస్త్రాదులకు సంబంధించి ఉండటంచేత సామాన్యులకు అందుబాటులో ఉండవు. సాహిత్యంలో కూడా ఇట్లే ఈ ఉద్యమం ప్రవర్తిల్లింది. "అధివాస్తవికత సాహిత్యంలో తెరవబడ్డ కవాటం. ఫ్రాయిడ్, మార్క్సుల సిద్ధాంతాల కలయికతో పుట్టినగానము" ఈ కవితలో అర్థస్ఫూర్తి ఉండదు. కాబట్టి ఇది వెఱ్ఱిగా కన్పిస్తుంది.

అచేతనంలో దాగివున్న గుప్త భావాలు సాంఘిక బంధనాలకు లోబడక అవకాశం చూచుకొని స్వప్న జగత్తులో వాస్తవరూపాన్ని దాలుస్తాయి. ఇందులో దేశకాలాల అడ్డంకులుండవు. ఇటాలియన్ చిత్రకారుడు జార్జి యోది చెరికో, పాల్‌క్లె అనే స్విస్ చిత్రకారుడూ, సాల్వదార్ దాలీ అనే స్పానిష్ చిత్రకారుడూ, సుప్రసిద్ధ బ్రిటిష్ చిత్రకారుడైన గ్రాహం సదర్లాండు మొదలైన వారంతా సర్రియలిస్టు చిత్రకారులే.

సర్రియలిజం యొక్క ధోరణులు ఇంగ్లాండులోకూడా పొడచూపాయి. హెర్బర్టురీడు అనునాతడు ఈ ఉద్యమానికి నాయకత్వం వహించి నడిపించాడు. అయితే ఫ్రాన్సు, ఇటలీ మొదలైన దేశాల్లో ఏర్పడ్డ తీవ్ర పరిస్థితులు ఇక్కడ ఏర్పడలేదు. నామ మాత్రంగా అనుసరించారే కాని తమ భావాలను ప్రచారం చేయడానికి ప్రముఖ సాధనంగా వినియోగించుకోలేదు. ఫ్రెంచి రచయితలు చూపించిన ప్రజ్ఞా విశేషాలు ఇతర దేశపు రచయితలంతగ చూపింపలేదు కాని 1929లో డేవిడ్ గ్యాస్కాయిన్ 'New verse' అనే కవితా సంపుటిని ప్రచురించారు. అందులో అన్నీ సర్రియలిస్టు గీతాలే ఉన్నాయి. 1936లో లండన్‌లో ఒక ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటు చేశారు. ప్రచార నిమిత్తం ఒక పత్రికకూడా ప్రారంభింపబడింది. అప్పటికి డిలాన్ థామస్ ప్రముఖ కవిగ ప్రసిద్ధిచెందాడు. 1942 నాటికి గ్యాస్కాయిన్ మారిపోవటంతో ఇంగ్లాండులో ఈ ఉద్యమం చల్లారిపోయింది.

**11.7.2. అధివాస్తవికత - స్వప్న సిద్ధాంతం :** 1924లో ఆంద్రే బ్రిటన్ నాయకత్వంలో (Manifesto of Surrealism) అధివాస్తవికతా ప్రకటన పత్రం ప్రచురింపబడింది. బ్రిటన్‌తోపాటు లూయిస్ ఆరగా (Louis Aragon) సోపాల్ (Soupault) పాల్ ఎల్వర్డ్ (Paul Elward) మొదలైనవారు ఈ ఉద్యమకర్తలు. ఈ ఉద్యమానికి 1919లోనే బీజం పడింది. ఆంద్రే బ్రిటన్ 1919లో ఒక సాయంకాలం నిద్రోన్ముఖుడై ఉండగా వ్యాకరణ రీత్యా సరిగానున్న ఒక చరణం స్ఫురించింది. దానితోబాటు ఇంకా కొన్ని చరణాలు పెల్లుబికాయి. వీటన్నిటినీ చేరిస్తే ఒక గేయమవుతుందనే విషయం అతనికి తట్టింది. తరువాత బ్రిటన్ అతని మిత్రుడు సోపాల్ కలిసి ప్రశాంతమైన ఒక గదిలో కూర్చుండి ఆలోచనలకతీతులై, నిద్రోన్ముఖమైన అవస్థలో కలిగే భావాలను వెంట వెంటనే కాగితంపై వ్రాసుకున్నారు. ఆ రెండింటిలోని చరణాలు, వాని భావాలు అసంబద్ధంగా ఉన్నా వానిని చదివేటప్పుడేదో ఒక అనుభూతి కలగకపోదు. తమ రచనలను జాగ్రత్తగా పరిశీలించిన పిమ్మట ఆ రచయితలిరువురూ ఇంత కాలం తమలో గుప్తంగా పడివున్న ప్రగాఢానుభూతులకా రచనలు దిగ్దర్శకాలని భావించారు. సర్రియలిజానికి వ్యక్తావ్యక్తము పునాది అనే భావం దృఢపడింది.

అధివాస్తవికత మొదట తాత్త్విక దృక్పథంగా, మనస్తత్వ సిద్ధాంతంగా ఏర్పడింది. ఫ్రాయిడ్ మనోవిశ్లేషణ శాస్త్రం దీనికి వెన్నుముక వంటిది. ఐన్‌స్టీన్ టివి రిలే సిద్ధాంతం (సాపేక్ష సిద్ధాంతం) కూడా దీనిపై ప్రభావాన్ని చూపింది. క్రమంగా ద్వితీయ ప్రపంచ సంగ్రామ కాలం నాటికి ప్రపంచమంతటా ప్రముఖ సాహిత్య సిద్ధాంతంగా వ్యాపించింది.

**11.7.3. అధివాస్తవికుల లక్ష్యం :** చేతనకును అచేతనకును నడుమ అరలు అనేకం ఉంటాయి. వాటిని పడగొట్టి బాహ్యాంభ్యంతర ప్రపంచాలను చేర్చి, ధ్యానానికి, ఆచరణమునకు, సుప్త భావాలకును, వ్యక్తలోకానికీ సమన్వయాన్ని సాధించటమే అధివాస్తవికుల ప్రధాన

ధ్యేయం. మార్క్సువాదం బాహ్య సంఘర్షణనే గ్రహిస్తుంది. అధివాస్తవికత బాహ్యాంభ్యంతర సంఘర్షణను గ్రహిస్తుంది. ఇందే 'గతి తర్కం' తో దీనికి సంబంధమేర్పడింది.

అధివాస్తవికతకు వ్యక్తావ్యక్తావస్థ ప్రధానమైంది. వ్యక్తావ్యక్తాన్ని విశృంఖలం చేయటమే సర్రియలిష్టుల ముఖ్య ధ్యేయం. ఈ ధ్యేయాన్ని సాధించటానికి వీరు గత నిరసనం, సంప్రదాయ నిరసనం, ప్రధాన కర్తవ్యంగా భావించారు. వ్యంగ్యం, అధిక్షేపం, హాస్యం, హేళనలను సాధనాలుగా చేసుకున్నారు. సౌందర్యానికి, నీతికి సంబంధించిన ప్రాచీన సూత్రాలను తుడిచిపెట్టారు. అయినప్పటికీ డాడాయిస్టులవలె వీరు అశ్లీలాన్ని ఆదరించలేదు. జుగుప్సావహమైన రీతిలో గతాన్ని తృణీకరింపలేదు. వీరు గతమూల్యాలను సహేతుకంగా నిరసించారు. అందుకు అధిక్షేపంకంటే లలిత హాస్యానికి ఆదరమిచ్చారు. స్వప్నస్థితిని చైతన్యానికి అగ్ర తాంబూలమిచ్చారు. శబ్దంచేత చిత్రమైన గారడీలు చేశారు.

డాలీవేసిన బొమ్మలు, పాల్ ఎల్వర్డు కవి గేయాలు, మాన్రే (Man Ray) ఛాయాచిత్రాలు, బ్యూన్వెల్ (Bunuel) వేసిన చలన చిత్రాలు, ఆంద్రీ బ్రిటన్ విమర్శలు సర్రియలిజాన్ని పతాక స్థాయికి తీసుకొనిపోయింది. అందుకే రాజకీయాల్లో నానాజాతి సమితి ఎటువంటిదో కళా ప్రపంచములో సర్రియలిజం అట్టిదని శ్రీశ్రీ అన్నారు.

సర్రియలిస్టులందరూ ఒక ప్రత్యేక మార్గాన్ని రచనలో చూపించారు. వీరు ప్రధానంగా సంప్రదాయ బద్ధంగా వస్తున్న నిర్మాణాత్మక రచనను, వ్యాకరణం, పద ప్రయోగం, ఛందస్సు మున్నగు వానిని తిరస్కరించడమేకాక, సౌందర్య రహితమగు దృశ్యాలను చిత్రించారు. కామాన్ని ప్రకోపింపచేసి అర్థాన్ని అయోమయం చేశారు. స్వచ్ఛంద గీతాలు వ్రాసినప్పటికీ భావంలో వాక్యాల్లో పరిసమాప్తి అంతగా కన్పింపచేసే అవకాశాన్ని వీరు తీవ్రంగా నిరోధించారు. శబ్దాలమధ్య సంబంధంలేకుండా ఉపయోగించే పరిపాటిని పాటించటంచేత అన్వయం క్లిష్టంగా ఉంటుంది. వీరి కవితలో సమస్త మార్గాలు సంగమించాయి. భావకల్లోలాలవల్ల బయలుదేరిన ప్రతీకవాదము ఆకవితలో స్థానాన్ని సంపాదించింది.

"యధార్థాన్ని గుర్తించం. కలలు మాకు యధార్థాలు. ఈ జగత్తుతో మాకు పనిలేదు. మాది స్వప్నజగత్తు. సంపన్నులు, భాషా సంపన్నులు మాకు విరోధులు. కావ్య లక్షణాలే అవలక్షణాలు. అందరం కవులమే. వ్యక్తాన్ని వదలిపెడతాము. వ్యక్తావ్యక్తంలో ఈతకొడతాం. ఏదో విధమైన శక్తి మమ్మల్ని పూనుతుంది. అదేదో రాయిస్తుంది. అర్థమనర్థం. అదేదిరాయిస్తే అదే కవిత్వం. ఇది అధివాస్తవికులమతం."

**11.7.4. అధివాస్తవికత - నిర్వచనం :** 'సర్రియలిజం'ని ఈ విధంగా నిర్వచించారు. "ఇది మనస్తత్వ మార్గం 'Sur' అంటే లోపల అన్న అర్థమని అంటారు. దీన్ని బట్టి 'సర్రియలిజం'లో ఒక పద్ధతి మనకు కనబడే బాహ్య ప్రపంచానికి పునాదియైన నిమ్నోన్నత భావ ప్రపంచ కథనమన్నమాట. మరికొందరు Sur అనే పదం 'Super' యొక్క సంకుచిత రూపమనిన్నీ Sur-realism' అంటే యథా దృష్టాన్ని చాలా అతిశయోక్తితో చిత్రించటమూ, యథాభావనను కూడా చాలా యెక్కువచేసి చిత్రించటమూ అంటున్నారు." (కురుగంటి - నవ్యాంధ్ర సాహిత్య వీధులు) 'అపస్మారకమనసునుండి స్వప్నలోక రహస్యాలను సంగ్రహించడానికి చేసే ప్రయత్నమని సర్రియలిజమ్'ను నిర్వచింప వచ్చు" అని శ్రీశ్రీ అన్నారు (1939. ఫిబ్రవరి - భారతి).

**11.7.5. అధివాస్తవికత - అభ్యుదయ కవులు :** కమ్యూనిజము ఆంధ్రదేశాన్ని అధికంగా ప్రభావితంచేసింది. ఎఱ్ఱ బావుటా నిగనిగలు ఈ కవులందరినీ ఒకటిగాచేసి అభ్యుదయ కవిత్వవేదికపై నిలబెట్టింది. దానితో వారికొక భావావేశం బయలుదేరి యూరప్‌లో వచ్చిన నూతన కవితలను తెలుగులో మనవారు పరివర్తింపచేశారు. ఆ విధంగా పరివర్తింపచేసిన పద్ధతుల్లో సర్ రియలిజం ఒకటి. దీనిని ఎక్కువగా అభ్యుదయ కవులు ఆధారంగా గ్రహించి కవితలు సృష్టించి సంచలనం కలిగించారు. ఈ కవితలు వారి కావ్యాలందు అచ్చటచ్చటనే వ్రాశారు. కానీ ప్రత్యేకంగా ఒక కావ్యంగా ఎవ్వరూ వ్రాయలేదు. వ్రాసిన వారిలో శ్రీశ్రీ, నారాయణబాబు, పఠాభి, ఆరుద్ర, శిష్టా మున్నగువారు ప్రధానులు.

అధివాస్తవికత యందభ్యుదయ దృక్పథం లేకపోదు. ప్రాచీనతా దూషితమగు సమాజ వ్యవస్థను సమూలంగా పెళ్ళగించి పారవేయాలనేది వీరి సంకల్పం. అభ్యుదయ ధోరణికి నిదర్శనం కానీ వైయక్తికంగా వీరు కోరు స్వేచ్ఛ అభ్యుదయ నిరోధకం. వీరి

కవితయందు రెండవ భావము సువ్యక్తమవుతూంది. అందువల్లే క్రిస్టఫర్ కాడ్వెల్ "illusion and reality" అనే గ్రంథంలో ఈ కవితోద్యమాన్ని నిరసించాడు.

**11.7.6. అధివాస్తవికత - తెలుగు కవితలో ఎంతవరకు ఉంది? :** మన వాఙ్మయంలో పుట్టలో పుట్టి ముఖలో మాడిపోయిన కవితారీతుల్లో అధివాస్తవికత ఒకటి. ఇందు కావ్యాలు వ్రాసిన కవుల సంఖ్య చాలా తక్కువ. కావ్యాల సంఖ్యయు తక్కువే. ఆ కవులు కూడా అధివాస్తవికతా లక్షణాల్ని సరిగా అర్థం చేసికొని అనుభూతి పూర్వకంగా వానిని ఆచరణలో పెట్టినట్లు కన్పించదు. ఉబుసుపోకనో, ఉక్తి వైచిత్రిని ప్రదర్శించటానికో వారాకవితారీతిని చేపట్టినట్లు తోస్తుంది. శ్రీశ్రీ ఈ విషయాన్ని అంగీకరించే ఉన్నారు. శ్రీనారాయణబాబు వంటి వారా విషయాన్నంగీకరించకపోయినా, ఆచరణలో వారుకూడా అధివాస్తవిక కవితలో చాలా భాగము అనువాద లోపాల్ని విడిచిపెట్టితే అందలి గుణదోషాలు రెండూ శ్రీశ్రీకి చెందవు. పఠాభి మొదలైనవారి కవితలలో అధివాస్తవికత గల భాగమత్యల్పము. లైంగిక విషయవాంఛా కలుషితములును, అనవ్యాములును, అపవిత్రములును, అగు భావాలను జుగుప్సావహంగా ప్రకటించినంత మాత్రాన అధివాస్తవికత కాజాలదు. పఠాభిగారి భావాలన్నీ జాగ్రచ్చేతనకు సంబంధించినవే. అచేతనా జన్యములుకావు. ఈ విషయం పఠాభిగారి కావ్య పరిశీలనద్వారా వివరింపబడుతుంది.

ఛందోవ్యాకరణ నియమాలని ఉల్లంఘించినంత మాత్రాన అస్పష్టమును, అర్థరహితము అయినంత మాత్రాన, కవిత్వము అధివాస్తవికం కాదు. నియమోల్లంఘనం అధివాస్తవికతకే నియత ధర్మంకాదు.

**11.7.7. తెలుగులో వచ్చిన అధివాస్తవిక కవితల ప్రధాన లక్షణాలు :**

1. అర్థముకాని ఆలోచనలను ప్రదర్శించడం
2. అన్వయము కుదరని పదప్రయోగాలను వాడటం
3. హేళన
4. చమత్కారాలు
5. కామ ప్రాధాన్యము - విధ్వంసనము
6. ప్రతీకలు వాడటం
7. భావ చిత్రాలను ప్రదర్శించటం
8. ఛందోబంధో బస్తులను త్రెంచటం - నత్తిమాటలు వాడుటం.

తెలుగులో అధివాస్తవిక కవితలు వ్రాసిన వారిలో శ్రీశ్రీ, నారాయణ బాబు ప్రముఖులు. ఈ కవిత ప్రారంభ దినాల్లో కొందరు దీన్ని వెక్కిరించారు. అయినప్పటికి రచన మాత్రము వదలలేదు.

**11.7.8. అధివాస్తవికతా రచనలు :** ఎ) శ్రీశ్రీ De-composition, విదూషకుని ఆత్మహత్య, టాంటాం, కొంటెకోణాలు, అభిసారికి కడసారి, రుబాయిత్, అధివాస్తవికుల ప్రవేశము మున్నగునవి అధివాస్తవిక గీతాలు.

'కొంటెకోణాలు' అను గీతంలో సర్ రియలిజమ్‌ను ఈ విధంగా నిర్వచించారు.

జీబ్రాకి Algebra చిహ్నాల
లాంకోటూ, పాంకోళ్ళూ తొడిగి
సాహిత్య పౌరోహిత్యం యిస్తే
వెఱ్ఱి కాదు, Sur-realism రా సోదరా

ఇందులో జీబ్రావేరు, ఆల్జీబ్రావేరు. ఈ రెంటికి శబ్ద సామ్యము మాత్రమే కలదు. 'జీబ్రా'కు ఆల్జీబ్రా చిహ్నాల లాంకోటు (లాంగుకోటు) తొడుగుట కూడ అర్థము లేనిది. దానిని తొడుగుటకు, సాహిత్య పౌరోహిత్యం చేయటానికి సంబంధం లేదు. కాబట్టి అసంబద్ధత, అనర్థకత, శబ్ద చమత్కారం సర్రియలిజము లక్షణాలని శ్రీశ్రీ చెప్పదలచుకొన్నాడు.

పులికి పిలకలేదనడం
చలికి తెలుగు రాదనడం
శ్రీనివాసరావు వ్రాస్తున్నది
మా నిషాద గీతంలో ఉన్నది.

'పులికి' పిలక 'చలికి' తెలుగు అసంబంధముగు ఆలోచన, సమన్వయముకాని పద ప్రయోగం. ఇందులో చోటు చేసికొనుటయే కన్పిస్తుంది. 'పులికి' 'పిలక' లేదని 'చలికి' తెలుగు రాదనటం ఎంత అసమంజసంగ ఉందో సర్‌రియలిజమ్‌ను వెక్కిరించి వెట్టి అని వ్రేలు పెట్టి చూపించటం అంత అసంబంధంగ ఉంటుంది. 'శ్రీనివాసరావు వ్రాస్తున్నది. మానిషాద గీతములోఉంది' శ్రీశ్రీ మానిషాద గీతమునకే మ త్రము సమన్వయంలేదు. అన్వయముకుదరని పద ప్రయోగాలు కవితలయందు కొంత వరకు స్థానమాక్రమించుకొన్నాయి. ఇంకొక రచనలో శ్రీశ్రీ అధివాస్తవిక ధోరణికి నిదర్శనంగా '5, 3, 2, ఆముక్తమాల్యద. ఆటవెలది ద్విపదకత్తగారు' - అని ప్రకటించారు. 5, 3, 2 కు ఆముక్త మాల్యదకు ఏమీ సంబంధం లేదు. బహుశః సామాన్యంగా కొరుకుడు పడని ప్రౌఢ ప్రబంధం కాబట్టి ఆముక్త మాల్యదను హేళన చేయటానికి ఆ యంకెలు వాడాడేమో! 'ఆటవెలది ద్విపదకత్తగారు' అన్న దానిలో ఈ రెండు పద్యాలకు గల సాన్నిహిత్యాన్ని, లలిత హాస్యరీతిలో చెప్పుచున్నాడేమో!

ఇంకొక గేయంలో
'తురాయికంటె ఆ
కురాయి కంటె, హిమాం
శు రాయి గొప్పవాడు' అన్నారు.

ఇందులో మూడు 'రాళ్ళు' ప్రయోగింపబడుట, అవి మూడు రాళ్ళుకాకపోవుట చమత్కారం. 'హిమాంశురాయి' (య్) ఒక వ్యక్తి. 'తురాయి' కిరీటమున తురమబడేది. ఆకురాయి సరేసరి. వీనిలో 'తురాయి'కి మరియు 'ఆకురాయి'కి 'హిమాంశురాయి'తో గల సంబంధమేమి? హిమాంశురాయ్ రాచటీవి తొణికిసలాడు పాత్రలను ధరించుటలో ప్రసిద్ధుడైన నటుడు. ఇతని బుద్ధి ఆకురాయివలె చురుకైనదని (Sharp as a file). ఈతని వ్యక్తిత్వం తురాయివలె రాజవైభవ ద్యోతకమని కవి యభిప్రాయమేమో! ఏమైనా దీనిలో శబ్ద చమత్కారమే ముఖ్య గుణం.

శ్రీశ్రీ వ్రాసిన యీ గేయాల్ని బట్టి హాస్యం, శబ్ద చమత్కారం, అర్థముల అసంబద్ధత, విశృంఖల పద ప్రయోగం, అధివాస్తవిక కవిత్వం యొక్క లక్షణాలని తెలుస్తున్నది. వీనితోపాటు జుగుప్సా ప్రియత్వం, కామోద్రేక ప్రకటనల, తీవ్రభావ ప్రదర్శనం అనే ముఖ్యమైన లక్షణాలున్నాయి. అవి శ్రీశ్రీ 'అభిసారికి కడసారి'లో నారాయణ బాబు 'లెండోయి బుషులు' 'మౌన శంఖం' 'భావం' 'చిన్నా' 'నీవెవరో' 'గేది పెయ్యి' వంటి గేయాల్లో స్ఫుటంగా గోచరిస్తాయి.

**బి) నారాయణబాబు :**

'చిన్నా' గేయంలో 'మన్నుతింటున్న చిన్న'
మీనాన్న నిన్ను కొడితె
ఏమిటి అల్లా చూస్తావు
..............................
చవితినాడు చిమ్మిలి తిన్నావ!
..............................
మన్ను తింటే పాండురోగ
మొస్తుందంటాం ఏం
..............................

మంటిలోన యినుముందని
పాండు రోగానికె మందని!

ఇందులో మన్ను తినే కుర్రవాడికి, 'చవితినాటి చిమ్మిలి' కి సంబంధం లేదు. అట్లాగే కుర్రవాని చూపుల్లో అంతటి అర్థమున్నదని అనుకోవడం కూడా వ్యక్తా వ్యక్తానికి సంబంధించిన గుణమే. మట్టిలో ఇనుముండుటవల్ల అది పాండు రోగానికి మందనడం, మట్టి తినడం వల్ల పాండురోగం వస్తుందనడం పరస్పర సంబంధాలు కావు. కవి స్వయంగా చెప్పుకున్నట్లు అది వ్యక్తా వ్యక్త భావ ఖేలనముగల గేయం.

నారాయణబాబు 'ఫ్రాయిడ్' కామ సిద్ధాంతంచేత ప్రభావితుడై 'లెండోయ్ ఋషులు' అనే గేయాన్ని రచించాడు. దీనిలో ప్రాణికి కామోద్రేకం, సుఖవాంఛ సహజ గుణాలని, వానిని అణచివేయడంవల్ల ప్రయోజనం లేదని ధ్వనింపచేశాడు.

'కనురెప్పల సెజ్జమీద కళ్ళజోడు ముక్కు తోడ
వ్యభిచరించె
నట్టింట్లో చిల్లుపడిన మజ్జిగ కుండకవ్వం
చీకటి తప్పే చేశాయ్
కుళ్లిపోయిన కూరగాయలు
కునికి పాట్లు పడుతుంటే
టమాటాపండు మాంసం ముక్క కలిసి
అఖండ సంధ్యారాజ్యం చేస్తున్నాయి'
అనే పంక్తుల్లో ఈ లైంగిక సంబంధాన్నే ఆపాదించారు.

**సి) పఠాభి :** 'కామ' ప్రాధాన్యం స్ఫుటంగాకల అతి నవ్య కవితాసంపుటి 'ఫిడేల రాగాలడజన్', దీని రచయిత పఠాభి. 'భోగందాన అనే గీతంలో సమాజాన్ని తీవ్రంగా విమర్శించడమే కాకుండా పరిహాసం చేశారు. సమాజం చేసే మోసాలను క్రౌర్యాలను చిత్రించాడు.

"నీలోనే నాకు జీవితం నిజంగా
సరిగ్గా ప్రతి ఫలిస్తుంది
ఇతర స్థలాలలోన
అంతా బూటకం నాటకం గొప్ప అబద్ధం
పూజారి అబద్ధం
పరపురుషుని జూచి తలవాల్చే
పతివ్రత సతీత్వమబద్ధం
యోగులబద్ధం అందరూ అబద్ధం
సర్వమబద్ధం
కానీ నీవు మటుకు ఓ భోగందాన
ముసుగులేని నిష్ఠురమగు నిజానివి
నీడపడనటువంటి నిర్మలమగు నిజానివి'

భోగపు స్త్రీ ఈ మనుష్యులలా అబద్ధమాడదు. ఏపనైనా ధైర్యంగా చేస్తుంది. పొట్టకూటికొరకు దేహాన్ని పబ్లిగ్గా అమ్ముకుంటుంది. కాని ఆమె దగ్గరకు వచ్చే మనుష్యులు దొంగచాటుగ చేరి లేనిపోని అబద్ధాలాడి ఆమె పంచన చేర్తారు. అట్టివారిని చూచి పఠాభి మాటలతో మాడ్చివేస్తున్నారు. సమాజంచేసే పనులింతింతకాదని వారి వ్యాఖ్యానం.

పఠాభి కొన్ని శబ్ద చమత్కారాలు చూపించారు.

ఉదా : ప్రేమికులు - అంటానికి 'పేరే మికులు' అని
అన్యోన్య - అనడానికి 'అన్యోన్య' అని
ఇంగిలీసుదానిని - 'ఇన్గ్ లీష్దానివి అని
Marriage - 'మ్ యారేజి'
Sweet Heart - 'స్వీట్ హార్ట్'
Thanks - 'థ్ యాన్ క్స్'
సౌఖ్యము - సవుఖ్యమ్ - అని ప్రయోగించారు

ఇతడు అచ్చులో కూడా చమత్కారాన్ని చూపాడు.
అద్దము తిరిగెను [illegible]
తలక్రిందులైనది [illegible]
ఇట్టి చిత్ర విచిత్రాలకు E. E. కమిలగ్స్ ప్రభావం కారణం.

డి) ఆరుద్ర : ఆరుద్రకూడా శబ్ద సంవిధానం ద్వారా భావానికి వింతగతులు కూర్చాడు. 'త్వమేవాఽహం'లో స్టాపు వాచి గేయంలో

నీ
గన్
నా
పెన్
ఆపెన్
కాపాడున్

తెలుగు పదాలతో ఆంగ్ల పదాలను కూర్చి చెప్పటం అభ్యుదయ కవులకు అలవాటయింది.
'పర్వత దశ' - పర్వతాలలా కఠినంగా ఉండాలని
'బ్రెయిన్‌లో బ్రెన్‌గన్
రెయిన్ లా ఆలోచనల బ్రెయిన్
గ్లూమీ తిమిరాలు చెరిపించి
సైతాన్ మనల్ని పరిశించినప్పుడు' వంటి కొరుకుడు పడని పదజాలంతో ప్రారంభించి క్రమంగా సౌలభ్యాన్ని చూపించాడు.

ఇ) శార్వరి : ఇంగ్లీషు అంకెల్లో కొన్నిటిని ఏరి వాని ఉచ్చారణము ద్వారా తెలుగు పదాలను సృష్టించాడు. అంకెల్లో ఇలాంటి గారడీ ఉందని తెలుస్తుంది. ఇంతకు పూర్వం ఇలాంటి ప్రయోగం ఎవ్వరూ చేసి ఉండలేదు.

అపాయం 3 తుంది
6 బైట పడుకొన్న ప్రదేశం
జనత 7స్తుంది.

పఠాభి ఆంగ్ల పదాలను తెలుగు లిపిలో వ్రాస్తే, ఆరుద్ర ఆంగ్ల పదాల చివర తెలుగు రూపాలు చేర్చి వ్రాయటంలో వైచిత్రిని సాధించారు. వీరిరువురు తమ కవితలయందు చిత్రమైన ప్రయోగాలను చేశారు.

ఎఫ్) శిష్లా : 'నవమి చిలుక, "విష్ణు ధనువు" అనే కావ్య సంపుటాల ద్వారా శిష్లా భావకవిత్వంపై తిరుగుబాటు చేసిన అతివప్యుడు. శిష్లా 'మహాలయ అమావాస్య' అనే చరణాలను 'పెద్ద టైపు'లో ముద్రించటం కమింగ్స్ ప్రభృతులు చేసిన గమ్మత్తులను పురస్కరించుకొనియే. తన కవిత్వము పండిత పామర రంజకమనీ, అది దేశీయ సంప్రదాయాలతో బాటు విదేశీరీతులను మేళవించుకొ ... శిష్లా అభిప్రాయం.

జి) బి.వి. సింగరాచార్య : బి.వి. సింగరాచార్య 'Vibgyor' అనే శీర్షికలో రచించిన గీతంలో

'గదిలో light ను తగ్గిస్తే

ఎల్లాగుంటుందో బోలో

ఈ Beauty worshippler లు కి వంటి చరణాల్లో ఇంగ్లీషు హిందీ పదాలను తెలుగుమాటల మధ్య ఇరికించి వైచిత్రి చూపారు. సింగరాచార్య ఒకచోట 'కప్పు' అనడానికి 'cup + ఊ' అని 'స్పూను' అవటానికి 'spon + ఊ' అని విచిత్రమైన మిశ్ర సంధులు చేశాడు 'యింత' అనుమాటలో ఆద్యక్షరాన్ని ఒత్తి పలుకుటకు 'య్యింత' అని ప్రయోగించాడు.

**సమీక్ష :**

ఫ్రాయిడ్ అనే మనస్తత్వ శాస్త్రవేత్త ప్రతిపాదించిన మనో విశ్లేషణ సిద్ధాంతం కళారంగంలో సర్రియలిజానికి దారి తీసింది. మానవుని మనస్సులో మూడు అరలున్నాయి 1. Conscious (వ్యక్తము), 2.Sub-conscious (వ్యక్తావ్యక్తము), 3. Un -conscious (అవ్యక్తము). మనస్సులోని యీ మూడు పొరలను గూర్చి ఫ్రాయిడ్ చేసిన పరిశోధనా ఫలితమే మనోవిశ్లేషణ సిద్ధాంతంగా రూపుదిద్దుకొంది. ఈ సిద్ధాంతం మానవుని తీరని కాంక్షలకు, అణగారిన భయాలకు అమితానుభూతులకు నూత్న వ్యాఖ్యానం చేసి సరిక్రొత్త అర్థాన్ని అందించ కలిగింది. ఫ్రాయిడ్ ప్రతిపాదించిన యీ సిద్ధాంతాన్ని ఆధారంగా చేసుకొని అధివాస్తవికులు కళారంగంలో క్రొత్త బాటలు వేశారు.

అధివాస్తవికత సాహిత్య లోకంలో తెరువబడ్డ మంత్రకవాటమని ఎందరెన్ని చెప్పినా, ఇదీ భావచిత్రంలో తప్ప సాధించిందేమీ లేదు. వ్యక్తానికీ హేతువునకు బదులుగా, అవ్యక్తానికీ, వ్యక్తావ్యక్తానికీ ప్రాధాన్యం ఇవ్వటంవల్ల సాధారణీకరణ రాహిత్యమనే లోపం కలిగింది. పదాలను వాని రూఢ్యర్థాలకు బదులుగా విపరీతార్థాలలో వాడటం వల్ల, అపూర్వ విషయాలను చెప్పే ఉబలాటంతో అన్వయాన్ని సవ్యసించటంవల్ల, జుగుప్సావహ విషయచిత్రణవల్ల ఈ అధివాస్తవికీత తెలుగులో ఎక్కువ కాలం నిలవలేకపోయింది. నారాయణబాబు వ్రాసిన రుధిర జ్యోతిలోని గేయాలు సాధారణంగా ఇమేజిజానికి, సింబాలిజానికి చెందినవి.

నేడు శ్రీమాదిరాజు రంగారావుగారు తప్ప, మరెవ్వరూ అధివాస్తవిక రచనలు చేస్తున్నట్లు కన్పించదు. 'రేఖా చిత్రాలు' అనేపేర వీరు అధివాస్తవిక కవితలు వ్రాశారు. 'ఆవాహన' అనే సంపుటిలో అవి ముద్రింపబడ్డాయి.

**ప్రశ్నలు :**

1. పాశ్చాత్య కవితా ధోరణుల ఆవిర్భావాన్ని వివరించండి?
2. తెలుగు సాహిత్యంలో కన్పించే సర్రియలిజంను విశ్లేషించండి.
3. ఇమేజిజం, సింబాలిజంలను సోదాహరణ పూర్వకంగా వివరించండి.

**ఆధార గ్రంథాలు :**

1. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు - ప్రయోగములు : డా.సి. నారాయణరెడ్డి.
2. ఆధునిక సాహిత్య ప్రస్థానములు - జి. రామమోహనరావు.

- ఆచార్య వేలి అనంత రామశాస్త్రి

పాఠం - 12.1

# దేవులపల్లి కృష్ణశాస్త్రి - నండూరి సుబ్బారావు

**పాఠ్య నిర్మాణ క్రమం**


12.1 దేవులపల్లి కృష్ణశాస్త్రి

12.1.1 దేవులపల్లి వృత్తి రచనా వ్యాసంగం

1.2 దేవులపల్లి కవిత్వ ప్రస్థానం

1.3 వివిధ ఉద్యోగాలు - సినీరంగ ప్రవేశం

1.4 మలి సంధ్య

1.5 మధుర కవిత్వం ఆయన సొంతం

1.6 ఆంధ్రాషెల్లీ దేవులపల్లి

1.7 నాటకాల ప్రత్యేకత

1.8 క్రిష్ణ శాస్త్రి రచనలు - వివరాలు


**లక్ష్యం :**

దేవులపల్లి జీవన విషయాలు - కవిత్వ ప్రస్థానం - లక్షణాలు కవిత్వతత్త్వ విచారణలను తెలిసికొంటారు.

## 12.1 దేవులపల్లి కృష్ణశాస్త్రి

భావ కవిత్వానికి రూపు, రేఖాదిద్ది ప్రాణం పోసిన ఘనత దేవులపల్లి కృష్ణశాస్త్రికే దక్కుతుంది. రాయప్రోలు సుబ్బారావుతో భావకవిత్వం ఆవిష్కృతమైనా దానికి విశేష ప్రచారాన్ని కలిగించింది మాత్రం దేవులపల్లి వారే. శ్రీశ్రీ మాటలలో చెప్పాలంటే ఇక్షు సముద్రం ఎక్కడుందో తెలియదు కానీ ఆపాత మధురమైన కృష్ణ శాస్త్రి సాహిత్యం సమస్తమూ ఇక్షు రసార్ణవమే. కృష్ణ శాస్త్రి పలుకుల్లోని చెఱుకు తీపి సాహిత్య రస పిపాసులకు ఎక్కడో వుందనుకునే ఇక్షు సముద్రాన్ని ఎదుర్కోవలసిన అగత్యాన్ని తొలగిస్తుంది. భావ కవిత్వానికి ఆయన పేరు పర్యాయ పదంగా మారిపోయింది. ఆయన 1897 నవంబర్ 1వ తేదీన పిఠాపురం దగ్గర ఉన్న చంద్రపాలెంలో జన్మించారు. ఈయన తండ్రి దేవులపల్లి సోదర కవులలోని తమ్మన శాస్త్రిగా పిలుపులందుకున్న వెంకట శాస్త్రి, తల్లి సీతమ్మ. ఈ దంపతులకు ఇద్దరు ఆడ పిల్లల తర్వాత కృష్ణ శాస్త్రి జన్మించారు. కృష్ణశాస్త్రి పెద తండ్రి సుబ్బారాయ శాస్త్రికి అయిదుగురూ ఆడపిల్లలే కావటంతో ఆ ఇంట్లో ఏడుగురు అక్కల తర్వాత చిన్నవాడైన ఈయన ఎంతో అల్లారు ముద్దుగా పెరిగారు. తండ్రి పెద తండ్రిల కవితా ప్రభావం ఈయన మీద ఎంతగానో ప్రసరించింది. ఆ ప్రభావంతో చిన్నప్పుడే కవిత్వ రచనకు ఉపక్రమించారు. పదో సంవత్సరంలో ఆయన "నందనందన ఇందిరానాథ వరదా..." అనే పద్యం చెప్పారు. తమ పుత్రుడు కవితా ప్రకర్షకు ఆనాడే ముచ్చటపడి తండ్రి, పెద తండ్రి ఇద్దరూ ఆయనను ఎంతగానో ఆశీర్వదించారు. కృష్ణ శాస్త్రి బాబాయి, తండ్రి ఇద్దరూ ఎక్కువ కాలం జీవించలేదు. వారి మరణానంతరం ఆయన విజయ నగరంలో ఉంటున్న తమ పెద్ద బావగారింటికి చేరి హైస్కూల్ చదువు ప్రారంభించారు. బావగారి వేళాకుళాలకు బదులు చెబుతూ తన పన్నెండో సంవత్సరంలోనే ఆయన మంచి పద్యాలు చెప్పారు. విజయనగరంలో గురుజాడ అప్పారావు ఆయనను ఆకర్షించారు. ఆయన దగ్గరకు తరచూ వెళ్ళి వస్తుండే వారు. ఆ పరిచయమే ఆయనను ఓ రకంగా నూతనత్వం వైపు చూసేలా కూడా చేసింది. గురజాడ గీతవాహినితో పాటుగా రాయప్రోలు సుబ్బారావు గీతాలను కూడా ఆయన అవగతం చేసుకున్నారు. రాయప్రోలువారి అమలిన శృంగార తత్వాన్ని నిశితంగా పరికించారు.

మరోవైపు అబ్బూరి, వెంకటపార్వతీశ కవుల వంటి భావ కవుల ఖండ కావ్య సుగంధ సౌరభాలతో ఆనాటి సమాజం పులకితమౌతుండగా ఆ సమాజాన్ని కృష్ణ శాస్త్రి తన వైపునకు తిప్పుకో గలిగారు. హైస్కూల్‌లో కూచి నరసింహం, కళాశాలలో బ్రహ్మర్షి రఘు వెంకట రత్నం నాయుడుల మహోన్నత సాహచర్యం కృష్ణ శాస్త్రిని సంస్కరణోద్యం వైపు మళ్ళించింది. ఆ స్ఫూర్తితో హరిజనోద్ధరణ కోసం రేయింబవళ్ళు కృషి చేశారు. పిఠాపురంలోనూ, కాకినాడలోనూ ఆయన విద్యాభ్యాసం జరిగింది. ఆ తర్వాత 1919లో తన పెద్ద బావగారి కుమార్తెనే వివాహమాడారు. అనంతరం తల్లా వఝ్ఝల శివ శంకర శాస్త్రి స్థాపించిన సాహిత సమితిలో సభ్యత్వం పొందారు. అదే రోజుల్లో ఆయనతో పాటు విశ్వనాథ సత్యనారాయణ, అడవి బాపిరాజు, నండూరి సుబ్బారావు, నోరి నరసింహ శాస్త్రి, చింతా దీక్షతులు, కొడాలి ఆంజనేయులు, మొక్కపాటి నరసింహశాస్త్రి, ముని మాణిక్యం నరసింహరావు కూడా సాహితీ సమితిలో సభ్యులుగా వుండేవారు సాహితీ సమితి సభ్యుడిగా కావటం తన అదృష్టమని ఆయన భావిస్తుండేవారు.

### 12.1.1 వృత్తి - రచనా వ్యాసంగం :

మెల్ల మెల్లగా భావ కవిత్వం వైపు, సంస్కరణ ఉద్యమం వైపు దృష్టి సారిస్తున్న కృష్ణ శాస్త్రికి ఆనాటి వ్యావహారిక భాషా ఉద్యమం బ్రహ్మ సమాజ ఉద్యమం మంచి స్ఫూర్తినిచ్చి ఆయన చేత గొప్ప గొప్ప గీతాలను ఆలపించేలా చేశాయి. కాకినాడ, పెద్దాపురం హైస్కూళ్ళలో ఉపాధ్యాయుడిగా రెండు సంవత్సరాల పాటు పని చేశారు. వృత్తి అలా కొనసాగుతున్నా ఆయన కవితాధార ప్రతిఫలిస్తున్న పాటలు, గేయాలు ఆనాటి సంప్రదాయ వాదులకు కటువుగా అనిపిస్తుండేవి. ఆ పాటలంటే గిట్టనివారు మహా కవుల వంశంలో కృష్ణ శాస్త్రి తప్పు పుట్టారని తిడుతూ అంతటితో ఆగక మహారాజా వారికి చెప్పి ఆయనకు సంఘ బహిష్కరణ శిక్షను కూడా విధించేలాగా చేశారు. ఎన్ని కష్టాలు ఎదురొచ్చినా తలదించని ఆయన పిఠాపురం రాజావారికి వ్యతిరేకంగా ధర్మ సాధన అనే పత్రికలో కొన్ని వ్యాసాలు రాయటంతో రాజా వారికి కోపం మరీ మితిమీరి చేస్తున్న ఉద్యోగం నుంచి తొలగించడమే కాకుండా తండ్రుల కాలం నుంచి వస్తున్న "వార్షికం"ను కూడా నిలిపేశారు. కృష్ణ శాస్త్రికి సంజాయిషీ చెప్పుకునే అవకాశం కూడా ఇవ్వలేదు. కోటలోకి ప్రవేశాన్ని కూడా నిరోధించారు. ఇలాంటి కష్టాల రోజుల్లోనే ఆయన భార్య మరణించారు. శోక తప్త హృదయంతో అప్పుడాయన కన్నీరు అనే ఖండ కావ్యాన్ని రాశారు. తరువాత సంఘ సంస్కర్త అయిన గాడేపల్లి సూర్య నారాయణ పెద్ద కుమార్తె రాజహంసను వివాహమాడారు. సూర్య నారాయణ ప్రోత్సాహంతో సహాయ నిరాకరణోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. గతంలో చేస్తున్న పాఠశాల ఉపాధ్యాయ వృత్తి పోవటం కూడా తన మంచికేనని అప్పుడు ఆయన అనుకున్నారు.

### 1.2 కవిత్వ ప్రస్థానం :

కృష్ణ శాస్త్రి 1925వ సంవత్సరం నాటికి తాను రచించిన ఖండ కావ్యాలను ఒక చోట చేర్చి కృష్ణ పక్షం అనే పేరుతో సాహితీ సమితి తరపు ఒక పుస్తకాన్ని ప్రచురించారు. ఈ కావ్యాన్ని కృష్ణ శాస్త్రి పిఠాపురం మహారాజా సూర్యరాయ బహద్దూర్‌కు అంకిత మిచ్చారు. తల్లా వఝ్ఝల శివశంకర్ శాస్త్రి సింహావలోకనం అనే పేరుతో దానికి పరిచయం రాశారు. అయితే ఈ పుస్తకాన్ని పిఠాపురం మహారాజా స్వీకరించటానికి నిరాకరించారు. అయినా కృష్ణ శాస్త్రి మొక్కవోని ఆత్మ విశ్వాసంతో తన కవితా ప్రస్థానాన్ని కొనసాగించటానికే నిర్ణయించుకొన్నారు. ఆయనకు అప్పటిదాకా చేస్తున్న ఉద్యోగం పోవటం కూడా మంచికే జరిగినట్లయింది. అప్పటి నుండి ఆయన తన కావ్య గానం చేస్తూ ఆంధ్ర దేశమంతటా తిరిగారు. కేవలం తన కవితలనే కాక తోటి భావ కవులు రచించిన అనేకానేక కవితలను కూడా ఆయన పాడుతూ భావకవిత్వాన్ని ఒక ఉద్యమ స్థాయికి తీసుకువచ్చారు. ఆయన గళంతోపాటు వేషధారణ, శైలి కూడా అంటే గిరజాలజుట్టు, పంచెకట్టు ఇలాంటివన్నీ ఆనాటి యువకులను బాగా ఆకట్టుకున్నాయి. తన తొలి భార్య మరణానికి దుఃఖిస్తూ ఆయన ప్రవాసం, కన్నీరు అనే కావ్యాలను ఆత్మాశ్రయ ధోరణిలో రచించారు. అలాగే ఊర్వశి కావ్యం గూడా గొప్పగా ప్రజాదరణ పొందింది. బ్రహ్మ సమాజ ప్రభావంతో ఆయన రాసిన వందల కొద్ది గీతాలు 'మహతి' అనే పేరుతో సంపుటిగా వచ్చాయి. ఇవి మంచి భక్తి గీతాలుగా కూడా ఆనాటి [illegible] చేత ప్రశంసలందుకున్నాయి. అలా ఆ కవితా ప్రస్థానం శాంతి నికేతనాన్ని దర్శించేలా కూడా ఆయన్ను ప్రోత్సహించింది. ఆ ప్రోత్సాహం శాంతి నికేతన్‌లో ఉండే కవులతో పరిచయాన్ని ఏర్పరచింది.

### 1.3 వివిధ ఉద్యోగాలు, సినీరంగ ప్రవేశం :

ఒకసారి స్కూలు మాస్టరీ గిరిపోయి ఆంధ్రదేశమంతా తిరుగుతున్న కృష్ణ శాస్త్రి మళ్ళీ 1933లో ఉద్యోగంలో చేరారు. కాకినాడ పి.ఆర్. కళాశాలలో ఆంధ్రోపన్యాసకుడుగా ఆయన పది సంవత్సరాల పాటు పని చేశారు. 1942 నాటికి సినిమాల్లో పాటలు రాసే అవకాశాలొచ్చాయి. కొంత కాలం పాటు హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంలో సాహిత్య కార్యక్రమాల ప్రయోక్తగా పని చేశారు. ఆ రోజుల్లోనే సాహిత్య ప్రసంగాలు, రేడియో నాటికలు, రూపకాలు రాశారు. 1958లో ఆయన జీవితంలో మరో విషాదం అలముకుంది. చిన్న కుమార్తె సీత మసూచి వ్యాధిసోకి మరణించటంతో ఆమె స్మృతిగా గోదా దేవిని తలపించే తిరుప్పావును తమిళం నుండి తెలుగులోకి అనువదించారు. తిరుప్పావుతో పాటుగానే పల్లకి, రుగ్విధి, అమృత వీణ, మంగళ కాహళి, ధనుర్దాసు, శర్మిష్ఠ, పుష్పలావికలు లాంటి కావ్యాలను, నాటికలను, వ్యాసాలను సంపుటాలుగా వెలువరించటమేకాక అప్పుడు పుట్టివుంటే, బహు కాల దర్శనం వంటి గద్యాత్మక కృతులను కూడా చేశారు. 1942లో నవ్య సాహిత్య పరిషత్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 1947వ సంవత్సరంలో మల్లీశ్వరి తెలుగు చలన చిత్రానికి మాటలు, పాటలు రాసి తనదైన విజయబావుటాను ఎగురవేసి ఆ చిత్రాన్ని సెల్యులాయిడ్ కావ్యంగా ఈ నాటికి అందరూ చెప్పుకునేలా మెరుగులు దిద్దారు. వంద సినిమాలకు అయిదు వందల పాటలను రాశారు.

### 1.4 మలి సంధ్య :

ఇంత ప్రతిభావంతంగా కాంతి వంతంగా భాసిల్లిన దేవులపల్లి వారి జీవితంలో అడుగడుగునా కష్టాలు ఎదురౌతూ చివరి దాకా ఆయన్ను వెంటాడినట్లే కనిపిస్తాయి. ఎంత అలవికాని కష్టాలెదురైనా ఏనాడు వాటి కాయన తలవంచలేదు. ఆంధ్ర దేశం అంతా తిరిగి భావ గీతాలను అద్భుతంగా ఆలపించిన ఆయన గొంతు మూగపోవలసిన పరిస్థితి దాపురించింది. 1964వ సంవత్సరంలో స్వర పేటికలో క్యాన్సర్ వ్యాధి సోకిన కారణంగా ఆపరేషన్ జరిగింది. దానితో ఆ కంఠం శాశ్వతంగా పాట ఎవరికీ వినిపించకుండా పోయింది. గొంతు మూగ పోయినా చివరి దాకా ఆయన ఎంతో ఉత్సాహంగానే జీవించారు. కవితా వ్యాసంగాన్ని ఓపిక ఉన్నంత కాలం విడిచిపెట్టలేదు. తన మనో భావాలను కవిత్వాన్ని తమ చెప్పదలచుకున్న మాటలను కాగితం మీద రాసి చూపిస్తుండేవారు. గొంతు మూగపోయిన రోజుల్లో రాసిన పాటలకు కృష్ణ రంజని అనే పేరు పెట్టుకున్నారాయన. ఇలా కడదాకా ఆత్మ స్థైర్యంతోనూ ఓ స్థిర లక్ష్యంతోనూ ఉన్న ఆయన 24-2-1980 వ సంవత్సరంలో దివ్యలోకాలకు లలిత మధుర సుందర కవిత్వాన్ని వినిపించటానికి వెళ్ళిపోయి ఆంధ్ర జాతికి మాత్రం కంటతడి పెట్టించారు.

### 1.5 మధుర కవిత్వం ఆయన సొంతం :

దేవులపల్లి కృష్ణ శాస్త్రి కలం నుండి జాలువారిన ప్రతి అక్షరం తేనెలొలుకుతూ అందాల పులుగులా కులుకులాడుతూ పాఠకుడిని మురిపిస్తుంటుంది. అది దేశ భక్తి గేయమైనా, భక్తి గీతమైనా, పద్యమైనా, గద్యమైనా చివరకు నాటికైనా పాఠకుడి చెవిన పడిన తర్వాత అతడి నాలుక మీద నిరంతరం నర్తించటమే దాని సంతవుతుంది. కృష్ణ శాస్త్రి జీవితం ఆరంభ దశనుండి తుది దాకా స్వేచ్ఛను కోరుకున్నారు. అందుకే ఆయన కావ్యాల్లో ఖండ కావ్యాల్లో స్వేచ్ఛా ప్రియత్వం దర్శన మిస్తుంటుంది. కృష్ణ శాస్త్రి కావ్యాలలో మొదటిగా, ఆయనకు మంచి పేరుతెచ్చి పెట్టింది కూడా కృష్ణ పక్షం. కృష్ణ పక్షం కావ్యంలో యాభై తొమ్మిది శీర్షికలున్నాయి. కానీ వాటిలో ఎక్కడా కృష్ణ పక్షం అనే శీర్షిక కనుపించదు. అయితే చాలా విచిత్రంగా "నాకు మరణమ్ము..." అనే శీర్షిక కింద ఉన్న ఒక తేటగీతి పద్యంలో మాత్రం కృష్ణ పక్షమనే ఒక్క పదం కనుపిస్తుంది. కృష్ణ పక్షం చక్కటి భావ గీతంతో ప్రారంభమైంది. ఆ భావ గీతం ఈ నాటికీ తెలుగువారి నాల్కల మీద నిరంతరం నర్తనమాడుతూనే వుంది.

"ఆకులో ఆకునై పూవులో పూవునై
కొమ్మలో కొమ్మనై నునులేత రెమ్మనై
ఈ యడవి దాగిపోనా ఎట్లయినా
నిచటనే యాగిపోనా?" అనే ఈ గీతం ఎప్పటికీ తెలుగువారి హృదయ సీమల్లో విహరిస్తూనే ఉంటుంది. భావ కవుల స్వేచ్ఛా ప్రియత్వం కృష్ణ శాస్త్రి "స్వేచ్ఛా గానం"లో ప్రతిబింబిస్తుంది.

"నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు
నా యిచ్చయేగాక నాకేటి వెఱపు"

అని ఎవరినీ, దేన్నీ ఆయన లక్ష్యపెట్టలేదు. కృష్ణశాస్త్రి ప్రేమతత్వం కూడా ఆయన స్వేచ్ఛా ప్రియత్వం లాంటిదే. మనిషికి ప్రేమించడం, ఒక సహజ లక్షణం.

"సౌరభము లేల జిమ్ము పుష్ప వ్రజంబు? చంద్రికల నేల వెదజల్లు చందమామ? ఏల సలిలంబు పారు, గాడ్పేల విసరు, నేల నా హృదయంబు ప్రేమించు నిన్ను?" అని అనడంలో ఆయన ప్రేమతత్వం ఎలాంటిదో అవగతమౌతుంది.

## 1.6 ఆంధ్రాషెల్లి దేవులపల్లి :

దేవులపల్లి కృష్ణ శాస్త్రి ప్రకృతిని కవిత్వీకరించి మనోహర దృశ్య కావ్యాలుగా మలిచిన తీరు ఆయనను అందరూ ఆంధ్రా షెల్లీగా గుర్తుంచుకునేలా చేసింది. బి.ఎన్. రెడ్డి ప్రోత్సాహంతో సినీ రంగంలో మల్లీశ్వరి సినిమా పాటలను పలికించినా ఆయన సంపుటాలలోని మరే ఇతర గేయ పాదాన్ని గమనించినా ఓ సుందర ప్రకృతి, ఓలయాత్మక భావన పీలైన చోటల్లా దైవ భక్తి మనకు దర్శనమిస్తూనే ఉంటాయి. ఆయన భావ సౌకుమార్యానికి పదలాలిత్యానికి "ఆకాశ వీధిలో హాయిగా ఎగిరేవు, మనసున మల్లెల మాలలూగెనె, కోతి బావకు పెళ్ళంట, నీవుండే దాకొండపై" లాంటి అనేకానేక చలన చిత్రాల పాటలు ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. అలాగే ఆయన గొంతు మూగపోయిన తర్వాత రాసిన గేయ సంకలనంలో ఆర్తి గీతాల రూపంలో పొంగి పొరలుతుంది. వాటిలో.

"ఎప్పుడైనా ఒక క్షణమైనా
ఏకాంత దర్శనమీవా? దేవా!
ఎదురుగా నీవూ, నేనే -
ఏకాంత దర్శన మీవా? ॥ఎప్పుడైనా॥

అలాగే "కృష్ణ రజని" కి సార్థకతను సమకూర్చిన
"ఒదిగిన మనసున పొదిగిన భావము
కదిపె దెవ్వరో! కదిపే దెవ్వరో!
కదలని తీగకు కరగని రాగము
కరపే దెవ్వరో! కరపే దెవ్వరో! ॥ఒదిగిన॥

ఈ పాట ఇప్పటికీ లలిత సంగీతంగా అందరినోట వినిపిస్తూనే ఉంటుంది.

ఆయన రచించిన దేశ భక్తి గీతాలలో "జయ జయ ప్రియ భారత జనయి త్రి దివ్యధాత్రి" లాంటి గేయాలు అక్షర సత్యంగా అజరామరాలే. ఆయన కేవలం ఇలా పాటలూ, గేయాలే అందంగా రాస్తారనుకోవటం పొరపాటే. గద్య రచన చేసినా, నాటకాన్నిరాసినా, యక్షగానాన్ని రాసినా ఏది రాసినా ఆయన కలం సౌందర్య రసాన్ని అక్షర రూపంలో ఆవిష్కరించి తీరుతుంది. భావ కవితని ఉద్యమంగా చేపట్టి ఊపిరున్నంత కాలం ఆ ఉద్యమానికి ఊపిరిలూది సజీవత్వాన్ని కల్పించిన ఆయన పద్యం చదివితే ఆహ్లాదకర ప్రభాతంలా ఉండేది. పాట పాడితే అందమైన జలపాతం శ్రోతలముందు ఆవిష్కృతమయ్యేది. ఆయన పదాల పట్టు భావ కవిగా నిలుద్దామనుకున్న వారికి ఆట పట్టేమరి. దీనికి కారణం సంప్రదాయం నుంచి చైతన్య వంతమైన శబ్దాలను ఏరుకోవటం, తనచుట్టూ ఉన్న సమాజంలో ప్రేమ పూరితమైన సన్నివేశాలను సునిశితంగా పరిశీలించటం ప్రధాన కారణాలు.

## 1.7 నాటకాల ప్రత్యేకత :

కృష్ణ శాస్త్రి రచించిన నాటకాలు దాదాపుగా అన్నీ ఆకాశవాణికి మాత్రమే పరిమితమయ్యాయి. అందుకు కారణం మద్రాస్ ఆకాశవాణి కేంద్రంలో కృష్ణ శాస్త్రి కార్యక్రమ నిర్వహకుడుగా వుండటం కూడా ఒకటి అయితే ఆ రోజుల్లో ఆయన ముందుగా తనకు తానుగా ఏ రచనా

చేయలేదు. ఆయన మిత్రులైన ఆచంట జానకీరామ్, బాలాంత్రపు రజనీ కాంతరావు, బుచ్చిబాబు, సూరి నారాయణ మూర్తి, అయ్యగారి వీరభద్రరావు, లాంటి వారంతా ఆయనను బ్రతిమాలి బామాలి నాటక రచనను ప్రోత్సహించారు. అలా రాసిన నాటకాలన్నీ ధనుర్దాసు, శర్మిష్ఠ అనే పేర్లతో రెండు సంపుటాలుగా వచ్చాయి. ధనుర్దాసులో సాయుజ్యం, గుహుడు, శివ క్షేత్రయాత్ర అనే నాటకాలు, శర్మిష్ఠలో కృష్ణాష్టమి, విహారి, ఏడాది పాడుగునా గౌతమి, వేణుకుంజం అనే నాటకాలు వున్నాయి. ఇవన్నీ చాలా వరకూ సంగీత ప్రధానంగా కనిపిస్తాయి. పాటల్లో పదాలు అకట్టుకున్నట్లే నాటకాలలో ఉన్న ప్రతి అక్షరం కూడా శ్రోతలను కట్టి పడేసేదిగానే వుంటుంది. ఆయన రాసిన యక్షగానాల్లో బాలాంత్రపు రజనీకాంతరావు సూచన మేరకు రచించిన క్షీర సాగర మధనం మొదటిది. దానిలో ఉన్న కొలువైతివా రంగశాయి అనే దరువు కూచిపూడి వారికి బాగా నచ్చి దాన్ని ఇప్పటికీ ప్రచారం చేస్తూనే వున్నారు. అలా యక్షగాన ప్రక్రియలో కూడా తనదే పై చేయి అని కృష్ణ శాస్త్రి అనిపించుకున్నారు.

### 1.8 కృష్ణ శాస్త్రి రచనలు, వివరాలు :

దేవుల పల్లి కృష్ణ శాస్త్రి పద్య కృతులుగా కృష్ణ పక్షం, ప్రవాసం, ఊర్వశి, నిశ్రేణి, పల్లకిలను గద్య రచనలుగా. అప్పుడు పుట్టి వుంటే, బహుకాల దర్శనం, పుష్పలావికలు అనే వాటిని వ్యాసరచనలుగా, కవి పరంపర, కవితాస్తుతి, మహా వ్యక్తులు, అమూల్యాభిప్రాయాలు అనే సంపుటాలను వెలార్చారు. అమృత వీణ, మంగళకాహళి, గేయ సంపుటాలయ్యాయి. నాటకాలలో ధనుర్దాసు, శర్మిష్ఠ సంపుటాలు వీటితో పాటుగా కీర్తనలు, పిల్లల రాజ్యం, యక్షగానాలు, బదలిక, అరుణరథం, విద్యావతి, కొత్త కోవెల, గోరింట, తిరుప్పావు, మూగనయాకా, రుగ్వేధి, మేఘమాల, ఇలాంటివి ఎన్నో కనిపిస్తాయి.

### సమీక్ష :

కృష్ణ శాస్త్రి గారి రచనలు - జీవిత విశేషాలు - మధుర కవిత్వ విశ్లేషణ మున్నగు విషయాలు పరిశీలించబడ్డాయి.

### మాదిరి ప్రశ్నలు

1. దేవులపల్లి వారి బాల్యం విద్యాభ్యాసం జరిగిన తీరు.
2. కృష్ణ పక్షం ప్రత్యేకత ఏమిటి
3. ధనుర్దాసు, శర్మిష్ఠలలో ఉన్న విశేషాంశాలు ఏవి.
4. దేవులపల్లి వారి సామాజిక స్పృహ, సేవా కార్యక్రమాలకు స్ఫూర్తినిచ్చిన వ్యక్తులు ఎవరు.

### ఉపయుక్త గ్రంథాలు


1. కృష్ణ పక్షం
2. దేవులపల్లి కృష్ణ శాస్త్రి సాహిత్య అకాడమీ ప్రచురణ : రచన బూసురపల్లి వెంకటేశ్వర్లు
3. కాహళి


డా॥ యల్లా ప్రగడ మల్లికార్జునరావు

పాఠం - 12.2

# నండూరి వేంకట సుబ్బారావు

**విర్మాణం :**

12.2.1 నండూరి గొంతులో ఎంకి మసలినవేళ

12.2.2 పాటలు ప్రాణం పోసుకున్న తీరు

12.2.3 సంచలనం రేపిన పాటలు

12.2.4 విమర్శలు - విశేష ఆదరణ

12.2.5 నండూరిని ప్రభావితం చేసిన అంశాలు

12.2.6 ఎంకిపాటలు - విశ్లేషణ

**లక్ష్యం :**

జానపదవాఙ్మయంలో ఎంకిపాటలు విశిష్టస్థానాన్ని ఆక్రమించాయని, ఎంకిపాటల్లోని ఆదర్శదాంపత్యధర్మం, పరస్పర ప్రేమ, భాష తెలుసుకుంటారు.

తెలుగు సాహిత్యంలో పాటలతో ఓ కొత్త వరవడిని సృష్టించిన కవి నండూరి వెంకటసుబ్బారావు. ఆయన కలంనుండి జాలువారిన అక్షరాక్షరంలోనూ అనంత భావకవితా మాధుర్యంతో పాటు తాత్విక చింతనామృతం కూడా పాఠకులకు, శ్రోతలకు పసందైన విందంత ఆనందాన్ని ఇస్తూ వుంటుంది. జానపద జీవన శైలీ విలాసం పాట పాటలోనూ సరాగంగా రాగాలాపన చేస్తూనే వుంటుంది. పుంఖాను పుంఖాలుగా కావ్యాలు, గ్రంథాలు ఏవీ రాయక పోయినా ఎంకిపాటలతోటే ఎన లేని కీర్తినందుకున్నాడు నండూరి సుబ్బారావు. ఎంత మంది కాదన్నా వెన్నంటి ప్రోత్సహించే స్నేహితుల అమృత హస్తాల ఆసరాలతో నండూరి వారు ఆనాడు ఓ గొప్ప ప్రయత్నంగా ఓ కొత్త విధానంగా నిర్భయంగా ఎంకి పాటలను పల్లవింపచేశారు. అందుకే ఈ నాటికీ అవి ఆంధ్రుల హృదయాలలో అంతరంగ తరంగాలై ఎంకిపాటల తరగల నురుగులను ప్రకాశింప చేస్తున్నాయి.

ఆనాడు శిష్ట కవులు జానపదుల భాషకు కవిత్వార్హత లేదని బల్లగుద్ది మరీ వాదించేవారు. జానపద భాషలో ఇలాంటివి రాయటమేమిటని నిలదీసి అడిగిన వారుకూడా లేకపోలేదు. ఇలాంటి ఎదురు దెబ్బలను ఎంతో సమర్థంగా తనదైన శైలిలో ఎదుర్కొంటూ చాలా సాహసంతో జానపదుల శైలికి, జానపదులు నాయికానాయకులకు కూడా కావ్య గౌరవాన్ని కల్పించి ఎంకిపాటలను రచించారు. నండూరి రచించిన పాటలకు విశేష జనాదరణ లభించింది. బసవరాజు అప్పారావు, కవి కొండల వెంకటరావులాంటి సమకాలికులు ఎంకి పాటల లాంటి కొన్ని కవితలను రాసినా అవి అంతగా ప్రచారాన్ని, ప్రాచుర్యాన్ని పొందలేక పోయాయి. దీనికి కారణం ఒక జానపదనాయిక (ఎంకి)ని సంపూర్తిగా ప్రతిపాటలోనూ కావ్యత్వాన్ని నింపుతు ప్రతిష్ఠించటమే. ఆయన రాసిన ప్రతిపాట ఓ ప్రణయ కావ్యమైతే ఆపాటలోని ప్రతి పదంలోనూ కథానాయిక ఎంకి తొంగిచూస్తూనే ఉంటుంది.

## 12.2.1 నండూరి గొంతులో ఎంకి మసలిన వేళ :

నండూరి వెంకట సుబ్బారావు ఏలూరు దగ్గరలో ఉన్న వసంతవాడ గ్రామంలో 1895వ సంవత్సరం డిసెంబర్ నెలలో జన్మించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యలు అయ్యాక ఆయన మద్రాస్ క్రైస్తవ కళాశాలలో పట్ట పరీక్షకు చదువుకోవటానికి వెళ్ళారు. అప్పుడే అంటే

1917, 1918 సంవత్సరాల మధ్య కాలంలోనే ఎంకి పాటలు ఆయన గొంతులో పల్లవించాయి. ఆ రోజుల్లో అధికార్ల సూర్యనారాయణరావు స్నేహం ఆయనకు ఓ వరంలా లభించింది. ఆయనతో కలసి ఉండటం వల్ల కొంత కవితావ్యాసంగం మెరుగు పరుచుకునేందుకు అవకాశం లభించింది. కవితా వ్యాసంగంలో అప్పటికే ఓ అడుగుముందుకేసిన బసవరాజు అప్పారావుకూడా అక్కడే వుండేవారు. పాటిబండ్ల అప్పారావులాంటి సాహితీ మిత్రులు సాహిత్య చర్చలకు వస్తుండేవారు. వారంతా ఎవరి రచనలను గురించి వారు మాట్లాడు కుంటే సాహిత్యంలో అప్పటికింకా ఓనమాలు దిద్దని నండూరివారు మాత్రం ఓ పక్కగా కూర్చుని ఆచర్చలను వింటూ ఉండేవారు. ఇలా కాలం గడుస్తున్న రోజుల్లోనే ఓరోజున కాలేజీ నుండి నండూరి సుబ్బారావు ట్రామ్ బండిలో వస్తుండగా ఆయన గొంతులో ఓసన్నని రాగం బయలు దేరింది. దాన్ని తనలోతానే పాడుకోవాలని ఆరాగానికి తగిన సాహిత్యాన్ని మనస్సులోనే కూర్చుకో సాగారాయన. ఒక తటిల్లత మెరిసినట్టు సుగంధ పరిమళం గుబాళించినట్టు తాను ఎప్పుడో విన్న పదంలాగా అనిపించినా నిజానికి కొత్త పదమైన "గుండెగొంతుకులోన కొట్లాడుతాది" అన్న పల్లవి వచ్చింది దాన్నే పదే పదే మననం చేసుకుంటూ ఇల్లు చేరే సరికి పాట పూర్తి అయి ఎదుట ప్రత్యక్షమైంది. వెంటనే అక్కడే ఉన్న తన మిత్రులు బసవరాజు అప్పారావుకు, జానకీ పతికి ఆపాట వినిపించారాయన. "శభాష్" రాసెయ్ అని జానకీపతి అన్నారు. ఏక్షణాన ఆమిత్రులు వెన్ను చరిచారో కానీ సుబ్బారావు అప్పటినుండి ఎంకిని ఓక్షణం కూడా మరవలేక పోయారు. ఎంకి పాటలు ప్రథమ ముద్రణేకాక మరికొన్ని కొత్తపాటలను కలిపిన ద్వితీయ ముద్రణ ప్రతిని కూడా నండూరివారు అనంతర కాలంలో రచించారు.

## 12.2.2 పాటలు ప్రాణం పోసుకున్నతీరు :

నండూరి సుబ్బారావు 1926వ సంవత్సరంలో న్యాయవాది వృత్తిలో చేరేటప్పుడే ఆయన మిత్రులు "న్యాయవాదానికి, కవిత్వానికి సరిపడదు" అని చెప్పారు. అయిన ఆయనా తన ఎంకిపాటల రచనా వ్యాసంగాన్ని వదల్లేదు. ఎంకిని నిత్యం స్మరిస్తున్నా 1948 వరకూ ఏగం పాటలైనా రాయలేక పోయారు 1948లో పాట్నా ఆలిండియా రేడియోలో పనిచేస్తున్న మంచాల జగన్నాథరావుతో స్నేహం కలిగింది. ఆనాటినుండి సంవత్సరాని కొకసారైనా జగన్నాథరావు సుబ్బారావు ఇంటికివచ్చి ఇచ్చిన ప్రోత్సాహంతోనే ఎంకిపాటలను పూర్తి చేయగలిగారు. రెండో భాగంగా వచ్చిన ఎంకి కొత్త పాటలకు మంచాల జగన్నాథరావే స్వరాలు రాసిచ్చారు. అంతకుముందే విద్వాన్ పారుపల్లిరామకృష్ణయ్య ఎంకి పాతపాటలకు స్వరాలను రాసిచ్చారు.

## 12.2.3 సంచలనం రేపిన పాటలు :

ఎంకి పాటల తొలిముద్రణ 1925లో ముప్పై అయిదు పాటలతో వచ్చింది. మలిముద్రణ 43 పాటలతో వెలువడింది. రెండోసారి రాసి ప్రచురించిన ఎంకిపాటలు ఏకారణం చేతనో అంతగా ప్రాచుర్యం పొందలేక పోయాయి. పాత ఎంకి పాటలే నండూరివారికి, ఆంధ్రుల గుండెల్లో స్థానం కల్పించాయి. ఎంకిపాటల్లో ఉన్న మాత్రా, ఛందోగతులు నూటికి తొంభై అయిదుశాతం వరకూ ఖండగతిలోనే వచ్చాయి. నండూరి వారి ఎంకి పాటలు అచ్చుకాగానే పెద్ద సంచలనం ఆంధ్రదేశం నలుమూలలా చెలరేగింది. కొంత మంది ఆయనను సమర్థిస్తే మరికొంతమంది ఆయనను విమర్శిస్తూ వ్యతిరేకించారు. ఎవరేమన్నా నండూరివారు మాత్రం ఎంకిపాటలలోని భావాలన్నీ తన స్వకీయ జీవితానుభవాలేకానీ వేరేవీమి కాదని అదంతా ఏదోతన సొంత ఘోషమాత్రమేనని చెప్పుకున్నారు.

## 12.2.4. విమర్శలు ఒక పక్క, విశేష ఆదరణలు ఇంకొక పక్క :

ఎంకిపాటలు ఆవిర్భవించి జనం నాల్కల మీదకు చేరగానే నండూరి వారు ఓ వైపునుంచి విమర్శలను, మరోవైపునుంచి విశేష ఆదరణలను పొందారు. పొక్కులూరి లక్ష్మీనారాయణ ఎంకి పాటలను గురించి చెబుతూ ఎంకినాయుడు బావలు సంకర దంపతులని వారి శృంగారం అసభ్యమని, అవినీతి మయమని తీవ్రంగా నిరసించారు. ఎంకి పాటలను అసత్కావ్య జాతిలో చేర్చి సర్వదా నిరసించిన వారిలో ఉమాకాంతపండితులు మొదట కనుపిస్తారు. ఎంకి పాటల భాష ప్రజల భాష కాదని అది ప్రజల భాషకి కాల్పనిక ప్రతిరూపం మాత్రమేనని,

అలాగే ఎంకినాయుడు భావ సామాన్య ప్రజలలోని వ్యక్తులు కారని దేవుల పల్లి కృష్ణ శాస్త్రి సృష్టించిన ఊర్వశికి నండూరి సుబ్బారావు ఎంకికి ఒక్క పేరులోనూ, వేషంలోనూ మాత్రమే తేడా కనుపిస్తుందని రచనలోని కూర్పు చూస్తే జానపద వాఙ్మయంలో ఉన్న ఛందస్సులను, జానపద భాషలాంటి భాషని తీసుకున్నా ఎంకి పాటలు భావకవిత్వమేనని లిఖిత కవిత్వమేనని వెల్చేరు నారాయణరావు అంటారు. ఆనాడు సుప్రసిద్ధులైన కవులు శ్రీశ్రీ కృష్ణశాస్త్రి లాంటివారంతా ఎంకిపాటలను భుజానవేసుకుని ఊరూరా ఊరేగించి ప్రచారంచేశారు.

## 12.2.5. ప్రభావం :-

నండూరి వారి కలంనుండి ఎంకి జాలువారి ఇంతలా ప్రచారం పొందటానికి ఆయనను ప్రభావితం చేసిన అంశాలు ఏవైవుంటాయని అనేక విమర్శకులు అనేక రకాలుగా విశ్లేషించి చెప్పారు. డాక్టర్ సి. నారాయణరెడ్డి ఆంగ్ల భాషలో కాల్పనిక కవి అయిన రాబర్ట్ బర్న్స్ ప్రభావం నండూరి మీద బాగా వుందని అన్నారు. బర్న్స్ స్కాట్లండ్ జానపదుల భాషలో పాటలు రాశారు. వాటిలో జీవనాదం ప్రతిధ్వనిస్తుంటుంది. నండూరి వారు తాను పుట్టి పెరిగిన గోదావరీ మండలంలోనూ విశాఖ ప్రాంతంలోని తూర్పు ఏసలోనూ పాటలురాశారు. అటు బర్న్స్ కవిత్వంలోనూ ఇటు నండూరి పాటల్లోనూ ఒక సమాన లక్షణం కనుపిస్తుంది. సామాన్య విషయాన్ని ఎంతో ఉదాత్తంగా వర్ణించి చెప్పటమనే ఆలక్షణం వల్లనే వారి కవిత్వాలు ప్రజలను అంతగా ఆకట్టుకున్నాయి. భావకవిత్వంలోని శృంగార నాయికలలో ఎంకి విలక్షణమైనది. ఊర్వశి, శశికళలాంటి కావ్యనాయికలు వెన్నెల నురుగులు పోతపోసిన మూర్తులైతే ఎంకి మాత్రం అడవిమల్లెలాంటిది. అంత రంగంలో పారిజాత పరిమళం గుభాళిస్తుంటుందని డాక్టర్ నారాయణ రెడ్డి ఎంకి లోని విశేష లక్షణాన్ని విశ్లేషించి చూపారు.

**అపూర్వజంట** : ఎంకి నాయుడు బావ అనే ఇద్దరు ప్రణయ మూర్తులు ఒక క్షణం కూడా ఒకరిని విడిచి ఒకరు ఉండలేరు. ఒకరిని చూసుకోకుండా మరొకరు బతకలేరు. ఈ అపూర్వ జంటలో ప్రణయ తత్వంతో పాటుగా మంచి దాంపత్య లక్షణం కూడా కనిపిస్తుంది. ఆదర్శ దంపతులు ఆ ఇద్దరే నన్న భావన పాఠకులకు, శ్రోతలకు అనిపిస్తుంటుంది.

## 12.2.6. ఎంకిపాటలు - విశ్లేషణ :

నండూరి సుబ్బారావు మొట్టమొదటిగా రచించిన ముద్దుల నా ఎంకి పేరుతో ఉన్న గుండె గొంతుకలోన కొట్లాడుతాదీ

కూ కుండ నీ దురా కూసింత సేపు!

..................................................

నా కాసి సూస్తాది నవ్వు నవ్విస్తాది
యెల్లి మాటాడిస్తె యిసిరి కొడతాది !
గుండె గొంతుకలోన కొట్లాడుతాదీ ॥

..................................................

కన్ను గిలిగిస్తాది నన్ను బులిపిస్తాది,
దగ్గరగ కూకుంటె అగ్గి సూస్తాది !
గుండె గొంతకలోన కొట్లాడుతాది ॥

..................................................

యీ దుండ మంటాది యిలు దూరిపోతాది,
యిసిగించి యిసిగించి వుసురోసుకుందీ !
గుండె గొంతుకలోన కొట్లాడుతాదీ ॥

..................................................

మందో మాకో యెట్టి మరిగించి నాదీ,
వల్ల కుందామంటే పాణ మాగదురా !
గుండె గొంతుకలోన కొట్లాడుతాదీ ॥

..............................................

అనే పాటలో నాయుడు బావమాటల్లో ఎంకి స్వరూప స్వభావాలు ఎంతగొప్పవో అవంటే నాయుడు బావకు ఎంత మక్కువో తెలుస్తుంది.

ఎంకి చిలిపి తనాన్ని, ఎంకి వలపు గొప్పతనాన్ని నాయుడు బావతలచుకుంటూ యెంకి వొంటి పిల్ల లేదోయి లేదోయి ! యెంకి నా వొంకింక రాదోయి రాదోయి

మెళ్ళో పూసల పేరు
తల్లో పూవుల నేరు
కళ్ళెత్తి తే సాలు
కనకాబిసేకాలు

అని ఇలా పలవరిస్తూ పరవసిస్తుండేవాడు. కేవలం ఇలా పరువపు వలపులలో పడి తిరుగాడటమేకాక నాయుడు బావమాటల్లో తాత్వికత ధ్వనిస్తున్నప్పుడు ఎంకి ఆమాటలకు ప్రతి స్పందిస్తున్నట్లు "ఎట్టి నా ఎంకి అనే పాటలో

"యెనక జల్మములోన
యెవరమో" నంటి
సిగ్గొచ్చి నవ్వింది
సిలక ... నా యెంకి
"ముందు మనకే జల్మ
ముందలె" యంటి !
తెల్ల తెల పోయింది
పిల్ల .... నా యెంకి !
"యెన్నాళ్ళ మనకోలె
యీ సుకము" లంటి
కంట నీ రెట్టింది
జంట ... నా యెంకి !

అంటూ నాయుడు బావ కథా నాయిక ఎంకి కంట నీరు ఏ ఆలోచనతో పెట్టిందో మనకు చెప్పకనే చెపుతున్నట్లుగా వుంటుంది.

ఎంకి పాటలు ప్రథమ సంపుటికి "ఒకటి రెండు మాటలు" పేరుతో ముందుమాట రాసిన పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి "ఈ విధంగా ప్రస్తుత కాలమున మనయాంధ్ర సారస్వతోద్యానపు సార్వజనీన శోభాభివృద్ధికై పాటుపడుచున్న తరుణ కవికుమారులలో శ్రీయుతులు నండూరి వెంకట సుబ్బారావు పంతులు (బి.ఏ) గారును నొక్కరు వీరు తక్కిన కవి ప్రపంచమువలె కాక తమ శుశ్రూషాంజలులను, భిన్న మార్గముల నాంధ్ర వాగ్దేవి సన్నిధి నలంకరించుచున్నావు. సుబ్బారావుగారు ఆంధ్రజాతికి సమాజములై - శ్రావ్యములై - సొంపు నింపగల మృదు మధుర గేయములలో అందునను నేడు వాడుకలో - వ్యవహారములో నున్న జీవద్భాషలో ఎంకి - నాయుడు బావల దాంపత్య

పూతములును భావోన్నతములును ముగ్ధముగ్ధములును అగు ప్రణయ గాథలను గానము సేయుచున్నారు. నిజముగా ఎంకి - నాయుడు బావలనే నాయకులున్నారో, లేక వారు కవి కపోల కల్పితులో చెప్పజాలకున్నను - ఎంకి పాటలను వినునప్పుడు మాత్రము, శ్రోతలు - తన్మయతను జెంది తమతమ భావనావీధులలో - రసమయ మూర్తులగు ఎంకినాయుడు బావలను తప్పక గాంచగల్గుదురు. ఒక్క కాంచుట మాత్రమేనా? - కాంచి తా మనుభవించిన ఆయా నందమును - మఱుల నా గీతములతోనే అనువాదరూపమున వెల్లడింపని సహృదయ శిరోమణి యుండుటయి గూడ గానము ఎంకి పాటల యందింతటి మహాత్యము గలుగుటకు తజ్ఞనకులగు వెంకటసుబ్బారావు పంతులు గారి రసానుభవ వ్యగ్రమగు హృదయ పరిణామ పేశలతయును, లోకజ్ఞతయును ముఖ్య కారణములని నాకుగల నమ్మకము."

"యెంకి కేవలం ముగ్ధకాదు. ఆమె శీలానికి రెండు పదునైన అంచులున్నాయి. ఒక్క మాటు ఆమె వికసిస్తుంది విరిలా. ఒకొక్కమాటు గుప్పుమంటుంది ఆవిరిలా. ఇదే యెంకితనం" ఎంతటి పరస్పరానురాగం వున్నా, అవగాహన ఉన్నా ఇద్దరూ ప్రత్యేక వ్యక్తిత్వాలు ఉన్న వారే, కాబట్టి అభిప్రాయ భేదాలు తప్పలేదు.

"రావొద్దు నాపక్క రావొద్దె యెంకి
ఆ పొద్దు మన పొత్తులయి పోయెనెంకీ ?
అని విరహం పొందాడు నాయకుడు.

"నన్నిడిసి పెట్టెల్లినాడే, నారాజా
మొః  తిరిగొస్తనన్నాడే,"

అని కోపంతో వెళ్ళిపోయిన బావకోసం నిరీక్షించింది యెంకి

"ఈ రేయి, నన్నొల్లనేరవా? రాజా
ఎన్నెలల సొగసంత యేటి పాలేనటర"

అంటూ స్మృతులు గుర్తుకు తెచ్చుకొని విప్రలబ్ధ అయింది.

"దూరాన నా రాజు కేరాయి డౌనో
ఈ రోజు నారాత లేరాల పాలో"

అని తన బావ తిరిగి రానందుకు వ్యధ చెందింది.

"యెనక జన్మములోన యెవరమోనంటి" "ఆరిపోయిన దీపమూ" మొదలైనవి దాంపత్య తత్వాన్ని వివరిస్తున్నాయి.

"ఎంకెవ్వరని లోక
మెపుడైన కదిపితే
వెలుగు నీడల వైపు
వేలు సూపింతు"

వంటి గొప్ప పంక్తులు ఎన్నోఎంకి పాటల్లో ఉన్నాయి.

ఎంకి పాటల్లో భావ చిత్రాలు నండూరి వారి ప్రతిభను పట్టిచూపుతాయి. కస్సుమంటా యేరుగాలి నెగబోసింది', 'ఏటి కడుపున దాగి తోటనిద్దురోయింది', ఆకాశమావరన, ఆవులించిన రేయి, ఎలుతురంతా మేసి, ఏరు నెమరేసింది, వంటి భావ చిత్రాలు సినారె అన్నట్టు "విశ్వకవితా భాండాగారంలో అగ్రపంక్తిలో నిలువ దగిన నిధులు"

"తీగలనడుమ నూగి
దీపమై తిలకమై
పీఠమై ఎంకికి కీ
రీటమై నెలవంక"

అన్న దృశ్య చిత్రీకరణ అమోఘం. వండూరివారి ఈ భావ చిత్రణానైపుణ్యమే తరువాత వచనకవితా శేఖరులకి నాంది పలికింది విధి వశాన దూరమైన ఎంకి విలాసవర్ణ నలోకూడా నండూరి వారి కలం పదు నెక్కింది.

"కళ్ళకేటో మబ్బు గమ్మి నట్టుంటాది.
నిదరల్లో నా వొల్లు
నీ రసెత్తున్నాది
తులి సెమ్మ నొరిగింది
తొలి పూస పెరిగింది
మనసులో నా బొమ్మ
మసక మసకేసింది"

అని వర్ణించడంలో యెంకి ఉత్తమ ఇల్లాలి తనం కనిపిస్తుందని వి. రామచంద్రవ్యాఖ్యానించారు.

కాశీ దేవుని యెదుట
గరవాన నిలిసింది
తల తడుముకునితానె
తబ్బిబ్బులైనాడు"

యెంకి పరమశివుని ముందు ఠీవిగా నిలిచిందట ఆమెను చూచి తబ్బిబ్బయి తలతడుము కొన్నాడట శివుడు. ఎందుకు? హఠాత్తుగా తనముందు ప్రత్యక్షమైన యీమె కొంపదీసి గంగాదేవి కాదుగదా - అనుకొని శివుడే తల తడుముకొన్నాడట ! ఈ భావుకతకే రసికులు పొంగపోరా? "మాండలిక భాషలో సముదాత్త భావాలను సమర్థంగా అందించిన ప్రయోగశీలి నండూరి సుబ్బారావు. మామూలుగా పాటకజనం మాట్లాడుకునే మాటల్లో ఎంత పాటవం ఉందో రుజావు చేశారు వారు. అంటు సినారె ఎంకి పాటల్లోని మాండలిక పదాల సార్థకతను వివరించారు.

ఉసురోసుకుంది = ప్రాణం తీసింది
అగ్గిసూస్తాది = కసిరి చూస్తుంది
దగ్గరస = దగ్గరగా
పల్లకుందామంటె = ఊరుకుందామంటే
పద్దాక = చాలాసేపు (ఎప్పుడూ)
తల తిరిగిందోలె = ఓలె అంటే ఓసి

"ఈ యెంకి పాటల్లో శ్రీ నండూరి సుబ్బారావు తన కవితాత్మను విశ్లేషించాడు. మధుర మనోజ్ఞ శృంగార భావాలను సహృదయుల హృదయాలు పరవశించి పోయేటట్లుగా ఆవిష్కరించారు. మాటల్లో, విషయంలో, ఛందస్సులో పూర్తిగా దేశీయతను సాధించారు. కొత్త పాటల్లో ఆలక్షణాలు సంపూర్ణంగా ఉన్నాయని చెప్పలేం" అన్నారు వి. రామచంద్ర.

ఎంకి పాటలతో తెలుగు సాహిత్యంలో నూతనత్వానికి అలా నండూరి సుబ్బారావు శ్రీకారంచుట్టారు. అనంతర కాలంలో కొంత మందికి ఆదర్శ రచయితగా కూడా అయ్యారు. కట్టమంచిరామలింగా రెడ్డి లాంటి సద్విమర్శకులు ఆయనను సత్కరించారన్నా, "ఆంధ్ర ధ్వన్యాలోకం" కర్త వేదాల తిరువెంగళాచార్యులు, కవి ప్రౌఢోక్తికి ఉదాహరణగా ఎంకి పాటను పేర్కొన్నారన్నా, దానికి కారణం ఆపాటల్లోని అచ్చ తెలుగు మాధుర్యం ఓ కారణమౌతుంది. తెలుగు నుడికారం, మాండలికం తెలుగు జానపద జీవన సౌరభం అన్నీ అలా సమ్మిళితమై నండూరి ఎంకి పాటలను నిత్య సుగంధ భరిత సుమరాజంగా చిరస్థాయిగా ఉండేలా జన జీవాలను కల్పిస్తున్నాయి.

## సమీక్ష :-

ఎంకిపాటలమీద రేగిన దుమారాన్ని, అందుకు కారణాలను పరిశీలించారు. ఎంకినాయుడుబావల పవిత్ర ప్రేమ, లోకానికి వారు ఆదర్శమూర్తులుగా నిలిచిన వైనం, మాండలిక భాషను పరిశీలించారు.

## మాదిరి ప్రశ్నలు

1. ఎంకి పాటలకు తెలుగు సాహిత్యంలో ఉన్న స్థానాన్ని వివరించండి?
2. ఎంకి పాటలు ఆవిర్భావం ఎలా జరిగింది?
3. ఎంకి పాటల్లో ఉన్న మాండలికాలను పేర్కొనండి?
4. ఎంకి పాటలు ఆవిర్భవించాక తెలుగు సాహిత్యకారుల్లో ఎలాంటి చర్చలు జరిగాయి?

## ఉపయుక్త గ్రంథాలు

2. ఎంకి పాటలు - నండూరి సుబ్బారావు సాయిరాం పబ్లికేషన్స్ సరూద్ నగర్, హైదరాబాద్
2. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు, ప్రయోగములు - డా॥ సి. నారాయణ రెడ్డి
3. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వా.నా. శాస్త్రి.

డా॥ యెడ్ల ప్రసాద మల్లికార్జునరావు

పాఠం - 13.1

# దువ్వూరి రామిరెడ్డి - రాయప్రోలు సుబ్బారావు

పాఠ్య నిర్మాణ క్రమం

13.1.1 దువ్వూరి బాల్యం - విద్యాభ్యాసం

13.1.2 ప్రభావితం చేసిన సంఘటనలు

13.1.3 వివాహం - కవితా వ్యాసంగం

13.1.4 సన్మానాలు - సత్కారాలు

13.1.5 కవిత్వం - స్నేహం

13.1.6 చిత్ర రంగం

13.1.7 కావ్యాలు - రచనలు

17.1.8 రచనలు - ప్రత్యేకత

**లక్ష్యం :**

దువ్వూరి వారి జీవనసరళి, కవితా వ్యాసంగం - రచనలు - విశిష్టతలను తెలుసుకొంటారు.

సామాజిక చైతన్య నేపధ్యం నుంచి ఊరి ఉబికి తన్ను కొచ్చిన సజీవ కవితా ఝరి దువ్వూరి రామిరెడ్డి. కవికోకిలగా తెలుగువనాన వెలుగు చిగుళ్ళను మేసి కొత్త పాతల మేలు కలయికలతో భావ కవితను వినదించిన దివ్య వాణిగా ఆయన కీర్తి దిగంతాలకు వ్యాపించింది. 20వ శతాబ్దం ప్రథమార్థంలో తెలుగు సాహిత్యనందనోద్యానాన్ని సుసంపన్నం చేసిన మహా మనీషి ఆయన. భావ కవిత్వయుగంలో అభ్యుదయ గీతాలను ఆలపించారాయన. భరతమాత దాస్య విముక్తి కోసం గొంతెత్తి పిలుపు నిచ్చి, ప్రజలలో చైతన్యం కలిగించిన నవయుగ వైతాళికుడు దువ్వూరి రామిరెడ్డి. కళకు సామాజిక ప్రయోజనం వుందని విశ్వసించి కవిత్వం కళాత్మకంగా ఉండాలని ఆకాంక్షించారు. కవిగా, నాటక కర్తగా విమర్శకుడిగా సినీరచయిత, దర్శకుడు, శిల్పి, చిత్రకారుడుగా బహుముఖీనంగా ఆయన ప్రజ్ఞ తేజరిల్లింది.

## 13.1.1. బాల్యం - విద్యాభ్యాసం :

దువ్వూరి రామిరెడ్డి 1895వ సంవత్సరం, నవంబరు 9వ తేదీన శనివారం ఉదయం ఆరున్నర గంటలకు నెల్లూరు జిల్లా గూడూరులో జన్మించారు. తండ్రి సుబ్బారెడ్డి, తల్లి లక్ష్మీ దేవమ్మ. తాత, తండ్రులంతా మంచి పేరు ప్రతిష్టలు పెత్తనం ఉన్నవారే. సుబ్బారెడ్డి, లక్ష్మీదేవమ్మ దంపతులకు రామిరెడ్డి మొదటి సంతానం. ఆ తర్వాత బాల కృష్ణారెడ్డి, ఆ తర్వాత రుక్మిణమ్మ జన్మించారు.

రామిరెడ్డి గూడూరు వీధిబడిలోనూ, పెమ్మారెడ్డి పాలెంలో సీతయ్య అనే సాతాని అయ్యావారి దగ్గర ఓనమాల నుండి అయిదో తరగతి వరకూ చదువుకున్నారు. పెద్ద చదువుల కోసం నెల్లూరు వెళ్ళి హార్వి దొర దగ్గర మూడో ఫారం వరకూ చదివారు. కానీ ఆపరీక్షలలో ఉత్తీర్ణులు కాలేకపోయారు. అందుకు తల్లి లక్ష్మీదేవమ్మ కోపగించుకుంది. రోషంతో మరుసటి సంవత్సరం బాగా చదివి థర్డ్ ఫారం పూర్తి చేశారు. అంతలోనే తండ్రి మృతి చెందడంతో ఆయన చదువు అర్థంతరంగానే ఆగిపోయింది. తండ్రి మరణానంతరం తల్లి లక్ష్మీ దేవమ్మ తన పిల్లల ఆలనా పాలనా చూసుకుంది.

### 13.1.2. ప్రభావితం చేసిన సంఘటనలు :

నెల్లూరులో రామిరెడ్డి చదువుకునే రోజుల్లోనే ఆయనను కొన్ని సంఘటనలు ప్రభావితం చేశాయి. ప్రతి చిన్న విషయానికి స్పందించటం ఆయనకు అలవాటైంది. చదువు మీదకన్నా ఇతరత్రా విషయాలమీద ఆయనకు ఆసక్తి పెరిగింది. ప్రతి దాంట్లోనూ ఏదోఒక కొత్తదనాన్ని వెతుకుతుండేవారు. గుర్రపుతోక వెంట్రుకలను కత్తిరించి కుంచెగా తయారు చేసి ఆనందపడేవారు ఇలాంటి విషయాలు ఆయనలోని సృజనాత్మక శక్తికి బాటలు వేసాయి. పాఠశాలలో ఆయన నేర్చిన విద్య చాలా కొంచెమే. కానీ ఆయన ఇల్లే ఆయనకు ఓ విద్యాలయమై ఆయన్ను తీర్చిదిద్దింది. వ్యవసాయాన్ని ప్రధాన వృత్తిగా స్వీకరించినా, విజ్ఞాన శాస్త్రాలు, మెకానికల్ ఇంజనీరింగ్, కవిత్వ రచన, చిత్ర లేఖనం, మట్టితో చక్కటి బొమ్మలను తయారు చేయటం ఇలాంటివన్నీ ఆయనను ఆకట్టుకొని వాటిలో ఆయన ప్రావీణ్యతను సాధించేలా చేశాయి. ఎప్పుడూ ఒకే విషయానికి పరిమితమై ఉండేవారు కాదాయన. హోర్వీదొర దగ్గర చదువుకునే రోజుల్లో దొరకొడుకు చేతుల్లో ఓ కెమెరాను రెడ్డి చూశారు. ఆ కెమెరా ఆయనకు ఒక స్ఫూర్తిని, ఉత్తేజాన్ని కూడా కలిగించింది. అది ఎంతదాకా వెళ్ళిందంటే విడివిడి భాగాలను కొని వాటన్నింటినీ ఓ క్రమ పద్ధతిలో జోడించి కెమెరాలాగా చేసి దానితో ఫోటోలు కూడా తీసారు రామిరెడ్డి. ఆ సంఘటన ఆయనను చాలా కాలం పాటు భారత దేశంలో ఓ కెమెరా ఫ్యాక్టరీని నిర్మించాలని నిరంతరం ఆలోచించేలా చేసింది. ఆ తరువాత విదేశాల నుండి రేడియో విడి భాగాలను తెప్పించి ఓ రేడియో సెట్టును కూడా తయారు చేసారాయన. ఇలా చిన్న తనంలోనే శాస్త్ర విజ్ఞానంతోపాటు వశీకరణ విద్య (హిప్నాటిజం) కూడా నేర్చుకున్నారు. పాఠశాలలో చదివే రోజుల్లోనే రామకృష్ణ పరమ హంస, స్వామి వివేకానంద లాంటి వారి రచనలు చదివి ప్రభావితమయ్యారు. ఆ ప్రభావితంతోనే పెల్లేటి వెంకట సుబ్బారెడ్డి అనే ఆయన దగ్గర డబ్బు అప్పుచేసి కలకత్తా వెళ్ళారు. అయితే ఆ తర్వాత ఆయన తల్లి లక్ష్మదేవమ్మ ఆయన బేలూరులో ఉన్నాడని తెలుసుకుని ఘుళ్ళీ ఇంటికి తీసుకు వచ్చింది.

### 13.1.3. వివాహం - కవితా వ్యాసంగం :

ఒక పద్ధతంటూ లేకుండా పోతున్నాడని ఓ దోవలో పెట్టాలని తల్లి ఇతర కుటుంబ పెద్దలు భావించి 1914వ సంవత్సరంలో పాపిరెడ్డి పాలెం నివాసి అయిన బలరామిరెడ్డి కుమార్తెతో వివాహం జరిపించారు. చిన్నప్పటినుంచి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ఆనందించే ఆయనకు చిత్రలేఖనం, మట్టి బొమ్మల తయారీ బాగా అలవాటయ్యాయి. అయితే ఉన్నట్టుండి ఆయన కవిత్వం వైపు మొగ్గారు. దీనికి దారితీసిన ఓ కారణం వుంది. రామిరెడ్డి నివసిస్తున్న పొరుగూరు గండవరంలో ఓ గ్రంథాలయముండేది. అయితే ఆ గ్రంథాలయంలోని పుస్తకాలను అన్నింటినీ చదివిన ఘనత మాత్రం రామిరెడ్డికే దక్కింది. ప్రతిరోజూ సాయం కాలం నాలుగు గంటలకు గండవరం వెళ్ళి పుస్తకాలు చదువుతుండేవారు. ఓ రోజున ఆ ఊరికి ఒక శతావధాని వచ్చి ఆ గ్రంథాలయంలోనే కూర్చుని కవిత్వం అనేది పూర్వ జన్మ సంస్కారం వుంటేనే వస్తుందని ఊరక పుస్తకాలు చదువుతూపోతే పండితుడయితే కావచ్చుకానీ కవి మాత్రం కాలేడని గట్టిగా అందరితో అన్నాడు. అసలే ఆత్మ విశ్వాసం ఓ పాలు ఎక్కువుగా ఉన్న రామిరెడ్డి ప్రయత్నం చేస్తే ఏదైనా నేర్చుకోవచ్చంటారు కదా మీరు ఇలా అంటారేమిటి అని అన్నారు. అందుకా శతావధాని నిజమే ప్రయత్నం చేస్తే మిగతా కళలేవయినా నేర్చుకోవచ్చేమో కానీ కవిత్వాన్ని మాత్రం నేర్చుకోలేరని ఓ వేళ అప్పటికప్పుడు ఛందస్సు నేర్చుకొని పద్యాలు రాస్తే అవి అంతంత మాత్రంగానే వుంటాయన్నాడు. ఇలా ఆ ఇద్దరి వాదులాటల చివరకు శతావధానికి విసుగేసి చాతనయితే నీవు కవిత్వం రాయొచ్చుగా అని అన్నాడు. ఆనాటి పట్టుదల ఆయన్ను కవికోకిలగా అనంతర కాలంలో తెలుగుజాతికి పరిచయం చేసి కమ్మటి కవిత్వ కలకూజితాలను చేసేలా చేసింది. పట్టుదలతో, ఆత్మ విశ్వాసంతో అప్పటి దాకా తెలుగు వాఙ్మయంతో ఎలాంటి పరిచయమూ లేకపోయినా మద్రాసు నగరానికిపోయి ఛందస్సు, అలంకారాలు, వ్యాకరణం ఇలాంటి వాటికి చెందిన అనేక పుస్తకాలను కొని తెచ్చుకున్నారు. 1915వ సంవత్సరంలో అలా ఆయనలో కవిత్వం అంకురించింది. 1916-17 సంవత్సరాల మధ్య బాగా కవితాభ్యాసం చేశారు. ఆ తర్వాత 1916-18 సంవత్సరాల మధ్య ఆయన రసిక జనానందం, స్వప్నాశ్లేషం, అహల్యానురాగం, [illegible] అనే ప్రబంధాలను, నలజారమ్మ అనే నవీన ప్రబంధాన్ని రచించారు. 1915లోనే నెల్లూరులోని దుర్భా సుబ్రహ్మణ్య శర్మ ఆయనకు కావలసిన వాఙ్మయ సాహిత్య పరమైన సహాయాన్ని చేశారు. ఆయన ప్రథమ ముద్రిత కావ్యాలైన వనకుమారి, జలదాంగనలను ప్రశంసించిన వేదం వెంకటరాయశాస్త్రి, రామిరెడ్డి కవిత్వ శైలిని మెచ్చుకున్నారు. ఆయన రచనల్లో చాలా భాగం 1927వ సంవత్సరంలో వచ్చిన పెద్దగాలి వానలో నాశనమైపోయాయి. ఆయన స్వతంత్ర రచనలనే కాక ఋతు సంహారం, పుష్పరాజ విలాసం అనే కావ్యాలను అనువదించారు. ఆరోజుల్లోనే కర్షక విలాసం అనే నాటకాన్ని కూడా రాశారు. 1917వ సంవత్సరంలో మాతృశతకం, సింహాసబోధలను

రాశారు. భారతదేశ దాస్య విముక్తి నేపథ్యంలో సాగిన నూత్న శతకాన్ని కేవలం నాలుగు రోజుల్లోనే రాశారు. ఆ శతకం రాతప్రతి పాణక కనకమ్మ ఇల్లు కాలిపోయినప్పుడు బూడిదై పోయింది. అయితే ఆ శతకం మరో ప్రతిని ద్రోణం రాజు లక్ష్మీ బాయమ్మగారసి పెట్టుకుని ఉండటంచేత దీన్ని రెండవసారి మద్రాస్‌లోని ఇండియా ప్రింటింగ్ వర్క్స్‌లో ముద్రించారు. అయితే విచిత్ర మేమిటోకానీ అవి కూడా అగ్నికి ఆహుతై వట్టి ప్రూఫ్ కాపీలు మాత్రమే మిగిలాయి. ఆ తర్వాత గుంటూరు రాజకీయ మహా సభలో ఆ పద్యాలకు మంచి ప్రచారం లభించింది.

### 13.1.4. సన్మానాలు సత్కారాలు :

1917లో నెల్లూరు రెడ్డి జన సంఘం ఒక బంగారు పతకంతో ఆయనను సత్కరించింది. ఆ సత్కార సభలో కట్టమంచి రామలింగారెడ్డి రామిరెడ్డిని మెచ్చుకొని ఘనంగా సత్కరించారు. ఆ తరువాత విజయనగర ఆంధ్ర సంస్థానం నిర్వహించిన ఆంధ్ర కావ్య పరీక్షకు వనకుమారి కావ్యాన్ని దుర్భా సుబ్రహ్మణ్య శర్మ ప్రోత్సాహంతో పంపారు. ఆ పరీక్షలో ఆ కావ్యానికి ప్రథమ బహుమతి, నాలుగు వందల రూపాయల పారితోషికం లభించాయి. దానితో ఆయన ప్రతిభ ఆంధ్ర దేశమంతా వ్యాపించింది. ఆ తర్వాత ఆయన పింజల సుబ్రహ్మణ్య శెట్టి మద్రాస్‌లో స్థాపించిన సమదర్శిని, న్యాయ దీపిక పత్రికలకు ఉప సంపాదకులుగా పని చేశారు. కానీ ఆ ఉద్యోగంలో ఎక్కువ కాలం నిలువలేక పోయారు. పత్రికా ముఖంగా ఆయన బ్రహ్మణ వ్యతిరేక వాదాన్ని గురించి అనేక వ్యాసాలు రాశారు. జస్టిస్ పార్టీని సమర్థించారు కానీ త్రిపురనేని రామస్వామి చౌదరిలాగా జస్టిస్ ఉద్యమానికి అంకితం కాలేదు. అనంతరం ఆయన ఆంధ్రోద్యమం, జాతీయోద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు. ప్రజలను చైతన్య పరచే అనేక ప్రబోధ గీతాలను ఆ సందర్భంగా ఆయన రచించారు. ఆయన రచించిన ఖండ కావ్యాల నుండి మంచి మంచి ప్రబోధాత్మక పద్యాలను ఎంచుకుని "వాయిస్ ఆఫ్‌రీడ్" అనే పేరుతో 1923లో ప్రచురించారు. మహాత్మాగాంధి ప్రబోధాలు ఆయనను బాగా ప్రభావితం చేశాయి. ఆ ప్రభావంతో ఆయన నైవేద్యం, మేలుకొలుపు, ప్రబోధ శంఖం లాంటి ఖండికలను రచించారు. 1922వ సంవత్సరంలో గాంధీజీ ఉద్యమాన్ని తాత్కాలికంగా నిలుపుచేసి, 1928లో మళ్ళీ ఉద్యమ సారధ్యం చేపట్టే వరకూ ఎలాంటి రచనలు చెయ్యలేదు. సైమన్ కమీషన్ వ్యతిరేక ప్రదర్శనలతో ప్రారంభమై 1932 వరకూ సాగిన ఉద్యమ కాలంలో రామిరెడ్డి గాంధీజీ మీద అనేక పద్యాలు రాశారు. 1919లో కృషీవలుడు కావ్యాన్ని, రచించారు. కర్షక విలాసం అనే నాటకాన్ని, పౌరాణిక నేపథ్యంలో సీతావనవాసం నాటకాన్ని రచించారు. 1922-23 సంవత్సరాల మధ్య కాలంలో యువక స్వప్నం, కడపటి వీడుకోలు కావ్యాలను రాశారు. కడపటి వీడుకోలును ఆంగ్లంలోనికి కూడా ఆయనే అనువదించారు. 1924లో ఆయన కుంభరాణా నాటకాన్ని రచించారు. ఈ నాటకాన్ని కేవలం తొమ్మిది రోజుల్లో మాత్రమే రచించటం విశేషం. ఆయన మిత్రుడు ఎరగుడి పాటి హనుమంతరావు కుంభరాణా నాటక ప్రదర్శనలు దేశమంతటా జరగటానికి ఎంతగానో సహకరించారు. ఆ తరువాత ఆయన మాధవ విజయం అనే నాటకాన్ని 1925లో రచించారు. అయితే ఈ నాటకానికి కుంభరాణాకు వచ్చినంత మంచి పేరు రాలేదు.

### 13.1.5. కవిత్వం - స్నేహం

ఆయన భాషా రచన శైలీ విషయాలలో కొన్ని కచ్చితమైన అభిప్రాయాలను కలిగివుండేవారు. గ్రామ్య భాషను నిరసించలేదు కానీ జీవద్వంతమైన భాష ఏ కట్టుబాట్లకు లొంగివుండదని ఆయన భావించేవారు. సమకాలీన కవులతో అంత స్నేహం ఉండేదికాదు. నండూరి సుబ్బారావు ఎంకి పాటలను అభిమానించారేకాని వాటిని గొప్ప కావ్యాలని మాత్రం ఆయన భావించలేదు. రాయప్రోలు సుబ్బారావు అస్పష్టశైలి రామిరెడ్డికి నచ్చేదికాదు.

1926 వ సంవత్సరం మార్చి నెలలో హైదరాబాద్‌కు రామిరెడ్డి మకాం మార్చిన తరువాత మాత్రం ఎన్నెన్నో పరిచయాలయ్యాయి. సురవరం ప్రతాపరెడ్డి, కొత్వాలు వెంకటరెడ్డి, ఆత్మకూరు రాజా లాంటివారు ఆయన్ను బాగా అభిమానించేవారు. తణికెళ్ళ వీర భద్రుడితోను, ఉస్మానియా విశ్వ విద్యాలయం ఇంగ్లీషు ప్రొఫెసర్ స్పేటు దొరతోనూ కవిత్వాంశాలను చర్చిస్తుండేవారు.

ఆయన జీవితంలో భార్యా వియోగం ఆ తర్వాత సంవత్సరానికే పుత్రికావియోగం ఓ అగాధాన్ని సృష్టించాయి. "పూవు రాలిన జిరు పిందె పూపపైన నంటుకొనియుండు నన్నపేరాసమంటి మృత్యు నిశ్వాస పవనంబు రేగి సుడిసిభావి ఫలమును గసుగందు "బైకేవిసిరి" అని వాపోయారు. ఆ దుఃఖం నుంచి కోలుకోవటానికి కనీసం రెండు సంవత్సరాలు పట్టింది. 1925-26లలో జరిగిన ఈ విషాద ఘటనలు ఆయనను ఎంతగానో కుదిపి వేసాయి. ఆ తర్వాత 1929 జూన్ 16న ఆయనకు ద్వితీయ వివాహమయింది. రామిరెడ్డికి వాస్తు శాస్త్రం,

జ్యోతిషం మీద కూడా మంచి ఆసక్తి కలిగి వాటిని కూడా నేర్చుకున్నారు. 1929 నవంబర్ 4న కడప కోటిరెడ్డి అధ్యక్షతన బెజవాడలో ఆంధ్ర మహాసభ కవి కోకిల అనే బిరుదు నిచ్చి సత్కరించింది.

### 13.1.6. చిత్రరంగం :

రామిరెడ్డి చలన చిత్ర రంగంలో అడుగుపెట్టి అక్కడా తనదైన ప్రత్యేకతనే నిరూపించుకున్నారు. రేబాల దశరధరామిరెడ్డి, పందిపాటి సుబ్బరామిరెడ్డి అడపాల వెంకట కృష్ణారెడ్డి తదితరులు శ్రీరామా ఫిలింస్ అనే సినిమా సంస్థను నెలకొల్పి సతీతులసి లేక జలంధర అనే చిత్ర నిర్మాణాన్ని చేయాలనుకున్నారు. ఆ చిత్రానికి కథ, మాటలు, పాటలు అన్నిటినీ రామిరెడ్డి రాశారు. 1936లో ఆ చిత్రం విడుదలయింది. అయితే అది కళాత్మకంగా ఉన్నా నిర్మాతలకు నష్టాన్ని తెచ్చిపెట్టింది. నష్టం వచ్చినా ఆ నిర్మాతలు వెనక్కి తగ్గకుండా ఆ తర్వాత 'చిత్ర నళీయం' చిత్రాన్ని తీయాలని అనుకున్నారు. ఆ చిత్రానికి దర్శకత్వాన్ని వహించారు రామిరెడ్డి. ఎన్నెన్నో ఒడుదుడుకులను అధిగమించి ఆ చిత్రం చాలా ఆలస్యంగా విడుదలైనా మంచి కళా ఖండమని పేరు తెచ్చుకుంది. ఆ తర్వాత పి. పుల్లయ్య నిర్మించిన బాలాజీ లేక వెంకటేశ్వర మహాత్యం, ఘంటసాల బలరామయ్య నిర్మించిన పార్వతీ పరిణయం, సీతారామ జననం చిత్రాలకు కొన్ని పద్యాలను, పాటలను రాశారు. సీతారామ జననం చిత్రానికి పూర్తిగా సంభాషణలను మాత్రమే రాశారు. రామిరెడ్డి కవితా ప్రస్థానంలో పానశాలను తన మొదటి భార్యకు అంకితమిస్తే, రెండో భార్యకు అంకితమిచ్చిన పలితకేశం, "మిత్రా" అనే మకుటంతో అరవై అయిదు కంద పద్యాలతో రాసిన మిత్రార్థ శతకం, గులిస్తాన్‌కు అనువాదంగా వచ్చిన గులాబితోట, సాది రచన "బోస్తాను" కు అనువాదంగా వచ్చిన పండ్లతోట ప్రత్యేకతను సంతరించుకున్నాయి. పండ్లతోట చతుర్థ అధ్యాయం పూర్తికాక ముందే ఆయన మరణించారు. 1945లో పక్షవాతం వచ్చింది. ఆ తర్వాత రెండేళ్ళకు అంటే 11-9-1947న రాత్రి పన్నెండు గంటలకు ఆయన కన్ను మూశారు.

### 13.1.7. కావ్యాలు - రచనలు :

రామిరెడ్డికి పానశాల తెచ్చినంత కీర్తిని మళ్ళీ కృషీవలుడు అనే కావ్యం తప్ప మరే ఇతర కావ్యమూ తెచ్చి పెట్టలేదు. కాపుటిల్లాంధ్ర దైనందిన జీవితం వర్ణించారు. పానశాల రుబాయత్‌కు నకలు కాదు. ఉమర్ ఆలీషా కవి రుబాయత్‌ను ఆయన తెలుగులోకి అనువదించాడు. తెలుగులో కవిత్వం చెప్ప గలిగే ప్రతిభేకాక పారశీక భాషలో ఉమర్ ఖయ్యాం రుబాయత్‌లను చదవగలిగే సామర్థ్యం ఆయన పెంచుకున్నారు. నెల్లూరులోని హబీబుల్లా సాహెబ్ సహాయ సహకారాలతో 1919లో ఆయన పారశీక భాష నేర్చుకున్నారు.

### 13.1.8. రచనలు - ప్రత్యేకత :

రామిరెడ్డి పద్యం ఎంత సరళంగా రాస్తారో వచనమూ అంతే సరళంగా రాస్తారు. కవిత్వంలో వర్ణనలూ, శాస్త్ర విషయాలు రెండూ ఉంటాయి. భావ కవిత్వ యుగంలో అభ్యుదయ గీతాలను ఆలపించిన కవిగా రామిరెడ్డి కీర్తినందుకున్నారు. పానశాలలో చెప్పిన అనేక పద్యాలు ఆయన భావకవితా ధోరణికి, అభ్యుదయ కవిత్వ విధానానికి తాత్విక చింతన సరళికి నిదర్శనాలుగా కనుపిస్తాయి. ఇలా

"ఓయీ, ఉమ్రఖయాము, నీవు చని యెన్నో
 యేండ్లు పూండ్లాయె; లే
ప్రాయంపు జెలి సాఖియున్ ధరణి గర్భంబందు
 నిద్రించె; గు
ర్తే యోపట్టక నీ నిషాపురమున జీర్ణించెం గదా!
 నీదుగో
రీ మైనన్ పడలున్; రుబాయతొకటే స్మృత్యం
 కమై విల్చెడన్"

ఉమర్ ఖయ్యాం రుబాయతుకు రామిరెడ్డి నివాళి ఇది. రామిరెడ్డి 'పానశాల'లో వృత్తాలు ఎక్కువ. అక్కడక్కడా కొన్ని తేట గీతాలు రాశాడు. రామిరెడ్డి పద్యాలు ఏ భావాన్నైనా అలవోకగా వ్యక్తం చేస్తాయి.

"నీవూ నేనను తారతమ్య మహమందేగాని భూ
గర్భర
త్నావాసంబున లేదు; దుర్జనుడు పుణ్యాత్ముండు
భిక్షార్థియున్
శ్రీ, వాల్లభ్య'ధురంధరుండు నొకటే శ్రేణిన్
సుఖాశీనులై
యా విందున్ భుజియింతు రంత గనలేమా
మృత్తికా భేదముల్"

మనుష్యులలో భేదాలు ఇహంలోనే కాని మరణానంతరం భూమిలో ఏ భేదాలుండవు. రేపటికోసం నేటి సంతోషాన్ని విడనాడాలంటారాయన.

"జీవిత మంతా ఎన్నెన్నో శాస్త్రాలు చదివి వాటి సారం తెలుసుకున్న తర్వాత అప్పటికి గ్రహించిందేమిటి అని ప్రశ్న వేసుకుంటే ఏమీలేదనే అనిపిస్తుందంటారాయన. జీవితం మొత్తం విధి ఆడే చదరంగపు ఆటగా ఈ సృష్టిని ఇలా భావిస్తారు రామిరెడ్డి.

"ఇల చదరంగ, మందు జనులెల్లరు పావుల
హస్తులున్ నిశల్
దెలుపును నల్పు గళ్ళు; కదలించును రాజును
బంటు దక్కుపా
వుల విధి యాటకాడువలు పోకల ద్రిప్పును
గళ్ళు మార్చు, న
వ్వల నొకటొక్కటిం జదిపి వైచునగాధ
సమాధి పేటికన్".

పానశాల మొత్తం ఇలా ఒక మహోత్తర భావ విపంచిగా మనకు దర్శనమిస్తుంది.

రైతు జీవితంలోని అణువణువును శోధించి ఉదాత్త అన్నదాత విలువను సమాజానికి అందించే కావ్యంగా కృషీవలుడు కనిపిస్తుంది. కృషీవలుల జీవితాన్ని వస్తువుగా తీసుకుని రచించిన తెలుగు కావ్యాలలో కృషీవలుడు మొదటిది. ఇక్కడ కవి స్వయంగా రైతు. వస్తువు రైతు జీవితానికి సంబంధించినది. ఈ కావ్యంలో రైతుల జీవనంతోపాటు ప్రకృతి వర్ణనలను కూడా అద్భుతంగా ఇమిడ్చి అందంగా వర్ణించారు రామిరెడ్డి. వ్యవసాయ దారుల జీవితంలోని కష్టాలను ఒక వైపు వర్ణిస్తూనే మరోవైపు రైతులు వ్యవసాయం విడిచిపెట్టడం మంచిదికాదని కూడా ఉద్బోధించారు. కర్షకుడి ప్రపంచాన్ని ఆయన ఇలా వర్ణించారు.

"పల్లె యెల్లెయె సర్వ ప్రపంచ సీమ
ప్రియ యొకర్తయె రమణీయ విగ్రహంబు
బంగరుం బంట పొలములే భాగ్య నిధులు
అనుదిన పరిశ్రమయె మతమగును నీకు"

రైతు జీవితంలో ఒడుదుడుకులు సహజమని చీకటి వెంబడి వెలుగులాగా, కష్టాల వెంబడి సుఖాలూ వస్తూనే వుంటాయని ఆయన రైతన్నలకు కృషీవలుడి ద్వారా ధైర్యం చెబుతున్నట్లు కనుపిస్తుంది. పల్లె ప్రాంతాన్ని ఎంత సహజమైన రీతిలో వర్ణించాలో అంత సహజంగా ఆయన వర్ణించారు.

"స్వారి చేయు నిచ్చ భావంబు కలిగింప, బట్టెనెక్కి వచ్చు బాలుడొకడు, వాని క్రింద ద్రోయు వరకు బట్టెను బాది సంత సింతురితర సఖులు నగుచు". ఈ తరహా వాతావరణం ప్రతి పల్లెలోనూ కనిపిస్తుంటుంది. కృషీవలుడి కావ్యం ఆధునిక తెలుగు సాహిత్యంలో

ఒక నూతనత్వాన్ని ఆవిష్కరించింది. ఈ కావ్యంలో కృషీ వలుడికి కాపు పడతిని ఎంతో సుందరంగా వర్ణించి కావ్యంగా తీర్చిదిద్ది తెలుగు కవిత్వంలో గొప్ప కావ్యంగా నిలిపారు రామిరెడ్డి. ఇలా ఆయన రచన ఏది తీసుకున్నా ఒక ప్రత్యేక ముద్ర కనిపిస్తు అక్ష రక్షరాన తెలుగుదనం ఉట్టి పడుతూ ఉంటుంది.

**సమీక్ష :**

దువ్వూరి రామిరెడ్డి గారి జీవితంలోని విశేషాలు-కవిత్వతత్త్వం - విశిష్టత, రచనలు మున్నగు విషయాలు పరిశీలించబడ్డా

**ప్రశ్నలు :**

1) రామిరెడ్డి జీవితాన్ని ప్రభావితం చేసిన సంఘటనలు.
2) దువ్వూరి కవితా వ్యాసంగానికి స్ఫూర్తినిచ్చిన విశేషాలు
3) దువ్వూరి కృషీవలుడులోని విశేషాంశాలు
4) పానశాల ప్రత్యేకతను వివరించండి.
5) కవితా వ్యాసంగంకాక ఇతర వైజ్ఞానిక విశేషాలలో దువ్వూరికి ఆసక్తి ఎలా కలిగింది?

**ఆధార గ్రంథాలు :**

కవికోకిల గ్రంథావళి - శతజయంతి సంపుటాలు

కవికోకిల - కె.వి. రమణారెడ్డి

దువ్వూరి రామిరెడ్డి సాహిత్యం - దుర్గింపూడి చంద్రశేఖరరెడ్డి

దువ్వూరి రామిరెడ్డి రచనలు - ఒక పరిశీలన - డా. ముప్పాళ్ళ వెంకటశివ ప్రసాదరావు

డా॥ యల్లా ప్రగడ మల్లిఖార్జునరావు

పాఠం - 13.2

# రాయప్రోలు సుబ్బారావు

(13-3-1892 - 30-6-1984)

పాఠ్య నిర్మాణ క్రమం :

13.2.1 జీవిత విశేషాలు
2.2 రాయప్రోలు సుబ్బారావుగారి వాఙ్మయ జీవితము
2.3 శ్రీరాయప్రోలు సుబ్బారావుగారి కృతులు - సమీక్ష
- ఎ) లలిత
- బి) తృణకంకణం
- సి) స్నేహలత
- డి) కష్టకమల
- ఇ) స్వప్నకుమారము
- ఎఫ్) తెనుగుతోట
- జి) జడకుచ్చులు
- హెచ్) రమ్యాలోకము
- ఐ) వనమాల
- జె) ఆంధ్రావళి

లక్ష్యం:
రాయప్రోలు సుబ్బారావుగారి జీవిత విషయాలను, వాఙ్మయ కృషిని, వారి కవితా లక్షణాలను గూర్చి తెలుసుకుంటారు.

## 13.2.1 జీవిత విశేషాలు

ఆధునికాంధ్ర కవిత్వానికి క్రొత్త బాటలు వేసి యుగకర్తగా ఖ్యాతిగన్న కవి వతంసులు శ్రీ రాయప్రోలు సుబ్బారావు. ఆత్మాశ్రయ ధోరణిలో ఖండ కావ్య వరచలు చేసి నూతనమైన రీతిలో కవిత్వ సృష్టి చేసిన విఖ్యాతులు వీరు.

శ్రీ రాయప్రోలు సుబ్బారావు గుంటూరు జిల్లా బాపట్ల తాలూకా గార్లపాడు గ్రామంలో 1892 మార్చి 13 న జన్మించారు. ఈయన తండ్రి వెంకటష్వావధాని గారు. తల్లి అవ్వారి వారి ఆడపడుచు. సుబ్బారావు గారి మేనమామ అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి గారు సంస్కృతాంధ్రాలలో గొప్ప విద్వాంసుడు. మంచి కవి. ఈయన వద్దనే సుబ్బారావు గారు సంస్కృతాంధ్రాలు నేర్చుకొన్నారు. ఆయన ప్రోత్సాహంతోనే తెలుగులో కవిత్వం చెప్పటం నేర్చుకున్నారు. మేనమామ తర్వాత రాయప్రోలు వారికి సాహిత్య విషయంలో ప్రేరణ ఈయన పిన తల్లి రామడుగు నరసమ్మ గారు. 1908 ప్రాంతంలో సుబ్బారావు గారు రాజమహేంద్రవరం చేరుకొన్నారు. ఆయన అక్కడ ఉన్న రెండు మూడేళ్ల కాలంలో వ్యాస రచనకు, కావ్య రచనకు ఆయనకు మంచి ప్రోత్సాహం లభించింది. నన్నయను తెలుగులో ఆది కవిగా నిలబెట్టిన రాజమహేంద్ర వరమే ఆధునిక కాంధ్ర కవితకు ఆది కవిగా సుబ్బారావు గారిని నిలబెట్టడం విశేషం.

ఆంగ్ల సంస్కృతీ ప్రభావం వలన [illegible] శతాబ్ది ఆరంభం నుండి ఆంగ్ల కవితా రీతుల ప్రభావం ఆంధ్ర యువ కవులపై పడింది. తమ తమ మేధా శక్తుల ననుసరించి వీరు ఆయా నూతన రీతులను ఆకళింపు చేసుకొనినారు ఆంగ్లభాషలో ప్రాచుర్య పొందిన బేలడ్, స్టోరీ

పోయమ్, డిస్క్రిప్టివ్ పోయమ్, ఎలిజీ, పేస్టొరల్ పొయిట్రీ, ఓడ్, సానెట్, లిరిక్ వంటి కవితా రీతులకు ఆకర్షితులైనారు. కాల్పనిక జగత్తులోని సౌందర్యాన్ని చిత్రించిన వర్డ్స్‌వర్త్, కొలరిడ్జ్, కీట్స్, షెల్లీ, బైరన్ వంటి కవుల రచనలు ఆంధ్ర యువ కవులకు మార్గదర్శకాలైనాయి. ప్రకృతి కవిత్వం, ప్రణయ కవిత్వం, భక్త కవిత్వ,దేశ భక్తి కవిత్వం, స్మృతా కవిత్వం వంటి కవితారీతులు ఆధునికాంధ్ర సరస్వతికి ఆభరణాలయ్యాయి.

ఆధునికాంధ్ర కవితకు తొలి కావ్యమైన 'లలిత'ను రాయప్రోలు సుబ్బారావు గారు 1909 లో ప్రచురించారు. ఆంగ్లభాషలో గోల్డ్ స్మిత్ రచించిన 'హెర్మిట్' అనెడి ఖండ కృతికి ఇది క్లుప్తమైన అనువాదం. తాను భద్రాచలం వెళ్లినప్పుడు పొందిన అడవి అనుభూతిని నాయిక లలిత అడవిలో సంచరిస్తూ పొందిన అనుభవానికి అన్వయించినట్లు ఈయన చెప్పుకొన్నారు. తెలుగు తోటలో నవ్య సాహిత్య ఋతు లక్షణ లక్షితంగా పూచిన తొలి కావ్య సుమం 'తృణ కంకణం' 1912 లో వెలువడింది.

రాయప్రోలు సుబ్బారావు గారు 1910 నాటికి తెలంగాణా వచ్చారు. కాలేజీలో చదువు కొనసాగించటానికి తగిన ఆర్థిక స్తోమత లేక పోవటం వల్ల స్కాలర్ షిప్ ఏదైనా ఇస్తే వచ్చి చదువు కొంటానని హైదరాబాద్‌లోని నిజాం కాలేజీలో ఇంటర్ చదివారు. తర్వాత హైదరాబాద్ నుండి మద్రాస్‌కు వెళ్లి అక్కడ కొమర్రాజు లక్ష్మణరావు గారి ప్రాపకంలో 'విజ్ఞాన సర్వస్వ' పు సంపాదక మండలిలో ఒకరుగా చేరి చక్కని కృషి చేశారు. సుబ్బారావు గారు మద్రాసులో ఉన్న కాలంలో రవీంద్రనాధ్ ఠాగూర్ రచించిన 'గీతాంజలి' కావ్యం ప్రచురింపబడింది. దానిని చదివిన తర్వాత సుబ్బారావు గారికి రవీంద్రనాధ్ సన్నిధిలో చేరి ఆయన ముఖతః కవితార రహస్యాలను గ్రహించాలన్న ఉద్వేగం ఎక్కువైంది. రవీంద్రనాధ్ ఠాగూరు పిలుపు నందుకొని 1915 లో 'శాంతి నికేతన్'లో జేరారు. విశ్వకవి రవీంద్ర నాధ్ ఠాగూరుకు ప్రియమైన శిష్యుడయ్యే అదృష్టం కలిగింది. ఇదే సమయంలో మరొక ఆంధ్రుడు, సుప్రసిద్ధ వైణికుడు సంగమేశ్వర శాస్త్రి తన వీణా వాదన నైపుణ్యంతో రవీంద్రుని ఆనందింప జేసేవారు. తమ నివాసం 'ఉత్తరాయణం' చుట్టూ ఉన్న తియ్య మామిడి తేపులో సుబ్బారావు గారు, సంగమేశ్వర శాస్త్రి గారు వసంత కాలంలో కోకిలలలాగా పద్యాల్ని చదివి, వీణ వాయించి రవీంద్రనాధ్ ఠాగూరు యొక్క మనస్సుని రంజింప జేసేవారు. గురు దేవుని వంగ గీతాలను రాయప్రోలు వారు ఆంధ్రీకరించి తన స్వంత పద్యాలతో బాటు వినిపించి, విశదీకరించి ఆయన యొక్క మన్ననలను పొందేవారు. శాంతి నికేతన్‌లో సాహిత్య విద్యా రహస్యాలను గ్రహించి, ప్రతి భావ్యుత్పత్తులతో సముజ్వలంగా ప్రకాశించే కాశీ విద్వాంసుల విద్వద్గోష్ఠులలో పాల్గొని రాయప్రోలు వారు తమ ప్రతిభకు మెరుగులు దిద్దుకొన్నారు. శాంతి నికేతనం నుండి తిరిగి వచ్చిన తర్వాత సుబ్బారావు గారు కరీంనగర్ జిల్లా మంథెన గ్రామంలో కొంత కాలం చిన్న స్కూలుకు హెడ్ మాస్టర్‌గా పని చేశారు.

రవీంద్రనాధ్ ఠాగూర్ ఒకసారి మద్రాసుకు వచ్చారు. మెరీనా బీచ్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో ప్రసంగిస్తూ "ఆంధ్రులకు ఒక అధునాతన మహా కవి ఉన్నాడు. ఆయనే యువకుడైన రాయప్రోలు సుబ్బారావు" అని అన్నారు. సభాసదు లందరూ కరతాళ ధ్వనులు చేశారు. ఈ పొగడ్త సుబ్బారావు గారికి ఎంతగానో ఉపయోగపడింది. ఆ సమయంలో హైదరాబాద్‌లో ఉస్మానియా విశ్వ విద్యాలయం నెలకొల్పబడింది. ఉస్మానియాలో ఉద్యోగానికి దుగ్గిరాల గోపాల కృష్ణయ్య గారు రాయప్రోలు సుబ్బారావు గారి చేత అప్లికేషను వ్రాయించి పడేశారు. 1921 లో ఇంటర్వ్యూకి పిలుపు వచ్చింది. ఆ ఇంటర్వ్యూ బోర్డుకి చైర్మన్ నిజామత్ జంగ్. ఆయన ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయం నుండి ఎమ్మే పట్టా పొందినవాడు. సాహిత్యానికి సంబంధించి కొన్ని ప్రశ్నలు వేశాడు. శాంతి నికేతనం నుండి తిరిగి వచ్చిన రోజులు కావడంతో ఈయన ధైర్యంగా సమాధానాలను చెప్పారు. ఈ ప్రశ్నలు సమాధానాలు అయిన తర్వాత ఆయన 'మీరు ఆంధ్ర దేశం నుండి చాలా దూరం పోయి శాంతి నికేతనంలో చదువుకొన్నారు. ఉద్యోగానికి గూడా చాలా దూరం వస్తున్నారే' అన్నారు. అప్పుడు రాయప్రోలు వారు తాను దూరంగా ఉన్న శాంతి నికేతనంలో చదువుకున్న మాట నిజమే కాని ఉద్యోగానికి దూరంగా ఉన్న ప్రాంతానికి రాలేదని తాను తెలంగాణ్యుప బ్రాహ్మణ్ణి అని తమ పూర్వులు ఇక్కడి నుండే ఆంధ్ర ప్రాంతం వెళ్లిరని చెప్పారు. వాళ్లెందుకు వెళ్లారు? అన్నాడాయన. మా వాళ్లంతా వైదికులు. గోవధకు వ్యతిరేకంగా ఉండి సహిప లేక వెళ్లారని చెప్పారు. ఆయన అలాగా అని నవ్వి ఉద్యోగం ఇచ్చారు.

రాయప్రోలు సుబ్బారావు గారు వేదం వెంకట శాస్త్రి, చెళ్ల పిళ్ల వెంకటశాస్త్రి వంటి సంప్రదాయ పండిత ప్రకాండులు, తల్లా వఝ్ఝల శివశంకర శాస్త్రి వంటి నవ్య కవితా రీతికి చెందిన వారి అభిమానానికే కాక సర్వేపల్లి రాధాకృష్ణన వంటి అంతర్జాతీయ సాహితీ పరుల అభిమానానికి గూడ పాత్రులయ్యారు. అధునాతన విమర్శ ఆకచార్యుడు, పండిత ప్రవరుడైన డాక్టర్ కట్టమంచి రామలింగా రెడ్డి గారి మెప్పును పొందినారు. నెల్లూరులో జరిగిన ఒక సభలో కట్టమంచి వారిని గూర్చి ఈ పద్యాన్ని చెప్పారు.

"స్వచ్ఛంద బలవ దుజ్జ్వల వీర్యవంతమై
యెందుగునాంగ్లేయ సాహిత్య పటిమ
రసిక సంవరణ లాలసరీతి కరగి పోమెడి
మధురాంధ్ర సాహిత్య కాంతి
చందన ద్రుమ సువాసన గుబాళింపు వరకు
పోత్కి దెరలు దుర్దాంత రచన
అలసులు రాకుండ వనల తేని యదీసిత్రావి
త్రావించు దార్శకుని నడువు
మేళనంబాయె నీయందు ..............................
.........................................................................
......... త్రోవలరయు నవకుమారులకు
తోడు గావలయు నీవు రామలింగా వతంస" అన్న పద్యం
కట్టమంచి వారిని పులకింప జేసింది.

రాయప్రోలు సుబ్బారావు గారి సాహిత్య ప్రస్థానం:

సంప్రదాయ కుంటుంబంలో జన్మించి సంస్కృత కావ్యాలను, ఛందస్సు అలంకార రీతులను అవగతం చేసుకొన్న రాయప్రోలు వారు తొలుత అవధాన కవిత్వంపై మమకారం చూపారు. ఆశు కవితలో వేగం తప్ప రస బావాదులకు అవకాశం ఉండదని గ్రహించి ఆ మార్గాన్ని తొలగించుకోవటానికి ప్రయత్నం చేస్తూ ఈ పద్యాన్ని వ్రాశారు.

'తెనుగే తీయని దందు పద్యపదగీతి క్రీడల తమో
హనముల్ శోభనముల్ తదీమ రసర క్తాలాపనంబుల్ లభిం
చిన వాగర్థ కలా కలాప జయలక్ష్మిన్ గాలికిం బుత్తునే
జననీ, యేమిటి కింక ఆశు కవితా సన్యాసమింప్పించవే?
'రసమో భావమో జీవ దర్ధ సుకుమార వ్యంజనా మంజు శ
బ్ద సమాసా రచనంబొ, సాధు హృదయ స్పంద ప్రతిష్ఠా కథా
విసరంబో, సకలార్ధ శూన్య మగు నీవే గాలి వేగోక్తి దు
ర్వ్యసనం బేటి త్రిప్పుమింక జననీ, రమ్యాక్షర శ్లోణికిన్"

ప్రాచీనాంధ్ర కవితా మార్గం నుండి మరలి అభినవాంధ్ర కవితావతరణానికి రాయప్రోలు సుబ్బారావు గారు మార్గ దర్శకత్వం వహించారు.

1918 సెప్టెంబరు 4 న ఉస్మానాయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో అధ్యాపకుడుగ ప్రవేశించిన రాయప్రోలు సుబ్బారావు గారు 1936 లో రీడర్ గాను ఆ తర్వాత ప్రొఫెసర్ గాను పదోన్నతిని పొందారు. 1947 అక్టోబరు 29 న వరంగల్లులోని ఆర్ట్స్ అండ్ సైన్సు కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఒక సంవత్సరం పని చేశారు. 1950 లో పదవీ విమరణ చేశారు. తర్వాత తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు విభాగంలో మెట్ట మెదటి ప్రొఫెసర్‌గా 1956 లో చేరి ఆ విభాగానికి రూపు రేఖలు దిద్దారు. 1940 ప్రాంతంలో ఆంధ్ర సారస్వత పరిషత్తును నులకొల్పి కురుగంటి సీతారామయ్య, కాసంబాన్ మొదలైన వారిని కలుపుకొని హైదరాబాద్‌లో తెలుగు బాషా సాహిత్యాల ప్రాచరానికి ప్రచురణకు కృషి చేశారు.

### 13.2.2 రాయప్రోలు సుబ్బారావు గారి వాఙ్మయ జీవితము:

రాయప్రోలు సుబ్బారావు గారి జీవితంము వలెనే వాఙ్మయము గూడా అతి విశాలమైనది. ఈయన అసంఖ్యాకంగా స్వంతత్ర కావ్యాలు, అనువాదలు, నాటకాలు, ఖండాకవ్య సంపుటాల, వచన రచనలు, వ్యాసాలు, పీఠికలు వెలయించారు. నవ్య కవిత్వ నేపధ్యంతో 1909 లో అనువాద రచన 'లలిత' తో రాయప్రోలు వారి వాఙ్మయ జీవితా ఆరంభమైంది. తృణకంకణము (1912), కన్నె పాటలు, మాధురీ దర్శనం (1949) వనమాల (1947), జడకుచ్చులు, రమ్యా లోకము, ఆంధ్రావళి (1952), మిశ్ర మంజరి (1963), దూత మత్తేభము (1957), మధు కలశము (1924), కృష్ణలీలా దర్శనము (1973), సుందరకాండ (1973), స్వప్న కుమారము, ఉత్తర రాయమ చరిత (1958 నాడికము), వకుంతల (1964 నాటకము), రవీంద్ర వ్యాసావళి (వచన రచన), స్వామి వివేకానంద (వచన రచన) వంటి ఎన్నో రచనలను చేశారు.

రాయప్రోలు సుబ్బారావు గారు పద్యబంధములే కాక, పాటలు కూడ రచించారు. 'కోకిల స్వామి' గా ఈయనను ఆచార్యజి. వి. సుబ్రహ్మణ్యం గారు కీర్తించారు. పదవే చెలి, కాళ్ల గజ్జియల్, రవళింపగ వెదుళ్ల పల్లికిన్ తొలి ప్రొద్దుల చల్ది యన్నమున్, తివి త్రిమ్మర వచ్చు స్వేచ్ఛగా మధు మాసపు కన్నె యెండలో, ఎల కొబ్బరి తోట నీడలన్ పసుపాడిన నిమ్మచెంగడన్, వయ సారిన మామిడి పొత్తునన్ ఎలకోయిల యీల నేర్వగా, పసి తెమ్మెర సేద తీర్వగా

చేయిచేయి బిగించి యింపుగా, విహరింతము తోడు తోడుగా
మన రూపము వ్రాయగా సొనల్, మనవే సముదాచగా పొదల్
మనసో పని పచ్చిముచ్చటల్, తనివోవగ చెప్పి కొందమో !"

ప్రకృతి వర్ణన, ప్రణయ భావన కలగలిసిన చక్కని భావ గీతమిది. రవీంద్రనాధ ఠాగూరు మరణానికి ఖేదంతో పల్కిన ఈ పద్యం రాయప్రోలు వారికి గురుదేవులతోను శాంతి నికేతనంతోను ఉన్న అనుబంధానికి ప్రతీక.

ఆరిపోయినది దివ్య స్నేహ శృంగార
దీపంబు నివ్వాళి తీసినట్లు
పండిరాలినది పక్వ ప్రసాద ఫలంబ
మొలక మోజున క్రమ్మరిలిన యట్ల
నిష్క్ర మించినది నాందీ ముఖాజ్జ్వలతార
చిత్రాంక మవనిక చిలిగినట్లు
తెగి జాటినది జగత్ప్రియ రాగమాలిక
గాంధర్వ జీవాళి కదలినట్లు
సొలినది శ్రీ రవీందుని సుస్వరంబు
వ్రాలినది సుకవీంద్రుని రమ్య రచన
మ్లానమయ్యెను పాసనా మందిరంబు
భిన్న మయ్యెను శాంతినికేతనంబు
నిదురించున్ శ్రుతులాసి కిన్నెరలు, వన్నెల్ చిత్ర పాంౘబులన్
చెదరుల్ చిన్నెలు మాటి కావ్యకల కంఠీ కంఠరాగంబు గ
ఇది కాలాపము నంది కుందును రవీంద్రా ! సర్వ సౌభాగ్యసం
విధమానంబగు తావకీవ చరితాశ్వా సాంత సంధ్యాగతిన్"

రవీంద్రుని ప్రజ్ఞా విశేషమును ఆయన ఎడల రాయప్రోలు సుబ్బారావు గారికి గౌరవాభిమానములు ఈ పద్యములందు పాఠకులకు సుస్పష్టమగును. అటు కవిగా ఇటు చక్కని గాయకుడుగా విఖ్యాతి నందిన విశ్వకవి రవీంద్రుని అస్తమయము రాయప్రోలు వారి భావనలో విషాద భరితమైన అక్షరాకృతి నిదాల్చినది.

### 13.2.3 శ్రీ రాయప్రోలు సుబ్బారావు కృతుల సమీక్ష:-

**ఎ) లలిత :** గోల్డ్ స్మిత్ ఆంగ్ల భాషలో రచించిన 'హెర్మిట్' కావ్యానికి ఇది అనువాద రచన.

'ఓ సుగుణాల వాల ! కుసుమోదయ చారువయో రసాల' అని మొదలపెట్టి 'ప్రణయవ్రత దీక్షతుదకు ఫలియింపగన్' అనెడి పాదంతో ఈ కావ్యం ముగుస్తుంది. ఇందులో మొత్తం 156 పద్యాలున్నాయి. ఈ కావ్యానికి చెళ్లపిళ్ల వెంకట శాస్త్రి గారు తెలుగులోను, రమాకాంతా చార్యులు ఇంగ్లీషులోను ఉపోద్ఘాతాలు వ్రాశారు రాయప్రోలువారు 'తొలి తొడిమ' అనే పేరుతో పీఠ కను వ్రాశారు. తొలి ముద్రణలో 136 పద్యాలు వ్రాసి తర్వాత నాయిక లలిత తన సఖునికై అన్వేషిస్తూ అడవిలో తిరుగుతున్న సందర్భంలో వన సౌందర్యాన్ని వర్ణిస్తూ రాయప్రోలు వారు కావ్యాన్ని పెంచారు. ఈ వర్ణకు ప్రేరణగా తాను భద్రాచలం వెళ్లినప్పుడు మార్గంలోని అడవిలో తాను పొందిన అనుభూతియే కారణంగా ఆయన చెప్పుకున్నారు. రాయప్రోలు వారు రచించిన ఈ కావ్యంలో భావ కవితా పరిణామం యొక్క సూచనలు స్పష్టంగా కనబడతాయి. రచనా శైలి మాత్రము శబ్దాలంకారములతో నుండి ప్రాచీన ప్రబంధము శైలని తలపింపజేయును. నాయికా నాయకుల విరహంతో ఈ ఇతి వృత్తం ఆరంభమౌతుంది. వియోగ శృంగారమే దీనిలో అంత స్సూత్రం. యువతీ యువకులు సంసారంలోని అనురాగ మాధుర్యాన్ని ఆస్వాదించాలేగాని వైరాగ్యంతో సన్యాసం పుచ్చుకొని అడవుల బడిపోరాదని నాయక అనుటలో భార్యభర్తలలో పరస్పర ప్రేమను రాగాలతో గూడిన జీవితమే శ్రేష్ఠమైనదని ప్రకటింపబడింది. దంపతీ నిష్ఠమైన ప్రణం ద్వారా ఒక పరమార్థాన్ని ఆశించినప్పుడు అది పవిత్రమే అని రాయప్రోలు వారి కావ్య సందేశం. 'లలిత' యువకవులలో ఆసక్తిని పెంచినది. ప్రాచీన సాహిత్య పరాయణులు 'లలిత' స్వేచ్ఛ ప్రవృత్తికి బాధపడినారు. నవ్య కావ్య పఠనము తొలి నాడులలో అనేకులలో విముఖత కల్గించినను క్రమక్రమముగా నవ్య కవితా రీతికి ఆకర్షితులై నవ్య కావ్య పఠనము నందు ఆసక్తిని, అభిని వేశమును పెంచుకొనినారు.

**బి) తృణ కంకణం :** రాయప్రోలు సుబ్బారావు గారు 'తృణ కంకణము' అనెడి ఖండ కావ్యాన్ని 1913 వ సంవత్సరంలో రచించి ప్రకటించారు. ఆధునిక కవిత్వానికి తృణకంకణము ఆది గ్రంధముగా పేర్కొనదగినది. ఆంగ్లభాషలో భావకవులుగా ప్రఖ్యాతి వహించిన వర్డ్స్ వర్త్, కాల్‌రాడ్జ్, షెల్లీ, కీట్సు వంటి కవుల కవితా రసమును శ్రీ రాయప్రోలు వారు ఆస్వాదించినారు కేవలము వారి ప్రభావముతో ఈ 'తృణకంకణ' కావ్యము రచింపబడలేదు కాళిదాసు కవీంద్రుని నాటక త్రయ ప్రభావము ఈ రచనపై యున్నది తన పిన తల్లి మీద రాయప్రోలు వారికి గల ప్రీతి చాలా ఎక్కువ. ఆమె వాక్యా మృతాన్ని అస్వాదిస్తూ కొన్ని సందర్భాలలో ఆమె పలుకులే సుబ్బరావు గారు పద్య రూపంలో ఈ కావ్యంలో చొప్పించారు. ఆమె అనేక విషయాల్లు అవగాహన చేసుకొన్న విశాల హృదయ. లోక యాత్రలో క్లిష్ట గ్రంధులు విప్పివేయ గల వివేకవతి. ఆమె ప్రభావం రాయప్రోలు వారిపై ఉండడటం వలననే ఈ కావ్యంలో అనురాగ సమస్య అమలినంగా పరిష్కరింపబడింది. స్త్రీల పట్ల ఆర్ద్ర కోమల దృక్పధం భావ కవులకు ప్రధానమైన లక్షణమైంది. పూర్వ కవుల వలె సంభోగ శృంగారము కాక, సంభోగ రహితమైన విప్రలంభ శృంగారము వీరికి ఆదర్శమైంది.

'తృణకంకణము' కావ్యము 'అడుగులు బొబ్బలెత్తా' అని మొదలై మైత్రీ సూత్ర బంధములు తెగవవురా అను వాక్యముతో ముగించు 110 పద్యాలు 448 పంక్తులు కలిగి వుంది. అమలిన శృంగార సిద్ధాంతమునకు లక్ష్యభూతముగా శ్రీ రాయప్రోలు వారు ఈ 'తృణకంకణము' అను 40 డ కావ్యాముసు రచించినారు. భావ కవులు మానసిక శృంగారానికే గాని శారీరక శృంగారానికి ప్రాముఖ్య మివ్వలేదు. వివాహ బంధం వేరు. ప్రేమ బంధం శాశ్వతం అని వీరు భావించారు.

"పరమ ధర్మమైన దాంపత్య భక్తి స్తన్య మోహనమైన వాత్సల్యసక్తి
సాక్షి మాత్ర సుందరమైన సఖ్యరక్త అందునాదిమ మగు ప్రేమ యందె ముక్తి'

ప్లేటో తత్వం ప్రాకరం ప్రేమ రెండు రకాలు. 1. స్త్రీ పురుష ప్రేమ 2. ఇద్దరు పురుషులు లేక ఇద్దరు స్త్రీల మధ్య ప్రేమ. స్త్రీ పురుషుల మధ్య గల ప్రేమను గూర్చి చెప్పుచు ఇది సంతానము కొరకే అని నాడు. రెండవదే గొప్ప ప్రేమ అని నాడు. అందుకే స్నేహ సంబంధమైన ప్రేమను 'ప్లెటొనిక్‌తా' అనుట జరిగింది. లైంగిక సంబంధమైన చేంబనము స్నేహ సంబంధమే అని పాశ్చాత్యుల భావన.

" Platome love is a term applied to an affectianate relation between a man and woman in to whien the sexual element goes not enter" - Eneyclopedea Britamiea.

కాబట్టి లైంగిక వాంఛా సంబంధము లేని స్త్రీ పురుషుల మధ్య ప్రేమల మధ్య 'Platome love'

'తృణకంకణము' కావ్యంలో కసరత్తులు లేవు. పదాడంబరం లేదు. కథకి, భావానికి తగినట్టుగా వృత్తాలు, కందాలు, తేట గీతులు, ఆట వెలదులు ఖండవల్లి లక్ష్మీ రంజనం గారు.

తృణకంకణము కథా వస్తు వించు మించుగా లేదనియే చెప్పవచ్చును. ఇందున్న పాత్రలు ప్రేయసీ ప్రియులు. చిన్న తనం నుండి కలిసి మెలసి తిరిగిన వారు. వారి ప్రేమ ఫలించలేదు. కారణము విధి విలాసమే. నాయికకి మరొకరితో వివాహమైంది. యువకుడు దుఃఖంలో వినియోగంతో సృష్టిని క్రూరంగా విమర్శిస్తాడు. ఒక నాడు ఊరి బయట తోటలో వారి రువురును ఒకరికొకరి తారసపడతారు. విరహవ్యథా పీడుతుడైన అతని మాటలను ఆమె వింటుంది. ఇద్దరును ఒకరినొకరుచూచు కొనుచు చేయి చేయి కలుపుకొని కొంతసేపు చిత్తరువులుగా నిలిచి యుంటారు. తరువాత అతడు ఆమె పలకరింపగా ఆమె గద్గద కంఠముతో సమాధానమిస్తుంది. అతని మాటలలో విరక్తి ఆమెకు స్పష్టమైనది. అతడు తాను వివాహము చేసికొనకుండగనే జీవితమును గడుపుదునని పల్కినాడు. అప్పుడామె ప్రణయ తత్వాన్ని ఉపదేసిస్తుంది. శారీరక సంబంధమే ప్రణయం కాదని, అంతరంగంలోని భావ స్థిరత్వమే ఆదర్శ ప్రణయమనీ అలౌకికమై అనుబంధం ముఖ్యమనీ యువకుడికి సున్నితంగా హితువు చెప్తుంది. ఆమె చేతికి కట్టబడిన పట్టు తోరమును తీసివైచి ఆ స్థానమున తృణకంకణమును కట్టును. తరువాత వారు వారి వారి ప్రదేశములకు పోవుదురు

"అడుగులు బొబ్బలెత్త వదనాంచల మందున చిమ్ము చెమ్మటల్
మడుగులు గట్ట, మండుక సుమాలపు చెండ పడంతి యొర్తు జా
తెడు బిలుగుం బయట సవరించుచు చొక్కిన యొప్పు తోడ కా
ల్నడ కనబోవు చుండెనెడలన్ గనుపట్టెడు తోటలోనికిన్"

ఇది 'తృణ కంకణము' కావ్య మందలి మొదటి పద్యము. నాయిక ఒక యువతి. పదియు నాల్గవ సంతముల్ వదలనట్టి వయసు సొగసుందనం బామె మెయినెసంగ' పదునాల్గు సంవత్సరాలు ఆమె వయస్సు. అప్పటికే ఆమెకు ఒక స్నేహితుడు, వారిద్దరి మధ్య పరస్పరాకర్షణ. ఆమెకు వేరొకరితో వివాహం జరిగింది. తర్వాత తన స్నేహితుని కోసం 'అడుగులు బొబ్బలెత్త' నడచి తోటలోకి వచ్చింది. ఆమెది లౌకిక సాధారణమైన ప్రేమ కాదు.

'నడచి బడలిన యాయాస మెడల లేదు
చీర చెఱగుల తడియైన వాట లేదు
లేడి నరసిన యపుడె ముద్దాడి కొనియె
నహహ ! యెంతటి ప్రేమార్ద్ర మామె మనసు'
అని ఆమె మనస్సు ఎంతటి ప్రేమార్ద్రమైనదిమో తెలిపాడు కవి.
ఆమె చేతికి పచ్చని పట్టు తోరమున్నది.

ఈమె మణికట్టుకున్న పచ్చని తోరము తర్వాత తృణకంకణానికి స్థాన మిచ్చింది. చేతికి తోరము కట్టు కొనుట ఒక ఆచారము. ఒక నియమ బద్ధమైన ప్రవర్తనకు పత్రీక. దానినే కవి చక్కని పద్యాలలో ఇమిడ్చినాడు.

తన స్నేహితురాలు వివాహిత కావటం వల్ల తనకు ఆమెతో వియోగం కలిగింది.

నా ప్రియ సఖి అనురూప గు<br>
ణ ప్రచుర ! ప్రసన్న శీల ! నవనీత శిరీ<br>
ష ప్రణయమృదుల హృదయ ! క<br>
టా ! ప్రాణము లండ యెటూ విడంబడి సయితున్ ?

ఆమె ఎంతగానో తన మనస్సులో చోటు చేసుకున్నది. ఇప్పుడు వేరొకరి సొత్తయింది ఆమె వియోగం సంభవించినా తన శరీరంలో ప్రాణం అలానే ఉంది. ఇది వేదన.

భావ భాసురమగు హృదంబరము నందు<br>
రక్తి లిఖియించు కొంటినే రమణిరూపు,<br>
అదియే ముద మీక యలత కాస్పద మయ్యె,<br>
గ్రహణ గత మైన చంద్రుని కళ విధాన'

ఆమె రూపం తన హృదయంలో ముద్రితమైంది. కాని గ్రహణం పట్టిన చంద్రుని రూపం వలె ఇప్పటి పరిస్థితి మారిందని వగచాడు.

తేట వలపులు మొలక లెత్తి నది మొదలు<br>
నిలిపితి పవిత్రరాగ మా లలన యెడల'

తన మనస్సులో ప్రేమ భావన కలిగిన తొలి సమయంలోనే ఆమెపై ప్రేమ ముద్రితమైంది.

ఇప్పుడామె తనది కాదు

విధివశాన తనకు ఆమె శాశ్వతంగా దూరమైంద తాను ప్రణయ కృపణుడైనాడు. తనకు ఈ లోకంలో అంతాశూన్యంగా కనబడుతోంది. ప్రశాంతిని ఎ క్కడ వెతకాలో అర్థం కాని స్థితి తనది.

కావ్యంలోని నాయికా నాయకులు ఇద్దరూ స్నేహితులు. ఒకరి చేతిలో మరొకరి చెయ్యి సంతోషం ఒక ప్రక్క వేదన మరొ ప్రక్క చిత్రమైన భావ సన్నివేశం వారిది. ఎవరో ఒకరు మాట్లాడాలి. మౌనాన్ని భంగం చేయాలి. అతడే సాహసించాడు

"కుశలమే నెచ్చెలీ ? అనుకూల పవన<br>
మోహనమ్ములే యీదినమ్ములు ? మనః ప్రి<br>
యమె సమస్తం ? " బటంచు, అంటూ

ఆమెను కుశల మడిగాడు. గుండె నుండి బయలు దేరిన మాటలో గొంతుకలో కొట్టుకొని గాద్గదికంగా బయటకు వచ్చినై. అతనికి బదులు చెప్పాలి. ఆతడు తన ప్రియుడు.

సోగ కన్నులు విప్పార జూచి ప్రియుని<br>
పలుకుల హృదంత రార్ద్రమేర్పడగ ననియె<br>
అస్ఖలితమగు ప్రేమ రహస్య సూత్ర<br>
విశద బుద్ధిన్ హృదయ వాద కుశల యగుచు'

తన గుండె నిండా అతనిపై ప్రేమ. ఆ ప్రేమ కేవలము మనస్సుకు సంబంధించినది. శారిరక సంయోగాన్ని కోరని ప్రేమ. తన మనోభావన తన స్నేహితునిలో లోపించిందేమో ఆమెకు శంక కలిగింది.

అందుకే కొంత మందలింపు ధోరణితో మాట్లాడింది.

ప్రేమకు, ఆప్యాయతకు గుర్తు ఒక కంచంలో ప్రేయసీ ప్రియులు భుజించటం 'మధుద్విరేఫః కుసుమైక పాత్రే పపే నిమేషాలస పక్ష్మ పంక్త్యా' అని కాళిదాస మహా కవి ఒక పుష్పంలో ఉన్న తేనెను కళ్లు తేలి పోతుండగా తన్మయత్వంతో తాగే తుమ్మెదల అనురాగాన్ని వర్ణించాడు. అంతటి అనురాగం నిండిన జంట విడిపోవటం విధి విలాసం.

సరస సాంగత్య సుఖ వికాసముల కన్న
దుస్సహ వియోగ భరమె మధురము సకియ
బాధ లేక వ్యవసరుచి బోధపడదు
చీకటులు లేక దీపక చెలగునట్లు

వియోగము లేకుండా ఉంటే సంయోగంలో అనుభూతి కొరవడుతుంది. చీకటి ఉన్నప్పుడే దీపపు కాంతి ప్రకాశవంతంగా ఉంటుంది. స్త్రీ పురుషుల మధ్య నురాగం కలగడం సహజమని పలికాడు. ఈ మాటలు అమలిన శృంగారాన్ని చాటుతాయి.

తగునోయీ మిత్రుడ ! నె
వ్వగలన్ దురపిల్ల, ప్రేమబంధములకటా
తెగవోయీ తెగ ద్రెంపిక
మిగుల గనిత్తురె మనంబు మిథ్యా భ్రమలన్

నిజమైన ప్రేమ బంధాలు అంత తేలికగా తెగిపోవు. నా యికకు మృదు స్నేహ సౌరభం కావాలి కాని వలపు గంధం కాదు. మనోవాక్కాయ కర్మలచే కలుషిత మయ్యేది 'వలపు' అనీ 'తపస్సు' చేతా, 'తాల్మి' చేతా, 'ధాన్యధార' చేత లీనమై ఐక్య మందజాలేది 'ప్రేమ' అనీ ఆమె భావం.

మనసుచే వాక్కుచేత గర్మంబుచేత
కలుషితములు కాదగిన వీవలపులవని
తపసుచే, తాల్మిచే, ధాన్యధార చేత
లీనమై మైక్య మీయజాలినది ప్రేమ'
అందుకే ఆమె అంటుంది.

కనుల నొండొరులను చూచుకొనుట కన్న
మనసులన్యోన్య రంజనల్ గొనుట కన్న
కొసరి 'యేమోయి' యని పిల్చుకొనుట కన్న
చెలుల కిలమీద నేమి కావలయు సఖుడ !

దీనిని బట్టి శృంగారా వస్థల్లో 'చక్షుః ప్రీతి మనస్సంగమం' వరకు సాగిన పరిచయమే స్త్రీ పురుషుల్లో స్నేహి పాత్రము, యోగ్యము అవుతుందని రాయప్రోలు వారు అభిప్రాయ పడినట్లు స్పష్టమవుతుంది. 'స్త్రీని భోగ్య వస్తువుగా చేసికొన్న ప్రాచీన వ్యవస్థను కట్లు తెంచుకొని పోవు యువతీ యువకుల నవీన ప్రేమావస్థను అదుపులో పెట్టుటకే అమలిన శృంగార సిద్ధాంతము స్థాపించిరి' అని డాక్టర్ సి. నారాయణరెడ్డి గారు అన్నారు.

'భావ బంధంబుగా మణిబంధమందు
తొలుతగట్టితి వీపట్టు తోరమీపు
విప్పెదవె యిప్పుడునుచు చూపించి కనుల
వ శ్రువులు నిండ పలుకలేదయ్యె నామె'

పూర్వమొకనాడు తమ ప్రణయ బంధానికి గుర్తుగా ఆతఢామె ముంజేతికి పట్టు తోరం కట్టాడు. ఇప్పుడా తోరాన్ని విప్పాడు.

నాయకుడు 'భావ బంధం' గా నాయిక మణి బంధాన వున్న పట్టు తోరాన్ని విప్పి 'ప్రేమ మధుర లాంఛన'మైన తృణ కంకణాన్ని ఆమె చేతికి తొడిగాడు.

నవకమెడవోని తృణ కంకణమును కేల
నందుకొని యామెపయి నయనాంచలములు
మరలిచి, సకియ ! మన ప్రేమ మధుర లాంఛ
నం బిదియె సుమ్మి ! యనుచు హస్తంబు దొడిగి. అంతే కాదు
'ఈ తృణకంకణంబు భరియింపుము నీమణి బంధమందు సం
ప్రీతిని అప్పుడపుడు వలపింపుల నెయ్యము జ్ఞప్తిగొన్న ప్ర
భాతికవేళ నీప్రణయ బాష్పజలాంజలి నింతయిచ్చి, యే
రీతిని వాడకుండ నలరింపు, మిదే తుదివాంఛ సోదరీ !

నాయకుడు ఆమెను 'సోదరీ' అని పిలిచాడు. 'కలనైన కలుషము గాని స్నేహ మృదు మధుర సానుభూతి'కి చిహ్నంగా నాయిక వలపు టుంగరాన్ని తన ప్రియ సఖుని హస్తానికి అలంకరించింది. అమలిన శృంగార భావనకు ప్రతీకలైన ఆ జంటపై అమృతాక్షతల వంటి పూలు రాలాయి.

ఈ కావ్యా రంభంలో నాయకుడు మోహావేశుడు. చివరిలో ఆతడు నాయిక నుండి నిరంతరం స్నేహాన్ని వాంఛించే ఒక మామూలు చెలికాడు మాత్రమే.

వలపు నశియించియును ప్రేమ నిలువ గలద
యేని, కలనైన కలుషముగాని స్నేహ
మృదు మధురసానుభవరక్తి బొదలి, మనము

నీడలుట్టులనైక్య మందెదముగాత ! అని ఆమె మోహావేశపరుడైన తన మిత్రుణ్ణి స్నేహభావం వైపు మరల్చి, మరో కన్యను వివాహమాడి దంపతీ నిష్ఠమైన పవిత్ర శృంగారం చేపట్టమని ప్రబోధించడం కావ్యనాయిక పరమార్థం. మోహం నశించినా 'కడిగిన మృగమద పాత్రిక విడువని పరిమళం' లాగ ప్రేమ శాశ్వతంగా వుంటుందని రాయప్రోలు సుబ్బారావు గారు ఈ 'తృణకంకణం' కావ్యం ద్వారా ధ్వనింపజేశారు.

కడిగిన మృగమద పాత్రిక
విడువని పరిమళముపగిది విధి నియమములన్
విడబడియును వారల పెం
పుడు మైత్రి ప్రేమ బంధములు తెగవవురా' అని కావ్యాన్ని ముగించారు.

భర్తతో కాపురం చేస్తూ తన బాల్య స్నేహితునితో ఉన్న భావబంధాన్ని వదలక పవిత్రమైన స్నేహభావాన్ని ఆకాంక్షించిన తృణకంకణ నాయిక ద్వారా అమలిన శృంగారతత్త్వాన్ని రాయప్రోలు సుబ్బారావు గారు ప్రకటించారు.

**సి) స్నేహలత:** రాయప్రోలు సుబ్బారావు గారి సంఘసంస్కరణాన్ని లాపకు వారి 'స్నేహలత' కావ్యం ముఖ్యోదాహరణం. బెంగాల్‌లో జరిగిన ఒక సంఘటన ఆధారంగా రాయప్రోలు వారు ఈ కావ్యాన్ని రచించారు. 1913 లో ఈ కావ్యాన్ని నవ్యసాహిత్య పరిషత్తు గుంటూరు వారు దీనిని ప్రచురించారు.

'నిత్య సంధ్యాకుమారీ మణీమతల్లి' అని మొదలై 'యా దక్షిణాన్ని కలుషితా చారములు కాల్చి వెలుగు గాక' అను వాక్యము తుదిగా ఈ కావ్యము మొత్తము 126 పద్యాలుగా వ్రాయబడింది.

తన కళ్యాణం కారణంగా కుంటుంబ నాశనాన్ని సహింప లేక మహత్తర సందేశాన్నిచ్చి ఆత్మత్యాగం చేసుకొన్న ఆదర్శవతిగా స్నేహలతను రాయప్రోలు వారి చిత్రించారు. తన పెళ్లికి కట్నం ఇవ్వవలసి వచ్చి తన తండ్రి ఇంటిని తాకట్టుపెట్టాల్సి వస్తుంది. తన వివాహ కారణంగా తన తండ్రి వెతలు పాలు కావాటాన్ని స్నేహలత సహింప లేకపోయింది. వరశుల్కం తన తండ్రికి ఎంతటి శాపంగా మారిందో ఆమె గ్రహించింది.

కన్నియను పెండ్లి యాడునో ? కన్నె తండ్రి
యర్పణ ముఖేయు శుల్క దివ్యాప్సరసను
పెండ్లి యాడునో యకడ ! యీ పెండ్లి కొడుకు
అడుగరే యొక్కరయిన నీ యార్ల సుతులు ?

అంటుక స్నేహలత లోకాన్ని ప్రశ్నించింది. అభ్యుదయ కావ్యాలలో ఈ 'స్నేహలత' కావ్యం మొదటిదిగా చెప్పవచ్చును. సాంఘికాచారాల పట్ల, పాశ్చాత్య వ్యామోహం పట్ల కలత చెందిన రాయప్రోలు సుబ్బారావు గారు ఈ పద్యాన్ని వ్రాశారు.

'పంక నిర్మగ్న కంఠమౌ పాడియావు
పగిది నున్నది ఋషులున్న భరతభూమి
కంటకంబులె పెరుగు దుష్కాననముల
పూలచెట్లెండి పోవుట బ్బురము కాదు !

వరశుల్కార్ధం ఆత్మార్పణం చేసుకొన్న స్నేహలతా దేవి లక్ష్యం నెరవేరాలని ఆమె రగిల్చిన పరిత్రాణ వహ్ని దేశాన్ని పునరుద్ధరించాలని. ఈ కావ్యం ద్వారా రాయప్రోలు సుబ్బారావు గారు ఆకాంక్షించారు. వరకట్నానికి వ్యతిరేకంగా వ్రాయబడిన మొదట కావ్యం స్నేహలతాదేవి.

'ఆర్య కన్యాకులీనత కర్పణముగ
తనువు విడిచిన స్నేహలతామ తల్లి
రగులజేసి పోయిన పరిత్రాణ వహ్ని
ఋషల యీ భూమి పునరుద్ధరించుగాత !

అని పలికిన స్నేహలతా దేవి ఆత్మర్పణం భారత దేశంలో వరకట్న దూరాచారాన్ని రూపుమాపుతుందనే ఆకాంక్షను రాయప్రోలు వారు వెలిబుచ్చారు.

**డి) కష్టకమల :** రాయప్రోలు సుబ్బారావు గారి మరో కావ్యం 'కష్టకమల' ఇందులోని కధ గూడా అమలిన శృంగారానికి సంబంధించినదే. కమల ముగ్ధ. తన బాల్య స్నేహితునైన కుమార, మాధవులను ఇద్దరి ప్రేమను ఆశించింది. అయితే కుమారుడి మీర ఆమెకున్న భావం మానసికమైన స్నేహబంధమేగాని శారీరకమైన శృంగార భావన కాదు. సోదరీ భావంతో 'కుమారుడి' క్షేమ సమాచారాలనా ఆమె కోరుకుంటుంది. 'తృణకంకణము' కావ్యంతో నాయకుడు తనకు చిన్ననాటి మండి స్నేహితురాలైన నాయికను అమలిన శృంగార భావనతో చివరకు 'సోదరీ' అని సంబోధిస్తాడు. వారి మైత్రికి ఆ పిలుపు పరాకష్టఅయింది. కష్టకమలలో కమల తన స్నేహితుడైన కుమారుని నుండి ఆ విధమైన ప్రేమనే ఆశించింది. కాని తాను తలచిన భావం ఆతనిలో లేదు ఆతడి ప్రేమనే ఆశించింది. కాని తాను తలచిన భావం ఆతనిలో లేదు ఆతడి ప్రేమ లేఖ ఆమెలో మానసిక సంఘర్షణను కలిగించింది.ఆమె తన జీవితాన్ని విషాదాంతం చేసుకొంది. ఈ సందర్భంలో

'చినుకులకు వేచు చాతకశ్రీ, కుమారి
మెఱయు మెరుపుల తెఱగు లేమె ఱుగగలదు ?
వానకారును మరగిన వనమయూరి
కార్తిక జ్యోత్స్నలకు నెట్లు కాంక్షసేయు ?

అని అనటంలో కమల చాతకం. కుమారుడు వన మయూరం. చాతక పక్షికి వర్షబిందువులు కావాలి మేఘాల నుండి వెలువడే మెరుపులు కాదు. నెమలి ఆసించేది వెన్నెల చల్లదనం కాదు మేఘగర్జనలు, వానకారుజోరు. కమల, కుమారుల మనస్తత్వాలకు ఈ వర్ణన చక్కని ప్రతీక.

ప్రేమతో బెంచికొన్న తీవియలు కొన్ని
విషలతల ఉంచు దోచినన్ బెరికి నైతొ
పూలెపూయవొ ? పరిమళంబులను విడవొ
చూడ సుందరములుకావొ ? సొగసులాడి !

యువతీ యువకుల మనోభావాలు ఒక మార్గంలో పయనిస్తే ఏర్పడే ప్రణయానికి భిన్న మార్గంలో పయనిస్తే కలిగే ప్రణయానికి చాల తేడా ఉంది.

కుమారుని నుండి తనకు వచ్చిన ప్రేమలేఖకు మనస్సులో తీవ్రమైన వేదనకు గురియై కమల తన ప్రాణం తీసుకొంది. అయితే ఆమెను మనస్ఫూర్తిగా కోరిన కుమారుడిది తప్పు అనిపించదు. కాని అతని ప్రవర్తన వల్లనే ఒక కన్నె నిండు జీవితం బలి అయిందని ప్రబోధించటమే ఇందులో కవిధ్యేయం.

**ఇ) స్వప్న కుమారము :** పరిశుద్ధమైన ప్రేమ సిద్ధాంతమును నిర్వచించుచు రాయప్రోలు సుబ్బారావు గారు రచించిన పద్య కావ్యమిది.

- 'దోసెడు మల్లెమొగల నథోముఖినై కొని తెచ్చితేల ? చాలా అని మొదలుపెట్టి 'స్మరించితిన్ భగవతీ ప్రకృతి స్తిమిత స్వరూపమున్' అను వాక్యంతో ఈ కావ్యం ముగిసింది. ఇందులో 110 పద్యాలు ఉన్నాయి. ఈ రచన 1930 జులై నుండి 'భారతి' మాస పత్రికలో ప్రకటింపబడింది.

భోగ్య వస్తువుగా స్వప్నంలో గోచరించిన స్త్రీ క్రమంగా ఒక మాతృమూర్తిగా ప్రత్యక్షమవడమే ఇందులో కవి ఆశించిన పరమార్థం.

దప్పిగొని చేరిన మిళింద తనయులకును
పూలపాలిచ్చి చీకట్లపోవకుండ
కడుపులో దాచుకొనద పంకజము ప్రియుడ
చేరదీసిన మమకారమేరి కెరుక ?

అనే పద్యం ద్వారా కవి ఒక వినూత్నమైన భావాన్ని ప్రకటించాడు. ప్రాచీన కావ్యాలలో పువ్వుకు తుమ్మెదకు ఉన్న సంబంధాన్ని ప్రేయసీ ప్రియులకు ఆయాకవులు అన్వయించారు. ఈ భావాన్ని పూర్తిగా మార్చి పూర్తిగా వ్యతిరేకమైన భావాన్ని కవి కల్పించాడు. ఆకలితో దగ్గరకు వచ్చిన పిల్లవాడిని ప్రేమగా గుండెకు హత్తుకొని కడుపునిండా తన స్తన్యాన్నిచ్చి లాలించే తల్లితో పద్మాన్ని ఆ పద్మంలోని తేనెను తాగి తృప్తిపడే తుమ్మెదను తనయుని తోపోల్చి ప్రేయసీ ప్రియులుగా వర్ణించబడిన పద్మము, తుమ్మెదల బంధాన్ని తల్లీ కొడుకుల ప్రణయ బంధంగా రాయప్రోలు వారి చిత్రించారు. నిజమైన ప్రేమ ఎప్పుడూ అమలినమే. ఆ ప్రేమ సంపూర్ణ వికాసం అందినపుడే హృదయ క్షేత్రంలో ఆనందంపడుతుంది. ఒకరిని ప్రేమించి మరొకరిని ఆనించటం వల్ల విశ్వజనీనమైన ప్రేమోదయం అవుతుందని రాయప్రోలు వారి సిద్ధాంతం. కాని లోకం దృష్టితో చూస్తే ఇది అంత సమంజసం కాదు. సౌందర్యారాధన తప్పుకాదనీ, కామవాంఛతో ప్రవర్తింపవచ్చనీ భావించే నవయువకులకు కనువిప్పు కల్గించడమే ఈ కావ్యంలో కవి ఆశించిన పరమార్థం.

'ఋతు విహిత ధర్మములు స్థల
ధ్గట[illegible]లబడిన [illegible] కోతల పాసముల్ కట్టికుడుపు'
అని రాయప్రోలు వారు హెచ్చరించారు.

స్త్రీలోని సోదరీత్వమును, మాతృత్వమును వివరించుటం ప్రధానమైన విషయంగా రాయప్రోలు వారు ఈ కావ్యం యొక్క ఇతి వృత్తాన్ని మలిచారు. ప్రణయం విరహం వల్ల పునీతమౌతుందని బోధించారు. ఈ కావ్యంలో ప్రకృతి మాతృ స్వరూపిణిగ మారి, ఆదిశక్తియై

స్త్రీకి సంజ్ఞగా నిలిచింది. కామ పీడితులకు ప్రకృతి చేసిన హితబోధ, దాని వలన జ్ఞానోదయము కలుగుట ఈ కావ్యమున ప్రధానాంశము.

కుమారుడను యువకునకు స్వప్న మందు ఒక స్త్రీ దోసిలిలో మల్లెమొగ్గలను ధరించి కనుపించినది. మల్లెమొగ్గలు స్వచ్ఛతకు, పవిత్రతకు చిహ్నములు. కుమారుడు వానిని ప్రేమించుమని ఆమెను అర్థించినాడు. ఆమె సృష్టి రహస్యమును వెల్లడించి వెడల పోయింది. ఆతడు దుఃఖించుచుండగా ఒక వెలదివాణి, ఎంత గాఢముగా ప్రేమించిన అంతగ విరహముతో దుఃఖించెదవనియును, ప్రేమకు సమస్కరించుమనియును బోధించినది. అంతలో స్వప్నము ముగిసినది.

**ఎఫ్) తెనుగు తోట :** చక్కని భావ గీతికల సముదాయంతో కూడినదీ 'తెనుగు తోట' కావ్యం. 1914 లో రచింపబడిన ఈ కావ్యంలో మూడు ఖండకలున్నాయి. ఆవాహన, గీతాసఖి, మంగళాచరణము. లేచిరావమ్మమా తల్లి లేచి రమ్మి అనే మకుటంతో 23 ఖండికలు ఈ కావ్యంలో ఉన్నాయి.

మధుర మధుమాస సాంధ్య యామములలోన
ఇసుక పడకల బడి యింపయి ప్రవహించు
ఏటి పంచలదిరుగాడ నిచ్చగింతో ?
దివ్యమగు మల్లెపూల పందిళ్ల పజ్జ
చీర మోడి బట్టి మొఉగ్గలు చిదుపు చిన్ని
కన్నియల ముద్దు నడలకు కాంక్షపడెదో ?
అని తెలుగు తోటలోకి కవి ఆహ్వానించాడు.
అంతేకాదు
మండుటెండల నావులు మ్రాని నీడ
మోములెత్తుక రోమంథములనొనర్ప
కొమ్మపై నిల్చి పిల్లన గ్రోలినూదు
గొల్ల చిన్న వానిని జూడనుల్లసింతొ ?

అని పల్లెలలోని సన్నివేశాన్ని సహజ సుందరంగా తెలిపాడు. 'పాడవమ్మ గీతాసఖి ! భావ పదము' అనే మకుటంతో తొమ్మిది గీతాలను రామప్రోలు సుబ్బారావు గారు ఈ సంపుటిలో కూర్చారు.

ప్రఖ్యాత సమయంలో ప్రకృతి సౌందర్యాన్ని చక్కటి భావకవితా స్ఫూర్తితో రాయప్రోలు సుబ్బారావు గారు 'తేచిరావమ్మ ! మా తల్లి! లేచి రమ్మి' అని ఆహ్వానిస్తూ ఇలా అంటారు

'నిదురనెలతలు వచ్చిరి నిదురలేప
భద్రభామలు దరిసిరి పాటబాడ
తెలియరాని చక్కిలిగింత లలమనొడల
మేలు కొలిపెడు పవనుడు బాలుడట్ల
నవకపు టుషస్సు చిద్రుపలు కవిసికొనెడు
పాడుపుమల పైకి నూగెడు ప్రొద్దు పాప
నుయ్యేలల పైడి త్రాళ్లన నొదిగి యొదిగి
రాలు సురపొన్న పూవులు రాసులట్ల

మధువు చిందుచున్నది కుసుమముల జితల
కొమ్మలొక క్రొత్త రుచి సరసమ్ములయ్యె
వృద్ధతరులులే మొక్కల పెంపుజూచి
యఖనవ వికాస దీపన మఖినయించు
తిన్నని పథంబు బట్టిగ యాత్రిక జనంబు
లేచి రావమ్మ ! మాతల్లి ! లేచిరమ్మ

తల్లి పాలు తాగి ఆనందంతో గంతులు వేసే లేగ దూడల సౌందర్యాన్ని రాయప్రోలు వారు ఇలా వివరించారు.

తల్లిపాలు ద్రావిన మహోత్సాహ పూర్తి
పెనగి చెల్లుట లాడెడు పెంపుమిగుల
నిరుగుపొరుగు లేగల క్రీడలరయవమ్మ

కాపు కన్నెను ఈ విధంగా మనోహరంగా వర్ణించారు రాయప్రోలువారు : కాపు కన్నె అందాలను శ్రీనాధుని వర్ణనలు పోలినట్లుగా ఉన్నాయి. ఆమె నడుము, పిరుదులు, చెక్కిళ్ళు, పెదవులు ఇలా ప్రతి విషయాన్ని చక్కగా వర్ణించినాడు. అదియు వీరి దృష్టిలో మలిన శృంగారం కాదు అని అట్టి అధికమైన శృంగారాన్ని కాక సౌందర్య స్ఫోరకమైన శృంగారాన్ని వర్ణించినాడు రాయప్రోలు.

'తెనుగు తోట' కావ్యంలో మరొక చక్కని పద్యం

చేతబట్టితి నీ వీణ చిన్నదాన
పాడితివి కొన్నినాళ్ల తిస్వాదువుగును
లోకదుర్లభ మోహన పాకఫణితి
రాగరస బంధురంబైన రమ్యగీతి
చంపకంబులు గురియు నచ్చర కొలంబు
ఆట వెలదులు పారవశ్యములు గొలుప
అలరి మత్తేభలక్ష్మి కుంభాభిషేక
హృద్యసౌవర్ణ కలశము లెత్తిపట్ట
పెరిమ బెరయంగ గరువంపు బిరుదుటందె
లడుగుదమ్ముల రారాజా లందగింప
నిండు ముత్యాల శాలల నీటు సూపి
వాసి చూరాడనట్టి నీ భాగ్యమేరి
లేచిరావమ్మ మా తల్లి ! లేచిరమ్మ

చక్కని భావస్ఫూర్తితో ఈ 'తెనుగుతోట' కావ్య మందలి పద్యాలు రచింపబడ్డాయి.

**జి) జడకుచ్చులు :** రాయప్రోలు సుబ్బారావు గారి ఈ కావ్యం నవ్య సాహిత్య పరిషత్తు. గుంటూరు వారిచే ప్రకటింపబడింది. ఇంద[illegible]ో మొత్తం 23 ఖండికలున్నాయి. శుక్తి, పూజ, విరహవీధి, పిలుపు, మధుమాలి, పసవ రాధిక, సఖిసంవరణం, ఒక మాట, తిలకము, గీతాం[illegible]హి, ధ్యానిబుద్ధ ప్రతిమ, ధ్యానగీతము, వసంత తిలకము, శేషచైత్రము, పూవు, మేఘము, కవిత, ఎవరు, కోయిల, కనకము, రాధ పిలుపు, ధ్వన్యా లోకము [illegible]త వార్త అమునవి.

'పూజ' ఖండికలో

'చందమామ పూవెన్నెలల్ జల్లులాడ
బీళ్లు పులకరింపగ సెలయేళ్లు పాడ
విశ్వమున పచ్చతోరణాన విరిసియాడ
వ్రేలవే ! తల్లి మెడను మాలాలలామ
తెలుగు నెత్తుట వెలిగిన దీపకళలు
తెలుగు పాలడేరిన మాగడల తరకలు
తెలుగు తేనె తీయందనమ్ములను తలసి
వ్రేలవే తల్లి మెడను మాలాలలావు ! అంటూ తెలుగు దనాన్ని చూపించినారు రాయప్రోలు.

రాయప్రోలు సుబ్బారావు గారు వ్రాసిన మరొక చక్కని పద్యం 'తుమ్మెద'లో,
తుమ్మెద ప్రవర్తనను చూచి కవి ఈ విధంగా అంటారు.

మధుప ! యేటికీ పెట్టుదు పథముగొంటి
వొక్క పువునకు పెట్టుదు గిలిగింత
లొక్కపువున పానీయము గ్రుక్కుగొందు
వొక్కపూవును గీతితో నుత్యవింతు
అంతులేని యాకసమున కొంతసేపు
కుటిల పవన వీచికలందు కొంతసేపు
కువల యోస్మీల రేఖల కొంతసేపు
త్రుళ్ళిపడుచు తిరిగెదుత్తుని విధాన.

తెల తెల వారు తుండగా ప్రకృతిని చూసిన రాయప్రోలు వారు పలికిన పద్యాలు

ఋషులు మేల్కొను సుముహూర్త మీయుషస్సు
లేచితిని నేను ప్రార్థన లాచరింప
సృష్టి పసిబాలపగిది నిద్రించుచుండె
విశ్వవిభుని బాంధవము భావించెనాత్మ
విరులలోపల మధువు స్రవించువేళ
పుడమి నలమిన దోషము సడలువేళ
ప్రాణి కర్మాభి ముఖమగు భద్రవేళ
అబ్బె బ్రాహ్మీ ముహూర్త భాగ్యంబు నాకు.

ఒకనాడు రాయప్రోలు వారు ఒక కలగన్నారు ఆకలలో ఒక అందమైన పక్షి కనబడింది. బంగారు రంగుతో మెరిసిపోతున్న ఆ పట్టను పట్టుకొందాము భావించారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని శబ్దాలంకార స్ఫూర్తితో ఒక పద్యాన్ని వ్రాశారు.

మిసమిసలపుట్ట, మవ్వంపు పసల గుట్ట
సొగసురతనాల తట్ట, సోయగపుకట్ట ...

ప్రియములకు మెట్ట, ఆ మురిపె ములపిట్ట
చెలువముల పట్ట మేమని పలుకవచ్చు
చక్కని భావస్ఫోరకమైన పద్యాలు పాటలతో 'జడకుచ్చులు' కూర్చబడింది.

**హెచ్) రమ్యాలోకము :** రాయప్రోలు సుబ్బారావు గారి ఈ కావ్యము 'మామిడి కొమ్మ మీద కలమంత్ర పరాయణుడైనకోకిల స్వామికి మ్రొక్కి అని మొదలై 'గొల్లభామల లీలన్ గోచరించు నీయబోధ శృంగారమే యిగురువోసి' అనే వాక్యం చివరిదిగా మొత్తం 158 పద్యాలతో రచింపబడింది.

ఈ కావ్య ఆరంభంలో కోకిల స్వామిని, వాల్మీకి మహర్షిని, మహకవి కాళిదాసును రాయప్రోలు వారు స్తుతించారు.

మామిడి కొమ్మ మీద కలయంత్ర పరాయణుడైన కోకిల
స్వామికి మ్రొక్కి, యీ యభినవ స్వరకల్పన క్షమించితిన్
కోమగోస్త నీరుచులకున్ కదళీఫలపాక సిద్ధికిన్
లేములు దీర్చుమా తెలుగు లేత ముదుళ్ళ వెలార్పు వేఁడుకన్
క్రౌంచమిధు నాను రాగ దారణము వలని
శోకమే శ్లోకమయి, యే మృదు కృతాత్ము
ముఖ వియత్పథమున గంగబోలె వెడలె
ఆ వచస్వి ప్రాచేతసు నాత్మదలతు
సకల కళ్యాణ వసతియౌ ప్రకృతిలోన
భావభాషాభినయులైన ప్రజల యందు
హ్లాద రామణీయకముల పాదులెఱిగి
కావ్యరతుడైన ఘనునెంతు కాళిదాసు.

తెలుగు భాష తన మాతృభాషయైనందు తానెంతగానో గర్విస్తున్నానని రాయప్రోలు వారు పలికారు.

ఏ ప్రఫుల్ల పుష్పంబుల నీశ్వరునకు
పూజసల్పితినో యిందు పుట్టినాడ
కలదయేని పునర్జన్మ, కలుగు గాక
మధుర మధురం బయిన తెన్గు మాతృభాష

తెలుగుభాష యొక్క గొప్పతనాన్ని ఈయన ప్రశంసించి పరభాషా వ్యామోహం చూపే వారిని నిరసించాడు.

వియోగ శృంగారం యొక్క విశిష్టతను ఇలా పలికారు

మూఢులిచ్ఛయించెదరు సంభోగ సుఖము
నే వియోగ మాధుర్య లీలా విపాక
మనుభవింప నఱ్ఱాడెద ననడె యాంధ్ర
రసికకుల రాజు పండిత రాజుమున్ను

కావ్యం యొక్క గొప్పతనాన్ని, కవి యొక్క వైశిష్ట్యాన్ని రాయప్రోలు వారు ఈ విధంగా తెలిపారు. 'అపారే కావ్యసంసారే కవిరేవ ప్రజాపతిః అని ఆర్యోక్తి.

హృద్యమై, రసమయమైన, ఈయపార

కావ్య సంసార మందున కవి యొకండె
బ్రహ్మ, ఏతదభీష్ట ధార తరంగి
తముగ ననురణించు సుమి శబ్దప్రవృత్తి.

ఆంధ్రుల యొక్క విశాల దృక్పథాన్ని కవి ఈ విధంగా కీర్తించారు

ప్రాతవయినంతనే త్యజింపరు, నవీన
మయిన మాత్ర వరింపరు, ప్రియములై, స
హృదయ సేవ్యమానములైన వెల్ల, స్వీక
రించి భావాంబర మలంకరింతు రర్థి.

కావ్యరచనకు ప్రధానమైన రసమే అని సౌందర్య సముపేతమైన రచనయే చక్కని కావ్యమని రాయప్రోలు వారి అభిప్రాయం. ఈ అభిప్రాయాన్నే 'రమ్యా లోకము' కావ్యంలో కవి చిత్రించాడు. ఇది రాయప్రోలువారి రస పరిపోషణకు చక్కని ఉదాహృతి.

**ఐ) వనమాల :** 1947 లో విశ్వజనీన గంధావళి పేరుతో నోరినరసింహ శాస్త్రి గారి సంపాదకీయంలో 'వనమాల' ఖండికా గీతికా సంపుటి వెలువడింది పరిచయ వాక్యాలులో నరసింహశాస్త్రి గారు ఇలా అన్నారు

" సహజ ప్రతిభకు దోహదముగా ఈ కవికి సరస సాంగత్యము లభించినది విద్వత్కవీశ్వరులగు సుబ్రహ్మణ్యశాస్త్రి గారితో ఆదిలోను, అనంతరము గురుదేవులు రవీంద్ర కవీంద్రులతోను, మహా విద్వాంసలు విదుశేఖర భట్టాచార్యుల వారితోను, ఆంధ్రరత్న గోపాలకృష్ణునితోను, సహృదయ శేఖరులు సముద్రాల అప్పలాచార్యుల వారి తోడను అభించిన సారస్వత సాంగత్యము వలన ఈ కవి వాగేశ్వరికి ముద్దు బిడ్డడయినాడు"

ఈ 'వనమాల' ఖండకావ్య సంపుటిలో 30 ఖండికలున్నాయి. ఈ కావ్యంలోని రెండు సమస్యాపూరణలు

అన్నము ప్రాణమూలమని యందురు ఓషధులందు బుట్టు నా
యన్నము తన్మహీషధి చయమ్ముదయించు ధరిత్రి, నా ధరి
త్రి న్నిరతంబు భక్తిమెయి దీబల కాయబలంబు లూతగా
దున్నవలెన్ పరుండిన నధోగతి తప్పదు కాదె మిత్రమా !

**ఔ) ఆంధ్రావళి :** 1916 లో నవ్యసాహిత్య పరిషత్తు గుంటూరు వారిచే ప్రచురింపబడిన కావ్యము. ఇందులో 30 ఖండికలున్నాయి.

భారతదేశ స్వాతంత్ర్యోద్యమముతో బాటు ఆంధ్రరాష్ట్రోద్యమము గూడా బయలుదేరింది. ఈ ఉద్యమము యొక్క ప్రధానోద్దేశాలు రెండు 1. ఆంధ్రులు తమ వ్యక్తిత్వమును నిలుపుకొనుట 2. తాము సర్వతో ముఖముగా అభివృద్ధి చెందుటకు ముఖ్యసాధనము ప్రత్యేకాంధ్ర రాష్ట్రమేయని యానాటి ఆంధ్ర ప్రముఖులు భావించినారు. ఆంధ్రులని కొందరున్నారని జౌత్తరాహికులకు తెలియదు. 'మదరాసీ' అనునదియే సర్వజన వేద్యమైన పదము. ఒకనాడు జగద్విఖ్యాతిగాంచి మహోన్నత దశననుభవించిన యాంధ్రులు, ఊరును పేరును లేక నీచస్థితిలో నుండటను భరింపలేని పరిస్థితిలో ఆంధ్రోద్యమము ప్రచండముగా సాగింది. రామప్రోలు సుబ్బారావు గారిది సహజంగా స్వేచ్ఛాప్రవృత్తి. ఆనాటి బంకించంద్ర ఛటర్జీ గారి వందేమాతర ప్రభావంతో పృథివియే తల్లిగా, దేవతామతల్లిగా గోచరించింది. 'తెనుగుతోట' కావ్యంలో అస్పష్టంగా ప్రకటింపబడిన జాతీయభావం 'ఆంధ్రావళి'లో సుస్పష్టంగా చేయబడింది.

రాయప్రోలు సుబ్బారావు గారి జాతీయాభిమానం 'ఆంధ్రావళి' గేయఖండ కృతిలో పొంగులువారింది. ఆంధ్రభిమానంతో ఉడికిపోయిన ప్రథమ కవి శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారు. ఈయన వ్రాసిన దేశభక్తి, ఆంధ్ర దేశభక్తి పద్యాలే ఇప్పటికి ఆంధ్రాభిమానం కలవారంతా ముందుగా చదువుతున్నారు. భారతమాతను కీర్తిస్తూ 'జన్మభూమి' ఖండికలో ఈయన వ్రాసిన పద్యాలు ఎంతో ఖ్యాతిని గడించాయి.

"ఏదేశమేగినా, ఎందుకాలిడిన,

ఏపీఠమెక్కినా, ఎవ్వరేమనిన

పొగడరా నీతల్లి భూమి భారతిని

నిలుపరానీజాతి నిండుగౌరవము.

ఏపూర్వపుణ్యమో, ఏయోగబలమొ

జనియించినాడవీ స్వర్గఖండమున

ఏ మంచి పూవులన్ ప్రేమించినా వొ

నిను మోచె ఈ తల్లి కనక గర్భమున

లేదురా ఇటువంటి భూదేవి యొందు

లేరురా మనవంటి పౌరులింకెందు"

ఈ గేయంలో "జననీజన్మభూమిశ్చ స్వర్గదపిగసి" అనే సూక్తినే ప్రబోధించినా మాత్ప చైతన్య మొకటి తొణికిసులాడుతుంది.' లేదురా ఇటువంట భూదేవి యొందు' అనటం కొందరికి దురభిమానంగా సైతం కనిపించవచ్చు. ఇందులు భారతదేశ ప్రాచీన వైభవం, ఆధ్యాత్మిక శక్తి గుర్తుచేశారు.

జాతీయ భావాన్ని రాయప్రోలు సుబ్బారావు గారు ప్రబోధంచారు భారతదేశం యొక్క పురాతన వైభవాన్ని ప్రకటించిన ఈగేయం అనేకుల హృదయాలలో శాశ్వతంగా నిలిచింది. ఈ పద్యాలు అసంఖ్యాక సభలలో గానం చేయబడి జాతీయాభిమానాన్ని రేకెత్తించాయి.

'ప్రబోధము' అనెడి కవితా ఖండికలో ఆంధ్రదేశ ప్రాభవాన్ని శ్రీ రాయప్రోలు వారు కీర్తించారు.

"అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వ

విద్యాలయములు స్థాపంచునాడు

ఓరుగల్లున రాజవీర లాంఛనముగా

పలుశస్త్రశాలలు నిలుపునాడు

విద్యానగర రాజవీధులన్ కవితకు

పెండ్లి పందిళ్లు కప్పించునాడు

పొట్నూరికి సమీపమున ఆంధ్రసామ్రాజ్య

దిగ్జయ స్తంభ మెత్తించునాడు

ఆంధ్రసంతతికే మహితాభిమాన

దివ్యదీక్షా ముఖస్ఫూర్తి తీవరించె

ఆ మహావేశ మర్థించి యాంధ్రులార

చల్లు డాంధ్ర లోకమున నక్షతలు నేడు - అంటూ పిలుపు నిచ్చినారు.

త్యాగరాజు తెలుగులో రచించి పాడిన పాటలు తమిళనాడు ప్రతి ఇంటను మార్మోగినాయి. వాగ్గేయకారుడైన ఆ త్యాగరాజు పలికిన పాటలు మృదు మధురంగా ఉండి తెలుగుభాషకే కీర్తి ప్రతిష్ఠల్ని తెచ్చి పెట్టాయి.

భారతదేశం యొక్క పురాతన వైభవాన్ని రాయప్రోలు వారు 'తమ్ముడా' అనే ఖండికలో మరొకసారి వివరించారు.

శ్రీలు పొంగిన జీవగడ్డయి। పాలు పొంగిన భాగ్యసీమయి

వ్రాలినది ఈ భరతఖండము । భక్తి పాడర తమ్ముడా !
వేదశాఖలు పెరిగె నిచ్చట । ఆదికావ్యంబందె నిచ్చట
బాదరాయణ పరమఋషులకు । పాదుపేమ్మిది చెల్లెలా !

పూర్వ చరిత్రల వైభవాన్ని గమనించి ప్రస్తుత స్థితిని వైభవోపేతంగా ఉండేటట్లు మలుచుకోవాలని కవి ప్రబోధించాడు.

సృష్టిమాచు సంగీతసాహిత్య కలల
నుగ్గు బాలతోడుత త్రావి యుమిసి రాంధ్రు
లాజగన్మోహనాస్త్రము లభ్యసింప
దక్షిణము మత్తరము జూడదగునె ఆంధ్ర !

కొండవీటి రెడ్లు, పల్నాటి వీరులు, అదంకికాపులు, తెలంగాణ భటలు పుట్టిన ఈ ఆంధ్రదేశపు గొప్పదనాన్ని గ్రహించమని పలికారు రాయప్రోలు వారు.

కులాలకతీతంగా ఆంధ్రదేశ ప్రాభవాన్ని పరిపుష్టం చేయాలని రాయప్రోలు వారు ఉద్బోధించారు.

ఆంధ్రదేశపు ప్రాభవాన్ని వివరిస్తూ 'తెలుగు తల్లి' లో తెలుగు తల్లి వైభవాన్ని మాయనివ్వర్దని, చిన్నబుచ్చవద్దని జాతిజనులను కోరారు శ్రీరాయప్రోలు వారు

శ్రీకాకుళ స్వామి సిగ్గై మూసించె । తెల్లని ఆంధ్రుల మల్లెపూలు
బద్దెరాజుల జీవగడ్డగ్రక్కదలంగ । కొరాఢె మత్తాంధ్ర కుంజరములు
చీకటి మన్నెముల్ ఛేదించి నవధాన్య । ములవెత్తె ఆంధ్రుల పోపుబిడ్డ
చిలుక సరస్సులో శృంగారవేకల । నడిపె ఆంధ్రుల యింటి పడుచు జతలు
ఉత్కలాశా నితంబమ్ములొత్తి హత్తె
ఆంధ్రుల యశోదుకూలసితాంచలములు
తమ్ముడా । మాయనిత్తువే తల్లిపన్నె
చెల్లెలా ! చిన్నబుత్తువే తల్లి చిన్నె ?'

అని ప్రాచీన తెలుగు దేశం ఎంతటి వైభవోపేతంగా ఉందో మనోహరంగా శ్రీ రాయప్రోలు వారు వర్ణించారు.

'తెలుగు మాన్యము' లో రాయప్రోలు వారు ప్రకటించిన భావాలు 'తెలుగు తల్లి మెడలో వేసిన మల్లెదండలే.'

వంశిన్ వంచి, మృణాళమున్ మెలచి, పక్వద్రాక్ష నెండించి వా
గంశల్ మార్దవ మాధురీ సుభగ విన్యాసంబు జిల్కన్, దశ
త్రింశ లక్ష జనప్రసన్న రసనా దేవాలయాభ్యంతర
ప్రింశు ప్రార్థన గీతమైన తెనుగుం బల్కున్ ప్రశంసించెదన్

అని తెలుగుభాషా వైశిష్ట్యానికి నీరాజనాల్ని పట్టారు రాయప్రోలు వారు. 'ప్రతిభా చక్రము'లో విశ్వకవి రవీంద్రుడు, శివశంకరశాస్త్రి, సరోజినీదేవి, రాధాకృష్ణన్ వంటి మహనీయులను గూర్చి స్తుతించారు.

ఆధునిక ఆంధ్ర కవిత్వ చరిత్రలో మొట్టమొదటిసారిగా ప్రణయానికి క్రొత్తభాష్యం చెప్పి అమలిన శృంగార సిద్ధాంతాన్ని ప్రతిపాదించటమేకాక ఉగాదిలాంటి పండగల మీద కోకిల, పులి విస్తరాకులాంటి విషయాలపై పద్యాలు వ్రాయటాన్ని ప్రచారంలోకి తెచ్చింది.

దేశభక్తి కవిత్వాన్నేకాక, ప్రకృతి, ప్రణయ, ఆధ్యాత్మిక, సంఘసంస్కరణ, మానవతావాద, స్తుతి, స్మృతి వంటి అనేక విషయాలకు సంబంధించి వైవిధ్య భరితమైన రచనలు చేసి ఆంధ్ర కళామతల్లి కంఠహారంగా భాసించిన అద్వితీయ కవితామూర్తి శ్రీ రాయప్రోలు సుబ్బారావు.

**సమీక్ష :**

రాయప్రోలువారి జీవిత విషయమును, వారి వాఙ్మయం కృషి ఫలితముళైన కావ్యాలు, వాటిలోని కవిత తత్వం. అమలిన శృంగార భావాలను పరిశీలించారు.

**రాదగిన ప్రశ్నలు :**

1. రాయప్రోలు సుబ్బారావు సాహిత్యంలో చేసిన కృషిని వివరించండి?
2. రాయప్రోలు వారి ఆంధ్రాభిమానాన్ని సమీక్షించండి?
3. రాయప్రోలు వారి అమలిన శృంగార తత్వాన్ని వివరించండి?
4. తృణకంకణం కావ్యాన్ని అందలి రాయప్రోలువారి రచనా వైశిష్ట్యాల్ని తెలుపండి?
5. రాయప్రోలు వారి కృతులను సమీక్షించండి?

**ఆధార గ్రంథాలు :**

1. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయం - ప్రయోగం - డా॥ సి. నారాయణరెడ్డి
2. ఆంధ్ర సాహిత్య చరిత్ర - ద్వా.నా. శాస్త్రి
3. నేటి తెలుగు కవిత
4. నేటి కాలపు కవిత్వం
5. రాయప్రోలు వారి కృతులు

- డాక్టర్ కొత్తా సుబ్రహ్మణ్యశాస్త్రి

పాఠం - 14.1

# తుమ్మల సీతారామమూర్తి - విశ్వనాథసత్యనారాయణ

పాఠ్య నిర్మాణం :


14.1.1. తుమ్మల సీతారామమూర్తి గారి జీవిత విశేషాలు

1.2. ప్రశంసలు

1.3. తుమ్మల సీతారామమూర్తి గారి బిరుదులు, సన్మానాలు

1.4. తుమ్మల సీతారామమూర్తి గారి రచనలు

1.5. తుమ్మల సీతారామమూర్తి గారి వాఙ్మయ సమీక్ష

1.6. తుమ్మల సీతారామమూర్తి గారి ఖండకృతులు

1.7. తుమ్మల సీతారామమూర్తి గారి మరికొన్ని విశిష్ట ఖండకృతులు


లక్ష్యం :

తుమ్మల సీతారామమూర్తి గారి జీవిత విశేషాలు, బిరుదాలు, రచనలు, విశేషాలు, వాఙ్మయ విషయాలు తెలుసుకుంటారు.

### 14.1.1. శ్రీ తుమ్మల సీతారామమూర్తి గారి జీవిత విశేషాలు:

శ్రీ తుమ్మల సీతారామమూర్తి గుంటూరు జిల్లా రేపల్లె తాలూకాకు చెందిన కావూరు అనే చిన్న పల్లెటూరులో 25-12-1901 న జన్మించారు. ఈయన తండ్రి నారయ్య. తల్లి చెంచమ్మ. నారయ్య గారికి చదువు లేకపోయినా భారత, భాగవత గ్రంధాలలోని వందలాది పద్యాలు కంఠపాఠాలు. ఈ పద్యాల ప్రభావం సీతారామమూర్తి గారిపై పసితనం నుండే పడింది. ఆ ఊళ్లోనే వీధిబడి కావూరి శ్రీరాములు దగ్గర శ్రీ సీతారామమూర్తి అమరకోశం, భారత భాగవతాలలోని ఉపాఖ్యానాలను చదివారు. తండ్రి మరణించిన తర్వాత అన్నగారితో కలిసి వ్యవసాయం చేశారు. బాల్యం నుండే విద్యపై ఆసక్తి ఎక్కువగా ఉండటంతో పొలానికి గూడా పుస్తకాలు తీసుకొని వెళ్లి చదువుకొనేవారు. ప్రొద్దుపోయిన తరువాత నాలుగుమైళ్ల దూరంలో ఉన్న చందోలుకు నడచివెళ్లి తాడేపల్లి వేంకటప్పయ్యశాస్త్రి గారి దగ్గర రాత్రివేళ సంస్కృత కావ్యాలు చదువుకొని కోడికూసిన తర్వాత ఇంటికి వచ్చి మరల పొలంపనులు చూసుకొనేవారు. వేంకటప్పయ్యశాస్త్రి గారి వద్ద ఒక సంవత్సరం పాటు సీతారామ మూర్తిగారికి చదువు జరిగింది. ఒక్కొక్క రోజున వేంకటప్పయ్యశాస్త్రి గారు సీతారామమూర్తికి ఒక సంస్కృత శ్లోకం కంటే బోధించేవారు కాదు. వెంకటప్పయ్య శాస్త్రిగారు గొప్ప విద్వాంసుడు, కవి. ప్రతి శ్లోకాన్ని ఖండాన్వయ, దండాన్వయ, వ్యాకరణ, అలంకార విషయాలన్నిటిని వివరిస్తూ ఈయన బోధన జరిగేది. తాను త్వరత్వరగా అన్ని శ్లోకాలు నేర్చుకోలేకపోతున్నానే అని సీతారామమూర్తి గారు బాధపడుతుంటే 'నాయనా! నీవు బాధపడవద్దు. నా దగ్గర ఒక శ్లోకం చదివినవాడు మహా విద్వాంసుడౌతాడు' అన్నారు. ఈ విధమైన శిక్షణ వల్లనే సీతారామమూర్తి గారికి మంచి సాహిత్య పరిజ్ఞానం కలిగింది. అట్టిగురువు గారిని స్మరిస్తూ ఈయన ఒక పద్యాన్ని వ్రాశారు.

"ఏకశ్లోక రహస్య బోధనముచే నెవ్వాడు శిష్యున్ సుధీ
లోకాగ్రేసరుజేయు నవ్విబుధు గొల్తున్ వెంకటప్పార్యున్
స్తోకశ్లోక మయూఖరాజి దఖిలాతున్ రామగాధామృతా
శ్లోకగ్రంధమ తెల్గిజానకు మద్గీర్వాణ భాషాగురున్"

కావూరు గ్రామంలో 1918 సంవత్సరంలో శ్రీ రామనవమిరోజు సీతారామాంధ్ర గ్రంధాలయం స్థాపింపబడింది. దీనిని నిర్వహిస్తూ శ్రీ తుమ్మలవారు చాలా గ్రంధాలతో సాన్నిహిత్యాన్ని పెంచుకొన్నారు. ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, దేశాభిమాని, గ్రంధాలయ సర్వస్వము

మొదలైన పత్రికలు చదవటం ద్వారా తుమ్మల వారిలో రాజకీయ చైతన్యం కలిగింది. సంఘసంస్కరణ పట్ల ఆయనకు అభిమానం పెరిగింది. 1920 నుండి సీతారామమూర్తి గారు గాంధీమహాత్ముడు నాయకత్వం వహించిన కాంగ్రెసులో ప్రముఖ కార్యకర్త అయ్యారు. చీరాల, పేరాల సత్యాగ్రహాన్ని చూచి ఉత్తేజం పొందారు. కాకినాడలో జరిగిన అఖిలభారత కాంగ్రెసు మహాసభ ఆయనలో సేవాదీక్షను, దేశభక్తిని ఇనుమడింపజేసింది. ఆయనకు గాంధీమహాత్ముడు ఆరాధ్యనాయకుడయ్యాడు. ఆ మహాత్ముని సిద్ధాంతాలకు తన జీవితాన్ని, సాహిత్యాన్ని అంకితం చెయ్యాలని నిర్ణయించుకొన్నారు.

1924 లో కావూరులో తిలక్ జాతీయ పాఠశాల నెలకొల్పబడింది. ఇందులో తుమ్మల వారు ఆంధ్రోపాధ్యాయుడుగా ఉన్న కాలంలో చిన్నయసూరి వ్రాసిన నీతిచంద్రిక, మహాకవి తిక్కన ఆంధ్రీకరించిన మహాభారత విరాటపర్వాన్ని బోధించాల్సి వచ్చింది. ఆ నాటి నుండి తెలుగుపలుకు మీద ఎనలేని మక్కువ ఏర్పడింది. తిక్కన సోమయాజి, చిన్నయసూరిల ఎడల ఆరాధనాభావం కలిగింది. ఆ తర్వాత 1930 లో దుగ్గిరాల బోర్డుహైస్కూలులో తెలుగు పండితునిగా జేరారు. గాంధేయవాద ప్రభావం తుమ్మల వారిచేత 'ఆత్మార్పణము' అనే కావ్యాన్ని వ్రాయుటానికి కారణమైంది. సీతారామమూర్తి గారు కేవలం పద్యకవి. ఆనాడు గ్రాంధికభాషయే పద్యరచనకు, గద్యరచనకు ముఖ్యావసరంగా ఉండేది. వార్తాపత్రికలు గూడా దాదాపు 1940 వరకు గ్రాంధికభాషలోనే ప్రచురింపబడేవి. ఆనాటి రచయితలందరూ గ్రాంధిక భాషకే అలవాటుపడ్డారు. తుమ్మల సీతారామమూర్తి గారి రచన అంతా ప్రధానంగా పద్యంలోనే నడిచింది. పద్యరచనకు వ్యావహారికభాష సరిపడదు. అందువల్లనే ఆనాడు ప్రారంభ దశలో ఉన్న వ్యావహారిక భాషోద్యమం తుమ్మలవారికి ఏ మాత్రం ఆసక్తి లేని విషయమయ్యింది. వ్యావహారికభాషావాదానికి ఆయన దూరంగా నిలిచారు. విద్యార్థులలో అంతగా ఆసక్తిని కలిగించని వ్యాకరణాన్ని పరమ 'రమణీయంగా' బోధించిన ఖ్యాతి పొందిన దువ్వూరి వేంకటరమణశాస్త్రి గారు తుమ్మల వారికి వ్యాకరణాచార్యులు. వీరి శిష్యరికంలో 'బాలవ్యాకరణాన్ని' రచించిన పరవస్తు చిన్నయసూరి గారి మీద తుమ్మల వారికి అంతులేని గురివిర్పడింది. చివరకు ఆయన "నాలో చిన్నయ కొలువున్నాడు జీవాత్మవలెన్" అని చాటుకునేంత వరకు వెళ్లారు. 1930 లో సీతారామమూర్తి గారు 'ఉభయభాషాప్రవీణ' పరీక్షలో ఉత్తీర్ణులైనారు చిట్టిగూడూరు పాఠశాలలో వీరికి గురుత్వము నెరపిన శ్రీ దువ్వూరి వెంకటరమణశాస్త్రి గారని గూర్చి ఈ విధంగా స్తుతించారు.

"శబ్దశాస్త్రాది లక్షణ సంప్రదాయ। మెవ్వడెరిగించెనాకు నయ్యిద్ధచరితు
బ్రస్తుతించెద బుంభావ పద్మజాత। రమణి దువ్వూరి వేంకటరమణశాస్త్రి"

తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారి తండ్రి నారయ్యగారు గురుకులాల్లోగాని, పాఠశాలలోగాని ఏ గురువు దగ్గరా చదవకపోయినా ప్రాచీన సాహిత్యంపై మిక్కిలి అభినివేశాన్ని పెంపొందించుకున్నారు. తన తండ్రిని గూర్చి తుమ్మల వారు వ్రాసిన పద్యమిది

'చదువకయున్ననేమి బుధసత్తములుబ్బగ నర్థభావ సం
పదవికసింప భాగవత భారతముల్ వివరించు; హృద్యముల్
తదమల కావ్యపద్యములు ధారణకగ్గము చేసి వేనవేల్
చదువునతండు; తచ్ఛ్రవణ సాహితి దుశ్శక మెట్టివారికిన్'

1922 లో తుమ్మలవారు పన్నుల నిరాకరణోద్యమము జరిమానా శిక్షను పొందారు. గుంటూరు జిల్లా కాంగ్రెసు సంఘంలో పదిసంవత్సరములు సభ్యులుగా నుండి జాతీయ ప్రబోధం చేశారు. రాట్నము, గాంధి, అస్పృశ్యత, పంజాబువధ, భారతమాత మొదలైన శీర్షికలతో ఈయన వ్రాసిన పద్యాలు ఆనాటి తెలుగు చదువరులందరికి సుపరిచితాలు. ఈయన దుగ్గిరాల, బాపట్ల, నిడుబ్రోలు, అప్పికట్ల హైస్కూళ్లలో ఆంధ్రోపాధ్యాయ పదవి నిర్వహించి ఎందరో శిష్యులను తీర్చిదిద్దారు. సంస్కృతాంధ్ర కావ్యపరిజ్ఞానమేకాక, అలంకారశాస్త్ర, వ్యాకరణశాస్త్ర పరిజ్ఞానాన్ని శ్రీ తుమ్మలవారు గురుకులక్లిష్టులై సంపాదించుకొనుటవల్లనే ఆయన రచనలలో రసపరిపుష్టి, భావగంభీరత, ధర్మనిష్ఠా నిశ్చితమైన రచనా సంవిధానం తెలియుచుండును.

**14.1.2 ప్రశంసలు:**

నన్నయభట్టు 'శబ్దనటనమ్ములు" తిక్కయజ్వ" యర్థసం
పన్నత "శంభుదాసుని ప్రబంధ విభూతి సమైక్యభావముం
గన్నవి నీయెడన్ - తెలుగు గడ్డ భవత్కవితా త్రివేణిచే
కన్నులవిందుగా వెలయుగావుత పచ్చని పైరుపంటలన్"
అనే ప్రశంసను, ఆశంసను ప్రకటించారు.

'కమ్మకమ్మని యెడదనైక్యమ్మొనర్చి
మీరు పెంచిన శబల, యీ భారతీయ
ధర్మసారము గురియుచు ధన్యమయ్యె
కాపుదల మీది తుమ్మల కవి వరేణ్య'

అని శ్రీ బెళ్లూరిశ్రీనివాసమూర్తి గారు
'తుమ్మల సీతారామా !
కమ్మకవిత్వము సొమ్ముగాదెనీకున్
బమ్మవుకైతలగూర్చగ
సమ్మతి గొనుమయ్య నతులసంభావనగన్'
'కమ్మనౌ కవిత యాతని సొమ్మె యౌనంట'
అని ప్రశంసించిన శ్రీ కరణంసత్యనారాయణ గారు
గుంటూరిసీమలో బాపట్లసేరువన
అప్పికట్లే యీరి నెలవాయెనంట
కమ్మోరి తలమానికమ్మయై మనునంట
తుమ్మల సీతారాము డితడంట

అని పలికారు.

బాపూజీ ఆత్మకథను తుమ్మలవారు 1951 లో మొదటిసారి ప్రచురించినపుడు "అభినవ తిక్కన తుమ్మల సీతారామమూర్తి చౌదరి" అని వ్రాసుకొన్నారు. కాని, తరువాత 'అభినవ' తిక్కన బిరుదాన్ని పేరు చివరకుల సూచకమైన "చౌదరి"ని వదలివేసుకొన్నారు. తిక్కన సోమయాజి నిర్వచనోత్తర రామాయణ రచనా కాలానికి తరువాత మహాభారతాంధ్రీకరణ సమయానికి మార్పు వచ్చినట్లే తుమ్మల సీతారామమూర్తి గారిలా బాపూజీ ఆత్మకథ రాసిన కాలానికి తరువాత రచనల కాలానికి మార్పువచ్చింది.

1925 జూన్ 28 న కావూరు గ్రామపెద్దలు ఆనాటి ఆశుకవితా చక్రవర్తులయిన కొప్పరపు సోదరకవులచేత అవధాన ప్రదర్శన ఏర్పాటు చేశారు. తరువాత కొప్పరపు కవులు రేపల్లి, చెరుకుపల్లి, పూడివాడ మొదలైన గ్రామాలలోని సభలలో చేసిన అవధానాలను, ఆశుకవిత్వాన్ని గమనించి ఆయా ప్రక్రియలలో గల మెలకువలను తుమ్మలవారు గ్రహించారు. 1926 వ సంవత్సరంలో గుంటూరులో గల కమ్మహాస్టల్‌లో మిత్రుల కోరికపై ఉగాదినాడు తొలి అష్టావధానాన్ని నిర్వహించారు. ఆ తర్వాత కావూరు, ప్రత్తిపాడు, పచ్చతతాడిపర్రులో 1927 లో ఎనమలకుదురు, 1930 లో తోటపాలెం 1944 లో చింతలపూడి 1946 లో కొడూరు 1948 వెలగనేరు, ముసునూరు మొదలైన ప్రదేశాలలో అవధానాలను నిర్వహించారు. గుంటూరులో జరిపిన తొలి అవధానములోని దత్తపది ఋణము, రణము, క్షణము, గణములతో భారతార్థాన్ని ఈ విధంగా చెప్పారు.

ఋణమది తీఱునా కురుకులేశ్వర నీకును రాజ్యలక్ష్మికిన్
రణమొనరింపగా సకలరాజ వరేణ్యులు గూడిదాయ లీ
క్షణమున నేగుదెంచి నిను జిక్కడగింతురు భాగమీనిచో
గణము గలాడనే ననెడు గర్వము చెల్లదయా సుయోధనా !

సీతారామమూర్తి గారి అక్క శేషమాంబ. ఆమె కుమార్తె రాఘవమ్మను వీరు 1921 లో వివాహమాడారు. ఈమె కొద్ది సంవత్సరాలే కాపురం చేసి 12-2-1930 న అనారోగ్యంతో కన్నుమూశారు. తల్లి పట్టుదలతో మిత్రులు దేవయ్యగారు సూచించిన సంబంధం స్థిరపరచుకొని మళ్లీ పెళ్లి చేసుకొన్నారు. వీరి రెండవ భార్య అన్నపూర్ణ.

1947 లో పొన్నూరులో జరిగిన భావనారాయణస్వామి వారి కళ్యాణోత్సవాలలో ఒకనాడు ఒక వ్యక్తి ఆశుకవిత్వాన్ని హేళన చేశారని విని ఆ మరునాడు తన వంతు వచ్చినప్పుడు తుమ్మల సీతారామమూర్తి గారు ఉపన్యాసాన్నిమాని గంటకు రెండువందల పద్యాల చొప్పున మూడువందల పద్యాలలో ఆశువుగా సీతారామకళ్యాణాన్ని వినిపించారు.

గాంధీ గారి జీవితం తుమ్మల వారిని ఎంతో ప్రభావితం చేసింది. ఊరికి దూరంగా ఉన్న ఒక పాఠశాలలో తుమ్మలవారు పని చేసే రోజులలో రోజు తెల్లవారే సరికి పాఠశాల ప్రాంగణమంతా మరుగుదొడ్డిగా మారిపోయేది. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఊరి జనానికి చేసిన విన్నపాలు వృధా అయ్యాయి దానితో తుమ్మలవారు బడి తెరిచే సమయానికి ఒక గంట ముందే వెళ్లి ఆ ప్రాంగణంలో ఉన్నమలాన్ని ఎత్తివేయడం ప్రారంభించారు. ఈ పనిని కొందరు ఎగతాళి చేస్తే కొందరు ప్రశంసించారు. కొందరు పిల్లలు గురువు గారికి సహకరించారు. ఇంత జరిగినా గ్రామస్థులుతమ అలవాటును మార్చుకొలేదు. దీనిని ఎలాగైనా మాన్పించాలని ఒకనాడు తుమ్మలవారు రాత్రివేళ బడిలోనే ఉండి తెల్లవారుజామున చెంబులుపట్టుకు వచ్చిన వారినిచూచి 'అమ్మా ! ఇది బడి ! దీనిని అపవిత్రం చేయగూడదు. మీకోసం అంతదూరంలో రెండుగుంటలు త్రవ్వి ఉంచాము అక్కడికి వెళ్లండి అని వినయంగా చెప్పారు. అంతే ! ఆనాటి నుండి బడిప్రాంగణం అపరిశుభ్రంకాలేదు. తుమ్మల సీతారామమూర్తి గారికంటె గొప్పగా కవిత చెప్పినవారు ఉండవచ్చు. వారికంటె గొప్పపండితులు ఉండవచ్చు కానివారిలాగా చెప్పిన దానిని ఆచరణలో పెట్టి బ్రతికేవారు మాత్రం అరుదు. తుమ్మలవారు నిష్కల్మషమైన, నిరాడంబరమైన, ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపారు.

### 14.1.3 తుమ్మల సీతారామమూర్తి గారి బిరుదములు, సన్మానములు

బాలకవి, అవధాన పండిత, సరసకవి శేఖర, ఆశుకవీంద్ర, గాంధీ ఆస్థాన కవి, విద్వత్కవి సమ్రాట్, జాతీయ కవిబ్రహ్మ, రాష్ట్రీయ కావ్యగ్రణి వంటి బిరుదములు తుమ్మల సీతారామమూర్తి గారిని అయాచితంగా వరించాయి. 'బాలకవి' బిరుదాన్ని కొన్నాళ్లు వీరు ఉపయోగించుకొన్నారు.

గాంధీజీ సిద్ధాంతాలను జీవితాదర్శాలుగా స్వీకరించి, మణులలోని దారంలా ఆ సిద్ధాంతాలను తమ కావ్యాలలో సమన్వయించిన సీతారామమూర్తి గారిని ఆంధ్రదేశం అనేక సార్లు ఘనంగా సన్మానించిది. 1939 లో నెల్లూరు వర్ధమాన సమాజంవారు శ్రీ రామలింగారెడ్డి గారి యాజమాన్యాన ఏర్పాటు చేసిన సన్మానసభలో శ్రీ తిక్కవరపు రామిరెడ్డి గారు తిక్కన పేరుతో బహుమానం సమర్పించి వీరిని సత్కరించారు ఆ సందర్భంలో 'అభినవ తిక్కన సన్మాన సంచికను ప్రచురించారు. 1944 లో ముక్త్యాలరాజాగారి సత్కారాన్ని, తెనాలిలో శ్రీ కాటూరివెంకటేశ్వరరావు గారి అధ్యక్షతన జరిగిన "నవ్యసాహిత్య పరిషన్మహా" సభలో ఆహ్వాన సంఘంవారి సన్మానాన్ని, 1948 లో ముదునూరుపౌరుల ఆదరాన్ని వీరు అందుకున్నారు. 1949 జనవరి 29 న నిడుబ్రోలులో వీరికి జరిగిన సన్మాన సభ వీరి జీవితంలో మహత్తరమైనదని చెప్పక తప్పదు. కనకాభిషేకం, గండపెండేరం, గజారోహణ మహోత్సవం మొదలైన ఉదాత్త సత్కారాలనన్నింటిని వీరు ఆ సందర్భంలో అందుకొన్నారు. ఆ సందర్భంలో వెలువడ్డ 'అభినవ తిక్కన కనకాభిషేకం' అనుసరించిన వారి సాహితీ విలువలకు ఒక మచ్చుతునకవంటిది. 1957 జనవరి 14 న గుడివాడ 'ఆంధ్రనలంద' వీరిని సముచితరీతిని సన్మానించింది. ఆ సందర్భాన గుడివాడ

పురపాలక సంఘం సన్మాన పత్రాన్ని సమర్పించి వీరిని ఆదరించింది. 1957 అక్టోబరు 2 వ తేదీన గాంధీజయంతి నాడు వీరి జన్మస్థానమైన కావూరు గ్రామపౌరులు, వినయాశ్రమ వాసులు స్వయంగా వడికినేయించిన ఖద్దరు వస్త్రాలతో వీరిని తూచి, ఆ వస్త్రాలను వీరిచే బీదలకు పంచిపెట్టించి మహోన్నతమైన సన్మానం చేశారు. వీరి ఉద్యోగ విరమణ సందర్భాన్ని పురస్కరించుకొని అప్పికట్ల పౌరులు 1958 మార్చి 5 వ తేదీన వీరిని ఘనంగా సన్మానించారు. పలుకేంద్రాలలో వీరి జయంతి సభలు ప్రతి సంవత్సరం జరుపబడుతున్నాయి. ఆంధ్ర, మద్రాసు, అణ్ణామలై విశ్వవిద్యాలయ అధికారులు అనేక పర్యాయాలు వీరి కావ్యాలను పాఠ్యగ్రంథాలుగా నిర్ణయించి వీరిని ఆదరించారు.

1939 లో నెల్లూరు వర్ధమాన సమాజంవారు ద్రావిడాంధ్ర గీర్వాణాంగ్ల సాహితీ కవితావిశారదుడు కట్టమంచి రామలింగారెడ్డి గారి అధ్యక్షతన జరిగిన సభలో 'అభినవ తిక్కన' బిరుదు ప్రదానం చేశారు. దీనికి తుమ్మలవారు ఎంతగానో సంతోషించి తన పుస్తకాలు ముద్రించేటప్పుడు అట్టమీద 'అభినవ తిక్కన తుమ్మల సతారామమూర్తి' అని ముద్రించుకొన్నారు. కొన్నేళ్ల తరువాత ఆ విధంగా పుస్తకాల మీద ముద్రించుకోవటం తప్పుగా భావించారు. 1960 లో తుమ్మల వారి జన్మదిన వేడుకను నర్సరావుపేటలోని అభిమానులు కాటూరి వేంకటేశ్వరరావు గారి అధ్యక్షతన ఏర్పాటుచేశారు. తుమ్మల వారిని ఘనంగా సన్మానించి 'అభినవ తిక్కన బిరుదునకు తగినవాడు తుమ్మల' అని సభలోని వారందరు పొగడగా

'నేనేడ దిక్కన్న యేడ దెనుంగు । బాసకు నుసురైన మరమర్త్రి యతడు
ప్రజలార । కవులార । పండితులార । 'యభినవ తిక్కన్న' యను పట్టమునకు
జాలనే, నిది నాకు సైరింపరాని । వ్రేగాయె మీముందు విడిచెదన్ దీని
ని కనన్ను బిలువకుడే పవాదమున'' అని సభాపూర్వకంగా
అభినవ తిక్కన బిరుదును పరిత్యజించి
'పొగరుబోతు తనము పోవనేనై లెస్స
యరసి 'తెనుగు లెంక నైతినేడు
లెంక నానెవండు ? కింకరుడేసుడే
రాజుగాడు రాజరాజు గాడు.'

అని తనకు తానే గౌరవ ప్రదంగా భావించి స్వీకరించిన బిరుదు 'తెనుగు లెంక' తెలుగు భాషకు, తెలుగు తల్లికీ, తెలుగు సంస్కృతికీ నేను సేవకుడిని అనే భావంతో ఈయన పెట్టుకొన్న పేరు ఇది. వినయ, సౌజన్యాలతో తాను సేవకుడిని, దాసుడిని, పరిచారకుడిని అని చెప్పకొన్న గొప్ప వ్యక్తి వీరు. తనను 'అభినవ తిక్కన'గా ఆరాధించిన ప్రజల యెదుట తిక్కనకు సాటి తిక్కనయేనని, తాను మాత్రం తెనుగులెంకనని సవినయంగా పలికారు తుమ్మల వారు. 'లెంక' అంటే సేవకుడు. ఆయన తెలుగుభాషా సేవకుడు

రాష్ట్ర సిద్ధికొఱకు రక్తమ్ముగార్చిన
కవిని నేను, గాంధి కవిని నేను
బడలిబడలి తల్లి బాస కూడెముసేయు
కవిని నేను, దేశి కవిని నేను'

అని తుమ్మల వారు సగర్వంగా ప్రకటించుకొన్నారు. తుమ్మలవారు పల్కిన ఒకచక్కని పలుకు
"పెక్కుబాసలకెగబడి యొక్కనుడియ
రాని దుర్గతికలవాడగాను నేను
నేర్చిన యొకండు గట్టిగా నేర్చినాడ
గూర్చిన రవంత తిన్నగా గూర్చినాడ"
అని తన మనోభావాన్ని విస్పష్టంగా ప్రకటించారు తుమ్మలవారు.

తుమ్మల సీతారామమూర్తి గారి జయంతి సభలు తెనాలి, బాపట్ల, చీరాల, గుంటూరు, విశాఖపట్నం, నరసాయపాలెం వంటి ఎన్నో ఊళ్లలో ఘనంగా జరిగాయి. 1969 డిసెంబరు 26 న ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ బిరుదమునిచ్చి సత్కరించింది. విశాఖపట్నంలో సీతారామమూర్తి సహస్రచంద్ర దర్శనం మహోత్సవంగా జరిగింది. 1980 లో చీరాల లయిన్స్ క్లబ్‌వారు గాంధీ జయంతి సందర్భంగా తుమ్మల వారిని సత్కరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిన సందర్భంగా హైదరాబాద్‌లో ఘనసన్మానం జరిగింది. భారత ఉత్సవాల సందర్భంలో తుమ్మల వారిని గుంటూరులో సత్కరించారు. మద్రాస్ మహనగరంలో 1948 లో L.V. రామయ్య ఫౌండేషన్ వారు తుమ్మలవారిని సన్మానించారు. "నాగార్జున విశ్వవిద్యాలయం 3-2-1985 న 'డాక్టర్ ఆఫ్ లెటర్స్' బిరుదు నిచ్చి సత్కరించింది."

తుమ్మల సీతారామమూర్తి గారు 1990 మార్చి 21 న సాయంత్రం 6.55 నిమిషాలకు అప్పికట్లలో మరణించారు. ఆయన మొదటి వర్ధంతి సభ 1991 లో చీరాలలో జరిగింది. తుమ్మల వారు మాటదారి, రచనదారి, బ్రతుకుదారి ఒక్కటిగా మనకలేని మనుగడ సాగించిన మహనీయులు. 2001 లో తుమ్మల వారి శతజయంతి సభలను వాడవాడలా సర్వాంగసుందరంగా నిర్వహించారు. వారి కావ్యాలన్నింటిని నాలుగు సంపుటాలుగా మరలా ముద్రించారు తుమ్మల శతజయంతి ఉత్సవ సంఘాన్ని గుంటూరులో ఏర్పరచి తుమ్మల శతజయంతి ప్రచురణ పేర 24 డిసెంబరు 2001 నాడు ప్రకటించిన తెనుగు లెంక తుమ్మల సమగ్ర సాహిత్యము' పేర వెలువడిన మొదటి గ్రంథం బాపూజీ ఆత్మకథ రెండవ గ్రంథం 'మహత్మకథ' దీనికి అనుబంధంగా గాంధీమహత్ముని నిర్యాణ వార్త విని 1958 ఫిబ్రవరిలో 'అమరజ్యోతి' అనే పేర తుమ్మల వారు వ్రాసిన 55 పద్యాలు ప్రచురింపబడినవి. తుమ్మల వారు వ్రాసిన 15 ఖండికలతో ఖండకావ్య సంపుటంగా మూడవ గ్రంథం ముద్రింపబడింది. 10 ఖండికలతో ఖండకావ్య సంపుటంగా నాలుగవ గ్రంధ ముద్రణ జరిగింది. ఇవికాక తెనుగు లెంక తుమ్మల శతజయంతి సంచిక, డాక్టర్ సూర్యదేవర రవికుమార్ రచించిన 'అమరామర వాఙ్మయమూర్తి తుమ్మల సీతారామమూర్తి' అనుపేర తుమ్మల శతజయంతి ప్రచురణ పుస్తకములు వెలువడ్డాయి.

### 14.1.4 తుమ్మల సీతారామమూర్తి గారి రచనలు:

గాంధీకావ్యాలు - ఆత్మకథ, మహాత్మకథ, అమరజ్యోతి, సర్వోదయగానం, గాంధీగానం, మహాత్మాగాంధీ తారావళి.

రాష్ట్రకావ్యాలు - రాష్ట్రగానం, ఉదయగానం,

ఖండకావ్యాలు - పఱిగపంట, పెద్దకాపు, శబల, పైరపంట, సమదర్శి, కదంబకైత, చక్కట్లు, దివ్యజ్యోతి.

కథాకావ్యాలు - ఆత్మార్పణం, ధర్మజ్యోతి,

సామాజిక కావ్యాలు - ఎక్కట్లు, సందేశ సప్తశతి,

స్వీయచరిత్ర కావ్యాలు - నేను, నా కథలు, తపస్సిద్ధి

వేదాంత కావ్యాలు - గీతాదర్శం, భజగోవిందం, లక్ష్మీనృసింహ స్తోత్రం, హనుమాన్ చాలీసా,

నీతి కావ్యాలు - తెనుగునీతి, నీతికుసుమం.

స్మృతికావ్యాలు - రామకృష్ణస్మృతి.

శతకములు - పురాంతక శతకము, రామశతకం, రామలింగేశ్వర శతకం,

జంగంకథలు - బిల్వణీయం

నాటకములు - గిరిజాపరిణయం, హనుమద్విజయం, మాహేంద్ర జననం

హరికథలు - అన్నదాన మహత్యం, సాత్రాజితీ పరిణయం నామదేవచరితం.

### 4.1.5. తుమ్మల సీతారామమూర్తి గారి వాఙ్మయ సమీక్ష:

ఎ) ఆత్మకథ: తుమ్మల సీతారామమూర్తి గారికి 1920 వ సంవత్సరము నుండి మహాత్మాగాంధీ ఎడల అవ్యాజమైన గౌరవాదరాలు ఆరంభమైనవి. ఆ అనుభూతి వల్లనే 'ఆత్మార్పణ' మను కావ్యాన్ని మరికొన్ని ఖండకావ్యాలను వారు రచించారు. 1927 తుమ్మలవారి

మిత్రుడు పోలిసెట్టి ఆదినారాయణగుప్త గారు గాంధీ ప్రకటించుచున్న ఆత్మకథను వీరి దృష్టికి తెచ్చి దీనిని పద్యరూపంలో రచించి మీ కవితా శక్తిని సార్ధక పఱుచుకొనుట లెస్స' అని పల్కి ప్రోత్సహించారు. 1932 అక్టోబరు రెండవ తేదీన కావురులో మహాత్ముని జన్మదినోత్సవంలో పాల్గొన్న రోజునే బాపూజీ ఆత్మకథకు శ్రీకారం చుట్టారు. 7.2.1934 న మొదటి పాలు పూర్తి చేశారు. కాని మహాత్మునివంటివాడు ఆచి తూచి వ్రాసికొన్న ఆత్మకథను పద్యరూపమున వ్రాయుట మిక్కిలి కష్టమని భావించారు. ఒకవేళ ఆ రచనలో కృతకృత్యుడనైనను తాను పడిన ప్రయాస లోకమున కెంతవరకు ఉపయోగపడునా అని మథనపడ్డారు. తరువాత పరిస్థితులు అనుకూలించుటతో మధ్యలో ఆపిన మహాత్మకథను 26-1-1951 న పూర్తిచేశారు. ఈ గ్రంధము పూర్తియగుసరికి అనేక సంవత్సరాలు గడిచినను తాను శ్రమించిన దినాలు మాత్రము 554 అని తుమ్మలవారు ప్రకటించారు.

నిత్యసత్యవ్రతుడై, అహింసానిరతుడై, సుఖవాంఛా విముఖుడై, కష్టానుభవకాముకుడై, పతితోద్ధరణ పరమలక్ష్యమునకు జీవితమంతా ధారవోసి ప్రపంచశాంతి కొఱకు ప్రాణములర్పించిన కరుణామూర్తి మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ.

కట్టమంచి రామలింగారెడ్డి గారు 'బాపూజీ ఆత్మకథకు పీఠకను రాశారు. దీనికి వారు పెట్టిన పేరు 'తిలకరచన' 2.4.1937 న అప్పటికి ప్రచురింపబడిన 'ఆత్మకథా' భాగమును చదివి తుమ్మల సీతారామమూర్తి చౌదరి గారికి కట్టమంచి వారు ఈ విధముగా లేఖలో వ్రాశారు. "తమచే రచింపబడిన 'ఆత్మకథ'ను చదివి ఆశ్చర్యమును ఆనందమును జెందితిని. విషయము గాంధీమహాత్ముని స్వీయచరిత్రము లోకారాధ్యమైనది. తమ శైలియించుమించు ఆంధ్రమహాభారత ప్రతిబింబము ....... మీరుధన్యులరు. మాతృభాష యొక్క సుకృతములఫల మనదగిన కావ్యమును, పూజనీయమైన విషయ శోభితమును తదనుగుణమైన రీతిని వ్రాసి స్థిరయశస్సు గాంచిన కవులని మిమ్ము అయాచితముగ ప్రశంసించి నా కుతూహలమును తమకు నివేదించుచున్నాను..... మన చౌదరి యతిప్రాసములకై భంగపాటు చెందితలగోకికొనుచు బలాత్కార పదప్రయోగముల చేసి, అర్థము ననుసరించి పదములు వాడక, పదముల బట్టి అర్థమును వంపులు పెట్టి వంగజేయు నీరసుడుగాడు. భావమనర్గళముగ ప్రవహించు చందాన వ్రాయుమహనీయుడు, యతి పదాదియందేకాక మధ్యమముననుగొనను వ్రాలును. ప్రాసమునకు, యతికినై పద్యము యొక్క నడక నిలిచి దాడివలసిన యిబ్బందిలేదు. అర్థమును బట్టి పదములు, పదములలో లీనమైనరీతిని యతిప్రాసములు ననాయాసముగ, నప్రయత్నముగ, స్వచ్ఛందంగా వచ్చి చేరుచుండును. ఈ సిద్ధియందు ప్రసిద్ధుడు తిక్కన. ఈ వర్గమున తిక్కనతో సజాతీయుడైనవాడు మన చౌదరి.... మహనీయమైన కార్యదీక్షకు బురికొల్పు గ్రంధములలో నీయాత్మకథకు మించినది ఈ దేశమున, ఈ కాలమున మఱియొండులేదు. సరస్వత్యారాధన తోడ దేశారాధనమునేసి శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరి విజయం సాధించాడు. తుమ్మల సీతారామమూర్తి మహాత్ముని యొక్క ఆస్థానకవి. ఈ స్థానము శాశ్వతము.

'ఆత్మకథ' జీవధర్మ మర్యాదకొక్క
వ్యాఖ్యగా సంతరించి 'మహాత్మకథను
నీశ్వరైక్యము భావించె, నాంతకంటె
నుండెనే యొండొక కవిత్వయోగసిద్ధి

అని శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారు తుమ్మల వారిని ప్రశంసించారు.

కవులు తాము వ్రాసిన కృతికి ఒకరిని అధినాయకునిగా చేయటం తెలుగునాట గల సంప్రదాయం. నన్నయభట్టు తన భారతాన్ని రాజరాజనరేంద్రునకు అంకిత మిచ్చినట్లు వాచ్యంగా చెప్పలేదు. అయినప్పటికి రాజరాజనరేంద్రుని 'అనుమతి' తోనే భారత రచన ప్రారంభించాడు. సప్తసంతానాల్లో ఒకటిగా కావ్యాన్ని పేర్కొంటు, ఆ సంతానాలలో అదే ప్రశస్తమైందిగా చెపుతూ దానిని గురువుకో, ఇష్టదైవానికో, రాజుకో అంకితమిచ్చే సంప్రదాయాన్ని వెన్నెచోడుడు సూచించాడు. ఇహపర సౌఖ్యాలలో ఏదో ఒకదానిని ఆశించి కవులు కృతిపతులను ఎన్నుకొనేవారు. ఈ సంప్రదాయానికి భిన్నమైన ఒక సంప్రదాయాన్ని సృష్టించారు తుమ్మల సీతారామమూర్తి గారు దైవాంకితాన్ని వీరు అంగీకరించలేదు. కృతిపతిత్వం కోరివచ్చిన వారికే కావ్యాలను అంకితం చేయటం కవులకు సర్వసాధారణం తుమ్మల వారి పద్ధతి దీనికి వ్యతిరేకమైనది. కవే కృతిపతిని వెదకి పట్టుకోవాలని వీరి అభిప్రాయం. ఈ దృష్టితోనే తుమ్మల వారు తమ కావ్యాలకు కృతిపతులన్ను

ఎన్నుకొన్నారు. అయితే ఆ విషయం ఆ వ్యక్తికి ఆ కావ్యం అచ్చయి ప్రచారంలోనికి వచ్చేదాకా తెలుపకుండా ఉంచటం తుమ్మల వారి మరో ప్రత్యేకత

"ఎతనింగృతిపతి నొనరిం। చితినతనికినైన నవ్విశేషము కృతిము
ద్రితమగుదనుకం జెప్పను। వ్యతిక్రమము లేని నియతి యౌనిదినాకున్"

అని పలికారు. 'ఆత్మకథ' తొలిభాగాన్ని 1936 లో అచ్చువేయించినపుడు దానిని ఎవరికీ అంకితమీయలేదు. ఆ తర్వాత దీనిని బాపూజీ అనుచరుడు, తన జీవితాన్ని సేవాదీక్షతో నడిపినవాడైన శ్రీ ఎర్నేని సుబ్రహ్మణ్యం గారికి అంకితంగా తుమ్మల వారు సమర్పించారు.

'ఆత్మకథ' కృత్యాదిలో భరతమాతను శ్రీ తుమ్మల వారు ఈ విధంగా కీర్తించారు.

'వీరుల్ త్యాగలు దేశభక్తులు జగగుద్విఖ్యాతాకీర్తి ప్రభా
శ్రీరోచిష్ణులు బుద్ధ శంకర శివాజీ గాంధి గంగాధరా
న్సారీ ముఖ్యలు పుత్రులే జననికిన్ జన్మించి ర గ్గౌరవా
ధారన్ భారతమాత నెంతు జరితార్థత్వంబు నర్థించుచున్'

తర్వాత ఇష్టదేవతా నమస్కృతి, గురుస్తుతి, పురాతన కవి పుంగవస్తుతి కుకవి నిరాకృతిని చేసి ఇంచుకవంశ వర్ణన చేశారు.

పద్యరచన యొక్క ఆవశ్యకతను, పద్యానికున్న ప్రత్యేకతను తుమ్మలవారు ఈ విధంగా పేర్కొన్నారు.

'పద్యంబు సర్వకవితల కాద్యంబై గానబద్ధమై శ్రుతిహితమై
హృద్యంబై నియతంబన, వద్యంబై లెస్సతోడువడు ధారణకున్ !

గురుశుశ్రూషాదులచే పొందబడిన విజ్ఞాన మాధారంగా బాల్యం నుండి పెక్కు కావ్యాలు వ్రాసినను తృప్తి కలుగకపోవుటచే ఒక మహాకావ్యాన్ని రచించాలని నిశ్చయించుకొన్నారు.

తెలుగు వారికి గద్యము చదువుటకంటె పద్యము చదువుటయందే ఆసక్తియని పలికి ఆకారణముననే తెలుగు సాహిత్యమునందు తొల్లిటి నుండి పద్యపుగ్రుతుల్ ప్రజలన్ దనియించి గౌరవాభ్యుల్లసితంబులై వెలయుచున్న'వని తుమ్మల వారు తన పద్యరచనను సమర్థించారు.

తుమ్మల సీతారామమూర్తి గారు రచించిన 'బాపూజీ ఆత్మకథ పద్యకావ్యం 41 గద్యపద్యాలతో గూడిన ప్రస్తావనతో ఆరంభమైంది. గాంధీ గారు తాను వ్రాసిన ఆత్మకథకు 'సత్యాన్వేషణలో నా అనుభవాలు' (My experiences with truth) అని పేరు పెట్టారు. తుమ్మల వారు తాను వ్రాసిన ప్రస్తావనలో సత్యస్వరూపాన్ని సత్యవాక్కుల విశిష్టతను వివరించారు. ఆ తర్వాత మొదటిభాగంలో 25 శీర్షికలు, రెండవభాగంలో 29 శీర్షికలు, మూడవభాగంలో 23 శీర్షికలు, నాల్గవభాగంలో 47 శీర్షికలు, ఐదవభాగంలో 44 శీర్షికలు తుమ్మల వారిచేత 'ఆత్మకథ'లో ఉంచబడ్డాయి. ప్రథమభాగంలో మొదటి శీర్షిక జన్మాదికము.

'కలదుగదా ! భరతోర్వీ తిలకంబగు ఘూర్జరాఖ్యదేశము; దానన్
దులలేని పేరు పెంపుల జెలువొందు "గతియవాడు" సిరికింగుదురై

అనెడి పద్యంతో ఆరంభమైంది.

బాపూజీ స్వీయ చరిత్రను ఆయన మాటలలోనే మధుర పద్యకృతిగా మార్చి వ్రాయుటం తుమ్మల వారి ప్రతిభకు తార్కాణం. ఈయన జాతీయావేశము దేశభక్తి కలవాడు కనుకనే బాపూజీ, ఆత్మకథను ఆత్మకథగానే పద్యకావ్యంగా గూర్చి ఆంధ్రభాషలో ఈ కావ్యానికి తద్వారా తనకు ప్రత్యేకస్థానాన్ని ఆర్జించుకొన్న అభినవ తిక్కన తుమ్మల సీతారామమూర్తి గారు.

బాపూజీ ఆత్మకథ పవిత్రమగు ఇతివృత్తమే కాని దీనియందు కవిప్రతిభను ప్రదర్శించుటకై వెసులుబాటు తక్కువ. గాంధీ యేమాటను తనను గూర్చి చెప్పునో ఆ మాటనే యథాతథంగా పద్యంలో బిగింపవలెను. ఏ శబ్దము హెచ్చినను అతిశయోక్తియగును.

ఇటువంటి కావ్యములలో కవి యెంత సమర్థుడైనను కృతార్థుడగుటకు అవకాశం చాల తక్కువ. దీనికి సాహసించి ఆరంభించుటలో ఈ కృతికర్త యాత్మ విశ్వాసం ప్రకటితమైంది. ఈ ఇతివృత్తమును కావ్యవస్తువుగా స్వీకరించుటలో తుమ్మల వారికి బాపూజీపై గల భక్తిశ్రద్ధలు తెలియుచున్నవి.

"నీపల్కులు విశ్వతమో
దీపంబు లఖండసత్యధీ రూపంబుల్
నా పల్కులనిడి నేటికి
బాపూజీ ! శాంత పట్టభద్రుడనైతిన్" అను పద్యము దీనికి ఉదాహరణము.

బాపూజీ ఆత్మకథలో చివరి శీర్షిక 'స్వస్తి'. ఇందులోని చివరి పద్యములు ఇవి:

'ఈ వినయప్రాప్తికి బర, మావధి నాదగు నహింస; యవ్వినయములే
కేవాడును ముక్తుడుగా డీవాకున కనుభవంబ హేతూద్ధమగున్
ఏతాదృగ్వినయమునకు, జోతలు చెల్లింతు నిట్టి సుగుణమునేలన్
జాతును జగదాధృతి, నీ చేత నికన్నిలిపి స్వస్తిసెప్పెదనెలమిన్ !

ఈ 'ఆత్మకథ'లో బాపూజీ జననం నుండి సహాయనిరాకరణోద్యమానికై నాగపూరులో జరిగిన సభవరకు గల జీవిత చరిత్ర కలదు. బాపూజీ జీవితమున ప్రతిఘట్టము నొక్కొక సత్య నిరూపణ చేయును. అవి మన భారతీయులకే కాదు విదేశీయులకు కూడ ఆచరణీయములు, నిత్యపారాయణములు. కావ్యములో మొత్తమున చిన్నపద్యముల సంఖ్య ఎక్కువ. కందము, తేటగీతి, ఆటవెలది నడపుటలో తుమ్మల వారు సిద్ధహస్తులు.

గాంధీనౌకా యాత్రలో

"రంగత్తుంగ తరంగాళి జెలంగుచుండె రత్నాకరము
ప్పొంగుచునేనావిరి పడవంగట్టెక్కితిని మిత్ర వర్గముమెచ్చన్"

కందపద్యరచన ఎంతో అందంగాసాగింది. బాపూజీ తన చేతివ్రాత బాగా ఉండనందుకు ఎంతగానో విచారించేవారు. విద్యార్థిలోకానికి సూచనగా ఆయన ఇలా అంటారు.

"ముద్దుగుల్కు నాణిముత్యాలపోలిక
వ్రాలు వ్రాయునేర్పువడయు కొఱకు
నన్నుజూచి యెల్ల పిన్నలు శ్రద్ధవ
హింత్రుగాక కడు రహింత్రు గాక"

ఇచ్చిన మాటను తప్పనివాడు తన కుమారుడైన గాంధీ అని భావించి ఆతని తల్లి పుత్తలీబాయి గాంధీచేత "మాంసమును మెక్క మద్యంబు మరగనొల్ల, నంగనను దాకనని యతండపుడు మూడు బాసలాడించె". నవ్వలనాసవిత్రి, సమ్మతింజూపె మత్ప్రయాణమ్మునపట్ల సీమకు వెడలి యెన్నియిడుములనైన బడి తల్లికిచ్చిన వాగ్దానమును నిలబెట్టుకొని సీమ నుండి తిరిగివచ్చి తల్లికి ఆనందంగా తెలియచేద్దామని భావించిన గాంధీకి తల్లిదర్శనముకరవైపోయింది.

'నాకుంబిన్నటగోలె ముద్దుమెయి నానాధర్మముల్ నిర్మల
శ్లోకులుపోయిన పోకడల్గఱపి నాలో నింత యాస్తిక్యమున్
రేకెత్తించిన సాధుశీల జనయిత్రిం గొల్చిపాపాగ్నికీ
లాకుల్యల్ తెగటార్పనైతి విధియేలా మారునంచేడ్చితిన్"

అని దుఃఖపడినాడు.

బాపూజీ యొక్క స్వాతంత్ర్య వాంఛను తుమ్మల వారు ఈ విధంగా ప్రకటించారు.

త్రాసునం బొకమై స్వతంత్రను నిల్పి
వేయి పాండిత్యముల నొందు చాయనిలిపి
తూచునప్పుడు వ్రేకున యేచి స్వేచ్ఛ
దెసకములు చూపునంట పెంపెసగుమాట.

భారతీయులందరికీ నిజమైన శాంతి ఎప్పుడుకలుగుతుందో వివరిస్తూ బాపూజీ ఇలా భావించినట్లు తుమ్మల వ్రాశారు

మారుబట్టలేక మానమ్ము నిల్పుకో
దగిన తెరవులేక తల్లడిల్లి
పనికిరాని ప్రాత తునుకలతోనిల్పు
నింతిలేనినాడె శాంతి మనకు" అంటారు ఈయన.

తాను రచించిన గాంధీజీ ఆత్మకథను గురించి తుమ్మల సీతారామమూర్తి ఇలా అన్నారు. " నా కృతులన్నింట నుత్తమము, పవిత్రమునైన యీ కావ్యము నా సారస్వతానుభూతికి, నా తెలుగుదనమునకు మూదలగా రూపెత్తుట నా భాగ్యమని తలంతును."

**బి) మహాత్మకథ:** బాపూజీ 'ఆత్మకథ' తుమ్మల సీతారామమూర్తి గారిచే చేయబడిన అనువాద రూపమైన పద్యకావ్యము. గాంధీజీ రచించిన స్వీయచరిత్రకు అనువాదంగా ఈ రచన సాగింది. ఆ తర్వాత తుమ్మల వారు రచించిన పద్యకావ్యం 'మహాత్మకథ'. 'ఆత్మకథ' గాంధీమహాత్ముడు తానుగా చెప్పుకొన్న రచన. ఇది ఆయన సత్యాన్వేషణ. 'ఈ ఆత్మకథను సహాయ నిరాకరణోద్యమంతో ఆపిన గాంధీమహాత్ముడు ఇక్కడ నుండి నా జీవితంలో జరిగిన విషయాలలో ప్రజలకు తెలియనివి లేవు' అని ముగించారు. ఇందులో 1921 వ సంవత్సరం వరకు నడచిన తన బ్రతుకును గాంధీ గారు స్వీయచరిత్రగా వ్రాసుకొన్నారు.

బాపూజీ జీవిత చరిత్రలో జరిగిన కొన్ని సన్నివేశాల వరకే 'ఆత్మకథ' వివరిస్తుంది. ఇది ఒక అసంపూర్ణమైన రచన. బాపూజీ జీవితాన్ని ఆమరణాంతం జాతికి తెలియజేయటానికి వ్రాసిన కావ్యం 'మహాత్మకథ'. 'ఆత్మకథ' గాంధీగారి సత్యాన్వేషణ. మహాత్మకథ ఆయన సత్యాచరణ, స్వరాజ్య సంపాదన యత్న ఫలితాల వ్యాఖ్యానం. 'ఆత్మకథ అనువాద గ్రంథం 'మహాత్మకథ' స్వతంత్ర కావ్యం.

మన భాషలో 'మహాత్మశబ్దంతోపాటు మహానుభావులు, మహామహులు, మహాశయులు, మహోదయులు మొదలైన శబ్దాలు చాలా ఉన్నాయి. కాని 'మహాత్మ' శబ్దంతో సమానమైన పదం మరొకటి లేదు. మహాత్మ శబ్దము గాంధీశబ్దానికి పర్యాయపదంగా, యోగరూఢంగా లోకమంతటను వ్యాప్తమయ్యింది. 'మహాత్మ' అనగానే గాంధీజీ అను అర్థము రూఢియైంది. గాంధీగారి ఆత్మమహత్వమును గుర్తెరిగిన లోకమే కాలక్రమంలో ఆయనను మహాత్ముడని వ్యవహరించింది. లోకోత్తరమైన గుణాలన్నిటికిని మూలమైన ఆత్మమహత్వమును బట్టియే గాంధీగారు మహాత్ములైనారు.

'మహాత్మకథ' పేరుతో తుమ్మల సీతారామమూర్తి గారు రచించిన పద్యకావ్యం లాల్‌బహద్దూర్‌శాస్త్రి గారికి అంకితం చేయబడింది. లాల్‌బహద్దూర్‌శాస్త్రి గారు గాంధీ గారి శిష్యులలో గణనీయుడైన మహనీయుడు. 'సత్కృతి' అనెడి శీర్షికతో 65 పద్యాలను అంకిత పద్యాలుగా తుమ్మలవారు వ్రాశారు.

సత్కృతమున్ మహాత్మకథ నీ కావ్యంబు నీ కంకితంబొనరింతున్ - ఈ పాలి నీకుగా కెవనికిచ్చెద - ననిపల్కి లాల్‌బహద్దరు శాస్త్రి గారికి సమర్పించారు తుమ్మల.

'ఇది మహాత్మకథా ఖ్యానెసగు నాత్మకథను దెనిగించినుతిగన్న కవి మహాత్మ కథను వర్ణింపవలెకదా ! కర్గమిట్టి, దవుట సమకట్టి నాడనీ కవికిపుడు అని 'మహాత్మకథారచనకు ప్రకమించినారు తుమ్మల.

పలికెడిది గాంధికథయట, పలికించెడివారు తెనుగు బ్రజలట దీని
బలికిన మాటట యౌనట, పలికెదనికనొండు మఱచిబాపు చరిత్రన్.

అని పోతనామాత్యుడు తన ఆంధ్రమహాభాగవత రచన సమయంలో
"పలికెడిది భాగవతమట పలికించెడివాడు రామభద్రుండటనే
బలికిన భవహరమగునట" అని పలికినట్లు తాను పలికి గాంధీమహాత్ముని కథకు పరమ పూజ్యత్వాన్ని ఆపాదించారు.

'మహాత్మకథ' నాలుగు భాగాలుగ రచింపబడిన పద్యకావ్యం. మొదటి భాగం 1919 రౌలటు చట్టానికి సంబంధించిన విషయంతో ఆరంభమైనవి. రెండవభాగంలో 1930 వ జరిగిన ఉప్పుసత్యాగ్రహం, 'హరిజన' పత్రికావతరణము, ద్వితీయ ప్రపంచయుద్ధము మొదలగు విషయాలను, మూడవభాగం 1940 నుండి ఆరంభమై 'క్విట్ఇండియా' ఉద్యమం, కస్తూరిబాయి నిర్యాణం, బెంగాల్‌లో బాపూజీ పర్యటన మొదలైన విషయాలను, నాలుగవభాగంలో 1947 నాటిసంఘటనలు 1948 లో గాంధీ నిర్వాణం మొదలైన విషయములు వివరింపబడినవి. ఆ తర్వాత దీనికి అనుబంధంగా 1948 ఫిబ్రవరిలో 'అమరజ్యోతి' అనుపేర గాంధీజీ మరణవార్త విని దుఃఖపూరిత మనోభావనతో తుమ్మల సీతారామమూర్తి గారు 55 పద్యాములను రాశారు.

'మనుజుడవుగావు నీవు కోమటివిగావు బడలిపోయిన భారతీయుడవుగావు
కావుగాంధివి లోకలోకములవెల్గు జూపు నిరవధి కామరజ్యోతి వోయి !
'పతితజగత్సముద్ధరణ భారము నేదలదాల్చి ధాత్రిపై
బ్రతికిన యన్నినాళ్ల పలుభంగుల గర్మము లాచరించి
తుటతుదకు నిర్మమత్వము కడల్కొన బంధములూడ్చి భారతీ
యతకు మెఱుంగు పెట్టిన మహాత్మ ! భవత్కథమమ్ము దేర్చుతన్.
అని పలికి తుమ్మల సీతారామమూర్తి గారు 'మహత్మకథను ముగించినారు.

## 14.1.6 తుమ్మల సీతారామమూర్తి గారి ఖండకృతులు

తుమ్మల సీతారామమూర్తి గారు అనేకములైన ఖండకావ్యాలనే కాక వివిధాలైన పత్రికలకు, సంపుటాలకు పలుశీర్షికలతో ఖండికలను వ్రాసివారు. ఈయన రచించిన ఖండకావ్యములనేకములు ప్రజాదరణకు గురియైనవి. 1919 లో వీరు రామశతకాన్ని, రామలింగేశ్వర శతకాన్ని రచించారు. 1921 లో మహత్మాగాంధీ తారావళి, 1923 మాహేంద్రజననం (నాటకము), 1923 లో రామకృష్ణస్మృతి, 1930 లో ఆత్మార్పణం, 1938 లో రాష్ట్రగానం, 1942 లో ధర్మజ్యోతి, 1943 లో పఱిగపంట, 1949 లో తపస్సిద్ధి, 1955 లో శబల, ఉదయగానం, 1961 లో సర్వోదయ గానం, 1961 లో గీతాదర్శం, 1964 లో పఱిగపంట, 1967 లో సమదర్శి 1973 లో నాకథలు, 1976 లో ఎక్కట్లు, 1978 లో హనుమాన్ చాలీసా, 1981 లో సందేశసప్తశతి, 1983 లో కదంబకైత, 1987 లో గాంధీగానము, 1993 లో చక్కట్లు, 1994 లో దివ్యజ్యోతి అనెడి ఖండకావ్యాలను రచించారు.

తుమ్మల శతజయంతి ఉత్సవ సంఘం, గుంటూరు వారు తెనుగులెంక తుమ్మల సమగ్రసాహిత్యం అనుపేరు నాలుగు సంపుటాలను ప్రచురించారు. ఇందు ప్రథమ సంపుటం బాపూజీ 'ఆత్మకథ'కాగా రెండవది 'మహత్మకధ' మూడవ సంపుటంలో తుమ్మలవారు రచించిన 10 ఖండకావ్యాలు నాలుగువ సంపుటం నందు 15 ఖండకావ్యాలను ప్రచురించారు. గుంటూరులోని జాగ్గరమూడి కుప్పుస్వామి చౌదరి కళాశాల ప్రాంగణంలో తుమ్మల సీతారామమూర్తి సాహిత్యపీఠము ఏర్పాటుగావింపబడి సాహితీ సమాలోచనలకు ఉత్సాహ, ప్రోత్సాహములను కల్పించుచున్నది.

**ఎ) ఆత్మార్పణము:** ఇది 190 గద్యపద్యాలతో గూడిన ఖండకావ్యం. ఆంధ్రమహాభారతంలో తిక్కనసోమయాజి రచించిన 'లుబ్ధకపోతోపాఖ్యానం' 34 గద్యపద్యాలతో కూడిన కథ. తుమ్మల వారు 1928 మే నెలలో ఒక సాయంత్రం మిత్రులతో షికారు వెళ్లి ఊరిబయట పచ్చికబయళ్లలో ముచ్చటలాడుతున్నప్పుడు ఓ ఎఱుక ఒక పెంటిగువ్వను చంపగా ఆ విషాద చేష్టను చూచి వీరి మనస్సు వేదనాభరితమయ్యింది. ప్రక్కనున్న స్నేహితులు తుమ్మలవారిని ఈ ఇతివృత్తంతో ఖండకావ్యాన్ని వ్రాయమని పురికొల్పారు. ఆ ప్రేరణ 'ఆత్మార్పణం' కావ్యరూపాన్ని సంతరించుకొన్నది. తరువాత 'భారతి' సాహిత్యమాస పత్రికలో ప్రచురింపబడి వ్యాప్తికెక్కింది. ఈ ఇతివృత్తాన్నే

గ్రహించి వేటూరి ప్రభాకరశాస్త్రి గారు 'కపోతకథ'ను గద్యపద్యాలతో రాశారు. తుమ్మలవారు తమ 'ఆత్మార్పణము' కావ్యాన్ని మరణించిన తన భార్యకు అంకితంగా సమర్పించారు. ఆమెనుస్మరిస్తూ

'నీకు - సాధ్వీవ్రతంసవౌ నీకు - నిర్భ, రాత్మగౌరవ సంపూర్ణవైననీకు
నిర్మల ప్రేమ చిహ్నమైనివ్వటిల్ల, నంకిత మొనర్తు నీకృతినందుకొమ్మ.

అంటారీయన. 'ఆత్మార్పణం' కావ్యకథ చాలా ఉదాత్త మహనీయమైంది. పక్షులను వేటాడి చంపి తన జీవనాన్ని కొనసాగిస్తున్న ఒక బోయవాడు ఒకనాడు తీవ్రమైన జడివానలో అడవిలో చిక్కుకొనిపోయాడు.

'దుర్గమారణ్య మదిగాక దుర్దినంబు వెండియుం జడివానపైపెచ్చమాస
నల్లవో। యేమి సెప్పెద నాటిరేయి, కాటగ్రమ్మిన చిమ్మచీకట్లు పేర్చి

ఆ చీకటిలో, జడివానలో, చలిగాలి తాకిడికి తట్టుకోలేక ఆ బోయవాడు మరణభీతిని పొందాడు. ఆ స్థితి తాను చేసిన పాపాలకు ఫలితమనుకొన్నాడు

కట్ట దయ వీడి యీపాడు పొట్ట కొఱకు, నింతవఱకెన్ని పుల్గులనేసిచంపి
జంట లెన్నిటి నేడ్పించి యుంటి, కడకు గుడువంగ వలదెతత్కలుష సలము

అని వేదన పొందాడు. ఒక మఱ్ఱిచెట్టు మొదట గల కటికరాయి మీద ముడుచుకొని పడుకొన్నాడు. ఆ చెట్టు తొర్ర ఒక పావురముల జంటకు నివాసస్థానం. ఆడు పావురం మేతకై గూడ విడచి వెళ్లి తిరిగిరాలేదు కారణం ఆ బోయవానికి బందీగా చిక్కింది. మగపావురం తన పెంటి పావురం తిరిగి గూటికి రానందుకు విచారించటం మొదలుపెట్టింది. పరిపరివిధాలుగా తలపోసింది. జీవించి ఉన్నట్లయితే ఆ సమయానికి తన వద్దకు వచ్చి ఉండేదని అప్పటికి బ్రతి లేదేమో అని విలపించింది. విధివిలాసమనుకొన్నది. తమ దాంపత్యాన్ని స్మరించింది.

అఱలేని కూర్మిపేర్మిం, బొరపొచ్చము లేనిడెందము జూపిననుం
గరమునలరించితి గదా, గరితా ! నిన్నెట్లుమఱవ గలవాడ నికన్'

అని ఆమె ప్రేమను, మందస్మిత సుందర వదనాన్ని తలచుకొని ఆమె లేనిచో తన ప్రాణములు నిలువవని పలికింది.

మగపావురం యొక్క మానసిక స్థితిని, తన ప్రియురాలిని గూర్చి విలపించిన రీతిని తిక్కన ఒక్కసీసపద్యంలో మాత్రమే చెప్పగా అభినవ తిక్కన తుమ్మల వారు 13 చక్కటి పద్యాలలో చెప్పారు. ఈ పద్యాలలో ఆలుమగలు అన్యోన్యతను, సఖీ వియోగిన్ని మనోహరంగా వర్ణించారు. ఇవి కథాసందర్భానికేకాక, తుమ్మలవారి వ్యక్తిగత జీవితానికి కూడా చక్కగా అతుకుతాయి. అందుకే ఈ రచనను తన తొలి అర్ధాంగికి అంకితమిచ్చారు.

తన భర్త తన పరోక్షంలో తనపై ప్రకటించిన ప్రేమను తెలిసికొని బోయవానికి బందీగా ఉన్న ఆడపావురం తన జన్మధన్యమైందని పులకించింది.

పతిమదికి నింతయెక్కిన యతివగదా పుణ్యవతి ప్రియాలాపములీ
గతి వినగాంచితి జన్మము కృతకృత్యంబయ్యెనాకు గెలిచితి జమునిన్ అని అనుకొనినది.

తనను రక్షించమని బోయవాడు వనదేవతలను, వృక్ష, విహంగ, మృగాలను ప్రార్థించాడు. ఆ విధంగా ఆ పావురాలకు శరణాగతుడయ్యాడు. బందీగా ఉన్న ఆడ పావురం తన మగ పావురంతో

'శరణమ ఉన్నవాడు నిజశాత్రవుడైనను వానికెంతయుం
గరుణ దలిర్పబ్రోచుటయకర్జము నత్తమ ధర్మమంచు స
తు సములు పల్కుచుందురిది బుద్ధిదలచి కిరాతుపీని నా
దరమున జూడవయ్య చలితాకున కెంతయు దల్లడిల్లడిన్'

అని బోధించింది. భార్యమాటను శిరసావహించి మగపావురం ఆబోయవాని చలిపోవటానికి తన గూడులోని ఎండుపుల్లల్ని ఉపయోగించి చలిమంటవేసింది. చలి తగ్గిన బోయవాడు ఆకలి తీర్చమని కోరాడు. మమ్ములను నిత్యం వేటాడే నీకు మాస్థితి తెలియందేముంది పూటకాపూట ఆహారాన్ని వెతుక్కునే జీవులమని పలికింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని తుమ్మలవారు తాను స్వయంగా రైతుకావటం వల్ల రైతు జీవిత స్థితిని ఔచితీభంగం కాకుండా వివరించారు.

"తాదిన 'దేహి' యటంచను పేదకు వడ్డింపనతిథి బృందమునంద
త్యాదరముపూవ నెల్లర కాదరువైవెలయు నితడు హాలికుడొక్కో"
"ఎండకు వానకుజంకక పండించిన ధాన్యమెల్ల బాతఅలందున్
నిండించి తినుచుబెట్టుచు నుండెడి కర్షకుడె ధన్యుడూహింపంగన్"

ఆ తర్వాత మగ పావురం తాను బోయవానికి ఆహారం కావాలని నిర్ణయించుకొంది. తన భర్త మరణించబోతున్నట్లు గ్రహించిన ఆడు పావురం మూర్ఛపోయింది. అదే తగిన సమయమని భావించి మగపావురం బోయవానికి ఆహారంగా రూపొందటానికి అగ్నికి ఆహుతి అయింది. బోయవాడు నిశ్చేష్టుడయ్యాడు. హింసతో జీవితాన్ని గడుపుతున్న తన జీవితం ఎంతటి హేయమైందో అతనికి తెలిసింది.

'స్వార్థమును వీడి పరార్థమునకు, నర్థమును మానమునుమేని నప్పగించు
పుణ్యమూర్తి చరిత్రంబపో సమస్త, జగతికాదర్శమై సుప్రశస్తిగాంచు'

అని గ్రహించాడు. మొలనుండి కత్తి తీసి వలత్రాళ్లు తెంచి తాను శ్రమించి పట్టుకొనిన పక్షులన్నింటిని బంధవిముక్తుల్ని చేశాడు. పక్షులన్నీ ఆనందంగా కేరింతలు కొడుతూ చెట్లపైకి ఎగిరాయి. ఒళ్లు తెలియకుండాపడి ఉన్నా ఆడపావురం మేలుకొని తన భర్త మంటల పాలగుటను చూసింది. "పతి మరణానంతర మీక్షితి నొక్కని మేషమేని జీవనయాత్ర సతిగడపుటదుస్సాధ్యం బతిదుష్కరమని పలికి" తానును అగ్నిని ఆహుతియైనది. బోయవాడు కపోత దంపతుల ఆత్మార్పణాన్ని చూచి తుచ్ఛమైన దేహాభిమానాన్ని తెంపుకొని భగవంతుని మనస్సులో నిల్పుకొని ముని వృత్తిలో నుండి మహాప్రస్థానమునకై ఉత్తరదిక్కున వెళ్లుచూ దావానలం తనకు ఎదురుకాగా అందులో ప్రవేశించి దైవత్వాన్ని పొందాడు.

తిక్కన రచించిన లుబ్ధకపోతోపాఖ్యానానికి అభినవతిక్కన బిరుదు నందిన తుమ్మల సీతారామమూర్తి గారు చక్కని మెరుగులు దిద్ది దేశకాల పరిస్థితుల కనుగుణంగా లోకవృత్తాలను ప్రస్తావించిన ఈ 'ఆత్మార్పణం' కావ్యాన్ని విశిష్టమైన రీతిలో రచించి ఖ్యాతిని పొందారు.

బి) రాష్ట్రగానము: 'రాష్ట్రగానము' అనెడి ఖండకావ్యము తుమ్మల సీతారామమూర్తి గారిచే 1938 వ సంవత్సరమున ప్రకటించబడింది. ఇది జోహారు, హెచ్చరిక, కైవారము, ప్రశస్తి, అనుతాపం, ప్రబోధం, సంస్కరణం, పశ్చిమాంధ్రం, మాతృభాష, తెనుగుదనం, ప్రమాదం, రాయబారం, ఆంధ్రనాయకుడు, కృతజ్ఞత, స్వాంతనం అఱవలు, పట్టాభికీజే, తెలుగు తల్లి ఆహ్వానము, రథోత్సవము, ఆశీస్సు, ఆకాంక్ష అనెడి ఖండికలతో చేయబడిన పద్యరచన. ఈ ఖండకావ్యాన్ని చల్లపల్లి రాజా, శ్రీయార్లగడ్డ శివరామప్రసాద్‌కు తుమ్మలవారు అంకితం చేశారు.

"రాష్ట్రగానం" ఖండకావ్యాన్ని గూర్చి "మనవి" లో తుమ్మలవారు ఈ విధంగా పలికారు. "తెలుగుదేశము, తెలుగుభాష, తెలుగుచరిత్ర తెలుగు ప్రజ, తెలుగు సంస్కృతి అనినంతనే నా ఒడలు పులకరించును. ఇవి నాకు ప్రాణకల్ప విషయాలు. "నేను తెలుగువాడను" అను అహంకారమునాకెక్కువ. ఈ అహంకారమే నన్ను కవిని చేసినది. ఇట్టి నా జాతి, నా భాష పరతంత్రములై పరకీయ సంస్కారము నాశ్రయించి ప్రాచీన గౌరవాన్ని కోల్పోయినవి కదా! ఇది నా మనస్సులో అనుక్షణంగా రేగునట్టి ఆరాటం. ఈ యారాటానికి నా జీవుడు కదలాడు. ఆ కదలికయే రాష్ట్రగానం..... రాష్ట్రగానంను చదివిన తరువాత నా పాఠకులు "ఉదయగానమును తప్పక చదువుదురుగాక! అది అక్క, ఇది చెల్లెలు."

'నాదుజాతి నా దేశము నాదుభాష, అను అహంకార దర్పనమందు మాంధ్ర' అని రాయప్రోలు సుబ్బారావు గారు తెలుగు వారిని ఉత్తేజితుల్ని చేశారు. ఈ విధమైన రచనకు ఉత్తేజితులైన వారిలో తుమ్మల సీతారామమూర్తి గారొకరు. వారు రచించిన 'రాష్ట్రగానం'

ఆనాడు తెలుగు మాగాణి అంతా ప్రతిధ్వనించింది 'పీఠిక'లో తుమ్మల వారిని గూర్చి కవిసమ్రాట్ విశ్వనాథ్ సత్యనారాయణ గారు ఈ విధంగా వ్రాశారు. "ఈ కవి స్వస్థాన వేషభాషలయందు పరమాభిమాని. ఈయన ఇంగ్లీషు గిట్టదు. తెలుగు బాసయే కావలయును. పరదేశీయుల వేషం పనికిరాదు. ఆంధ్రుడాంధ్రునివలె కనిపించవలెను. పేర్వాంధ్రుల వేషం మారినచో వాడాంధ్రుడుగా కనిపించడు ఆంధ్రుడు ఉత్తరము గూడా తెలుగులో వ్రాయవలెను. ఇట్లే తెలుగువాని వేషమును గూర్చి కూడ ఎన్నోచోట్ల స్వాభిమానంగా వ్రాయబడినది. వేషభాషలయందనాంధ్రమైనది తిరస్కరింపబడింది, వెక్కిరింపబడింది, అసహ్యించుకొనబడింది.... అనాంధ్రునియందు, ఆంధ్రవిరోధి యందు ఈ కవి ప్రచండకోపి. ఆంధ్రులలో కులతత్వాలే ఆయనకు గిట్టవు. ఈ కవికి కుల భేదబుద్ధిలేదు. ఆంధ్రదేశములో నున్న సర్వమేధావులును: - అతడు బ్రాహ్మణుడో, కమ్మయో ! కాపొ, రెడ్డో అందరును ఆదరణీయులు."

తుమ్మలసీతారామమూర్తిగారు 'జోహారు'(గేయము)లో ఇలా వ్రాశారు
తెలుగు తల్లీ! నీకుజోహారు
దేశమాతా!నీకు జేజేలు
నినుజూచి నిమబాడి నిమగోల్చు వేళ నా
కనులాణిముత్యాల గనులుగానగు నహో
తెనుగుతల్లీ నీకు జోహారు.
దేశమాతా!నీకు జేజేలు
కుటిలశాత్రవకోటి గుండెలో నిదురించి, యిటుసేతువటుగంగమెల్లగా జగమేలే
నటరాజకంధరారానైల్యమ్మునడగించు, పటకీర్తి పెంచెనీపట్టి యెంతటివాడో.
ఏ పుణ్యలేశమ్మునాపాలిదాయెనో,నాపూజకేలోకనాథుండుంపొంగెనో
నీపావనోదారశ్రీపరంపరలలో, నీపదార్చకులలోనేనొక్కడనైతి"
తెలుగువారి పరాక్రమాన్ని, వైభవాన్ని ఇలా తెలిపారు.
కలదోయి! తెలుగుజోదుల తుటారికటారి చెలరేగిపగఱజేల్చినదినంబు
కలదోయి! తెలుగురాజులు గంగగట్టుపై,దీండ్రించిపడగలెత్తనదినంబు
కలదోయి! రేవువేవుల దెలుంగు సరంగు, పెపగిలంగర్లుదింపినదినంబు
కలదోయి! తెలుగుపద్యాలవెలంది-వెలందివెలుగులెల్లెడల బర్విసదినాబు
కలదు కలదోయి! తెల్లప్రెగ్గడలుమన్ను, మిన్నుతాళంబు వైచిపేర్గన్నదినంబు'

అని ప్రాచీన తెలుగు వైభవాన్ని తెలిపి

'నేటినీ పాటునెంచి కన్నీటి నిడకు, నిలుచునేకాల మొకరీల దెలుగుబిడ్డ' అని పల్కి మరల మంచిరోజులు రాక మానవని ఊరడించారు. త వైభవాన్ని భావించక పరవేషభాషలపై వ్యామోహంతో ఉన్న తనజాతి జనులను ఈ విధంగా భావించాడు.

సీ. పరవేషభాషా సపర్యతారకమౌట, నాంధ్రత్వమే సగంబడగిపోయె
పరఖడ్గమునకు లోబడి జోహారులువెట్ట, స్వాతంత్ర సమపేక్ష జాఱిపోయె
కులతత్వములు చుట్టుకొని యార్వలకు దింప, నైకమత్యము సర్వమాఱిపోయె
అసమర్థతాపంకమందు బ్రుంగుటజేసి, మెట్టవేధాంతముల్ మీఱిపోయె
నలగిపోయిన యీనాటి తెలుగుబిడ్డ కేమిం సందేశమిత్తు తల్లీ, తమస్సు
విడుచుచున్నది యిప్పుడెరవంత, ఉద్ధరింపుమువీని సద్బుద్ధులోసంగి,

అని తెలుగు తల్లిని ప్రార్థించారు తుమ్మల. జాతి, కుల , మతాలనే శత్రువులు దేశంలో అంతర్గాగంగా ఉండదేశాన్ని అధఃపాతాళానికి త్రొక్కేస్తున్నాయని భావిస్తూ ఈవిధంగా పోతనామాత్యుని భాగవత పద్యపురీతిలో పలికారు.

"ఇంతింతైరిపులింతయై మతియు దామింతై నభోవీదిపై
నంతైతోయరదమండలాగ్రగున కల్లంతైప్రభారాశిపై
నంతై చంద్రుని కంతయైధ్రువునిపై నంతై"నకాలాననీ
యంతర్యద్ద మరిప్పదాయకముగాదా జాతికిన్ నీతికిన్"

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో 'అకలంకంబగు నాంధ్రసంస్కృతికి నేడాధారమేలేదని వాపోయిన తుమ్మలవారు " తెలుగు తల్లికిదేజంముల్ తెచ్చు కొఆకునదుము గట్టదురాష్ట్రంబు వడయుకొఆకు' అని ప్రబోధించారు. మనల్ని ఎవరు పాలిస్తేంఏం? మనం ఏవిధ్య నేర్చుకొటేయే? అని పలికే తెలుగువారిని చూసి తుమ్మలవారు ఆ నిర్లప్తతను అసహ్యించుకొన్నారు.

వేసమెటున్ననేమి పరవిద్యలకన్ బరజాతికిన్
దాసులమైననేమి పరతంత్రతపోకకు దీనికేమిపా
వాసమటంచు ఆంకెలిడు వారికి జీరికిరాని పిచ్చిప
న్నాసులకిమ్ము తల్లి!కరుణారతి నించక మానవత్వమున్

అలాగని ఆంధ్రులందరును అసమర్థులు, అవివేకులుకారని ఆంధ్రసోదరుల లక్షణాన్ని యీవిధంగా కీర్తించారు తుమ్మల.

చావున కెన్నడున్ మదిన్ జంకరు యాచకదైన్యభారమున్
మోవగలేరు నీచులకు మ్రొక్కరుచిక్కరు నిత్యకౌతుక
శ్రీవిభవాభిరాములు విశిష్టయశోభిరతుల్ స్వతంత్రతా
సేవకె ధారవోయుదురు జీవధనంబుల నాంధ్రసోదరుల్.

తెలుగు వాడు ఒకనాడు 'కొమ్ముదిరిగిన వారలే కొలువుసేయ దిక్కు లొత్తిన మొనగాడు! తెలుగుటెక్కెము పాటలీపురస్త్రీ కభరీభరమ్మున నున్నదికమై నాట్యమాడిందొకనాడు. తెలుగువాడు ఉత్తమోత్తమధర్మ నిర్వాహకుడు. ఇరుగుపొరుగు వారలకాచార్యుడు. అతిలోకమతుడు. తెలుగురాజులకథలు కండలను కదిలిస్తాయి. విశ్వరంగమ్ముపై ఔమ్ము విఱిచి నిలిచే'లా చేస్తాయి. నిన్నమొన్నటి తెలుగువారల ప్రతిభాపాటవాలు, త్యాగమయజీవితాలు. కళాహృదయాలు, తెలుగు ఆడపడుచుల శీలసంపద, శౌర్యప్రతాపాలు మాసిపోనివి ఇటువంటి బిడ్డలను కన్నదా. యీ తెలుగుతల్లీ అని జగం ఆశ్చర్యపోతుంది. మరి ఈనాడు వారిని గూర్చి చెప్పేవారేరి? ఈ ఎరుకలేని తనం ఎంతో దుస్థితిని కల్పిస్తున్నదని తుమ్మలవారు వాపోయారు. పూర్వసంస్కారదూరుడైన తెలుగువాడికి పూర్వస్థితిని వివరించవలసిన అగత్యం ఎంతైనా ఉందని భావించిన తుమ్మలవారు పూర్వాంధ్ర వైభవాన్ని విస్పష్టంగా,వివరణాత్మకంగా ఈ ఖండకావ్యంలో విరచించారు.

"సకలాంధ్రంబొకరాష్ట్రమై చతురతా సంపన్నతాధన్యమై
సుకవీంద్రస్తుతిపాత్రమై శతకళాశుద్ధాంతమై కాంతమై
కకుబంతంబులనెల్లనీ జయపతాకల్ నిల్పులగ్నంబుచెం
తకువచ్చెన్ నిటలాక్షుడట్లు పడినన్ సాగింతుమీపంతమున్"

సమగ్ర ఆంధ్రరాష్ట్రావతరణకై అర్రులు చాచి తానముకొన్నది సాధించక తీరదని పల్కి తెలుగుతల్లికి రథోత్సవం చేసిన తుమ్మలవారు వచ్చిన రాష్ట్రమున్ దెలుగువారు పరస్పర సౌహృదమ్ములన్

మచ్చయొకింతలేని ఋజుమార్గములన్ నడపింత్రుగాక!వా
రచ్చ తెలుగులైకెలకులందలి సీమలపాలి విందులై
హెచ్చినకల్మితోడ సుఖియింతురుగాక !యశఃప్రశస్తులై

అని ఆశీస్సునొసంగినారు.

తెలుగువారిని ఒకటిచేసేది వారు మాట్లాడే భాష. మాతృభాషాభి మానం లేనప్పుడు మాతృదేశాభిమానం వృద్ధి పొందదు. అందువలననే ముందుగా తెలుగుభాషాభిమానం అందిరిలో కలగాలని తుమ్మలవారు కాంక్షించారు.

తుమ్మల సీతారామమూర్తి గారి 'రాష్ట్రగానానికి పూర్వమే ఆయన సమకాలికులైన రాయప్రోలు సుబ్బారావుగారు, విశ్వనాథ సత్యనారాయణ గారు జాషువాగారు ఆంధ్రత్వాన్ని ఎలుగెత్తిచాటారు. తత్పురావైభవాన్ని కీర్తించారు. ఈ నలుగురు కవుల లక్ష్యమొకటే అయినా వారవలంబించిన మార్గాలువేరు. రాయప్రోలు వారును, జాషువాగారును ఆంధ్రులపురావైభవాన్ని అనేక రకాలుగా కీర్తించారు. విశ్వనాథ సత్యనారాయణగారు ఆంధ్రుల చరిత్రలోని తమ కిష్టమైన ఘట్టాలను స్వీకరించి రసభావబంధురంగా కావ్యాల్ని నిర్మించారు. తుమ్మల సీతారామమూర్తిగారి 'రాష్ట్రగానం' ఖండకావ్యంలో వారి దేశభక్తిని, ఆంధ్రరాష్ట్రోద్యమానికిని అవినాభావ సంబంధంగలదు. ఆ ఉద్యమ పరిణామాల్ని విపులంగా, క్రమబద్ధంగా తుమ్మల వారు తమ కావ్యంలో వివరించారు. రాష్ట్రగాన సారమంతా ఈ కంద పద్యంలో ఇమిడిఉంది.

"ఆంధ్రుడవై జన్మించితి, వాంధ్రుడవై యనుభవింపుమీయుర్వీభావం
బాంధ్రుడవై మరణింపుమి, ఆంధ్రత్వములేని బ్రతుకు నాసింపకుమీ'.

ఆంధ్రుల గత చరిత్రలోని వైభవాన్ని తెలియజేయటానికే ఆంధ్రపురావైభవకీర్తనం, మహోన్నతము. మహోజ్జ్వలతేజస్సంపన్నమైన ఆంధ్రజాతి యందునీవు జన్మించావు. పూర్వవైభవాన్ని స్మరించి భావివైభవానికి శ్రమించు అని చెప్పడమే ఈ ఖండకావ్య ధ్యేయం. ఈ ఖండకావ్యంలోఎన్నో అమూల్యరత్నాల్లాంటి పద్యాలను తుమ్మలవారు సృష్టించారు. ఆంధ్రభాషాభిమానాన్ని రెచ్చకొట్టటానికి తుమ్మలవారు రాసిన పద్యాలలో ఆంధ్రత్వాన్ని తప్ప దేనినీ సహింపని ప్రబోధమున్నప్పటికీ అది తిరస్కార్యముకాబోదు. కొన్ని సందర్భాలలో భావప్రకటనలో తీవ్రత తప్పదు. స్వరాష్ట్రాభిమానాన్ని, స్వజాత్యనురాగాన్ని ప్రబోధించి ఆభావములు గుణములే కాని దోషములుకావు. విపరీతార్థాలను తీయకపోయినచో ఈ పద్యములను తుమ్మలవారెంత ఆవేదనకులోనై రచించారో విశదమగుతుంది. శ్రీ తుమ్మలసీతారామమూర్తిగారు ఆంధ్రత్వమునకేపాటి హానికలిగినా, ఆంధ్రుల కేపాటియవమానము కలిగినను సహింపలేరు. అందులకే రాష్ట్రగానం'లో తీవ్రమైన ప్రబోధంతో పాటు తీవ్రమైన నిరసన గోచరించును. తెలుగుజాతి భాషాసంస్కృతులను గురించి 50 సంవత్సరాలకంటే పూర్వం వెలుబుచ్చిన ఆవేదనాత్మకాలైన భావాలు తెలుగుజాతి ఉన్నంత వరకు మార్గదర్శకాలుగానే ఉంటాయి. తెలుగుజాతినంతటిని సమైక్యపరచే 'రాష్ట్రగానం' వంటి ఖండకావ్యాలుయువకుల హృదయాల్లో ముద్రితమైనప్పుడే ప్రాంతీయ విద్వేషాలు సమసిపోతాయి.

కావ్యరచన, ప్రచురణ రెండింటిని సవ్యసాచిలా నిర్వహించిన ఘనత తుమ్మలసీతారామమూర్తిగారికి దక్కుతుంది. తాము రచించిన వాదాపు 25 గ్రంధాలను తమ సంపాదకత్వంలోనే తమ పర్యవేక్షణలోనే ప్రచురించారు. రచయితలు తమ గ్రంథాలకు ప్రముఖులచే పీఠికలు, పరిచయాలు వ్రాయించి వాటిని గ్రంథంతో జతపరచడం ఒక సంప్రదాయంగా పాటించారు. తుమ్మలవారు ఈ సంప్రదాయాన్ని కేవలం 12గ్రంధాలకు మాత్రమే పాటించారు. తాము వ్రాసిన పద్యాలకు అవి వ్రాసిన తేదీలను, అవి ఏఏ పత్రికలలో ప్రచురింపబడ్డాయో తెలియజేసే విధానాన్ని ఆచరించారు.

### 14.1.7 తుమ్మలసీతారామమూర్తిగారి మరికొన్ని విశిష్టఖండకావ్యాలు:

**ఎ) ధర్మజ్యోతి:** 1942 లో తుమ్మసీతారామమూర్తిగారు రచించిన ఖండకావ్యమిది. 6 భాగాలలో 171 పద్యాలలో దీనిని వ్రాశారు. తుమ్మలవారితండ్రి నారయ్యగారి ధర్మనిరతిని తెలియజేసే ఒక యదార్థగాథ ఇది. ధర్మజ్యోతి కథాస్థలం గుంటూరు జిల్లాలోని చందోలు గ్రామం. ఇది ఒకనాటి వెలనాటి రాజధాని. చందోలు వర్ణనతో ఈ కావ్యం ప్రారంభమౌతుంది. ఆంగ్లేయులు విజయవాడవద్ద కృష్ణానదికి ఆనకట్ట కట్టి ఎన్నో కాలువలు తవ్వించారు. అందులో ఒక కాలవను చందోలుకు పడమట దిక్కున త్రవ్వవలసివచ్చింది. ఆ కాలువను త్రవ్వే ఒడ్డె వాళ్లలో వొకడు నాటిన పలుగుకు ఖంగుఖంగుమని ఏదో తగిలింది. పనివాళ్లకు నూరుబంగారు ఇటుకలు కనిపించాయి. పనివాళ్లు వాటిని పంచుకొని ఆరాత్రి గ్రామంలోని వైశ్యులకు అమ్మజూపారు. ఆ వైశ్యులు అవి బంగారు ముద్దలుకావు ఇత్తడివి అని చెప్పి 4,175 కిలోల బంగారు ఇటుకలను ఆనాడు కేవలం రెండు రూపాయల వెలకట్టికొన్నారు. వేల సొమ్ము రెండు రూపాయలకే దక్కిందని కోమట్లు లోపల పొంగిపోయినా బయటపడలేదు. బంగారు ఇటికలు బయటపడినట్లు తెలిసుకొని అధికారులు చందోలును ముట్టడించి ఇళ్లను

సోదాచేశారు. మూడు బంగారుపు ఇటుకలను కొన్న ఒక పేద కోమటి అధికారుల దాడి గుర్తివిని తనను కాపాడమని నారయ్యను ప్రార్థించాడు. అధికారుల కన్నుగప్పటానికి నారయ్యకు బాకీ నటించి ఆ బంగారు అచ్చుల్ని ధాన్యంతో బాటు గోతాములో పెట్టి ఇచ్చాడు. తర్వాత ఆకోమటికి నారయ్య తాను దాచిన బంగారాన్ని భద్రంగా అప్పగించాడు. ఆమూడు బంగారు ముద్దల్లో ఒకదానిని నారయ్యకు ఇవ్వబోగా నారయ్య ఆకోమటితో

'నింద్రలేవి లేక నీసొమ్మునీచేత, నిడుముహూర్త మెప్పుడెప్పుడంచు

గలవరించునన్ను గరుణించెనేటికా, రంగసాయి మదికొసంగెహోయి' అని పలికి వాటిని ఇచ్చివేసి తన బరువు బాధ్యతలు తొలగినట్లు భావించిన నిస్వార్థపరుడు నారయ్య. ఆ ధనాన్ని ధర్మకార్యాలకోసం వినియోగించమని ఉపదేశించాడు. ధర్మజ్యోతి కావ్యంలో ముఖ్యమైన విషయం ధర్మోపదేశమే మోసంతో సంపాదించిన ఆ ధనాన్ని సద్వినియోగంచేయమని మిత్ర ధర్మంగా నారయ్య బోధించాడు. ఇంతటి సద్ధర్మాన్ని బోధించిన గ్రంథం కనుకనే నారయ్య ధర్మజ్యోతి అయ్యాడు. ఈ కావ్యం విద్వాంసుల ప్రశంసలనందుకోవటమేకాక విశ్వవిద్యాలయాలలో పాఠ్యగ్రంథంగాగూడ నిర్ణయింప బడింది.

**బి) పఠిగపంట:** 1943 లో ప్రచురింపబడిన కావ్యమిది. ఆంధ్రీ, మహతీ, భారతి, ప్రజా మిత్ర మొదలైన పత్రికలలోను, రైతుబిడ్డమొదలైన సినిమాలలోను, రైతుభజనావళి మొదలైన చోట్ల చెదురుమదురుగా పఠిగకంకుల్లో వ్యాపించిఉన్న చిన్న చిన్న ఖండికలను ఒక చోట చేర్చి " పఠిగపండ" పేరుతో ఖండకావ్య సంపుటంగా తుమ్మల సీతారామమూర్తిగారు ప్రకటించారు. దీనికి **కాటూరి** వెంకటేశ్వరరావుగారు పురస్కృతి పేర పరిచయమును రాశారు. 1924 నుండి 1943వరకు తుమ్మలవారు వ్రాసిన 45ఖండికల సమాహార సంపుటమీగ్రంథము. దీనిని శ్రీకోసరాజు లక్ష్మయ్య చౌదరికి అంకితం చేశారు. 12-3-1944న నిడుబ్రోలులో జరిగిన కృతి సమర్పణసభలో కవి రత్నకొసరాజు రాఘవయ్య చౌదరి ఇట్లనినారు.

పలుపలుచగ రాలుకంకులనెమట
బఠిగపంటయె యింతగొప్పగ ఫలించె
దీర్చివేసిన కుప్పలు నూర్చునప్పు
డెన్నిధాన్యరాసులు మిన్నుదన్నగలవొ!

ఈ గ్రంథమందు కానుక, భారతసవిత్రి, సంక్రాంతి, ఆదర్శవీరుడు, గురుదక్షిణ, ఉద్రేకం, వీరధర్మం, తెల్లుకాంత, హంపీ క్షేత్రం, పలునాడు, మాయూరు, విద్యార్థి, పాదధూళి, స్వతంత్రభారతం, దొరతనం, నేతాజీ, నవభారతి, కాంగ్రేసు, కర్షకుడు, క్షేత్రజీవి, శివకర్షకుడు, ఖైరు, గోసేవ, చిన్నయసూరి, మొల్ల, ఆస్థానకవి, కవిరాజా, ద్వారమువారు, షష్టిపూర్తి, మాధవపెద్ది, పట్టాభిషేకం, విశ్వదాత, ఓదార్పు ఆవేదన, వంగభస్మం, చుక్కలు, ముక్త్యాలమాలిక, కూడివేదాంతులు, భజగోవిందమ్, సేవాధర్మం, అవివేకం, కృతమెఱుక, తపస్సిద్ధి, విజయవాణి అను శీర్షికలతో వీరి పద్యరచనసాగింది.

ఇందులోని "సంక్రాంతి" ఖండికలో తుమ్మలవారు భావనలో, భాషలో సర్వోత్తమమైన తెలుగునాట భోగభాగ్యాలను, సరససల్లాపాలను, నడతనాగరికతలను కన్నులకు కట్టినట్లు, నోరూరునట్లు చిత్రించారు. తుమ్మలవారు అచ్చమైన రైతుబిడ్డ, నిజమైన తెలుగుకవి పల్లెల సౌభాగ్యాన్ని చిత్రించే సిద్ధహస్తుడు.

సంక్రాంతి పండుగనాడు పల్లెల్లో సరదాసన్నివేశాలను చిత్రించారు తుమ్మల సీతారామమూర్తిగారు. ' మాఱువడించెడి మఱదలి కెంగేలు, పిసికివలనె నొక్క పెంకెబావ

వంగిముగ్గులుదిద్దు వధువుపైనీర్చల్లె, గదివీడిచనునొక్కగడుసుమగడు

అప్పుడెవచ్చిన ప్రియుని సోయగముగనుచు దలుపుచాటున నొక్కపై దలిచెమర్చె

'ప్రతిఇంటిలోను మూర్తీభవించిన తెలుగుదనాన్ని తుమ్మలవారు మనోహరంగా ఈ ఖండికలో వర్ణించాడు.

'సేవాధర్మం' ఒక చక్కని ఖండిక. దిలీప మహారాజు సంతానం పొందుటకై వశిష్ఠుని మాటననుసరించి హోమధేనువైననందిని సేవింపసాగాడు ఒకనాడు ఒక సిహం ఆదూడ నందినిని చంపి తినుటకు ఉద్యుక్తురాలైంది. దిలీపుడు ఆ సింహాన్ని చంపుటకు కత్తినెత్తినాడు. చిత్తరువునందుతీర్చిన విధాన అతని చేయి స్తంభించినది. దిలీపుడు తననుచంపలేడని తాను శివుని ఆదరణంవలన అత్యంత శక్తివంతురాలనైనానని పల్కి తనకు చిక్కిన ఆదూడను ఆహారముగా తీసుకొనక తప్పదని పలికింది. దిలీపుడు ఆ దూడకు బదులుగా తాను ఆహారమగుదునని సిద్దపడ్డాడు. నందిని ఎడల ఆయన చూపిన సేవాధర్మం ఫలించి ఆయన కోరిక నెరవేరింది.

పి) శబల: 1955లో తుమ్మల సీతారామమూర్తిగారిచే ప్రకటించబడిన గ్రంథమిది. ఇది జాస్తి నరసయ్యగారికి అంకితంగావించడింది. శబల అనగా గోవు, బహువర్ణాలు కలది. ఇందు బహువిషయాలను పురస్కరించుకొని వ్రాసిన శీర్షికలు కలవు. సంక్రాంతి తలపులు, వీరపూజ, కర్ణుడు, హరిసర్వోత్తమరావు, మెచ్చుకోలు, పశువైద్యము, రంగా, తత్వానందం, పుట్టపండువు, వివేకానందుడు, ఆర్తబంధువు, నాగయ్య, నాకథ-సీత, శాంతిగీతము, రైతు మొ॥ఐ కృతజ్ఞత, చంద్రమౌళి, అంటరానివారా, ఆంధ్రనాయకుడు, హెచ్చరిక, దేశభక్తుడు, అన్వేషణం, తెలుగుపెండ్లి ఉపద, అతడు, జయసంక్రాంతి అనే కవితా ఖండికలున్నాయి.

సంక్రాంతి తలపులు చిత్రమైన ఖండిక. ఇందు రైతు జీవితం పరమ రమణీయంగా వర్ణింపబడింది. కవి చిన్నప్పుడురైతు. కుప్పలునూర్చినవాడు, గడ్డికోసినవాడు, వెంటికట్టినవాడు, పదిమోపులగడ్డిపనల నెత్తినరెట్ట బలంకలవాడు. తరువాత తెలుగుపండితుడై కవియైనవాడు. కవిగా అంతపంటను పండించుకొన్నాడు. కవిచిన్నప్పుడు బండితోలుకొని పోవుచుండగా చక్రం ఊబిలో దిగింది. గిత్తలుబండిని లాగలేకపోయాయి. కవి గిత్తల నూడదీసి కాడితానే మెడపై వేసుకొనిలాగాడు. ఈ కవితాఖండికలో రైతును కవి గొప్పగా ప్రశంసించినాడు. రైతుకానివాడు సోమరియని సోమరికానివాడొక్కరైతే అనీ,రైతు కష్టపడిపండించుచుండగా ఇతరులంతా మనోవృత్తినను భవించుచున్నారని తుమ్మలవారు రైతు యొక్క శ్రమను వర్ణించారు. ఈ సంక్రాంతి తలపులు కావ్యఖండిక 'నేటి యాంధ్రభాషాకవిత్వంలో శిరోభూషణ' మని విశ్వనాథసత్యనారాయణగారు ప్రశంసించారు.

ఆనాటి మహానటుడు చిత్తూరి నాగయ్యను ఒక కవితాఖండికలో తుమ్మలవారు కీర్తించారు.

కవివరుల్ నటాగ్రణులు గాయక ముఖ్యులు జాతి సంస్కృతి
చ్ఛవులు సృజించువారనుట జాటునఖండమహీచరిత్రముల్
కవియునాట్యకౌశలము గానపటుత్వము నిన్నుజేరి నీ
కవిరతకీర్తిగూర్చి జరితార్థుడ నీవు కదయ్య! నాగయ్యా!'

చక్కని నటుడుగా, గొప్పగాయకుడుగా నాగయ్య తెలుగు చిత్ర పరిశ్రమలో అనాడు ఒక వెలుగువెలిగారు.

తుమ్మలసీతారామమూర్తి గారి కవితలు రసదృష్టితో చూసినచో ఉత్తమములు. వారిభావన గంభీరమైనది. ఆవేశం ప్రశంసనీయమైనది. తెలుగుజాతికి, తెలుగుసాహిత్యానికి లభించిన అపూర్వమైన కానుక తుమ్మలసీతారామమూర్తిగారు.

**సమీక్ష :-**

తుమ్మల సీతారామమూర్తి గారు కోరుకొన్న సంఘసంస్కరణను, వ్యక్తి స్వేచ్ఛను, మహాత్ములు సంఘానికి చేసిన సేవలను, సంఘసంస్కరణకు అవసరమైన విధానాలను తుమ్మల వారి రచనలను పరిశీలించారు.

**ప్రశ్నలు**

1) తుమ్మలసీతారామమూర్తిగారి జీవిత విశేషాలను తెలపండి.
2) తుమ్మల సీతారామమూర్తిగారి రచనలు గూర్చి వివరించండి.
3) తుమ్మల రచనల్లోని జాతీయతా భావాన్ని చిత్రించండి.

4) తుమ్మలసీతారామమూర్తిగారు రచించిన ఖండ కావ్యములను పేర్కొని మీకు నచ్చిన ఏ ఖండికనైననూ సోదాహరణముగా వివరించండి.

5) తుమ్మలసీతారామమూర్తిగారి వాఙ్మయ జీవితమెట్టిదో వివరించండి.

**ఉపయుక్త గ్రంధములు**


1) తెనుగులెంక తుమ్మల సమగ్రసాహిత్యము 1నుండి 4గ్రంధములు (తుమ్మల శతజయంతిప్రచురణ -గుంటూరు)

2) తెనుగులెంక తుమ్మల శతజయంతిసంచిక 200 (తుమ్మలశతజయింతి ఉత్సవసంఘము-గుంటూరు)

3) అజరామరవాఙ్మయమూర్తి తుమ్మలసీతారామమూర్తి (డా॥సూర్యదేవరరవికూమార్) (తుమ్మలసీతారామమూర్తి శతజయంతి ప్రచురణ)

4) ఆధునికాంధ్ర కవితాసమీక్ష - ఆచార్య కాకర్ల వెంకటరామనరసింహం (గంగాధరపబ్లికేషన్స్ విజయవాడ)

5) ఆంధ్రరచయితలు -మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి (అద్దేపల్లి అండ్‌కో, రాజమహేంద్రవరము)

6) ఆధునికాంధ్ర కవితాతత్త్వము- డి. లలితకుమారి. విశాఖపట్టణము

7) తెలుగుసాహిత్య చరిత్ర - డాక్టర్ ద్వా. నా.శాస్త్రి ( విశాలాంధ్రపబ్లిషింగ్ హౌస్,హైదరాబాదు)

8) తెలుగులోజాతీయోద్యమ కవిత్వము-. డా॥ మద్దూరి సుబ్బారెడ్డి (రాగసుధా ప్రచురణ,తిరుపతి)


డా. కౌతా సుబ్రహ్మణ్యశాస్త్రి

పాఠం - 14.2

# కవిసమ్రాట్ 'విశ్వనాథ సత్యనారాయణ

పాఠ్య నిర్మాణ క్రమం :

14.2.1 విశ్వనాథ జీవిత విశేషాలు

2.2 విశ్వనాథ సత్యనారాయణగారి రచనలు

2.3 విశ్వనాథ - కవితా రీతులు

ఎ) రామాయణ కల్పవృక్షం

బి) ఆంధ్ర ప్రశస్తి

సి) కిన్నెరసాని పాటలు

డి) వరలక్ష్మీ త్రిశతి

ఇ) గిరికుమారుని ప్రేమగీతాలు

ఎఫ్) ఇతర రచనలు

**లక్ష్యం:**

విశ్వనాథ జీవిత విశేషాలు, రచనలు - కవిత్వ తత్త్వ విశేషాలు వివరించడాన్ని తెలుసుకొంటారు.

శ్రీ విశ్వనాథ సత్యనారయణ గారు జన్మతః ప్రతిభావ్యుత్పత్తులు గల మనీషి. 'కవి సమ్రాట్ ' గా కీర్తి ప్రతిష్ఠలనార్జించారు. తెలుగు సాహిత్య చరిత్రలో వీరి స్థానం అద్వితీయం.

'ప్రజ్ఞాఃప్రగల్భాన్వితాః' అని ఆర్యోక్తి. పాండిత్యం విశేషంగా ఉన్న మహనీయులు తమను గురించి తాము అతిశయంగా చెప్పుకొన్నా అది దోషం కాదు. 'అమలోదాత్త మనీష నేను భయ కావ్యప్రౌఢి బాటించు శిల్పము నంబారగుడ కళా విదుడ' అని మహాకవి తిక్కన తన ప్రాగల్భ్యాన్ని ప్రకటించాడు.

విశ్వనాథ సత్యనారాయణ గారు తమశేముషీ విభవాన్ని భంగ్యంతరంగా ఇలా చెప్పుకొన్నారు.

'అల నన్నయ్యకు లేదు తిక్కనకు లేదా భోగ మస్మాదృశుం
డలఘు స్వాదు రసావతార ధిషణాహంకార సంభార దో
హల బ్రాహ్మీమయమూర్తి శిష్యుడయినాడన్నట్టి దావ్యోమపే
శల చాంద్రీ మృదు కీర్తి చెల్లపిళ వంశ స్వామి కున్నట్లుగన్'

ఈ పద్యంలో తన ప్రజ్ఞావిశేషాన్ని, పాండితీ ప్రకర్షను చెప్పుకున్నా అది ఆయన విషయంలో అలంకారమే అయింది కాని దోషంకాలేదు. తన కవితాగురులైన చెల్లపిళ్ల వేంకటశాస్త్రి గారిని గురించిన ఈయన హృద్గత భావాలు మహోదారమైనవి.

"పుడమిని బెక్కు సత్కవులు పుట్టిరి ముట్టిరి సత్కవిత్వపుం
దొడిమలు చెల్ల పిల్ల కవితో తులతూగెడువారె? వానలో
తడియని వారు మద్గురు వదాన మృదూక్తి మరంద ధారలో
కడుగని వారు మాకెచట కానగ రారిల తెల్గునాడునన్"

అంతేకాదు

'తన యెద యెల్ల మెత్తన కృత ప్రతి పద్యము నంతకంటె మె
త్తన తన శిష్యులన్న నెడదంగల ప్రేముడి చెప్పలేని మె
త్తన యయి శత్రు పర్వత శతారము సత్కవి చెళ్ల పిళ్ల వేం
కన గురువంచు జెప్పికొనగా నది గొప్ప తెలుంగునాడునన్'

### 14.2.1. విశ్వనాధవారి జీవిత విశేషాలు :

శ్రీ విశ్వనాధ సత్యనారాయణ గారు మన్మథనామ సంవత్సర భాద్రపద బహుళ షష్ఠీ మంగళవారం అనగా 10.9.1895 న కృష్ణా జిల్లా గన్నవరం తాలూకా నందమూరు గ్రామంలో జన్మించారు. ఈయన తల్లి దండ్రులు పార్వతీ శోభనాద్రులు. శోభనాద్రి గారు గొప్ప వితరణశీలి. నందమూరు గ్రామంలో శ్రీ విశ్వేశ్వర స్వామి వారికి ఆలయనిర్మాణం చేసి పరమ శివక్షేత్రమైన వారణాసినుండి శివలింగాన్ని తెచ్చి ఈ ఆలయంలో ప్రతిష్ఠ చేశారు. స్వామికి నిత్య నైవేద్య ధూప దీపముల కొరకు కొంత భూమిని దానం చేశారు. ఆ స్వామి విశ్వనాధుడు. వీరి ఇంటి పేరు విశ్వనాధ. నిత్యశివపూజా తత్పరులైనా కేశవార్చన అంటే వీరికి గౌరవము. అందువలననే శివకేశవ అభేద రూపమైన విశ్వనాధ సత్యనారాయణ అన్నపేరు వీరికి సార్ధకమైంది. మధ్యాక్కరలలో శివకేశవుల్ని స్తుతిస్తూ ఈయన శతకాలను వ్రాశారు. తాను రచించిన రామాయణ కల్పవృక్ష కావ్యానికి లభించిన జ్ఞానపీఠ పురస్కారంలో పొందిన ధనంలో కొంత భాగాన్ని ఈస్వామి ఆలయ జీర్ణోద్ధారానికి వినియోగించి దైవఋణం తీర్చుకున్నారు. వీరి తండ్రి శోభనాద్రి గారి దానశీలత, తల్లి చేసిన నిరతాన్నదానాలతో ఉన్న సంపద యావత్తు హారతికర్పూరం అయింది. ఈయనకు ఇద్దరు తమ్ములు ముగ్గురు సోదరీమణులు. బాల్యంలో వీరి చదువు నందమూరు, పెదపాక, ఇందుపల్లి, వెలునూతం గ్రామాలలోని వీధి బడులలో సాగింది. అష్టవర్షోపనీతుడైన ఆయనకు పదకొండవయేట వివాహం జరిగింది. ఆ తర్వాత బందరు (ఇప్పటి మచిలీపట్నం) లో విద్యాభ్యాసం. అక్కడ ఈయన ప్రత్యక్ష గురువు చెళ్ల పిళ్లవారు. వీరే విశ్వనాధ వారికి తొలి కవితా గురువు. పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వెంకటేశ్వరరావు, దేవుల పల్లి కృష్ణశాస్త్రి, వేదుల సత్యనారాయణశాస్త్రి, స్వామి శివశంకరుల సాహచర్యం ఈయన కవితాప్రతిభకు మెరుగులు దిద్దాయి. సనాతన సంప్రదాయంపై మమకారం, దేశభాషా వైభవ ప్రాభవాలపై అతిశయించిన అభిమానం ఈయనలో సమృద్ధిగా చోటు చేసుకొన్నాయి.

శ్రీ సత్యనారాయణ గారి పాండిత్యం సర్వతోముఖమైంది. ప్రాచీన సాహిత్యం మొదలు ఆధునిక సాహిత్యంలోని విభిన్నరీతులలో ఈయన రచన సాగింది. ఈయనలో ఇంతటి వైదుష్యానికి ప్రధాన కారణం ఆయన చేసిన శాస్త్ర పరిశీలన. ఈయన కుప్పాలక్షావధానులు గారివద్ద తర్క, వ్యాకరణశాస్త్రాలను, వేదవిద్యను నేర్చుకొన్నారు. శ్రీపరిమనరసింహశాస్త్రి గారి వద్ద ప్రస్థానత్రయమైన ఆదిశంకరాచార్యులవారి శృతి, స్మృతి, పురాణ భాష్యాలైన గీతాభాష్యం,సూత్ర భాష్యం, ఉపనిషద్భాష్యాలను అధ్యయనం చేసారు ఈవిధంగా వేదవేత్తలు, శాస్త్ర పారంగతులైన మహావిద్వాంసుల కరుణాకటాక్ష వీక్షణ ప్రసారం శ్రీవిశ్వనాధ సత్యనారాయణ గారికి లభించింది.

ఆనాడు భారత దేశాన్ని పట్టి పీడించిన పరదేశపాలన, పరదాస్య, పరానుకరణలను ఎదుర్కొనటానికి స్వస్థాన వేష భాషోద్యమ ప్రభావానికి పలువురు మేధావులు ఆకర్షితులయ్యారు, ఆనాటి ఆంధ్రదేశంలో రాజకీయ, సాంస్కృతిక చైతన్యానికి దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, కట్టమంచిరామలింగా రెడ్డి, కాశీనాధుని నాగేశ్వరరావు మార్గదర్శకులయ్యారు. తల్లావజ్ఝల శివ శంకరశాస్త్రి, పింగళిలక్ష్మి కాంతం, కాటూరి వెంకటేశ్వర్లు, వేటూరిశివరామశాస్త్రి, చిలుకూరి వీరభద్రరావు; మల్లంపల్లి సోమశేఖరశర్మ, రాయప్రోలు సుబ్బారావు మొదలైన మహనీయుల ప్రత్యక్ష, పరోక్ష సాన్నిహిత్యాలు విశ్వనాధ వారిని ఒక దేశీయోద్యమ ప్రచారకునిగ, ప్రాచీన ఔన్నత్యాన్ని స్తుతించే వైతాళికునిగా చేసాయి. ఒక దేశ భక్తునిగ, దేశాన్ని సాహిత్య పరంగా దర్శించే ద్రష్టగా, స్వస్థాన వేషభాషా సమారాధకునిగా ప్రభవింప జేసినవి. ఈయన రచించిన ఆంధ్ర పౌరుషం, ఆంధ్ర ప్రశస్తి వంటి ఖండకావ్యాలలోని కవితా వస్తువు దీనినే వ్యక్తం చేయడం జరిగింది. ఆంగ్ల భాషాసాన్నిహిత్యము, అనేకములైన ఆంగ్ల గ్రంథాల పరిశీలన ఈయన వివేచనా శక్తికి దోహదం చేశాయి. ఈయనకు లభించిన సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల భాషావైదుష్యం వివిధ దేశ సారస్వత తరతమములన్నీ తెలుగు సాహిత్యానికి మెరుగులు దిద్దటానికి ఈయనకు ఎంతగానో సహకరించాయి.

శ్రీ విశ్వనాధ సత్యనారాయణ గారు శ్రీ కొడాలి ఆంజనేయులుగారితో కలసి, 'సత్యాంజనేయ' నామంతో జంటకవులుగా కవిత్వాన్ని చెప్పడం ఆరంభించారు. శ్రీ ఆంజనేయులు గారి తండ్రి వేంకటాద్రిగారు, సత్యనారాయణ గారి తండ్రి శోభనాద్రి గారు పరమమిత్రులు.

వారిసాన్నిహిత్యమే వీరిని జంటకవులుగా మార్చింది. ఇంటర్మీడియట్ చదువుతుండగా 1916 వ సంవత్సరంలో అనగా తన యిరవది ఒకటవ సంవత్సరంలో భ్రష్టయోగి శీర్షికలో విశ్వనాథ వారు కొన్ని పద్యాలు రచించారు. 1917 లో 'ఆంధ్రపౌరుషం' అనే లఘుకావ్యాన్ని రాశారు. బందరు నోబుల్ కళాశాలలో 1921 లో చదువుతున్న బి. ఎ. పూర్తికాక ముందే అక్కడవే జాతీయ కళాశాలలో అధ్యాపక వృత్తిలో చేరారు. బి.ఎ పూర్తి చేసి బందరు హిందూ కళాశాలలో ఉపన్యాసకులుగా పనిచేశారు. 1926 లో ఆంధ్రప్రశక్తి, గిరికుమారుని ప్రేమగీతాలు, కిన్నెరసాని పాటలు, కోకిలమ్మ పెళ్ళి, నర్తనశాల, శృంగారవీధి, అనార్కలి వంటి ఖండకావ్యాల్ని రచించారు. 1929 లో ఎం.ఎ చదివారు. కొంతకాలం గుంటూరు ఆంధ్రక్రైస్తవ కళాశాలలో అధ్యాపకత్వం చేశారు. 1938 లో విజవాడ ఎస్.ఎస్ ఆర్ అండ్ సి.వి.ఆర్ ప్రభుత్వ కళాశాలలో ఆంధ్రోపన్యాసులుగా 21 సంవత్సరాలు పనిచేశారు. 1958 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలి సభ్యత్వం లభించింది. 1959-61 లో కరీంనగర్ కళాశాల అధ్యక్షునిగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షులుగా నిర్వర్తించారు. విశ్వనాథ సత్యనారాయణ గారికి లభించిన పురస్కార పరంపరలు:

మహాకవి, అసమాన ప్రతిభాశాలియైన శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారిని ఆంధ్రదేశమే కాక భారతదేశమందలి వివిధ సంస్థలు సన్మానించి గౌరవించాయి. ఈయన రచించిన 'వేయిపడగలు' నవలకు ఆంధ్ర విశ్వవిద్యాలయ బహుమానం లభించినది. 1935 లో బందరులో భావరాజు వారి అధ్యక్షతలో 'కవిసమ్రాట్' బిరుదు ఇవ్వబడింది. 1942 వ సంక్రాంతి పర్వదినాన గుడివాడలో గజారోహణోత్సవం జరిగింది. 1957 లో ఆంధ్రసాహిత్య అకాడమీ అధ్యక్షపదవి లభించింది. ఈయన రచించిన శ్రీమద్రామయణ కల్పవృక్ష పఠనోత్సవాలు వివిధ నగరాలలో నిర్వహింపబడినాయి. ఆనాటి నుండి రామాయణ కల్పవృక్ష కావ్యంపై విమర్శలు, సమర్ధనలు. 'భారతి' పత్రిక వీరికి వివాదస్థానమైంది. ఆపత్రికలో వెలువడిన విమర్శనలే ఈయన కవిత్వ తత్వానికి రచనా వైదగ్ధ్యానికి నికషోపలములైనాయి. ఆ తర్వాత 1963 లో "విశ్వనాధ మధ్యాక్కఅలకు" సాహిత్య పరిషత్తు వారి పురస్కారం లభించింది. 1965 లో ఆంధ్ర విశ్వవిద్యాలయంవారిచే "కళాప్రపూర్ణ" బిరుదం ప్రదానం చేయబడింది. 1966 లో కలకత్తా నగరంలో పుష్పకిరీట గౌరవం లభించింది. 1967 లో అఖిలభారత బెంగాలీ రచయితల సభలో గౌరవ పురస్కారాన్ని పొందారు. 1970 లో కేంద్ర ప్రభుత్వం "పద్మభూషణ" సత్కారాన్ని పొందారు. ప్రముఖ సాహితీ వేత్త, రాజకీయ దురంధరుడు పి.వి. నరసింహారావు గారిచే వేయిపడగలు నవల హిందీ భాషలో అనువదింపబడింది. తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు విశ్వనాధ వారికి డాక్టరేట్ బిరుదును ప్రదానం చేశారు. సాహిత్య రంగంలో విశిష్టమైన కృషి చేసిన ప్రముఖ కవికి లభించు అత్యున్నత పురస్కారం జ్ఞానపీఠ అవార్డు. ఈ అవార్డు విశ్వనాధ సత్యనారాయణగారి విశిష్ట కావ్యం 'శ్రీమద్రామయణ కల్పవృక్ష' కావ్యానికి 1971 లో లభించింది. భారత దేశవిశిష్ట సాహిత్య పురస్కారమైన జ్ఞానపీఠ పురస్కారము ద్వారా ఆనాడు లక్షరూపాయల నగదును, జ్ఞాపికను శ్రీ విశ్వనాధ వారు పొందారు. ఆ సంవత్సరమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశ్వనాధ వారిని ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవిగా ప్రకటించింది.

శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు కవిగా, రచయితగా, విమర్శకునిగా, నవలాకారునిగా, వక్తగా ఆంధ్రదేశంలో గొప్ప ఖ్యాతిని పొందారు. సభలలో ఈయన గానం చేసిన కిన్నెరసాని పాటలు శ్రోతల హృదయాల్ని రసప్లావితం చేశాయి. ఈయన చేపట్టిన ప్రతి సాహితీ ప్రక్రియ ఆయన కీర్తికి అద్దం పట్టింది. సాహిత్యంలో ఎన్ని ప్రక్రియలున్నవో అన్నింటిని సంప్రదాయ బద్ధంగా నిర్వహించిన ప్రతిభాశాలి విశ్వనాథ. ఈయన అనేక కావ్యాలకు పీఠికలను వ్రాశారు. ప్రతి పీఠిక యందును ఆ కావ్య రచయిత వ్రాసిన ఛందస్సులోని పరమ రహస్యాలను, భాష, చందస్సు, జీవన లక్షణములకు గల అవినాభావ సంబంధం వంటి ఎన్నో విషయాలను ఆయన తనదైన శైలిలో వివరించారు.

విశ్వనాథ సత్యనారాయణ గారికి పద్యం హృదయపులోతుల్ని తొలుచుకొని వస్తుంది. నూటికి నూరుపాళ్ళు తెలుగుదనాన్ని నింపుకొని వస్తుంది. వెన్నముద్దల్లాంటి పద్యాలు వందల కొద్దీ వ్రాశారాయన. ఒక్కొకపద్యం' రెక్కలు చాచి తీరికగాౘ గాలిలో దేలిపోయెడు నంచవోలె' వస్తుంది. అనంతగంభీరమైన అర్ధాన్ని హేలగామోసుకొని వస్తుంది. చాల మంది అనుకుంటున్నట్లుగా ఆయన పద్యాలన్నీ 'అంతః ప్రగర్జన్మహాంభోదరములు, అశనిపాతోగ్రఘోరాంబుదములు' కావు. శ్రీదివాకర్ల వెంకటావధానిగారు విశ్వనాథ సత్యనారాయణ గారిని పురుషాకృతిదాల్చిన శారదాదేవిగా అభివర్ణించారు.

"ఓయి తమ్ముడ విశ్వనాథోదరాశి
జో పూర్ణిమా హిమ భానుడై పురుష మూర్తి
నవతరించిన వాగ్దేవియైన వాని
సత్యనారాయణుని జేరజనగదయ్య"

దివాకర్ల తిరుపతి శాస్త్రిగారు చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు జంటకవులుగా 'తిరుపతి వెంకటకవులు'గా ప్రసిద్ధికెక్కారు. దివాకర్ల తిరుపతిశాస్త్రి గారి కుమారులే దివాకర్ల వెంకటావధానిగారు. అందువలననే విశ్వనాథ వారిని దివాకర్ల వెంకటావధానిగారు ప్రీతి పూర్వకంగా ఓయీతమ్ముడా! అని సంభోధించారు.

## 14.2.2. శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారి రచనాకుసుమాలు :

**ఎ) ఖండకావ్యాలు :** ఆంధ్ర పౌరుషం, ఆంధ్రప్రశస్తి, గిరికుమారుని ప్రేమగీతాలు, శృంగార వీధి, శశిదూతం, ఋతుసంహారం, కిన్నెరసాని పాటలు, కోకిలమ్మ పెళ్లి, మాస్వామి, వరలక్ష్మి త్రిశతి, ఝాన్సీ రాణి, శివార్పణం, భ్రమరగీతాలు మొదలైనవి. మహాకావ్యం: శ్రీమద్రామాయణ కల్పవృక్షం

**బి) నవలలు :** వేయిపడగలు, స్వర్గానికి నిచ్చెనలు, తెఱచిరాజు, మాబాబు, ధర్మచక్రం, వల్లభమంత్రి, విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు, స్నేహ ఫలం, పులుల సత్యాగ్రహం దేవతల యద్ధం, పునర్జన్మ, కడిమిచెట్టు, పరీక్ష, చెలియలికట్ట, ఏకవీర, జేబుదొంగలు, నందిగ్రామరాజ్యం బానావతి, అంతరాత్మ, గంగూలీ ప్రేమకథ, ఆఱునదులు, చందవోలు రాణి, ప్రళయనాయుడు, హాహాహూహూ, వీరపూజ, మ్రోయుతుమ్మెద, సముద్రపుదిబ్బ, కుణాలునిశాపం, దమయంతీ స్వయంవరం, నీలపెండ్లి, శార్వరి నుండి శార్వర దాకా, బద్దన్నసేనాని, వీరవల్లుడు, కుక్కగొడుగులు,దిండుకింద పోకచెక్క, చిట్లీ చిట్లని గాజులు, సౌదామిని, లలితాపట్టపురాణి, దంతపుదువ్వెన, దూత మేఘము, కవలలు, యశోవతి, పాతిపెట్టిన నాణెములు, సంజీవకరణి, మూడుతరాలు, మిహరకులుడు, భ్రమరవాసిని, మొదలైనవి.

పురాణవైర గ్రంథమాల పేర పన్నెండు నవలలను శ్రీ విశ్వనాథ వారు రచించారు. అవి: భగవంతుని మీదిపగ, నాస్తికధూమం, ధూమరేఖ, నందోరాజాభవిష్యతి, చంద్రగుప్తుని స్వప్నం, అశ్వమేధం, అమృతవల్లి, పులిముగ్గు, నాగసేనుడు, హెలీనా, వేదవతి, నివేదిత.

నర్తనశాల, సౌప్తిక ప్రళయం, అనార్కలి, వేనరాజు, త్రిశూలం, తల్లికానిపిల్ల, కళింగరాజ్యం, వంటి నాటకాలను విశ్వనాథవారు రచించారు.

విమర్శకునిగా విశ్వనాథ సత్యనారాయణగారి బహుముఖ ప్రజ్ఞను ఆవిష్కరించే విమర్శనాత్మక రచనలలో 'నన్నయగారి ప్రసన్న కథాకలితార్థ యుక్తి,' 'అల్లసాని వాని అల్లిక జిగిబిగి', 'శాకుంతలము యొక్క అభిజ్ఞత,' 'ఒకడు నాచన సోమన్న', 'ఆంధ్ర మహాభారతోపన్యాసములు' వంటివి ముఖ్యమైనవి.

ప్రాచీన భారతీయ సంస్కృతిపై విశ్వనాథ సత్యనారాయణ గారికి అభిమానం ఎక్కువ. తన రచనల ద్వారా సనాతన భారతీయ తత్వాన్ని ప్రకటించారు. తానునమ్మిన సిద్ధాంతాలను తన జీవితాంతం ఆచరించి తన రచనలలో నిర్భయంగా వెల్లడించిన అద్వితీయ ప్రతిభామూర్తి ఈయన.

విశ్వనాథ సత్యనారాయణ గారు ధిషణాసవీనుడు, 'పాతయనిపించు సరికొత్త పథమునాది' అనిప్రకటించుకొన్నాడు, 'కావ్యపరీమళం' లో 'తెలిసికోకుండా వ్రాసినవాడు కవి. తెలిసి వ్రాసిన వాడు మహాకవి అని అంటారీయన. మరొక సందర్భంలో 'కవులు చాలమంది సామాన్యంగా కవితాసృష్టి వేళ ఋషులు. మామూలువేళ వట్టి దగుల్బాజీలు' అన్నారు. కాళిదాసాది మహాకవుల రచనలకే కాలం చెల్లిందని భావించే పాఠకులు ప్రబలుతున్న కాలంలో తనరచనలు ఎవరికోసమోకాదని భగవంతునికి నివేదిస్తూ

'ఇది మెచ్చెదరా? మెచ్చరో
యిదియును జదివెదరు జదువరేలా నాక
య్యది? నా యెద మీతో రా
చెద నద్దానికి ఫలంబు జెందించుశివా!' అని భావించారీయన.

శ్రీ విశ్వనాధ సత్యనారాయణ గారి పరశ్యత గ్రంధసముదాయంలో శిరోరత్నం లాంటి మహత్తర కావ్యం 'శ్రీమద్రామాయణ కల్పవృక్షం'. స్వాతంత్ర్యానంతరం వెలసిన సంప్రదాయ సాహిత్యానికి ఈ కావ్యం మకుటాయమానం. రాశిలోనే కాక వాసిలో కూడా రామాయణ కల్పవృక్షరచన ఒకమలుపు లాక్షణికలు కావ్య హేతువులుగా పేర్కొన్న ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసము ఈ మూడింటి కూడలిగా తాను రచించిన రామాయణ కల్పవృక్షాన్ని విశ్వనాధ వారు అధికంగా ప్రేమించారు. కమ్మని కంఠంతో రాగ రంజితంగా కవితాగానం చేసి శ్రోతులను పరవశింపజేశారు. రామాయణ కల్పవృక్ష సృష్టిచేత అపర వాల్మీకిగా గౌరవార్హులైనారు. ఈ కావ్యాన్ని విశ్వనాధ సత్యనారాయణ గారు 1934 లో ఆరంభించి 1962 లో పూర్తి చేశారు. "విశ్వనాధ కవిత మెరపునకు శిఖరాయమానము శ్రీమద్రామాయణ కల్పవృక్షము" అని దివాకర్ల వెంకటావధాని గారు ప్రశంసించారు. రామాయణ కల్పవృక్ష కావ్యంలో నన్నయ భట్టారకుని కధాకధన శిల్పం, తిక్కన, సోమయాజి చిత్రించిననాటకీయ శిల్పం విశ్వనాధ సత్యనారాయణ గారు కనబరిచారు. ఈ భావన తోనే రామాయణ పీఠికలో

'నన్నయ్యయు దిక్కన్నయు,
నన్నావేశించిరి పరాణాహమనస్సం
చన్నత వారలు పోయిన
తెన్నున మెఱుగులు దీర్చి దిద్దుచు బోదున్' అని చెప్పుకొన్నారు.

### 14.2.3. విశ్వనాధ - కవితారీతులు

**ఎ) రామాయణ కల్పవృక్షం :** విశ్వనాధ వారి భావనా వైభవం అద్భుతం, తన హృద్గత భావాల్ని అనుసరించి శబ్దాలు రావాలిగాని పదాల కోసం వెదుకులాట ఉండదు అందుకే "దీపితాలాతము వోలె నామది విలంబన మోర్వదు నిత్యవేగి నా చేతము శబ్దమేరుటకు జిన్నయునిల్వదు భావతీవ్రతన్" అని చెప్పుకొన్నారు. ఇంతటి భావతీవ్రతగల కవి శబ్దా లేరుకొని శైలియే పరమార్థమనుకొనలేదు.

కథను ఎవరైనా చెప్పవచ్చును. కధాకధనవు సామర్థ్యాన్ని బట్టి మాత్రమే మహాకవి శబ్దవాచ్యుడౌతాడు. అందువల్లనే రామరాజ భూషణుడుగా పేరు పొందిన భట్టుమూర్తి కవి తన వసు చరిత్ర పీఠికలో

'కేవల కల్పనా కథలు కృత్రిమ రత్నము లాద్యసత్కథ
ల్వావిరి పుట్టురత్నము లవారిత సత్కావి కల్పనా
విభూ షావహ పూర్వ వృత్తములు సానలు దీరిన జాతి రత్నముల్
గావున నిట్టి మిశ్రకధగా నొనరింపుము నేర్పుపెంపునన్"

అన్నాడు. కేవలం పురాణ కధావస్తు విశేషంలేక కల్పింపబడిన కధావస్తు కావ్యాలు గాజురాళ్ళ వంటి కృత్రిమ రత్నాలు. పురాణ కధలు గని నుండి అప్పుడే తీసిన రత్నపు సాన బట్టిన మణుల వంటివి.

ఒకమహోదాత్తమైన కధను రసప్లావితంగా వైలక్షణ్యంతో తీర్చిదిద్ద గలిగిన వాడే మహాకవి. కధ కంటే రసపోషణ, రసానుభూతి హృదయాల్ని హత్తుకుంటుంది. ఆ కారణంగానే విశ్వనాధ వారు ఇలా అన్నారు

"మరల నిదేల రామాయణంబన్నచో నీ ప్రపంచమెల్ల వేళల
తినుచున్న యన్నమే తినుచున్నదిన్నాళ్ళు తనరుచి బ్రతుకులు తనవిగాన
చేసిన సంసారమే సేయుచున్నది తనదైన యనుభూతి తనదిగాన

తలచిన రామునే తలచెదనేను నా భక్తి రచనలు నావిగాన
కవి ప్రతిలోన నుండును కార్యగత శతాంశముల యందు తొంబదియైన పాళ్ళు
ప్రాగ్వి పశ్చిన్మతంబున రసము వేయి రెట్లు గొప్పది నవకథా ధృతిని మించి"

కావ్యానికి కథకంటే రసానుభూతిని కల్గించే లక్షణం అతిముఖ్యమైనది. అలాగని కథ ఏదైనా పర్వాలేదు అనటం కూడా సరియైనది కాదు. మహాకావ్య రచన చేయగల సామర్థ్యం ఉన్న ఒక నూతన మైన కథను కల్పించటం గొప్ప విశేషమేమికాదు. ఉదాత్తమైన చరిత్ర గల నాయకునికి సంబంధించిన కథను ఎన్నుకొని దానిని రసపరిపుష్టం చేస్తూ చేసిన రచనకే శాశ్వితత్వం లభిస్తుంది. ఆ విధమైన రసానుభూతిని కలిగింప చేసే వర్ణనా నిపుణత్వం ప్రదర్శించవలెనంటే ఆ రచయితకు హృదయ పరిపక్వత ఉండాలి. అదే జీవుని వేదన. అందుకే విశ్వనాథ వారు తాను శ్రీరాముని కథను కావ్య వస్తువుగా సంభవించటానికి కారణాన్ని ఇలా చెప్పారు.

"వ్రాసిన రామ చంద్రు కథ వ్రాసితి వంచని పించుకో వృధా
యాసము గాక కట్టుకతలైహికమా? పరమా? యటంచు
జేసిన తండ్రి యాజ్ఞయును జీవుని వేదన రెండునేకమై
నాసకలోహ వైభవ సనాథము నాథ కథన్ రచించెదన్"

"వ్రాసిన నీవు రామ కథ వ్రాసితినంచని పించు" కొనమని తండ్రి ఉపదేశించగా, దానికి జీవుని వేదన తోడుకాగ సకలోహ వైభవంతో శ్రీమద్రామయణ కల్పవృక్షం అవతరించింది.

"ఒక్క వాల్మీకి కాక వేఱొక్కడెవడు
సుకవి శబ్ద వాచ్యుండిక గుకలి నింద
యప్రశస్త పథంబుగా నవుట జేసి
ముని ఋణముదీర్ప నీ కావ్యమును రచింతు"

అని పలికిన విశ్వనాథ వారు వాల్మీకి రామాయణాన్ని హృద్గతం చేసికొని వాల్మీకి కవితా సృష్టికి ఎంతగా పులకించి పోయారో, ఎంతటి అభినివేశాన్ని పొందారో తెలుస్తుంది. అంతటి మహత్తరమైన అనుభూతిని వ్యక్త పరుస్తూ శ్రీమద్రామాయణ కల్పవృక్ష రచన చేయనారంభించారు.

కవి తాను ఊహించి, దర్శించిన సన్నివేశ చిత్రణ కోసం కల్పించే పద సముదాయం ఆ కవి యొక్క సాహిత్య స్థితికి ప్రత్యక్ష ప్రమాణం అవుతుంది. తిక్కన సోమయాజి మహాభారతంలోని విరాట పర్వంలో ద్రౌపదికి జరిగిన అవమానానికి క్రుద్ధుడైన భీముని కోపాతిశయాన్ని ఇలా వర్ణిస్తాడు.

కనుగొని కోప వేగమున గన్నుల నిప్పులురాల నంగము
ల్గనలగ, సాంద్రఘర్మ సలిలంబులు గ్రమ్మ, నితాంతం దంతపీ
డనరట దాస్యరంగ వికట భ్రుకుటీ చటుల ప్రవృత్త వ
ర్తన ఘటనా ప్రకార భయదస్ఫురణా పరిణద్ధ మూర్తి యై.

రసానికి, ఛందస్సుకు పరస్పరాశ్రయం ఉండడం సహజం. మృదుగమనం గల చంపకమాల వృత్తంలోనే రౌద్రరసా విష్కరణం చేయగల్గటం మహాకవి తిక్కన నేర్పు. అంతేకాదు కోపం వచ్చింది ఎవరికి? భీముడికి అందుకే

"నేలయు నింగి యుదాళముల్ గా జేసి
యేపున రేగి వాయించి యాడ
గుల పర్వత ంబులు గూర్చి యొండొంటితో
దాకంగ వీకమై దన్ని యాడ

నేడు సాగరములు నిక్కడక్కడ బెట్టి
పలుచని రొంపి మైనలది కొవగ
దిక్కులు నాలుగు నొక్క చోటికి దెచ్చి పిసికి పిండిలి సేసి పిడుచగానక మిగిలి బ్రహ్మాండ భాండంబు పగుల వ్రేయ
నప్పళించుచు, ప్రళయ కాలానమున
గండరించిన రూపంబు కరణి భీము
డతి భయంకరాకారత నతిశయిల్లె,

ఈ పద్యంలో వర్ణించిన అంశాలు అయిదు అసాధ్యాలు, అసంభావ్యాలుకూడా. అయితే అటువంటి పనులు చెయ్యాలన్న తపన, సాహసభావన భీమసేనునిలో ఏర్పడ్డాయి. అదీ భీమసేనుని రౌద్ర భావనకు అక్షరాకృతి.

శ్రీమద్రామాయణ మహాకావ్యంలో సీతా స్వయంవర సన్నివేశం అద్భుతమైనఘట్టం. శివధనుర్భంగం అత్యాశ్చర్యజనకం.

మంజూషలోనె యమర్చి కోణం బందు
నొక్కి త్రాడం గొప్పనెక్కు వెట్ట
గాబోలు మంజూషికావినిర్గమనంబు
వేళకే జ్యావల్లి బిగిసి యుండె
దాళ ప్రమాణ మౌధనువు జానకిదృష్టి
కడ్డమ్ముగా వచ్చు నంచు నెంచె
గాబోలు నడ్డంబుగా ధనుస్సుబూని
పిడిబాకు వలె డ్రాడు వ్రేలలాగె

నతనిదృష్టికి జానకి యాగలేదు
అతని కృష్టికి శివధనుస్సాగలేదు.
సీతాపూజడ వెన్నుగా శిరసు వంచె
జెఱకుగడ వోలెనడిమికిఱిగెధనవు

ఛిన్నమైన శివధనుస్సు నుండి ఒక ధ్వని వెలువడినిది. ఈ సన్నివేశాన్ని పురస్కరించుకొని

"ఫెళ్ళుమనెవిల్లు గంటలు
ఘల్లుమనెగుభిల్లు మనె గుండె నృపులకు
జల్లు మనియు జానకీ దేహ మొకవి మెపమునందె
నయముజయము భయము విస్మయముగదుర"

అని కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు లలిత లలితంగా భావించారు. మరి ప్రౌఢసంస్కృత సమాజభూయిష్ఠ రచన విన్యాస భావుకుడైనా విశ్వనాథ సత్యనారాయణ గారు ఆ వెలువడిన ధ్వనిని, ఆధ్వని శివలోక, స్వర్గలోక, దైత్యలోక, రాజలోకాలలో ప్రతిధ్వనించిన తీరును వర్ణించిన విధానం పరమాద్భుతం.

"నిష్ఠా వర్షదమోఘ మేఘ పటలీ నిర్గచ్ఛ దుద్యోతిత
స్వేష్ఠేరమ్మద మాలికాయుగపదు జ్జృంభన్మహాఘోర బం
హిష్ఠ స్ఫూర్జదుపండ ఘర్ఘరవా హీనక్రియా ప్రౌఢి ద్రా
ఘిష్ఠమై యొక రావమంతట నెసంగన్ భిన్న చాపంబునన్"

"హేరంబోన్నత శూర్పకర్ణ వివర హ్రీకారియై షణ్ముఖి
స్ఫార ద్వాదశ నేత్రగోళ వివృతి ప్రాకారమై శైల క
న్యా రాజన్మ వఫాల మండల విభుగ్న క్రీడయై యాశ్వల
ద్గీరుగ్ర ప్రమథంబుగా ధనువు మ్రోగెన్ శైవ లోకంబులన్"

"నృద్యన్మంజుల తారహం కబరీ నిష్యంది ముక్తామణి
ప్రత్యగ్ర ప్రసవాక్షి సంకలన దీవ్యత్కంధరాభేద సా
హి త్య ప్రౌఢ వవాప్సరో నటవ సాహిత్య ప్రశస్తాచ్ఛద్ర
ద్గాత్లాకార మనోజ్ఞమై ధనువు మ్రోగెన్ స్వర్ణలోకంబులన్"

"దర్పస్ఫీ కృత హాస విశ్లథన రుంధద్దుష్టి వాగ్దోరణీ
సర్ప ద్వీరచమూ పథశ్య ధన మై ప్రంసత్కటే శాటికా
కూర్పాస ప్రకటోగ్ర సాధ్యసన ధూగుర్విణ్య భద్రాధ్వమై
దర్పాడంబరమై ధనస్సుమొఱసెన్ దైతేయ లోకంబులన్"

" స్ఫీతాష్టాపద విద్యుదు జ్జ్వల పయః పీయుష ధారాధునీ
నీతా స్వాద్యతర ప్రగల్భ వచనాస్నిగ్ధానవా భోజ సం
ధా తీర్థం కరమాగ ధోల్బణము నానా మేదినీ రాట్సభా
గీతి స్వాదు మనోజ్ఞమై ధనువుమ్రోగెన రాజలోకంబులన్"

ఇంతటి సంక్లిష్ట రచనా విన్యాసం సామాన్యులకు అంతు పట్టనిది. ఇట్టి సన్నివేశాలను దృష్టిలో పెట్టుకొని కొందరు విశ్వనాథ సత్యనారాయణ గారిని 'పాషాణ పాక ప్రభూ' అన్నారు. నిజమే అర్థం చేసికోగలిగితే నారికేళపాకం. ఆ శక్తి లేనివాడు పాషాణ పాకమే అనిపిస్తుంది.

శివధనుర్భంగ వార్తవిని పరశురాముడు క్రుద్ధుడయ్యాడు -

"ఎవ్వడురా? త్రిలోచను నహీన మహాధను వెత్తి చేత క్రౌం
బువ్వు విధాన దాని బలుముక్కలు సేయగ సాహసింపగా
గ్రీవ్విన వాడు వానిచుఱుకున్ దెలివింగని సంతసించుచున్
నవ్విన వాడు మత్పరశు నవ్య మహోగ్నుల పాలు చేసెదన్"

అని పలికాడు. ఈ పద్యాలలోని అక్షరాల్లో అంతటా ఒకవ్యంగ్య స్ఫూర్తి కనిపిస్తుంది. "ఎవ్వడురా?" అనే సంబోధనలో గల ఎగుడు దిగుడులన్నీ కోపావేశంలో చిందులు వేస్తున్న పరశురాముని ఊపును చెప్తాయి. 'అహీన మహాధనువు' అన్న సమాసంలోని 'హీ' 'హా' అన్నీ దీర్ఘాల మీద ఊనికనిలిచి శివధనుస్సు ఎంతగొప్పదో ఎంతపెద్దదో చెప్తుంది. దానిని శ్రీరాముడు "క్రౌంబువ్వు" లాగా పట్టుకొన్నాడట. ఆ విల్లు పొడవంతా రాముని చేతిలో ముడుచుకొని పోయి 'పలుముక్కలు' అయింది. పరశు రాముడు 'ఎవడురా వాడు'? 'ఎవడురా యాతడు' 'ఎవ్వడురా?' 'ఎవ్వడురా' అంటూ విరుచుకు పడిన వాక్యాలకు బదులుగా శ్రీరాముడు

'ఎవ్వడు ప్రమథులనేత హేరంబు హ్రీకారియయ్యె
నెవ్వని కతమున స్వామి దృక్తతి యింతగానిచ్చె
నెవ్వడు శివఫాల విధృతి హేతువై యెగసునో వాడు
క్రొవ్వి శివ ద్రోహ పథము కొన్నటి కొండీడు వేను"

అని పలికాడు. పరశురాముడు నిర్లక్ష్యంతో పలికిన పలుకుల పొందికగా మూడు ముక్కల్లో శ్రీరాముడు చెప్పిన సమాధానం ఇది. ప్రశ్నలలోను, సమాధానాలలోను, ఉన్న వాక్యాలలో పునశ్చరణ పొందిన 'ఎవ్వడు'అను పదం పాఠకులలో రసస్ఫూర్తిని కలిగిస్తుంది.

గౌతముడు ఒక మహాముని. ఆయన ధర్మపత్ని అయిన అహల్య దేవేంద్రుని ప్రలోభానికి లొంగిపోయి మనస్సుతో వ్యభిచరించింది. విషయం తెలుసుకున్న గౌతముడు ఆమెను గాలియే భోజనంగా, మరొక ఆహారం లేని దానివై బూడిదలో పొర్లాడుతూ, ఏ ప్రాణికి కనబడకుండా ఇక్కడ పడిఉండు. దుర్ధర్షుడైన దశరథరాముడు ఈ ఘోరమైన వనానికి వచ్చినప్పుడు నీవు పవిత్రురాలివౌతావు. చెడునడవడికల నీవు ఆయనకు ఆతిధ్యమిచ్చి లోభమోహాలను వదలి నీదైన సుకుమార దేహాన్ని మరల పొంది ఆనందంతో నావద్దకు వస్తావు అని పలికి హిమాద్రికి పోయి తపస్సు చేసుకొన్నాడు. అహల్య వేలసంవత్సరాలు రాయిలా పడి ఉంది. శ్రీరామచంద్రుడు సమీపించినంతనే ఆమెలో చైతన్యం వెల్లివిరిసింది.

'ప్రభుమేని పై గాలి పైవచ్చి నంతనే
పాషాణ మొకటికి స్పర్శవచ్చె
ప్రభు కాలి సవ్వడి ప్రాంతమైనంతనే
శిలకొక్కదానికి చెవులు గలిగె
ప్రభుమేని నెత్తావి పరిమళించిన తోన

యశ్మంబు ఘ్రాణేంద్రియంబు చెందె
ప్రభు నీల రత్నతోరణ మంజులాంగంబు
గనవచ్చి ఱాతికి గనులు గలిగె
ఆ ప్రభుండు వచ్చి యాతిధ్యమున స్వీక
రించినంత నుపల హృదయవీధి
ను పనిష ద్విత్తాన మొలికి శ్రీరామ భ
ద్రాభి రామ మూర్తి యగుచుదోచె.'

అహల్యకు శాపవిమోచనం కలిగింది. రాయి సతీమూర్తిగా పరిణమించింది. ఆ పరిణామక్రమాన్ని, పంచేంద్రియముల శబ్ద స్పర్శ రసరూప గంధాలకు అన్వయించి విశ్వనాధ సత్యనారాయణ గారు కమనీయంగా, భావనాత్మంగా, తత్త్వస్ఫోరకంగా ఈ సన్నివేశాన్ని వర్ణించిన తీరు అద్భుతం. లక్ష్మణుడు మూర్ఛపోయినప్పుడు శ్రీరాముడు

"ఇతడు చనిపోవలేదని యీవుచెపుము
యితని బ్రతికింతుననుచును నీవు చెపుము
యితడు బ్రతుకక యున్నచో బ్రతుకనేను
నాకురాజ్యమ్ము వలదు. జానకియు వలదు."

అన్నప్పుడు కరుణరసం ఉట్టి పడుతుంది. రాముని సోదర వాత్సల్యం విదితమవుతుంది.

శబరి ఒక వృద్ధ స్త్రీ. ఆమె రూపం ఎవ్వరిని ఆకర్షించదు. ఆమెకు గల రామభక్తి తత్పరతే ఆమెను శాశ్వతం చేసింది. ఆమె ఆకృతిని విశ్వనాధ వారు ఇలా వర్ణిస్తారు.

కడుపులో మెఱవుల గల పరించిన విట్ట
మొయిలు వెల్గులు వోని పూలు కొన్ని
బంగారమును రాగి పాళ్ళుగా గరగించు
వన్నెలై యున్నట్టి పండ్లు కొన్ని
కొన్ని పూవులు లేత జన్నె యావుపాదుగు

వలె గర్భమంధరోజ్జ్వల మధువులు
కొన్ని పండ్లు రసానుకూల వాంఛాపరీ
పాక ముగ్ధాకార వర్తులములు

విడివిడిగ మెట్ట పళ్లిక బేర్చి శిరసు
పైన నిడుకొని మెల్లగా వచ్చె శబరి
తుట్టతుది దాక నెండిన చెట్ట కొమ్మ
శేఖరంబున యందు బుష్పించినట్లు"

పాఠకులదృష్టి 'ఎండిన చెట్టుకొమ్మ" లాంటి శబరి భౌతిక శరీరం మీద కాక ఆమె ఆత్మజ్యోతిని ప్రకాశింప జేసిన పూలపై, పళ్లపై నిలుస్తుంది. శబరి పాత్రను విశ్వనాథ పోషించినట్లు మరొక కవి పోషించలేదు. మధుర భక్తితో నిండిన శబరి శ్రీరాముని ఇట్లా అంటుంది.

"చేతులునికి పూలు తెచ్చితిని స్వామి
చెట్లు కలవని పండ్లు తెచ్చితిని స్వామి
సతను వగుటను నేను వచ్చితిని స్వామి
చిత్రముండుట నూహచేసితిని స్వామి
నాదు ప్రాణములను నీకు మీదుకట్టి
నాదు నావయియుట వచ్చినావు స్వామి"

విశ్వనాథ వారి శైలి మృదు మధురంగా ఉంటుందనటానికి ఇది ఓ ఉదాహరణ. వాల్మీకి మహర్షి హృదయపు లోతులను చూచి రామాయణ గాథలోని ఎన్నో ఘట్టాలను పరమరమణీయంగా తీర్చిదిద్ది ఆంధ్ర సాహిత్యానికి రసరమ్య కావ్యంగా 'రామాయణ కల్పవృక్షా''న్ని అందించిన ప్రతిభాశాలి శ్రీ విశ్వనాథ సత్యనారాయణ.

ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర పోరాటాలు జరుగుతున్న కాలంలో దేశభక్తి ప్రపూరితమైన ఖండ కావ్యాల సృష్టి జరిగింది. ప్రాంతీయమైన దేశభక్తిని పెంపొందించటం ద్వారా భారత దేశ భక్తిని వ్యాపింప జేయగలమని కవులు భావించారు. పూర్వ చరిత్రలో ఆంధ్రులు సాధించిన విజయాలు, సంతరించు కొన్న వైభవాలు తెలుగు కవులకు కళ్ళల్లో మెదిలాయి. ఆవిధమైన గత వైభవాలను ఆంధ్రజాతి కందించి వారిలో ఉత్సాహం కల్గించాలని భావించారు. దానికోసం ఆంధ్రుల చరిత్రను త్రవ్వి ఆంధ్రజాతి శౌర్యాన్ని, ఐశ్వర్యాన్ని, కళలను స్తుతించటం ప్రారంభించారు. పూర్వాంధ్ర శౌర్యప్రభలను రాయప్రోలు సుబ్బారావు గారు కీర్తించగా ఆంధ్రపౌరషానికి అక్షరాకృతిని కల్పించుకొన్న వారు శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు రాయప్రోలు సుబ్బారావు సూచించి వదిలివేసిన ఆంధ్ర పౌరుషమనే పదానికి సమగ్రరూపం సత్యనారాయణ గారి 'ఆంధ్రపౌరుష' మనే కావ్యం. ఆంధ్రయువకులు తూరుపు కనుమ దుర్గముల నేలినదినమ్ము "లు రిల్పక పాటుశీత్రుల" ఆంధ్ర సైన్యాలు వేటాడే దినాలు సత్యనారాయణ గారి స్మృతిపథాన నిలిచాయి. ప్రధానంగా శౌర్యపు పాయసాన్నాన్ని అందించే కావ్యమే అయినా పురాప్రశక్తికి సంబంధించిన అనేక విషయాలు మహోన్నతంగా వర్ణింప బడ్డాయి.

"రుద్రుడైన ప్రతాపరుద్ర దేవుండోరు
గల్కోట బురుజుపై కాలుమోప
విద్యానగర రాజవీధి పట్టపు టేన్గు
పై గృష్ణరాయలు పాఱజూడ
పిడుగు మొత్తము బొబ్బిలి కోట పుండరీ
కము పాపరాయుడు కన్నులుఱమ
చాళుక్య రాట్ప్రతిష్ఠా కీర్తి చోళ నా
యక కీర్తి నెయ్యమ్ము నెఱప"

గాంచిన రోజులు జ్ఞాపకం చేయబడ్డాయి. కోటగోడల నుండి కుప్పించు ఎగిసిన వారు, అడుగుమండి శిఖరాగ్రానికి తేజీల నెగిరించిన వారు, వేలకు వేల శత్రువులమధ్య లఘించి హతమార్చిన వారు ఆంధ్రవీరులు.

'ఆంధ్రపౌరుషమన మాటలా! రిపూత్క
రముల గుండెలు వినినంత బ్రద్దలయ్యే'

ననిగత పౌరుష స్మరణలో మిన్నులందుకున్నారు. కాలవశాన ఈ పుర ప్రాభవము మరుగున పడ్డదని ప్రస్తుత దుస్థితికి విశ్వనాథ వారు కన్నీరు విడిచారు.

**బి) ఆంధ్ర ప్రశస్తి :** విశ్వనాథ సత్యనారాయణ గారి మరొక కావ్యం 'ఆంధ్రప్రశస్తి' ఇది వస్త్వాశ్రయ రీతిలో సాగిన శౌర్య ప్రశస్తి సంబంధ కావ్యం. రెండు వేల సంవత్సరాలకు పై బడిన కాలం నుండి ఈ తెలుగునేల నాలుగు చెఱగులలో వెలసిన అనేకములైన పూర్వాంధ్ర మహా సామ్రాజ్యాల ఉదయాస్తమయాలకు సంబంధించిన విషాదానంద శబలితమైన సంస్కృతి ధారయే యిందలి కావ్య వస్తువు. ఈ కావ్యాన్ని మల్లంపల్లి సోమశేఖరశర్మ గారికి అంకితం చేశారు. చరిత్రను కావ్యంగా ఎట్లు చేయవలెనో విశ్వనాథ నిర్దేశించారు. చరిత్ర అంతయు కావ్యానికి వస్తువుగా పనికిరాదు. అందు పుట్టురత్నముల వంటి గాథలు కొన్ని ఉండును. ఏ గాథకాగాథ ప్రత్యేక ప్రబంధమయ్యును అన్నియును కలిపి ఒక మహాప్రబంధంగా భాసించునట్లు నిర్మింపవలెను. ఈ విధమైన పద్ధతినను సరించియే విశ్వనాథ వారు 'ఆంధ్రప్రశస్తి' కావ్యనిర్మాణము గావించినారు.

'ఆంధ్రప్రశస్తి' యందు పదిరెండు గాథలు కలవు. ఆంధ్ర విష్ణువు, శాతవాహనుడు, గౌతమీ పుత్రశాతకర్ణి, మాధవవర్మ, వేగిక్షేత్రం, ముఖలింగం, నన్నయభట్ట, ప్రోలరాజు, ప్రోలరాజువధ, కొండవీటి పొగమబ్బులు, చంద్ర వంకయుద్ధం, యమదంష్ట్రిక అనునవి. ఆంధ్రవిష్ణువు, శాతవాహనుడు, గౌతమీ పుత్ర శాతకర్ణి శాతవాహన రాజులు. మాధవవర్మ పల్లవరాజు. వేంగిక్షేత్రం పల్లవరాజుల రాజధాని. ముఖలింగం కళింగగాంగ వంశజులది. నన్నయభట్టు తూర్పుచాళుక్యులకు సబంధించింది. ప్రోలరాజు కాకతీయులకు సంబంధించింది. చంద్రవంక యుద్ధం పలనాటి చరిత్రలోనిది కొండవీటి పొగమబ్బులు రెడ్డిరాజులది. యమదంష్ట్రిక విజయనగర రాజులది.

పల్లవరాజు మాధవవర్మ బెజవాడ రాజధానిగా ఆంధ్ర దేశాన్ని పాలించినవాడు. అతని ధర్మమునకు మెచ్చి దేవతలు రెండు ఘడియల కాలంవిజయవాటికా పట్టణములో కనకవర్షం కురిపించారట. తన ఒక్కగానొక్క కుమారుని కారణాన పుత్రుని కోల్పోయిన ఒక స్త్రీకి తాను చేయదలచుకొన్న న్యాయం తనకుమారునికి మరణశిక్ష వేయించింది. తనకుమారుని మరణశిక్షను తప్పించ గలిగినప్పటికివి మాధవవర్మ ఆ పని చేయలేదు. ఆతడు "పుత్రవిరహాగ్రభరాత్ముడకాని నాయ్యు కార్యచరణ భారదుఃఖ వివశాత్ముడగా"నని పల్కి తన ధర్మ దక్షతను ప్రకటించాడు.

'వేగిక్షేత్రము' ఒకచక్కని ఖండిక. వేగిక్షేత్ర పురావైభవమును తలచుకొని విశ్వనాద కవి గుండె జల్లుమన్నది. ఆర్ద్రమానసుడైన కవి కార్చిన వేడి కన్నీళ్ళు కరళ్లు కట్టి పద్యాలైనవి.

'ఏరాజు పంచెనో యిచట శౌర్యపు చాయ
    సమ్ములు నాగుల చవితినాళ్ల
ఏ యెట్టి సంజలో నెలదు పల్లవ రాజు
    రమణులు కాళ్ల బారాణు లిడిరొ
చిత్రరథ స్వామి శ్రీరథోత్సవములో
    దెలుగు పిల్లలు కత్తి త్రిప్పి రెపుడొ
ఏ రెండు జాముల యినుని వేడిమివచ్చి
    కలిసి పోయెనొ త్రిలింగ ప్రభువుల
వాజగచ్ఛేయసంబులై యలరు తొంటి

వేంగి రాజుల పాద పవిత్ర చిహ్న
గర్భితమ్మైన యీభూమి ఖండమందు
వశ్రువులు జేరు జీవచ్ఛ వాంధ జనులు"

'ఆంధ్రప్రశస్తి' ఖండకావ్య సంపుటిలోని వేగిక్షేత్రమందలి ప్రతి పద్యం హృద్యమే.

ఇట వేగీశుల పాదచిహ్నములు లేవే? లేవుపో! భావనా స్ఫుట మూర్తిత్వము నైనబొందవు. నేదోపూర్వాష్టాదుష్కాల పుంఘటికల్ గర్భమునందిముద్చుకొనియెం గాబోలు, నీ పల్లెచోటలలో కాద్భుత దివ్య దర్శనమటే! యాభోగ మేలాటిదో! అని పలికిన కవి

ఈనా పదార్పిత క్షోణి నేరాజు ధ
ర్మా సనంబుండి స్మృత్యర్థ మనెనొ
ఈ నాదృగావృతంబైన భూములలోన
నేశౌర్యధనులు శిక్షింపబడిరొ
ఈ నా శరీరమందివతళించిన గాలి
యెంత పౌరాతన్య మేచుకొనెనొ
ఈనాతమాపూర్ణ మైన యాకాశమ్ము
నేక్రతు ధ్వనులు శబ్దించినదియొ

అస్మదజ్ఞాత పూర్వ దివ్యత్వ మొప్పు
నీ పునీతావనీ ఖండ, విచటనిలిచి
యస్వతంత్రత దొరలు నాయాంధ్రశక్తి
నన్ను గంపింప జేయుచున్నది భృశము

అని పరదేశీయుల పరిపాలనలో అస్వతంత్రులుగా బ్రతుకుతున్నామనెడి భావన విశ్వనాధ వారిని చలింపజేసింది. అంతేకాదు'ఆంధ్ర పల్లవ నరేంద్ర శ్రీయశ స్తంభం'లా తాను నిలిచినట్లు తలచాడు. అక్కడి శాద్వలాంకురాదులలో పూర్వనృపచరిత్రలే దర్శించాడు. పాదలనడుమ తిరుగుతూ పూర్వరాజుల 'పురవీధులలో' సంచరించునట్లు భావించాడు. 'నన్నీవింతగా నెదపదిలించు కొన్నదిది యెక్కడి పూర్వపు జన్మవాసనో' అని విశ్వనాధ వారు కర్మ సిద్ధాంతంపైగల విశ్వాసాన్ని స్ఫురింపజేశారు. అలాగే 'ముఖలింగా'న్ని దర్శించినపుడు ఆ జీర్ణ దేవాలయ స్థితిగతులకు ఆయన 'గుండె నెత్తురులు' కదలాడినాయి. ప్రళయంవచ్చి తెలుగు నేల మునిగి పోయినా పరవాలేదు కాని మనకు స్వాతంత్ర్యం సిద్ధించాలి అనే ఒక ప్రగాఢ వాంఛను విశ్వనాధ వారు ప్రకటించారు.

'తెలుగు నదులెల్ల పొంగెత్తి ప్రళయ వారి
కెరలివడి తెన్గునేల ముగించినిమ్ము
నేటితో నస్వతంత్రతా నియతమైన
యీ బ్రతుకు తెన్గువారు భరింలేరు.

అదే విధంగా 'కొండవీటి మబ్బుల'ను దర్శించినపుడు 'పలిపమ్ము చికిముత్యాల యంచుల్లా, జఘన భాగోపరిస్రస్త చేలం'లా గిరిలక్ష్మి మొగముపై మొగలి పుప్పొళ్లు'లా స్వేదబిందువుల్లా ఉన్నాయనటం ప్రతిభావంతం.

**సి) కిన్నెరసాని పాటలు :** ఆధునికాంధ్ర సాహిత్యంలో 'కిన్నెరసాని పాటలు' అగ్రశేణికి చెందుతాయి. ఇది విశ్వనాధ వారి అపూర్వ సృష్టి. విశ్వనాధ వారు ప్రతి ఉపన్యాసానికి ముందుగా తప్పక ఈ గేయాల్ని ఆలపించేవారు. ఇందులో 8 భాగాలున్నాయి. కిన్నెరపుట్టుక, కిన్నెర నడకలు, కిన్నెర నృత్యం, కిన్నెర సంగీతం, కడలిపొంగు, కిన్నెరదుఃఖం, గోదావరి సంగమం అనునవి, భావకవిత్వానికి చెందిన

చక్కని గేయ కావ్యం 'కిన్నెరసాని' నామ మాత్రంగా ఉన్న వస్తువును స్వీకరించి తమ భావనా శక్తితో దానిని అహ్లాదకరంగా, ఆశ్చర్యజనకంగా తీర్చి దిద్దటం భావ కవిత లక్షణం. చిన్నతనంలో తన తండ్రి శోభనాద్రి గారితో పాటు పోల్లి చూచిన 'కిన్నెరసాని' నదికి మానవత్వం ఆరోపించి తన భావానికి ఒక ఇతి వృత్తాన్ని కల్పించి 'మూడు మూర్తులా కిన్నెర తెనుగు వారి ఆడబడుచు అనే భావనకు శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు కలిగించారు.

మాత్రాచ్ఛందస్సులో నడిచిన ఈ గేయ కవితా ప్రక్రియలో కిన్నెరలోని ఆర్భత్యము సాని దానిలోని ఆకర్షణ సమపాళ్లలో మేళవించినై. కిన్నెర ఒక కన్యగా, ముద్దగా, ప్రౌఢగా పొందిన పరిణామ దశలను శ్రీ విశ్వనాధ వారు మనోరంజకంగా చిత్రించారు. అత్తాకోడళ్ల పోట్లాటలు, ఫలితంగా ఆలుమగల మధ్య ఏర్పడ వియోగ విషాద పరిణామాలు ఈ ఇతివృత్తిలో రమ్యంగా తీర్చిదిద్దబడ్డాయి. కిన్నెర పుట్టుక, నడకలు. నృత్యం, సంగీతం. సంగమం. దుఃఖం వైభవం ఇవన్నీ నదీ స్త్రీరూప పరంగా ఈయన సమన్వయం చేశారు. కిన్నెర నవ్వులు నురుగులు, వళులుతరగలు, కన్నులు మీనులు, జఘనం ఇసుక తిన్నె వంటి చిత్రీ కరణలు నదిని ఒక స్త్రీ గా రూపొందించాయి. కిన్నెర చాల సుకుమారి, పతివ్రత, ఆర్షధర్మాభిమాని. అత్త పోరును ఆమె భరించలేక పోయింది. తన భర్తకు తనకు ఆయన మీద వలెను ఆయనకు తనపై అతిశయించిన ప్రేమానురాగాలు ఉన్నాయి. కాని తల్లిని ఎదిరించి తన భార్య మనుస్సుకు తగిలిన గాయాలను మాన్పలేని అసమర్ధుడు. కిన్నెర ఇల్లు విడిచి అడవుల వెంట పరుగులెత్తింది. భర్త వెంటవెళ్లి ఆమెను కౌగలించుకొంటాడు. భర్త కౌగిలిలోనుండి విడిపోయి జారి ఆమె పరుగెత్తడం, ఆము వేణీ బంధాన్ని ఆతడు చేత్తో పట్టుకోవడం, చేతిలో వేణికి బదులు 'నీటిపొరలు' కాల్వగట్టడం, ఎడమ చేత్తో కొంగను బడిసిపట్టగా తడిచేతిలో కొంగులేక పోవడం, ఆ తడబాటు వల్ల నుదిట పట్టిన చెమటయే వాగవటం వంటి భావనలలో ఆలు మగల ప్రణయసన్నివేశాలు కళ్ల ముందుకు వస్తాయి. కిన్నెర రసహృదయ ఆము భర్త శిలా హృదయుడు. ఆమె జలరూపాన్ని దాల్చింది. ఆతడు ఆమె కోసం ఏడ్చి ఏడ్చి శిలా రూపం దాల్చాడు.

తొడిమ ఊడిన 'పూవుపడతి'లా ఉన్న కిన్నెర తన 'కెరటాల హస్తాల' తో భర్తను కౌగలించుకొని

నీలి మబ్బుల బోలు
నిడివి నీ చేతుల్లు
నన్నింక కౌగలించగ రావు కాబోలు
కడుప్రేమతో చేరగా తీవు కాబోలు
నెమ్మదిగా నా యొడల్ నామురవు కాబోలు

అంటూ కిన్నెర తన విరహాన్ని ప్రకటించింది.

కిన్నెరసాని గోదావరికి ఉపనది. కిన్నెర ప్రవహిస్తుండగా సముద్రుడు ఆమెతో సంగమాన్ని కోరుకున్నాడు. ఆ పతివ్రత, సతీమతల్లి కాముకుడైన సముద్రుని బారినుండి గోదావరి ఒక పెద్ద ముత్తయిదువుగ్గా కాపాడ తనలో లీనం చేసుకొన్నట్లు కవి చిత్రించాడు. గోదావరిలో కలిసిన కిన్నెర భద్రాద్రి రాముని దివ్వ సన్నిధిలో ప్రవహిస్తూ పుణ్యవతి అవుతుంది. విశ్వనాధ వారి గొంతు నుండి ఈ పాట వినటం ఆనాటి శ్రోతలకు ఒక దివ్వ రసానుభూతి. ఆయన కీర్తి కిరీటంలో కలికితురాయి. 'కిన్నెరసాని పాట', ఆయన భావనా శక్తికి ఒక ప్రబల నిదర్శనం.

**డి) వరలక్ష్మిత్రిశతి :** శ్రీ విశ్వనాధ సత్యనారాయణ గారి ధర్మపత్నీ వరలక్ష్మి 1932 లో మరణించారు. సతీ వియోగం కల్గిన సందర్భంలో ఆమెను గూర్చి స్మృతి పూర్వకంగా 'వరలక్ష్మీ త్రిశతి' అనే కావ్యాన్ని వీరు రచించారు. ఇది కర్మ, స్మృతి, నిత్య శతకాలుగా విభజింపబడింది. తన సర్వస్వాన్ని ధారపోసి అనుభవవీధిలో బ్రదుకును యజ్ఞ పశువుగా అర్పించిన సాధ్వీమణిగా ఆమె భావించబడింది.

'నాకులాంగన యాననము చెక్కులద్దనం డకట నన్నడ్డు పెట్టకుడు మీరు నా ప్రియురాలి కంఠము కౌగిలించనిం డీకరమ్ములు లాగబోకుడీడు." అని భార్యావియోగంలో తన దుఃఖావేశాన్ని ప్రకటించిన పద్యాలు హృదయావర్జకాలు. భార్యా వియోగం వల్ల 'కాలి యటు పొగచూటిన కట్టెలా,' మంత్రము లేని ప్రభు శక్తిగా ఋతుచిహ్నములకు తలను ధరించని 'బాడిద'లా తాను మారినట్లు పేర్కొన్నారు. వశిష్ఠుడికి అరుంధతిలా తన కవిత్వానికి, కీర్తికి పరోక్షంగా తన అర్ధాంగియే ఆధారభూతం అని విశ్వనాధ వారు ప్రకటించారు. తాము

విప్రలంభ రసానియకుడు. తాను పోషించిన పాత్రలకు ఆయన సూత్రధారి. విశ్వనాథ భావించాడు. గొప్పగ హృదయ స్పందన కల్గించే పాండిత్య ప్రకర్ష గల సతీస్మృతి కావ్యమిది.

భావకవులు తమ తమ కవితలలో కోకిల గానాలను వర్ణించారు. విశ్వనాథ సత్యనారాయణ గారు 'కోకిలమ్మ పెళ్లి' అనే ఖండ కావ్యాన్నే వ్రాశారు. కోకిల పరభృతిక. పుట్టిన దాది తల్లిదండ్రులచే విర్లక్ష్యం చేయబడింది. తాను పొందిన వేదన వల్లనే మధురమైన కంఠధ్వనిని వరంగా పొందింది. కోకిలమ్మ జీవిత గాధలో కరుణ రసాత్మకత వెల్లివిరిసింది.

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారి 'విశ్వనాధ మధ్యాక్కరలు' గ్రంథం పదిశతకాల సంపుటి. వీనిన్నింటిని కలుపు సూత్రమొక్కటియే. అది ఛందస్సు. ఈ శతకాలన్నీ మధ్యాక్కరలలో రచింపబడినాయి. మధ్యాక్కర నన్నయ కంటె ప్రాచీనమైంది. యుద్ధమల్లుని బెజవాడ శాసనం 'మధ్యాక్కరలలో' రచింపబడింది. ఇందు శ్రీగిరి శతకమునకు 'శ్రీశైల మల్లి కార్జున మహాలింగా' అనీ కాళహస్తి శతకమునకు 'శ్రీకాళహస్తీశ్వరా! మహీదేవి' అనీ, భద్రగిరి శతకమునకు 'భద్రగిరి పుణ్య నిలయశ్రీరామ! అనీ, కులస్వామి శతకమునకు 'విశ్వేశ్వరా కులస్వామి!' అనీ, శేషాద్రి శతకమునకు 'వేంకటేశ్వరా శేషాద్రినిలయ' అనీ ద్రాక్షారామ శతకమును 'భీమేశలింగ! ద్రాక్షారామ సంగ' అనీ, నందమూరు శతకమునకు 'నందమూర్నిలయ సంతాన వేణు గోపాల' అనీ, నెకరుకల్ శతకమునకు 'నెకరుకల్ ప్రాంతసిద్ధేశ్వరా!' అనీ, మువ్వంగి శతకమునకు 'మువ్వంగి వేణుగోపాల' అనీ, వేముల వాడ శతకమునకు 'వేములవాడ రాజరాజేశ్వరాస్వామి' అనీ, మకుటములనుండి శ్రీ విశ్వనాధ సత్యనారాయణ గారు ఈ శతక సంపుటిని వెలయించారు. ఈ శతకముల యందు విశ్వనాధ వార్లు భావించిన 'వ్యాజస్తుతి' సహృదయ హృదయంగమమై మెప్పినది. ఈ శతకసంపుటి భక్తి, జ్ఞాన, వైరాగ్య భావాలకు కూడలియైనది. విశ్వనాధ వారు మహాకవులే కాదు, మహాభక్తులు కూడా. భక్తి భావనిర్భరమగు వీరి కవితా స్రోతస్విని ఈ శతకములలో పొంగిపారలింది.

ఇ) గిరి కుమారుని ప్రేమ గీతాలు: విశ్వనాధ వారి మరొక ఖండకావ్యం 'గిరికుమారుని ప్రేమగీతాలు'. ఈ గీతాలను వారు 1920-1928 మధ్య కాలంలో రచించారు. విశ్వనాధ వారి ప్రణయం ముఖ్యంగా కులపతి ప్రణయం. తన భార్యనే ప్రేయసిగా, ఈశ్వరిగా, పరమేశ్వరినిగా వారు భావించారు. తన తండ్రి శోభనాద్రిలో ఉన్న 'అద్రి'కి మారురూప మైన 'గిరి'ని తీసుకొని విశ్వనాధ వారు తన ఈ ప్రణయ కవిత్వానికి 'గిరికుమారుని ప్రేమగీతాలు' అని పేరుపెట్టారు. ఈ ప్రేమగీతాలలో ప్రియురాలితో ఉన్న అనుబంధం సాగించిన సరససల్లాపాలు, పొందిన ఆనంద పారవశ్యమే ప్రకటిత మవుతాయి. తనలోని ప్రణయ భావన వల్ల తనకు గల్గిన సంకట స్థితిని కావ్యారంభంలోనే కవి ఈవిధంగా పలికారు.

'అస్మదీయ కంఠమున యందాడుచండె
నొక యెదో గీతి బయటకు నుబికి రాదు.
చొచ్చుకొని లోనికింబోదు వ్రచ్చిపోయె
నాహృదయ మీమహాప్రయత్నమ్మునందు!

తనకు తన ప్రేయసికి ఉన్న సంబంధాన్ని సూర్య కాంతిన ననుసరించి వర్తించే ప్రొద్దుతిరుగు పూవుతో అన్వయిస్తూ తను ప్రణయం ప్రకృతి సిద్ధమైందిగా కవి భావిస్తాడు.

'సూర్యుడును నేను ప్రాగ్దిశా సుందీము
ఖారవింద సుందరి తిలకాకృతిధి నయి
యుదయ మొందితి నాకోసెమెదురుచూచె
విడిలు రేకల నాప్రొద్దు పొడుపు పూవు.'

తన ప్రేయసి 'హృదయాంతర కోటస్థమైన ఒక సూక్ష్మకృతి'గా,' కృత్రిమ భావనా విశ్రితాత్మగా ఆయన పేర్కొన్నారు.

'పలుకరాని జ్యోతిస్సు నా ప్రణయ మెల్ల

గావ్యరూపమ్ముగా నిట్లు కరుగ బోసి
ప్రళయ కాల నిగూఢ గర్భమ్మునందు
దీని యాకృతి గూర్చి చింతించుచుంటి'

అంటారు విశ్వనాధ. ఈయన ప్రేమగీతాలపై రవీంద్రనాధ ఠాగూర్ 'గీతాంజలి' లోని భావనైర్మల్యం. కాల్పనిక కవులలోని స్త్రీ సమారాధనాతత్త్వం, ఉమర్‌ఖయ్యాం ప్రణయ భావావేశం చూపించినట్లు కనబడుతుంది. విశ్వనాధ వారికి భార్యా వియోగం ఒక తీరనివ్యధ అయింది. ఆ విప్రయోగపు తీవ్రత ఆయన రచించిన 'శశిదూత' కావ్యంలో స్పష్టంగా గోచరిస్తుంది. శ్రీరాముడు హనుమంతునీ నలచక్రవర్తి హంసను, మేఘసందేశ కావ్యంలో యక్షుడు మేఘుని తమ ప్రణయ సందేశానికి దూతలుగా ఎన్నుకున్నారు. వినిర్మలాకాశంలో వెలుగులు చిమ్ముతున్న చంద్రుణ్ణి విశ్వనాధ వారు తన ప్రణయ సందేశానికి దూతగా ఎన్నుకొని ఈ 'శశిదూతం' అనే ఖండకావ్యాన్ని రచించారు.

**ఎఫ్) ఇతర రచనలు :**

'అమృతము కూడు కట్టిన దొరా! యల దూరపు నీలి కొండలో
గొమరు మిగుల్ సితాంబుదము కోసల మూసలు పోతువెన్నెలల్
రమణి యొకింత క్యోపరాజ్మఖయైనది, నాకు చెప్పక
నమరిక దూత యిప్పుడెవరందువు నీవు వినా నిశాపతీ!

అని తనకు చంద్రుడు తప్ప మరొకరు ప్రణయ దూత కాలేరని కవి భావించాడు. దంపతుల ప్రేమకు చంద్రుడు ఒక 'కొలపాత్ర' అనీ, స్త్రీ, పూలు, చంద్రుడు ఒక విధమైన 'కోమల జీవులనీ' ఒకే పూవుల కుటుంబం 'కాబట్టి ప్రేయసి ప్రణయ కోపం తీర్చటానికి చంద్రుణ్ణి దూతగా ఎన్నుకున్నాడు కవి.

'ముగుదలు, పూలు, నీవు నొక మోస్తరు కోమల జీవు లందు ఒ
ట్టుగ నిది యొక్క పూవుల కుటుంబము మీలోకళ్లోకళ్లకున్
మిగులుగ స్నిగ్ధలేదురును మీరును మీరును నొక్కడొద్య నీ
వగుదువు నాకు దూత్యమున కంగనకున్ మృదుకోపశీలకున్.'

మరణించిన భార్య ఆత్మ చేసే ఆకాశయానానికి తగిన రీతిలో చంద్రుణ్ణి దూతగా ఎన్నుకోవటంలో విశ్వనాధ వారి ప్రతిభ ప్రకటితమవుతోంది. తనకు తన ప్రేయసికి ఉన్న అనుబంధాన్ని చంద్రుడికి, కలువకూ నడుమ ఉన్న ప్రణయ బంధంగా భావించారు విశ్వనాధ.

విశ్వనాధ సత్యనారాయణ గారి నర్తనశాల మంచినాటకం. తొమ్మిది అంకాల ఈ నాటకంలో చక్కని సాహిత్యం ఉంది. ఈ నాటకం విశ్వనాధవారు కేవలం భారతీయ దృక్పధములో రచించినట్లు కనపడదు. ఈ రచన మీద షేక్స్పియర్ విషాదాంత నాటకాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ నాటకమందలి ప్రతినాయకుడైన కీచకుని చిత్రణను పరిశీలించినచో ఆతడు ఒక దుష్ట నాయకుడిగా కాక ఉత్తమ విషాద నాయకునిగా రూపొందినట్లు తోచును. 'వేనరాజు' ప్రాచ్యపాశ్చాత్య లక్షణములతో రచింపబడిన నాటకము, శివ భక్తి తత్పరతతో విశ్వనాధవారు రచించిన గొప్ప నాటకం 'త్రిశూలం'.

శ్రీవిశ్వనాధ సత్యనారాయణ గారి నవలలు కేవలం కథాప్రధానములు కావు. తర్క, వేదాంత, శాస్త్ర విషయాలకు ఆలవాలాలు. ఆయన రచించిన వేయిపడగలు నవలలో ప్రాచీనాంధ్ర సాహిత్య వైశిష్ట్యం, భారతీయ ధర్మం వ్రాయబడింది. 'తెఱచిరాజు' నవలలో నాట్యశాస్త్ర విశేషాలు, 'మ్రోయు తుమ్మెద' లో సంగీతశాస్త్రం, పురాణవైరగ్రంధమాలలోని పన్నెండు నవలల్లోను అనేక ప్రాచ్యపాశ్చాత్య జీవన రహస్యాలు, 'ఆరునదులు' నవలలో ప్రపంచనాగరికత భారతదేశ నాగరికతకు ప్రతిరూపమే అన్న విషయాన్ని నిరూపిస్తాయి. విశ్వనాధవారి జగత్పరిశీలన మిక్కిలి లోతైనది. తాము పరిశీలించిన ప్రతి విషయాన్ని తన మనఃకుహరమునందు నిక్షిప్తము చేసికొని సమయానుకూలముగా

ఆ విజ్ఞానాన్ని నవలలోని పాత్రల ద్వారా బహిర్గతం మవుతుంది. చిన్నతనమున తన తండ్రి తన స్వగ్రామములోని నందమూరి వేణుగోపాల స్వామివారి జీర్ణోద్ధార కార్యక్రమాన్ని మనసున పదిలపరచుకొని దానిని 'వేయిపడగల' నవలలో స్వామి ప్రతిష్ఠా మహోత్సవములను వర్ణించు సందర్భంలో ఉపయోగించినాడు, 'పులిమ్రుగ్గు' నవలలో ప్రాణం పోవు విదమును గుఱించి ప్రసంగించు సన్నివేశమున ప్రభువైన సుశర్మపాత్ర ముఖ్యంగా వివిధ శాస్త్రాలు వానిలో ప్రాణాత్క్రమణ విధానాన్ని గురించి చెప్పబడిన విషయాన్ని వివరించాడు. 'నాగసేనుడు నవలలో ఆర్థికశాస్త్ర విషయాలు వివరింపబడినవి. తన నవలలో తాను వివరించిన విషయాలను గురించి ఆయన ఇట్లు చెప్పుకొనినాడు. "శ్రమలేకుండా నా నవలలు చదివి మనోజ్ఞానమును సంపాదించవచ్చు.....పాశ్చాత్య విజ్ఞానములో నేను నిద్రాహారాలు లేకుండా సంపాదించిన విజ్ఞానమంతా నా నవలలో, పుస్తకాలలో ఉంటుంది." తాను పల్కిన ఈ పలుకులు ప్రత్యక్షర సత్యాలుగా ఆయన తన నవలల ద్వారా చేశారు. విశ్వనాథ సత్యనారాయణ గారి వేయిపడగలు నవలకు ఆంధ్రవిశ్వవిద్యాలయం బహుమతినిచ్చింది. వేయిపడగలు ఆంధ్రవిజ్ఞాన సర్వస్వమునకు మాఱుపేరుగా వెలసిన గ్రంథం. దానిలో సత్యనారాయణ గారి సారస్వత-సాంఘిక సిద్ధాంతాలన్నీ కరడుగట్టియున్నవి. సత్యనారాయణ గారి వచన రచనలో ఒక క్రొత్తదనం, చిక్కదనం గోచరిస్తాయి. తిక్కన పద్యరచనలో వలె వీరిరచనలో గ్రియాపద బాహుళ్యం. ఎక్కడికక్కడ భావం తెగిపోయి పాఠకులనిలో మెల్లమెల్లగా చొచ్చుకుంటాయి. ఈయన భావన అగాధమైనది. దానిని భాషలో బెట్టినపుడు కొంత క్లిష్టత యనివార్యం. ఆయన శిరీషకుసుమ పేశలముగా వ్రాసికొని పోవుచు పట్టరాని భావనా పథమున పడినపుడు చేసెడి పదముల కూర్పు విభిన్నమైన రీతిలో సాగుతుంది. ఈ విధమైన వాక్యనిర్మాణము విశ్వనాథ శైలి. "విశ్వనాథ వారి భారతీయ దర్శనానికి గౌరీశంకరతుల్యమైనది వేయిపడగలు. భారతీయమైన సర్వవిజ్ఞాన గరిమకూ అది ఒక సర్వస్వం అన్నారు ఏలూరిపాటి అనంతరామయ్యగారు. ఈ నవలా రచనాకాలం 1930 ప్రాంతం. ఆనాటి మన సమాజం భౌతిక కష్టాల్లోకి జారిపోతున్న దశలో శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు వేయిపడగలు నవల ద్వారా ధర్మదృష్టితో, ఆధ్యాత్మిక లక్ష్యానికి మళ్లించటానికి ప్రయత్నించారు. పాపపుణ్యాలు న్యాయాన్యాయాలు, ధర్మాధర్మాలు లాంటి విషయాలు ఈ నవలలోని అనేక చర్చల్లో అభిప్రాయాల్లో కనిపిస్తాయి" అన్నారు శ్రీముదిగొండ వీరభద్రయ్య. ధర్మారావు, రామేశ్వర శాస్త్రీ గిరిక, పసిరిక, కుమారస్వామి వంటి పాత్రల వ్యక్తులుకారు, ప్రతీకలు అని విమర్శకులు భావిస్తారు.

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారి బాణిలోను, వాణిలోను తృణీకరించ దగిన దేదియు ఉండదు. ఆయన ప్రతి రచనయె అర్థవంతం, సునిసితభావనాత్మకం. తనకు గల లోక కావ్యాద్యవేక్షణంచే సంస్కృతాంధ్రాంగ్ల వాఙ్మయ మహోదధులను మధించి అమృత కలశ సదృశ గ్రంథాలను వెలికి తెచ్చి సారస్వత జిజ్ఞాసువుల కందించిన జగన్మోహన్యవతారం శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు. ఈ కారణం వలననే మహాకవిగా తనకు గల గురుతరమైన భాధ్యతను అత్యంత సమర్థవంతముగా ఆయన నిర్వర్తించుకొనగల్గినాడు. కనుకనే ఈయన వెలయించిన ప్రతి రచనకు ప్రశస్తి లభించింది.

శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు 1921 వ్రాసిన తొలి నవల 'అంతరాత్మ'. ఆనాడు ప్రముఖ సాహిత్య మాసపత్రికలలో ఒకటైన 'శారద'లో ధారావాహికంగా ప్రచురింపబడింది. 1976 లో విశ్వనాథ వారు వ్రాసిన పౌరాణిక వ్యంగ్యనవల 'నందిగ్రామ రాజ్యం' దీనిని ఆశువుగా చెప్తుండగా శ్రీమల్లాది శివరామ్ గారు లిపిబద్ధం చేశారు. ఇది విశ్వనాథ వారి చివరి నవల. ఏ నవల అయినా అయిదు ఆరురోజులకు మించి వ్రాయని విశ్వనాథ వారి జీవితంలో 29 రోజులలో వ్రాయబడిన నవల 'వేయిపడగలు'. ప్రతి నవలను తాను ఆశువుగా పలుకుతూ వ్రాయటానికి వేరే వ్యక్తులను నియమించుకొన్న విశ్వనాథ వారు స్వదస్తూరితో వ్రాసిన ఒకే ఒక్క నవల ఏకవీర. 1929 నుండి 1931 వరకు ఒక నవలా రచనకు విశ్వనాథ వారు సమయాన్ని తీసికోవడం ఒక్క 'ఏకవీర' నవలకే జరిగింది.

ఆధునిక కాలంలో జన్మించి వైవిధ్యభరితమైన సాహిత్య ప్రక్రియల్లో శతాధికంగా రచనలను చేసి గొప్ప సాహిత్య వేత్తగా, సాహిత్యస్రష్టగా తాను సంపాదించిన విజ్ఞాన సర్వస్వాన్ని సాహితీ రూపంలో వెలువరించిన విశ్వనాథ సత్యనారాయణ గారి వంటి సాహితీమూర్తి, పుంభావ సరస్వతి 'నభూతో నభవిష్యతి'.

**సమీక్ష :**

విశ్వనాథ కవిత్వంలో వివిధాంశాలను స్థాలీపులాక న్యాయంగా ప్రస్తావించి, విశ్వనాథ కవి స్వరూపాన్ని ఆవిష్కరించడం జరిగింది.

ప్రశ్నలు :

1. విశ్వనాధ సత్యనారాయణగారి జీవిత విశేషాలను - కవితా రీతులను సమీక్షించండి?
2. రామాయణ కల్ప వృక్ష మాధారంగా విశ్వనాధవారి కవితా వైశిష్ట్యము నెమ్మనది?
3. విశ్వనాధ వారి నవలా సాహిత్య వైదుష్యమును వివరించండి?
4. విశ్వనాధ కృతులను సమీక్షించండి.

ఆధార గ్రంథములు :


1. ఆంధ్ర సాహిత్య చరిత్ర - ద్వా.నా. శాస్త్రి
2. విశ్వనాధ మార్గము - సుప్రసన్న
3. విశ్వనాధ నవలలు - విశ్వనాధసత్యనారాయణ
4. రామాయణ కల్ప వృక్ష సమీక్ష.


డా॥ కౌతా సుబ్రమణ్య శాస్త్రి

పాఠం - 15.1

# త్రిపురనేని రామస్వామి - జాషువ

**పాఠ్య నిర్మాణ క్రమం :**

15.1.1 కవిరాజు జీవిత విశేషాలు
1.2 కవి రచనలు
1.3 నాటకాలు
1.4 శతకాలు
1.5 సూతాశ్రమ గీతాలు
1.6 సూతపురాణం
1.7 భగవద్గీత
1.8 వివాహవిధి
1.9 పీఠికలు
1.10 కవిరాజు శబ్ద సృష్టి
1.11 కవిరాజు ఛలోక్తులు

**లక్ష్యం :**

కవిరాజు రచనలను పరిచయం చేయడం, త్రిపురనేని రచనలలోని హేతువాద ధోరణిని పరిశీలించడం.

## 15.1.1. కవిరాజుగారి జీవిత విశేషాలు

కవిరాజు కవి, ప్రముఖ నాటకకర్త సుప్రసిద్ధ శతక కర్త, శతావధాని, మహాపండితుడు, మంచి భావుకుడు, వ్యంగ్య రచయిత విమర్శకుడు, పరిశోధకుడు, సంఘ సంస్కర్త, న్యాయవాది, మానవతావాది, హేతువాది, భావ విప్లవ విధాత.

మహా పురుషుల కోవకు చెంది, తెలుగుదేశంలో మంచి పేరు ప్రఖ్యాతులు పొందినవారు త్రిపురనేని రామస్వామిగారు, కవిరాజ బిరుదాంకితులు. వీరు 1887 సంవత్సరం జనవరి 15 వ తేదీన కృష్ణాజిల్లాలో జన్మించారు. రామస్వామిగారికి అంగలూరులో వీధిబడిలో 1895 జులై 15వ తేదీన అక్షరాభ్యాసం జరిగింది. కవిరాజు చిన్నప్పుడు చదువుమీద పెద్ద శ్రద్ధ చూపేవారు కాదు. ఆటలమీద ఆసక్తిని కనబరిచేవారు.

1898లో అల్లూరి పున్నమాంబతో పెళ్ళి అయింది. 1910 వ సంవత్సరం సెప్టెంబర్ 8వ తేదీన ఒక కుమారుడు జన్మించాడు. వీరే ప్రఖ్యాత కథకుడు, నవలా రచయిత, తత్త్వవేత్త, గోపీచంద్‌గారు. తర్వాత ఐదు సంవత్సరాలకు ఒక కూతురు కలిగింది. ఆమె పేరు సరోజిని.

భార్య శ్రీమతి పున్నమాంబగారు 1920 సంవత్సరం జనవరి 16 వ తేదీన కాలధర్మం చెందారు. ఆ సంవత్సరమే రామస్వామిగారు ద్వితీయ వివాహం కూడా చేసుకున్నారు. ఈమె పేరు చంద్రావతి. వీరికి ఒక కుమారుడు కలిగాడు. ఆయన పేరు గోకుల్‌చంద్.

1932 వ సంవత్సరంలో రెండో భార్య కూడా పరమపదించారు. 1933 సంవత్సరంలో కవిరాజుగారు మూడో పెళ్ళి చేసుకున్నారు. ఈమె పేరు అన్నపూర్ణమ్మ. వీరికి ఒక కూతురు పుట్టింది. ఈమె పేరు చౌదరాణి. ప్రఖ్యాత కథకుడు ఆల్లూరి విశ్వేశ్వరరావుగారు ఈమెను వివాహం చేసుకున్నారు. చౌదరిగారి మూడో భార్య కూడా 1964 వ సంవత్సరంలో ఏప్రిల్ 30వ తేదీన చనిపోయారు.

వీరి భాషాసేవకు గుర్తింపుగా ఆంధ్ర మహాసభ బెజవాడలో 1929 వ సంవత్సరం నవంబర్ 4వ తేదీన కాశీనాథుని నాగేశ్వరరావుగారి చేతి మీదుగా 'కవిరాజా' అనే బిరుదును ఇచ్చి గౌరవించింది. గుడివాడ పౌరులు రామస్వామి చౌదరిగారికి 1942 వ సంవత్సరం ఏప్రిల్ 25, 26 తేదీల్లో గజారోహణోత్సవంతో ఘనంగా సన్మానం జరిపి, వారి సంస్కారణోద్యమం పట్ల తమ ప్రగాఢానురాగాన్ని తెలియజేసుకున్నారు.

వివిధ ప్రాంతాలనుంచి అనేకమంది ప్రముఖులూ, వేలాది స్థానిక ప్రజలూ ఆ సన్మానంలో పాల్గొని కవిరాజుకు బ్రహ్మరథం పట్టారు. బెజవాడ రామచంద్రారెడ్డిగారి అధ్యక్షతన, చల్లపల్లి సంస్థానాధీశ్వరుల సమక్షంలో, పండితాశీర్వాదాలతో, అనేక మంది కవుల అభినందనలతో, అఖండ వైభవోపేతంగా ఆ సన్మానం జరిగింది. ఒక కవికి ఇలాం సన్మానం జరగడం తెలుగులో అరుదు.

సహృదయ సార్వభౌముడు, భావవిప్లవ వైతాళికుడు, హేతువాది అయిన రామస్వామిగారు తెనాలిలోని వారి స్వగృహం 'సూతాశ్రమం' లో 1943 వ సంవత్సరం జనవరి 16వ తేదీన రాత్రి గం. 1.30 ని.లకు కీర్తిశేషులయ్యారు. అప్పటికి కవిరాజాగారి వయస్సు 56 సంవత్సరాలు మాత్రమే. ఈ ఆకస్మిక వార్త యావదాంధ్ర ప్రజానీకాన్ని దుఃఖసాగరంలో ముంచివేసింది.

### 15.1.2. కవిగారి రచనలు :

చౌదరిగారు తెలుగు సాహిత్యంలో భావవిప్లవాన్ని తన రచనల ద్వారా సృష్టించారు. 'సూత పురాణం', 'కురుక్షేత్ర సంగ్రామం' 'శంబుకవధ', 'ఖూనీ', 'వివాహ విధి', 'కుప్పుస్వామి శతకం', 'ధూర్త మానవా', 'సూతాశ్రమ గీతాలు', 'భగవద్గీత' మొదలైనవి వీరి ముద్రిత గ్రంథాలు. 'అంపకం', 'మాలదాసరి', 'నరకం', 'గోపాలరాయ శతకం', 'చెన్నకేశవ శతకం', 'పల్నాటి పౌరుషం', 'రాణాప్రతాప్' మొదలైన గ్రంథాలు అముద్రితాలు. కవిరాజాగారు డబ్లిన్ విశ్వవిద్యాలయంలో బారిష్టరు పట్టా పొందారు. 'ఎందుకు?' అని ప్రశ్నించడం తెలుగు సాహిత్యానికి నేర్పిన భావవిప్లవకారులు చౌదరిగారు.

### 15.1.3. నాటకాలు :

చౌదరిగారు నాటక ప్రక్రియను తమ అభిప్రాయాల ప్రచారానికి సాధనం చేసుకున్నారు. వీరి నాటకాలు ప్రజాదరణను పొందాయి 'కురుక్షేత్ర సంగ్రామం', 'శంబుక వధ', 'ఖూనీ' మొదలైనవి కవిరాజాగారి ముద్రిత నాటకాలు. 'కారెంపూడి కథనం', 'కొండవీటి పతనం' 'రాణాప్రతాప్', 'నరకం', 'అంపకం' అనేవి అముద్రిత నాటకాలు.

#### 3.1 ముద్రిత నాటకాలు :

**1. కురుక్షేత్ర సంగ్రామం :**

లోకమంతటా అప్పటివరకు కౌరవులు దుర్మార్గులనీ, అవినీతిపరులనీ, పాండవులే సన్మార్గవర్తనులనీ, పూజ్యులనే భావం వుంది. ఇది యథార్థంకాదని గాఢంగా విశ్వసించారు కవిరాజాగారు. అంధ విశ్వాసాలతో నిండి, నిబిడీకృతమైన సమాజంలో చైతన్యం కలిగించడానికిగాను ఈ 'కురుక్షేత్ర సంగ్రామము' రచించబడింది. ప్రథమ ముద్రణ 1910 సంవత్సరంలో జరిగింది. దీనిలోని ఇతివృత్తం మహాభారత యుద్ధానికి సంబంధించింది. ఇది వీరరస ప్రధానమైన నాటకం. కవిరాజాగారి పేరు ప్రఖ్యాతులు తెచ్చిన నాటకం ఇది. ఈ నాటకపు ఎత్తుగడ లోకంలోకి ప్రబలి ఉన్న విశ్వాసానికి భిన్నంగా ఉంటుంది. కౌరవ పాండవ సంగ్రామం ఎందుకు జరిగింది? చివరకు నష్టపోయింది ఎవరు? వంటి ప్రశ్నలకు సమాధానంతో కవిరాజాగారి నాటకం ప్రారంభమవుతుంది. కురుక్షేత్ర మహా సంగ్రామ పరమార్థాన్ని కవిరాజాగారెలా వర్ణించారో చూడండి.

*"ఆ ముటెద్దులు రెండు పోరాడుచుండ*
*నడుమనున్న లేగల కాళ్ళు నలగుపట్లు*
*పుడమికై కురుపాండవుల్ పోరనున్న*
*నారులు చచ్చెద రిటునటు తిరుగలేక.*

కోడెలు కుమ్ముకుంటుంటే, దూడలు వలిగిపోతాయన్నది గుంటూరు సీమలోని సామెత. ఆ సీమ బిడ్డగా ఆ సామెతను మహా భారతంలోకి తీసుకువచ్చి, దాని సాయంతోనే భారతయుద్ధ పరమార్థాన్ని (రాజ్యం కోసం కుమ్ములాటను) చెప్పిన చమత్కారి, వాస్తవవాది కవిరాజాగారు.

### 3.2. శంబుక వధ :

ఇది కవిరాజుగారి రెండో నాటకం. ఇది భారతదేశ చరిత్రను పరిశీలించి రాయబడింది. మనదేశ చరిత్రను పరిశీలించి చూస్తే ఆర్య, అనార్య సంఘర్షణలు ముమ్మరంగా కన్పిస్తాయి. అనాదినుంచి ఆర్యులు ద్రావిడుల్ని పెక్కు ఇక్కట్లుకు గురిచేస్తూనే వచ్చారు. మధ్య ఆసియా నుంచి వచ్చిన అర్యులు వర్ణ వ్యవస్థను ఏర్పరచడమే కాకుండా, ఈ దేశం మీద అధిపత్యం కూడా సంపాదించారు. ద్రావిడులపై అనేక ఆంక్షలు విధించి, అణగద్రొక్కారు. రామరాజ్యంలోనే ఆర్యుల బాధ ద్రావిడులకు తప్పలేదు. ఆర్యపక్షపాతియైన రాముడు ద్రావిడుల్ని అష్టకష్టాలూ పెట్టాడు. అనార్యుడైన శంబుకుని, దయాదాక్షిణ్యాలు లేకుండా రాముడు సంహరించాడు. కారణం తపస్సు చేసుకొనే హక్కు ద్రావిడులకు లేదు. ఈ విషయాన్ని గమనించిన కవిరాజుగారు ఆ సాంఘిక అధర్మాల్ని అద్దం వలె ప్రతిబింబింప చేస్తూ, రసోచిత పద ప్రయోగంతో, నాలుగు అంకాల నాటకాన్ని రాశాడు. ప్రథమ ముద్రణ 1920 లో జరిగింది.

ఈ నాటకంలో స్వతంత్ర సిద్ధి కొరకే శంబుకుడు ప్రాణత్యాగం చేశాడనీ, ద్రావిడుల్ని దాస్యంలో వుంచడానికిగామా రాముడు మతగురువైన వశిష్టుడు పన్నిన కుట్రను చౌదరిగారు ఎలుగెత్తి లోకానికి చాటారు. వందలాది రామాయణాలు రాసినవారు వున్నారు కానీ ఏ ఒక్కరూ శంబుకునకు జరిగిన అన్యాయాన్ని వేలెత్తి చూపించలేకపోయారు. ఈ నాటకంలో సంభాషణలు సామాన్యుని హృదయానికి హత్తుకొనేలా వున్నాయి. ఈ నాటకంలోని రెండు పాత్రల చేత శంబుకుని ఆశయాలను కవిరాజుగారు చెప్పించిచతీరు వారి శిల్ప నైపుణ్యానికి, ఒక మంచి ఉదాహరణ.

పౌరాణిక రూపకకర్తలపై ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆంగ్ల భాషా ప్రభావం వుంది. కవిరాజుగారు బెర్నార్డ్ షా ప్రభావంతో రూపక రచన చేసినట్లు 'శంబుక వధ'కు రాసిన పీఠికలో వారే చెప్పుకున్నారు. కవిరాజుగారు హిందూ మతంలోని పరస్పర విరుద్ధ భావాల్నీ అహేతుక అంశాల్నీ ఖండిస్తూ రూపక రచన చేశారు. శభాష్ అనిపించుకున్నారు.

### 3. ఖూనీ :

విశ్వనాథ సత్యనారాయణగారు 'వేనరాజు' అనే నాటకాన్ని ఆధారంగా చేసుకొని కవిరాజుగారు 'ఖూనీ' అనే నాటకాన్ని రాశారు. వేనుని ఆర్యుఋషులు లేదా విశ్వనాథ సత్యనారాయణ ఖూనీ చేశారని చౌదరిగారు అభిప్రాయపడ్డారు. వేనరాజు నాటకంలో వేనరాజుకు తీరని అపచారం చేయబడిందని గ్రహించిన కవిరాజుగారు వేనుని నిజస్వరూపాన్ని లోకానికి తెలియజేయాలనే ఆకాంక్షతో ఖూనీ నాటకాన్ని 1935 సంవత్సరంలో రాశారు. ఇందులో నాలుగు రంగాలు వున్నాయి.

వేనరాజు నాయకుడు. అతని సైన్యాధిపతి దృష్టవర్మ ఉపనాయకుడు. దృష్టవర్మ మునులచేతుల్లో కీలుబొమ్మగా మారి, గాఢనిద్రలో వున్న వేనుని గుండెల్లో బాకుతోపొడిచి, చంపుతాడు. తుట్టతుదకు దృష్టవర్మ తన అపరాధాన్ని తెలుసుకొని పిచ్చివాడైపోతాడు. తాను కూడా పృథువుచేతికత్తితో పొడవబడి మరణిస్తాడు. అంతటితో ఈ నాటకం అంతమౌతుంది. కాబట్టి ఇది విషాదాంత నాటకం.

ఆంధ్ర నాటక రంగానికి చేసిన అమూల్యమైన సేవ వల్ల రామస్వామి చౌదరిగారు ఆంధ్ర నాటక కర్తల్లో అగ్రశ్రేణికి చెందిన వారుగా పరిగణించబడుతున్నారు.

### 3.2. అముద్రిత నాటకాలు :

పలనాటి యుద్ధం ఇతివృత్తంగా తీసుకొని రాసిన నాటకం 'కారెంపూడి కథనం'. ఈ నాటకం ముఖ్యమైన పట్టణాల్లోనే కాక అంగలూరు, చేటపల్లి మొదలైన గ్రామాల్లో సైతమూ ప్రదర్శించబడింది.

స్వాతంత్ర్య పోరాటం ముమ్మరంగా జరుగుతున్న రోజుల్లో కవిగారు కొండవీటి పతనం, రాణాప్రతాప్ అనే రెండు నాటకాల్ని రాశారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగానూ, స్వాతంత్ర్య ఉద్యమానికి అనుకూలంగానూ రాసిన నాటకాలు ఇవి. బిపిన్ చంద్రపాల్ ఆంధ్రదేశ పర్యటనను పురస్కరించుకొని అనేక చోట్ల ఇవి ప్రదర్శించబడ్డాయి.

అముద్రిత నాటకాలైన వరకం, అంపకం కూడా అదృశ్యమయ్యాయి. చౌదరిగారి ఇతర గ్రంథాలవలే ఈ నాటకాలు కూడా తెలుగుదేశంలో పెద్ద గాలి దుమారాన్ని లేపాయి. ఈ నాటకాలు దొరికి వుంటే ఇంకా బాగుండేది.

ప్రముఖ నాటకకర్త, మానవతావాది, హేతువాది అయిన కవిరాజు గూర్చి ఒక్క మాటలో చెప్పాలంటే జాతిలో జీర్ణించిన మూఢ విశ్వాసాల్ని, ఛాందసాచారాన్ని నిర్మూలించి, భావ విప్లవాన్ని సాధించిన యుగకర్త కవిరాజుగారు. చాతుర్వర్ణ్యాన్ని వర్గ సమాజాన్ని కాదని ఎచ్చులొచ్చులు లేని ప్రజాస్వామ్య ధర్మాన్ని ప్రబోధించి, మానవతకు నీతికి పట్టం గట్టిన మహామనిషి కవిరాజుగారు. తర్వాత తరంవారికి వీరి నాటకాలు పరమ ప్రామాణికమైనాయంటే వీరి నాటకాలకు ఎంత శక్తి ఉందో మనం ఊహించవచ్చు.

**4. శతకాలు :**

**4.1 కుప్పుస్వామి శతకం :**

జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరిగారిని దృష్టిలో వుంచుకొని రాసిన శతకం ఇది. రామస్వామిగారు కుప్పుస్వామిగారు మంచి స్నేహితులు.

ఈ శతకంలోని మొట్టమొదటి పద్యమే మనల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది.

'గొంటరుల దుంటరుల గుమిగూల్చి సృష్టి
జేసి చీటికి మాటికి గాసి వారు
తన్నుకొని చచ్చుచుండగ దనియు చుండు
గొప్పవానికి జేజేలు కుప్పుస్వామి"

అప్పట్లో అమలులో వున్న సాంఘిక దురాచారాలనూ, మూఢనమ్మకాలనూ, మతం పేరుతోనూ, దైవం పేరుతోనూ, జరుగుతున్న అత్యాచారాలనూ, నిర్భయంగా దుయ్యబట్టారు చౌదరిగారు ఈ శతకంలో.

మానవునికి ఎన్ని సుగుణాలుంటే మాత్రం ఏమి లాభం? నీతి ఒక్కటి లేకపోతే మిగిలినవన్నీ బూడిదలో పోసిన పన్నీరు గదా! అంచేత మానవుల్ని నీతి, నియమాలతో బ్రతకవలసిందిగా ఉద్బోధించారు కవిరాజుగారు.

"ఎన్ని రసమున్న నేమి రుచించును
నుప్పులేని కూర చప్పనగుచు
కోటి గుణములున్న గొఱగావు నీతియొ
క్కండు లేకయున్న గుప్పుస్వామి"
"నీతిలేనివాని నిరసించు జగమెల్ల
నీతిశాలి కపుడు నెగడు లేదు
నీతి శాలినెపుడు నీతియే కాపాడు
గుజనుబారి నుండి కుప్పుస్వామి"

ఈ శతకాన్ని ఆరంభం నుంచీ అంతం వరకూ కమ్మని శైలిలో నడిపించారు కవిరాజుగారు. ఇందులోని పద్యాలన్నీ పసిడితునకలే.

తెలుగు భాషలో అనేక నీతులు బోధించే శతకాలు వున్నాయి. కాని భావ విప్లవాన్ని ప్రబోధించే శతకం ఒకటి లేదు. ఈ లోటు కుప్పుస్వామి శతకం తీర్చింది. ఈ శతకంలో తెలుగు నుడికారం ఉట్టిపడుతుంది. దానితో వీరు ప్రజాకవిగా, పేరు పొందారు. సాంఘిక సేవలో, సాహిత్య సేవలో, ప్రజా సేవలో, ప్రమాణాల్లో, వారాల్లో భావవిప్లవంలో ఆరితేరిన మొనగాడు త్రిపురనేనివారు.

**2. ధూర్తమానవా! :**

కవిరాజుగారు ప్రారంభించి, అసంపూర్తిగా ఆపివేసిన మరో శతకం 'ధూర్తమానవా'! ఈ మకుటంతోనే ఇందులోని పద్యాలు సమవృత్తాలుగా రాయబడ్డాయి. దీని ప్రథమ ముద్రణ 1943 వ సంవత్సరం సెప్టెంబర్‌లో జరిగింది.

సర్వసాధారణంగా అన్ని శతకాల్లోనూ, మానవులకు జరుగుతున్న అన్యాయాలనూ, అధర్మాలనూ, తమ ఇష్టదైవానికి నివేదించుకోవడం ఇతివృత్తంగా వుండటం కద్దు. అయితే ఈ శతకంలోని చిత్రమేమిటంటే - మానవుడే మకుటధారియైన ప్రపంచంలో-భగవంతుడే కవిరాజుగారికి కలలో కన్పించి, తన పేరిట భూసుర వర్గం సమాజంలోని ఇతర వర్గాలకు చేస్తున్న అన్యాయాల్ని అక్రమాల్ని గూర్చి విన్నవించుకుంటాడు.

ఈ శతకం చదివితే ఇతర జాతుల్ని బానిసత్వంలో శాశ్వతంగా వుంచడానికి భగవంతుణ్ణి, స్వర్గ నరకాలనూ, భూసురులు తమ సుఖ సంతోషాల కోసం సృష్టించారనేది స్పష్టమవుతుంది.

*'హాజను మానకున్న నపవాదులు; తప్పవు శృంగ భంగముల్;*
*రోజులు నీకుఁ జాలవిసిరో! జాలు మింతకు మానకున్నచో*
*బాజివి యౌదు నీవు నగుబాటు ఘటిల్లును, నింకమీదనీ*
*పోజును చూచి మోసపడి పోవుట గల్గదు ధూర్త మానవా!"*

'ధూర్త మానవ శతకం' మిక్కిలి వ్యంగ్య పూరితమైంది. దీనిల్లో భగవంతునిపేర జరిగే అత్యాచారాల్ని, దుష్కృత్యాల్ని ఖండించారు. మానవులందరూ సమానులే అని నిరూపించబడింది ఈ శతకంలో.

ఎత్తుకోలులోనే భగవంతుని చేత పిడుగుల వర్షం కురిపించారు కవిరాజుగారు. భగవంతుడు ఏమంటున్నాడో మీరే చూడండి.

"ఏ బదునాల్గు లోకముల సృష్టియొనర్చుచు బెంచి పిమ్మటన్
దూబవలెన్ హరింతునని దొంగనుడుల్ వచియించు చుంటివే?
యే బది మాటలేమిటికి? ఇట్టి ప్రచారము మానకున్నచో
గూబలు సాఁగఁ దీసెదను గూయకు మిట్టివి ధూర్త మానవా"!

దేవుడు సర్వాంతర్యామి అని, శక్తిమంతుడు అని, సృష్టి అని అంటూనే ఆయనకు పుట్టిన రోజులు, పెళ్ళి రోజులు చేస్తున్నామని డబ్బులు దండుకొనే చందా రాయుళ్ళపై ఈ దేవుడి (కవిరాజు) పిడుగును పరిశీలిద్దాము.

*ఈ టకటొంకులేమిటికి? నిల్లును వాకిలిఁ గట్టి పెట్టియే*
*టేటను బెండ్లిసేయుమని యేనెపుడైనను గోరియుంటినె?*
*చీటికి మాటికిన్ బరుల జేబులు గొట్టుట ధర్మ మార్గమె?*
*ఏటికి నీయు బద్ధమరరే! ఇక సాగునె? ధూర్త మానవా!*

ఆయునకు జరుగుతున్న అన్యాయానికి కడుపుమండిన దేవుడి తిట్ల పురాణం ఇంతటితో ఆగలేదు. చందారాయుళ్ళనే మరొకసారి ఏమంటున్నాడో చూడండి.

*"గుడులున్ గోపురముల్ కుశీలవుఁడనై కూర్పించి చందాలతో*
*మడి మాన్యంబులు నాదు పేరునవె నిర్మాణంబు గావించుమన్*
*వడ వప్పున్ బెరవారి కిచ్చెదవె! నీ భావంబు నందేమి గీ*
*ల్పడఁగానేర్చెడి? చెప్పు మింతటి దివాలాకోరువే మానవా!"*

ఉపనిషత్తుల కాలంలో నింగి కెగిరిన భారతీయ తత్వ శాస్త్రం, పురాణ కాలం నాటికి అదః పాతాళానికి చేరింది. అవతారాల పేరిట దేవుడికి అనేక రకాల జంతు జన్మలను ప్రసాదించారు కవి పుంగవులు. వరాహమని, కూర్మమని, సింహమని ఒకటేమి? భావుకత పేరిట, భక్తి పేరిట దేవుడిని నానా బాధలకు గురిచేశారు. అంతేనా జుగుప్సాకరమయిన కామక్రీడలకు, ఆయన్ను కేంద్ర బిందువును చేశారు. పైపెచ్చు వాటికి కృష్ణ లీలలని పేరుపెట్టారు. కడుపు మండిందా దేవుడికి. పరువు తీసే ప్రయత్నం చేస్తే ఎవరికి మండిపోదు? దేవుడేమంటున్నాడో చూడండి. (కవిరాజు కవత వైవిధ్యాన్ని కూడా చూడండి).

అవతారంబులనెత్తి చేయగల నన్యాయంబు లన్నింటి నే
నవతారంబుల నెత్తకుండ మఱి చేయన్ శక్తి లేదంచు న
న్నవమానించితి వింతకాలమిటు? నిన్నాపాద మస్తంబుగా
నిపురుంబేసెద నెవ్వరడ్డ పడగా నీ కుండిరో మానవా!'

'మిడి మేలంబుగఁ దెచ్చి పెట్టితివిగా మేనత్తఁతో గూటమిన్
బడి మువ్వంకల ముండతోడ మధురాపట్నంబులోఁ గూటమిన్
మెడకుంగట్టిరి వెంతవాడవురా? నీ మిట్టాటలన్ మానవా?
కడికండల్ తెగ గోసివైచెదను గాక శ్రేణికిన్ మానవా?

తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టిపోసి అలసి సొలసిన ఆ సర్వాంతర్యామి ధూర్త మానవునికి ఇస్తున్న చిట్ట చివరికి హెచ్చరి చూడండి ఎలాగుందో? ఈ శతకం ప్రముఖుల, పామరుల మన్ననల్ని ప్రశంసల్ని అందుకొనటంలో ఆశ్చర్యం ఏముంది.

శతక వాఙ్మయం సాధించవలసిందేమిటో, ఎలా సాధించాలో, చౌదరిగారి 'కుప్పుస్వామి శతకం', 'ధూర్తమానవా' శతకాలు చాటుతున్నాయి.

**3. గోపాల రాయ :**

'గోపాలరాయ' అనే మకుటంతో మరో శతకం కూడా రాశారు. ఇందులో శ్రీకృష్ణుని గూర్చి వ్యంగ్యంగా చెప్పిన 26 పద్యాలు వున్నాయి.

### 15.1.5 సూతాశ్రమ గీతాలు :

కొందరు సంస్కర్తలు మార్పును ఏవో కొన్ని శాఖలకే పరిమితం చేస్తూ వుంటారు. చౌదరిగారు దానికి పూర్తిగా విరుద్ధం. గణబద్ధమైన పద్యరచనతోపాటు సూత్రాబద్ధమైన గేయ రచనను కూడా వారు రాశారు. ఆ పద్యాలకూ గేయాలకూ ఒక ప్రధానమైన భేదం వుంది. పద్యం పండితులకే పరిమితంకాగా, గేయం పామర జనానికి కూడా అందుబాటులో వుంటుంది. సామాన్య ప్రజానీకంలో ఏదైన ఒక నూతన భావాన్ని బహుళ ప్రచారం చేయడానికి గేయం చక్కని సాధనం. ముఖ్యంగా స్త్రీలనూ, బాలబాలికలనూ, గ్రామీణులను, సంఘంలోని సామాన్య ప్రజానీకాన్ని గేయాలు ఆకర్షించినంతగా, పద్యాలు ఆకర్షించవు. ఈ విషయాన్ని గుర్తించిన రామస్వామి చౌదరిగారు 'సూతాశ్రమ గీతాలు' రాశారు. సాహిత్య క్షేత్రంలో వారు చేసిన ఈ కృషి దేశాభివృద్ధికి జాతీయోద్యమానికి ఎంతగానో ఉపకరించింది.

వీరు భారతజాతికి అండగా నిల్చి జాతీయోద్యమంలో పాల్గొని, భారతమాత దాస్య శృంఖలాల్ని విచ్ఛేదం చేయాలని సంకల్పించారు. నీరసమూ, నిస్తేజమూ అయిన జాతిలో వీర రసంతో ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని, కలిగించడానికి 'వీరగంధము' అనే జాతీయ గీతం రాశారు. ఇది చాలా మంచి గేయం. స్వాతంత్ర్య పోరాట సీమలో తెలుగు వారికి నూతన ఉత్సాహాన్ని, శక్తిని ఇచ్చింది ఈ గీతం.

'వీరగంధము దెచ్చినారము
వీరుడెవ్వడొ తెల్పుడీ!
పూసి పోదుము మెడను వేత్తుము
పూలదండలు భక్తితో
తెలుగు బావుట కన్ను చెదరగ
కొండవీటను నెగిరినప్పుడు
తెలుగు వారల కత్తి దెబ్బలు
గండి కోటను కాంచినప్పుడు.

తెలుగు వారల వేడి నెత్తురు
తుంగభద్రమ గలసినప్పుడు
దూరమందున మన్ను నవ్వాజ
కత్తి నెత్తురు కడిగినప్పుడు
..................
..................
నడుము కట్టిన తెలుగు బాలుడు
వెనుక తిరుగం డెన్నడున్
బాస ఇచ్చిన తెలుగు బాలుడు
పాటి పోవండెన్నడున్.

అంటూ సాగె ఈ గీతం తెలుగు జాతిలో వీర రసాన్ని, కదనోత్సాహాన్ని కలిగించింది.

'ఉప్పు సత్యాగ్రహపు జైలు జీవితంలో నేనూ, ఆచార్య రంగా ఈ గేయాన్ని సంస్కరిస్తూ ఉత్తేజితులమయ్యే వారము' అని అన్నారు. డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారు. ఈ గీతం స్వాతంత్ర్య పోరాటపు రోజుల్లో ఆంధ్ర దేశంలోని ముఖ్య పట్టణాల్లోనే కాక, మారుమూలల గ్రామాల్లో సైతమూ ప్రతిధ్వనించింది.

చాదరిగారు ఎంతటి దేశభక్తులో, అంతటి స్వరాష్ట్రాభిమానులు. వారికి తెలుగు ప్రజలన్నా, తెలుగు భాషన్నా, తెలుగు దేశమన్నా అభిమానం ఎక్కువ. అంచేతనే నిద్రాణమైన తెలుగు ప్రజానీకానికి వైతాళిక గేయాలు ఆలాపించారు.

'గౌతమీ నది, కృష్ణవేణియు
తుంగభద్రయు, నర్మదా
జీవనదులై యుండి పోవక
యెల్ల కాలము పాఱుచున్
...    ....    ....
...    ...    ....
తెలుగు బిడ్డా మరచి పోకుర
తెలుగు దేశము పురిటి గడ్డర
కొక్కొరోకో పాట బాడర
తెలుగు వారల మేలు కొల్పర'

ఆంధ్ర సాహిత్య నందనోద్యానంలో పూచిన సురభిళప్రసూనాలు ఈ 'సూతాశ్రమ గీతాలు'.

**6. సూత పురాణము :**

భారత దేశంలోని దురాచారాల్ని రూపుమాపి, నీతిని నెలకొల్పడానికి రామస్వామిగారు 'సూతపురాణం' రాసినట్లుగా ఈ క్రింది పద్యం వల్ల తేటతెల్లమవుతుంది.

'ధర్మము ధర్మమంచు చెఱదారులు త్రొక్కుచు నానలేక దు
ష్కర్మములాచరించు కలికాలపు బిడ్డలగాంచి తప్పుడై
మర్మము విప్పి చెప్పిమను మార్గమునన్ నడిపింప లోకమున్
నిర్మలుడైన సూతముని నీతులు పల్కెడు నా ముఖంబునన్'

చిరకాలజీవి, పరమ కరుణా స్వభావుడు, గంగానదీ తీరంలో తపోనిష్టలో వున్న సూతమహర్షిని రామస్వామిగారు సందర్శిస్తారు. పుణ్యభూమిగా, గణనకెక్కిన ఈ భారతదేశంలో భగవంతుని పేరు మీదుగానూ, స్వర్గ - నరకాల పేరుమీదుగానూ, పూర్వ గ్రంథాల పేరు మీదుగానూ, జరుగుతున్న అపచారాలనూ, అన్యాయాలనూ, అసత్యాలనూ, సూతుని ముందు ఏకరువు పెట్టారు. ఇది వంచన కాదనుకొంటున్న సూత మహర్షికి, వంచనే అని స్థిరంగా నమ్ముతున్న రామస్వామిగారికీ, సుదీర్ఘమైన వాదోపవాదాలు జరుగుతాయి. చివరకు భారత దేశంలో జరుగుతున్నది వంచనేనన్న మోసమేనన్న రామస్వామిగారి వాదనతో ఏకీభవించిన సూతముని రామస్వామిగారిని లోక కళ్యాణార్థం ఓ కావ్యం రాయమనగా వారి ఆజ్ఞానుసారంగా సూత పురాణాన్ని రాశారు రామస్వామి.

సత్యాన్వేషణ దృష్టితో తాను యధార్థమని విశ్వసించిన సిద్ధాంతాన్ని నిర్భయంగా లోకానికి 'సూత పురాణం' ద్వారా వెల్లడించారు. కవిరాజుగారు. ఈ కావ్య ప్రయోజనాన్ని గ్రంథ పీఠికలో నిర్మొహమాటంగా ఈ విధంగా వెల్లడించారు. "ప్రాకృతజనంబునకు వేదార్థము సులభైక వేద్యము కాదని యెఱింగి వైదికులును, నిష్కాములును, లోక సంసర్గ రహితులును, నిసర్గభూత దయాశీలురును నయిన ఋషిచంద్రులు నిర్వ్యాజకరుణా విశేషంబున 'స్త్రీ శూద్రద్విజబంధువులకు' ముక్తి మార్గముఁజూపి తరింపజేయుటకునై వేదార్థమునుటంకించి పురాణములు వ్రాసిరని ఆర్యోక్తి. ఈ యార్యోక్తియందు విశ్వాసముంచి మూఢ లోకంబు పురాణము లార్షేయములనియుఁ, దత్కారణమునఁ బూజ్యములనియు, దదంతర్గత ధర్మములు నీతులు, కథలు శిరోధార్యములనియు విశ్వసించుచున్నది. ఈ విశ్వాసము వలనఁ గలిగిన ప్రతిఫలమాత్మ ద్రోహముగాఁ బరిణమించుటఁజేసి పురాణము లెంతవరకుఁ బ్రతికూలములో, ఎంత వరకు నీతి బాహ్యములో, యెంతవరకుఁ బక్షపాత భూయిష్ఠములో మోడ్పుగన్నుతోనున్న విద్వల్లోకమునకుఁ జూపించు తలంపుతో సూతపురాణము రచింపబడింది. తత్కారణమున సూతపురాణము కారణజన్మ".

'సూత పురాణం' నాలుగు ఆశ్వాసాల రసవత్కావ్యం. ప్రథమాశ్వాసంలో కౌశికునికి జ్ఞానోదయం కలిగించిన ధర్మవ్యాధుడనే కసాయివానికథ, భద్రాద్రి గోపన్నను రామదాసుగా మార్చిన కబీరుదాసు వృత్తాంతం చోటుచేసుకున్నాయి. ద్వితీయాశ్వాసంలో దేవతల్ని గూర్చి, దేవలోకాన్ని గూర్చి చర్చించడం జరిగింది. తృతీయాశ్వాసంలో ప్రహ్లాద చరిత్ర, యధార్థ రామాయణం వుంది. చతుర్థాశ్వాసంలో శ్రీకృష్ణ చరితము, కురుపాండవుల కథ చక్కగా వివరించబడ్డాయి.

కేవలం అగ్రకులంలో జన్మించారన్న ఒకే ఒక కారణంచేత కొందరు అన్ని లాభాలను తామే జుర్రుకోవటం, ఇతర జాతులను న్యూనతకు గురిచేసి అదేమంటె అది వారి కర్మఫలం అనటం - ఈ రెంటిని కూడా కవిరాజుగారెలా ఎద్దేవా చేశారో చూడండి.

*'విభుఁడొకఁడు చేయునంట పై పెత్తనంబు!*
*కర్మయొకఁడు సంసార చక్రంబుఁ ద్రిప్పు*
*నంట! ద్వంద్వ ప్రభుత్వమిం దమరలేదె?*
*ఎంతకాలంబు సాఁగునో యిట్టి చిట్ట!*

పురాణాలు ఎంతవరకు కట్టు కథలో, ఎంతవరకు నీతి బాహ్యములో లోకానికి చెప్పటం లక్ష్యంగా సూత పురాణ ఆవిష్కరణ జరిగిందని కవిరాజుగారు ముందె చెప్పుకున్నారు. ఆబాలగోపాలం పరమ పవిత్రంగా భావించె పురాణ కథలను ప్రతికూలములని చెప్పటానికి చాలా ఆత్మ స్థైర్యం అవసరం. అది వారికి పుష్కలంగా ఉంది. మచ్చుకు ఈ క్రింద నుదహరించిన రెండు పద్యాలు వారి ఆత్మస్థైర్యానికి, సామాజిక స్పృహను కల్పిద్దామన్న వారి నిష్ఠకు సజీవ ఉదాహరణలు.

*క్రోతి కొండ ముచ్చులకును గొండలకును*
*మానవులు పుట్టిరనునట్టి మాయమాట*
*లన్ని కథలీ పురాణము లందె కలవు*
*పిట్ట కథలకు నివిఎల్ల బుట్టినిండ్లు.*
*సాధో జనాభుండు భగవంతుడొక చోట*

నొకచోట స్త్రైణ శాపోహతుడు
అళికాక్షుడద్వితీయ బ్రహ్మమొకచోట
నొకచోట ఋషిపత్నులకు విటుండు
అబ్జ గర్భుండు స్వయం భువౌ నొకచోట
నొకచోట శత్రుపాదోపహతుడు
దేవకీపుత్రుడింద్రియ జీత యొకచోట
నొకచోట జారవాళికి గురుండు

శుకపరబ్రహ్మ మొకచోట శుద్ధ జడుఁడు
వేతె యొకచోట సంసారి బిడ్డ తండ్రి
యన్ని కధలీపురాణము లందె కలవు
పిట్టుకథలకు నివియెల్ల బుట్టినిండ్లు.

సూత పురాణము అగ్రకులజుల సొత్తుగా మిగిలిపోయిన పండిత లోకంలో ప్రకంపనాలు పుట్టించింది. సహజమెకదా! దాని ప్రతులను అగ్నీ దేవుడికర్పించి, సంతుష్టులయిన వారూ ఉన్నారు. అయితే దానిని ప్రశంసించిన ఉదార హృదయులు కూడా మెండుగానే వుండేవారు. వారిలో అగ్రగణ్యుడు, స్వయాన రామస్వామిగారి గురుదేవులు, కింకవీంద్ర ఘటాపంచానన బిరుదాంకితులు జానపదుల నాలుకలపై సదా నాట్యమాడె 'చెల్లియో చెల్లకో' వంటి పద్యరత్నాల సృష్టి అయిన చెళ్ళ పిళ్ళ వేంకటశాస్త్రిగారు. వారు వారి శిష్యునికి ఇచ్చిన ఈ యోగ్యతా పత్రము చూడండి.

నలగామరాజు తన ఆంతరంగిక సచివుడైన గింజయు ద్వారా యుద్ధ వార్తలను వినాలన్న కుతూహలంతో అతడిని అడిగే ఘట్టంతో భగవద్గీత ప్రారంభమయింది. బాల చంద్రునిలో రణోత్సాహం కలిగించడం కోసం బ్రహ్మనాయుడు ప్రయత్నించాడు. సాంఖ్యోపదేశం చేసినా బాల చంద్రునిలోని భయం పోలేదు. అతనిలోని రాగ ద్వేషాలను పోగొట్టాలని జ్ఞానయోగం బోధించాడు. ద్వాపర యుగం నాల్గవ పాదంలో ప్రజలు పాపాత్ములయ్యారు. అందుకే భారత దేశంలో యుద్ధాలన్నీ కల్పించి ఇరు పక్షాలు హతమయ్యేటట్లు ధర్మం వృద్ధి చెందేలా చేశానన్నాడు. వర్ణ వ్యవస్థను గురించి కూలంకషంగా చర్చించి జ్ఞానోదయం చేయమని బాలచంద్రుడు కోరాడు.

"వర్ణములు నాలుగు తొలుత నేర్పరచి పిదపఁ
బ్రజ సృజించితి నమమాట వట్టిమాట
ప్రజల సృష్టిఁజేసి గుణకర్మలచేత
వర్ణములనుమూడింటి నేర్పఱచినాడ" అని బ్రహ్మనాయుడు వివరించాడు.

వ్యాస భగవద్గీతలోని విభూతి యోగంలో శ్రీకృష్ణుడు 'సమస్త భూత హృదయాలలోఉన్న ఆత్మను నేను - భూతాల ఆది మధ్యాంతం నేనే. సూర్యులలో విష్ణువును నేనే అంటూ నా దివ్య విభూతులకు అంతం లేదు. అంటూ వివరణను కొందరు వక్రీకరించి 'అహంబ్రహ్మన్న' అనుకున్నారు. ఈ భావం అవహేళనకు గురయింది.

యెకముల హిపొపొటామసును
సుకములలోఁబల్లినాఁటి యుకమును రాలన్
జెకుముకి రాయిని నేనే
శకటములందెల్ల ధూమశకటమునేనే" అన్నాడు.

వర్ణ వ్యవస్థను సమూలంగా నాశనం చేయాలనేది త్రిపురనేని ఆశయం. జన్మను బట్టి ఆధిక్య అనాధిక్యతలను నిర్ణయించడం అధర్మం. నాటి ఆచారాలను, వ్యవస్థను నశింపజేసి సర్వ మానవ సమతా ధర్మంగల నూతన ప్రపంచాన్ని నిర్మించాలని రామస్వామి కలలుగన్నారు.

విశ్వరూప సందర్శన సమయంలో బ్రహ్మనాయుడు -

బ్రహ్మణాది చండాల పర్యంతమైన
యన్ని జాతుల వారల నాస పెట్టి
యిటకుఁ దోడ్తెచ్చితిని వధియింపనెంచి
తెలుగు జాతి పునస్సృష్టికలన కొఱకు".

అని బాలచంద్రునికి బోధించాడు.

సంస్కర్తలకు పుట్టినిల్లయిన ఆంధ్ర దేశంలో మహా మనీషి, బహుభాషావేత్త, సమతా సిద్ధాంత వేత్త అయిన త్రిపురనేని అపూర్వమైన భగవద్గీతను సృష్టించి ఆంధ్రుల ప్రతిభను పెంచారు. నిస్తేజమైన జాతిలో చైతన్యాన్ని కలిగించారు.

బూతుపురాణము కాదిది
పాత పురాణమును గాదు పాతకహర మౌ
సూత పురాణం బియ్యది
ఖ్యాత పురాణంబు, పుణ్య పురుషావళికిన్.

ఒక మహా కవికి ఇంతకన్నా గొప్ప యోగ్యతా పత్రం మరెక్కడనుండి లభిస్తుంది.

### 15.1.7. . భగవద్గీత :

1941 వ సంవత్సరంలో పలనాటి వీర చరిత్రను ఇతివృత్తంగా గైకొని రామస్వామిగారు 'భగవద్గీత'ను రాశారు. కురుక్షేత్ర యుద్ధ భూమిలో శ్రీకృష్ణుడు అర్జునునికి గీతోపదేశం చేశాడనే ప్రతీతి వున్నది కదా! అదే విధంగా కారెంపూడి కదనరంగంలో బ్రహ్మనాయుడు బాలచంద్రునికి గీతోపదేశం చేశాడని భావించిన చౌదరిగారు చక్కని వ్యంగ్య వైభవంతో ఈ అధిక్షేప గ్రంథాన్ని రాశారు. మహాభారత యుద్ధానికి వలే పల్నాటి యుద్ధానికి కూడా సోదరుల రాజ్య కాంక్షే మూలకారణం. మహాభారత, పల్నాటి యుద్ధాలకు గల పోలికలు చాలా స్పష్టంగా తెలుస్తాయి. తెలుగు సాహిత్య చరిత్రలో కనీవినీ ఎరుగని ధోరణిలో వ్యంగ్య రచన చేశారు కవిరాజుగారు.

### 15.1.8. వివాహవిధి :

కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరిగారు చిన్ననాటి నుంచి తాను విశ్వసించిన అభిప్రాయాల్ని నిర్భయంగానూ, నిర్మొహటంగానూ, వెల్లడించేవారు. మానవ జీవితంలో వివాహం మహోత్కృష్టమైంది. అంచేత పెళ్ళి నూరేళ్ళ పంట అని అంటారు. గనుక వివాహ నిర్వహణ విధానంలో వారికి గల కొన్ని అమూల్యమైన అభిప్రాయాల్ని లోకానికి తెలియజేయాలనే ఉద్దేశంతో 'వివాహవిధి' అనే చిన్న పుస్తకాన్ని 1930 సంవత్సరంలో ప్రచురించారు.

ఈ చిన్న పుస్తకం తెలుగు కుటుంబ జీవితంలో ప్రవేశపెట్టిన మార్పు అంతా - ఇంతా కాదు. కరుడుగట్టిపోయిన సంఘంలో చైతన్యం కలిగించింది. బ్రాహ్మణ, పౌరోహిత్యం లేకుండా వందలాది వివాహాలు జరిగాయి. చౌదరిగారి వివాహ పద్ధతి అమల్లోకి వచ్చింది. కవిరాజుగారు ప్రవేశపెట్టిన మార్పులన్నీ ఒక ఎత్తు, ఇదొక్కటే ఒక ఎత్తు.

### 15.1.9 త్రిపురనేని తియ్యనైన పీఠికలు :

రామాయణ, భారత, భాగవతాలపై కవిరాజుకు నిర్దుష్టమైన అభిప్రాయాలున్నాయి. వీరు పౌరాణిక సాహిత్యాన్ని హేతువాద దృక్పథంతో పరిశీలించారు. ఆర్యమత గ్రంథాలకు ద్రావిడ భాష్యాన్ని రాశారు. పురాణ ఇతి వృత్తాల్ని తీసుకొని తన దృక్పథానికి అనుగుణంగా నాటకాల్ని రాశారు. వాటికి వివరణాత్మక ఉపోద్ఘాతాల్ని కూడ పొందుపర్చారు. ఈ పీఠికలు లేకపోతే వారి తాత్త్విక దృష్టికి అవరోధం, అపకారం, జరిగి వుండేది. కేవలం రచనకోసం రాశారు కానీ ఆయాపాత్రల్లో వారి అభిప్రాయాలు లేవని విమర్శకులంటే, వారి అనుయాయులు ఇరకాటంలో పడేవారే. వారు తమ విప్లవాత్మకమైన భావాల్ని ఉపోద్ఘాతాల్లో వివరంగా వివరించారు. వీరి విమర్శన వెనుక సాంఘిక సమానత్వం, సత్యాన్వేషణ, నీతి, ధర్మం అనేవి ఉత్తమ ఆదర్శాలుగా కన్పిస్తాయి.

పాశ్చాత్య విజ్ఞానం ద్వారా వచ్చిన హేతువాద దృక్పథంతో, చారిత్రక దృష్టితో పురాణాల్ని పరిశీలించి, అంధ విశ్వాసాల్ని ప్రశ్నించారు. న్యాయశాస్త్రంలో నిష్ణాతులైన కవిరాజు తమ వాదాల్ని తర్కబద్ధంగా, అతి సమర్థవంతంగా సాగించారు.

వీరి పౌరాణిక రూపకాలైన కురుక్షేత్ర సంగ్రామం, శంబుక వధ, ఖూనీ నాటకాలకు పొందుపర్చిన పీఠికల్లో హిందూ ధర్మ శాస్త్రాలు అధర్మ శాస్త్రాలనీ, స్వర్గనరకాలు స్వార్థపరుల కల్పనలనీ, పురాణాలన్నీ పిట్ట కథలుగా, కట్టుకథలుగా పేర్కొన్నారు. మన పురాణాలన్నీ నిశితంగా పరిశీలిస్తే చౌదరిగారి వాదమే నిజం అనిపిస్తుంది.

### 15.1.10 కవిరాజు శబ్దసృష్టి :

చౌదరిగారు శబ్దవైచిత్రిని కవితలో చూపించారు. మహత్తర కవితా సృష్టిని చేయడంతోపాటుగా తెలుగు నుడికారపు పదును చూపటమేగాక, తెలుగుదనపు సంపదల్ని, చూపించుటయే కాక, నూతన శబ్దాల ప్రౌఢిమను మనకు చూపించారు. వారి నూతన శబ్ద సృష్టి వారి గ్రంథాల్లో కన్పిస్తుంది.

### 15.1.11. కవిరాజు ఛలోక్తులు :

సంభాషణల చమత్కారానికి కవిరాజుకు పెట్టింది పేరు. వీరి సంభాషణల్లో ఎంతో చమత్కారం, ఎంతో హాస్యం జాలువారుతాయి.

ఒకనాడు, తోటలో అరటిమొక్క పాదుచేస్తూ వుండగా, విశ్వనాథ సత్యనారాయణగారు, సూతాశ్రమానికి వచ్చి, 'కవిరాజుగారూ అరటిగెల ఈశాన్యపు మూల వేయరాదంటారు. కోయించి వేయండి' అన్నారట. వారి మాట ముగియకముందే 'అవును, సత్యనారాయణగారు ఇంకొక వారానికి పక్వానికొస్తుంది, అలాగే కోసివేస్తా' నన్నారట.

ఒక సభలో కవిరాజు వారి విప్లవాత్మక భావ ప్రసంగాలు చేసిన తర్వాత, అక్కసు పట్టలేని ఒక శ్రోత 'మీరింతగా రాముణ్ణి ఆడిపోసినా, మీ పేరు రామస్వామియేగదా' అన్నాడట. 'అవును నేను రామునికి మొగుణ్ణి కనుక నా పేరు రామస్వామి' అని చటాలున అనేసరికి పృచ్ఛకుడు మూర్ఛిల్లినంత పని అయినదట.

అంగలకుదురులో ఒక ఉపన్యాసక చక్రవర్తి కవిరాజుతో ఢీకొన్నప్పుడు, 'మీరు మ్లేచ్ఛులు గదా' అని కవిరాజుగారు వారిని అంటే వారు హుంకరించి 'నేను స్వచ్ఛమైన బ్రాహ్మణ్ణి సుమా! అన్నారట. 'మీరు మనుస్మృతి నంగీకరిస్తారా?' అని కవిరాజు వారిని అడుగగా, వారు 'మహాప్రసాదంగా' నన్నారట. మనుస్మృతి గత శ్లోకాన్ని విసరి, అర్థాన్ని వివరిస్తూ 'వింధ్యదాటి దక్షిణానికి వచ్చినవాడు మ్లేచ్ఛుడ'న్న వాక్యాన్ని చెప్పగా, సభికులు గొల్లుమన్నారట. ఉపన్యాసక చక్రవర్తికి నక్కిళ్ళు పడినవట.

కొల్లూరు ఆ రోజుల్లో వేటభూమి. ఒక దీక్షితులు 'కమ్మ', 'కుమ్మర', శబ్దసామ్యం వారిరువురు ఏకోదరులనిపించున'న్నారట. గభీలున 'అవును, దీక్షితులుగారూ విప్ర వుప్పర' శబ్దసామ్యమును బట్టి ఏక గర్భజనితులుగా నున్నారనగా సభలో హర్షధ్వానాలు మిన్ను ముట్టినవట. దీక్షితులు గారు దిగ్భ్రమ చెందారట.

రాజకీయ చర్చల్లో ఒకనాడు ఒక గాంధేయుడు 'నూలువడికితే స్వరాజ్యం వస్తుంది' అంటే 'నూలువడికిన రోజుల్లోనే ముందుగా మన స్వరాజ్యం పోయింది. తిరిగి నూలు వడికితే ఎట్లా వస్తుంది' అని కవిరాజు అన్నారట.

ఊదర గోపయ్యగారు శ్రీ చౌదరిగారిని ఇలా ప్రశ్నించారు :

'రామస్వామి గారు! దేవుడు విషయం మీరు వున్నాడనా లేక లేడనా! ఏమంటారు? వారు ఇలా సమాధానపరిచిరి. దొంగతనం చేస్తే కోర్టుకు వెళ్ళాలి అనే సంగతి తెలుసుగదా! మానవుడు సరియైన ప్రవర్తన అలవరచుకుంటే దేవుడుతో ఏమి పని?' అని అన్నారు. ఇలా చౌదరిగారు ఎన్నో చలోక్తులు వేసేవారు.

చౌదరిగారి కవిత్వం అపూర్వ విషయ భూయిష్టమై, చమత్కార పూరితమై, సుడికార పోషకమై, శయ్యా(ప్రసన్నతాహృద్యమై, ధారాళతావిశిష్టమై, బహుపండిత ప్రశంసా పాత్రమై విరాజిల్లుతూ వుంది. ఇలాంటి రసవత్తరమైన కవితను భూసురవర్గం పాతాళలోకానికి అణగ(ద్రొక్కాలని ప్రయత్నం చేశారు. అయితే ఆ ప్రయత్నం ఫలించలేదు.

కవిరాజుగారి భావాల ప్రచారం ఉధృతరూపం దాల్చుతూ వుంది. ఈనాడు వారి గ్రంథాలు చదివేవారి సంఖ్య ఎక్కువయింది. వారి కవితా మాధుర్యానికి తన్మయులైన రసపిపాసకులు ఎందరో ఆంధ్రదేశం నలుచెరగులా వున్నారు. రామస్వామిగారి చిత్రపటం అనేక ఇండ్లలో అలంకరించబడి వుంది. కవిరాజుగారికి అనేకమంది ఏకలవ్య శిష్యులు వున్నారు.

రామస్వామిగారు చేసిన సాహిత్య, సాంఘిక సేవల్ని గుర్తించిన మన రాష్ట్ర ప్రభుత్వం వారి కాంస్య విగ్రహాన్ని ట్యాంక్‌బండ్ మీద 1986 నవంబర్ 1వ తేదీన నెలకొల్పింది. ఈ కాంస్య రూపం భావి తరాలకు చైతన్యస్ఫూర్తి కలిగిస్తూ, సందర్శకుల హృదయాల్లో జాతి, మత, కుల వర్గ విభేదాల్ని సమసిపోయేటట్లు చేసి, మానవులంతా ఒకటే అనే సమతాభావాన్ని కల్గిస్తుందనడంలో సందేహంలేదు.

సామాజిక రుగ్మతలకు, అసమానతలకు కారణాలైన వేదాల్ని, పౌరాణిక గాథల్ని హేతువాద దృష్టితో, సాంఘిక న్యాయ సాధన కోసం కలంపట్టి భావ విప్లవానికి బాట వేసిన మహానుభావుడు కవిరాజుగారు.

ఏది ఏమైనా సమాజంలో మతపరమైన, మతపరంగా వచ్చిన అసమానతలు సమసిపోయే వరకు చౌదరిగారి రచనలు భావ విప్లవాన్ని వెదజల్లుతూనే ఉంటాయి.

## సమీక్ష :

హేతువాద పితామహుడుగా నిరూపించడం, త్రిపురనేని నాటకాలలో ప్రాచీన ఛాందస భావాల మీద వ్యతిరేకత, పురాణాలలోని, అహేతుక భావాలను హేతు దృష్టితో ప్రశ్నించడం, వివాహ క్రమాన్ని తెలుగులో వివరించడం, భగవద్గీతను ఆధునిక దృష్టితో చూడడం గమనించవచ్చు.

## ప్రశ్నలు :

1. త్రిపురనేని భావవిప్లవాన్ని వివరించండి.
2. త్రిపురనేని నాటకాలలోని హేతువాద దృష్టిని పరిశీలించండి.
3. సూత పురాణ రచనా విధానాన్ని సమీక్షించండి.
4. త్రిపురనేని రచనలను పరిశీలించండి.

## ఆధార గ్రంథాలు :


1. కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి జీవితం - సాహిత్యం - తెలుగు విశ్వవిద్యాలయం.
2. పౌరాణిక రూపకాలు - భావ విప్లవం - డా. కొండపల్లి సుదర్శనరాజు
3. కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి జీవితం - సాహిత్యం - త్రిపురనేని సుబ్బారావు.
4. కవిరాజు త్రిపురనేని సాహిత్యం - పరిశీలన - డా.కె. సురేంద్ర


డా॥ వి. సిమ్మన్న

పాఠం - 15.2

# గుఱ్ఱం జాషువా

(28-9-1895 - 24-7-1971)

## పాఠ్య నిర్మాణ క్రమం :

15.2.1 కావ్య ఖండికలు

2.2 లఘు కావ్యాలు

2.3 గద్య కావ్యాలు

2.4 దృశ్య కావ్యాలు

2.5 స్వీయ చరిత్ర

2.6 పద్య కావ్యాలు

2.7 జాషువా కవికి లభించిన బిరుదులు

2.8 జాషువా కవికి లభించిన సన్మానాలు

2.9 జాషువా మానవతా వాది

## లక్ష్యం :

అస్పృశ్యత, సాంఘిక అసమానతలు, మూఢ విశ్వాసాలు, అశాస్త్రీయ దృక్పథమనే పర్వతాలను హేతువాద దృష్టితో ఖండించబడి సమాజ శ్రేయస్సుకు మార్గాన్ని సుగమం చేసిన విధంగ గమనించవచ్చు.

నిరుపేదగా పుట్టి నవయుగ కవిచక్రవర్తిగా ఎదిగిన అమృతమూర్తి గుఱ్ఱం జాషువా (28-9-1895-24-7-1971). వీరి తల్లి దండ్రులు లింగమాంబ వీరయ్యలు. లింగమాంబ ఆదియాంధ్ర కులస్థురాలు. క్రైస్తవ మతానికి సంబంధించింది. వీరయ్య యాదవ కులస్థుడు. వీరిది ప్రేమ వివాహం. లింగమాంబను ప్రేమించడం వల్ల క్రైస్తవ మతాన్ని పుచ్చుకొని, క్రైస్తవ మతబోధకుడయ్యాడు వీరయ్య. వీరికి కలిగిన సంతానమే జాషువా. ఆయన 1895వ సంవత్సరం సెప్టెంబర్ 28వ తేదీన గుంటూరు జిల్లా వినుకొండ గ్రామంలో జన్మించాడు.

జాషువా చిన్నతనంలో విద్యమీద అంతగా ఆసక్తి చూపలేదు. ఆటపాటలతో కాలం గడిపాడు. గురవమ్మ టీచర్, గుడిమెళ్ళ సుబ్బారాయుడు మాష్టారు చూపిన చొరవతో, ఆదరాభిమానాలతో, ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యను పూర్తి చేసుకొని, బాపట్లలోని అమెరికన్ బాప్టిస్టు మిషన్ హయ్యర్ గ్రేడ్ టీచర్ ట్రైనింగ్ స్కూల్లో ఉపాధ్యాయ శిక్షణ పొందాడు. జాషువాకు "మేరి"తో 1910లో పెళ్ళి అయింది. నా కవిత్వానికి నా ప్రతిభకి కారణం నా "మేరి" అని జాషువాయే చెప్పుకున్నాడు.

జాషువాకి తన అభిప్రాయాల్ని భావాల్ని వున్నదియున్నట్లు చెప్పడం అలవాటు. ఇలా తాను నమ్మిన సిద్ధాంతాల్ని అభిప్రాయాల్ని చెప్పడం వల్ల జీవితంలో జాషువాకు చాలా ఎదురు దెబ్బలు తగిలాయి. బ్రతుకు తెరువుకోసం స్వగ్రామమైన బాట్రగడ్డ పాడులో మిషన్ వారి ప్రాథమిక స్కూల్లో టీచర్‌గా ఉద్యోగంలో చేరాడు. క్రైస్తవ పెద్దల్ని క్రైస్తవ మతాచారాల్ని చాలా తీవ్రంగా విమర్శించడం వల్ల టీచర్ ఉద్యోగం పోయింది.

బ్రతుకుతెరువు కోసం జాషువా ఇంచుమించు అన్ని ఉద్యోగాలు చేశాడు. కొంతకాలం తర్వాత టూరింగ్ టాకీసుల్లో యుగ సినిమాలకు కథా రచయితగా పనిచేశాడు జాషువా. పిదప రాజమండ్రిలో కోటిలింగాల పేటలో టీచర్ ఉద్యోగం చేశాడు. తర్వాత గుంటూరులోని అమెరికన్ లూథరన్ హయ్యర్ గ్రేడ్ ఉపాధ్యాయ శిక్షణా పాఠశాలలో టీచర్‌గా పని చేశాడు. జాగర్లమూడి కుప్పస్వామి చౌదరి ప్రోత్సాహం వల్ల సహకారం వల్ల బాపట్లలోని జిల్లా బోర్డు హైస్కూలులో టీచర్‌గా కొంతకాలం, వినుకొండలోని బోర్డు మెడికల్ స్కూలులో కొంతకాలం

పనిచేశాడు. రెండో ప్రపంచ యుద్ధకాలంలో "యుద్ధ ప్రచారకా" ఉద్యోగిగా కొంతకాలం పనిచేశాడు. అంతేకాక ఆలిండియా రేడియో మద్రాసు కేంద్రంలో, తెలుగు విభాగంలో ప్రొడ్యూసర్‌గానూ పనిచేశాడు. ప్రతి ఉద్యోగంలోనూ క్రమ శిక్షణతో మెలిగాడు. అందరితో కలసి మెలసి వుండేవాడు. శాసన మండలి గౌరవ సభ్యునిగా కొంతకాలం పని చేశాడు.

జాషువా మేరిలకు ఐదుగురు సంతానం. ఇద్దరు కొడుకులు, ముగ్గురు కుమార్తెలు. పద్మానాభుడు, వలరాజా కొడుకులు. కాంతమణి, పద్మావతి, హేమలత కుమార్తెలు. అనుకోకుండా తన శ్రీమతి చనిపోవడం వల్ల జాషువా "విమలమ్మ"ను రెండో భార్యగా పెళ్ళి చేసుకుంటాడు. జాషువా చివరి రోజుల్లో ఆయనకు సేవలు చేసింది విమలమ్మే. మానవతామూర్తి జాషువా 1971వ సంవత్సరం జులై 24వ తేదీన గుంటూరులో పరమపదించాడు.

వినుకొండ పొలిమేరల్ని దాటి, తెలుగుదేశం ఎల్లల్ని అధిగమించి, వినువీధి అంచుల్ని తాకడానికై ఉద్యమించిన జాషువా వ్యక్తిత్వం, పరిపక్వత చెంది పరాకాష్ఠకు చేరుకుందనడానికి ఈ క్రింది పద్యాల్ని మంచి ఉదాహరణగా తీసుకోవచ్చు.

"కులమతాలు గీచుకున్న గీతలజొచ్చి
పంజరాన గట్టువడను నేను
నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు
తిరుగులేదు విశ్వనరుడనేను"

జాషువా కవితాత్మకు ఆయన విశాల దృక్పథానికి ప్రబల నిదర్శనం.

## జాషువా రచనలు - సమీక్ష :

### 15.2.1. కావ్య ఖండికలు :

జాషువా ఏడు కావ్య ఖండికలు రాశాడు. ఇవి అన్నీ ప్రముఖుల ప్రశంసల్ని అందుకున్నాయి.

1. ఖండ కావ్యం - మొదటి భాగం : బహుళ ప్రచారం పొంది జాషువా కీర్తి కిరీటంలో మణిపూసలైన కవితా ఖండికలు 'భారత మాత', "సాలీడు", 'స్మశాన వాటిక', 'గుంటూరు సీమ', 'రాజదర్శనం' మొదలైన 35 కవితా ఖండాలు ఇందులో వున్నాయి. తాత్వికుడైన కవి మనసు ప్రపంచంలోని జీవన మరణ లీలలకు ఉద్వేగం చెందుతూ భావ డోలికలలో విహరించి ఊహాలకందని విషయాలన్నీ సహజంగా ఇతివృత్తంలో వివరిస్తుంది. ఉదాహరణకు సాలీడు గూర్చి

   *"నీలో నూలు తయారు చేయు మరగానీ, ప్రత్తి రాట్నంబు గా*
   *నీ లేదీశ్వర శక్తి నీ కడుపులోనే లీనమై యుండునో*
   *యే లీలన్ రచియింతు నీ జిలుగు నూ! వీ పేట్టు పుట్టంబు! లో*
   *సాలీడా, నిను మోసగాడవని విశ్వం బేల ఫరోషించెడిన్"* ఖండ కావ్యము, మొదటి భాగము (పుట. 16).

2. ఖండకావ్యం - రెండో భాగం : "భారతమాత", "ఆంధ్రుడను", "అఖండ గౌతమి", "మాతృప్రేమ", "బుద్ధుడు", "కృష్ణదేవ రాయలు", "కవితా లక్షణం", 'తలిసి వస్తాదు" మొదలైన 32 కవితా ఖండికలు ఇందులో ఉన్నాయి.

   కవి మాతృ మూర్తి గొప్పదనాన్ని గూర్చి చెప్పుచూ :

   *"చేరి తన మేనినెత్తురు టేరులందు*
   *నేను నిలు వీత లీదని నెలవు లేదు,*
   *జనన దినమునఁ బురిటి మంచాలమీఁద*
   *నేను తన గుండెకాయనై నిలిచినాను"*

   ఖండ కావ్యము, రెండవ భాగం (పుట : 28).

3. ఖండ కావ్యం - మూడో భాగం : ఇందులో "కన్న తల్లి", "తిక్కయజ్వ", "నేటికైత", "సుభానుబోసు", "భట్టుమూర్తి", "గోవు లాంటి" కవితా ఖండికలు 20 వున్నాయి.

సృష్టిలో గల ప్రతి అణువూ ఆయన దృష్టికి వింత సోయగాలతో కనిపిస్తుంది తన కవితా శిల్పంతో చిరస్మరణీయం చేశారు. గోవుమ క్షమారూపణిగా తీర్చి దిద్దాడు.

*"పలవుల బిడ్డలం గటిక పస్తులతో హాతమార్చి గడ్డి దూ*
*డల సృజియించి తెచ్చి యెదుట న్నిల బెట్టెడు క్రూర మర్త్యన్ మం*
*డలముల మోస ముందెలిని నవ్వు మొగంబుల పాలొసంగు గో*
*వుల సహన స్వభావమును పొందొసరింపుము మామనస్సులన్"* ఖండ కావ్యము, మూడో భాగం (పుట :19)

4. ఖండకావ్యం - నాల్గో భాగం : ఇందులో 'క్రీస్తు", "నవభారతం", "వీరేశలింగ కవి", "తెలుగు గడ్డ" "కవిబ్రహ్మ" మొదలైన ఇరవై ఆరు కవితలు వున్నాయి.

5. ఖండకావ్యం - ఐదో భాగం : ఈ భాగంలో "నేను", "మాత", "నవభారతం", "పిలక" "బడిపంతులు", 'వంచిత', మొదలైన 24 ఖండికలు వున్నాయి.

జాషువా ఆశయానికి, వారి మూర్తి స్ఫూర్తికి గీటురాయి 'నేను' ఖండిక.

*"నివసించుటకు చిన్న నిలయమొక్కటి దక్క*
*గడన సేయుట కానవడదు నేను*
*ఆలుబిడ్డలకు నై యాస్తి పాస్తులు గూర్ప*
*పెడ త్రోవలో పాదమిడను నేను..."* ఖండ కావ్యం, ఐదోభాగం (పుట : 1)

6. ఖండకావ్యం - ఆరో భాగం : ఇందులో "విశ్వకవి", "నాగార్జునుడు", "శారదా దర్శనము", 'వీరచానమ్మ', 'సంక్రాంతి' మొదలైన 31 కవితా ఖండికలు వున్నాయి.

7. ఖండ కావ్యం- ఏడో భాగం : ఇందులో "తస్మాద్ జాగ్రత్త", "సింహనాదం", "రక్త తిలకం" "ప్రథమాస్థాన కవి", "తండ్రి దీవెన", "పితృభక్తి" మొదలైన ఇరవై ఐదు కవితా ఖండికలు వున్నాయి.

## ఎ. అనాథ (1932) :

1. విప్లవాత్మకమైన మార్పునకు అనుగుణంగా రచించబడినదే ఈ 'అనాథ'.

*"పరుల దుర్గతి గని గుండె గఱగి వగచు*
*సదయ హృదయుల వీక్షణాం చలమునందు*
*బుట్టుచుండును కన్నీటి బొట్టు వోతె*
*ఏడి భగవంతుడని సంశయింతు వేల?"*
మాధవ సేవకన్నా మానవ సేవే సర్వోత్కృష్టమైనదని ఈ ఖండ కావ్యంలో పేర్కొన్నారు.

అనాథ-ద్వితీయాశ్వాసము (పుట : 44).

**2. స్వప్నకథ (1932) :**

ఇందులో రెండు గాథలున్నాయి. 1. అనాథ, 2. స్వప్నకథ రెండూ కల్పిత గాథలే. జాషువా మాటల్లో "స్వప్నకథ సమగ్రం" మ్రోట్టి కట్టిన గాలి. అనాథ అసమగ్రం సలసల కాగించిందిన కన్నీటి బిందువు".

అనాథ, భర్త చనిపోగా గంపెడు బిడ్డలతో పొట్టకోసమై జోలెపట్టుకొని వీధుల పాలైన మాలెతదీనగాథ ఇందులోని కథా వస్తువు. అస్పృశ్యత, దారిద్ర్యం ఈ రెండూ సామాజిక రుగ్మతలకు జాషువా అద్దం పట్టాడిందులో.

స్వప్నకథ, చందమామలోని మచ్చుగా కన్పించే 'అవ్వకథ' పుట్టుకతోనే కన్నవారిని పోగొట్టుకొని ఒక సాలె పడతిచే పెంచబడి ఓ 'పీధిబిక్ష' గాణ్ణి ఆదుకొనబోయి అపనిందల పాలయి చివరకు కారాగారం పాలైన ఓ రెడ్డిసాని కథ ఇందులోని కథావస్తువు. సమకాలీన సామాజిక పరిస్థితుల్ని దారిద్ర్యం ఎంత పతనానికి దారి తీయిస్తుందో ఇందులో చాలా చక్కగా వర్ణించాడు.

చిన్ననాడు పేదరికమన్న బడిలో తాను నేర్చుకొన్న పాఠాలకు సంబంధించిన జ్ఞాపకాలతో లేమిలోని గుట్టును ఈ విధంగా బట్టబయలు చేశారు.

"పేదరికము పెద్ద వింత విద్యాశాల
దానిలోన లజ్జ గాన బడదు
ఉదర మొజ్జయగుచు నోరం తప్రొద్దులు
నోర్మి విద్దె నేర్పు చుండు నవట"
స్వప్నకథ- ప్రథమాశ్వాసము (పుట : 33)

**4. కాందిశీకుడు (1945) :**

ఆంధ్రుడైన ఒకానొక బర్మా కాందిశీకునికి, అరణ్య మార్గంలో కాలికి తగిలిన ఒక బౌద్ధ భిక్షువు కపాలానికి జరిగిన వాదోపవాదాలే ఇందలి యితివృత్తం. యాంత్రిక జ్ఞానాభ్యున్నతికై వెంపరలాడే ఈ అధునాతన యుగానికి బుద్ధదేవుని అహింసా సందేశం, క్రీస్తు ప్రభువుని ప్రేమ సందేశం, రామకృష్ణుని ఆధ్యాత్మిక తాత్త్విక సందేశం లోకానికి తెలియజేసి శాంతి అహింసల ఔన్నత్యాన్ని ముఖ్యావసరాన్ని నొక్కి చెప్పి, విశ్వమానవ కళ్యాణ సాధన కవి ముఖ్యాశయం. ఇందులోని కథ కవిత్వం. యుద్ధోన్మాదంతో గంగుర్లెత్తిపోతున్న ప్రపంచానికి శాంతి అహింసల ప్రాముఖ్యాన్ని ప్రబోధించడమే జాషువా ముఖ్యోద్దేశం.

నిరపరాధులైన మానవుల్ని నిష్కారణంగా బలి చేస్తున్న నేటి ప్రపంచ యుద్ధ భీషణ కాలములో శాంతి అహింసలను స్థిరపరచడమే నా ఆశయం." అని జాషువాయే కావ్య ఉద్దేశ్యాన్ని ప్రకటించారు.

"సమరన భావ నిశ్చల పరిశ్రమకు బ్ర
హ్మాండంబు లున్మూఖంబయిన దాక
వ్యత్యయంబైన తీవ్రాస్పృశ్యతా జాడ్య
మన్ని విధాల రూపటిన దాక
నా జాతి నా యూరు నా దేశమని పొంగు
స్వాభిమానము శూన్యమయిన దాక
విశ్వ సౌభ్రాతృంబు వెలయించు నైక్య సం
ఘా వ్యాప్తి దిశల పెంపారు దాక,
జ్ఞానమత సాంఘిక స్వేచ్ఛ నల్పురకును
నేకరీతి లాభించువందాక, రాదు
భావి భారత కల్యాణ పరమ సుఖము
కాక చల్లార దేవుడు సంగ్రామ ముఖము" కాందిశీకుడు (పుట : 47).

**5. నేతాజీ (1948) :**

ఇందులో తొలి నిట్టూర్పు, మలి నిట్టూర్పు అనే రెండు భాగాలున్నాయి. పరదాస్యంలో మ్రగ్గుతున్న భారతమాత ఆవేదన తలచుకొని బోసుపడిన మనోవ్యధ, దేశంలో కులమత భేద, మదపిశాచముల స్వైరవిహారం తొలి నిట్టూర్పులో కన్పిస్తాయి.

గృహ నిర్బంధం నుంచి తప్పించుకొని మిత్రుల సాయంతో బెర్లిన్‌లో నియంత హిట్లరును కలిసి సహాయం పొందటం, జపాను వెళ్ళి జపాను అధినేతల ప్రాపకం సంపాదించడం, అజాద్ హిందూ ఫౌజు సైన్యాన్ని రూపొందించడం బ్రిటీషు ఇండియాపై దాడికి సర్వ సన్నద్ధం కావడం ఇలాంటి ముఖ్య ఘట్టాలు ఇందులో వున్నాయి.

**6. బాపూజీ (1948) :**

బాపూజీ హత్య వార్తవిన్న జాషువాకవి హృదయావేదన ఇందులో చోటు చేసుకుంది. ఇందులో భారత స్వాతంత్ర్యోద్యమంలో బాపూజీ చేపట్టిన సహాయ నిరాకరణోద్యమం, క్విట్ ఇండియా మూమెంట్ మొదలైన ముఖ్యమైన ఘట్టాలున్నాయి. బాపూజీ వ్యక్తిత్వానికి, బాపూజీ నాయకత్వానికి, గాంధేయ సిద్ధాంతానికి జాషువా ఈ కావ్యంలో బ్రహ్మరథం పట్టాడని చెప్పవచ్చు. ఈ బాపూజీ కావ్యం ద్వారా గాంధీజీ ఎడల తనకు గల భక్తి ప్రకటించడంలో పూర్తిగా జాషువా కృతకృత్యుడయ్యాడు.

**7. స్వయం వరం (1950) :**

ఇది కల్పించబడింది. స్వరాజ్య వధువుని అభ్యుదయ భావాలుగల నవయువతకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఓ నవయువకుడు వరించడం ఇందులోని ఇతివృత్తం. ఇందులో స్వాతంత్ర్యానంతరం దేశంలో నెలకొన్న విపరీత ధోరణుల్ని ఆయన విమర్శించాడు. అఖండ భారతంలో నెలకొన్న కులమత ప్రాంతీయ భాషా వర్గభేద భావాల్ని సూచన ప్రాయంగా తెలియజేశాడు.

**8. రాష్ట్రపూజ (1953) :**

ఇది చిన్న ఖండ కావ్యం. ప్రత్యేకాంధ్ర రాష్ట్రం కోసం ఆత్మబలిదానం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు, రాజధాని విషయమై చెలరేగిన వివాదం, ముఠా రాజకీయాల కీచులాట, జీవనదుల పావన జలాలతో సస్యశ్యామలమవుతూ, సహజ ప్రకృతి సౌందర్యంతో పసిడి పంటల సిరిసంపదలతో నిత్యకళ్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న ఆంధ్రదేశ సౌభాగ్యం, ఆంధ్రజాతి ఉత్కృష్టత మొదలైన అనేక విషయాలు ఇందులో వర్ణించబడ్డాయి.

**9. కొత్త లోకం (1956) :**

ఇది కల్పితం. ఇందులో మూడు భాగాలున్నాయి. 1. వ్యత్యయం, 2. తొలికోర్కె, 3. మలికోర్కె. రాజుకు కవికి మధ్య వున్న తేడాను విడమరచి చెప్పినాడు జాషువా. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రాభివృద్ధికి చేపట్టిన పథకాన్ని సూచనప్రాయంగా పేర్కొంటూ ప్రధానంగా నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణం గూర్చిన ప్రస్తావన, ప్రశంస 'వ్యత్యయం' లో కన్పిస్తాయి.

తొలి కోర్కెలో జగం కల్పన చేసిన గారడీ వానిని 'కనపడవేమిరా?' అనీ, 'ఎవరడిగినారు నిన్నీ అవకతవక సృష్టిచేయ' మనీ ఇలాంటి ప్రశ్నలతో అవకతవకల్ని అసమానతల్ని ఎత్తి చూపుతూ సృష్టికర్తపై నిందాగర్భిత వ్యాఖ్యలు కవి చేస్తాడు.

మత మూఢాచారాలపై జరుగుతున్న అవకతవకల్ని, దోపిడీ విధానాన్ని నిరసించిన జాషువా ఈ కావ్యంలో హేతువాదిగా అంతకుమించి 'ఆస్తికవాది'గా ఇలా బహుముఖంగా నిజంగా కొత్తగా దర్శనమిస్తాడు.

అసమానతలకు అతీతంగా ఒక కొత్త లోకాన్ని సృజించమని కవి అభ్యర్థించడం జరిగింది.

"కలుపుంగోలు తనంబు తేట పడనుత్కంఠన్ మొగాలెత్తి మూ
తులు మూతుల్ గదియించి ముద్దుగొని సంతోషించు చిన్నారిచే
మల యందున్న పరస్పర ప్రణయ సంపత్తిం బ్రసాదించి మ
ర్త్యుల బుట్టింపుము కొత్త లోకమున కొల్తున్ నిన్నుము ప్రొద్దులన్"
కొత్త లోకము, తొలికోర్కె, పుట : 32.

**10. ముసాఫరులు (1963) :**

ఇహానికి పరానికి ప్రయాణించే రెండాత్మల సమావేశం ఇందలి కథా వస్తువు. ఇందులో మానవ జీవిత పరమార్థాన్ని గూర్చి కవి చెప్పిన వివేచన గమనించదగ్గది. ఇందులోని ఇతివృత్తం కల్పితం.

మానవులంతా ఒక్క తల్లి సంతానంగా భావించిననాడే మానవ జీవితానికి, మానవత్వానికి సరైన పరమార్థం కలుగుతుందని చెప్పాడు, 'ముసాఫరులు' కథలో.

"పెరిగినది వాఙ్మయుంబం బ
బరకుంటం బెద్ద గ్రంథ భాంగారంబుల్
పెరిగినవి మానవత్వము
పెరగదు కారణము తమ్మబిడ్డ డెరుంగన్"
ముసాఫరులు, (పద్యం : 46).

ఇంటనున్న ద్రవ్య మెరువు గుట్టను బోలు
వ్యాప్తి చెందెనేని ఫలము నిచ్చు
పారుచున్న నీరు పంటయని పండించు
పారకున్న నీరు పాంచిబట్టు (ప. 93)

**11. నాగార్జున సాగర్ (1966) :**

కృష్ణానదిపై గుంటూరు, నల్గొండ జిల్లాల సరిహద్దు మాచర్ల దగ్గరున్న 'నాగార్జున కొండ' సమీపంలో నిర్మించబడ్డ నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని గూర్చి రాసిన ప్రచార ఖండకావ్యం. ఇందులో శ్రీనాథుని పల్నాటి ప్రస్తావన, ఈ సాగరు రావడం వల్ల సస్యశ్యామలమైన పల్నాటి ప్రగతి చెప్పబడ్డాయి.

సాగరు రావడం వల్ల సస్యశ్యామలమైన పల్నాటి ప్రగతిని కవి ఈ క్రింది పద్యం ద్వారా చెప్పాడు.

"పులులు ప్రదక్షించినవి,
ముద్దిడుకొన్నవి నందికొండ లోయలు
చరణాంక ముద్రికలు
స్వాగత గీతము లాలపించి
పక్షులు తమిమీర రెక్కగొడుగుల్ ఘటియించిన
విందు బుద్ధ శిష్యులకు
పవిత్ర చైత్ర పరిశోభితముల్,
పలనాటి క్షేత్రముల్" (పుట : 10)

**15.2.2 లఘుకావ్యాలు :**

**1. ఫిరదౌసి (1932) :**

సుప్రసిద్ధ పారశీక కవి ఫిరదౌసి జీవితగాథకు సంబంధించిన కావ్యం. గజనీ మహమ్మద్ ఫిరదౌసి కవిని రావించి 'షానామా' గ్రంథం రాస్తే పద్యానికొక్క బంగారు నాణెం (దీనారం) యిస్తానంటాడు. ముప్పదేండ్లు కష్టపడి అరవైవేలు పద్యాల షానామా గ్రంథాన్ని రాసి, నవాబుకిస్తాడు కవి. బంగారు నాణెములకు బదులు వెండి నాణెములిస్తాడు నవాబు. వాటిని కవి తిరస్కరిస్తాడు. కోపించిన నవాబు కవిని చంపమంటాడు. ప్రాణభీతిచే భార్యాబిడ్డల్ని తీసికొని గజనీపట్నం వదలి తన స్వగ్రామమైన 'తూసు' నగరానికి వెళ్ళతాడు. మనసు మారిన

గజినీ బంగారు నాణెములను పంపుతాడు. అప్పటికే కవి చనిపోతాడు. కవి కుమార్తె, కూడా ఆ నాణెములను తిరస్కరిస్తుంది. పశ్చాత్తాప తప్తుడైన గజినీ మహమ్మద్ ఫిరదౌసి పేర సత్రం ఒకటి కట్టిస్తాడు. స్థూలంగా ఇది ఇందులోని కథావస్తువు. కథ చారిత్రాత్మకమైనా కొంత కల్పించబడింది. జాషువాకు అఖండ కీర్తి ఆర్జించి పెట్టిన కావ్యాల్లో ఇది ప్రథమ స్థానం పొందిందనడంలో అతిశయోక్తి లేదు.

"ముత్యముల కిక్క యైన సముద్రమునను
బెక్కు మార్కులు ముక్కలు వేసినాఁడ
భాగ్యహీనుఁడ ముత్యమ్ము వడయన యితి
వనధినను మ్రింగనోరు వచ్చినది తుదకు" పుట 28.

అని ఫిరదౌసి వాపోయినాడేగానీ రాజాను శపించలేదు. ఈ పద్యాలు పరమ కర్కశమైన రాజు హృదయాన్ని కూడా కరిగించాయంటే కవిత్వానికి ఉన్న శక్తి ఎటువంటిదో మనకు తెలుస్తుంది. కావ్య వస్తువులోని శిల్పం-సౌందర్యం ఇక్కడ కన్పిస్తుంది.

**2. ముంతాజ్ మహల్ (1961) :**

మొగలాయి చక్రవర్తి షాజహాన్, ముంతాజ్ బేగంల నిష్కళంక, నిర్మల, పవిత్ర అన్యోన్య దాంపత్య ప్రేమైన జీవితం కడు రమనీయంగా వర్ణించబడింది. రోగగ్రస్తురాలైన బేగం భర్తతో మాట్లాడిన వేదాంత ధోరణి, సతీ వియోగంతో మొగలు చక్రవర్తి చెందిన మనోవ్యధ, హృదయావేదన ఇందులో చోటు చేసుకున్నాయి. చివరకు భార్య కోరిక మేరకు ఆమె ప్రేమ చిహ్నంగా షాజహాన్ 'తాజ్‌మహల్' నిర్మాణం చేయడం ఇందలి ఇతివృత్త ముఖ్య ఘట్టాలు. ఈ కావ్యంలోని షాజహాన్ మనోవేదనకు, జాషువా సతీవియోగంతో పడిన హృదయావేదనకీ సాదృశ్యం వుందని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు.

భరత మాతకు రత్న గర్భమును నామము ఎట్లు సార్థకమో కవి అపూర్వ రీతిలో తాజ్ సౌందర్యమునకు ఈ క్రింది రీతి సమన్వయించును.

"నిన్ను నుదరంబులో దాచుకున్న మహికి
రత్న గర్భాఖ్య నేడు సార్థక్యమయ్యె
నీవు తలమీద దాల్చి మన్నించు కతన
వసుధనొక బొగ్గు కోహినూరు వజ్రమయ్యె"
సౌందర్యాబ్ధి వర్ణనములో నిదొక అద్భుతా పూర్వ ఫణితి
ముంతాజ్ సౌందర్యానికి ప్రతిబింబమే తాజమహలు.

**3. క్రీస్తు చరిత్ర (1963) :**

ఇది మతపరమైన కావ్యం. క్రైస్తవ మత పవిత్ర గ్రంథం. క్రొత్త నిబంధనకిది కావ్యరూపం. క్రైస్తవ మతం పుచ్చుకున్న జాషువా క్రీస్తు చరిత్రను కావ్యంగా మలచడం ముదావహం.

### 15.2.3 గద్య కావ్యాలు :

**1. కుశలవోపాఖ్యానం (1923) :**

ఇది రామాయణానికి సంబంధించిన పౌరాణిక నవల. పిల్లలమర్రి పిన వీరభద్రుని ఆంధ్ర జైమినీ భారతం నుండి, కంకంటి పాపరాజు కవి రాసిన ఉత్తర రామాయణం నుండి కథను సంగ్రహించి ఈ పౌరాణిక నవల రాసినట్లు జాషువాయే చెప్పుకున్నారు. ఇందులోని శైలి సంస్కృతపద భూయిష్టమై దీర్ఘ సమాస సంభరితమై ప్రబంధ రచనా విధానాన్ని పోలి వుంటుంది. ఇది అలభ్యం.

**2. చిన్నా నాయకుడు (1948) :**

ఇది చారిత్రాత్మక నవల. పల్నాటి సీమను గజగజలాడించిన 'అడవిదొంగ' కన్నమదాసు దౌష్ట్యానికి గురియైన వినుకొండ నివాసి దనిశెట్టి - నరసరావుపేట అధినేత మల్రాజు గుండారాయని అండదండలతో ఆ గజదొంగ కన్నమదాసు (పల్నాటి వీరుడు, సేనాపతి కన్నమదాసు వేరు)ను హతమార్చి 'బొల్లాపల్లి' కోటకు పాలెగాడైన చెంచుల 'చిన్నవాడి' గాథ ఇది. ఈ నవల ఇప్పుడు అలభ్యం.

## 15.2.4 దృశ్య కావ్యాలు :

**1. రుక్మిణీ కల్యాణం (1919) :**

ఇది ఆరు అంకాల పౌరాణిక నాటకం. పోతన భాగవతంలోని రుక్మిణీ కల్యాణ కథకు ఇది రూపకం. రాజమండ్రిలోని చింతామణి నాటకమండలి అధినేత సత్యవోలు గున్నేశ్వరరావుగారి అభ్యర్థన మేరకు ఇది రచించబడింది.

**2. చిదానంద ప్రభాతం (1921) :**

ఇది మూడు అంకాల క్రైస్తవ మత సంబంధిత నాటకం. క్రీస్తు జననం ఇందలి ముఖ్య ఇతివృత్తం. క్రైస్తవ మత గ్రంథం బైబిలులోని 'క్రొత్త నిబంధన' ఆధారం చేసుకొని రచించబడింది.

**3. ధృవ విజయం (1925) :**

ఇది నాలుగు అంకాల పౌరాణిక నాటకం. పోతన భాగవతం చతుర్థ స్కంధంలోని ధృవోపాఖ్యానమునకు ఇది నాటక రూపం.

**4. వీరాబాయి (1946) :**

ఇది ఐదు అంకాల చారిత్రక నాటకం. చిత్తోర్గడ రాజు ఉదయ సింహుని భార్య వీరాబాయి వీరోచిత సాహసగాథ ఇందలి ఇతివృత్తం. హిందూ ముస్లిం మైత్రిని మనసులో వుంచుకొని జాషువా ఈ గ్రంథం రాశాడు.

**5. తెరచాటు (1946) :**

ఇది నాలుగు అంకాల సాంఘిక విషాదాంత నాటకం. బాల వితంతువుల హృదయావేదన, తత్ఫలితంగా కలుగు అనర్థాలు, నేటి ఇంగ్లీషు వైద్యుల నిర్దాక్షిణ్యం, సనాతనుల స్వార్థం, ముసలి మగవాళ్ళు పడచు పెండ్లాలతో పడు కష్టాలు మొదలైన విషయాల్ని లోకానికి వెల్లడించడమే నా ముఖ్యోద్దేశం అని జాషువాయే తన నాటక రచనోద్దేశ్యాన్ని వెల్లడించాడు. ఇందులో సమకాలీన సాంఘిక రాజకీయ మత సాహిత్య ధోరణులపై కూడా కవి విమర్శించాడు. ఇది అలభ్యం.

## 15.2.5 స్వీయచరిత్ర :

**1. నా కథ (పద్యరచన) :**

జాషువా కవి స్వీయజీవిత గాథకిది కావ్యరూపం. జన్మస్థలాన్ని, జననీ జనకుల్ని, నాటి నేటి రాజకీయ సాంఘిక వ్యవస్థను పరిశీలించి చూచుకొని 'మనశ్శాంతి' కై కలం పట్టుకొని కవి వెలయించింది 'నా కథ' కావ్యం. ఇందులో మూడు భాగాలు చోటు చేసుకున్నాయి.

## 15.2.6 పద్య కావ్యాలు :

1. హిమదమార్క పరిణయం, 2. కన్యకా పరమేశ్వరి, 3. శివాజీ ప్రబంధం ఈ మూడు పద్యకావ్యాలు అముద్రితం.

**శివాజీ :** ఛత్రపతి శివాజీ జీవితానికి సంబంధించిన కావ్యం ఇది. అయితే ఇందులో శివాజీ జీవితగాథ పూర్తిగా లేదు. ఈ కావ్యంలోని కొన్ని ముఖ్యమైన ఘట్టాలు 'శత్రు విజయం' 'పితృభక్తి', 'ఢిల్లీ ప్రయాణం' మొదలైన శీర్షికలు వున్నాయి.

వీరు చేపట్టిన అన్ని ప్రక్రియల్లోనూ మంచిపేరు తెచ్చుకున్నారు. తెలుగు సాహిత్యంలో వీరు రాసిన రచనలు ఆచంద్రతారార్కంగా సజీవంగా నిలిచి వుంటాయనడంలో అతిశయోక్తిలేదు. ఆంధ్ర కవితా లోకంలో అద్భుత కవితా వతంసుల్లో జాషువా అగ్రగణ్యుడు. వీరి

కవిత్వం లలితాతిలలితం. మధురాతిమధురం. వీరు కమనీయ మనోజ్ఞ కావ్య సుమాల్ని రాసి పాఠకుల హృదయాల్ని దోచుకున్నారు. ఆధునికాంధ్ర సాహిత్య కవి విశారదుడు జాషువా.

**15.2.7 జాషువా కవికి లభించిన బిరుదులు :**

1. కవితా విశారద (1933)
2. కవికోకిల (1936)
3. కవిదిగ్గజ - నవయుగ కవిచక్రవర్తి (1947)
4. మధుర శ్రీనాథ (1952)
5. విశ్వకవి సమ్రాట్ 1964)
6. కళాప్రపూర్ణ (1970)
7. పద్మభూషణ (1970)

**15.2.8 జాషువాకు లభించిన సన్మానాలు :**

1. విజయవాడ పౌరుల సన్మానం
2. గుంటూరు పొగాకు వ్యాపారుల సన్మానం (29-1-1953)
3. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం (15-2-1965)
4. శాసన మండలి సభ్యత్వం(1964)
5. గుంటూరు పురస్వేచ్ఛ పౌరసత్వం (26-1-1969)

## 15.2.9 జాషువా - మానవతా వాది

మనిషి-మనిషిగా మెలగడం బ్రతకడం; పాటి మనిషిని మనిషిగానే చూడటం, బ్రతకనివ్వడమే 'మానవత' అంటే 'వివేచన'లేని జంతువువలె 'మూర్ఖత్వంతో' కేవలం పొట్టకోసం ప్రాకులాడకుండా క్రూర స్వభావంతో తన స్వార్థం కోసం ఇతర జీవుల వలే జీవించకుండా మనిషి మనిషిగా జీవించడం మానవత్వం. విశ్వమానవ కల్యాణం మానవతకు పై మెట్టు. భిన్నత్వంలో ఏకత్వం అని మనం చెప్పుకుంటున్నా కులం కుమ్ములాటల్లు, మత వైషమ్యాలు వర్గపోరాటాలు జరుగుతూనే వున్నాయి. జాషువా కవితలు వారి మనోవ్యథకు అద్దంపడతాయి. "నాకు గురువులు ఇద్దరు ఒకటి పేదరికం, రెండోది కులమతం. మొదటిది నాకు సహనాన్ని నేర్పితే రెండవది నాలో ఎదిరించే శక్తిని పెంచిందే కాని బానిసగా మాత్రం మార్చలేదు. దారిద్ర్యాన్ని కులభేదాన్ని కూడా చీల్చి నేను మనిషిగా నిరూపించుకోదలిచాను. వాటిపై కత్తి కట్టాను. నా కత్తి కవిత. నా కత్తికి సంఘంపై ద్వేషం లేదు. దాని విధానంపైనే ద్వేషం" అన్నారు.

**ఎ) వర్ణ వ్యవస్థ :**

గబ్బిలం కావ్యం వీరి మనోవేదనకు ప్రతీక. ఒక అరుంధతీయుడు తన కన్నీటి గాధను కైలాస నాదునికి వినిపించమని తన అశ్రు సందేశాన్ని గబ్బిలం ద్వారా రాయబారం పంపడం ఇందులోని ప్రధాన ఇతివృత్తం. అస్పృశ్యుడు కనిపిస్తే చాలు

"కసరిబుస కొట్టు నాతని గాలిసోక
నాల్గు పడగల హైందవ నాగరాజు" అంటూ వర్ణాశ్రమ ధర్మాన్ని నిరసించాడు.

"మునలివాడైన బ్రహ్మకు పుట్టినారు
నల్వురు కుమారులనుట విన్నాముకాని

వసరముకన్న హీనుడభాగ్యుడైన

ఐదవ కులస్థుడెవరమ్మా సవిత్రి" - పంచము డెవరని భరతమాతను నిలదీశాడు. హరిజన క్రైస్తవుడుగా తాను అనుభవించిన దుస్థితిని తన కవిత్వంలో ప్రదర్శించాడు. స్వతంత్ర భారత దేశంలో హరిజనులు తమ హక్కులను సాధించుకొని గౌరవంగా సుఖంగా జీవించాలని కాంక్షించాడు.

**బి) ఆర్థిక అసమానతలు :**

గబ్బిలం, కాందిశీకుడు, కొత్తలోకం, అనాధ మొదలైన కావ్యాలలో పేదరికపు బాధలను చక్కగా వర్ణించాడు. గంపెడు పిల్లల్ని వెంటబెట్టుకొని ఇంటింటికి తిరిగి అడుక్కునే అనాధజీవితాన్ని, మానవత్వం లేకుండా ఆమెను ఛీకొట్టేవాళ్ళు, మూర్తీభవించిన మానవత్వంతో ఆమెను ఆదరించిన వారు, వారి ప్రవర్తనలను అనాథలో చిత్రించారు. ధరలు పెంచి జనులను పీల్చి పిప్పిచేసే జలగల వంటి బ్లాక్ మార్కెట్టుదార్లను గురించి హెచ్చరించాడు. ఈ దేశంలో "సనాతన ధర్మ ధేనువుల్ పితికిన పాలు పేదకు లభింపవు" అని బాధపడ్డాడు.

**సి) మతం పేరిట జరుగుతున్న అన్యాయాలు :**

"ప్రతిమల పెండ్లిండ్లు సేయుటకు వందలు వేలు వ్యయించుగాని దుః
ఖితమతులైన పేదల వకీరుల శూన్యములైన పాత్రలన్
మెతుకు విదల్పరీ భరత మేదిని ముప్పది మూడు కోట్ల దే
వతలెగ వడ్డ దేశమున భాగ్య విహీనుల క్షుత్తులారునే!"

మతం పేరుతో మానవునికి జరుగుతున్న అన్యాయాన్ని నిరసించాడు.

గంపెడు పిల్లల్నిచ్చి కూడు గుడ్డ లేకుండ చేసి పేదల కష్టాలకు కారణం కర్మ సిద్ధాంతాన్ని అంటగట్టాడనీ, సకల చరాచర జీవకోటిలో అణువణువున వుండి కూడ ప్రాణాంతకమైన అణుబాంబును సృష్టిస్తావా? అంటూ దేవుణ్ణి నిలదీసాడు. మత వైషమ్యాలు పురికొల్పి అనైక్యం పాదుకొల్పటానికి సంకుచిత స్వార్థ మత పీఠాధిపతుల జీవితాలు బాగు చేయటానికి మతం కంచుకోటలాగ పని చేస్తుంధన్నాడు. మూఢ మతాచారాలు కర్మకాండలవల్ల సామాన్య మానవుడు ఎంత దోపిడీకి గురవుతున్నాడో వివరించాడు.

**డి) మహిళాభ్యుదయం :**

వేలాది సంవత్సరాలనుండి భారత స్త్రీ అణచివేతకు గురవుతున్నది. అత్తగారి ఆరళ్ళతో అల్లాడిపోతూ కోడలిగాను, భర్త మరణంతో వితంతువుగాను, సంఘంలో పతివ్రత అన్న బిరుదు తగిలించి యింటిలో అత్తమామలకు, మగనికి, సంతానానికి, వెట్టి చాకిరీ చేస్తూ అబలగా జీవిస్తున్న భారతీయ స్త్రీ దయనీయ స్థితిని జాషువ గమనించాడు.

"అబలయన్న బిరుదమంటించి కాంతల
స్వీయ శక్తులదిమి చిదిమినారు
సబలయన్న బిరుదు సాధించి హక్కులు
గడన చేసి కొమ్ము కష్ట చరిత" అంటూ స్త్రీలోని సహజ శక్తి సామర్థ్యాలను అణచిన పురుషాధిక్యాన్ని, హిందూ సమాజాన్ని నిరసించారు. మగవారితో సమాన హక్కులు, సమాన గౌరవం సంపాదించుకొని సబలగా నిరూపించుకొమ్మన్నారు.

**ఇ) హేతువాద ధోరణి :**

హేతువాద దృక్పథం విద్యార్థి దశలోనే అలవడాలని జాషువా అభిప్రాయం.

"అకలంకంబగు హేతువాదమును సత్యాన్వేషణాసక్తి సాం
ఘిక కళ్యాణ పిపాస, పాక్షిక దవాగ్నిన్నెట్టు దుర్దాంత శా

*ర్ధిక పాండిత్యము నాచరింపని లసద్విజ్ఞాన మింటింట పా*
*దుకొనుంగాత విశాల భారతమునందున్ లోనన్ విఖ్యాతమై"*

అకలంకమైన హేతువాదం, సత్యాన్వేషణాసక్తి, సాంఘిక కళ్యాణం ప్రతి ఇంటా నెలకొల్పాలని కాంక్షించారు. తల్లి దండ్రులు, గురువులు, రచయితలు విద్యార్థులకు కులగోత్రాల గొడవలను తెలియజేయకుండా వారికి హేతువాద పూర్వకమైన ధోరణిని అలవాటుచేయాలి. ప్రాచీన సంప్రదాయాలనుండి, తాతలనాటి అనుభవాలనుండి విముక్తి పొందాలని, కాలంమారింది కనుక కొత్త భావాలను అలవరచుకొని ప్రగతి పథంలో నడవాలన్నారు.

అస్పృశ్యత, సాంఘిక అసమానతలు, మూఢ విశ్వాసాలు, అశాస్త్రీయ దృక్పథమనే పర్వతాలను హేతు దృష్టితో ఖండించి సమాజ శ్రేయస్సుకు మార్గం సుగమం చేసిన మానవతావాది, హేతువాది జాషువ.

## సమీక్ష :

భిన్నత్వంలో ఏకత్వం అని మనం చెప్పుకుంటున్న కులాల కుమ్ములాటలు, మత వైషమ్యాలు, వర్గ పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి. జషువా కవితలు వారి మనో వ్యధకు అద్దం పట్టినట్లుగా చూపించబడ్డాయి.

## ఆధార గ్రంథాలు :

1. జాషువా కవితా వైభవం - అమూల్యశ్రీ
2. జాషువా పిరదౌసి - ఒక పరిశీలన - డా. వెలమల సిమ్మన్న
3. జాషువా కృతుల సమాలోచన - డా.బి. భాస్కర చౌదరి
4. జాషువా సాహిత్యము - మానవతావాదము - డా.ఎమ్. సామ్యూల్ ప్రభాకరరావు
5. మహాకవి జాషువ కవిత్వం - కవిత్వం - ఆచార్య ఆర్.ఆర్. సుందరరావు
6. హేతువాది జాషువా - ఆచార్య తేళ్ళ సత్యవతి.

## ప్రశ్నలు :

1) గుఱ్ఱం జాషువాకు మానవతావాదిగా ఎందుకు చెప్పవచ్చును?
2) గుఱ్ఱం జాషువాగారి దృశ్య కావ్యాలను తెలిపి, వాటిల్లో ఉన్న సారాంశాన్ని తెలియజేయవలయును?
3) జాషువాగారి లఘు కావ్యాలను వ్రాసి, వాటిని ఏ ఉద్దేశ్యంతో వ్రాశాడో తెలుపవలెను?

డాక్టర్ వి. సిమ్మన్న

పాఠం - 16.1

# గుంటూరు శేషేంద్ర శర్మ - శివసాగర్

## పాఠ్య నిర్మాణ క్రమం :

16.1.1 చంపూ వినోదిని

16.2 పక్షులు

16.3 ఋతుఘోష

16.4 శేషజ్యోత్స్న

16.5 మండే సూర్యుడు

16.6 నాదేశం నాప్రజలు

16.7 నీరై పారిపోయింది

16.8 గొరిల్లా

16.9 సముద్రం నా పేరు :

16.10 ప్రేమ లేఖలు

16.11 ఆధునిక మహాభారతము

16.12 జనవంశమ్

## లక్ష్యం :

శేషేంద్ర శర్మ రచనలను పరిచయం చేయడం. వీరి కవిత్వం మీద భావ కవిత్వ, అభ్యుదయ విప్లవ కవిత్వాల ప్రభావాన్ని చూపించడం.

"నా ఏకైక లక్ష్యం నా శబ్దం యొక్క
అయస్కాంత శక్తితో పాఠకుణ్ణి
ఆకర్షించి అతడి మనస్సు మార్చడమే" - శేషేంద్ర.

గుంటూరు శేషేంద్ర శర్మ గారి సాహిత్య జీవితం ప్రయోగాలకు పుట్టినిల్లు. దీనికి ప్రధానంగా ఆయన వ్యక్తిగత జీవితం, ప్రభావాలు, అభిరుచులే కారణాలు. మహా పండితుడుగా, మంచి విమర్శకుడుగా, ఉత్తమ కవిగా శేషేంద్ర చూపిన ప్రతిభ అనన్య సామాన్యం.

1927 అక్టోబర్ 20వ రాత్రి 11-10 నిముషాలకు నెల్లూరు జిల్లా ఉదయగిరి తాలూకా నాగరాజుపాడులో జన్మించారు. తల్లి అమ్మాయమ్మ తండ్రి గుంటూరు సుబ్రహ్మణ్యంగార్లు. స్వగ్రామమైన నాగరాజుపాడులోని వీధిబడిలో అక్షరాభ్యాసం జరిగింది. శేషేంద్ర శర్మగారు 8 ఏళ్ళ వయస్సులోనే చిన్న చిన్న పద్యాలు స్వంతంగా చెప్పేవారు. ఆయునలో చిన్నతనంలో కమ్యూనిస్టు బీజాలు మొలిచాయి.

స్వగ్రామంలోనే శ్రీ నేతి కృష్ణశాస్త్రి గారి వద్ద కావ్య నాటక అలంకారాది సంస్కృత విద్యాభ్యాసం జరిగింది. గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో 1945లో బి.ఏ. పూర్తి చేశారు. 1948లో మద్రాసు విశ్వవిద్యాలయంలో బి.ఎల్. పూర్తి చేశారు.

1949 నుంచి 1974 వరకు డిప్యూటీ పంచాయితీ ఆఫీసర్‌గా కమీషనర్‌గా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగం చేశారు. 1975లో ఎమర్జెన్సీ చట్టం క్రింద కంపల్సరీ రిటైర్‌మెంట్‌కు గురై, తిరిగి ఉద్యోగంలో చేరారు. 1985లో హైదరాబాద్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసులో ఛీఫ్ వాల్యుయేషన్ ఆఫీసరుగా ఉద్యోగం చేస్తూ 1985 అక్టోబరులో రిటైరయ్యారు.

బాల్యంలో పద్మనాభయ్య మొదలైన కమ్యూనిస్టుల ప్రభావం, విద్యార్థి దశలో త్రిపురారిభట్ల రాఘవయ్య, ఆఘుంచర్ల గంగాధరరావు మొదలైన మిత్రుల ప్రభావం వల్ల కమ్యూనిస్టు సిద్ధాంత ప్రభావానికి లోనయ్యారు. గుంటూరు కళాశాల విద్యార్థిగా వున్నప్పుడే విశ్వనాథ సత్యనారాయణ గారితో పరిచయం ఏర్పడింది. విద్యార్థి దశలో ఆశుకవితా నైపుణ్యం అలవడింది. ఆశు కవిత్వంతోపాటు తిరుపతి వేంకటకవులు, వేంకట పార్వతీశ్వర కవులమీద గురుభావం ఏర్పడింది.

రానురాను శేషేంద్రగారికి కమ్యూనిస్టు సిద్ధాంతాలపట్ల అభిమానం పెరిగింది. మరోవైపు విశ్వనాథ సత్యనారాయణగారి ప్రభావం వల్ల పద్య రచనాశక్తి, మొదలైన విభిన్నాంశాలు ఆయనలో చోటు చేసుకున్నాయి.

1951లో 'షానామా' అనే పర్షియన్ ఇతిహాసంలోని సుప్రసిద్ధ గాథకు సొరాబు మరియు రుస్తుం 'మాత్యూ ఆర్నాల్డ్' చేసిన ఆంగ్ల తర్జుమాను అనుసరించి తెలుగులో స్వతంత్రానువాదం చేశారు.

1952లో స్వంత రచన మొదటిసారిగా ఈ ప్రపంచంలోను ఎక్కడున్నా సరే.... అనే పాట విశాలాంధ్రలో ముద్రించబడింది.

1954లో 'మబ్బుల్లో దర్బారు' అనే విప్లవ నాటికను రాశాడు. ఇది ఆంధ్ర ప్రభలో ప్రచురితమైంది.

1957 నుంచి లఘు కవితలు వివిధ పత్రికల్లో రాశాడు. 1961లో తను చేసిన చాటువులు అన్నిటినీ కలిపి 'చంపూ వినోదిని' పేరిట ముద్రించారు. హాస్య వ్యంగ్యం విలాస విశేష పద గద్యం సమ్మిశ్రిత రచన ఇది.

1963లో నక్షత్ర లోకాలకు సంబంధించిన 'విశ్వవివేచన' అనే గ్రంథాన్ని రాశారు. అదే సంవత్సరంలో ప్రాచీన ఛందస్సుతో 'ఋతుఘోష' అనే కావ్యాన్ని వెలువరించారు.

1964లో 'సాహిత్య కౌముది' అనే పేరుతో వ్యాసాలు రాశారు. ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధాల్లో ఇవి వచ్చాయి.

1965లో స్వర్ణ హంసను ఆంధ్ర ప్రభుత్వ సహాయంతో ప్రచురించారు. 1965 నుంచి ఐదేళ్ళు ఆంధ్ర సాహిత్య అకాడమీ సభ్యులుగా వున్నారు.

1968 నుంచి 1971 మధ్య కాలంలో జర్మనీ, ఇంగ్లాండు, ఫ్రాన్సు, ఇటలీ, గ్రీసు, కెన్యా, మడగాస్కర్, మారిషస్ దేశాలు పర్యటించారు.

1968 లోనే విప్పాల, కథలు పూర్వాంధ్ర కావ్యావళి విమర్శ వెలుగుచూశాయి. ఇదే సంవత్సరంలో జ్ఞాన్ బాగ్ ప్యాలెస్‌లో 'శేషజ్యోత్స్న' రాయడం మొదలుపెట్టారు. ఈ సంవత్సరమే ఊహలో సైన్సు, మొదలైన మిత్రవ్యాసాలు వచ్చాయి. 1969లో మారిషస్ ఆంధ్ర మహాసభలో ప్రసంగించారు. 1951-1969 మధ్య రాసిన లఘు కవితల్ని "పక్షులు" పేరిట ముద్రించారు.

1971లో ప్రముఖ ఆంగ్ల కవయిత్రి ఇందిరాదేవి ధన్‌రాజ్ గారిని వివాహం చేసుకున్నారు. ఈమెను వివాహమాడిన తర్వాత శేషేంద్ర కవిత్వంలో పరిణత ప్రస్ఫుటంగా కన్పిస్తుంది.

1972లో 'శేషజ్యోత్స్న' అనే కవితా సంకలనాన్ని శేషేంద్ర ప్రచురించారు. 1973లో 'మండే సూర్యుడు' తెలుగు, ఆంగ్ల భాషల్లో వెలువడింది. 1974లోనే 'రక్తరేఖ' డైరీ ఆంగ్లం తెలుగు నోట్సుతో ప్రచురించబడింది.

9-5-75 నుంచి 18-5-75 మధ్య కాలంలో ఊటీరిచింగ్ హాల్ ఎస్టేట్స్‌లో ఆధునిక ఇతిహాసం అయిన 'నా దేశం నా ప్రజలు' అనే విప్లవ కావ్యాన్ని రాశారు.

1975లోనే 'నారస్త్రా' ఋతుఘోష నుంచి మండే సూర్యుడి వరకు సంకలనం కవితా సంపుటి వెలువడింది. 1976-77 ప్రాంతంలో 'సీరై పారిపోయింది' అనే కవిత తెలుగులోనూ, ఆంగ్లంలోను వెలువడింది.

1977లో గొరిల్లా అనే కవిత ఎమర్జెన్సీ కాలంలో ప్రచురించారు. ఇదే సంవత్సరంలో శేషేంద్ర తన మిత్రులకు అప్పుడప్పుడూ రాసిన లేఖాంశాల్ని 'ఇన్ డిఫెన్స్ ఆఫ్ పీపుల్ అండ్ పొయిట్రీ' అనే పేరుతో ప్రచురించారు. 1977 ఆగష్టులో ఆధునిక కావ్యశాస్త్రమైన 'కవిసేన మేనిఫెస్టో' ఆవిర్భవించింది.

1978 లో 'సముద్రం నా పేరు' అనే కవితను ప్రచురించారు. ఈ సంవత్సరమే 'షోడశి రామాయణ రహస్యములు' అనే ఆధ్యాత్మిక తార్కిక గ్రంథం తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే ప్రచురించబడింది.

1982లో 'నేనూ నా నెమలి' రాశారు. 1984లో 'శేషేంద్ర జాలం' శీర్షికతో ఆంధ్రజ్యోతి వారపత్రికలో ధారావాహికంగా కవితలు రాశారు. వాటన్నిటికీ 'అరుస్తున్న ఆద్మీ' అని పేరు పెట్టారు.

1985లో 'వాల్మీకి కవితా సౌందర్యాలు' విమర్శనాత్మక రచన ``ష్ట పత్రికలో ధారావాహికంగా వెలువడింది.

1986లో 'ఈ నగరం జాబిల్లి' రాశారు. ఇందులో సాహిత్య వ్యాసాలు చోటుచేసుకున్నాయి. 1986లో 'ఆధునిక మహాభారతం వచ్చింది. 1990లో కాలరేఖ, సాహిత్య వ్యాసాలు 1993లో జనవంశమ్ ముద్రించబడ్డాయి.

గుంటూరు శేషేంద్ర శర్మగారి కవితా ప్రస్థానాన్ని మూడు దశలుగా వర్గీకరించవచ్చు. 1. సంప్రదాయిక దశ, 2. ప్రయోగ దశ, 3. విప్లవ కవిత్వ దశ. సంప్రదాయిక దశలో 'సొరాబు' అనే అనువాద కావ్యం. చంపూ వినోదిని, పక్షులు కవితా సంపుటి వెలువడ్డాయి. ఇది 1954లో ముద్రించబడింది. ప్రయోగదశలో ఋతుఘోష, శేషజ్యోత్స్నలను పేర్కొనవచ్చు. మండే సూర్యుడు, కవితా సంపుటి నుంచి నేటి వరకు విప్లవ కవిత్వ దశగా పేర్కొనవచ్చు.

## 16.1 చంపూ వినోదిని :

ఇది 1961లో ప్రచురించబడింది. 1947 నుంచి 1958 వరకు అప్పుడప్పుడు రాసిన గద్యపద్య రచన సంపుటి ఇది. 54 పద్యాలు గల ఈ సంపుటిలో కవికి గల సంస్కరణాభిలాష, ఆశుకవితా నైపుణ్యం ద్యోతకమవుతాయి. దీనిలో కుహనా ప్రజానాయకులపై విమర్శ లున్నాయి. కేవలం వచనాన్ని కవిత్వంగా పరిగణించే వారిపై వ్యంగ్యోక్తులున్నాయి. ఇందులో శ్రుతిమించిన శృంగార పద్యాలున్నాయి. అవినీతి పరులమీద విసుర్లు చమత్కారాలున్నాయి.

*"ఓ రోరీ అధికార దుర్మదవితండోద్దండ చండాలుడా*
*నీ రాజత్వము నీ నిరంకుశ దశన్ నీ గర్వ సర్వస్వమున్*
*నీ రేఖా లవమేని నిల్పన్ నినున్ నిర్మూలముంజేసి ని*
*స్సారుంజేయు దినంబు వచ్చె నికపై చాలింపు నీ వేషముల్"*

అంటూ దుర్మదులైన అధికారులపట్ల దూషణలున్నాయి. ప్రాచీన కవుల చాటువుల్లో వలె వ్యక్తిగతమైన రాగ ద్వేషాలు, శృంగార వర్ణనలు ఈ చాటువుల్లో కన్పిస్తాయి. వివిధ సందర్భాల వివరణల్లో వచనం కూడా చోటు చేసికొన్నది.

## 16.2 పక్షులు :

దీనిలో ఏడు గేయ కవితలు కాగా మిగిలినవి పద్య కవితలు. 1950-60 మధ్య కాలంలో రాసిన శేషేంద్ర కవిత్వంపై భావ అభ్యుదయ కవితోద్యమాల ప్రభావం కన్పిస్తుంది.

"ప్రొద్దిప్పుడే పొడిచి భూగోళమంతటా
ఎర్ర రంగులు పూసి వెర్రి ఎత్తిస్తోంది

నిండు కంఠము విప్పరా సోదరా

నిదుర లెమ్మని చెప్పరా"

అంటూ కమ్యూనిస్టు సిద్ధాంతంలో ఏకీభావాన్ని వ్యక్తం చేశారు.

"జిలుగు చినుకుల జలతారు వలువ దాల్చి

వచ్చి పోయినదట మొన్న వర్ష యోష

మెడకడన్ దెగి చన్నుల నడుమ నుండి

జారిపోయెడి ముత్యాల జాలువోలె

మడుగులను వీడి కొండల మధ్య నుండి

వెడలిపోయిన కొంగల వెంట నంటి"

ఇలాంటి పద్యాల్లో వివిధాలంకారశోభితాలైన, ప్రకృతి వర్ణనలున్నాయి.

"భావలతా నికుంజమున పాటలు పాడి కోకిలమ్మ యే

పూవులతోటకో ఎగిరిపోయెను తీయని స్వప్నమైననా

జీవన గేహళి తిమిరసీమలు కోమల కాంతి రేఖకై

బావురుమంచు శోకరస బంధురమై తపియించె నెచ్చెలి"

మొదలైన పద్ధతిలో నెచ్చెలి కొరకు వియోగ విలాపాలున్నాయి. సార్థక పదప్రయోగంతో, కోమల పదబంధాలతో లలితమైన శైలిలో భావావిష్కారానికి పద్యాన్ని మలచుకున్న తీరు అమోఘం. గ్రాంథిక వ్యావహారిక భాషల్లో కవికి గల పద్య రచనా నైపుణ్యానికి ఈ సంపుటిలోని ప్రతి పద్యమూ తార్కాణమే.

## 16.3 ఋతుఘోష :

1963లో వెలువడిన 'ఋతుఘోష' శేషేంద్ర భావుకతకు, వర్ణనా చతురతకు, ఆయనలో అనుస్యూతంగా ప్రవహిస్తూ వచ్చిన సామాజిక చైతన్యానికి అద్దం పట్టింది. ఆయన పద్య కవిత్వానికి తలమానికమైన కృతి ఇది. ఆయా ఋతువులలోని ప్రకృతి సౌందర్యం, శ్రామికుల కష్టనిష్ఠురాలు సమాంతరంగా వర్ణింపబడటం ఈ కృతిలోని విలక్షణత. గతానుగతికమైన కవి. ఒక్కొక్క ఋతువులో ఒక్కొక్క రకమైన ప్రత్యేక అందచందాల్ని సమకూర్చుకొని ప్రకృతి చేసే సౌందర్య ఘోష 'ఋతుఘోష'.

వసంత ఋతువును కవి ఈ విధంగా వర్ణిస్తాడు.

'నీలి జలంబు నీలిధరణీ వలయంబు వినీల శైలముల్

నీలి తరు ప్రపంచములు నీలియనంతయు నెందుజూచినన్

నీలిమ నీలిమాకవిత నిర్భర కంఠము విల్చినట్లు నా

నీలిమ దేహపంజర వినిర్గతమై పరుగెత్తె నెంతయున్'

ఋతురాణి ఐన వసంతంలో చెట్లు చిగిర్చి పల పుష్పాలతో ప్రకృతి అంతటా పచ్చదనంతో వ్యాపిస్తుంది. అనంతమైన ఆకాశం, కాలం నీలమైనవి. నీలిమ అనంతత్వానికి ప్రతీక. 'నా నీలిమ దేవ పంజర వినిర్గతమై పరుగెత్తె నెంతయున్' అంటూ నీలిమను తన ఆత్మకు లేదా ఆంతరంగిక జగత్తుకు ప్రతీకగా స్వీకరించాడీ కవి.

'నాలో నున్నది మాధవమ్మొకటి అంతర్గూఢమై జీవన

జ్వాలా కీలకమై మదీయ మధురస్వప్న ప్రపంచమ్ములన్

బాలించున్ పరిణామ జీవిత దశావ్యాఖ్యాన సంకేతమై
కాలంబన్నది దుర్విలంఘ్యమని యుద్ఘాటించు నుచ్చైర్గతిన్'

వైశాఖ మాసానికి మాధవ మాసమనేది మరో పేరు. కాలం ప్రకృతిలో మార్పులను తెస్తుంది. ప్రకృతి మానవప్రకృతిలో మార్పుల్ని కలిగిస్తుంది.

శేషేంద్ర వ్యంగ్యాన్ని చూపించడంలో ఆరితేరిన మొనగాడు.

"కనక మేఖలవోలె గగనమ్ము జఘనమ్ము
నింద్ర చాపము కుండలీకరించె
జాజిదండలవోలె చిన్న ముత్యాలతో
నీహార మధురిమ నివ్వటల్లె
అందెల రవళిగా ఆశాపథమ్ము లం
దంబుద ధ్వనులు మోహంబుగొల్పె"

పై పద్యంలో ఇంద్రచాపాన్ని, మెరుపును, మంచుబిందువులను, ఉరుములను ఉపమించిన తీరు శేషేంద్ర భావుకతకు నిదర్శనం. శరదృతువును వర్ణిస్తూ మబ్బులు ఆకాశపు నీలిరేవులో, వెన్నెల అనే నీటిలో పిండి ఆరేసిన వలువల్లా వున్నాయంటాడు. 'నేటి రేయి నన్ను కాటువేసె', 'చిక్కని చిగురాగు జేబులో పవళించి ఎండ వేణువు కంఠమెత్తిపాడె' మొదలైన సందర్భాల్లో ఉత్ప్రేక్షలను ప్రయోగించి వ్యంగ్యాన్ని సాధించాడీ కవి.

విసంధుల్ని ప్రయోగించటంలో, వృత్తాల్ని వ్యావహారిక భాషలో రాయటంలో, కొన్నిచోట్ల గణ యతి ప్రాసల విషయంలో స్వాతంత్ర్యాన్ని ప్రదర్శించాడు. కొన్ని సందర్భాల్లో అలతి అలతి పదాలతో పద్యాన్ని ప్రారంభించి మూడవ, నాల్గవ పాదాల్లో సుదీర్ఘ సమాసాల్ని బిగించి తేలికయిన పదాలతో పద్యాన్ని ముగిస్తాడు. చివరి పాదంలో మాత్రమే దీర్ఘ సమాసాన్ని నిక్షేపించటం కొన్నిచోట్ల కనిపిస్తుంది.

'లోలంబంబు ధ్వనించె నాకసము గండూషించె బీరెండలన్
వాలాయంబుగ దాల కోమల దళవ్యాలోల డోలావళీ
కేళీ మంజుల లీలలందలసి కున్కెం గ్రీష్మ వాతూలముల్
చేలుం తోటలు దాటియేగి వన వంశీ కుంజ పుంజంబులన్'

కేవలం శబ్ద విన్యాసంతో పద్యానికొక గంభీరమైన నడకను సమకూర్చగల నేర్పరి ఈ కవి. పై పద్యంలో 'గండూషించె' అనే శబ్దం మహాశక్తివంతమై పద్యానికి 'తేజస్సును కలిగిస్తుంది. రెండో పాదంలోని 'వాలాయంబు' 'డోలావళీ' అనే పదాలు డోలికా స్ఫూర్తిని కలిగిస్తున్నాయి. 'దుర్నిరీక్ష్య ప్రభాధూర్త రచ్చటలతో, క్షేత్ర జీవమలను శిక్షించినాడు, ఘనఘనా ఘనగజ గ్రైవేయ ఘంటికా, టంకారములకు ఘంటాపథంబు' మొదలైన పద్యాలను గమనిస్తే సీస పద్యంలోని మొదటి అర్ధభాగాన్ని ఒకే సమాసంగా కూర్చటంలో శేషేంద్ర ప్రతిభ తెలుస్తుంది. శబ్ద సంయోజనంలో, సమాస కల్పనలో, పద్యపు నడకలో అపర శ్రీనాథునిలా కన్పిస్తాడు శేషేంద్ర. రమ్యమైన భావాలు, భావావిష్కరణ కనువైన భాష, సున్నితమైన కూర్పు, నాదసౌందర్యం ఈ కావ్యమంతటా నిండి వున్నాయి. ప్రసన్న మాధుర్యాది గుణాలు ఈ కావ్యానికి అదనపు ఆకర్షణను చేకూర్చాయి. కీటక యోగి, హిమబిందు సుందరి, వల్లిక తపసి, హిమదంష్ట్ర, శైత్య భల్లూకం, నగ్నవల్లిక, కోమల జ్వాల, అలరుగిన్నెలు మొదలైన ప్రయోగాలు నూతన ఉపమానాల నెన్నుకోవటంలో ఈ కవి నైపుణ్యానికి నిదర్శనాలు.

'భావ ప్రౌఢములై సమాస ఘటనా ప్రాగల్భ్య సందత్త గం
గావేణీ ఘుమ ఘుంఘుమాయిత తరంగ స్నిగ్ధ గంభీర ధా
రావేల్లత్ పటు సంస్కృతాంధ్ర సువహో రమ్యంబులై హృద్యతా
శ్రీ వాసించు గదయ్య నీదు కవితల్ శేషేంద్ర శర్మాహ్వయా'

## 16.4 శేషజ్యోత్స్న :

1972లో ప్రచురింపబడిన ఈ కవితా సంపుటిలో శేషేంద్ర వచన కవితా ప్రస్థానం ప్రారంభమైంది. కాని దీనిలో గేయకవిత్వ ఛాయలు లేకపోలేదు. దీనిలో ప్రేయసితో వియోగ సంయోగానుభూతులు, అచంచలమైన దివ్య ప్రేమానుభవం, ప్రణయం వర్ణింపబడ్డాయి. అనంతమైన భావుకత, ఆశ, నిరాశలు, తాత్త్వికత, మానవతా వాదం, గతవైభవ స్మృతులు, నూతన ప్రపంచ నిర్మాణం కోసం ఉత్సుకత అన్నీ చోటుచేసికొన్నాయి.

ఈ సంపుటిలో భావకవిత్వ ఛాయలు ఎక్కువగా వున్నప్పటికి నూతన పదబంధ నిర్మాణంలో, ఉపమాన రూపకావ్యాలంకార ప్రయోగంలో, ప్రతీకలను భావ చిత్రాల్ని ప్రయోగించటంలో శేషేంద్ర విశిష్టతను చూపాడు. ఆయన తర్వాత రాసిన కావ్యాలలో కన్పించే కొత్త అభివ్యక్తి విధానానికి బీజాలు ఈ కావ్యంలో కన్పిస్తాయి.

ఇది శేషేంద్ర మొదటి వచన కవితా సంపుటి కనుక దీనిలో నా పరిపక్వ జన్మాంతర కెరటాలగమి, కాలకుహర శయ్యాసుషుప్తిగరిమ, జ్వలతజ్వాలాగుళుచ్ఛము, వెరసంజకెంజాయల మంజాల కిజంల్కవల్కలాలు, శబలమనఃశకలిక, శబలవర్ణసంచాలిత శఫరిలాంటి దీర్ఘ సమాసాలు గ్రాంథిక వాసనలు కన్పిస్తాయి.

వర్ణనల్లో అపూర్వమైన భావుకత, సౌందర్యదిదృక్ష, కాల్పనిక ధోరణి గోచరిస్తాయి. ఉషస్సు, గాలులు, వసంతం, స్వప్నం, కిరణాలు మొదలైన ప్రతీకల ద్వారా అమూర్తభావనల్ని సుందర రూపాలుగా సృష్టించాడు. నిరీక్షామధువు, పూలపీటలు, పరిమళాల తుఫాను, చరిత్ర పెదవులు, తిమిర కన్యలు, తరుణాల స్వరాలు, మబ్బుల మందులు, సుఖదుఃఖాల మఖ్మల్ దుస్తులు, నిశ్శబ్దపు సాలీడు, కిశోరమారుత వీచికలు, తిమిరహస్తాలు, శతాబ్దాల కలశాలు మొదలైన సమాసాల్లో ప్రయోగించిన నూతన ఉపమానాలు కవి అనుభూతి గాఢతను తెలుపుతాయి.

## 16.5 మండే సూర్యుడు :

1974లో వెలువడిన 'మండే సూర్యుడు' కవితా సంపుటితో శేషేంద్ర సాహిత్య ప్రస్థానం ప్రధానమైన మ... తిరిగింది. వర్గ చైతన్యం, కళాత్మక అభివ్యక్తి ప్రతిబింబించిన ఈ కావ్యానికి 'మండే సూర్యుడ'నే పేరు సార్థకమైంది.

'మండే సూర్యుడు' లోని చివరి కవిత 'మండే గీత' - 'నీవొక కర్ర ముక్కవే కావచ్చు, కానీ అనాది సృష్టిలో తలయెత్తిన, మానవ మహా 'కృషికి ఏకైక చిహ్నానివి' అంటూ నాగలియొక్క గొప్పతనాన్ని చెబుతూ 'శ్రమ జీవుల లోకానికి ఒక నూతన సూర్యుడ్ని వాగ్దానం చేశావు' అని ముగుస్తుంది. ఈ సంపుటి ఆద్యంతాలలో శ్రమ శక్తికి సంకేతమైన సూర్యుని ప్రస్తావించటం, శ్రామికునిలో సూర్యుని దర్శించటం, కర్షకుడిని కేంద్రంగా తీసుకొని తరువాత వ్రాయబడిన 'నా దేశం నా ప్రజలు' ఆధునిక ఇతిహాసానికి నాంది పలికినట్లయింది. కలలు ఎదురులేని ప్రజాశక్తి ఇతిహాసం పాడుతూ, సూర్యమండలాన్ని కడుపుతో ఉన్న సుందర దిశవైపుకు పోతున్నాయ్' అని ఆధునిక ఇతిహాసానికి ప్రస్తావన జరిగింది.

ఈ సంపుటిలోని ప్రారంభ వాక్యాలలో సూర్యుడిని శ్రమశక్తికి ఉపమానంగా, నా దేశం నా ప్రజలు ప్రారంభ వాక్యాలలో కాలమవే శ్రామికుని హస్తంగా వర్ణించాడు. శ్రామికునిలో సూర్యుని దర్శించటంలో లోతయిన భౌతిక, తాత్త్విక ప్రపంచావిష్కరణముంది.

'నీ స్పర్శ మట్టిలో నిద్రిస్తున్న, కలల పరిమళాల్ని మేల్కొల్పి
దిశల్లో విదిలించింది / నీ బలానికి అడవులు కొండలు
నదులు పాదలు తలలు వంచాయి
నీ వీర్యానికి లొంగిపోయి భూమి
ఆనందోద్రేకంతో వళ్ళూ ఇళ్ళూ
పద్యాల దోసిళ్ళలో దానం చేసింది'

మానవ మహాకృషికి ఏకైక చిహ్నంగా నాగలి భావింపబడింది. ఈ దేశానికి నాగలి ప్రతీక. నా దేశపు ఆకృతి, నాగలి ఆకృతి ఒకదాన్ని ఒకటిపోలి ఉంటుంది. దాని జీవన కథా నాయకుడు కర్షకుడే. అతడే ఈ దేశపు జీవన దాన ప్రభువు' అన్నాడు శేషేంద్ర. 'మండే గీత' కవితలో నాగలిని సంబోధిస్తూ 'శ్రమ జీవుల లోకానికి ఒక నూతన సూర్యుణ్ణి వాగ్దానం చేశావు' అనే వాక్యంతో ముగుస్తుంది సంపుటి. ఆద్యంతాల్లోనే కాక ఈ సంపుటిలోని ప్రతి కవితలో వివిధ కోణాల్లో సూర్య సంబంధ భావ చిత్రాలు పెదజల్లబడ్డాయి.

- వర్షం వెయ్యి చేతులతో నా తలుపు కొడుతోంది
- రైతు నాగలి మోస్తున్నాడు, క్రీస్తు శిలువ మోసినట్లు
- పరిమళాలు కూడా గాలి ఊచలు పట్టుకుని ప్రయాణం చేస్తాయి
- భూమిలో ఉన్న చిన్నారి మెడ బయట పెట్టి మొదట వచ్చిన రెండాకుల్ని చేతులుగా జోడించింది కృతజ్ఞతతో.

మొదలైన అద్భుత భావచిత్రాలు కవి పరిశీలనా శక్తిని, అభివ్యక్తిలోని హాస్య లిపిని సూచిస్తాయి. ఆక్రోశిస్తున్న అడవులు, చెంచాల వంచువులు, గుండ్రని పాట, మాటల దేశాలు, ముత్యాల కిరీటాలు, పద్యాల ముఖాలు, ప్రశ్నల సైన్యాలు, మబ్బుల తాగుబోతులు, తారల గాలివానలు, వదరుబోతు పువ్వులు, స్కూళ్లలో బంధింపబడిన ఆకాశం, గాలి రైళ్ళు, మేఘాల బిడారులు, సోమరి గాలి, ఎండల జండాలు, ఎండల తలపాగాలు మొదలైన ప్రయోగాలు పరిశీలిస్తే ఉపమానాల్ని, రూపకాల్ని ఎన్నుకోవటంలో ఆధునిక తెలుగు కవిత్వంలో ఇంతటి వైవిధ్యాన్ని ప్రదర్శించిన వారు చాలా అరుదు.

## 16.6 నా దేశం నా ప్రజలు :

'నా దేశం నా ప్రజలు' కావ్యాన్ని ఆధునిక ఇతిహాసమని' పేర్కొన్నాడు శేషేంద్ర. ఆధునిక ఇతిహాసమనటంలో ఆయన సమన్వయ దృష్టి స్పష్టమవుతున్నది.

సామ్యవాద సిద్ధాంతపు వెలుగులో అతీత వర్తమానాలను అనుశీలించి అధోజగత్సహోదరుల కష్టనిష్ఠురాలు తొలగిపోవటానికి సమ సమాజ నిర్మాణం కోసం చేస్తున్న చెయ్యవలసిన ప్రస్థానాన్ని ప్రపంచిస్తున్నది నా దేశం నా ప్రజలు.

సర్వ విధాల శ్రమలకు ప్రతినిధిగా నిలిచిన కర్షకుని ఈ ఇతిహాసానికి నాయకుడిగా స్వీకరించాడు.

సూర్యుడు కాలమనే శ్రామికుని హస్తంతో పొల్చబడుతూ ప్రారంభమైన ఒకటో సర్గ 'సూర్యుడు కిరణాల బండ్లు తోలుకొని వస్తున్నాడు' అని సూర్యుడు యుద్ధ సన్నద్ధుడైన కర్షకునిగా వర్ణించటంతో ముగుస్తుంది. 'ఇది సంవత్సరం కన్న మొదటి కల, ఈ కలలో నేను నా దేశపు శరీరం మీద నడుస్తున్నా ప్రభాత పూర్వ స్వప్నంలా' - వేకువజామున కలిగిన స్వప్నం నిజమవుతుందన్న విశ్వాసాన్ని స్ఫురింపజేశాడు.

రెండో సర్గలో గత చరిత్ర సంస్కృతులను స్పృశిస్తూ, ఎక్కడ గ్రామాలు రంగులలో కలలలో పరస్పరం మాట్లాడుకుంటాయో ఆ మరో ప్రపంచాన్ని గూర్చిన వర్ణన చేశాడు. మూడో సర్గలో 'విషపాత్రిక' లాంటి నగర జీవనం నుండి బయటపడాలనే కాంక్ష, తాత్విక జిజ్ఞాస, చరిత్ర తత్వం వ్యక్తం చేయబడ్డాయి. నాలుగో సర్గలో కవి తాను కవిత్వం కోసం చేసిన 'చిరదీక్షా శిక్షా తపస్సమీక్షణ' వల్ల ఆవేదనల్ని అనుభూతులను అర్థం చేసుకోవటం, విప్లవానికి అంకురార్పణ జరగటం, పురుషునికి ప్రేరకశక్తిగా సహచరిగా స్త్రీ ఔన్నత్యం వ్యంజింపబడ్డాయి.

ఐదో సర్గలో ఈ దేశపు దుర్భర పరిస్థితి చిత్రించారు. 'ఇక్కడ జీవితానికి గర్భస్రావమైన కలలు, అసహ్య రూపాలతో అసమగ్ర అవయవాలతో బయట పడుతున్నాయి.... నా దేశపు రాత్రులు గుండెకు తగిలి రగులుతున్న గొడవలు 'నా దేశపు దినాలు రాళ్ళకు తగిలి పగులుతున్న పడవలు' అనే ఆవేదనతో రాళ్ళ కన్నీళ్ళు వ్యాపించిన ఈ భూముల మీద ఇనుప కండరాలు దేహం మీద సుళ్ళు తిరుగుతున్న మనిషి' గా శ్రామికుడు రూపొందాలని ఆవేశంతో ఆక్రోశించాడు. ఆరో సర్గలో సోదర కవులను 'చేతన తొణికిసలాడే గొంతులతో పద్యాల బందూకులు సంధించి యుద్ధ సన్నద్ధులు కావాలని ప్రబోధించాడు. 'నా దేశంలో నాయకత్వం నాదే దాన్ని రాజకీయాల బారికి అప్పగించను'

అని వైజ్ఞానిక నాయకత్వ ఆవశ్యకతను చెప్పాడు. బానిసతనానికి అలవాటు పడుతున్న ప్రజానీకానికి 'స్వేచ్ఛ మనిషికి మొదటి శ్వాస, అది నీ రక్తపు సజీవ భాష, భూమినించి నీ చివరి అడుగుతీసే వరకు నిలుపుకోవలసిన ఒకే ఒక్క ధ్యాస' అని హెచ్చరించి తిరుగుబాటుకు పురికొల్పాడు. 'చెట్టు గనుక పర్వతాగ్రాలెక్కి కేకవేస్తే చెట్లు గుంపులు గుంపులుగా వస్తాయి.... తిరస్కార సూచకంగా తలుపులు, దూలాలు, ద్వార బంధాలు, కుర్చీలు, బల్లలు అన్నీ చెట్లుగా మారి బయటికి వస్తాయి. అరణ్యాల్లోకి పోతాయి' అని ప్రకృతి కూడా తిరుగుబాటు చేస్తుందని శ్రామికుడు తిరగబడవలసిన అవసరాన్ని ప్రతీకాత్మకంగా చెప్పాడు.

ఏడో సర్గలో 'రిక్తి నాగరితకల ఆర్భాటం' వివరింపబడింది. ఎనిమిదో సర్గలో 'పొలాలలో ఇంద్ర ధనస్సు వంగింది, రా పోదాం కొడవళ్ళు దాల్చిన చేతులు ఎగరేస్తూ,' అనటంలో విప్లవ విజయం సూచింపబడింది. ప్రకృతి విజయం మానవతా శక్తి విజయంగా ప్రేమ విజయంగా విశదీకరింపబడింది.

## 16.7 నీరై పారిపోయింది :

వ్యక్తి తాను తన జీవితంలో స్వయంకృషితో ఆర్జించిన విజ్ఞానం జాగృత్ చైతన్యాత్మకమైంది. వివిధ యుగాలలో, వివిధ ప్రాంతాల్లో నిమ్నోన్నత మార్గాలలో మానవాత్మ చేసిన ప్రస్థావన ఫలితాలు స్మృతులుగా, వాసనలుగా సంక్రమిస్తాయి. అవి సుప్తచైతన్యాత్మకమైనవి. ఆ స్మృతుల్ని, వాసనల్ని అంతర్ముఖుడై కవితా మార్గంలో వెలికి తేవటానికి కవి చేసిన ప్రయత్నమే 'నీరై పారిపోయింది' (1976) కావ్యం.

ఈ కావ్యంలోని భావాలు అంతశ్చేతనాప్రేరితాలైన సందేశాలని, వాటిని గ్రహణయోగ్యంగా వ్యవస్థీకరించటమే తాను జాగృచ్చేతనలో చేసిన పని అవి, ఆప్రేరణలు అనిర్వచనీయ సంకేత రూపాలలో వున్నాయని పీఠికలో కవి చెప్పిన మాటల్ని బట్టి 'కలలో ఒక సర్రియలిస్టు ఋషి దర్శనమిచ్చి దీవించాడు. తెల్లవారేసరికి నా పిచ్చివాగుడికి కవిత్వమనే పేరు వచ్చింది' అనే కావ్యాంత వాక్యాలనుబట్టి ఈ కావ్యంపై అధివాస్తవిక, చైతన్య స్రవంతి ధోరణుల ప్రభావమున్నట్లు తెలుస్తుంది. వివిధ ఖండికల్లోని అన్వయ రాహిత్యం, అర్థనిగూఢత కూడ ఇందుకు తార్కాణమే.

కవి చెప్పినట్లు ఈ కావ్యం 'పిచ్చివాగుడు' మాత్రం కాదు. కావ్యమంతటా వ్యక్తి ఆంతరిక జగత్తులో జరిగే అనిర్వచనీయ సంఘర్షణలు, కల్లోలాలున్నాయి, తాత్త్వికత, మార్మికత, ఊహలు, స్వప్నాలున్నాయి. ప్రకృతిలోని ప్రతి వస్తువు మానవీకరింపబడి ప్రతీకలు, భావ చిత్రాలుగా రూపొంది ఈ కావ్యంలోని ప్రతి వాక్యం వేయి పూలయి కవితా సౌరభాలు వెదజల్లుతున్నాయి. 'నా పేజీమీద ఒక సముద్రం పెడతా దానిమీద ఒక పడవ పెడతా దానిమీద ఒక తుఫాను ఊదుతా అది పద్యమై ఏ తీరాలకు కొట్టుకుపోతుందో చూస్తా...' దీనిలోని పేజీ కవి మనో భూమికకు, సముద్రం కల్లోలిత హృదయానికి, పడవ చెప్పదలచుకున్న భావానికి ఏర్పరచిన మాధ్యమానికి, తుఫాను కవి మహోద్రేకంతో చెప్పే కవితా వస్తువుకు ప్రతీకగా భావింపవచ్చు.

## 16.8 గొర్రిల్లా :

శేషేంద్ర కవితా వృక్షం అందించిన పరిపక్వ విప్లవ కవితా ఫలమే గొర్రిల్లా. గొర్రిల్లాలో విప్లవ కవిగా శేషేంద్ర విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. ప్రస్తుత వ్యవస్థ పట్ల క్రోధోన్మత్త స్వరంతో నిశ్చైతన్య నిద్రలోనున్న ప్రజలను జాగృతమొనరిస్తూ, బూర్జువా వ్యవస్థపై ద్వేషాన్ని ప్రేరేపిస్తూ దాన్ని నాశనం చేయటానికి ప్రతి వ్యక్తి తనలో దాగివున్న గొర్రిల్లా లాంటి శక్తిని అవగాహన చేసుకొని రౌద్రమూర్తి అయి తిరగబడాలన్నాడు ఈ కావ్యంలో.

గొర్రిల్లాను స్వచ్ఛమైన హింసకు, అన్యాయం మీద అక్రమం మీద తిరుగుబాటు చేసే క్రోధానికి, దేహశక్తికి ప్రతీకగా స్వీకరించాడు గొర్రిల్లా ఆత్మ రక్షణకోసం, తన హక్కును కాపాడుకోవటం కోసం చేసే ప్రతిక్రియా పవిత్ర హింసే అవుతుంది. ఈ విధమైన గొర్రిల్లా శక్తితో పీడితుడు విజృంభించి కర్మవీరుడుగా నిలబడాలనేది గొర్రిల్లా కావ్యసారాంశం. ద్వంద్వ ప్రవృత్తితో కూడిన చట్టం, న్యాయం, ధర్మ సూత్రాల లాంటి వేమీలేని ఆదిమ సమాజంలోని మానవునిలా అక్రమానికి వ్యతిరేకంగా పోరాటానికి పూనుకోవాలని ప్రబోధించాడీ కావ్యంలో.

నియంతృత్వ శక్తులు వీరవిహారం చేసిన అత్యవసర పరిస్థితి (1975-77) ప్రభావం ఈ కావ్యం మీద కొంత ఉన్నట్లు కనిపిస్తుంది. కవియొక్క రచనాత్మకత తత్కాలీన రాజకీయ లగ్నత పరిధుల్ని దాటి మనిషికి విరుద్ధంగా కాలం చేస్తున్న కుట్రలమీద దుర్మార్గుల మీద మనిషి తిరుగుబాటుగా ఈ కావ్యం రూపుదాల్చింది.

"జీవితం దుఃఖాన్ని రాసులు రాసులుగా పోసుకుని అమ్ముతోంది మన దేశపు బజారుల్లో కానీ భూమిని ఫలాలుగా పంటలుగా మార్చే ప్రవీణత ఉన్నవాడు ధైర్యం కోల్పోనక్కరలేదు. దేవతలొస్తుంటారు దేవతలు పోతుంటారు ఆకాశంలో, మనకందే దేవత మాత్రం మన చేతుల్లో నాగలి, మన కండరాల్లో నిద్రించే గొర్రిల్లా".

మధ్య దళారుల చేతుల్లో చిక్కిన కర్షకులకు దక్కేవి దుఃఖాలే. కర్షకుడు / శ్రామికుడు/ధైర్యం కోల్పోకుండా వుండాలంటే ఉత్పత్తి ప్రావీణ్యతతోపాటు పోరాటతత్వాన్నీ పెంచుకోవాలి. 'రైతులారా, రాజకీయ వర్షం పడుతోంది. మోసపోయి మీ విత్తనాలు చల్లకండి' అని ఎన్నికల రాజకీయాల్లో భాగంగా నాయకులు సోషలిజాన్ని గూర్చి చెప్పే వుపన్యాసాలను, వాగ్దానాల్ని విని మోసపోవద్దంటున్నాడు.

"ఈ బ్రతుకు నీకివ్వబడింది ఎలా చావాలో తెలుసుకోడానికి కాదు, ఎలా బ్రతకాలో తేల్చుకోడానికి - దుఃఖాల బారి నుంచి తప్పించుకోవడం సులువే కాని సుఖాల బారినుంచి తప్పించుకోవడం అంత సులువుకాదు. ఇంత భయంకర గ్రీష్మాన్ని ఒక విసనకర్రతో విసిరిపారేద్దామనుకున్నావేమో? (గొ.పు. 32).

పాలకుల కుతంత్రాలకు బెదిరిపోయి నిరాశలో మగ్గిపోకూడదు. పోరాటాన్ని విచ్ఛిన్నం చేయటంకోసం పాలకులు ఎరగా కన్పించే స్వల్ప సుఖాలపై వ్యామోహంతో శత్రువుకు లొంగిపోయి కర్తవ్యాన్ని విస్మరించకూడదు. పెట్టుబడిదారి రాజనీతి భయంకర గ్రీష్మం లాంటిది. దానిని చిన్ని విసనకర్రలాంటి క్రమ పరిణామంతో స్వల్ప ప్రతిఘటనతో సాధ్యమయ్యేది కాదు. అందుకని గుణాత్మకమైన పరిణామాన్ని ప్రజలు తీవ్రమైన కోరికతో కార్యాచరణ ద్వారా సాధించాలి. ఈ వ్యవస్థను కూలదోసే ఉద్యమం 'ఎన్ని మైళ్ళు అని కాదు. ఎన్ని శవాలు ముందుకు పోయిందో కొలుచుకో' మన్నాడు. 'సమానత్వం ఒక పౌరాణిక స్వప్నం'గా మారిన పరిస్థితిలో ఆ స్వప్నం నిజం చేసుకోవాలంటే ప్రజలను చైతన్యవంతులను చేయాలి. 'నా దేశపు గతిచూస్తే నా బలిష్ఠ హస్తాల్ని అందిమ్మని అడుగుతున్న దిక్కులేని పక్షులు మిలియన్లు ప్రత్యక్షమౌతాయి' అన్నాడు. 'నా తలుపు కొడుతుంది నా దేశపు భవిష్యత్తు' మొదలైన వాక్యాలలో గల అస్మదర్థక పదాలు కవులు, రచయితలందరికీ వర్తిస్తాయని గ్రహిస్తే కవే ప్రజల సాంస్కృతిక నాయకుడన్న శేషేంద్ర భావం స్పష్టమవుతుంది. 'ప్రపంచ భూముల్ని తొక్కుతూ తిరుగాడే దేశద్రిమ్మరి విప్లవం మన వీధిక్కూడా వస్తుంద'ని ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు.

కిశోర జనాలు, కిరణాల గింజలు, మానవ నాగరికతా గంగోత్రి, స్వప్నాల సమాధి, రక్త ప్రవాహాల మహోత్సవాలు, ఒళ్ళు విరుస్తున్న జ్వాలల నోళ్ళు, మస్తిష్కశిఖరాలు మొదలైన పదబంధాలు అలంకారాల పరిధులను దాటి పదార్థాల సరిహద్దులను చెరిపి కవితా వైచిత్రిని ప్రదర్శిస్తున్నాయి.

## 16.9 సముద్రం నా పేరు :

సముద్రం నా పేరు, గడియారంలో కాలం, అడవుల్లో ఆర్కెస్ట్రా, చైత్ర స్వరాలు అనే నాలుగు దీర్ఘ కవితల సంకలనమే 'సముద్రం నా పేరు'. 1978 మేలో ప్రచురించబడిన ఈ కావ్యంలో అనుభూతి కవిత్వ ఛాయలు ఎక్కువగా వున్నాయి.

మనిషినీ, సముద్రాన్నీ సంపూర్ణంగా అర్థం చేసుకోవడం దుస్సాధ్యం, నేటి మానవునిలో ఆది నుండి మనిషి సాధిస్తూ వచ్చిన ప్రగతి, వివిధ యుగాలలో అక్రమాలపై చూపిన ప్రతిఘటనా ప్రవృత్తి, సాహసం నిక్షిప్తమైవున్నాయి.

"ఈ వేళ సముద్రం విరిగిపడుతున్న భారీ కెరటాలూ, తెల్లటి నిరాశలాంటి నురుగుల సమూహాలు, తీరాలమీద పడి గొంతు కోల్పోయిన శంఖాలూ, భిన్నాభిన్నమైన నత్తగుల్లలూ, శాశ్వతంగా నోళ్ళు పోగొట్టుకున్న భగ్న నౌకలూ.... భగ్న నౌకల్లా తయారైన జీవితాల్లో నిరాశను తొలగించాలి అని అన్నారు.

'ఆకాశం అంతా ఉంది / మోహం నిండా పలుముకున్న పుట్టెడు నీలిమతో
గుప్పెడు చిలిపి మబ్బులతో / నెలవంకతో నక్షత్రాల జనాభాతో
అది ఒక సౌందర్య మహా సముద్రం
నా కన్నులు స్పృశించలేని అంచులుగల చంచల ద్రవం
నా కిటికీకి చిక్కిన ఆకాశపు ముక్క ఒక్కటే
నా ఇంద్రియాల గుమ్మం తొక్కిన అతిథి
నా అంతర్లోకాల్లో కోట్లాది కోర్కెలు
క్రిక్కిరిసిన ఆకాశాలు దొర్లుతున్నాయి.
కానీ నా ఆస్వాదజాలంలో ఇరుక్కున్నదే
నా ఆత్మ బంధాల్లో లీనమయింది"

ఇలాంటి రమ్యమైన ప్రకృతి సంబంధ భావచిత్రాలలో అవ్యక్తానుభూతి, అంతర్ముఖీనత ప్రకటింపబడ్డాయి. 'నా గొంతు విరిసీ విరియని మొగ్గల్లో చల్లాను. ఇవి ఫలాలుగా మారేవరకు నా జీవితమొక నిరీక్ష - కాలమేఘాల్లో నుంచి బయటపడే నాలుగు కిరణాలే నా వాక్యాలు' ఇలాంటి వాక్యాల్లో 'నేను' 'నా' వంటి పదాలు కవులందరికి ప్రాతినిధ్యం వహిస్తుంటాయి. ఈ కావ్యంలో కొన్ని సందర్భాల్లో కవికి కూడా సముద్రాన్ని ప్రతీకగా వాడినట్లు కనిపిస్తుంది.

## 16.10 ప్రేమ లేఖలు :

ప్రేమలేఖలు కావ్యం 1980 లో ఓంప్రకాశ్ నిర్మల్‌గారి హిందీ అనువాదం జోడించి ప్రచురింపబడింది. ఈ కవి తన ప్రేయసి (పత్ని), ఆంగ్ల కవయిత్రి ఇందిరాదేవి ధనరాజ్ గిర్‌గార్కి, 1968-71 జూన్ మధ్య కాలంలో రాసిన ఉత్తరాలలోని కవితాత్మకమైన భాగాల్ని ఏర్చి కూర్చిన గ్రంథమే 'ప్రేమలేఖలు' జీవన పత్రాలు, ప్రేమ పత్రాలు అని రెండు భాగాలుగా విభజింపబడిన ఈ కృతిని 'చంపూ ప్రబంధం' అన్నాడు కవి. శృంగార రసాత్మమై, వర్ణనా ప్రాధాన్యం కలిగిన కావ్యమనే అర్థంలోనే ప్రబంధమన్నాడనుకోవాలి. కవితాత్మకమైన వచనం కూడ పద్యమేనన్న కవి ఈ కావ్యాన్ని 'చంపువు' అనటంలోని అంతరార్థం బోధపడదు. ఈ లేఖల్లో అక్కడక్కడ మాత్రా ఛందస్సులో రాయబడిన లయాత్మక వాక్య సమూహాలు కూడ చేరటం వల్ల 'చంపూ ప్రబంధం' అన్నాడేమో.

సాధారణంగా ప్రసిద్ధుల లేఖలు వారి మరణానంతరం ఒక సంకలనంగా ప్రచురింపబడుతుంటాయి. అందులోనూ ప్రేమలేఖలు లేఖకుల జీవితకాలంలోనే ప్రచురింపబడటం అరుదయిన విషయం. తెలుగు సాహిత్యంలో చలం, శేషేంద్రలు మాత్రం దీనికి అపవాదంగా కన్పిస్తున్నారు.

దేశభాషాకాలాది సరిహద్దులు దాటగలిగిన ఆత్మకళను అభ్యసించి సాగించిన అక్షర యాత్రా ఫలితమే శేషేంద్ర కవిత్వం. ఆ యాత్రలో ఒక మజిలీ 'ప్రేమలేఖలు' జీవన పత్రాలులో తనను సంబోధించుకుంటూ కొన్ని చోట్ల స్పష్టంగా తానే చెబుతున్నట్లు కొన్ని చోట్ల కవిత్వం రాశాడు. ప్రేమ పత్రాలలో తన ప్రేమ ఉదాత్తతను ప్రేయసి రూప లావణ్యాదులకు అనిర్వచనీయ సౌందర్యానికి ఆమె వియోగంలో తన ఆవేదనకు కవిత్వ రూపమిచ్చాడు.

చూపుల రామచిలకలను, ప్రేమగాథల లైబ్రరీలు ఒదిగి పట్టుకున్న ఆమె కన్నుల్ని, పూల దండల్లాంటి చేతుల్ని చీరా తారా కలిపి నేసిన అందాల తుపానులాంటి ఆమె రూపాన్ని వర్ణించినా, ఈ కావ్యంలో ప్రేమ దైహిక శృంగారంగా పర్యవసించలేదు.

"ఏ ప్రేమ మానవతకు రూపాంతరమో, చిత్తశుద్ధికీ, నీతికీ ధైర్యానికి మారుపేరో, ఏ ప్రేమ ఇద్దరు పరస్పర అజ్ఞాత వ్యక్తుల్ని విలీనం చేసి సృష్టి అనంతతను ఆవిష్కరిస్తుందో, ఏ ప్రేమ సర్వమానవ జాతినీ ఒక్క చరిత్ర మూసలో వేసి మానవతా హిరణ్యంగా మలచి వేస్తుందో, ఏ ప్రేమచేత మనిషి తోటి మనిషి బాధ చూచి ద్రవిస్తాడో, ఏ ప్రేమచేత మనిషి అన్యాయం మీద దౌర్జన్యం మీద తన ఇనుప పిడికిలి ఝుళిపిస్తాడో......'

అటువంటి ప్రేమను జీవితం నుండి కాని, కవిత్వం నుండి కాని, బహిష్కరించకూడదని, మానవత ప్రేమ ఫలితమేననీ అంటాడు.

## 16.11 ఆధునిక మహాభారతము :

ఆధునిక మహా భారతము (1986) లో పది పర్వాలున్నాయి.

ప్రజాపర్వం (నా దేశం నా ప్రజలు) సూర్యపర్వం (మండే సూర్యుడు), పశుపర్వం (గొరిల్లా), ప్రవాహ పర్వం (నీరై పారిపోయింది), ప్రేమ పర్వం (ప్రేమలేఖలు), సముద్ర పర్వం, (సముద్రం నా పేరు) - ఈ విధంగా పూర్వకృతులను నామాంతరీకరించి దీనిలో చేర్చడం జరిగింది. 1983లో 'ఆంధ్రజ్యోతి' వారపత్రికలో 'శేషేంద్రజాలం' పేరుతో ధారావాహికంగా వెలువడిన క్లుప్త కవితలు ఆదిమపర్వం పేరుతో దీనిలో చేర్చబడ్డాయి. పై కావ్యాలన్నిటి నుంచి కొన్ని చమత్కారమైన కవిత్వ భాగాల్ని ఎన్నికచేసి (వీటినే కవి చమత్కారికలన్నాడు) / మౌక్తిక పర్వం పేరుతో ఈ మహాభారతములో ప్రచురించబడ్డాయి. 'శేషజ్యోత్స్న' (1972)లో ప్రచురింపబడిన 'నేనూ - నా నెమిలి' అనే కవితా సముదాయం దీనిలో మయూరపర్వంగా మారింది.

తాను (కవి) మరణించిన తర్వాత '21వ శతాబ్ది సాయంకాలం' కొందరు ప్రాచ్య, పాశ్చాత్య కవులు, కళాకారులతో జరిపిన సాహిత్య చర్చలకు అక్షరరూపమే 'నేనూ-నా నెమిలీ' అనే రచన. దీనిలో వాలీటి, భవభూతి, ఆల్బర్ట్ కెమ్యూ, కాఫ్కా, బొదెలేర్, రెంబో, పికాసో, ఇలియట్, శ్రీశ్రీ మొదలైనవారు దర్శనమిస్తారు.

పూర్వకావ్యాలన్నీ వివిధాంగాలుగా అమరగా ఏర్పడిన శేషేంద్ర ఏకైక మహాకావ్యం ఆధునిక మహాభారతము.

## 16.12 జనవంశమ్ :

ఆధునిక మహాభారతానికి అనుబంధ కావ్యంగా పేర్కొనబడిన 'జనవంశమ్' (1993-321 పేజీలు)లో ఋతుకాండ, భ్రమకాండ, ప్రజాకాండ, చంపూకాండ, యుద్ధకాండ, చమత్కారకాండ అనే ఆరు కాండాలున్నాయి. ఋతు ఘోష ఋతుకాండగా, చంపూ వినోదిని చంపూకాండగా దీనిలో పునర్ముద్రణ పొందాయి భ్రమర, ప్రజా, యుద్ధకాండలలో 1980 తర్వాత రాసిన కవితలతోపాటు 'పక్షులు' కవితా సంపుటిలోని ఖండికలు కూడ అక్కడక్కడ చేర్చి తిరిగి ప్రచురింపబడ్డాయి. శ్రీ ద్వారం వెంకటస్వామినాయుడు, శ్రీ వేదం వేంకటరాయశాస్త్రి శ్రీ, విశ్వనాథ సత్యనారాయణ, శ్రీ అనుముల కృష్ణమూర్తి, శ్రీ ముల్లంపల్లి శరభేశ్వరశర్మ మొదలైన వారి ప్రశస్తిని గూర్చి రాసిన పద్యాలు, సారాబు కావ్యాన్ని తన తండ్రిగారికి సమర్పిస్తూ రాసిన అంకిత పద్యాలు కూడ చంపూ కాండలో వున్నాయి. ఆధునిక మహా భారతాంతర్గత మౌక్తిక పర్వంలోని కొన్ని భాగాలు, ఇతర కావ్యాల్లోని కొన్ని కవితావాక్య సముదాయాలు చమత్కారికా కాండలో కన్పిస్తాయి. తొమ్మిదవ దశాబ్దంలో రాసిన కొన్ని అద్భుతమైన కవితలు ఇందులో వున్నాయి. ఈ తరం పాఠకులకు శేషేంద్ర పద్య రచనలు పరిచయం కావటానికి ఈ కావ్యం బాగా వుపకరిస్తుంది.

ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు చెప్పినట్లు 'విశ్వనాథ, శ్రీశ్రీలలా సమకాలీన తెలుగు సాహిత్యంలో నిస్సంశయంగా శేషేంద్ర శర్మ జీనియస్.' అని చెప్పక తప్పదు.

## సమీక్ష :

వీరి రచనలు సాంప్రదాయిక, ప్రయోగ, విప్లవ కవిత్వ దిశల్లో ప్రయాణించాయని తెలుస్తుంది. గేయ కవితలు, పద్య కవితల్లోను మనకు కన్పించే భావుకత, వర్ణనాచాతుర్యం, సామాజిక చైతన్యం చూపించబడ్డాయి.

## ప్రశ్నలు :

1. గుంటూరు శేషేంద్ర శర్మ పద్య రచనలను పరిచయం చేయండి
2. శేషేంద్ర రచనల్లోని విప్లవ భావాలను వివరించండి.
3. శేషేంద్ర రచన కవితా ప్రస్థానాన్ని పరిశీలించండి.

## ఆధార గ్రంథాలు :


1. యుగకవి శేషేంద్ర - సం. ఆకుల సుబ్రహ్మణ్యం
2. శేషేంద్ర కవిత - నవ్యత - కలువగుంట రామమూర్తి
3. శేషేంద్ర కవితా విశ్వరూపం - విజయసారధి
4. శేషేంద్ర కవిత్వానుశీలనం - పెన్నా శివరామకృష్ణ
5. శేషేంద్ర జాలం - ఆపత్స సోమసుందరం.


డాక్టర్ వి. సిమ్మన్న

## పాఠం - 16.2

# శివసాగర్ (కె.జి. సత్యమూర్తి)

**పాఠ్య నిర్మాణ క్రమం :**

16.2.1 శివసాగర్ గేయాలు

2.2 కీచక వధ కవిత

2.3 ప్రతీకలలోని ధర్మాలు

2.4 శివసాగర్‌పై కమ్యూనిస్టు ప్రభావం

2.5 శివసాగర్ విప్లవ సాహిత్యం

**లక్ష్యం :**

విప్లవ కార్యా చరణలో నిరంతర కృషి చేయాలన్న విప్లవ కారుల అంతరంగానికి ఈ రచనలు ప్రతినిధులుగా ఎలా ఉన్నాయో చూపవచ్చు.

## 16.2.1 శివసాగర్ గేయాలు

'నరుడో భాస్కరుడా' అనే ప్రసిద్ధమైన పాట ద్వారా విప్లవ భావాల్ని బాగా వ్యాపింపచేసిన కవి కె.జి. సత్యమూర్తి. ఇతనికి శివుడు, శివసాగర్ అనే పేరు కూడా వున్నాయి. శివసాగర్ అనే పేరుతో జానపద బాణిలో అనేక పాటలు రాశాడు. ఇతని జానపద బాణీల పాటల్లో ఒక విశిష్టత వుంది. ఏక కాలంలో పండిత పామరుల్ని మెప్పించగల శక్తి వీటికి వుంది. జానపద గేయాల్లో కన్పించే భాషా సారళ్యంతో పాటు ఇతర సాహిత్యాల్లో కన్పించే భావ పరిణతి వుంది. స్వయంగా పాణిగ్రాహిలా విప్లవ పోరాటాల్లో పాల్గొన్నాడు. 'నా చెల్లీ చెంద్రమ్మా' అనే ఇతని కథా గేయం కరుణరసంతో నిండి ఆదరణ పొందింది. ఎన్నో రకాలుగా శివసాగర్ విప్లవ కవులకు మార్గదర్శకుడు.

'గువ్వలతో చెలిమి చేసి
కొండ చిలవతో పోరి
నీనెత్తురు ధారలతో
రహదారులు పోసినావు"

ఇది శివసాగర్ మార్గం, నక్సల్బరీ, శ్రీకాకుళ విప్లవోద్యమాల ముద్దుబిడ్డ శివసాగర్. ఈ మార్గంలో తీరిక లేకుండా పోరాడాలని శివసాగర్ ఆవేదన. పోరాటంచేసి, ఫలితం సాధించిన ఉద్యమకారుడు సత్యమూర్తి.

'పొద్దస్తమానం
పనిపాటల్లో పడి
కన్నెత్తయినా చూడటం లేదని
అలిగి
కవిత కన్నవారింటికి
వెళ్ళిపోయింది'

ఇది శివసాగర్ అంతరంగం. విప్లవ కార్యాచరణలో నిరంతర నిర్విరామ కృషి చేయాలన్న విప్లవకారుల అంతరంగానికి శివసాగర్ ఇక్కడ ప్రతినిధిగా నిలబడుతున్నాడు. ఇక్కడ కవితను శివసాగర్ భార్యగా భావించడంలో భార్యాభర్తల ఐక్యత పనిపాటల్లో కూడా వుందని ప్రతిపాదించాడు. భార్య భర్త రెండు భిన్న ప్రాణులైనప్పటికి విడివిడిగా బతకలేనంత పరస్పర ఆకర్షణశక్తి వారిని ఒకటి చేస్తోంది. పని-పాట రెండు వేరు వేరు పనులైనప్పటికీ భార్య - భర్తల మధ్యనున్న అవినాభావ సంబంధం లాంటిదే వీటి మధ్య కూడా వుంది. భార్యలేకుంటే భర్త ఎలా తపించిపోతాడో అలాగే పాట లేకుండా పనికూడా నీరసించిపోతుంది. భార్యభర్తల ఐక్యతలో మాధుర్యం ఎలా శిఖరాగ్రస్థాయిని పొందుతుందో అలాగే పని-పాట ఏకోత్పన్నతలో కూడా ఆ శిఖరాగ్రస్థాయి మాధుర్యం అనివార్యంగా కలుగుతోంది. అందుకే శివసాగర్ కవితను భార్యగా భావించాడన్నమాట.

### 1. నాచెల్లి చంద్రమ్మ గేయం :

శివసాగర్‌కు విప్లవంలో స్త్రీల పాత్రను గూర్చి స్పష్టమైన అవగాహన వుందనటానికి 'అమ్మ' పాత్రతో పాటు చెల్లీ 'చెంద్రమ్మ' కూడా ఒక మంచి నిదర్శనం.

'నా చెల్లీ, చెంద్రమ్మా' గేయం ఈనాటికీ గ్రామాల్లోని భూస్వాముల కాముక దృష్టికి భోగలాలసతకు వ్యతిరేకంగా స్త్రీ ఎలా పోరాడాలో చెప్పే గేయం. ఆ చెంద్రమ్మ రేపల్లె చంద్రమ్మ. మల్లె పూవులాంటి చిన్నది. మొగిలి పూవులాంటి మరిది మొగిలన్న ఆమె ప్రియుడు. వాళ్ళు చూడ చక్కని జోడు. మొగిలన్న కాసిరెడ్డి రాకాసికోరలకు బలైపోయాడు. చెంద్రీ చేయిలోన చేయివేసి వొడిలోన తలవుంచి తనువు చాలించాడు. చంద్రమ్మ శోకం ఏరులై, వరదలై, సంద్రమై ఆకసం తాకింది. ఆమె బ్రతుకు వల్లకాడయింది. వగచి వగచి పగబట్టి లేచింది. చిటపట చినుకుల్లో కందిరీగ మధ్యలోవున్న చంద్రీనిచూసి పసల కొట్టం వద్ద 'మసలు' కొందామని కాసిరెడ్డి దాపుకొచ్చాడు. చెంద్రమ్మ వగలమారి దొరనుకత్తితో కుత్తుకలో పొత్తికడుపులో గుచ్చింది. ఊరికి పులిని, దోపిడీకి దొరను కత్తికి సొరకాయ చేసింది. కారిన రక్తాన్ని నుదుటబొట్టు పెట్టుకొంది. చీమ చిటుకనగ చీకటిలో కలిసిపోయింది. జాలారి జంగయ్య సాయంతో తెప్పమీద ఏరుదాటి అడవిలో అన్నల చేరింది తెల్లారింది. ఆ రోజు ఆ పల్లె 'నవ్వుతోంది'.

చెల్లీ 'చెంద్రమ్మ' విప్లవకారిణికి ప్రతీక. జాలారి జంగయ్య విప్లవోద్యమానికి సానుభూతి చూపే మధ్య తరగతి వర్గానికి ప్రతీక. గురజాడ పూర్ణమ్మ కథకు, చెల్లీ చెంద్రమ్మకు పోలిక వుంది. పరిణతి విప్లవం వల్ల వచ్చిందని శివసాగరే స్వయంగా పూర్ణమ్మ కథ ప్రభావాన్ని చెప్పుకొన్నాడు. పూర్ణమ్మ కథకూ చెల్లీ చంద్రమ్మకు మధ్య వున్న భేదం పూర్ణమ్మ 'ఆత్మత్యాగం' చేసి సమస్యను గాలికి వదిలేస్తే చెంద్రమ్మ భూస్వామిని చంపి సమస్యకు పరిష్కారాన్ని చూపించింది. ఇదే శివసాగర్ చెప్పిన విప్లవం వల్ల వచ్చిన పరిణతి.

### 2. మలి కదలిక

శివసాగర్ కవితలో విప్లవోద్యమం సంపూర్ణంగా ప్రతిఫలించి విప్లవ కవితకు అనంత విస్తృతిని సాధించింది. విప్లవోద్యమ పోరాటంలో ప్రభవించిన 'మలి కదలిక' ఒక పోరాట వీరుడైన, శివసాగర్ భావోద్వేగంలో ప్రసరించింది. ఈ 'మలి కదలిక'కు నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమాలు నేపథ్యంగా వ్యవహరించాయి.

తమ మీద జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కోవాలని ప్రజలు అనుకున్నప్పుడు అది తప్పనిసరిగ వర్గ పోరాటానికి దారి తీస్తుంది. వర్గ పోరాటం ప్రజల పాలిటికి బతుకు యుద్ధం అవుతుంది. ఈ బతుకు యుద్ధంలో ప్రజలు ఎప్పుడో ఒకప్పుడు సుబ్బారావు పాణిగ్రాహి అన్నట్లుగా చావో రేవో తేల్చుకోవలసి వుంటుంది. నేలతల్లి చెరను విడిపించడం కోసం శివసాగర్ రాసిన ఈ కింది పాట ఎంతగానో పోరాటోత్తేజాన్ని కల్గిస్తుంది.

"విప్పపూల చెట్ల సిగన - దాచిన విల్లంబులన్ని
నీకిస్తా తమ్ముడా! నీకిస్తా తమ్ముడా!
లోహార్ జ్వాల దారిలోన - దాచిన విల్లమ్ములన్ని

నీకిస్తా తమ్ముడా! నీకిస్తా తమ్ముడా!
బుగతగాడి నెత్తురుకో - తళతళ లాడే కత్తులు!
నీకిస్తా తమ్ముడా! నీకిస్తా తమ్ముడా!
గార్ల రైలు దారిలోన - గుంజుకున్న బల్ రైఫిల్
నీకిస్తా తమ్ముడా! నీ కిస్తా తమ్ముడా!
రూపాయీ కొండలోన - కోసిన సిపాయి పీక
నీకిస్తా తమ్ముడా! నీకిస్తా తమ్ముడా!
తులసి కొండ లోయల్లో - దాచిన బందూకులన్ని
నీకిస్తా తమ్ముడా! నీకిస్తా తమ్ముడా!
ఆవిరి కొండల కోనల - పారిన వీరుల రక్తం
నీకిస్తా తమ్ముడా! నీకిస్తా తమ్ముడా!
చీకటికొండల కన్నుల - దాగిన వెన్నెల వెలుగులు
నీకిస్తా తమ్ముడా! నీకిస్తా తమ్ముడా!
బుడారి సింగి కొండల్లో - పూచిన పూలన్ని ఏరి
నీకిస్తా తమ్ముడా! నీ కిస్తా తమ్ముడా!
బొడ్డపాడు పోతుగడ్డ - గరుడ భద్ర మెరుపు దాడి
నీకిస్తా తమ్ముడా! నీ కిస్తా తమ్ముడా!
కైలాసం కళ్ళ వెలుగు - వెంపటాపు చురుకు చూపు
నీ కిస్తా తమ్ముడా! నీ కిస్తా తమ్ముడా!
పాణిగ్రాహి కత్తిపాట - మల్లిక పసిపాప నవ్వు
నీ కిస్తా తమ్ముడా! నీ కిస్తా తమ్ముడా!
పేద ప్రజల ఆరాటం - పేద ప్రజల పోరాటం
నీ కిస్తా తమ్ముడా! నీ కిస్తా తమ్ముడా!
విద్రోహుల మట్టుబెట్టి - రైఫిళ్ళను చేతబట్టి
ఎర్రసేన నిర్మించగ - ఎర్రప్రాంత మేర్పరచగ
అన్నలతో చేయి కలిపి - నేలతల్లి చెరను విడిపించగ
రావాలోయ్ తమ్ముడా - జాగేలోయ్ తమ్ముడా!

ఈ పాటను పాడేటప్పుడు అది శ్రోతల మీద ఎంతో ప్రభావాన్ని వేస్తుంది. ముఖ్యంగా పోరాటంతో ఎంతో కొంత పరిచయం, సానుభూతి వున్నవారి విషయం చెప్పవలసిన పనిలేదు. ఎందుకంటే ఈ పాట కొత్తవారికి చైతన్యాన్ని కలిగించడం మాత్రమే కాకుండా, పాత వారికి పోరాట అనుబంధాన్ని ఏర్పరుస్తుంది. పోరాట ప్రాంతాల పేర్లు పోరాట సంఘటనలు, పోరాట వీరుల సంస్మరణ ఈ పాటలో వుండడమే దానికి కారణం. శివసాగర్ పాటలన్నీ దాదాపు విలక్షణమైన శైలిలో వుండి ఎంతో ఆవేశపూరితంగా వుంటాయి. ఇది అటువంటి విలక్షణమైన పాట.

అత్యవసర పరిస్థితిని విధించడానికి ముందు 1974లో దేశవ్యాప్తంగా జరిగిన రైల్వే కార్మికుల సమ్మె చాలా ముఖ్యమైంది. ప్రభుత్వాన్ని చాలా క్లిష్టమయిన స్థితిలో వుంచి, దేశంలోని విప్లవ పోరాట శక్తులకు అది మంచి ఉత్తేజాన్ని కల్గించింది. ఆ సమయంలో రైల్వే సమ్మె మీదనే

కాకుండా ఆ సమ్మెను బలపరుస్తున్న వారి మీద కూడ తీవ్రమైన నిర్బంధకాండను ప్రయోగించి సమ్మెను విచ్ఛిన్నం చేయాలని ప్రభుత్వం ప్రయత్నించింది. ఆ సమ్మెను బలపరుస్తూ సమ్మె పరిస్థితిని తెలియజేస్తూ శివసాగర్ ఈ కింది కవితను రాశారు.

'రెడ్ సిగ్నల్ -
ప్రభుత్వం చక్రాలు కదలవు
ఇంజన్‌లో డూమ్ జాయింట్
ప్రమాదాన్ని సూచిస్తోంది
ప్రభుత్వ దమనకాండ ఎక్స్‌ప్రెస్‌కు
లైన్ క్లియరెన్స్ లేదుఅణగారిన కార్మిక శక్తి
అగ్ని పర్వతంలా బద్దలవుతోంది.
.... ..... ....
కార్మిక నక్షత్రం
మళ్ళీ దేశం ఆకాశం మీద
సగర్వంగా ప్రకాశిస్తోంది
నగరంలో పారిన కార్మిక రక్తం
పల్లె దిక్కుగా ప్రవహిస్తోంది
దేశమంతా పెనుతుపానుగా వీస్తోన్న
కార్మికుల బిగి పిడికిళ్ళలో
ఎర్రని చైతన్యం కనిపిస్తోంది
దేశం గుండెల్లో విప్లవ ఘడియలు మోగిస్తోంది
.... .... .....
అద్భుతంగా వుంది పరిస్థితి
అడివిలోని అగ్నికి ఆజ్యం పోస్తున్న నగరాలు
తిరుగబడ్డ కొడవళ్ళతో
చేతులు కలిపేందుకు సన్నద్ధమవుతోన్న సమ్మెలు'

ఇక్కడ రెండు అంశాల్ని మనం గమనించాలి. విప్లవోద్యమం కార్మికుల సమ్మెను పూర్తిగా బలపరచడం అందులో ఒకటి. ఒక్క కార్మికుల సమ్మెను మాత్రమే కాకుండా ప్రజల్లోని ఏ వర్గం చేసే సమ్మెనయినా విప్లవోద్యమం సాధారణంగా బలపరుస్తుంది. దోపిడీ వ్యవస్థకు ప్రాతినిధ్యం వహిస్తూ, దాన్ని కాపాడే ప్రభుత్వాన్ని బలహీన పరచడానికి ఇలాంటి సమ్మె పోరాటాలు, ఆందోళనోద్యమాలు జరుగుతాయి.

### 16.2.2 కీచక వధ కవిత

శివసాగర్ 'కీచక వధ' కవితలో ప్రకృతిని విప్లవపరంగా దర్శించడం జరిగింది.
'ఆకాశంలో సగం నీవు
అనంతకోటి నక్షత్రాల్లో
సగం నీవు సగం నేను

తూర్పు పవన సంగీతంలో
రాగం నీవు తానం నేను
మనిద్దరం కలిసి
ఉద్యమిస్తే ఉప్పెన
మనిద్దరం కలిసి
విప్లవిస్తే విజయం
ఆకాశంలో సగం నీవు'

విప్లవోద్యమంలో స్త్రీ భాగస్వామ్యాన్ని గురించి ఈ కవిత రాయబడింది. అనది పురుష స్వామ్య దోపిడీ వ్యవస్థ కావడం వల్ల అన్ని విషయాల్లోనూ స్త్రీ పురుషుని చేత అణచివేయబడుతున్నది. పురుషుడు ఒకవైపు తాను సంకెళ్ళలో వుంటూ మరోవైపు స్త్రీని అదనంగా పురుష స్వామ్యమనే సంకెళ్ళలో వుంచుతున్నాడు. అందువల్ల స్త్రీ ఒకవైపు పురుషునితో కలిసి దోపిడీ వ్యవస్థను అంతమొందించడానికి విప్లవ పోరాటంలోపాల్గొంటూనే మరోవైపు పురుష స్వామ్యం నుంచి తనకు తాను విముక్తి చేసుకోవడానికి పురుషునితో కూడా పోరాటం చేయవలసిన అదనపు భారాన్ని కలిగి వుంది. పురుష స్వామ్యం నిరాఘాటంగా కొనసాగడానికి కూడ దోపిడీ వ్యవస్థయే కారణం. కాబట్టి దోపిడీ వ్యవస్థ పోకుండా పురుష స్వామ్యం కూడ పోదు. అందువల్ల విప్లవ పోరాటంలో స్త్రీ భాగస్వామ్యం తప్పనిసరిగా అవసరమైంది. స్త్రీ భాగస్వామ్యం లేకుండా విప్లవం జయప్రదం కాదు. ప్రపంచంలోనే సగభాగమైన స్త్రీ అందుకు తగినట్టుగా విప్లవ పోరాటంలో పాల్గొనాలి అని నొక్కి వక్కాణించాడు సత్యమూర్తి.

ఒక కుట్రకేసు సందర్భంగా శివసాగర్ ఇచ్చిన కవితా వాఙ్మూలం ఇలా వుంది.

'న్యాయమూర్తులంగారూ!
భూమిని చాప చుట్టగా చుట్టి
చంకన బెట్టుకున్న రాక్షస భూస్వామ్యం కుట్ర
నా దేశాన్ని విదేశాలకు తెగనమ్మే
దళారీ తనం కుట్ర
కొసిగిన్ కుష్టు పాదాల వద్ద
స్నేహ ఒప్పందం కుట్ర
నిక్సన్ ఓడలు తెచ్చే
ఆహారంలో కుట్ర
భారత స్వాహా తంత్రం కుట్ర
బ్యాలెట్ బాక్స్ కుట్ర
'గరీబీ హటావో' కుట్ర
ఇందిరమ్మ మందహాసం కుట్ర
సూర్యుణ్ణి ఉరితీసేందుకు పొంచి వున్న
అన్యాయ శాస్త్రం అరమోడ్పు కన్నుల్లోని అహం భావం కుట్ర
న్యాయమూర్తులంగారూ
శ్రీకాకుళ సూర్యోదయం కుట్రకాదు
గెరిల్లా సూర్యుడు కుట్ర దారుడు కాదు
చీకట్లను చీల్చడం కదా సూర్యోదయం
వేడీ వెలుతురూ ప్రజలకు పంచడం కదా సూర్యోదయం'

ప్రజలందరికి న్యాయం జరగాలని కోరుతూ విప్లవ పోరాటంలో పాల్గొన్న వారి మీద కుట్ర కేసులు మోపి శిక్షించడానికి అనువుగా వున్న న్యాయస్థానాలు, చట్టాలు రాజ్యాంగ పాలకవర్గ ప్రయోజనాల్ని మాత్రమే రక్షిస్తున్నాయి. అసలు మన రాజ్యాంగమే పాలక వర్గాల కుట్ర ఫలితంగా రాయబడింది. ఈ రాజ్యం రాజ్యాంగ యంత్రం పరిపాలన, చట్టాలు - మొత్తంగా వ్యవస్థ అంతా - ఈ దేశంలోని ప్రజల మీద పాలక వర్గాలు జరిపిన పెద్ద కుట్ర. ఈ కుట్రను తెగటార్చి వేయమని మన సమాజంలోని ఒక వైరుధ్యాన్ని చాలా చక్కగా ఈ కవితా భాగం చూపుతుంది.

జడత్వం జరీ అంచు చీర కట్టినవారు
ఆయుధం చేపట్టలేరు
విప్లవాన్ని ముస్తాబుచేసి
ఎన్నికల దొమ్మరి సంతలో అమ్ముకోనేర్చిన బేహారులు
బారికేడ్లు కట్టలేరు

అని శివసాగర్ రివిజనిజం గూర్చి అన్నారు. నక్సల్బరీ శ్రీకాకుళ విప్లవోద్యమంలో రివిజనిజంలో పోరాటం కూడ ఒక భాగమయింది. విప్లవ కవిత్వంలో మిగిలిన అందరు కవులకంటె శివసాగరే ఎక్కువగా రివిజనిజంతో పోరాడుతూ కవిత్వం రాసారు.

'సృజనాత్మక' స్టూడియోలో
'మార్క్సిస్ట్' మేకప్ మెన్‌లు
నీకు విగ్గు తగిలించి
సరికొత్త మీసాలు అంటించి
జరీబురఖా తొడిగి
కాళ్ళకు పాంకోళ్ళు పెట్టి
నెత్తికి పాగా చుట్టి
నిన్ను 'స్వామీజీ లెనిన్'ను చేయాలని
ఎంతటి సాహసానికి తలపడ్డారు.
ప్రపంచ దోపిడీ వ్యవస్థనే గజగజలాడించిన
రివల్యూషనరీని 'జంటిల్మన్' చేసేందుకు
ఎంత ఘాతుకానికి తల ఒగ్గేరు'

లెనిన్‌లోని విప్లవ సారాన్ని తీసివేయడానికి జరుగుతున్న ప్రయత్నాల్ని చెప్పిన ఈ కవితా భాగం ఒక సుదీర్ఘమైన కవితలో చిన్న భాగం. లెనిన్ శత జయంతి సందర్భంగా రాసింది ఈ కవిత. విప్లవ వీరుల సంస్మరణ కూడ పోరాటోద్దీప్తిని కలిగించేదిగా వుండాలి. కాని రివిజనిస్టులుగా, సోషల్ సామ్రాజ్యవాదులుగా మారిపోయిన రష్యా కమ్యూనిస్టు నాయకత్వం శత జయంతిని పనికి మాలిన ఉత్సవాలుగా నిర్వహించడాన్ని చూసి, సహించలేక, ఆవేదనతో రాసిన కవిత ఇది. ఈ కవితలో రివిజనిజాన్ని మట్టుపెట్టాలనే సంకల్పమూ, కసీ వున్నాయి. జాతీయంగా అంతర్జాతీయంగా రష్యన్ కమ్యూనిస్టులే కాకుండా, మనదేశంలోని రెండు కమ్యూనిస్టు పార్టీలు అనుసరిస్తున్న వర్గ సంకర రాజకీయాల్ని ఈ కవిత విపులంగానే పేర్కొన్నది. లెనిన్‌కు, అతని సిద్ధాంతాలకు ద్రోహం చేస్తూ... దొంగజపం చేస్తున్న వారిని నిర్దాక్షిణ్యంగా విమర్శించడం మాత్రమేకాకుండా లెనిన్ అనగానే ఏ పోరాట స్మృతులు విప్లవకారుని మదిలో మెదలుతాయో ఆ స్మృతి సంఘటనలు కూడా ఇందులో పేర్కోబడ్డాయి.

### 16.2.3 శివసాగర్ ప్రతీకలలోని ధర్మాలు

శివసాగర్‌లో కన్పించే ప్రతీకల్లో రెండు ప్రధాన ధర్మాలు వున్నాయి. 1. జానపద వాస్తవికత, 2. విప్లవ చైతన్యం. విప్లవ కవిత్వం ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసి విప్లవోన్ముఖుల్ని చేయడానికి జానపదీకరణం పొందాలి. విప్లవాన్ని గ్రామీణ వాతావరణంలో సూటిగా స్పష్టంగా చెప్పిన గేయం 'కొక్కొరోకో'-

'కొక్కొరోకో' అని కోడి కూసింది
మబ్బులన్నీ దాటి మన అన్న సూరీడు
మారేడు కొండల్లో మాటుకాశాడు,
చీకట్ల చౌరలను చీల్చి వేస్తున్నాడు,
కొక్కొరోకో అని కోడి కూసింది,
'నిదురబోయే సీమ కదల బారింది
ఈ నీన వరిచేను పాలు బోసింది
పాలుబోసిన చేను ఆర్రువంచింది :
ఆర్రువంచిన చేను కోత కొచ్చింది
కోతకొచ్చిన చేను కోత కోరింది :
కక్కు కొట్టాలిరా కొడవళ్ళకు - ఇంక
పదును పెట్టాలిరా - కొడవళ్ళకు
కొక్కొరోకో అని కోడి కూసింది :
నిదురపోయే సీమ కదలబారింది :
ఏతమెత్తిన వాడ : ఏరు కట్టినవాడ :
నారు పోసినవాడ : నీరు పోసిన వాడ :
దుక్కి దున్నిన వాడ : మొక్క నాటిన వాడ :
కలుపు తీసినవాడ : కలత మోసిన వాడ :
కోతకొచ్చిన చేను కోతకోరింది
కోత కాలము నిన్ను కోరి పిలిచింది :
కక్కు కొట్టండిరా : కొడవళ్ళకూ - ఇంక
పదును పెట్టండిరా : కొడవళ్ళకూ
కొక్కొరోకో అని కోడికూసింది
తూర్పువు కొండంత జేవురించింది :
నీలాటి రేవంత నిగ్గుదేరింది :
పాతాళ గంగమ్మ పెల్లుబికి పొంగింది :
కోతకొచ్చిన చేను కోత కోరింది :
కోత కాలమే నిన్ను కోరి పిలిచింది.

ఈ గేయంలో కర్తవ్య నిర్దేశం ఒదిగి పోయింది. గ్రామీణ ప్రకృతి - జీవితం విప్లవానికి వినియోగించుకోబడ్డాయి. ఈ గేయాన్ని భావ కవిత్వంపై వచ్చిన విప్లవంగా మనం చెప్పవచ్చు.

కొక్కొరోకో అనే కోడికూత ఉషోదయంలో విన్పించగానే గ్రామీణ ప్రజలు వారి వారి పనులకు సన్నద్ధమవుతారు. ఈ సంకేతాన్ని ఇది విప్లవాల యుగమని ెప్పడానికి విప్లవ శంఖారావంగా వుపయోగించుకోబడింది. అందుకే ఆ సంకేతంతో 'నిదురబోయే సీమ కదల బారింది.

'విప్లవ ఆశావహదృష్టి' (రివల్యూషనర్ ఆప్టిమిజమ్) తో విప్లవ కారులు సామాజిక పరిస్థితి, విప్లవానికి అనుకూలంగా వుందని తలుస్తారు. అది పాలుపోసి, కోతకొచ్చి, అగ్రువంచిన వరిచేనులా ప్రతీకరింపబడింది.

ఈ గేయంలో సామగ్రి అంత గ్రామీణ ప్రకృతి. అది గ్రామీణ ప్రజల రైతాంగ పోరాటాన్ని గూర్చి చెప్పడానికి అనుగుణంగా ప్రతిఫలించింది. ఆ రైతాంగం ఎవరు? ఏతమెత్తి, ఏరుకట్టి, నారుపోసి, దుక్కిదున్ని, మొక్కనాటి, కలుపుతీసిన శ్రమ జీవులు. వాళ్ళు తమ ఇంటికి పంటలుగాదు 'కలతల మోసుక' పోతున్నారు. అందుకే 'కలత మోసినవాడా' అని ఆ శ్రామికున్ని ప్రతీకరించడం ఈ దోపిడీ తీవ్రత సహించలేని స్థితిలో శ్రామికుడు విప్లవిస్తాడు. అంటే దోపిడియే ఆ దోపిడిని అంతం చేయడానికి కోరి పిలుస్తుంది. ఇక్కడ ఈ విధంగా ప్రతీకరించబడింది.

'కోత కొచ్చిన చేను కోత కోరింది
కోత కాలము నిన్ను కోరి పిలిచింది'

ఈ 'కోడికూత' తోనే 'తూరుపు కొండంతా' జేవురించింది. 'నీలాటి రేవంత' నిగ్గదేరింది. తూరుపు కొండ జేవురించటం పోరాట చైతన్యానికి చిహ్నం. శ్రీకాకుళం కొండలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తూర్పున వున్నాయి. ఆ కొండల్లో గిరిజన రైతాంగం జరిపిన ఉద్యమం సూర్యోదయం చైతన్యానికి చిహ్నం. అందుకే శ్రీకాకుళోద్యమాన్ని 'తూర్పు కొండంత జేవురించిందని' ప్రతీకరించడం, ఆ చైతన్యంలో 'నీలాటి రేవు మిగిలిన ప్రాంతం నిగ్గుదేరింది. ఆ చైతన్యంతోనే 'పాతాళ గంగమ్మ' విప్లవం పెల్లుబికి పొంగిందని 'విప్లవ ఆశావహదృష్టి' కవితా రూపం పొందింది.

## 16.2.4 శివసాగర్‌పై - కమ్యూనిష్టు ప్రభావం

శివసాగర్‌లోని కమ్యూనిష్టు అవగాహనను కళాత్మకంగా ప్రతి ఫలించిన ప్రతీకలు శాస్త్రీయమైన పోరాటానుభవంచేత పరిపూర్ణత పొందిన కవితా స్పందనకు గీటురాళ్ళుగా నిలుస్తున్నాయి.

'కడలి కడుపు మీటినవాడా!
కెరటాలపై లేచిన వాడా!'

ఇక్కడ కడలి ప్రజలకు ప్రతీక. వారి 'కడుపు మీటినవాడు' లెనిన్. ఆ ప్రజల విప్లవ చైతన్యం కెరటాలు. ఆ 'కెరటాలపై లేచినవాడు' లెనిన్. అంటే ప్రజల అగ్రభాగాన నిలిచాడని అర్థం. 'అలలు' అనే కవితలో ఈ ప్రతీకల - భావాన్ని శివసాగర్ స్పష్టంగా చెప్పాడు.

'ఉరికంబం మీద అలలు
కటకటాల వెనుక అలలు
కన్నీళ్ళలో అలలు : అలలు :
కారడవిలో అలలు : అలలు :
కడలి జనం : అలలు దళం
అలలు కడలి ప్రాణప్రదం :

'అలలు' అంటే విప్లవం వీరులని. 'కడలి' అంటే ప్రజలని ఇక్కడ స్పష్టం చేయబడింది. దోపిడీ సమాజంలో ప్రజల జీవితం 'ప్రాణ రహితం' విప్లవకారులు దానికి ప్రాణం పోయడానికే విప్లవిస్తున్నారు. అందుకే 'అలలు కడలి ప్రాణప్రదం' అని శివసాగర్ చెప్పడం. 'ఎంతో ఆధునికమైన ఎక్స్‌ప్రెషన్‌కు ఈ గీతం మొత్తం ఒక అద్భుతమైన ఉదాహరణ'గా చెప్తూ వరవరరావుగారు 'అలలు ఎంతో సున్నితమైన, హృదయాంతరాల్ని మీటే భావన'గా పేర్కొన్నారు.

## 16.2.5 శివసాగర్ విప్లవ సాహిత్యం

శివసాగర్ 'నేను' సంకేతం ఆధారంగా విప్లవ వీరుడిని ప్రతీకరించడంలో అభివ్యక్తి సామాగ్రి శాస్త్ర పరిభాషకు, జన వ్యవహారంలోని భావాలకు, పోరాట ప్రాంతాల పేర్లకు ప్రాణం పోశాడు.

'నేను నేను కాదు
నేను అదో లోకానికి పోతున్న
సమాజ విమానాన్ని హైజాక్ చేసినవాణ్ణి
ఖడ్గాన్ని మీటి ప్రపంచ జనసంగీతాన్ని సృష్టించినవాణ్ణి
చరిత్ర చెక్కిలి ముద్దిడిన వాణ్ణి
నేను పొత్తిళ్ళలోని ప్రజా సైన్యాన్ని
నేను నక్సల్‌బరీని : నేను ముషాహరీని :
నేను శ్రీకాకుళాన్ని :

శ్రీకాకుళం జిల్లా కొండ ప్రాంతాల్లో బూర్జువా వ్యవస్థకు వ్యతిరేకంగా గిరిజనులు చేసిన భౌతిక సంఘర్షణే శ్రీకాకుళ ఉద్యమం. ఈ భౌతిక పునాది నుంచి పుట్టిన 'శ్రీకాకుళం' ఈనాడు కేవలం ఒక భౌగోళిక ప్రాంతం కాదు. అది నూతన సమాజం కోసం అణచబడ్డ ప్రజానీకం చేస్తున్న పోరాటాలకి ఉత్తేజానిచ్చే ఒక ప్రతీక. ఈ విషయం శివసాగర్ కూడా గుర్తించాడు. అందుకే శ్రీకాకుళంతోపాటు నక్సల్బర్ ముషాహర్ పోరాట ప్రాంతాల్ని విప్లవానికి ప్రతీకలుగా నిలబెట్టాడు.

శివసాగర్‌కు వున్న పరిశీలనాశక్తి, అవగాహన చాలా లోతయినవి. దోపిడి దొరల పులి స్వభావాన్ని ఇలా ప్రతీకరించాడు.

'నీ రక్తం గ్లాసులతో
తాగి తేన్పు దొరలుండగ'

మనిషయినవాడు మనిషి రక్తం తాగలేడు. తాగినా అరిగించుకోలేడు. కాని దోపిడీ దారులు పీడితుల రక్తం తాగి తేన్పుతూ వున్నారు. అలాగే దోపిడీ వ్యవస్థ విష స్వభావాన్ని ఇలా చెప్తాడు.

'కష్ట జీవిదారుల్లో
నాల్గు తలల విషపునాగు'

సామాజిక జీవనం సక్రమంగా నడవడానికి సామాజిక వ్యవస్థ నాలుగు వర్ణాలుగా విభజింపబడి వుంది. అవి 1. బ్రాహ్మణ, 2. క్షత్రియ, 3. వైశ్య, 4. శూద్ర వర్ణాలు. అయితే ఇవి సమాజంలో ప్రజల్ని 'ఉన్నత', 'హీన' వర్ణాలుగా విభజించాయి. అంతేగాకుండా 'హీన' వర్ణాల ప్రజల్ని 'ఉన్నత' వర్గాలు దోచుకోడానికి అనువుగా సమాజంలో మార్మికతను ప్రవేశపెట్టాయి. దోచుకోడానికి అనువైన ఈ సంప్రదాయాన్ని 'నాలుగు తలల విషపునాగు' అని చెప్పడంలో ఆ సంప్రదాయ వ్యతిరేకత, దోపిడిని అంతం చేయాలన్న తపన ఈ విధంగా వ్యక్తమైంది.

'తెగించు పోరాటంలో
వధించు, పెనుసర్పం'

ఇక్కడ కర్తవ్య నిర్దేశం, విప్లవానికి ఒదిగిపోయిన కవితా హృదయం కన్పిస్తుంది.

విప్లవ కవులు చందమామను సామగ్రిగా స్వీకరించి కవితలు రాయడానికి జంకుతారు కాని శివసాగర్ 'చందమామ'ను కార్మికునికి ప్రతీకగా నిలబెట్టి భవిష్యత్తులో కార్మికుని సుఖమయ జీవితంలోకి తొంగిచూశాడు.

'ఫ్యాక్టరీలో చందమామ
మర చక్రం తిప్పును'

ఆలాగే రైతు జీవితాన్ని కూడా దర్శిస్తాడు శివసాగర్ -

సూర్యుని అరచేత పట్టి

రైతు దుక్కి దున్నును'

రేపటి 'రాజు' గా శివసాగర్ కార్మికుడికి పట్టం కట్టాడు.

'మహితాత్ముడు కార్మికుడే

నక్షత్ర కిరీటధారి'

ఈ విప్లవాల యుగంలో భారతదేశం కూడా విప్లవిస్తోందని శివసాగర్ ఇలా అంటాడు.

'రుతుగీతికి పులకించి

గంగ కూడా పొంగెను'

'మార్క్సిజం' మిగిలిన తాత్విక ధోరణుల మాదిరిగా ఆచరణ లోపించింది కాదు. దీనికి ఆచరణ గీటురాయి - ఆ గీటురాయి వెలిగించిన గీతాలు శివసాగర్‌వి. అందుకే ఇలా అన్నాడు.

'మార్క్సిజం టార్చిలోన

సెల్ఫ్‌మాట మరువకు'

మార్క్సిజాన్ని ఆచరణలో పెట్టడమే 'ఏటికి ఎదురీదువాళ్ళమురా' అని చెప్పడం.

ఒక సంఘటనను కవితా మయం చేయటంలో శివసాగర్ వాస్తవిక దృష్టికి చెరబండరాజుపై రాసిన గేయ భాగం నిదర్శనం. చెరబండరాజు మెదడు రోగంతో చనిపోయిన సంఘటనను శివసాగర్ ఈ విధంగా రాశాడు.

అంపశయ్యపై మేనువాల్చి

తన కపాలంలోని రక్తంలో

కంకాళాన్ని ముంచి

జన హృదయంపై

చెరబండరాజు

రాస్తున్న

చరమగీత సౌందర్యాన్ని

నామునివేళ్ళతో తాకాలని

వృధా ప్రయత్నం చేస్తున్నాను'

చెరబండరాజు విప్లవ స్పృహమీద శివసాగర్‌కి వున్న గౌరవం అపారం. అదే తోటి విప్లవ కారుల్లో జ్వలనాగ్ని సదృశంగా వైష్ణవ గీతాన్ని సృష్టించేది. పై గేయంలో ఆసుపత్రి 'అంపశయ్య'గా, చెర అనారోగ్యానికి కారణమైన 'పోరాటపాట'ను కపాలంలోని రక్తంలో ముంచిన కంకాళంగా'ను శివసాగర్ ప్రతీకరించాడు.

ఈ విధంగా శివసాగర్ విప్లవ భావుకత ఎక్కువుగా వుంది. ఈ ప్రతీకలు విప్లవ కవితా ప్రయోజనాల్ని సాధించాయి.

అంచేతనే చేకూరి రామారావుగారు శివసాగర్ గూర్చి ఇలా అన్నారు.

"విప్లవ సాహిత్యంలోనే కాదు మొత్తం తెలుగు సాహిత్యంలో కూడా శ్రీశ్రీ తర్వాత గుర్తించదగిన బహుముఖ ప్రతిభావంతుడు శివసాగర్". ఇది నూటికి నూరుపాళ్ళు నిజం.

**సమీక్ష :**

ఒక సంఘటనను కవితామయం చేయడంలో శివసాగర్ వాస్తవిక దృష్టి ఎంతో చక్కగా చూపించబడింది. శివసాగర్ మీదనున్న కమ్యూనిస్టు ప్రభావం నిరూపించబడింది. విప్లవ కవిగా శివసాగర్ నిరూపించబడ్డాడు.

**ఆధార గ్రంథాలు :**


1. ఆధునిక తెలుగు కవిత్వంలో విప్లవ ధోరణులు - ఒక విశ్లేషణ. - డా॥ ఎమ్. గంగాధర్
2. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు - ఆచార్య కె. కె. రంగనాథాచార్యులు
3. కవితా విప్లవాల స్వరూపం - త్రిపురనేని మధుసూదనరావు
4. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం - ఆచార్య వెల్చేరు నారాయణరావు
5. తెలుగు విప్లవ కవిత్వంలో ప్రతీక- డా. తాతిరెడ్డి ప్రభాకరరెడ్డి.


**ప్రశ్నలు :**

1) శివసాగర్‌పైగల కమ్యూనిస్టు ప్రభావాన్ని తెలియజేయండి?
2) శివసాగర్ ప్రసిద్ధ గేయాలను తెలిపి, అందలి సారాంశాన్ని వివరించండి.

**డాక్టర్ వి. పిమ్మన్న**

పాఠం - 17.1

# దాశరథి - కుందుర్తి

**పాఠ్య నిర్మాణ క్రమం**


17.1.1 దాశరథి పరిచయం

17.1.2 దాశరథి కవిత్వ జీవితం ప్రారంభ దశ

17.1.3 దాశరథి రచనలు

17.1.4 దాశరథి కవితా వస్తుతత్త్వం

17.1.5 సంప్రదాయకత

17.1.6 కాల్పనికత

17.1.7 ప్రకృతి కవిత్వం

17.1.8 దేశభక్తి కవిత్వం

17.1.9 అభ్యుదయ శీలత


**లక్ష్యం :**

దాశరథి జీవిత విశేషాలను, రచనలను, రచనా తత్వాన్ని, సమాజం కోసం దాశరథి చేసిన సాహిత్య కృషిని తెలుసుకుంటారు.

## 17.1.1. దాశరథి పరిచయం

సమాజాన్ని మార్చాలనే సంకల్పంతో కొందరు కత్తిని, మరికొందరు కలాన్ని స్వీకరించారు. కత్తితో తెచ్చే మార్పు అత్యల్పం, తాత్కాలికమనే సత్యాన్ని చరిత్ర ఋజువు చేస్తూవుంది. కలంతో మనిషి మనస్సులో మార్పును తేవచ్చిని ఎందరో కవులు రచయితలు భావించారు. అట్టి వారిలో దాశరథి ఒకరు.

జననం: ఆధునికాంధ్ర కవులలో ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించు కొన్న దాశరథి కృష్ణమాచార్యులు 1925 సం॥ జూలైనెల ఇరవై రెండో తేదీన దాశరథి వెంకటాచార్యులు వెంకటమ్మలకు వరంగల్లు జిల్లా చిన్న గూడూరులో జన్మించారు. ప్రాథమిక విద్యను తండ్రి సమక్షంలో సాగించి, ఖమ్మంలో మెట్రిక్యులేషను, హైదరాబాదు సాయంకళాశాలలో ఆంగ్ల భాష ప్రధానాంశంగా డిగ్రీని దాశరథి సముపార్జించారు.

## 17.1.2 దాశరథి కవిత్వ జీవితం ప్రారంభ దశ:-

ఖమ్మంలో మెట్రిక్యులేషన్ పూర్తి చేసిన దాశరథిని అప్పటి రాచరికపు వ్యవస్థ, ప్రజల దుస్థితి రాజకీయ రంగ ప్రవేశం చేయించాయి. 1943 ప్రాంతంలో "గార్ల" జాగీరులో రైతుల అలజడి ప్రారంభమైంది. దాశరథి ఆ ఉద్యమంలోకి దూసుకెళ్ళాడు. "మానిజామురాజా జన్మజన్మాల బూజు" అని నా తెలంగాణా కోటి రత్నాల వీణ" అని నినదించాడు.

1946 డిశంబరు 18 వ తేదీన మానుకోట తాలుకాలో ఒక ఉపన్యాసంలో "ప్రాణము లొడ్డి ఘోర గహనాటవులన్ బడగొడ్డి, మంచి మా గాణములన్ సృజించి, ఎముకల్ నుసిజేసి పొలాలు దున్ని, భోషాణములన్ నవాబునకు స్వర్ణము నింపిన రైతుదే, తెలంగాణము రైతుదే, ముసలి నక్కకు రాచరికంబు దక్కునే" అని ఎలుగెత్తి చాటి పోలీసుల చేతిలలో జిక్కి, ఎట్టకేలకు తప్పించుకొని మారు వేషం ధరించి ఉద్యమ జీవితాన్ని, కవితా ఉద్యమ జీవితాన్ని సాగించాడు.

### 17.1.3. దాశరథి రచనలు:-

సంస్కృతం, తెలుగు, ఉర్దూ, పార్శీ, హిందీ, ఇంగ్లీషు భాషా రీతుల్ని చక్కగా అవగాహన చేసికొని సమాజంలోని చైతన్య వంతమైన అభ్యుదయశాలిగా దాశరథి అందించిన రచనలు అనేకాలు.

ఎ) అగ్నిధార:- కవిగా దాశరథిని మింటికెత్తిన కవితా సంపుటి అగ్నిధార. దాశరథి ముద్రిత గ్రంధాలలో ఇది మొదటిది. 1949 లో 'సాహితీ మేఖల' అనే సాహిత్య సంస్థ పక్షాన దేవులపల్లి రామానుజరావు, పులిజాల హనుమంతురావు ఈ 'అగ్నిధారను ప్రచురించారు. ఇందులో ప్రళయా వేశంతో రచింపబడిన అగ్నిఖండికలే గాక, ప్రణయం వస్తువుగా కలిగిన ఖండికలు వున్నాయి. ప్రళయం, ప్రణయం కలిపి చెప్పడం సబబుగా లేదని కొందరన్నారు. అందుకు దాశరథి "సైనికుడు యుద్ధరంగంలో పోరాడుతూ, అప్పుడప్పుడు తన ప్రియురాలి అందమైన కళ్ళను తలచుకోవడం అస్వాభావికమా?" అని సమాధనం ఇచ్చాడు. ఈ 'అగ్నిధార' లో ప్రళయం, ప్రణయమే కాక దేశభక్తి, ప్రకృతిని సంబంధించిన ఖండికలు వున్నాయి.

"అగ్నిధార"కు నిజాం నిరంకుశ పాలన, ఆతని పాలన రోజులలో ప్రజల బాధలు ప్రేరకాలు'అగ్నిధార' లోని అనేక ఖండికలు దాశరథి జైలు జీవితం గడుపుతున్న రోజుల్లో రాసినవే. 'అగ్నిధార' లో కొన్ని ఖండికలలో దాశరథి ఆవేశం కట్టలు తెంచుకొని ప్రవహించడం గమనింపవచ్చు. ఉదాహరణకు

"ఇదేమాట ఇదేమాట

పదే పదే అనేస్తాను

..........................

..........................

దిగిపోవోయ్ తెగిపోవోయ్

తెగిపోవోయ్ దిగిపోవోయ్" (అగ్నిధార) అని నిజాం రాజును రాజ్యం దిగిపొమ్మని నినదించాడు.

బి) రుద్రవీణ:- 1950 లో ప్రచురితమైన 'రుద్రవీణ' దాశరథి రెండవ సంపుటి. ఇందులో ఖండికలన్నీ దాదాపు తెలంగాణాకు సంబంధించినవే. నిరంకుశ నిజాం దురాగతాలను నిరసించేవి, శ్రామికుల అభ్యున్నతిని కాంక్షించేవి అయిన గేయాలు ఇందులో అధికం. 'రుద్రవీణ'ను దాశరథి 'తెలంగాణా'కు అంకితం చేసాడు. దేశభక్తి,స్వేచ్ఛాప్రియత్వం, సామ్యవాదం వైపు మొగ్గు ఈ ఖండికల్లో మనం గమనింపివచ్చు.

"రానున్నది ఏది నిజం - అది ఒకటే సోషలిజం"- అన్న విశ్వాసాన్ని 'రుద్రవీణ'లో దాశరథి వ్యక్తం చేశాడు. తెలంగాణా విముక్తితో దాశరథి పరమానందంతో గత చరిత్రలోకి ఒకసారి తొంగి చూచి కాకతీయుల్ని, వీర రుద్రమదేవిని కాపయ్యని, చాళుక్య రాజుల్ని స్మరిసూ "రుద్రవీణ"లో వీర తెలంగాణా ఖండికలో విజయగర్వాన్ని ఇట్లా వ్యక్తం చేసాడు.

"నాడు నేడును తెలంగాణా మోదలేదు శత్రువుల దొంగ దాడికి, శ్రావణా భ్రమటుల గంభీర గర్జాట్ట హాస మరల నా తెలంగాణా పోవుచున్నది పధాన".

సి) మహాంధ్రోదయం:- 'మహాంధ్రోదయం' కావ్యం 1956 లో ప్రకటితం. తెలంగాణాకు విముక్తి లభించిన తరువాత తెలంగాణాంధ్రాను -మిగిలిన రెండు కోట్ల తెలుగు వారితో కలపడం, మహాంధ్రాను సాధించడం ఇందలి ప్రధానంశం. నిజాం రక్కసి గుండె నీరయ్యేలాగా'మహాంధ్రోదయం' లో పద్యాల ద్వారా నినదించాడు దాశరథి.

డి) పునర్నవం:- ఇది దాశరథి నాల్గవ కవితా సంపుటి. ఇది కూడ 256 లో ప్రకటింపబడింది. ఇందులో పద్య ఖండికలు లేవు. ఉన్న వానిలో గేయ ఖండికలు కన్నా వచన కండికలు అధికం. తాను ఆశించిన సోషలిజం దరిదాపుల్లో కనిపించడం వల్లా "పునర్నవం" లో

దాశరథి పరవశించి ( 'ధనం దాచగలరు గాని తేజస్సుని దాచగలరా" అని అన్నాడు. "పునర్నవం" కవితా సంపుటిని ప్రస్తావిస్తూ శ్రీ పి.వి. రత్నం గారు "శ్రీ దాశరథి ప్రతిభను చూపడానికి, చాటడానికి మనమంతా సగర్వంగా చెప్పుకోవడానికి ఒక్క పునర్నవం చాలదా" అన్నాడు. 'పునర్నవం' లోని ప్రతి ఖండిక విలువైంది, భారమైంది అని దాశరథి కృతులపై పరిశోధన చేసిన ఇ.చంద్రమౌళి గారు అభిప్రాయ పడ్డారు.

ఉన్న దాన్ని, ఉన్నవాళ్ళందరితో పంచి ఉన్నంతలో అందరం కలసి భోంచేయడం సహజీవనం. ఇదీ సామ్యవాదం. అంతకన్నా ప్రజాస్వామ్యం లేదంటాడు దాశరథి.

**ఇ) మహాబోధి:-** 1957 లో 2500 వ బుద్ధజయంతి సందర్భంగా రూపుదిద్దుకొని 1959 లో ప్రకటింపబడింది మహాబోది. అయితే ఇందులో ఖండికలు లేవు. ఇది ఏక విషయక కావ్యంగా రచింపబడింది.

సర్వమానవ సౌభ్రాతృత్వం, విశ్వశాంతిని ఆకాక్షించి దాశరథి 'మహాబోధి' నిర్మించాడు. బుద్ధుడికి సంబంధించిన కథలు ఇందలి యితి వృత్తం. సత్యానికి శాంతికి, దయకు, ధర్మానికి, జ్ఞాన, విజ్ఞానాలకు కాణాచియైన బుద్ధిని జీవిత కథను ఇతివృత్తంగా గ్రహించి సమాజానికి శాంతిని అందింప దాశరథి మంచి ప్రయత్నం చేసినాడు.

**ఎఫ్) నవమి:-** ఇది రేడియో నాటికల సంకలనం. దాశరథి ఆకాశవాణిలో ఉద్యోగం చేసే రోజులలో అనేక రేడియో నాటికలు రచించాడు. అందులో తొమ్మిదింటిని చేర్చి 'నవమి' పేరుతో 1959 లో వెలువరించాడు. ఇందులో కొన్ని అనువాదాలు కూడా వున్నాయి. ఈ తొమ్మిదింటిలో కొన్ని చారిత్రకాలు, మరికొన్ని సాంఘిక సమస్యలు ఇతివృత్తంగా గలవి. ఇంకనూ కొన్ని స్వాతంత్రోద్యమానికి సబంధించినవి.

**జి) "నవమంజరి":-** సంగీత ప్రధానమైన లలిత గీతాల సంపుటి 'నవమంజరి'. ఇదికూడా 1959 లో వెలువడింది. ఇందులోని లలిత గేయాల్లో కలువలు, చంద్రుడు, మేఘాలు, మెరుపులు, మామిడి చిగుళ్ళు మొదలైనవి వర్ణితాలు.

**హెచ్) "సినిమాపాటలు":-** 1961 లో దాశరథి సినిమా రంగంలో ప్రవేశించి, సుమారు రెండువేలకు పైగా చక్కని సాహిత్యంగల సినిమా పాటలు రచించాడు.

**ఐ) "అమృతాభిషేకం:-** 1960 లో 'అమృతాభిషేకం' ప్రకటితం. దీపం - దీపపు పురుగులు సంబంధాన్ని జీవాత్మ, పరమాత్మల సంబంధంగా గుర్తించడం పర్షియన్ సంప్రదాయం. దీనిని "అమృతాభిషేకం" లో తెలుగునకు పరిచయం చేసినవాడు దాశరథి. అంతేగాక దీపం ప్రియురాలుగా, దీపపు పురుగును ప్రియుడుగా తెలుగునకు తెలియ జేసినవాడు దాశరథి. ఇకంనూ దీపాన్ని జ్ఞానానికి చీకటిని అజ్ఞానానికి ప్రతీకలుగా 'అమృతాభిషేకం ' లో దాశరథి గ్రహించాడు.

**జె) "గాలిబ్ గీతాలు:-** 1961 లో ఉర్దూ గాలిబ్ గీతాలు దాశరథి అనువాదం చేసాడు. ఇది భావానువాదం. ఇందులో వీలైనంత వరకు తెలుగు నిలబెట్టడానికి దాశరథి ప్రయత్నం చేసాడు. గాలిబ్ గొప్ప భావకుడు. అంత భావుకత్వం దాశరథిలో కూడా వుంది కాబట్టి తెలుగులో గాలిబ్ గీతాల్ని చక్కగా అనువదించగలిగాడు. గాలిబ్ సంక్షిప్తత, క్లుప్తతలను దాశరథి అందుకోగలిగినాడు.

**కె) "దాశరథి" శతకం :-** కంచర్ల గోపన్న "దాశరథి శతకం" తెలుగు సాహిత్యానికి సుపరిచితం. దాశరథి కూడా 'దాశరథి' మకుటంలో 1962 లో ఒక శతకాన్ని వ్రాశాడు. అయితే గోపన్న శతకం భక్తిరస ప్రధానం. దాశరథి తన శతకంలో లోక రీతిని వ్యంగ్య ధోరణిలో వివరించాడు. తన శతన రచనకు ప్రేరకులు చలన చిత్ర నిర్మాత చక్రపాణియని తన శతకంలో చెప్పుకొన్నాడు. రాజకీయ, సాంఘీక నైతిక వ్యవస్థలోని కలుషిత వాతావరణాన్ని ఈ శతకంలో దాశరథి చక్కగా విమర్శించాడు.

**ఎల్) "కవితాపుష్పకం":-** ఇది 1966 లో ప్రకటింపబడింది. పాఠకలోకంలో మంచి ఆదరణను పొందింది. ఇందులో కొన్ని ప్రణయ వాసనలు గల కవితలు. కొన్ని పండుగల వంటి సంఘటనలకు సంబంధించిన కవితలు, ఇంకనూ కొన్ని శాంతి ప్రియత్వాన్ని మానవాభ్యుదయాన్ని కోరే కవితలు, కొన్ని అనువాద కవితలు వున్నాయి.

**ఎమ్) "తిమిరంతో సమరం" :-** ఇది 1973 లో వెలువడింది. దాశరథి చైతన్య సారధిగా, కవితా పయోనిధిగా, రసోదధిగా, విప్లవ వైతాళికుడుగా "తిమిరంతో సమరం" లో దర్శనమిస్తాడు. దాశరథి ఒక శాంతి విప్లవవాది. శాంతి అనే ఆయుధంతో యమున్ని అయినా ఓడించ వచ్చునంటాడు. దాశరథి. వెలుతురు మంచికి ప్రతీక. చీకటి చెడుకు ప్రతీక. ఈ ప్రతీకలు గ్రహించి దాశరథి "తిమిరంతో సమరం" నిర్మించాడు. హింసపై కోపాన్ని "హింస నుండి సమ సమాజ హింస ఉద్భవించుననే అసత్యాన్ని నమ్మకు హంతకుడవు కాబోకు' ' అని దాశరథి వ్యక్తం చేశాడు. "తిమిరంతో సమరం" లో శాంతి ప్రియత్వం, మానవతతోపాటు విశ్వమానవ సౌభ్రాతృత్వం దాశరథి ఆకాంక్షించాడు.

**ఎన్) ఆలోచనాలోచనలు:-** 1975 లో వెలువడిన కవితా సంపుటి. తిండీ, గుడ్డా, ఇల్లూ, వుండనివాడు వుండకూడదు. అందరూ విద్యావంతులు కావాలి. క్షుధ, బుజాబాధల నుండి ప్రజలు విముక్తి పొందాలనేదే దాశరథి 'ఆలోచనాలోనచనల' ధ్యేయం. 'వాగ్దానాలతో నినాదాల్తో స్వర్గం నేలకు వాలదు' అనేది దాశరథి అభిప్రాయం. అంతేగాకః 'గజదొంగ గోపురంలో కాదు కాపురం-కార్మికులు గలపురం కవికి అంతఃపురం" అని కార్మికుల పక్షాన నిలిచినాడు దాశరథి. 'శాంతి ఒక్కటే మానవ జాతికి సరియగు సాల్యూషన్' అని సిద్ధాంతీకరించిన వాడు దాశరథి. మనిషి బానిసత్వాన్ని తొలగించాలనే ఆవేదనను 'ఆలోచనాలోచనలు' లో దాశరథి వ్యక్తం చేసాడు.

**ఓ) ధ్వజమెత్తిన ప్రజ:-** 63 ఖండికలతో 1981 లో ప్రకటింపబడింది. ఇందులో యుద్ధ విముఖత, శాంతి ప్రియత్వం, మానవత, ఆశావాదం అడుగడునా కనిపిస్తాయి. ఇందులో కూడా కొన్ని అనువాదాలు వున్నాయి. మూర్ఖత్వాన్ని పర్వనాన్ని, దౌర్జన్యాన్ని, చూసి భయపడకుండా సౌజన్య పర్జన్యాన్ని పలికించాలంటాడు దాశరథి. శాంతి ప్రియత్వాన్ని అడుగడుగునా ఆకాంక్షించిన వాడు దాశరథి. అందుకే "శాంతి పతాకం ఎగరేయాలి క్రాంతి గీతములు వినిపించాలి" అని అంటాడు.

## 17.1.4. దాశరథి కవితా వస్తుతత్వం:-

దాశరథి కవిత్వంలోని వస్తువును ప్రధానంగా మూడు విభాగాలుగా వర్గీకరింపవచ్చు. అవి. 1. సంప్రదాయకత 2. కాల్పనికత 3. అభ్యుదయ శీలత

**4.1. సంప్రదాయకత :-** ప్రతి జాతికి కొన్ని ఆచారాలు, అలవాట్లు వుంటాయి. అవి తరంగాలుగా ఆచరింపబడుతూ ఆగామితరాలకి అందివ్వబడతాయి. స్థూలంగా దానినే మనం సంప్రదాయమంటున్నాం. ఈ సంప్రదాయం ఆధునిక యుగంలో నాలుగు విధాలుగా వున్నట్లు మనం చెప్పవచ్చు. అవి 1. జాతీయ సంప్రదాయం 2. పొరుగు సంప్రదాయం 3. పాశ్చాత్య సంప్రదాయం 4. అన్యదేశ సంద్రాయం. ఇందులో దాశరథి కవిత్వం మీద జాతీయ, పాశ్చాత్య, అన్యదేశ సంప్రదాయాల్ని మనం గుర్తించవచ్చు.

**4.1.1. జాతీయ సంప్రదాయం:-** దీనినే పౌరాణిక, సంస్కృత సంప్రదాయాలని కూడా అంటారు. ఇది దాశరథి కవితలో రెండు రకాలుగా కనబడుతుంది. అందు మొదటిది ఒక శీర్షిక క్రింద ఖండిక పూర్తిగా సంప్రదాయానికి సంబంధించిధి. ఇందుకు ఉదాహరణలుగా "అగ్నిధార" లోని 'సంధ్యాలయ మూర్తి' 'నటస్వామి' "తిమిరంతో సమరం" లోని 'నటశ్రీ మొదలైన వాటిని గ్రహించవచ్చు. ఇక రెండవది ఖండికల్లో అక్కడక్కడ చెప్పే విషయానికి బలాన్ని చేకూర్చడానికి వుపయోగించే సంప్రదాయ భావాలు. ఇందుకు ఉదాహరణంగా "రుద్రవీణ' ' లోని "వీరతెలంగాణము" ఖండికలో నిజాంనవాబును దుర్యోధనుడుగాను, భటుల్ని దుశ్శాసనుడిగాను పోల్చడం, అట్లే "రుద్రవీణ" లోని 'ముక్తభూమి' ఖండికలో ప్రజాశక్తికి రామున్ని ప్రతీకగా గ్రహించడం గుర్తించవచ్చు.

**4.1.2. జాతీయ సంప్రదాయం:-** పాశ్చాత్య సంద్రాయానికి సంబంధించిన భావాలు దాశరథిలో కొంత తక్కువే అనవచ్చు. ఇందుకు ఆయన కవితలలో రెండు, మూడు వుదాహరణలే మనకు కనిపిస్తాయి. 'ఆలోచనాలోచనాలు' లో 'కొవ్వుత్తి ద్రాక్షగుత్తి ఖండికలో మేరిమాత శ్వాస వలననే గర్భవతి అయిందనీ శ్వాన గూడ లేకుండగనే గర్భం దాల్చిందని, మేరిమాత యేసును, ద్రాక్షగుత్తి మధువును కన్నాయి అని అంటాడు దాశరథి. అట్లే" పునర్నవము" లో 'నరకము' ఖండికలో పదమ్, ఈకల ప్రశక్తి చేశాడు దాశరథి.

దాశరథి సంప్రదాయ పరిజ్ఞానాన్ని గూర్చి కీ॥శే॥ సభాగారు "దాశరథి ప్రాచీన సంప్రదాయాలను భద్రంగా దాచుకుంటూ ఆధునిక కవితా రీతులను అందచందాలతో ప్రదర్శిస్తూ అభ్యుదయ సాహిత్య ప్రపంచానికి ఆదర్శంగా పురోగమిస్తూ ప్రశాంత శ్రామిక విప్లవానికి బంగారు బాటలు వేస్తున్నాడు." అని చెప్పిన మాటలు అక్షర సత్యాలు.

**4.2. కాల్పనికత:-** తెలుగు కవులకు ఆంగ్ల భాషా పఠనం వల్ల, ఆంగ్ల కాల్పనిక కవులైన వర్డ్సువర్త్, షెల్లీ, కీట్సు మొదలగు వారి ప్రభావం వల్ల కవిత్వంలో బుద్ధికంటె ఆత్మకు ప్రాధాన్యమివ్వడం జరిగింది.

కాల్పనిక కవితా శాఖలైన ప్రకృతి కవిత్వం, ప్రణయ కవిత్వం దేశభక్తి కవిత్వం, స్మృతి కవిత్వం దాశరథి రచనల్లో విరివిగా కనిపిస్తాయి.

**4.2.1. ప్రకృతి కవిత్వం:-** వైదిక వాఙ్మయంలోను, భారత రామాయణ కావ్యాలలోను, ప్రబంధాలలోను ప్రకృతి వర్ణనలు కోకొల్లలు. అయితే వాటికి నవ్య కవుల దృక్పథానికి వ్యత్యాసం కనిపిస్తుంది. ముఖ్యంగా దాశరథి మీద అటు ఆంగ్ల కాల్పనిక కవుల ప్రభావం, ఇటు తెలుగు భావకవుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. దాశరథి వ్రాసిన ప్రకృతి కవిత్వంలో ఉషోదయం, సూర్యాస్తమయం, సంధ్య చంద్రోదయాది వర్ణనలతో పాటు ఋతువర్ణనలు వున్నాయి.

**4.2.1.1. ఉషస్సు:-** "అగ్నిధార" లో "ఉష" అనే ఖండికలోను, రుద్రవీణలో, 'అమృతాభిషేకం" లో 'సుప్రభాతితం' ఖండికలోను "ధ్వజమెత్తిన ప్రజ" లో 'తపోషస్విని' ఖండికలోను మొదలైనచోట్ల ఉషస్సును దాశరథి వర్ణించిన తీరు అనితర సాధ్యంగా వుంది.

**4.2.1.2 సంధ్య:-** గాలిబ్ గీతాలలో సంధ్య వర్ణన వుంది. అట్లే "అగ్నిధార" యందు 'అస్తమయం" అనే ఖండికలో

"ఈ నిశా ప్రాంగణాన అద్దించినారు

పాడు నెత్తురు రంగు, దేవతల స్త్రీలు

వాళ్ళ కనుకోనలందు నివాళు లెత్తి

వెళ్ళి పోతాడు సూరీడు, పిల్లవాడు" అని వర్ణించినాడు.

**4.2.1.3. చంద్రోదయం:-** "అగ్నిధార" లో 'చంద్రోదయం" ఖండికలో "వచ్చినవాడు చంద్రుముడు....వెన్నెల జ్వాల లెత్తగా" అని చంద్రుని రాకను ప్రాబంధిక శైలిలో వర్ణించాడు.

**4.2.1.4 చీకటి:-** "అమృతాభిషేకం" లో 'తామసి' అనే ఖండికలో "ఇరులు నిశావతీ భుజము లెక్కి..... హరినీల కాంతులన్" అని మనోహరంగా వర్ణించాడు. "చీకటినటి" ఖండికలో చీకటి చురుకైన నల్లని చూపులకు అందరూ బందీలె అని వర్ణించాడు.

**4.2.1.5 ఋతు వర్ణనలు:-** దాశరథి కవితలలో ఋతువులకు సంబంధించిన ఖండికలు అధికం. ముఖ్యంగా వసంతఋతు వర్ణన దాశరథి ఎంతో మధురంగా వర్ణించాడు. "అగ్నిధార" లో 'ఉగాది' ఖండికలోని ఉగాదిని వర్ణించినపుడు, "కవితా పుష్పకం" లో "నవవసంత వైభవం" ఖండికలో వసంత ఋతువును వర్ణించనపుడు,"ఆలోచనాలోచనలు" లో "పూలలోగిలి - ముళ్ళకౌగిలి" ఖండికలో వసంత ఋతువును వర్ణించినపుడు దాశరథి ఎంతో సామాజిక స్పృహను కలిగి చేసిన వసంత ఋతు వర్ణనలు పేర్కొనదగి వున్నాయి. "అగ్నిధార"లో 'ఎండలు' ఖండికలో "తన నీడలో తానె కునికి పాటలు పడు ఇట్టి గుండెల యెండ లెట్లనయ్యో" అని ఎంతో రసవంతంగా గ్రీష్మ ఋతు వర్ణన చేసినపుడు దాశరథి.

"అగ్నిధార" లో "వానలు" ఖండికలోను "అమృతాభిషేకం" లో "జలధ సరస్వతి" ఖండికలోను మొదలైన వానిలో దాశరథి వర్షఋతు వర్ణనలు పేర్కొనదగి వున్నాయి. "అగ్నిధార" లోని "ఋతుషట్కము" ఖండికలోని శరదృతు వర్ణన ఎంతో రమణీయంగ సాగింది. "మహేంద్రోదయం"- కవితా పుష్పకం"- "ఆలోచనాలోచనలు మొదలైన వానిలోని హేమంత ఋతువర్ణన శోభాయమానంగా చిత్రింప బడింది.

**4.2.2. పల్లీయ ప్రకృతి:-** దాశరథి పల్లెల్లో జీవించే అమాయకులైన, సామాన్య జనుల జీవితానికి సంబంధించిన విశేషాలు ఎన్నో వివరించాడు. "అగ్నిధార" లోని "రైతు" ఖండికలో "నీ వంటి స్వయం ప్రపోషణ విభావము రాజుల కబ్బ జాలునే" అని రైతుగా పుట్టడమే అదృష్టమంటాడు.

**4.2.2.1 బాల్య ప్రకృతి:-** అమాయకత్వం, దివ్యత్వం, ఉత్సాహంగా, ఉదారత మూర్తీభవించిన బాల్యాన్ని దాశరథి చక్కగా వర్ణించాడు. ముఖ్యంగా 'పునర్నవం'లో బాల్యం ఖండికలోని వర్ణనలు గుర్తింపదగి వున్నాయి. "నమ్మించి మోసం చెయ్యొచ్చనీ డబ్బుకోసం గడ్డి తినాలనీ' ' తెలియని బాల్యాన్ని దుర్మార్గాలు, దుఃఖాలు, ధన సంపాదన వంటి విషయాలకు అతీతమైన బాల్యాన్ని దాశరథి చక్కగా వివరించాడు.

**4.3. ప్రణయ కవిత్వం:-** సహజంగా భావకవులు తమ ప్రేయసిని కావ్యనాయికగ స్వీకరించి రచనలు చేసినారు. కాని దాశరథి మాత్రం ప్రత్యేకంగ ప్రియురాలిని పేర్కొనలేదు. దాశరథి ప్రణయ భావన ఒక కొత్త పంథాలో సాగింది. వసంతం, శరత్తు, ఉషస్సు, మంచు చినుకు, భోగి మంటల్లోని జ్వాల, శాంతి - వీటన్నిటిని దాశరథి ప్రేయసిగానే భావించాడు. ప్రత్యేకించి వసంత ఋతువులో మనోహరమైన ప్రణయ భావాలు వ్యక్తం చేశాడు.

"అగ్నిధార" లో "వాసంతిక" ఖండికలో వసంతకుమారిని ప్రేయసిగా భావించాడు. అందులోనే "వసంతీకుమారి రాక" ఖండికలో గ్రీష్మ ఋతువుకు సంబంధించిన వర్ణనలో "రసాలపు తోపుల కాపులందుమ నదులు కలియాడెడి సంగమాలలో మాపులు దాటవేతము" రమ్ముఅంటాడు. "రుద్రవీణ"లో ఉషస్సుందరి' ఖండికలో శాంతిని ప్రేయసిగా భావించాడు. "కవితాపుష్పకం" లో "శాంతి" ఖండికలో శాంతిని ప్రేయసిగా భావించాడు. అట్లే హేమంత ఋతువులోని మంచు చినుకు ప్రేయసిగా భావించాడు. అందులోనే "ప్రపాపాలిక" ఖండికలో "ప్రప"(చలివేందిరి) ను ప్రేయసిగా భావించాడు. "సంక్రాంతి రాత్రి" ఖండికలో భోగిమంటల జ్వాలను "అందానికి చంద్రముఖి

చూపులకు సూర్యముఖి

చలికేమో జ్వాలాముఖి

ననువలచిన నా సఖి" - అని వర్ణించాడు. ఆమెను కౌగలించుకోవాలని ప్రయత్నిస్తే చేతులు కాలుతాయంటూ

"చూచుటకే ముగ్ధరాలు

లోలోపల ప్రౌడుకాలు

చల్లని చూపులతోనే

గిల్ల జాచు ప్రియురాలు" అని వర్ణించినపాడు.

**4.4. దేశభక్తి కవిత్వం:-** దాశరథి దేశం పట్ల, జాతి పట్ల అభిమానం నిలువెత్తు వున్నా. అది తెలంగాణా నవాబుకు వ్యతిరేకంగా సాగిన పోరాటంతోనే ప్రారంభమయింది. కాబట్టి దాశరథి దేశభక్తి కవిత్వాన్ని తెలంగాణా స్తుతితోనే ప్రారంభించవచ్చు.

**4.4.1. తెలగాణాప్రశంస:-** దాశరథి తెలంగాణా అభిమానాన్ని నవాబు నింద తెలంగాణా స్తుతి అని రెండు విధాలుగా గ్రహించవచ్చు. ముఖ్యంగా "అగ్నిధార" లో నవాబును

"ఓ నిజాము పిశాచమా ! కానరాదు

నిన్ను బోలిన రాజు మాఎన్నడేని" - అని తరువాత అదే "అగ్నిధార" లో

"దగాకోరు బడాబోరు రజాకారు పోషకుడవు

..................................

దిగిపోవోయ్ తెగిపోవోయ్

తెగిపోవోయ్ దిగిపోవోయ్" అని నిందించి వుండటం గమనింపవచ్చు. దాశరథి తన "రుద్రవీణ" కావ్యాన్ని తెలంగాణాకే అంకితమిచ్చాడు. "నను గని పెంచినట్టి కరుణామయి నా తెలంగాణా " అని ప్రస్తుతించాడు. తెలంగాణా విముక్తితో దాశరథి ఎంతో ఆనందాన్ని అనుభవించాడు. "నాడు నేడును తెలంగాణా మోడలేదు" అని తన గర్వాన్ని చాటుకున్నాడు.

**4.4.2. విశాలాంధ్ర ప్రశంస:-** "మూడు చెరుగుల నేలల మూడు కోట్లు ముడివడిన యట్లు కన్నుల ముందు తోచింది" అని మహాంధ్రోదయంలో విశాలాంధ్ర స్తుతి చేశాడు. అంతేగాక తెలంగాణా, ఆంధ్రలో వుండే తెలుగు వాళ్ళనే కాక ప్రపంచంలో తెలుగు వాడు ఎక్కడున్నా "తనవారితో తనని బంధించును వాణి" అని తెలుగు వాణిని స్తుతించాడు. ఇంకనూ "ధ్వజమెత్తిన ప్రజ" లో మలేషియాలోని తెలుగు వారికి ప్రస్తుతించిన తీరు గమనింపదగివుంది.

**4.4.3. భారతీయత:-** "అగ్నిధార" కావ్యంలో "జయభారతీ" ఖండికలో దాశరథి భారత దేశ ప్రాముఖ్యాన్ని, నాయకుల ఘనతను చక్కగా తెలియజేసాడు.

"మతం మరచి పొగలను - గతం విడిచి రాగలను

భారతీయుడను నేనని - పరవశించి పొగలను" అని "ఆలోచనాలోచనలు" లో 'నాదేశం ఆదేశం ఖండికలో తాదాత్మనం చెంది **భారతీయతను** ప్రస్తుంతించాడు దాశరథి. అట్లే "ధ్వజమెత్తిన ప్రజ" కావ్యంలో జాతీయ పతాకాన్ని భారత జాతి గౌరవం భద్రపరుచు **కేతనంగా** కీర్తించాడు.

ఇంతేగాక దాశరథి తన కావ్యాలల్లో ప్రస్తుతించిన నదీ-నదాల స్తుతులు, పుణ్యక్షేత్ర ప్రస్తుతులు, నాయకుల, సైనికుల ప్రశంసంలు **అతవి దేశభక్తిని** చాటి చెపుతున్నాయి.

**4.5. స్మృతి కవిత్వం:-** దాశరథిలో కనిపించే స్మృతి కవిత్వం పూర్తిగా దేశనాయక స్మృతి కవిత్వంగా గుర్తించవచ్చు. 1948 జనవరి 30 వ తేదీ గాంధీ గారు మరణించినపుడు "క్షమామూర్తి" ఖండికలను దాశరథి వ్రాశారు. ఇందులో గాంధీ గారిని" స్వామీ ! నరాకృత సత్యదైవమా" అని సంబోధించారు. అట్లే "కవితా పుష్పకం" లో నెహ్రూ మృతికి విలపిస్తూ "చిరంజీవి నెహ్రూ" అనే ఖండికలో "చని పోయావని యెల్లరు - జలజల కన్నీర్ గార్చిరి చిరంజీవివే నీవు - మరణం నీ కెక్కడిది" అని అంటూ ఎర్రగులాబీల్లో, హిమాలయ శిఖరాల్లో, గంగాయమునల సంగమంలో రైతుల హలాల్లో, కవుల కలాల్లో అన్నిటా నెహ్రూ వున్నాడంటాడు.

దాశరథి తన తొలికావ్యమైన 'అగ్నిధార' ను వట్టి కోట ఆళ్వారు స్వామికి స్మృతి చిహ్నంగా అంకితం మిచ్చాడు. ఆయన్ను పదమూడవ ఆళ్వారుగా కీర్తించాడు. 1962 లో చైనా యుద్ధంలో మరణించిన పరమ వీరచక్ర అబ్దుల్ హమీద్ ను వీరభిమన్యునితో పోల్చాడు దాశరథి. అభ్యుదయ భావాలు కలిగిన దాశరథి స్మృతి కవిత్వంలో బేలతనం, దుఃఖం అధికంగా కనబడవు. గతించిన వారి ధ్యేయాలు, సిద్ధాంతాలు ద్వారా ప్రేరితుడై ప్రజల్ని ఉత్తేజితుల్ని చేసినట్లుగా దాశరథి రచన సాగింది.

## 17.1.5 అభ్యుదయ శీలత:-

1930 తరువాత భావ కవిత్వం మీద వచ్చిన తిరుగు బాటును స్థూలంగా అభ్యుదయ కవిత్వమన్నారు. ఇది రెండు రకాల్లుగా కనిపిస్తుంది. అందు ఒకటి విషయ ప్రధానమయిన ప్రగతి వాద కవిత్వం, రెండవది వైచిత్రి మూలకమైన ప్రయోగవాద కవిత్వం. ఇందులో దాశరథి ప్రగతి వాద కవిత్వంగా మనం గుర్తించవచ్చు. దాశరథి తన కాలం నాటి సమాజ స్థితి నిర్మాణం ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని కలిగించాడు. వర్గస్పృహ, సామాజిక ప్రయోజనం లేని చరిత్రను దాశరథి నిరసించాడు. సమకాలీన బూర్జువా వ్యవస్థను నిశితంగా విమర్శించాడు. దానితో పాటు విప్లవ ప్రబోధం చేశాడు. వీరగాథా కథనం వినిపించాడు. సామ్యవాద ధోరణిని తెలిపాడు. వసుధైక కుటుంబ దృష్టిని ప్రేరేపించాడు. దాశరథి కవిత్వంలో యుద్ధ విముఖత, శాంతి ప్రియత్వం, శాస్త్ర విజ్ఞాని, ఆశావాదం స్పష్టంగా కనిపిస్తాయి. ఇవన్నీ కూడా ఆతని అభ్యుదయ శీలతకు ఉదాహరణలుగా గ్రహించవచ్చు. దాశరథి అభ్యుదయ శీలతను కొన్ని విభాగాలుగా చేసి తెలుసుకోవచ్చు.

5.1. సమాజ స్థితి-చిత్రణ:- ఫ్యూడల్ సమాజాన్ని సంస్కరింప తల పెట్టిన మహాకవి గురజాడ. బూర్జువా వాస్తవికలను చిత్రిస్తూ సామ్యవాదపు ఊహలు ప్రతిబింబ చేసినవాడు శ్రీ. శ్రీ. బూర్జువా వ్యవస్థ మీద తిరుగుబాటు ధోరణిలో ఎందరో కవితలను అల్లారు. అందులో అగ్రగణ్యుడు దాశరథి. పీడితుల్లో చైతన్యం నింపడానికి దాశరథి తన కవితను ఆయుధంగా మలుచుకున్నాడు.

అగ్నిధార లో కవితా కూపం అనే ఖండికలో

"ఇది లోకం

నరలోకం

నరకంలో లోకం నరలోకం" అంటూ ఇలాంటి లోకంలో రక్తానికి, ప్రాణానికి, శ్రమకు, సౌజన్యానికి, రచయితకు, శ్రామికునికి విలువు లేవు అంటూ బాధను వ్యక్తం చేశాడు.

అగ్నిధారలోని 'శ్రామిక జాతి' ఖండికలో ఎటు చూచినా వేదన తప్ప మరేమి లేదని లోకం నిండా ఎక్కువ శాతం నిరుపేదలే అంటూ "రైతు కూలీ ప్రజలంతా ధనికుల పాదాల క్రింద చీమల వలె చితికినారు." అని వివరించాడు.

పునర్నవంలో కనిపించినదంతా కవితగా, కైతగా రాసేస్తున్నాను అనే ఖండికలో "ముష్టిలోకం తనమీద ఇష్టం వచ్చినట్టుగా అతన్ని అష్టైశ్వర్యాల వారు" అని అంటూ తరువాత "అనాధుడి కడుపులోని అంగారం ఆరాటం అతడి కళ్ళల్లోకి అశ్రువుల లోతులు" అని చెపుతూ సమాజ స్థితిని వ్యక్తీకరించాడు. ఈ విధంగా అభ్యుదయ భావం కలిగిన దాశరథి కవితలలో సమాజ స్థితిని మనం గుర్తించవచ్చు.

5.2. గత విరావం:- The random house dictionary లో చరిత్రకు నిర్వచనం ఈ విధంగా ఉంది. "a continuous systematic narrtive of past events as relating to a particular people, country period etc, usually return in chronologica order" ఈ నిర్వచనాన్ని సామ్యవాద దృక్పదం కలిగిన అభ్యుదయ కవులు కోరేది ప్రయోజనాత్మక చరిత్ర. అంటే సమాజ స్థితిని ప్రతి బింప చేసే చరిత్ర.

"The essemce of history lies in the evolution of an entire people as society rather than individuals" అన్న దానిని అభ్యుదయ కవులు చరిత్ర నిర్వచనంగా అంగీకరించినట్లు తెలుస్తుంది.

దాశరథి తన రుద్రవీణలో రుధిర దీపిక అనే ఖండికలో "పెద్దల విద్యావంతుల తరతరాల బూజుల పట్టి పాత గాజుల విలువలు' ' అని ఈసడించుకున్నాడు. గతాన్ని నిర్వచించడంతో పాటు వర్తమానం లోని బూర్జువా వ్యవస్థను కూడా దుయ్య బట్టాడు. కొందరు కోటీశ్వరులుగా మరికొందరు అష్టదరిద్రులుగా ఉండే వ్యవస్థ నాశనం కావాలని దాశరథి ఆశించాడు. "కూలి ఎక్కువ ఇమ్మంటే పేదల రక్తంతో పోలీసుల హోళీ పండుగ" అని అంటూ బూర్జువా వ్యవస్థను చిత్రించాడు. అట్లే అగ్నిధారలో అనంత సంగ్రామం అనే ఖండికలో శ్రమకు తగిన ఫలితం ఇమ్మని శ్రామికులు కోరితే దాన్ని అతివాదంగా తిరుగుబాటుగా ధనికులు భావించడాన్ని దాశరథి ఖండించాడు.

దాశరథి ధనికుల దౌష్ట్యాల్ని వర్ణించడమే కాక పీడితుల శక్తిని కూడా వారికి గుర్తు చేశాడు. "పొగలుతున్న భూగర్భం పగులు నున్న జ్వాలాముఖి చిప్పుపట్టిన స్నిగ్ధాటవి పిడుగులురలు పెను మేఘం అరగళ గత హాలా హలం శ్రమిక జాతి కదిలింది. అని అగ్నిధారలో శ్రమిక ఖండికలో వర్ణించాడు.

5.3 విప్లవ-ప్రబోధం:- "బూర్జువా వ్యవస్థ స్థితికి నిరాశ పడకుండా శ్రామికులలో చైతన్యాన్ని కలిగిస్తూ కవిత రాసిన మహాకవి దాశరథి. అగ్నిధారలో నిరుపేద అనే ఖండికలో బరువులతో శిరము వంచి ధోకా చెందిన నిరుపేద శ్రమ విలువను గమనించని అమాయకుడా! అన్నార్తుడా !" అంటూ వారి శక్తిని వారికి గుర్తు చేశాడు. అదే విధంగా రుద్రవీణలో రుధిర దీపిక ఖండికలో" ఓ తంద్రి లయ రుద్రమహోను భావ ప్రియ విశ్వశ్రామిక దేవ అంటూ శ్రామికుల్ని ప్రోత్సహించాడు. పీడితుల్ని తాడితుల్ని ముందుకు నడిపించాల్సిన బాధ్యత కలిగిన యువకుల్ని, కవుల్ని, కథకుల్ని ఉత్తేజ పరుస్తూ అగ్నిధారలో అనలదాహం అనే ఖండికలో అంటాడు.

భవితవ్యపు హవనానికి ఊతలు మాతన భూతల నిర్మాతలు మీరే మీరే తాను కూడా తన బాధ్యతను గుర్తెరిగి ప్రవర్తిస్తున్నాని నిరుపేదల కోసం తనకు చేతనైన సహాయం చేయాలని తపనలో వున్నానని అగ్నిధారలో నిరుపేద అనే ఖండికలో ఇలా అంటున్నాడు. "నిరుపేదా నేను కూడా

నీ కోసం ఆకలితో చచ్చెనో
నా కలాన్ని రూకలపై
అమ్ము కోచ్చేనా !"

**5.4. సామ్యవాద ధోరణి :-** దాశరథి కాక్షించింది సామ్యవాదం, ప్రజాసామ్యం. అందుకే "రానున్నది ఏది నిజం, అది ఒక్కటే సోషలిజం" అని ఎలుగెత్తి చాటాడు. ఉన్నంతలో ఉన్నదానిని అందరూ పంచుకొని జీవించడమే సామ్యవాదం అని రుద్రవీణలోని రానున్నది అనే ఖండికలోను పునర్నవం లోని బాల్యం ఖండికలోను గట్టిగా చెప్పినాడు - దాశరథి. అగర్భశ్రీమంతులు అనాధలు, జమిందార్లు-రైతులు, మిల్లు ఓనర్లు కూలీలు, రాజు సైనికులు ఈ పరస్పర భేదాన్ని గుర్తుంచుకొని లోకానికి తెలియజెప్పడమే అభ్యుదయ కవితగా భావించాడు దాశరథి.

పైన పేర్కొన్న వ్యత్యాసాల మధ్య ఎప్పుడూ సంఘర్షణ తప్పదు. ఈ సంఘర్షణకు కవితా రూపం ఇచ్చినవాడు దాశరథి. అందుకే ఆలోచనాలోచనలులో స్వాతంత్ర్య మాస అనే ఖండికలో "ఆ మిల్లు నీది కాదు ఈ ఇల్లు నాది కాదు కలవాడు లేనివాడు అనుమాట పనికి రాదు" అంటాడు దాశరథి.

ఊక దంపుడు ఉపన్యాసాల మీద అర్థం లేని నినాదాల మీద దాశరథికి నమ్మకం లేదు. ఆర్థిక వ్యవస్థ మారాలన్నదే దాశరథి ధ్యేయం. అందుకే తిమిరంలో సమరంలో అక్షర నక్షత్రమాల అనే ఖండికలో "ప్రజాస్వామ్య సామ్యవాద ధ్వజం ఎగురగలగాలి ఉగ్రవాద నగ్నవాద రుగ్నబాధ తొలగాలి" అని ఎలుగెత్తి చాటాడు.

**5.5. వసుదైక కుటుంబ దృష్టి :-** వసుదైక కుటుంబ దృష్టితో రచనలు చేసిన అభ్యుదయ కవుల్లో దాశరథి ప్రముఖుడు. పునర్నవంలో నా పేరు ప్రజాకోటి అనే ఖండికలో "తెలంగాణా లోని కోటి దీపల గళ ధ్వనినే గాక ఇలా గోళ మందుండెడి ఎల్లరి శబ్దాన్ని నేను" అని తన దృష్టి వైశాల్యాన్ని వ్యక్తం చేశాడు.

అదే విధంగా కవితా పుష్పకం కావ్యంలా పూల జెండాలు అనే ఖండికలో కుల మతాల సంకుచితత్వపు గోడల్ని పడదోస్తూ ప్రపంచంలో ఏ మారుమూలలో శ్రామికుడు హింసింపబడుతున్నా ప్రజాస్వామ్యం దెబ్బతింటూన్నా దాశరథి ఇక్కడనుండే కవితా చరాల్ని సంధించాడు. పునర్నవంలో జ్యోతిశ్చక్రం అనే ఖండికలో "విశాల విశ్వం నిండా పేదలది ఒక్కటే జాతి" అని ప్రపంచంలో దోచుకొనే జాతి, దోచుకొబడే జాతి అనేవి రెండే ఉన్నాయని ఎలుగెత్తి చాటాడు.

అట్లే రుద్రవీణలో రుధిర దీపిక అనే ఖండికలో "లే తండ్రి లయ రుద్రమహాను భావ ప్రియ విశ్వశ్రామిక దేవ" అని సంభోదించడంలో ఆతని వసుదైకతత్వం వ్యక్తమవుతుంది.

## 17.1.6. సమీక్ష :

దాశరథి కవిత్వంలో ఆశావాదం, యుద్ధ విముఖత, శాంతి ప్రియత్వం, శాస్త్ర విజ్ఞానం ఈ మొదలైన అంశాలన్నీ చోటు చేసుకున్నాయి.

అతి నవ్య కవులు విజ్ఞాన శాస్త్రాన్ని ఆధారంగా చేసుకొని భావ వ్యక్తీకరణంలో వైచిత్రిని సాధించారనడం నిర్వివాదాంశం. అలాంటి వారిలో దాశరథి అగ్రగణ్యులు.

దాశరథి కవిత్వంలో భావానికి, రూపానికి చక్కని బంధం వుంది. దాశరథి కవిత్వంలో కాల్పనిక భావనల అభ్యుదయ భావనల సమ్మేళనం కవిపిస్తుంది. అభ్యుదయ శీలమైన భావాల్ని ఎంత తీవ్రంగా దాశరథి వ్యక్తం చేస్తాడో అంతే తీవ్రంగా ప్రణయ భావాన్ని కూడా

ఒక్కొక్కసారి వ్యక్తం చేస్తాడు. అతని కవిత్వాన్ని త్రిపురనేని గోపీచంద్ గారు తుఫానుతో పోల్చాడు. ఆధునిక సాహిత్య రంగంలో తనకంటూ దాశరథి ఒక సుస్థిర స్థానాన్ని పదిల పరుచుకున్నారు.

## ప్రశ్నలు

1) దాశరథి సాహిత్య నేపథ్యానికి జీవిత నేపథ్యం గట్టి పునాది - వివరించండి.
2) దాశరథి రచనలను స్థూలంగా పరిచయం చేయండి.
3) దాశరథి కవితా వస్తుతత్త్వాన్ని పరామర్శించండి.
4) దాశరథి ప్రణయ, దేశభక్తి, స్మృతి కవితలను వివరణాత్మకంగా తెలపండి.
5) దాశరథి అభ్యుదయ శీలతను పేర్కొనండి.

## ఆధార గ్రంథాలు


1. ఆంధ్ర శతక సాహిత్య వికాసము. - గోపాలకృష్ణారావు.కె.
2. ఆధునికాంధ్ర కవిత్వము, సంప్రదాయములు - ప్రయోగములు - నారాయణరెడ్డి.సి.
3. చరిత్రాత్మక తెలంగాణా పోరాటం - రాజేశ్వరరావు చంద్ర.
4. తెలంగాణా ఆంధ్రోద్యమము (ప్రథమ, ద్వితీయ భాగాలు) - హనుమంతరావు మాడుపాటి.
5. దాశరథి కవిత - ఒక పరిశీన - శ్రీమతి రమాదేవి.ఎ
6. దాశరథి కవితా దర్శనము - లలితకుమారి.డి.
7. దాశరథి కవితా సమాలోచన - చంద్రమౌళి.ఇ.


డా॥ జి.డి. నాయుడు

పాఠం - 17.2

# కుందుర్తి

**పాఠ్య నిర్మాణ క్రమం**

17.2.1 జీవిత నేపథ్యం

17.2.2 సాహిత్య నేపథ్యం

17.2.3 కుందుర్తి వచన కవితా రీతులు

17.2.4 అభ్యుదయ వాద ప్రభావం

17.2.5 ముగింపు

**లక్ష్యం :**

కుందుర్తి వారి జీవిత విశేషాలను గురించి, సాహిత్యము, వచన కవితా రీతులను గురించి సమగ్రంగా తెలుసుకోవటం.

## 17.2.1. జీవిత నేపథ్యం :

కుందుర్తిగ ప్రసిద్ధుడైన ఈ వచన కవితా పితామహుని పేరు కుందుర్తి ఆంజనేయులు. ఇతడు గుంటూరు జిల్లా నరసరావు పేట తాలూకా కోట వారి పాలెంలో నరసమ్మ, కామయ్యలకు 1922, డిశంబరు 16వ తేదీ జన్మించాడు. చిన్ననాడే తండ్రి మరణించడం చేత తల్లి సంరక్షణలోనే పెరిగాడు. బాల్యం నుంచి ఇతని విద్యాభ్యాసం వినుకొండలో సాగింది. తరువాత 9వ తరగతి నుంచి ఎస్.ఎస్.ఎల్.సి. వరకు విజయవాడ మున్సిపల్ హైస్కూల్‌లో పూర్తి చేశాడు. విజయవాడలోనే ఎస్.ఆర్.ఆర్. కాలేజీలో 1941లో ఇంటర్మీడియేట్ పూర్తి చేశాడు. 1943లో గుంటూరు ఎ.సి. కాలేజీలో బి.ఏ. పట్టా పుచ్చుకున్నాడు. 1942లో సుందరమ్మతో వివాహం జరిగింది.

కుందుర్తి నిర్వహించిన మొదటి ఉద్యోగం ఆంగ్ల భాషా పండితుడు. తెనాలి తాలూకాలోని రేవేంద్రపాడు నేషనల్ కాలేజిలో ఆంగ్ల భాషా బోధకుడుగా ప్రిన్సిపాల్‌గా పని చేశాడు. తరువాత తన స్వగ్రామమైన కోటవారి పాలేనికి 1944లో మునసబు అయినాడు. 1946లో గుంటూరు టుబాకో మార్కెటింగ్ కమిటీ ఇన్‌స్పెక్టర్ పదివిని పొందాడు. 1956లో కర్నూలులో ఇన్‌ఫర్మేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్ అనువాదకుడుగా పదవి పొందాడు. 1965లో మహబూబ్ నగర్‌లోను, 1966లో హైదరాబాదులోను ఆ పదవినే నిర్వహించాడు. 1977 డిశంబరులో ఆంధ్ర ప్రదేశ్ తెలుగు మాస పత్రికకు సంపాదకుడుగా ఉంటూ ఉద్యోగ విరమణ చేశాడు.

పెక్కు ప్రాంతాల్లో ఎన్నో ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన కుందుర్తికి ఎందరో కవి మిత్రులు ఏర్పడ్డారు. ముఖ్యంగా విశ్వనాథ సత్యనారాయణ గారికి ఆంజనేయులు ప్రత్యక్ష శిష్యుడు. అట్లే జాషువాతో కుందుర్తికి మంచి పరిచయముంది. అందుకే కుందుర్తి "జాషువా, విశ్వనాథ తెలుగు కవిత్వంలో రెండు రకాల శైలులకు ఏకైక ప్రతి నిధులుగా ప్రసిద్ధి పొందారు. వీరిద్దరి పరిచయం కలగడం నాకు కలిగిన అపూర్వమైన ఒక అవకాశం అని నేను అనుకొంటాను" అని చెప్పుకున్నాడు. కుందుర్తికి ఇంటర్మీడియేట్ చదివే రోజుల్లోనే బెల్లంకొండ రామదాసు, ఏల్చూరు సుబ్రమణ్యం మొదలైన వారితో పరిచయం కలిగింది. అట్లే బెజవాడ రామ్మోహన్ గ్రంథాలయంలో పోలూరి ఆంజనేయ ప్రసాదు, పల్నాడులోని జానపాడులో పట్టాభిరామిశాస్త్రి పరిచయాలు కుందుర్తిలో సాహిత్యాభిమానాన్ని రేకెత్తించాయి.

ముదికొండ వీరభద్రమూర్తి, కోట వీరాంజనేయ శర్మ, అబ్బరాజు శర్మ, పుంకలి శ్రీ రామమూర్తి మొదలైన సాహితీ మిత్రుల పరిచయంతో కుందుర్తికి అష్టావధానం, ఆశు కవిత్వం బాగా అబ్బినాయి.

ఆధునికాంధ్ర కవిత్వంలో లబ్ధ ప్రతిష్ఠులైన శ్రీశ్రీ, దాశరధి, ఆరుద్ర, సోమ సుందర్, తిలక్, అజంతా, నారాయణ రెడ్డి, శేషేంద్ర శర్మ, గుత్తి కొండ సుబ్బారావు, గోపాల చక్రవర్తి, శీలా వీర్రాజు, అద్దేపల్లి రామ్మోహన్ రావు, సుప్రసన్న, తుమ్మల సీతారామమూర్తి, నిడుమతి ఉమామహేశ్వరరావు, సంపత్‌కుమారు, వరవరరావు, దేవులపల్లి రామానుజరావు, వేములపల్లి కృష్ణ, నాయని కృష్ణ కుమారి మొదలైన కవి పండిత విమర్శకులతో కుందుర్తికి సన్నిహిత సంబంధం ఏర్పడింది.

### 17.2.2. సాహిత్య నేపథ్యం :

చదువు కుంటున్న రోజుల్లో నుంచి మహా కవులతోను, పండిత విమర్శకులతోను సన్నిహిత సంబంధం కలిగి ఉండడం చేత కుందుర్తిలో ఆ సాహితీ వాసనలు బాల్యం నుండే గుబాళించినాయి.

1944 ప్రాంతంలో గుంటూరులో ఉన్న కాలంలో మిత్రులతో కలసి కవిత్వంపై చర్చలు సాగించేవాడు. ఆ కాలంలోనే అభ్యుదయ కవిత్వాన్ని గురించిన చర్చ వారి మధ్య సాగేది. అభ్యుదయ కవిత్వ ప్రచారక బీజం కుందుర్తిలో ఇక్కడే పడింది. తరువాత అనిశెట్టి సుబ్బారావు, ఏల్చూరి సుబ్రమణ్యం మొ॥ వారితో కలిసి నరసరావు పేటలో నవ్య కళా పరిషత్తు స్థాపించడం జరిగింది. ఈ పరిషత్తులో కుందుర్తి ముఖ్య వ్యవహర్త. ఈ పరిషత్తు ద్వారానే 1944లో 'నయాగారా' కవితా సంపుటి వెలుగులోనికి వచ్చింది.

1936లో భారత దేశంలో అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది. ఆంధ్ర దేశంలో కూడా దానికి అనుబంధంగా ఒక ఉప సంఘం ఏర్పడింది. ఈ సంఘం ఏర్పాటుకు నవ్య కళా పరిషత్తు కూడా తన వంతు సాయం చేసింది. కొంత కాలం తరువాత కుందుర్తి ఆ సంఘంలో చేరి ఆ సంఘ పురోగతికి ఎంతో కృషి చేశాడు.

ఉద్యోగ రీత్యా కర్నూలు, మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లలో ఉంటున్న కుందుర్తి 1966లో హైదరాబాదుకు వచ్చినపుడు "ఫ్రీవర్స్ ఫ్రంట్ సంస్థ" ఏర్పడడానికి ముఖ్య కారకుడయ్యాడు. "ఫ్రీవర్స్ ఫ్రంట్ సంస్థ" వచన కవితా ప్రచారం కోసం ఆదేశింపబడింది. ఈ సంస్థ ద్వారా అనేక వచన కవితలు వెలుగులోనికి వచ్చాయి. అందులో కుందుర్తి 'నగరంలో వాన' 1967లో ఈ సంస్థ ద్వారానే ప్రచురింపబడింది.

### 17.2.3. కుందుర్తి వచన కవితా రీతులు :

"కవిత్వం కొద్దిగా రాసినా ఎక్కువగా రాసినా తన సొంతమని చెప్పుకోదగిన శైలిని స్థాపించుకోలేని వాడు సాహిత్య చరిత్రలో నిలదొక్కుకోలేడు." అని కుందుర్తి 'అమృతం కురిసిన రాత్రి' కి పీఠిక వ్రాస్తూ చెప్పాడు. అతను చెప్పిన ప్రత్యేకత అతని కవితారీతుల్లో మనం స్పష్టంగా గమనించవచ్చు. వచన కవిత్వంలో తన దైన ముద్రను స్థాపించుకున్నవాడు కుందుర్తి. కుందుర్తి తన జీవితాన్నంతా వచన కవిత్వం కోసం, వచన కవిత్వాన్ని సామాన్య మానవుని కోసం అంకితం చేశాడు. కుందుర్తి వచన కవిత్వంలో సంప్రదాయ ముద్ర అభ్యుదయ ప్రభావం అనుభూతి వాద ప్రస్తరణ, మానవతా వాదవిస్తరణ ధ్వని వ్యంగ్య వైభవాలు సూక్తివైచిత్యం అనే అంశాలు పరిశీలింపదగినవి.

**3.1. సంప్రదాయ ముద్ర :** కుందుర్తి సంప్రదాయ ముద్ర విషయాన్ని ప్రస్తావిస్తూ అద్దేపల్లి రామ్మోహన్ రావు ఇలా అన్నాడు. "కాలాన్ని బట్టి మొదటి వరసలో నిలబడ్డ అభ్యుదయ కవులు చాలా మందికి ఈ సంప్రదాయక భావ ప్రభావం చాలా అధికం గానే కన్పిస్తుంది. వాళ్ళు సంప్రదాయంలో పుట్టి, సంప్రదాయంలో పెరిగి, నరనరాన సంప్రదాయాన్ని జీర్ణింప జేసుకొని దాంట్లో నుంచి ఆధునిక భావాల్ని మధించి వెలికి తీయడానికి కృషి చేసిన వాళ్ళు ఆ మొదటి వరుస అభ్యుదయ కవులలోను, కుందుర్తిలోను ఈ సంప్రదాయకత చాలా ఎక్కువగా కనబడుతుంది." అద్దేపల్లి రామ్మోహన్‌రావుగారి ఈ వివరణ అక్షర సత్యం.

అభ్యుదయ కవులు భావ కవిత్వంపై తిరుగుబాటుతో అభ్యుదయ కవిత్వాన్ని సృష్టించుకున్నారు. అయినా అభ్యుదయ కవుల రచనల్లో అక్కడక్కడ ప్రాచీన పౌరాణిక సంప్రదాయ ప్రభావం, ప్రాచీన కవుల కవితారీతుల ప్రభావం కనబడుతుంది. కుందుర్తి మాటికి నూరుపాళ్ళు ప్రాచీన సాహిత్యాన్ని అంగీకరించక పోయినా ఆయన కవిత్వంలో కూడా ప్రాచీన సంప్రదాయ ప్రభావం కొంత కన్పిస్తుంది.

అద్దేపల్లి రామ్మోహన్‌రావు, కుందుర్తి కవితలో సంప్రదాయక ముద్ర ఉండటానికి రెండు కారణాలు చెప్పాడు. అందు ఒకటి

సాహిత్యపరమైన ఒక బలాన్ని తన భావాలకి శిల్ప రూపంలో ఆపాదించడం కోసం అని, రెండవది, తాను తలపెట్టిన సామాన్యుల వస్తువుకి, సామాన్యుల భాషకి అభ్యుదయోద్యమానికి గుర్తింపుకోసం అని రామ్మోహన్‌రావు అభిప్రాయం. ఈ రెండు కారణాలు అంగీకరిస్తూనే కవిత్వం ఎఫెక్టివ్‌గా ఉండడం కోసం అని చంద్రశేఖర్ తన పరిశోధనా వ్యాసంలో పేర్కొన్నాడు.

వచన కవిత్వంలో అభ్యుదయ భావాల్ని మార్క్సీయ దృక్పథంతో చెప్పిన కుందుర్తి రచనల్లో సంప్రదాయ ముద్రని మూడు రకాలుగా విరంగడించుకోవచ్చు.

1. పౌరాణిక సంప్రదాయ కత
2. ఛందో సంప్రదాయ కత
3. భావ కవితా సంప్రదాయకత

**3.1.1. పౌరాణిక సంప్రదాయకత** : సంప్రదాయాన్ని గూర్చి కుందుర్తి

"సంప్రదాయాన్ని మన్నించడమంటే
సమస్తం అనుకరించడం కాదు
అవసరం లేని అనేక బంధాలను
కావాలని కనికరించడం కాదు
క్రొత్తను కొందరు ద్వేషించడం కద్దు
అయినా పాత మా పునాది
నన్నయ నుండి నా దాకా
తెలుగు కవిత అంతా నాది" అని అన్నాడు.

కుందుర్తిలో పౌరాణిక సంప్రదాయ ముద్ర హిందూ సంప్రదాయానుసారం వచ్చి చేరిందిగా కనిపిస్తుంది. ఉదా : కు

"అమాయక హృదయాలలో
రగిలిన విప్లవ జ్యోతులు
మన్య సముద్రంలో
చల రేగిన అవమాన
బడవాగ్ని జ్వాలకు
రాజుకున్నాయి. ప్రభుత్వ భవనాలు."

ఇందులో చక్కని పౌరాణిక సంప్రదాయం కనిపిస్తుంది. మన్యాన్ని కుందుర్తి ఒక సముద్రంగా భావించాడు. మన్య ప్రజల్లో అణిగి వున్న విప్లవాన్ని బడవాగ్నితో పోల్చాడు. పురాణాల్లో సముద్రంలో దాగి ఉండే అగ్నిని బడ బాగ్నిగా చెప్పారు. ఇది గుర్రం ఆకారంలో సముద్ర గర్భంలో దాగి ఉంటుందని చెపుతారు. బడబాగ్ని బయటికి వస్తే ఎంత తీవ్రంగా ఉంటుందో మన్యం ప్రజల్లో విప్లవం రేగితే అంత తీవ్రంగా ఉంటుంది అంటాడు ఈ కవి.

అట్లే మరొక్క ఉదాహరణ మనం గమనించ వచ్చు.

"తమ బలం తాము తెలుసుకుంటారు ప్రజల హనుమలు అశోక లోకపు ధర్మ వెలుగు కంఠాలు ప్రజల హనుమలు" హనుమంతుడు తన శక్తిని తాను తెలుసుకోలేనివాడు. ఎవ్వరైనా అతని శక్తిని అతనికి తెలియజేస్తే అతన్ని ఇంకెవ్వరూ నిరోధించలేరు. అతడు చిరంజీవి. అతడు ఈ లోకంలో సాధించలేనిది లేదు. అట్లే ప్రజలు తమ బలం తాము తెలుసుకొని ముందుకు దూకితే ఆ ప్రజా విప్లవం ముందు ఏదీ ఆగదని కవి భావం. ఇలాంటిదే మరొకటి.

"పోరాటం రావటం తెలిసినా
ఆలోచనల అభిమన్యుల సహస్రం నందు
అధికారం నిర్మించిన
పద్మ వ్యూహాలు పని చేయటం లేదు."

భారత యుద్ధంలో పద్మవ్యూహం లోకి వెళ్ళడం మాత్రమే తెలిసి తిరిగి రావడం తెలియని అభిమన్యుడు వీరమరణం పొందాడు. అయితే తెలంగాణా పోరాటంలో పాల్గొంటున్న వీరులకు అడవులలోనికి వెళ్ళడమేకాదు తిరిగి రావడం కూడా తెలుసని వారు పద్మ వ్యూహం లాంటి ప్రభుత్వాన్ని ఛేదిస్తారని కుందుర్తి అంటున్నారు.

భారతంలో అప్రధానులలో ప్రధానమైన పాత్ర వికర్ణుడు. ఈ వికర్ణుని ప్రశక్తిని తెచ్చాడు కుందుర్తి ఆంజనేయులు.

"చీకట్లో మా కళ్లు చూడటం లేదా అన్నాడు.

అందులో ఒక వికర్ణుడు" అని కుందుర్తి ప్రయోగం. భారతంలో ద్రౌపది పరాభవ సమయంలో ద్రౌపది ప్రశ్నకు సమాధానం చెప్పవలసిందిగా కురు సభను కోరినవాడు వికర్ణుడు. ఇతడు కౌరవులలో ఒకడు. అట్లే బలహీనులపై అత్యాచారాలు చేస్తున్న పోలీసుల్లో కూడా వికర్ణుని లాంటి వాళ్ళు ఒకరో, ఇద్దరో ఉంటారని కుందుర్తి చెప్పాడు.

మహా కవి కాళిదాసు "వాగార్థా వివ సంపృక్తౌ" అన్న ప్రసిద్ధ శ్లోక భావాన్ని కుందుర్తి ఇలా చెప్పాడు.

"అర్థాన్నో శబ్దాన్నో నేను
అవగతం కావడం లేదు
అర్ధనారీశ్వరుడిలా ఈ మేను
చెరి సగం పంచుతాను" అని తన కవితా తత్వాన్ని కూడా పౌరాణిక అంశంతోనే ముడిపెట్టి చెప్పాడు.

కుందుర్తి వచన కవితలో విశ్వామిత్రుడు, పురూరవుడు, నారదుడు, శ్రీవాణి, అభిమన్యుడు, హనుమంతుడు, భూదేవి మొ॥న వ్యక్తుల ప్రశక్తి మనం చూడవచ్చు. అంతేగాక కల్ప తరువు, బ్రహ్మాస్త్రం, ప్రళయం, పద్మవ్యూహం, ఆగ్నేయాస్త్రం, పిండాలు, శాపం ఇలాంటి విషయాల ప్రశక్తిని మనం చూడవచ్చు.

కుందుర్తి పురాణ ఘట్టాల్ని, పురాణ వ్యక్తుల్ని స్మరించడమే గాక శ్రీ కృష్ణుని ధర్మదీక్ష, హరిశ్చంద్రుని సత్య సంధత మొదలైన పురాణ ప్రసిద్ధ అంశాలను కూడా తన వచన కవితలో ప్రతిబింబింప చేశాడు.

**3.1.2. ఛందో సంప్రదాయత :** కుందుర్తి రచనలలో ప్రాచీన ఛందో సంప్రదాయత కొన్ని కవితలలో కనిపిస్తుంది. ముఖ్యంగా కుందుర్తి తొలి రచనలు కొంత ఛందో సంప్రదాయాన్ని కలిగి ఉన్నాయి. అందులో రసధ్వని, అమావాస్య, నా ప్రేయసీ, సౌస్తికం వంటి రచనలు గుర్తింప దగి వున్నాయి. ఇవేకాక వీధి మానిసీ, తెలుగు బౌద్ధం వంటి రచనలు వచన కవితలే అయిన కొంత ఛందో సంప్రదాయం కనబడుతుంది.

ఉదాహరణకు : వీధి మానిసిలో

"నిను గుర్తించితిన్
హృదయ నేరజమప్పటి కప్పుడే
తనంతన ముఖులించుకొన్నప్పుడు
దాగని సత్యము వోలె గాయమెత్తిన బ్రతుకెల్ల" అన్నది గుర్తింప దగి వుంది. ఇందులో చంపకమాల వృత్తాన్ని కవి భావ ప్రధానంగా విడదీసి వచన కవితా పంక్తిలా రాశాడు. అట్లే తెలుగు బౌద్ధమనే ఖండికలో కూడా మత్తేభ విక్రీడితాన్ని విడదీసి వచన కవితగా వ్రాసి ఉండడం గమనించవచ్చు.

"మరచెన్ భారత జాతి ద్వేషం
అహింసా ధర్మ సందిగ్ధిలో తెరచెన్ క్రొత్త కవాటముల్
వెలుగు లొత్తెన్ దేశ దేశాలలో
దూరముల్ రేపిన రాజనీతుల పునాదుల్ కూలిపోయ్యెన్"

ఇంతేగాక కుందుర్తి ఛందో సంప్రదాయతలో మరొక నవీన పద్ధతిని మనం చూడవచ్చు. ఉత్పలమాల వృత్తములో ప్రారంభించిన కవిత క్రమ క్రమంగా వచన కవితలోకి మారడం సమస్యలు అనే ఖండికలో మనం చూడవచ్చు.

"సాగిన తత్త్వ శాస్త్రపు కొసల్..............
.......................................................
.......................................................
.................................సాగితి మ్రొక్కె కళా రహస్యముల్"
అని ఉత్పలమాల రాసి వెంటనే సమస్యలు నా కవితా
శక్తి. ....................................................................
పురా రూపమెత్తిన కవికి" అని వచన కవితా పంక్తులు రాశాడు.
కుందుర్తి చంధో సంప్రదాయంలో
మాత్రా చంధస్సును కూడా మనం గమనించవచ్చు.
ఉదాహరణ : మన్యం అనే కవితలో
"విదిలించిన వీరుని ఖడ్గం
పగబట్టిన పాము బుస
చూపించిన విప్లవ మార్గం" అని త్రిశ్ర గతిలో నడిపాడు అలాగే చతురస్ర గతిలో కూడా కవిత చెప్పిన వాడు కుందుర్తి జయిస్తుంది అనే ఖండికలో.........................................................
"గడిచిన చరిత్ర
యుగ సంధుల్లో
..............................
..............................
మానవ జాతికి
విముక్తి నేడే" అని ఉండడం గమనించవచ్చు.

తొలుత సంప్రదాయ చంధో కవితల్ని ఆపైన మాత్రా చంధస్సులతో కూడుకున్న కవితల్ని అటు తరువాత వచన కవితల్ని కుందుర్తి చేపట్టి తన కవిత్వంలో - చంధో వైవిధ్యాన్ని ప్రదర్శించాడు.

**3.1.3. భావ కవితా సంప్రదాయత :** కుందుర్తిలో అక్కడక్కడ భావ కవితా సంప్రదాయం కూడా కనిపిస్తుంది. భావ కవులలో కనిపించే బలమైన వాదం కుందుర్తిలో కొన్ని సందర్భాలలో దర్శనం ఇస్తుంది. సమాజంలోని మనుష్యుల క్రూరత్వానికి భయపడిన కుందుర్తికి అరణ్యమే శరణ్యంగా కనిపించింది. అందుకే అచ్చం భావ కవిలాగా ఇలా అంటాడు.

"రా తమ్ముడు పోదాం
అనంత సౌందర్యంలోకి
పచ్చని గడ్డి మైదానాల మీద
ప్రభాతం మెరుస్తున్న చోటికి

ఎడదలో కరుణ జడివానల కురుస్తున్న చోటికి"

ఇందులో భావ కవిత స్పష్టం - భావ కవుల పలాయనా వాదమే గాకుండా ప్రకృతి ప్రియత్వాన్ని కూడా కుందుర్తిలో మనం చూడవచ్చు.

**ఉదాహరణకు :**

"హేమంత కాంత చీమంత చీమలో
వ్రేలాడుతున్న ముత్యాల వరుసలా
ప్రతి చెట్టు మీద ప్రతి గుట్ట మీద
పరచుకున్నది దళసరి మంచు" అని సంక్రాంతి సూర్యుడిలో వర్ణించాడు. 'నగరంలో వాన' అనే కవితా సంపుటిలో కూడా భావ కవితా ఛాయలు కన్పిస్తున్నాయి. భావ కవితా శాఖల్లో బాగా ప్రచారంలోకి వచ్చిన స్మృతి కవితా ధోరణులు కూడా కుందుర్తి వచన కవిత్వంలో మనం చూడవచ్చు.

అయితే భావ కవితా సంప్రదాయమైన ప్రేమ తత్త్వాన్ని కుందుర్తి వ్యంగ్యంగా విమర్శించి ఉండడం ఈ క్రింది పంక్తుల్లో కనిపిస్తుంది.

"ఊర్వశి పాపం ఎక్కడో ఉరివేసుకొని ఉంటుంది.
హృదయేశ్వరీ కనిపించడం లేదు
గిరి కుమారుడు కొండ గుహలలో దాగుకున్నాడు
అభ్యుదయ కవులు అరెస్టు చేస్తారని"

ఈ విధంగా కుందుర్తి కవితల్లో పౌరాణిక సంప్రదాయత, చంధో సంప్రదాయత, భావ కవితా సంప్రదాయతలను మనం గమనించవచ్చు.

### 17.2.4. అభ్యుదయ వాద ప్రభావం :

భారత దేశానికి స్వాతంత్ర్యం రాక పూర్వమే 1940లోనే అభ్యుదయ కవిత్యోద్యమం ప్రారంభమైంది. శ్రీశ్రీ, శిష్లా, నారాయణబాబు, పఠాభి వంటి కవులు భావ కవిత్వంపై తిరుగుబాటు చేస్తూ ప్రయోగ వాద దృక్పథంతో రచనలు చేశారు. ఈ అభ్యుదయ కవిత్యోద్యమానికి శ్రీశ్రీ నాయకుడు. పాశ్చాత్య కవితా ధోరణులైన సింబాలిజం, సర్రియలిజం, డాడాయిజం, క్యూబిజం, ఇంప్రెసలిజం వంటివి ఈ అభ్యుదయ కవుల రచనలపై అధికంగా ప్రభావాన్ని చూపాయి. వీటితో పాటు మార్క్సిజం, మానవతా వాదం అభ్యుదయ కవితా సౌధానికి పునాదులైనాయి. ఈ అభ్యుదయ కవితా సౌధంలో దాశరధి, గంగినేని, ఆరుద్ర, తిలక్ మొదలైన కవులతో పాటు కుందుర్తి కూడా ప్రవేశం చేశాడు. అభ్యుదయ కవుల నుంచి 1965లో ఆరుగురు కవులు విడిపోయి తమను తాము దిగంబర కవులుగా ప్రకటించుకున్నారు. అటు తరువాత 1970లో అభ్యుదయ కవితోద్యమాన్ని చీల్చు కుంటూ విప్లవ కవిత్వం ఆవిర్భవించింది. కాబట్టి దిగంబర విప్లవ కవిత్వాలు అభ్యుదయ కవిత్యోద్యమం నుంచి ఆవిర్భవించినాయి అని చెప్పవచ్చు. అలా ఆవిర్భవించిన ఈ రెండు శాఖల కన్నా అభ్యుదయ కవితోద్యమమే తన ప్రాభవాన్ని నిలుపుకొని బహుళ వ్యాప్తి చెందింది. దిగంబర విప్లవ కవితోద్యమాలు మంచి ఊపునందుకుంటున్న కాలంలోనే కుందుర్తి వచన కవిత సాగించాడు. కొన్ని సందర్భాల్లో విప్లవ కవిత్వం వైపు మొగ్గు చూపించినట్లు కనిపించిన కుందుర్తి ఒక్క అభ్యుదయ కవిత్యోద్యమ ప్రభావానికే లొంగి రచనలు చేసినట్లుగా తెలుస్తుంది.

సామాజిక స్పృహ సమ సమాజ నిర్మాణ దృష్టి ఉన్న అభ్యుదయ కవిత్వంలో ముఖ్యంగా ఈ క్రింది అంశాలు ప్రధానంగా ఉంటాయని నారాయణ రెడ్డి చెప్పాడు. అవి

1. వర్గ సంఘర్షణ
2. విప్లవ ప్రబోధం
3. వీర గాథా కథనం

4. యుద్ధ విముఖత - శాంతి ప్రియత
5. గత నిరాసం
6. సమ సమాజ నిర్మాణం
7. విశ్వ మానవతా వాదం

నారాయణరెడ్డి గారు చెప్పిన పై అంశాలే గాక

8. స్త్రీ పోరాట చిత్రణ
9. పోలీసు చర్యల కథనం
10. పల్లీయుల బాధా చిత్రణ
11. మధ్య తరగతి జీవిత ప్రస్తావన
12. ఆశావాదం.

అనే విషయాలు కూడా కొంత ప్రాధాన్యతను కలిగి ఉన్నాయని చంద్ర శేఖర్ తన పరిశోధనా వ్యాసంలో తెలిపాడు. పై అంశాలు పరిశీలింపదగి వున్నాయి.

**4.1. వర్గ సంఘర్షణ :** అభ్యుదయ కవితా లక్షణాలలో ఒక అంశంగా గుర్తింప బడిన వర్గ సంఘర్షణ చిత్రీకరణ కుందుర్తి రచనల్లో కనిపిస్తుంది. సమాజంలో సంపన్నులు, సామాన్యులు అనే రెండు వర్గాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఈ రెండు వర్గాల మధ్య నిత్యం చోటు చేసుకుంటున్న సంఘర్షణను కుందుర్తి చక్కగా చిత్రీకరిస్తూ తాను సామాన్య ప్రజలవైపు నిలిచాడు. వర్గ సంఘర్షణల్ని చక్కని ప్రతీకల ద్వారా వివరించాడు.

ఉదా :

"వ్రేళ్ళు బయటపడ్డ వృద్ధ శాల్మలీవటాలు
వర్తమాన ప్రజోద్యమ మారుతాలకు తట్టుకొని మనలేవు
అసంఖ్యాకమైన గడ్డి మొక్కలు
తలలు వంచింది సుడి గాలికి తడిసికాదు
ఎఱుక పొందిన ప్రజల హృదయాల వేగు చుక్కలు"

ఇక్కడ వృద్ధ శాల్మలీ వటాల్ని బూర్జువా వ్యవస్థకు, గడ్డి మొక్కల్ని సామాన్య ప్రజలకు కుందుర్తి ప్రతీకలుగా గ్రహించాడు.

తెలంగాణాలో నిజాం ప్రభువుల నిరంకుశత్వాన్ని, రజాకర్ల రాక్షసత్వాన్నీ ఎదుర్కొన్న సామాన్య ప్రజల ధైర్య సాహసాల్ని కుందుర్తి ఎంతో చక్కగా వర్ణించాడు.

ఉదాహరణకు :

"చీకటి మీద యుద్ధానికి వెలుగు రవ్వలు కలుసుకున్నాయి.
అందరి ఆశయం ఒక్కటే గదా!
రజాకార్ల ఆశలు ఎండిన ఆకుల్లా వ్రాలినాయి
ప్రజల ఆశలు పండబోతున్న పండు" పాలకులను నిరశిస్తూ ప్రజల ఐకమత్యాన్ని కోరుకుంటూ కుందుర్తి ఇలా అంటున్నాడు.

"అంధకార గజం అంబారీ మీద మదమెత్తిన దౌర్జన్య ధ్వజం కూలిపోయింది.
పారి పోయిన మావటీడు
వదలేసిన అంకుశం ప్రజలకు దొరికింది
ఇక మీద చెప్పినట్టు వింటుందా గజం
ప్రజలంతా కలిస్తే భుజం భుజం"

21)

ఈ విధంగా కుందుర్తిలో వర్గ సంఘర్షణ చిత్రణను మనం గమనింప వచ్చు.

**4.2 విప్లవ ప్రబోధం :** కుందుర్తికి విప్లవ రచయితలతో సంబంధం లేదు. అతని పయనం అభ్యుదయం వైపే. అయినా తెలంగాణా పోరాటాన్ని వీర మాస్కో పోరాటాల్ని కుందుర్తి కావ్య వస్తువులుగా గ్రహించాడు. తిరగబడ్డ తెలంగాణా ప్రజల ఉద్యమాన్ని చక్కని ఉపమానాలతో చిత్రీకరించాడు.

**ఉదాహరణకు :**

"నేల మీదికి విసిరేసిన రబ్బరు బంతి
కసి కొద్దీ నీ మీదికి లేస్తుంది
గండు పిల్లి చావబోయే ముందు నీ రెండు కళ్ళు పీకేస్తుంది." అని తెలంగాణా ప్రజల తిరుగుబాటు తత్వాన్ని వివరించాడు.

అట్లే సామాన్య ప్రజల్ని చిట్టెలుకలుగా సంబోధిస్తూ ధాన్యాగారాల్ని బూర్జువాలుగా భావిస్తూ ఈ క్రింది విధంగా విప్లవ ప్రబోధం చేశాడు.

"కొండె కత్తె పదును చేసి
దండెత్తు ధాన్యం మీదికి
చీకటి కలుగులో నుంచి
చిట్టెలుక కదులు వెలుగులోకి" కుందుర్తి దృష్టిలో విప్లవం అంటే హింసా మార్గం కాదు. సర్వనాశనాన్ని కోరుకొన్నది అంతకంటే కాదు. విప్లవానికి ఒక ప్రయోజనం ఒక పద్ధతి ఒక క్రమం ఉండాలని బోధించిన వాడు కుందుర్తి అందుకే

"ఒక మనిషిని మరో మనిషి నరకమనీ కొరకమనీ
మన కులాలు చెప్పలేదు. మన శాస్త్రం చెప్పలేదు" అని చెప్తూతూ
"శ్రామికులను దోచుకొనే సంఘ స్థితి పోవాలని
సమాజంలో రెవల్యూషన్ రావాలని పోరాడండి."
అన్నది కుందుర్తి హితబోధం. ఇది సరియైన అభ్యుదయ కవితా దృక్పథం.

**4.3. వీరగాథా కథనం :** ప్రజాస్వామ్యం కోసం సర్వ మానవ సమానత్వం కోసం యుద్ధాలల్లో, తిరుగుబాటు పోరాటాల్లో ఎందరో ప్రాణాలు కోల్పోయారు. అటువంటి వారి గాథల్ని కథనం చేయడం కూడా అభ్యుదయ కవిత్వంలో అంశం. ఈ అంశాన్ని కుందుర్తి కవితలో కూడా మనం చూడవచ్చు. ముఖ్యంగా తెలంగాణా పోరాటంలో పాలు పంచుకొన్న వీరుల సాహసోపేతమైన చర్యల్ని కుందుర్తి వర్ణించాడు.

"మొదటిసారి కొమరయ్య ఫోటో
బహుశ, పొరపాటున
పత్రికలు ప్రకటించాయి....................
......................................................
......................................................
ఎన్ని ప్రాణాలు కత్తితో తరిగారో
మన కోటిలో ఎంతమంది తరిగారో" అట్లే తెలంగాణా పోరాటంలో పాలు పంచుకొన్న స్త్రీలను ప్రభుత్వం హింస పెట్టే స్థితిని కుందుర్తి కరుణరసోపేతంగా చిత్రించాడు.

"అయ్యా అధికారం గర్భ స్రావం కాదు
స్త్రీలు అబలలు లేవలేని వారు
......................................................
......................................................

వాళ్ళు బియ్యంతో [illegible] తినే బీదోళ్ళ భార్యలు"

అని ఆ స్త్రీల దయనీయ స్థితిని కథనం చేశాడు కుందుర్తి. తెలంగాణా పోరాటంతో పాల్గొన్న వీరులను కుందుర్తి పేరు పేరున పేర్కొన్నాడు. వీరుల సంఖ్యను కూడా అక్కడక్కడ చెప్పాడు. అంతేగాక సామూహిక మరణాల్ని ఎత్తి చూపాడు. కుందుర్తి కవితలో వీరగాథా కథనం ఎక్కడోగాని కనిపించదు.

**4.4 యుద్ధ విముఖత శాంతి ప్రియత :** ఆవేశం కట్టలు తెంచుకొన్నప్పుడు వీరగాథా విషయాలు ప్రస్తుతించినా కుందుర్తి ఎక్కువ ఆశించింది శాంతి ప్రియతనే. విప్లవాల్లో, యుద్ధాలలో జరిగే జన నష్టం, ధన నష్టం చూచి కుందుర్తి చలించి రచన జేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఆటంబాంబు తయారు చేసిన వారు తమ శత్రువుపై ఆయుధాన్ని తయారు చేసినాం అని సంబర పడుతున్నారే కాని అవి తమకు కూడా ప్రాణాపాయకరమైన ఆయుధాలని తెలుసుకోలేకపోతున్నారని కుందుర్తి బాధ పడుతూ ఇలా అన్నాడు.

"స్వార్థం చెలియ కట్టను మన్నించదు
శాస్త్రజ్ఞులు చేయి దాటితే
మహా నగరాల మీద విరుచుకు పడుతుంది ఆటం" అని అంటూ వినాశకరమైన మారణాయుధాల భయంకరత్వాన్ని వర్ణించాడు కుందుర్తి. అదే ఆటం ఇలా అంటుందని కూడా [illegible].

"నాకు లేదు
నాగసాకిని చంపే ఉద్దేశ్యం
అది మృత్యువు నిర్దేశ్యం
.......................................................
.......................................................
ఎంతో పోరాడి చెప్పాడు" అని అణువుకు ఇష్టం లేని పని మనుష్యులు స్వార్థం కోసం చేస్తుంటారని కుందుర్తి వివరించాడు.

యుద్ధ విముఖతనే కాకుండా కుల, మత ఘర్షణల్ని నిరశించాడు కుందుర్తి.

"మతాలని, వ్రతాలని గత కాలపు ఘనతలని
ఆవేశపుటవుధలలో తిరిగే అమాయకులారా
.......................................................
.......................................................
మధ్య యుగాలకు మరల కండి
మనుష్యుల మని మరువ కండి" అని సమాజానికి ఒక హెచ్చరికను చేశాడు.

యుద్ధ విముఖతని ఎంతగానో చెప్పిన కుందుర్తి ఒక చోట ఇలా చెప్పి ఉండడం గమనింప దగి ఉంది.

"యుద్ధం ఎంత వద్దు అనుకున్నా
ఎదుటివాడు దెబ్బ తీసినపుడు ఎదుర్కోక తప్పదు
ఎవరిది తప్పో, ఎవరిది ఒప్పో ఈ పాడు లోకం చెప్పదు"

తనలో జీర్ణించుక పోయిన శాంతి ప్రయత్నాన్ని యుద్ధ విముఖతను కుందుర్తి ఇలా వ్యక్తం చేశాడు.

"మనిషిమీద మనిషిని జాతి మీద జాతిని
ఉసి గొల్పిన రాక్షస యుగ చర్యకు
శాంతి శాంతి"

**4.5 గత విరసం :** గత కాలము మేలు, వచ్చు కాలము కంటెన్" అని అన్నాడు భారతంలో ఆదికవి నన్నయ్య. ఈ సూక్తిని వ్యతిరేకించినవాడు కుందుర్తి. పెత్తం దార్ల సాంఘిక వ్యవస్థను దాచుకొన్న గతమంటే కుందుర్తికి ఇష్టం లేదు. బూర్జువా వ్యవస్థ అంటే ఆయనకు అసహ్యం. గతించిన కాలమంతా కుందుర్తికి చీకటి మయంగా కనిపించింది. అందుకే

"శతాబ్దాల వెనుకటి
చీకటి
చరిత్రలో
రారాజులు
చేసిందే
ఈ రోజున జరుగుతుంది
అదే అదే
ఆనాటికి ఈనాటికి
కొద్ది మంది లోకాన్నంతా
కొల్లగొట్టుకొని
తినే విధానం" అని తీవ్ర ఆవేదనల్ని వ్యక్తం చేశాడు.

తమ స్వార్థం కోసం తాము సుఖించడం కోసం, తాము వినోదించడం కోసం కొందరు ప్రజాభ్యుదయాన్ని పక్కన బెట్టి రాచరికాన్ని సమాజంలో నిలిపారని కుందుర్తి భావించి అటువంటి స్థితిని నిరశిస్తూ.

"గతం పురాగతం కాదు
మతం మనకు సమ్మతం కాదు
......................................................
......................................................
గతం నీకు చూపించె దారి
బ్రతుకు మీద గుర్రం సవారి" అని తన వ్యతిరేకతను తెలిపాడు. అంతేగాక సంప్రదాయ వస్తువు మీద సంప్రదాయ చంధస్సు మీద తన వ్యతిరేకతను ప్రకటించాడు కుందుర్తి.

**ఉదాహరణకు :**

"యతి ప్రాసల ఇరకాటంలో పొల్లు మాటలు వాడినట్లు
భార్యా మణి మెప్పుకోసం
పక్కంటి వాణ్ని తిట్టినపుడు
......................................................
......................................................
ముగింపు మాట గుర్తు లేదా అంటాడు" కుందుర్తి వచన కవిత్వంలో ప్రబంధ కవితా ధోరణుల్ని భావ కవితా సంప్రదాయాల్ని నిరశించిన తీరు కూడా కనిపిస్తుంది. పాత భావాల బూజు దులుపుకొని కొత్తవి ఆలోచించడం కుందుర్తి కవితా తత్త్వంగా చెప్పవచ్చు.

**4.6. సమ సమాజ నిర్మాణం :** కుందుర్తి రచనలో ఏది చేసినా అది సమసమాజ నిర్మాణం కోసమే అన్నది అక్షర సత్యం. విప్లవాన్ని ఆహ్వానించినా, వీరుల గాధల్ని చెప్పినా, యుద్ధాన్ని నిరసించినా, శాంతిని కోరుకున్నా, గత కాలాన్ని నిరశించినా అంతా సమ సమాజ నిర్మాణం కోసమే. స్వాతంత్ర్యం వచ్చి ఎన్ని ఏళ్ళు గడిచినా సమ సమాజం సిద్ధించలేదని ఇలా బాధ పడతాడు.

"నిజానికి స్వాతంత్ర్యం బోలెడు అంత ఉంది మనకు
సగం రోజులు తినకుండా నెల పొడుగున్నా
చాకిరే చేసే స్వాతంత్ర్యం ఉంది
......................................................

.....................................................
పుచ్చిపోయే స్వాతంత్ర్యం ఉంది మనకు" అని వ్యంగ్యంగా వివరించాడు.

కుందుర్తి తన రచనల్లో ముఖ్యంగా ఆర్థిక అసమానత్వమే ఈ దేశానికి పట్టిన పీడ అని భావించాడు. దీనికి కారణం పాలకులే అని గొంతెత్తి చాటాడు. తెలంగాణా పోరాటంలో విజయం సాధించిన వారిని చూచి ఎంతో ఆనందించాడు. ఆ ఆనందంతోనే

"బీదలు భూములు పంచుకున్నారు
సంఘంలో ప్రతిష్ట పెంచుకున్నారు.
ఈ నేల ఎవరిది, కోటి ప్రజల సొత్తు కాదా
కొందరు వద్దంటే ఒప్పుకోని చరిత్ర
ముందుకు పద" అని అన్నాడు. తరతమ వర్గ భేదాలు లేని సమాజం మన ముందుకు రావాలని ఆశిస్తూ తన వచన కవితల్లో సమతా వాదాన్ని వ్యక్తం చేశాడు కుందుర్తి. సమతా వాదాన్ని కాంక్షించే అభ్యుదయ కవి అయిన కుందుర్తి సమ సమాజం ఎలా సిద్ధిస్తుందో కూడా వివరిస్తూ ఈ లోకంలో సమ సమాజ నిర్మాణం కోసం ప్రపంచం పడే ఆరాటాన్ని తన వచన కవితలో తెలియ జేశాడు కుందుర్తి.

**4.7. విశ్వ మానవతా వాదం :** ఆధునిక ఆంధ్ర కవిత్వంలో ఈ మానవతా వాదం అన్నది అభ్యుదయ కవితావిర్భావంతో ప్రారంభమైంది. శ్రీశ్రీ మొదలు నేటి యువ కవుల వరకు అందరి మీద ఈ మానవతా వాదం ముద్ర వేసింది.

కవి, పండితుడు అయిన శ్రీ నాగళ్ళ గురు ప్రసాదు రావుగారు మానవతా వాదాన్ని ఇలా వివరించారు.

"ఒక కవి సామాజిక పరిణామము అంగీకరించి ఆయా సన్ని వేశములలో ప్రజలు పొందు అనుభూతులను లెస్సగా గుర్తించి ఆ అనుభూతులను తనవిగా చేసుకొని ప్రజా ప్రతినిధియై రంగమునకు వచ్చి రచనలు గావించుట మానవతా దృక్పథం."

నేడు మానవతావాదం ప్రధానంగా రెండు భిన్న సిద్ధాంతాలను ఆధారం చేసుకొని కనబడుతుంది. అయితే ఆ రెండు సిద్ధాంతాలు కోరుకొనేది మానవతా వాదాన్నే. మానవ శ్రేయస్సునే. మొదటి సిద్ధాంతం గాంధేయ వాదానికి సంబంధించినది. దీనికి అధినేత గాంధీ మహాత్ముడు. రెండవ సిద్ధాంతం కమ్యూనిస్టు సిద్ధాంతం. దీనికి అధినేత మార్క్స్. కుందుర్తి రచనల్లో మానవతా వాదంతో పాటు విశ్వ మానవతా వాద దృక్పథాన్ని కూడా మనం గమనించవచ్చు. అందుకే ఆయన ఇలా అంటాడు.

"దేశ దేశాల ఎల్లల చెరికి

జాతుల కృత్రిమ సరిహద్దు రేఖలు దాటి

సర్వమానవ సోదరభావ చైతన్యాన్ని"

కాంక్షిస్తున్నాను అంటాడు కుందుర్తి. కుందుర్తి తెలంగాణా శ్రేయస్సునే కాకుండా ఆంధ్ర దేశాన్ని, భారత దేశాన్ని సంబోధించి ఎంతో మానవతా వాదాన్ని ప్రదర్శించాడు. అంతేగాక జర్మనీ ప్రాంత ప్రజల్ని వారి సుఖ శాంతుల్ని కోరుకుంటూ రచనలు చేసి తన విశ్వ మానవతా వాదాన్ని ప్రస్ఫుటం చేశాడు.

**17.2. 5. ముగింపు :**

అభ్యుదయ కవులు చాలా వరకు తమ వచన కవితల్లో మధ్య తరగతి వారి జీవితాల్ని, బాధల్ని, కార్మిక, కర్షక జీవిత విధానాల్ని బూర్జువా వ్యవస్థకు వ్యతిరేకంగా వారు జరిపిన పోరాట విధానాలను చిత్రించారు. అయితే వారిలో స్త్రీల ప్రస్తావన ప్రత్యేకంగా అభ్యుదయ కవులు చేయలేదు. శ్రీశ్రీ భిక్షు వర్షీయసి, తిలక్ వెళ్ళిపొండి వెళ్ళిపొండి అనే ఖండికల్లో స్త్రీల విషయం చెప్పబడింది. అయితే కుందుర్తి ఈ విషయంలో ఒక్క అడుగు ముందుకు వేసి తెలంగాణా పోరాటంలో పాల్గొన్న స్త్రీలను గూర్చి తన రచనల్లో ప్రత్యేకంగా చెప్పినాడు.

కుందుర్తి తన వచన కవిత్వంలో అభ్యుదయ దృక్పథంతో పాటు తెలంగాణా ఉద్యమంలో పోలీసులు జరిపిన అకృత్యాల్ని, అమానుష చర్యల్ని కథనం చేసి ఉన్నాడు. అట్లే ఉద్యమ కాలంలో పల్లీయులు ఎదుర్కొన్న బాధల్ని తన కవితలో ఏకరువు పెట్టాడు. పల్లీయుల జీవిత చిత్రణతో పాటు, మధ్య తరగతి జీవిత ప్రస్తావనకు కూడా కుందుర్తి తన కవితలో చోటు కల్పించాడు.

అభ్యుదయ దృక్పథం ఉన్న కుందుర్తి వచన కవిత్వంలో ఆశావాదం చోటు చేసుకొని ఉంది. ఏనాటికైనా భారత దేశంలో స్థితి గతులు మారి ధనికులు, పేదలు అనే వర్గ భేదాలు నశించి కుల, మత వ్యవస్థలు రూపుమాసి పోయి సమ సమాజం ఏర్పడుతుందని కుందుర్తి తన కవితలో ఆశించాడు. రాబోయే కాలంలో మనిషి బ్రతుకు మూడు పువ్వులు ఆరు కాయలుగా వికశించి దానవులంతా నశించి, మానవులే మిగులు తారని కుందుర్తి తన దృఢ విశ్వాసాన్ని వ్యక్తం చేశాడు.

"ఆధునిక ఆంధ్ర కవిత్వంలో అందున అభ్యుదయ దృక్పథంతో కూడుకొన్న వచన కవిత్వంలో యువకుల్ని ప్రేరేపించి తన బలీయమైన ముద్రలతో ప్రభావితం చేసిన కవులు ముగ్గురు ఉన్నారు. ఒకరు శ్రీశ్రీ మరొకరు తిలక్, ఇంకొకరు కుందుర్తి అని తన వచన కవిత్వం కుందుర్తి పాత్ర అన్న పరిశోధనా గ్రంథంలో చంద్రశేఖర్ గారు చెప్పిన మాటలు అక్షర సత్యాలు.

## సమీక్ష :

కుందుర్తి వారి రచనలను గురించి, వివిధ సంప్రదాయకతలను గురించి, అభ్యుదయ వాదమును గూర్చి, వర్గ సంఘర్షణపై కుందుర్తి వారి అభిప్రాయాలను, విశ్వమానవతా వాదమును సమీక్షించెదము.

## ప్రశ్నలు :

1) "వచన కవితా పితామహుడు కుందుర్తి" - నిరూపించండి

2) కుందుర్తిలో కనిపించే సంప్రదాయ ముద్రను పరామర్శించండి.

3) అభ్యుదయ కవిగా కుందుర్తి పాత్రను తెల్పండి.

4) తెలం[illegible]వీరవనితలను గూర్చి కుందుర్తి గావించిన వీర గాథా కధనాన్ని వివరించండి.

5) కుందుర్తి ఉద్యోగ జీవితం అతని సాహిత్య జీవితానికి ఏ విధంగా దోహదం చేసిందో పరిశీలించండి.

## ఆధార గ్రంథాలు :


1) అడుగు జాడలు - పొరంకి దక్షిణామూర్తి

2) ఆధునికాంధ్ర కవిత్వమూ, సంప్రదాయములు
ప్రయోగములు - నారాయణరెడ్డి సి.

3) ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు - కె. కె. రంగనాధాచార్యులు.

4) కుందుర్తి కవితా వైభవం - అద్దేపల్లి రామ్మోహనరావు

5) కుందుర్తి కవితా తత్త్వం - అద్దేపల్లి రామ్మోహనరావు

6) తెలుగు కవితా విప్లవాల స్వరూపం - నారాయణరావు వేల్చూరి

7) మహతి - యువ భారతి

8) తెలుగు కవితా వికాసం - కడియాల రామ్మోహనరావు

9) వచన కవిత్వం - కుందుర్తి పాత్ర - యస్. జి. డి చంద్రశేఖర్


డా॥ జి.డి. నాయుడు

### పాఠం - 18.1

# చెఱబండరాజు - చావలి బంగారమ్మ

**పాఠ్య నిర్మాణ క్రమం**

- **18.1.1** దిగంబర కవిత్వం-చెఱబండరాజు
- **18.1.2** చెఱబండరాజు రచనలు
- **18.1.3** చెఱబండరాజు రచనాతత్త్వం
- **18.1.4** చెఱబండరాజు రచనలు - విశిష్టత
- **18.1.5** నన్నెక్కనివ్వండి బోను
- **18.1.6** ఆకాశం నెక్కి నెక్కి ఏడుస్తోంది
- **18.1.7** వందేమాతరం
- **18.1.8** జగద్గురువులొస్తున్నారు జాగ్రత్త
- **18.1.9** అశోక చిహ్నం
- **18.1.10** విప్లవ కవిగా చెఱబండరాజు
- **18.1.11** చెరబండరాజు - తిరుగుబాటుతత్త్వం
- **18.1.12** చెఱబండరాజు - అంతర్జాతీయతత్త్వం-విశ్వశాంతి
- **18.1.13** చెఱబండరాజు - అణుయుద్ధ విముఖత
- **18.1.14** చెఱబండరాజు - వ్యక్తి స్వేచ్ఛ
- **18.1.15** ముగింపు

**లక్ష్యం:**

చెఱబండరాజు దిగంబర కవిగా సమాజానికి చేసిన సేవలను, విప్లవ కవిగా సంఘమును చైతన్యపరచిన విధానం, చెఱబండరాజు తత్త్వాన్ని తెలుసుకుంటారు.

**చెరబండరాజు**

విశిష్టమైన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కొంత అధిగమించి ఆంధ్ర సాహిత్యం పాశ్చాత్య విజ్ఞానానికి, సంస్కారానికి లోనై ఆ ప్రభావంతో వచ్చిన సాహిత్యం నవ్యసాహిత్యం. ఈ నవ్య సాహితీ ప్రముఖులు అనేక క్రొత్త ప్రయోగాలను చేశారు. వీరిలో రాయప్రోలు, నాయని, విశ్వనాథ, క్రిష్ణశాస్త్రి మొదలైన వారు ప్రముఖులు. వీరి మూలంగా ఆంధ్ర సాహిత్యంలో సమాజ శ్రేయోదాయకమైన ఆలోచన అధికమైన రచనలు వెలువడ్డాయి. అవి కొన్ని ఉద్యమాలుగా కూడా రూపాంతరం చెందినాయి. వాటిలో భావకవిత్వోద్యమము, అభ్యుదయకవిత్వోద్యమము, దిగంబర కవిత్వోద్యమము, విప్లవ కవిత్వోద్యమము. మొదలైనవి ముఖ్యమైనవి.

భావ, అభ్యుదయ కవిత్వాలు ఆధునిక కవిత్వపు శిల్పములైతే ఆ శిల్పానికి ప్రాణం పోసి, చైతన్యం తెచ్చింది దిగంబర, విప్లవ కవిత్వములు సమాజంలోని అన్ని విధాలైన దురాచారాలు, మూఢ విశ్వాసాల నుంచి ప్రజలు చైతన్యవంతులై అభ్యుదయ మార్గంలో పయనించాలని ఆశించాయి.

దిగంబర కవులలో ప్రముఖుడుగా ఉండి ఆటు పిమ్మట విప్లవ కవిగా తనవంతు సేవను చేసిన మహామనిషి చెరబండరాజు. చెరబండరాజు దిగంబర కవిగా, విప్లవ కవిగా చేసిన సేవను, దానికై ఆయన కష్టములను, కృషిని తెలియవలసిన అవసరం నేటి సమాజానికి ఎంతైనా ఉంది.

## దిగంబర కవిత్వం - చెరబండరాజు

నవ్య కవిత్యోద్యమంలో భావకవిత్వము, అభ్యుదయ కవిత్వముల అనంతరం అనగా దాదాపు 1965 లో దిగంబర కవిత్వం ఆవిర్భవించింది. భావ, అభ్యుదయ కవుల కృషి సమాజంలోని కుళ్లును తొలగించ లేక పోయిందని దానికి వ్యతిరేకంగా సంఘంలోని యువకులు ఈ ఉద్యమాన్ని ప్రారంభించినారు. దేశ ఆర్థిక వ్యవస్థ మీద ఆధారపడి సంఘం ఉంటుందనీ, దాని వికాసం మీది దృష్టితో మనిసి జీవితం రూపొందుతుందని దిగంబర కవులు గుర్తించారు. వీళ్లు కొంత మార్క్సిస్టు దృక్పధం కలవాళ్లే. దిగంబర కవులు ఆరుగురు, వాళ్లు తమ సొంత పేర్లతో కవిత్వం వ్రాయలేదు. పేర్లను మేము వదిలి కొత్త దనాన్ని సృష్టిస్తాము అన్నారు. వారు యం.హెచ్. కేశవరావు నగ్నమునిగా, మాధవరెడ్డి చెరబండరాజుగా, మన్ మోహన్ సహాయ్ భైరవయ్యగా, కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు మహాస్వప్నగా పేర్లు మార్చుకొని కవిత్వం రాశారు.

ఈ దిగంబర కవిత్వం మూడు సంపుటాలుగా వెలువడింది. 1965, 1966, 1968 లలో ఈ సంపుటాలు రిక్షావాడు, హోటలు క్లీనరు, బిచ్చగత్తెల చేత ఆవిష్కరింప చేసి నూతనత్వాన్ని నెలకొల్పినారు. దిగంబర కవులు వస్తూ వస్తూ

"మనిషిలో అట్టగున బురద గుంట్లో
పడివున్న మనిషిని లేవదియడం,
ఎముకల లోతుల్లో ధ్వనించే
స్వచ్ఛమైన గీతాల్ని ప్రతి ధ్వనించడం,
కళ్ల వెనక దాగి ఉన్న సిసలైన
కళ్ల నీళ్లను ప్రసరించడం,
నిజాన్ని నిజంగా నగ్నంగా చెప్పడం",
తమ లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపినారు.

ఈ దిగంబర కవులలో చెరబండరాజు పాత తరం సంప్రదాయ సాహిత్య విలువల పైన, అసాంఘిక విధానాల పైన, అన్యాయ, అక్రమాల పైన, తిరుగుబాటు తన లక్ష్యయంగా పేర్కొన్నాడు. సంఘ దుస్థితికి, సాంఘిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థల దురవస్థలకి, వెన్నెముక విరిగిన యువత నిర్వీర్యావస్థకి తాను వ్యతిరేకి నన్నాడు. కుళ్లి దుర్గంధం వెదజిల్లుతున్న కుష్టు వ్యవస్థ మీద ధ్వజమెత్తిన కవిత చెరబండరాజు కవిత. కడుపులో అనంత కాలుష్యాన్ని దాచుకొని పైకి నిర్మలంగా కనిపించే సమాజంలోకి నగ్న భావాలతో వస్తున్నాను అన్నాడు. కులమతాలకు అతీతంగా తన రచన సాగుతుందని చెప్పాడు. మానవునిలోని కృత్రిమ భావాలను తొలగించి సహజ భావాలను వెలుగులోకి తేవటం, వ్యవస్థను కూలదోసి ఆరోగ్యకరమైన వ్యవస్థను పునర్నిర్మించడం తన లక్ష్యం అంటూ చెరబండరాజు తెలిపాడు. సమాజంలో సభ్యత, సంస్కారం, నిజాయితీల అభివృద్ధికి కృషి చేస్తానన్నాడు.

తన రచనలలో పదజాలాన్ని దూకుడుగా ప్రయోగించినాడు. మానవాతీత విలువలను కాపాడినపుడే నవ సమాజ స్థాపన సాధ్యమౌతుందని అందుకు తాను అవిరళ కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేసినాడు.

### 18.1.2 చెరబండరాజు - రచనలు :

చెరబండరాజు దిగంబర కవిగా ఎంతో కృషిచేసి నవసమాజస్థాపనకై ఎన్నో రచనలు చేసినాడు. దిగంబర కవులు వెలువరించిన మూడు సంపుటాలలో చెరబండరాజు

ఒకటవ సంపుటలో "వన్నెక్కనివ్వండి బోను" అనేకవితను,

రెండవ సంపుటలో "ఆకాశం వెక్కి వెక్కి ఏడుస్తోంది" అనే కవితను

మూడవ సంపుటలో "వందేమాతరం" "జగద్గురువులొస్తున్నారు జాగ్రత్త" అనే కవితలను రచించాడు. అంతేకాక దిక్సూచి, ముట్టడి, గమ్యం, కాంతి యుద్ధం, గౌరమ్మ కలలు, జన్మహక్కు, పల్లవి మొదలైన కవితా సంపుటాలను వెలువరించినాడు. అశోక విప్లవం, నక్షిపోయిను

గర్జించాలి, విప్లవగ్రామం, పునర్జన్మ మున్నగు వచన గీతాల్ని కూడా చెరబండరాజు రచించినాడు. వీరి రచనల ఆధారంగా ఈ కవిని ఆధునిక కవులలో అత్యంత ప్రతిభావంతుడు గాను, వచన కవిత, పాటల రచనలలో సవ్యసాచిగాను చెరబండరాజును గుర్తించ వచ్చు. ఈ దశాబ్దంలో వికసించిన ప్రజ్ఞావంతులైన కవులలో చెరబండరాజు ఉత్తమ శ్రేణిలో లెక్కించదగిన వారు. వీరి రచనలు సహృదయులను ఎంతో ఆనందానికి గురిచేసినాయి. వారంతా వీరి రాజకీయ అభిప్రాయాలతో ఏకీభవించి వీరి రచనలను కవిత్వ శిల్పాన్ని కొనియాడినారు. వీరి వచన గీతాలు సాధారణంగా పామర జనులకు అర్థంకానట్లుగా ఉంటాయి కానీ సభల్లో గొంతెత్తి పాడి వినిపిస్తే ఎందరో పామరులు ఆ పాటల్లో తమ బ్రతుకు స్థితిగతుల్ని అర్థం చేసుకొని, దాని పరిష్కారాన్ని తెలుసుకొంటారు. వీరి రచనలు హృదయాలను కైవసం చేసికొని కర్తవ్యబోధ చేస్తుంది. వీరి రచనలు ఏ కవితా ప్రమాణాలతో చూచినా ఉత్తమ కావ్యాలుగా ఎన్నదగినవి.

'నేను భ్రాంత విప్లవాన్ని', 'ఏ కులమబ్బీ మాదే మతమబ్బీ', 'మారలేదన్నా', అనే పాటలు, 'ఊరు మేలుకొంది', మున్నగు కథాకావ్యాలే ఎన్నో వీరి రచనల్లో చోటు చేసుకొన్నాయి. యువకవులు చాలా మంది ఈ రచనలను మార్గదర్శంగా చేసుకొని కవితలల్లుతున్నారు. కానీ వారెవ్వరికీ అందనంతటి రీతిలో చెరబండరాజు రచన కొనసాగింది. ఒక విలక్షణమైన శైలితో, ఊపిరి నింపిన తీవ్ర బాధాజనితమైన ఆర్తితో, వెలువడిన చెరబండరాజు కవిత అనితర సాధ్యం. ఇతని ఈ రచనలు అన్నింటిలోనూ అభ్యుదయ భావావేశము పరంపరలుగా కన్పిస్తుంది. అంతే కాదు ప్రతి రచనలోను దిగంబరత్వము, విలక్షణత్వము, మనకు కన్పిస్తుంది. విశ్వకుటుంబ భావనను తన రచనలలో చొప్పించినాడు చెరబండరాజు. రచించడమే కాకుండా తన గీతాలను పాడి వినిపించే వాడు కూడా ! 'ఒక వీరుడు మరణిస్తే' 'కాలే గంజినీళ్లు' మున్నగు నాటికలు, నిప్పురాళ్లు అనే నవలను కూడా రచించాడు.

### 18.1.3 చెరబండరాజు రచనాతత్త్వం

జానపదగాథల ప్రభావంతో వీరగాథలు, మున్నగు వాటి ఉత్సాహంతో రచనలు చేసిన వాడు చెరబండరాజు. వీరి రచనలలో అధికంగా వర్గపోరాట తత్త్వం కనిపిస్తుంది. నాస్తికత్వము ప్రతిచోటా ప్రతిబింబిస్తుంది. సమాజంలోని దురాచార నిర్మూలనా దృష్టి ఎక్కడ చూచినా గోచరిస్తుంది. మానసిక దిగంబర కవిత్వం కోసం నిత్యసచేతన ఆత్మస్ఫూర్తితో నివసించటానికి ప్రయత్నించమంటాడు. శ్వాసించే ప్రతి వ్యక్తితోను సారూప్యం పొంది ఆ వ్యక్తి అంతరంగంలో అణిగి మణిగి ఉన్న ఆరాటాన్ని అసంతోషాన్ని, విసుగును, అక్షరాల్లో వ్యక్తీకరించి నూతన విశ్వాసాన్ని, ఆశను కల్గించే తత్త్వం ప్రతి అక్షరంలోను అక్షయంగా కన్పిస్తుంది. సారహక్కుల సాధన, రక్షణ వీరి కవిత్వంలోని మరో విశిష్టత. గ్రామీణ జీవన తత్త్వం అధికంగా వీరి రచనలలో చోటు చేసుకొంది. అంతేగాక విశ్వశాంతి, సర్వమత సమానత్వం, మొదలైన లక్షణాలు వీరి రచనలలో మనకు కన్పిస్తుంటాయి. తిరుగు బాటుతత్త్వం కూడ అధింకంగానే ఉంది.

### 18.1.4 చెరబండరాజు రచనలు - విశిష్టిత

దిగంబర కవితా రచన చేసిన వారిలో ద్వితీయుడు, రచనా విధానంలో అద్వితీయుడు చెరబండరాజు. వీరి రచనల్లో విశిష్టత వచన రచనా ప్రక్రియ. వచనంలోనే ప్రజాలోకపు చీకట్లను, ఆచీకటిలో ప్రజలు పడుతున్న బాధలను వర్ణించిన కవి చెరబండరాజు. చెరబండరాజు సహృదయుడుగా, దేశభక్తి కలవాడుగా, సర్వమత సమాన దృష్టికలవాడుగా, విశ్వశాంతిని కోరుకొనే ఆశాజీవిగా మనకు కన్పిస్తాడు.

### 18.1.5 వన్నెక్కవివ్వండి బోను :

మంచి కోసం, మనిషిలోని నిప్పులాంటి నిజమైన మనిషి కోసం, కపటంలేని చిరునవ్వులు చిందే సమాజం కోసం అహోరాత్రులు కృషి చేసిన దిగంబర కవి చెఱబండరాజు. కవిత్వానికి చెందిన మొదటి సంపుటలో కొత్త కవిత్వం ఎంతో కొంత వేగంతోనే వస్తుంది. తీవ్రదాటితోనూ వస్తుంది. అలాగే నా కవిత్వం కూడా అంటూ తాను రచించిన కవితా సంకలనం వన్నెక్కనివ్వండి బోను అనేది. దీనిలో చెరబండరాజు

"ఆకలి, కామం, కలలూ కన్నీళ్లు
మనిషిలోని మర్మజ్ఞానమంతా ఒక్కటే
దేశమేదైతేనేం, మట్టంతా ఒక్కటే
అమ్మవెరైతేనేం, చనుబాల తీపంతా ఒక్కటే

బిక్క మొఖాలతో చూస్తారేం;
పిచ్చి వాణ్ణిగా కేసుపుటప్ చెయ్యండి,
నన్నొక్కనివ్వండి బోను"

అన్న చెరబండరాజు గారి భావన, కవిని పిచ్చివాడు అని భావించేటట్లు చెయ్యదు. కవితలో భావం, సహృదయుల మనస్సునకు హత్తు కుంటుంది. అంతేకాదు విచ్చల విడిగా, నగ్నంగా హృదయంలోని భావాల్ని బయటపెట్టే వాళ్లని పిచ్చివాళ్లుగా ఈ సంఘం చూస్తుందని, పోలీసులు అరెస్టు చేస్తారని ఆక్రోశించినాడు. ఆ తత్త్వాన్ని సమాజం పోగొట్టుకోవాలని, మనుషులంతా ఒక్కటే నన్న భావాన్ని చక్కగా నిరూపించినాడు చెరబండరాజు.

## 18.1.6 ఆకాశం వెక్కి వెక్కి ఏడుస్తోంది

దిగంబర కవులు ప్రచురించిన రెండవ సంపుటలో చెరబండరాజు వెలువరించిన కవిత ఇది. ఈ కవిత ఎంతో చక్కని భావావేశం కల్గి ఉంది. చెరబండరాజు ఈ కవితలో తన నగ్నభావ పరంపరలను ఒక వరదలాగా సమాజం పైకి కురిపించిన నైనం సహృదయులను ఇట్టే ఆకట్టు కొంటుంది.

"పుడమితల్లి చల్లని గుండెను
పాయలు పాయలుగా చీల్చుకొని
కాల్వలై ఎవరిదో
ఏ తరం కన్నీరో
గలగలా సుళ్లు తిరిగి
మెల్ల మెల్లగా పారుతూంది"

అని ఊరును ముంచేసిన వరదను గూర్చి అభి వర్ణించినాడు. ఆ భావనలో ఒక రకమైన ఆర్ద్రత నెలకొని ఉండటం స్పష్టమై పాఠకుల హృదయాన్ని కలవర పరుస్తుంది. "వరదనీళ్లు కాదట అది ఏ తరంలోని వారి కన్నీళ్లో" అంటూ ఊహించిన కవి ఆలోచన ఎంత హృదయంగమో గదా ! ఈ వరదను అలానే వర్ణిస్తూ మరలా కవి

"అప్పుడే పుట్టిన ఆవుదూడ
లోతైన గోతిలో దిగబడింది
ఎక్కడో కత్తి మెరుపు
ఊరి ఎగువన తటాకం
గుండె తెగి ప్రవహిస్తున్నట్టుంది
ఒంటరి పాలేరు గుండె పూరింటిలో
దూలం విరిగి, గోడకూలి
బంధాను బంధాల తాటాకులు
గాలిలో ఎగురు తున్నాయ్,
..... కాపరి హృదయంలో ఏదో
కన్నీటి ఊయల కదలాడింది".

అంటూ కరుణామయమైన హృదయాన్ని కరుణ రస పరిస్ఫోరకంగా ప్రదర్శించినాడు చెరబండరాజు. ఈ కవితలో భావన చూస్తే చెరబండరాజు యొక్క ప్రజా జీవన పరిశీలనలోని సూక్ష్మదృష్టి వ్యక్తమై పాఠకుని మనస్సును ద్రవింపజేస్తుంది.

### 18.1.7 వందేమాతరం :

చెరబండరాజు దిగంబర కవుల మూడవ సంపుటంలో ప్రచురించిన మొదటి కవిత ఈ వందేమాతరం. భావకవులు దేశం పైని భక్తితో గీతాలు రచించినారు. కానీ చెరబండరాజు అలాకాక మనదేశంలోని వాస్తవ పరిస్థితిని వాళ్లకు కట్టే విధంగా వర్ణించినారు. అందులో చెరబండరాజు

"ఓనా ప్రియమైన మాతృదేశమా
దుండగులతో పక్కమీద కులుకుతున్న శీలం నీది,
అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టు పెట్టిన అందం నీది,
సంపన్నుల చేతుల్లో మైమరచి నిద్రిస్తున్న యవ్వనం నీది,
వందేమాతరమ్, వందేమాతరమ్"

అంటాడు. ఈ భావనలో దేశంలోని స్త్రీల బ్రతుకుల దుస్తితి, సంపదకల వారిపై వ్యతిరేక దృష్టి చక్కగా వ్యక్తమై చెరబండరాజు మనస్సును తెల్పునట్టివిగా ఉన్నాయి. జుగుప్స, బాధ, మిళితమై ఆక్రోశం కల్గే విధంగా, నగ్నమైన భావనకు ఆవేవ పూరితమైన పదజాలంతో రచించటంలో ఏ పాఠకునికైనా పరిస్థితులు మారాలని పించేటట్లుగా ఉన్నది.

చెరబడరాజు రచించిన రచనల్లో ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించు కొన్నది వంతేమాతరం. ఇది ఎంతో ఆవేశ పూరితమైన రచనగా యువతలో చైతన్యాన్ని రగుల్కొల్పింది. దేశంలోని దౌర్భాగ్యస్థితిని చక్కగా వెలుగులోకి తెచ్చిన కవిత ఇది. భారత మాత ఎంత హీనంగా, దీనంగా బ్రతుకుతుందో తెలియజేయబడింది ఇందులో. శీలాన్ని చెడగొడుతున్న సమాజంలోని కుమనుష్యుల పై చెరబండరాజు ఝుళిపించిన కత్తి ఈ వందేమాతరం. అనేక సమస్యలతో సతమత మౌతున్న ఓ భరతమాతా నీ గమ్యం ఎటో, ఏమిటో తెలుసుకోవమ్మా అంటూ ఆక్రోశించినాడు. అందుకే ఈ కవిత మురికి బట్టిన సమాజానికి ఒక ఆదర్శవంతముగా చెప్పదగినది.

### 18.1.8 జగద్గురువులొస్తున్నారు జాగ్రత్త

దిగంబర కవుల మూడవ సంపుటంలో చెరబండరాజు వెలువరించిన రెండవ కవిత ఈ "జగద్గురువులొస్తున్నారు జాగ్రత్త" అనేది. ఈ కవితలో చెరబండరాజు మనుషుల భుజాల మీద ప్రయాణం చేసే మోసకారులైన జగద్గురువుల బండారాన్ని వ్యంగ్యంగా దుయ్యబట్టారు. మతాధి పతుల్ని పాతిపెట్టి, మంచికి పతాకాన్నెత్తే మనిషివని ఋజువు చేసుకోమని సాటి మనిషిని హెచ్చరించారు.

"వంచనల సంకుచిత సహ జీవనాల్లో
కుంచించికు పోయి జాతిమతాల నెమరేసే
యుగాల రోగ పీడితుల్ని
పండితుల్ని, పశువుల్ని",

నాశనం చేయిస్తుంది నా కవితా. అంటూ జగద్గురువుల పై విముఖతను వెలకొల్పినాడు చెరబండరాజు. మతాధికారాల పేరుతో వారుచేసే అన్యాయాల్ని, దురాగతాల్ని ఎత్తిచూపి సమాజంలో అట్టి వంచన కారులపై వ్యతిరేకతను, వంచితులపై జాలిని ప్రదర్శించినాడు.

### 18.1.9 అశోక చిహ్నం

చెరబండరాజు రచించిన గీతాలలో ప్రఖ్యాతి గాంచినది అశోక చిహ్నం. దీనిలో చెరబండరాజు యొక్క మానసిక దృక్పథం చక్కగా వెల్లడి అవుతుంది అనవచ్చు. దీనిలో పల్లెజీవుల కష్టనష్టములను, ఆలోచనలను చక్కగా అభివర్ణించినాడు. ఇదొక వచనగీతం. అయినా శైలికొంచెం కఠినంగా ఉండి పల్లె ప్రజల జీవనంలోని కష్టములను చక్కగా చిత్రించబడింది. పల్లె ప్రజలను చైతన్యవంతుల్ని చేయటానికి చక్కగా ప్రయత్నించిన వాడు చెరబండరాజు.

అశోక చిహ్నం గీతంలో చెరబండరాజు

"రేగే దుక్కిదుమ్ములో పులుకు పులుకున

ఇల్లాలి కనుగుడ్ల కేసి చూస్తూ
గంజి తాగే రైతుకూలీ
ఉరకలు వేసే నీ యువ రక్తం
ఏ నర రాక్షసి పీల్చేశాడూ"

అంటూ మనిషిలోనే నిక్షిప్తమైన ఉడుకు రక్తపు ఉష్ణశక్తిని ఎవరో అపహరించినాడు అంటారు. అంతే కాదు వారిని ఆ విధంగా ప్రశ్నించి మరలా

"చెప్పులూ, గొంగడి
ఏడాదికి ఒకజత గుడ్డలు దొరికే ఆశకు
అయిదు మానికల నెల జీతానికి ఏడేండ్లయినా నిండని బిడ్డని
కుదవేశా వెందుకు కూలీ"

అని బాధగా అడుగుతాడు. ఈ విధంగా అశోక చిహ్నం గీతంలో అశోక చిహ్నం క్రింద మనం ధర్మ పరిపాలనలో ఉన్నామా అని చివరకు ప్రశ్నిస్తాడు సమాజాన్ని. ఈ విధంగా చెరబండరాజు ప్రజా సమస్యలను తన రచనలలో ఇమిడ్చినాడు. అంతేకాదు

యుద్ధం మానీ బౌద్ధం పుచుకు
ధర్మ ప్రబోధం చేసిన రాజా,
కళింగ రాజ్యం,
కడకయినా ఇచ్చేశాడా,

అంటూ పరాయిల చేతుల్లో ఉన్న ప్రజా జీవనాన్ని గూర్చి ప్రశ్నిస్తాడు. దేశమేగతిలో ప్రగతిని కోల్పోతున్నదో చక్కగా ప్రదర్శించినాడు చెరబండరాజు.

### 18.1.10 విప్లవ కవిగా చెరబండరాజు

దిగంబర కవులతోకలిసి నగ్నభావాలతో సమాజాన్ని అనేక రకములైన దూషణాలతో మార్చాలని ప్రయత్నించిన చెరబండరాజుకు అది సాధ్యమయ్యే పని కాదని తెలిసి విప్లవ కవిగా రూపొందినాడు. వరంగల్లుకు చెందిన తిరుగబడు కవులతో కలసి విరసంను స్థాపించినాడు. 1975 లో ఈ విరసం ఏర్పడినది. విరసం కార్యదర్శిగా ఉండి దానిని ఎన్నో విధాల అభివృద్ధి మార్గంలో నడిపించినాడు.

"విప్లవాల యుగం మనది
విప్లవిస్తె జయం మనది

అంటూ వైప్లవ్య గీతాన్ని ప్రబోధించినాడు. చెక్కు చెదరని విశ్వాసంతో విప్లవ పోరాటం కొనసాగింది. నమ్మిన సిద్ధాంతాలకు అంకితమైన విప్లవ కవిగా కీర్తి గడించినాడు చెరబండరాజు. వీరు రచించిన దిక్సూచి, గమ్యం, జన్మహక్కు మున్నగు వైప్లవ్య భావ పూరితములైన రచనలు వీరి విప్లవ తత్త్వాన్ని చాటుతాయి.

"పొద్దు పొడుపు రణంతో లేచి
పట్టెడన్నం పెట్టమ్మా అంటూ
పొట్ట చేతబట్టు కొని వచ్చే లక్షలాది భిక్షకుల మస్తిష్కాల్లో
నా దేశం పేరేవిటి ! నా పెదాలు చెప్పేదేవిటి ?"

అని ఆవేదన చెందిన గొప్ప కవి చెరబండరాజు. ఆయనకు మనదేశంలో పేదరికంతో బాధ పడుతున్న లక్షలాది దరిద్ర జీవుల ఆవేదన తప్పమరేమీ కన్పించలేదు. అందుకే చెప్పేదానికి, చేసే దానికి పొంతన లేదని విప్లవం రావాలని ఆశించినాడు. అందుకే

"కలం గళం ప్రాణ ప్రదం
ప్రజకి నేను అంకితం
పోరాటం డైరెక్షన్
పాటనాకు ఆక్సిజన్

అని 'కత్తి పాట' ను రాశాడు. ఉరిత్రాటికి సైతము పాట నేర్పి పల్లవిని నేను పాడిస్తాను అన్నాడు. వచన కవితను వదలి వేసి పాటనే ఆయుధంగా చేతబట్టినాడు.

"మట్టి పిసికి యిటుక జేసి
యిల్లుకట్టి పెట్టినపుడు
మాడు చెక్కలే తింటూ
మాగాణం దున్నినప్పుడు
ఏకులమబ్బీ"

అంటూ కుల వ్యవస్థను నిరసించినాడు. కులమతాలకు అతీతంగా పెరగండి అని జనులను కోరుకొన్నాడు. సర్వమత సమానత్వమును చాటినాడు చెరబండరాజు.

చెరబండరాజు అనగానే గుర్తుకు వచ్చే పాట, శ్రమ దోపిడీని నిలువుటద్దంలో చూపించే పాట, జనం నాలుకల పై నాట్యమాడే పాట, శ్రీశ్రీ మార్క్సిస్టు భావాల బాటలో సాగిన యీ పాటను చూస్తే చైతన్యం రాని వారుండరు. పోరాట తత్వాన్ని వద్దనే వారు సైతం శ్రమైక జీవన సౌందర్యాన్ని గమనించి పోరాడి శ్రమఫలాన్ని అందుకొని ఆస్వాదించ వలసిందే. అంత చక్కని పాటను రచించిన చెరబండరాజు ఆ పాటలో శ్రమ జీవుల పనులను గూర్చి చక్కగా చెప్పాడు. అదీ

కొండలు పగలేసినం - బండలనూ పిండినం
మా నెత్తురు కంకరగా - ప్రాజెక్టులు కట్టినం,
శ్రమ ఎవడిదిరో - సిరి ఎవడిదిరో (కొండలు)
బంజర్లను నరికినం - పొలాలను దున్నినం,
మా చెమటలే కాల్వలుగా - పంటలు పండించినం
గింజెవడిదిరో - గంజెవడిదిరో- (కొండలు)
యంత్రాలను తిప్పినం - ఉత్పత్తులు పెంచినం,
మా శక్తే విద్యుత్తుగా - ఫ్యాక్టరీలు నడిపినం
మేడెవడిదిరో - గుడి సెవడిదిరో (కొండలు)

అంటూ శ్రమ చేసిన వానికి ఫలితం లేదని, అది మరొకరికి చెందుతుందని ప్రజలకు తెల్పినాడు. తన మార్క్సిస్టు భావాలను చక్కగా చూపిన ఈ గీతం ఎంతో ప్రఖ్యాతిని చెరబండరాజుకు కల్గించి, ప్రజలలో నూతన చైతన్యాన్ని కల్గించినది అని చెప్పదగియున్నది.

శ్రీశ్రీ వలెనే చెరబండరాజు సమస్త వృత్తుల శ్రామికులను సంబోధిస్తూ రాసిన గీతాలు చాలా ఉన్నాయి. ఉదాహరణకు

కొలిమంటుకున్నది
తిత్తినిండా గాలి
పొత్తంగ ఉన్నది,
నిప్పారి పోనీకు రామన్న
పొద్దెక్కి పోనీకు - లేవన్నా....
ఉత్తరానురిమింది

రోజా మొగులవుతూంది,
ఎఱ్ఱ మెరుపూసూడు - రామన్న..
కుర్రు పారా సాన బెట్టన్నా.."

అని రాసిన పాటలు ఎంతో చక్కగా మేల్కొలుపు పాటలై కొంత పోరాట తత్త్వాన్నే చాటుతున్నాయి. పోలీసును ఉద్దేశించి చెరబండరాజు

"మాలోని మనిషివే
మా మనిషివే నీవు
పొట్టకూటికి నీవు పోలీసు వైనావు"

అంటూ పోలీసుల పై జాలి కలిగించి కానిస్టేబుల్స్‌ను కూడా శ్రామికులలో భాగంగానే చిత్రించినాడు.

"కఱ్ఱూ నాగలి పారా పట్టండి
ఎత్తిన గునపాలు దించకండి"

అని ఆయుధాలు ధరించిన శ్రామికులను వాటిని వర్గ శత్రువు పై ప్రయోగించమని పిలుపు నిచ్చినాడు.

"ఇంటింట చీకటే ప్రతికంట కన్నీరే
రాజ్యమెవరికి వచ్చెనో - రాజన్న
సుఖము లెవరికి దక్కెనో"

అంటూ శ్రమ ఒకరిదీ ఫలితము ఇంకొకరిదిగా ఉన్న యీ బ్రతుకులు ఇంకెన్నాళ్లు అంటూ ధ్వజమెత్తి దీనిపై పోరాడండి అంటూ విప్లవాన్ని బోధించిన విప్లవ కవి చెరబండరాజు. పోరాడితేనే శ్రమ జీవులకు ఫలితం దక్కుతుందని గుర్తించండి అంటూ సమాజాన్ని మేల్కొలిపినారు.

### 18.1.11 చెరబండరాజు - తిరుగుబాటు తత్త్వం

చెరబండరాజు తిరుగుబాటు తత్త్వంగల కవి. ఆయన మొదట భావ కవిత్వము వంటి దిగంబర కవిత్వానికి ముందున్న సాహిత్య ప్రక్రియల పై తిరుగుబాటుని ప్రారంభించినాడు. అటు పిమ్మట సమాజంలోని యువతరము పైగల బద్ధకపు ధోరణికి తిరుగుబాటు చేసినాడు. 'చిలుము' అనే కవితలో చెరబండరాజు

"యువతీ యువకుల్లారా
మన్నుతిన్న పాముల్లారా
చిలుంనాకి బజ్జో కండి
ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ
కొలింపెట్టి పగులగొట్టి
చిలుంవదలగొట్టాల్సిందే
తరం మీది బరువు మీది
బాధ్యత మీది భావి మీది"

అంటూ యువతరాన్ని నిద్రలేపి విప్లవ రసాన్ని వారిచే త్రాగించి చైతన్యవంతుల్ని చేసినాడు. ఇట్టి ఎన్నో గీతాలు చెరబండరాజు తిరుగుబాటు తత్త్వాన్ని చాటుతాయి.

### 18.1.12 చెరబండరాజు - అంతర్జాతీయ - విశ్వశాంతి

దేశము, కాలము అనే అవధులు లేవు. ఎక్కడ అన్యాయం జరుగుతుందో అక్కడ మేముంటాము అంటూ ధ్వజమెత్తిన కవులు దిగంబర కవులు. సహోదర భావాలను, సత్య సమ్మతాలను అంగీకరించినారు. ప్రపంచ దేశాల్లో ఐక్యరాజ్య సమితి శాంతిని స్థాపించునని

ఆశించినారు కానీ అది భ్రమ అని గ్రహించి అగ్రరాజ్యాల దురహంకారానికీ అధికార కాంక్షకు దారితీసిన ఉదంతాలపై చెరబండరాజు

"మనిషి రక్తం ప్రాణం ముఖ్యం
లింగ భేదాలు వాతాలు తప్పితే
మందిర్, మసీద్, చర్చి
మతాధికారాలు మతాలే ఎందుకు"

అంటూ అవన్నీ వదలి ఏకమత్యంగా మెలగండి అంటూ అంతరాజతీయ దృక్పథాన్ని, విశ్వమానవ శాంతి సౌభాగ్య శీలాన్ని చిత్రించినాడు.

### 18.1.13 చెరబండరాజు - అణుయుద్ధ విముఖత

రెండవ ప్రపంచ యుద్ధాల్లో ఆధునిక అణు విజ్ఞానం వల్ల సంభవించిన నష్టాన్ని, బీభత్సము దృశ్యాల్ని గర్హించినాడు చెరబండరాజు. ప్రపంచాన్ని తృటిలో భస్మం చేయగల ప్రయోగాలను నిరసించినాడు. మానవ నాశనానికి దారితీస్తుందని, ఇది ప్రగతి కాదని, విధ్వంసక చర్య అనీ చెరబండరాజు దానిని గూర్చి అభిప్రాయపడినాడు.

"విశ్వ శాంతి మన ధ్యేయం
యుద్ధాలకు పరిమితమా
అబద్ధమా ఈ వేదన
మాంసం ముద్దలేగా మనుషులు"

అంటూ ఆవేదన చెంది అణు యుద్ధాల్ని నిరసించినవాడు చెరబండరాజు. అణు యుద్ధాల వల్ల కలిగే నష్టాలను, కష్టాలను తెలిపినాడు. దానికి దారితీసే పరిస్థితులను గురించి ప్రజలకు ఒక అవగాహన అవసరము అని నమ్మిన కవి చెరబండరాజు. దిగంబర కవులు అందరిలోనూ ఈ భావన ఉన్నా, చెరబండరాజు మాత్రం ఒక ప్రత్యేకమైన రీతిలో విముఖతను తెలిపినాడు.

### 18.1.14 చెరబండరాజు - వ్యక్తి స్వేచ్ఛ

సమాజం బాగుండాలంటే వ్యక్తి బాగుండాలి, ఆ వ్యక్తి బాగుండాలంటే ఆతనకి స్వేచ్ఛ ఉండాలి, అంటూ వ్యక్తిని శాసిస్తున్న రాజకీయ మంత్రదండం విరిగిపోయి అసలైన విలువల కోసం నిలిచే జీవితం కోసం సంఘర్షణ జరగాలి అని కోరుకొన్నాడు చెరబండరాజు.

"నిన్నెనోయ్ ఎదగని మనిషీ
రేబవళ్ల తిరుగళ్ల మధ్య
నామరూప రహితుడవై
ఎప్పుడో గప్పున గాలిలో కలిసేముందు
ఒక్కసారి వెనక్కి మళ్లి మూసుకోవూ"

అంటూ మనిషి కొన్ని ఆచ్ఛాదనలను కప్పుకొన్నాడనీ, వాటిని ఛేదించి బయట పడాలని, కోరుకొన్నాడు. "జాలిలేని సమాజంలో మనిషీ నీవు నిలదొక్కుకు నిలవనప్పుడు చీకటికి, వైరాశ్యానికి, ఊపిరికి ఇంకా ఇంకా నువ్వు బానిసవే" అంటూ వ్యక్తి స్వేచ్ఛ ఎంతో అవసరము తని బానిసతత్త్వం నశించాలని కోరుకొన్న కవి చెరబండరాజు.

"మనిషి మీద నమ్మ కంపోగొడుతున్న మీరు
దేవుడి మీద ప్రమాణం చెయ్యమంటారెందుకు?
దోషికి నిర్దోషికి ఒకటే సూత్రం,
వల్లించిందే వల్లించి వాదిస్తారు,
ఫీజు కుడితి కుండలో న్యాయాన్ని ఎలుకలా ముంచేస్తారు,
మీ రాత్రి చొక్కాలు పగళ్లు నిలవవు,

పగటి చొక్కాలు రాత్రి ఉండవు"
అంటూ వ్యక్తి స్వేచ్ఛను కాంక్షించినాడు.

## 18.1.15 ముగింపు

దిగంబర కవుల్లోనూ అటు తర్వాత విప్లవ కవుల్లోను బలమైన గొంతుక కలవాడు చెరబండరాజు. తాను నమ్మిన సిద్ధాంతాలకు పూర్తిగా కట్టుబడినవాడు. సామాజిక దురాగతాల్ని ప్రశ్నించిన ధైర్యశాలి చెరబండరాజు. రాజకీయ రాబందుల పైనా, ప్రణయ కవుల పైనా విరుచుకు పడ్డ తిరుగుబాటు గలవాడు. మానవుడు చమురు ఇంకిన దీపంలాగా ఉన్నాడు అంటూ బాధ నొందినాడు. కాడవూడిన పుష్పం అవుతున్నాడు మానవుడు అన్నాడు.

"నీ ఆశయం సూర్యుణ్ణి మాత్రం పిడికిట్లోంచి జారవిడువకు
ప్రాణాన్ని పెట్టయినా, ఈ జగతికి మానవతా భిక్షపెట్టు"

అన్న గొప్ప మానవతావాది చెరబండరాజు.

"ఎండిన స్తనాల మీదికి ఎగబడ్డ బిడ్డలను ఓదార్చలేని లోకం" గా భారతావనిని తలచి బాధ పడినవాడు. "మనిషిలా మంచిగా, ఆకాశంలా-అవనిలా బ్రతుకు" అంటూ ఒకగొప్ప సందేశాన్నిచ్చినాడు. తన కవిత్వాన్ని రచిస్తూ దేశం కోసం 1971 లోను 1973 లోను అయి ఎన్నో కష్టాలు పడినాడు చెరబండరాజు. 1975 లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో బహిష్కరింపబడి శ్రీశ్రీతో పాటు 36 గంటలు నిర్బంధంలో ఉండి తలనొప్పికి గురి అయినాడు. ఆ తలభారము భారమై 1981 లో శస్త్రచికిత్స చేయించు కొనినాడు.

"అనారోగ్య బాధితుణ్ణి
అయితే నేం యోధుణ్ణి
ముంజేతిని ఖండించినా
నా పిడికిటి కత్తి వదలను"

అంటూ పోరాట తత్వంతోనే ప్రతిన చేసి, సమసమాజ స్థాపన క్షాంక్షతో 1982 జూలై 2 వ తేదీన మరణించినాడు. "విప్లవాల యుగం మనది - విప్లవిస్తె జయం మనది" అన్న ఆయన మాట మాత్రవ ఇప్పటికీ ప్రజల నాలుకలపై నిలిచిపోయి "సుకవి జీవించె ప్రజలనాలు కలందు" అన్న సార్థకత సాధించినది.

## సమీక్ష :

చెఱబండరాజు సమాజంలోని దురాచార వ్యవస్థ పైన, సంఘంలోని శ్రామికవర్గ కష్టనష్టాల పైన చేసిన తిరుగుబాటును, చెఱబండరాజు కోరుకున్న సంఘ సంస్కరణను పరిశీలించారు.

## ప్రశ్నలు

1. దిగంబర కవిగా చెరబండరాజు దేశానికి చేసిన సేవ తెల్పుము?
2. విప్లవ కవిగా చెరబండరాజు సమాజాన్ని చైతన్యపరచిన విధమెట్టిది?
3. చెరబండరాజు సమాజానికి చేసిన మేలు తెలుపండి?
4. "విప్లవాల యుగం మనది-విప్లవిస్తె జయం మనది" అన్న చెరబండరాజు మాటలను పరిశీలించండి?

## ఆధార గ్రంథాలు

1. తెలుగు సాహిత్య చరిత్ర - డాక్టర్. ద్వాదశి నాగేశ్వరశాస్త్రి.

2. తెలుగు కవితా వికాసం - కడియాల రామమోహనరాయ్

3. ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం - ఆచార్య కొలకలూరి ఇనాక్

4. ఆధునిక తెలుగు సామాజి కవిత్వ ఉద్యమాలు - కేతవరపు రామకోటి శాస్త్రి

5. అభ్యుదయ సాహిత్యం - ఇతర ధోరణులు - డా. ఎస్వీసత్యనారాయణ.

డా॥ జి.డి. నాయుడు

పాఠం - 18.2

# చావలి బంగారమ్మ

## పాఠ్య నిర్మాణ క్రమం


18.2.1 బంగారమ్మ జీవిత విశేషాలు
18.2.2 బంగారమ్మ రచనలు
18.2.3 బంగారమ్మ రచనలు - విశిష్టత
18.2.4 బంగారమ్మ రచన - నవ్యత
18.2.5 బంగారమ్మ - బాల మనస్తత్వం
18.2.6 బంగారమ్మ పదాల పొందిక
18.2.7 ముగింపు


## లక్ష్యం :

చావలి బంగారమ్మ రచనా వైశిష్ట్యాన్ని, ఆమె కవిత్వ తత్త్వాన్ని, ఆమె రచనలో కనపడే బాలల మనస్తత్వాన్ని గురించి తెలుసుకుంటారు.

## 18.2.1 జీవిత విశేషాలు :

చావలి బంగారమ్మ 1897 వ సంవత్సరంలో తూర్పుగోదావరి జిల్లా కోనసీమలో మోడెకుర్రు గ్రామంలో జన్మించారు. బంగారమ్మ తన కవితారచన ప్రక్రియ మొత్తం దాదాపుగా బాలలపై కేంద్రీకరించారు. ఈమె కవిత్వం మమత, అనురాగం, ఆప్యాయత, మొదలైన లక్షణాలతో కూడుకొని ఉంటుంది. రూప చిత్రణాత్మకమై ఉంటుంది. అమాయకత్వ లక్షణాలు ఈమె కవితలో చాలా ఎక్కువగా కనిపిస్తుంటాయి. తెలుగు నుడికారం పుట్టింది ఈమె గీతాలలో. ఒక్కొక్క గీతంలో ఒక్కొక్క కమ్మదనం కన్పిస్తుంది. సంస్కృత, ఇంగ్లీషు కోటరికాలలో ఊపిరాడని తెలుగునకు ఈమె పలుకుల రాక అలనాటి తీయటి తెలుగునకు ప్రాణ వాయువు కాగలదు. తెనుగు కడుపున పుట్టి చేవదీరిన నుడికారం ఈమె. భాషా పోకడలలోను, తాటాకు బొమ్మలకు ప్రాణం పోసి కన్నబిడ్డనుగా చంకనెత్తగల్గిన పసినాటి తెలుగు భావన ఈమె ఊహ. ఈమె ఊహా ప్రపంచంలో ఎంతో గారడీ ఉంది. పుట్టుకతోనే కవిత్వం. పాండిత్య ప్రకర్షతో దీనికి సంబంధం లేదు అనడానికి బంగారమ్మ తార్కాణం అని 'వైతాళికులు' సంకలనంలో ముద్దు కృష్ణ మనకు పరిచయం చేశారు.

## 18.2.2 బంగారమ్మ రచనలు :

చావలి బంగారమ్మ రచనలన్నీ గీతాలే. ఆమె రచనలలో ఒకలయాత్మకత ఉంది. ఒక ఆత్మీయతా స్వరూపం ఉంది. ఇలాంటి ఎన్నో గీతాలను బంగారమ్మ రచించారు. వాటిల్లో 'కప్పతల్లి పెండ్లి', ఆ కొండ, తమస్సు, కార్తీక పూర్ణిమ, ఉదయిని, నీడ, పుంతలో ముసలమ్మ, మొదలైన ఎన్నో గేయాలు మనకు కన్పిస్తాయి. ఈ గేయాలన్నీ ప్రకృతి మీద ప్రేమతోనో, బాలలపై ప్రేమతోనో, సమాజంపై ప్రేమతోనో రచించినవే.

## 18.2.3 బంగారమ్మ రచనలు - విశిష్టత :

**ఎ) కార్తీక పూర్ణిమ :** బంగారమ్మ రచనలలోవిశిష్టమైనది కార్తికపూర్ణిమ గేయం. కార్తీక పున్నమి నాటి ప్రకృతిని, సమాజంలోని ఆచార వ్యవహారాలను బంగారమ్మ చక్కగా ఇందులో చిత్రించారు.

" పక్షుల్లు పలకకే పడియుండినాయి
వృక్షాలు చూచుచు ఊరకున్నాయి
తమ వెంటపడుతున్న తరుణిజాడడిదేమి?
పోవుతున్నాడు తాను పొంగులోకాలుగనను
గాలి ఉయ్యాలపై కదలు తుండెడి మబ్బు
కనులకడ్డముతాగ, కాలైన తడబడక
పోవుతున్నాడు తాను తనగర్వపొంకములు డెలుపుతూను"

అంటూ పున్నమి రాజు చంద్రుడు ఏ విధంగా ప్రయాణిస్తున్నాడో వివరిస్తుంది. ప్రకృతి సహజమైన శరదృతు లక్షణాలను చక్కగా చిత్రించింది. శరచ్చంద్ర ప్రయాణాన్ని ఆమె ఎలా ఆస్వాదించిందో చూడండి.

"వాద్యములు వినబడవా ! చోద్యములు కనబడవా
నిముసమ్ము నిలువడే నీడ నిలుచునో కాని,
పోవుతున్నాడు తాను గర్వంపు పొంగు పోగారిపోను
పక్షి కలకలమ్మిలే పరిభవంబని యెంచి
తెల్లబోయిన మోము తెలియకుండుటకై
పోవుతున్నాడుతాను తనువెల్ల తారుమారగుటచే"

అంటూ బంగారమ్మ కొంత అమాయక లక్షణాలను చంద్రుడిలో చొప్పించింది.

బంగారమ్మ కవిత మమతలమయం. చరాచరప్రపంచమంతా ఈమె అగాథమైన ప్రేమ భావానికి పాత్రమవుతుంది. ఈమె శిలలను, చెట్లను, పక్షులను కూడా ప్రేమించగలదు. ఈమె కవితలో రూప చిత్రణ, అద్భుతమైన అమాయకత్వం ప్రస్ఫుటంగా కన్పిస్తాయి.

"మా పాప చెంబులో
నీళ్లొలకబోసితే
చెందురుడు జారిబడి
చిందులాడేడు..."

అంటూ చక్కని బొమ్మలను ఈ గేయంలో చిత్రించింది బంగారమ్మ. అంతేకాదు ఆ చంద్రుణ్ణి చూచి కొంచెం జాలి పడింది కూడా.

" నీటిలోని ఆ చంద్రుణ్ణి
చేయెత్తి మా పాప చెడమొత్తి నాది,
మరికొంతసేపటికి మనసునొచ్చింది,
పాపనేమనక పారిపోయాడు.
పాకొచ్చి పాపాయి పడకజేరింది.
కన్నీదీర తానొచ్చి కళ్ళబడ్డాడు.
నీకింతెయని పాప నిదురబోయింది.
మరల నేడొచ్చునో మరిరాడో నేనెరుగ"

అంటూ మరలా ఆ పున్నమి చంద్రునికై పసిబాలగా ఆమె ఎదురు చూసింది. అందుకే ఈ గీతం బాలగేయంగా ఎంతో ప్రాచుర్యాన్ని పొందింది.

**బి) ఆ కొండ :** బంగారమ్మ ఒకసారి రైలులో ప్రయాణం చేస్తూ కొండను చూసింది. దానిపై కవిత్వం రాసింది. అదే 'ఆ కొండ' అనే గేయంగా ప్రాచుర్యం పొందింది. అందులో బంగారమ్మ తన అనుభవాలను పదిలం చేసింది. కొండను చూసి

"ఆ కొండ అక్కడేనిలుచెండెనూ
రైలులోపలనేను రాబోవుచున్నాను
నన్నుజూచివెను దిరిగెనో
ఆ కొండ
నైజమే అటులుండెనో,"

అంటూ పరిచయం చేసింది. ఒక్క నిముషంలో ఆ నల్లరాతికి చలనం వచ్చింది. బంగారమ్మలోకూడా చైతన్యం కలిగింది. ఆ చోటునుండి వడివడిగా లేచింది.

"వడివడిగ లేచింది
తడబడుతు నడిచింది
మరుగున పడి ననుజూడ
పరిగిడుచు వచ్చింది.
కదలుచూ నిలుచుండెనో
ఆ కొండ."

అంటూ ఆలోచించింది. కఠిన శిలలకు సైతం హృదయాన్ని కల్పించి దానిని కరిగించింది బంగారమ్మ. ఆ కొండ తనతో రావాలని ఆశపడింది చిన్నపిల్లలలాగా. ఆ కొండ అను కొన్నట్లుగా బంగారమ్మ జరజరానడించింది, గిరగిర తిరిగింది. బలు తిరిగితాను పడెనో, ఆ కొండ తల దిరిగి బోరుమనెనో" అంటూ కొండ మనస్తత్వాన్ని బంగారమ్మ కోసం ఆ కొండ పడే తహతహని వర్ణించింది.

అంతలో ఆ కొండకు తనకు మధ్య సరివి తోటలు అడ్డమొచ్చాయి. కానీ ఆ అడ్డాన్ని దాటి ఆ కొండ తన కేసి చూస్తూనే ఉందట. అప్పుడు బంగారమ్మ

"తల ఎత్తి నను జూచెనే
ఏలచూచెదవంటి
ఏమి కావలెనంటి
ఎంత పిల్చినా పల్కదే ఆ కొండ"

అంటూ బాధపడింది. ఆ కొండ తనతో మాట్లాడలేదని బెంగపడింది. తాను ఆపాదించిన ఆర్ద్రత మాయమై కొండకు కర్కశత్వం కల్గిందేమో నన్నట్లుగా ఊహించింది.

" ఆ కొండ గుండె రాయిగామారెనో
నను విడిచి ఆ కొండ నల్లరాయైపోయెనో
ఎంత చూచినాచూడదే
ఎంత పిలిచినా పలుకదే ఆ కొండ"

అంటూ ఆ కొండ మనస్సును నిష్ఠూరాలాడుతూ నిందిస్తుంది. ఈ గేయం ఎంతో ప్రాచుర్యాన్ని పొంది బంగారమ్మ యొక్క అనురాగ హృదయాన్ని వ్యక్తం చేస్తుంది. కొండ బండ అని తెలిసి కూడ ఇలాగేయాన్ని రచిచడంలో అమాయకత్వం ఎంత చక్కగా చూపబడిందోకదా!

సమాజంలోని కఠిన హృదయం గల మనుషులను, వారి హృదయ భావాల్ని కొండలాంటివారు ప్రజలు అంటూ చక్కని చిత్రంగీశారు. అటువంటి కఠిన హృదయాలు సమాజంలో మనకెంతోమంది దర్శనమిస్తారు. ఆ విషయాన్నే బంగారమ్మ ఈ గేయంలో వివరించారు.

సి) ఉదయిని : బంగారమ్మ గేయాలలో ప్రాముఖ్యతను సంపాదించిన మరొక గొప్ప గేయం ఉదయిని. ఈ గేయంలో ప్రకృతి చిత్రణ చక్కగా కన్పిస్తుంది.

' ఆగండి ఆగండి

చుక్కలు, ఆగిచూడండి,

ఇదిగో పసికూన

అగపడదనాబలసైడి కాంతులు

చలిపలుతెరగులు పరిమళించు చుండ..."

అంటూ సాగే పాటలో తన కవిత్వంతో ప్రకృతి అందాలను ఎంతో అద్భుతంగా చిత్రించింది బంగారమ్మ. ఈ గేయంలో ఉద్రేకం కూడా మనకి కనిపిస్తుంది. ఆమె తమ్ముడు కొంపెల్ల జనార్ధనరావుగారి ఉదయిని తొలి సంచికను చూచి ఆమె ఈ రచన చేసింది. ప్రకృతి వర్ణనలో బంగారమ్మది అందెవేసిన చెయ్యి అనే విషయం ఈ ఉదయిని గీతం ద్వారా తెలుస్తుంది. ఈ గీతం కూడా ఎంతో ఆహ్లాదాన్ని, ఆనందాన్ని, ఉద్రేకాన్ని, ఉత్సాహాన్ని కల్గించి బంగారమ్మ లోని చైతన్య భావాలు వ్యక్తం అయ్యేలా ఉంటుంది. అంత గొప్ప ప్రాచుర్యాన్ని బంగారమ్మ ఈ 'ఉదయిని' గీతం ద్వారా సాధించారు.

ఈ ఉదయిని గీతం కూడా బాలల మనస్సులను హత్తుకొనేటట్లుగా ఉంటుంది. బాల మనస్సులనే ఉత్సాహ ఉదయానికి దోహద పడుతుందీగీతం.

డి) కప్పతల్లి పెండ్లి : ప్రకృతి చిత్రణలో బంగారమ్మ చేయి ఎముక లేనట్టిది. అందమైన ఊహతో గొప్ప ఉత్ప్రేక్షతో వర్ణించడమే కాక ప్రకృతిలోని కొన్ని అంశాలకు ఎంతో వ్యక్తిత్వాన్నిచ్చి అద్భుతంగా జీవింపచేస్తారు. ఇందుకు బంగారమ్మ రచించిన 'కప్పతల్లి పెండ్లి' అనే ఈ గీతం చక్కని ఉదాహరణ. ఇందులో

"కప్పతల్లీ పెళ్ళి చూడరే - నేడు

కావెళ్ల నీళ్లొంపినాడు,

వరుణదేవుడు పంపినాడు - ఓ చెలి

వాడలన్నీ నింపినాడు"

అంటూ పల్లెటూళ్లలో వానకోసం కప్పలకు పెళ్ళిళ్ళు చెయ్యడం, కావళ్ళు కట్టి నీళ్లుపోస్తూ ప్రజలు చేసే సందడి విషయాన్ని ఈ గీతంలో చిత్రించింది బంగారమ్మ. అంతేగాదు

"గగనతలమునుంచినేడు - వీవనలు

చెట్లచే వేయించినాడు

స్వర్గాధినాథుడూ నేడు - రథమెక్కి

పయనమై పోతూ ఉన్నాడు."

అంటూ మబ్బులు పట్టినప్పుడు గాలివీవగా ఆ గాలికి పట్టిన మబ్బులు వెళ్లిపోయే సన్నివేశాన్ని బంగారమ్మ చక్కగా చిత్రించారు. మబ్బులలో వచ్చే ఉరుములు, మెరుపులను సైతం విడిచి పెట్టకుండా బంగారమ్మ రచించారు. ప్రాచీన కావ్యకర్తలకు భిన్నంగా ఈమె పోల్చిన తీరు ఎంతో అద్భుతంగా ఉంటుంది.

"భత్యాలులేకనే వాడు, బాగ

బాజాలు వేయించినాడు

బండరాళ్లపైన మావాడు

బడబడా దొర్లించినాడు,

బాణాసంచావెలితిలేదే, పెళ్లికి

బహుబాగుగా చేసినాడే

కప్పమ్మ పెళ్లికోయంచూ, మేళములు

గొప్పగా తెప్పించినారే."

అంటూ నేటి పెళ్లి పేరంటాళ్లలో ఉండే మేళాల ఖర్చు లేకుండానే కప్పమ్మ తల్లి పెళ్లికి బాజాలను ఏర్పరచినారంటూ బంగారమ్మ చేసిన ఊహ ఎంతో రమ్యంగా ఉంది.

అంతేగాకుండా కప్పమ్మ పెండ్లి గీతంలో కప్పకు నీళ్లుపోస్తే వచ్చే ప్రయోజనాన్ని గురించి ప్రజలు చెప్పుకొనే మాటలనే తీసుకుని బంగారమ్మ

"కప్పమ్మ గడపతొక్కినాదే శుభమన్న

సూచనలు చూరు చెప్పినాది

కప్పలెగిరే వానలమ్మా - పొలములు

కనకమే పండుతాయమ్మా"

అంటూ ఎంతో చక్కగా చెప్పారు. "కప్పలు ఎంత సంతోషంగా ఉంటే వరిచేలు అంత హెచ్చుగా పండుతాయి" అన్న సామెతను ఆధారం చేసుకొని ఈ రచన చేసింది బంగారమ్మ. వర్షాకాలంలో ప్రకృతి సహజసంపద నంతటిని కప్పమ్మ పెండ్లికి అనువుగా మార్చి రూపక అను ప్రాణిత వ్యంగ్యం మాతృకగా ఈ గేయాన్ని రచించారు బంగారమ్మ.

ఇ) నీడ : బంగారమ్మ రచించిన గేయాలలో వర్ణనాత్మకతకు, చిత్రణా చాతుర్యానికి నిదర్శనము 'నీడ' అనే గేయం. ఇందులో చెరువు, చెరువులో గట్టుమీదున్న చెట్ల ప్రతిబింబం, ఆకాశం అద్దంలో ఉన్నట్లు కన్పించడం అనేవి విశేషాలు. వీటిని వర్ణించిన తీరు, మందారాన్ని కన్యగా చిత్రించడం ఒక అద్భుతమైన అనుభవాన్ని మనకు అందిస్తాయి.

"అందాలు తానె చూసింది నీటిలో

చందాలు తానె చెప్పింది నా తోటి

ఒడ్డున మందారం ఒంగి బొట్టెట్టుకొని

అందాలు తానె చూచింది,

సొగసెల్ల చూచెను సొమ్మసిల్లి పోయెను,

చెట్లెంట పాములే చెరువెల్లె పాకాయి,

అప్పుడే ఆకాశం హడలిపోయింది.

గజగజావణికి తాగట్లు పై కొరిగింది."

అంటూ ఆ ప్రకృతిని చక్కగా వర్ణిస్తుంది "పేర్చి ప్రపంచాన్ని శాసించగల శక్తి కవికి కలదు" అనే విషయాన్ని బంగారమ్మ తన ఈ 'నీడ' గేయం ద్వారా నిరూపించింది.

"సూర్యుడే చెట్టెక్కి చూడభయపడ్డాడు

అందాలు తానె చూచింది

జొబ్బిల్ల విరియబోసింది,

మందార బొట్టిబ్లే చెదరిరాలింది

గట్లుగుండెలు కలగ మెట్ట కన్నులు చెదర

వంగున్న మందార వంగియేయుండి ఆ

అందాలు తానె చూచింది"

అని ఒక ఊహాస్పదమైన వయస్సు వచ్చిన కన్యగా బంగారమ్మ మందారాన్ని వర్ణిస్తుంది. అందుకే అందాలు తానె చూచింది మందార మాటాడింది అంటారు.

ఎఫ్) పుంతలో ముసలమ్మ : బంగారమ్మ సమకాలిక సాంఘిక మూఢాచారాలను నిర్దాక్షిణ్యంగా విమర్శించింది. ప్రాచీన సాంప్రదాయమంటే ఎంత గౌరవమున్నా మతం పేరిట ప్రబలలిన మూఢ విశ్వాసాన్ని సహింపలేదు. "ఇన్ ఫ్లూయంజా" ప్రబలి, ప్రజలు భీతితో కన్పించిన రాతికీ, రప్పకీ మొక్కుతున్నారు. అప్పుడు వెలసింది "పుంతలో ముసలమ్మ". ఈశ్వర స్వరూపానికి చెందవలసిన పూజ, ఆరాధన రోడ్డు ప్రక్కనున్న మైలు రాయికి జరుగుతుండటం చూచి కోపంతో

"హద్దుకొరకు అంకె కొరకు

కాలిబాట తుడుచు కొరకు

దూరములను తెలుపుకొరకు

పాతినట్టి మైలురాయి

నేటి దేవతాయెనే

ప్రజలకు మతిపోయెనే"

అంటూ రాతికీ, రప్పకీ చేసే పూజలను నిరసిస్తుంది. పుంతలో ముసలమ్మ నడక బాగుంటుంది.

బంగారమ్మ ఈశ్వరుని స్థానంలో అనేక దేవతలను పూజించటాన్ని ఖండిస్తుంది. ఈ విషయాన్నే పుంతలో ముసలమ్మ గేయం నిరూపిస్తుంది.

"పికిలి పిట్ట పిర్రు మంటె

ఒకతె ఒళ్ళుజల్లుమంటె

సంతబయట గొల్లుమంటె

పొట్టకొరకు ముసలమ్మ

కుప్పిగంతులు వేయుచుంటె

సకల జనులు సంభ్రమమున

దానిచుట్టు మూగుచుంటె"

అంటూ ముసలమ్మ ఆ జనుల బాధ తట్టుకోలేక పొలిమేరకు పోగా దానికే దేవతని ప్రజలు పూజలు చేస్తున్నారు వెర్రిజనాలు కదా! అంటూ మూఢ విశ్వాసాలను నిరసించిన గేయం పుంతలో ముసలమ్మ, ఒక సంఘసంస్కరణదృష్టితో ఈ గీతాన్ని రచించిన బంగారమ్మ ఎంతో ప్రఖ్యాతిని పొందింది.

జి) వేదన : బంగారమ్మకు తాను నమ్మిన సత్యంపై ఎంతో విశ్వాసం. ఆత్మాభిమానంతో వాటిని ప్రచారం చేసింది. సత్యం, విశ్వాసం అనే వీటిని ప్రజలు సైతం అవలంబించి ఆదరించటంలో బంగారమ్మ ఎంతో సంతోషించింది. మనుష్యుల మధ్య, వారి మనస్సుల మధ్యగల తారతమ్మలను నిరసిస్తూ ప్రజలకు ఈ తారతమ్మ భావన వద్దని తన అభిప్రాయాన్ని నివేదిస్తూ చేసిన రచన "నివేదన". ఇందులో మానవులు

కొన్ని పక్షులను చేరదీసి కొన్నింటిని వేరు చేస్తారు. ఎదుకీ తారతమ్యం అంటూ

"కాకి కోకిల ఒక్క కాంతినున్నయి
కంఠములు మాత్రమే కలియలేదమ్మ
కోవెల్ల కూసితే వింటారు
కాకమ్మ కూసితే కసరి కొడతారు,
కోవెల్ల మీకేమి కోరి తెచ్చింది
కాకమ్మ మీకేమి కాన్కలీలేదు..."

అంటూ ఎంతో హృద్యంగా వాటిపై ప్రేమను కురిపిస్తుంది బంగారమ్మ.

## 18.2.4 రచనలో నవ్యత :

పూర్వకవులు ప్రేమసందేశాన్ని చిలుకలతోనో, మేఘాలతోనో హంసలతోనో పంపించారు. కానీ బంగారమ్మ తన రచనలో ఒక నూతన ఒరవడిని సృష్టిచేశారు. ప్రేమరాయబారిగా సూర్యుని ఎన్నుకున్నారు. సందేశాన్ని ఆతనితో చెప్పి పంపారు.

"ఆది మధ్యాంతముల అమరిన దేవ
అతని హృదయమునన్ను అలముకోనీవ"

అంటూ ప్రారంభించిన వేడుకోలు అతి విచిత్రంగా పరిణమిస్తుంది. ఒక నిముషం ఆదిత్య వార్తా వహునిపై అంతులేని విశ్వాసాన్ని చూపిస్తూ మరొకపక్క స్త్రీ సహజమైన అపనమ్మకాన్ని చూపిస్తుంది. మహనుభావుడవైన నీవు చేయలేని పనీ చెప్పలేని మాటా ఉన్నదా అంటూ పొగుడుతుంది ఒక నిముషం. మరలా అయ్యో నీ వలన ఈ పని కాదేమో అనే సందేహం మరో నిముషం. అలాంటి మానసిక స్థితిలో బంగారమ్మ

"చూచి వచ్చిన మాటతేట పడగాను,
నోట చెప్పుట చేత కాదనుము
చురుకుగల చూపులతో సూర్యుడా! నీవు
చూడలేవైతివా సున్నితపు విభుని"

అని రాయబారానికి కావలసిన అంశాలు ఏకరువు పెడతారు. ఉన్నట్టుండి ఆమెకో సందేహం. ఇంత గొప్పభారం అతనిపై మోపినా ఏమో చీకటిపడగానే కునుకు పడతాడేమో సూర్యుడు అనుకొని మరలా

"కునుకుపాటున నీవు కునుకుతావేమో
కుముదబాంధవుడనైన కూక లెట్టుమను"

అని ఆ సూర్యుని ఆదేశిస్తుంది బంగారమ్మ. సూర్యచంద్రులను రాయ బారులుగా చిత్రించి ఒక నవ్యత్వాన్ని తన రచనలో చూపించారు.

## 18.2.5 బంగారమ్మ - బాల మనస్తత్వం :

ఎన్నో రకాలైన ఆ దేశనలు, ఆవేదనలను చూపించిన బంగారమ్మ మానసికంగా ఎంతో పరిణతి పొందినట్లుంటుంది. కానీ కొన్ని రచనలు చూస్తే ఆమె హృదయం బేల అని, పిల్లల మనస్తత్వం కలదిగా భాసిస్తుంది. పిల్లల విషయాన్ని చెప్పేటప్పుడు ఆమె వారిలో లీనమైపోతుంది.

"కొమ్మపై కోయిలా కూయుటమాని
పాపాయి పాట విని ఫక్కునా నవ్వె
పాపమ్మ నీపాట బాగున్నదమ్మ
నీ ముందు నేనింక పాడలేనమ్మా
నీవు నేను కలసి పాడుతూ వుంటె
ఈ పేట వారలకిక పాటలేవి

పాటలెరిగిన మనము పాడుతూవుంటే
మాటలెరిగిన వారు మాటాడగలరా"

అంటూ ఎంతో చక్కగా ఒక లయాత్మక ధోరణిలో గేయాన్ని రచించారు బంగారమ్మ. ఆ చిన్న పిల్లల పాటలలో మాధుర్యం ఉన్నదనీ, దానికై భగవంతుడు సైతం తలాడిస్తాడని బంగారమ్మ శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసంఫణిః" అన్న సూక్తిని స్వీకరించి

"మనవారి మాటలకు మనకేల ఉలుకు
మనపాటలకు వేను మాధవుడు పలుకు"

అంటారు. ఇందులో ఆమె బాల హృదయం వ్యక్తమౌతుంది. ఇలాంటి కవిత్వం చదివితే ఎంతటి వయసులో ఉన్న వారినైనా కాలం వెనక్కి వెళ్లి పసితనాన్ని గుర్తుకు తెచ్చుకొనేట్లుగా చేస్తుందనటంలో సందేహంలేదు.

## 18.2.6 పదాల పొందిక :

బంగారమ్మ రచనలో ప్రాచీన కవులలోని పదగుంఫనశక్తి కన్పిస్తుంది. పదాల పొందికలో ఒక సహజత్వాన్ని చూపిస్తుంది బంగారమ్మ. ఉదాహరణకు

"గాలి ఉయ్యాలపై కదులుచుండెడి మబ్బు"
"నా గుండెలోన బడి నలిగిపోయిన వాన"
"మల్లెపూవుల తావి మనసెల్లనిండు"
"తన గుండెలోన నేను తలదాచుకొన్నట్టి"
"భావాలె పూవులై పరిమళించెడిదండ"
"చిన్ని చిన్ని పాదాల చిరుత గజ్జెల మ్రోత"

ఇలాంటివెన్నో ఆమె రచనలో మనకు కన్పిస్తాయి. ఆమె పదముల పొందిక, ఒద్దిక కల్గిన ఆంధ్ర ఆడపడుచు లక్షణాల్ని ప్రదర్శిస్తుంది.

## 18.2.7 ముగింపు :

బంగారమ్మ గొప్ప భావాలను భావింపగల భావానా బలం కల్గినది. చిత్ర విచిత్ర చిత్త ఊహాశక్తి, అందాన్ని అనుభవింపగల ఆత్రుత, వీటన్నింటినీ అందరితో పంచుకోగల స్థైర్యం, కోరిక గల్గినది బంగారమ్మ. తెలుగు నుడికారం పుట్టింది ఈమె రచనలో అనిపించేటంతటి తెలుగుదనం కల్గినది. గేయ రచనలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని పొంది, తన సాహిత్య జీవితాన్ని ఎన్నో గేయ రూపముల ద్వారా ప్రజలకు అందించిన బంగారమ్మ 1960 లో తుది శ్వాస విడిచారు.

## సమీక్ష :

చావలి బంగారమ్మ ప్రకృతి పరిశీలనను, మానవత్వ లక్షణాలను, ఆమె రచనలలోని బాలల మనస్తత్వ విషయాలను పరిశీలించారు.

## ప్రశ్నలు :

1. చావలి బంగారమ్మను గూర్చి రాయండి ?
2. చావలిబంగారమ్మ గేయాలలోని ఆత్మీయతను సమీక్షించండి ?
3. బంగారమ్మ గేయాలను వివరించండి ?

## ఆధార గ్రంథాలు

1. వైతాళికులు - ముద్దు కృష్ణ సంకలనం
2. ఆంధ్ర కవయిత్రులు - సంకలనం
3. ఆంధ్రసాహిత్య చరిత్ర - ద్వా.నా. శాస్త్రి

డా॥ జి.డి. నాయుడు

(కత్తిరించి పంపవలెను)

## అధ్యాపకుల, విద్యార్థుల సలహాలు, సూచనలు :

అధ్యాపకులు, విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు, ముద్రణ దోషాలు తెలియపరచినచో, పునర్ముద్రణలో తగు చర్యలు తీసుకొనగలము. తెలియపరచవలసిన చిరునామా : **డిప్యూటీ డైరెక్టర్, దూరవిద్యా కేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510.**

| **Course** | **Year** | **Paper No. & Title** |
|---|---|---|
| M.A. Telugu | Ist Year | Paper -V : MODERN TRENDS IN TELUGU POETRY |

(కత్తిరించి పంపవలెను)